SIVA PURANA
RUDRA SAMHITHA

4



KAUSIKI

శ్రీ శివ మహా పురాణము

రుద్ర సంహితము లోని

పార్వతీ ఖండము





1 – హిమవంతుని వివాహము

నారద ఉవాచ ।

దాక్షాయణీ సతీ దేవీ త్యక్తదేహా పితుర్మఖే।
కథం గిరిసుతా బ్రహ్మన్ బభూవ జగదంబికా ॥
కథం కృత్వా తపోఽత్యుగ్రం పతిమాప శివం చ సా ।
ఏతన్మే పృచ్ఛతే సమ్యక్కథయ త్వం విశేషతః ॥

నారదుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! దక్ష పుత్రి యగు సతీదేవి తండ్రి చేసిన యజ్ఞములో దేహమును వీడి పర్వత పుత్రికయై జగన్మాతయైన విధంబెట్టిది?(1). ఆమె మిక్కిలి ఉగ్రమైన తపస్సును చేసి శివుని భర్తగా పొందిన విధంబెట్టిది? నా ఈ ప్రశ్నకు సమాధానమును విస్తారముగా చక్కగా చెప్పుడు.

బ్రహ్మోవాచ ।

శృణు త్వం మునిశార్దూల శివాచరితముత్తమమ్ ।
పావనం పరమం దివ్యం సర్వపాపహరం శుభమ్ ॥
యదా దాక్షాయణీ దేవీ హరేణ సహితా ముదా।
హిమాచలే సుచిక్రీడే లీలయా పరమేశ్వరీ॥
మత్సుతేయమితి జ్ఞాత్వా సిషేవే మాతృవర్చసా।
హిమాచలప్రియా మేనా సర్వర్ధిభిరనిర్భరా॥
యదా దాక్షాయణీ రుష్టా నాదృతా స్వతనుం జహౌ ।
పిత్రా దక్షేణ తద్యజ్ఞే సంగతా పరమేశ్వరీ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ ఋషిశ్రేష్ఠా! ఉత్తమమైన జగన్మాతృచరితమును నీవు వినుము. అది పరమపావనము, దివ్యము, పాపములనన్నిటినీ పోగొట్టునది,శుభకరము. దాక్షాయణీదేవి శివునితో గూడి ఆనందముతో హిమవత్పర్వమునందు క్రీడించుచుండెను. ఆ పరమేశ్వరికి అది ఒక లీల (4) . ఆ సమయములో హిమవంతుని ప్రియురాలు, సమస్త సంపదలతో నలరారునది యగు మేనాదేవి మాతృప్రేమతో 'ఈమె నా కుమార్తె ' అని భావించి సేవించెను (5) . పరమేశ్వరియగు దాక్షాయణి తండ్రియగు దక్షుని యజ్ఞమునకు వెళ్లి అచట తండ్రిచే అవమానింపబడి, కోపించినదై తన దేహమును త్యాగము చేసెను.

తద్వై వ మేనకా తాం సా హిమాచల ప్రియా మునే ।
శివలోకస్థితాం దేవీ మారిరాధయిషుస్తదా ॥
తస్యామహం సుతా స్యామిత్యవధార్య సతీ హృదా।
త్యక్తదేహా మనో దధ్రే భవితుం హిమవత్సుతా ॥
సమయం ప్రాప్య సా దేవీ సర్వ దేవస్తుతా పునః ।
సతీత్యక్తతనుః ప్రీత్యా మేనకాతనయాఽభవత్ ॥
నామ్నా సా పార్వతీ దేవీ తపః కృత్వా సుదుస్సహమ్మ్ ।
నారదస్యోపదేశాద్వై పతిం ప్రాప శివం పునః॥

ఓ మహర్షీ! హిమ వంతునకు ప్రియురాలగు మేనక ఆనాడే శివలోకమునందున్న ఉమాదేవిని ఆరాధించగోరెను (7) . అపుడు సతీ దేవి దేహమును వీడిన తరువాత హిమవంతుని కుమార్తెగా ఆమె గర్భమునందు జన్మించవలెనని మనసులో నిశ్చయము చేసుకొనెను (8) . దేవతలందరిచే స్తుతింపబడిన ఆ సతీదేవి దేహమును వీడిన తరువాత సరియగు సమయము రాగానే ప్రేమ పూర్వకముగా మేనకకు కుమార్తెయై అవతరించెను (9). పార్వతి యను పేరుగల ఆ దేవి నారదుని ఉపదేశముచే మిక్కిలి దుష్కరమగు తపస్సును చేసి మరల శివుని భర్తగా పొందెను.

నారద ఉవాచ।

బ్రహ్మన్ విధే మహాప్రాజ్ఞ వద మే వదతాం వర ।
మేనకాయాస్సముత్పత్తిం వివాహం చరితం తథా॥
ధన్యా హి మేనకా దేవీ యస్యాం జాతా సుతా సతీ।
అతో మాన్యా చ ధన్యా చ సర్వేషాం సా పతివ్రతా ॥

నారదుడిట్లు పలికెను –

ఓ బ్రహ్మా! విధీ! మహాప్రాజ్ఞా! నీవు వక్తలలో శ్రేష్ఠుడవు. మేనక యొక్క పుట్టుకను, వివాహమును మరియు చరితమును నాకు చెప్పుము (11) . సతీదేవిని కుమార్తెగా పొందిన మేనకాదేవి ధన్యురాలు, పూజ్యురాలు. ఆమె అందరిలో గొప్ప పతివ్రత.

బ్రహ్మోవాచ ।

శృణు త్వం నారద మునే పార్వతీ మాతురుద్భవమ్ ।
వివాహం చరితం చైవ పావనం భక్తివర్ధనమ్ ॥
అస్త్యుత్తరస్యాం దిశి వై గిరీశో హిమవాన్మహాన్ ।
పర్వతో హి మునిశ్రేష్ఠ మహాతేజాస్సమృద్ధి భాక్ ॥
ద్వైరూప్యం తస్య విఖ్యాతం జంగమస్థిర భేదతః ।
వర్ణయామి సమాసేన తస్య సూక్ష్మ స్వరూపకమ్॥
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితో హి యః।
నానారత్నాకరో రమ్యో మానదండ ఇవ క్షితేః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ నారదమహర్షీ! పార్వతి తల్లి యొక్క పుట్టుక, వివాహములను గూర్చి వినుము. ఆమె చరితము పావనము, భక్తిని వృద్ధి చేయునది (13) . ఓ మహర్షీ! ఉత్తర దిక్కునందు గొప్ప తేజస్సు, సమృద్ధులతో గూడిన హిమవాన్ అని ప్రసిద్ధి గాంచిన పెద్ద పర్వతము కలదు గదా! (1 4) . దానికి జంగమము (నడయాడునది). స్థావరము(స్థిరమైనది) అను రెండు రూపములు గలవని ప్రసిద్ధి. ఈ విషయములోని సూక్ష్మ స్వరూపమును సంగ్రహముగా వివరించెదను (15) . ఆ పర్వతము పశ్చిమ సముద్రము, తూర్పు సముద్రముల వరకు వ్యాపించి భూమిని కొలిచే కొలబద్దయా యన్నట్లు ఉన్నది. ఆ సుందరమగు పర్వతము అనేక శ్రేష్ఠవస్తువులకు నిలయమై ఉన్నది.

నానావృక్ష సమాకీర్ణో నానాశృంగ సుచిత్రితః ।
సింహవ్యాఘ్రాది పశుభిస్సేవితస్సుఖిభిస్సదా ॥
తుషారనిధిరత్యుగ్రో నానాశ్చర్య విచిత్రిత: ।
దేవర్షి సిద్ధ మునిభిస్సంశ్రితశ్శివసంప్రియః ॥
తపస్స్థా నోఽతి పూతాత్మా పావనశ్చ మహాత్మనామ్ ।
తపస్సిద్ధిప్రదోఽత్యంత్యం నానాధాత్వాకరశ్శుభ॥
స ఏవ దివ్యరూపో హి రమ్యస్సర్వాంగ సుందరః ।
విష్ణ్వంశోఽవికృతశ్శైల రాజరాజస్సతాం ప్రియః ॥

ఆ పర్వతము అనేక రకముల వృక్షములతో నిండి అనేక శిఖరములతో అతి సుందరముగా నున్నది. సింహము, వ్యాఘ్రము మొదలగు జంతువులు దానియందు సర్వదా సుఖముగా సంచరించుచుండును (1 7) . మిక్కిలి దట్టమై మంచుతో ఉండి అనేక అద్భుతములతో ఆశ్చర్యమును గొల్పు ఆ పర్వతమును దేవతలు, ఋషులు, మునులు, సిద్ధులు సేవించుచుందురు. అది శివునకు మిక్కిలి ప్రియమగు పర్వతము (18) . మహాత్ములు అచట తపస్సును చేయుదురు. మిక్కిలి పవిత్రమగు ఆ పర్వతము వారిని పవిత్రులను చేయును, ఆ పర్వతము నందు తపస్సు చేయువారికి సిద్ధి కలుగుట నిశ్చితము . శుభకరమగు ఆ పర్వతము అనేక ధాతువులకు (లోహ ఖనిజములకు) నిలయమై ఉన్నది (19) . దివ్యమగు రూపము గలది, అన్నీ భాగములలో సుందరమైనది, రమణీయమైనది, వికారములు లేనిది, సత్పురుషులకు ప్రియమైనది అగు ఆ శ్రేష్ఠపర్వత రాజము విష్ణువు యొక్క అంశచే ఉద్భవించినది.

కులస్థిత్యై చ స గిరిర్ధర్మ వర్ధన హేతవే ।
స్వవివాహం కర్తుమైచ్ఛత్పితృదేవ హితేచ్ఛయా ॥
తస్మిన్నవసరే దేవాస్స్వార్థ మా చింత్య కృత్స్నశః।
ఊచుః పితౄన్ సమాగత్య దివ్యాన్ ప్రీత్యా మునీశ్వర ॥

ఆ పర్వతుడు కులమును నిలబెట్టి, ధర్మమును వర్ధిల్లజేయుట కొరకై మరియు పితృదేవతలకు హితమును చేయు కోరికతో వివాహమాడగోరెను (2 1) .

ఓ మహర్షీ! ఆ సమయములో దేవతలు పూర్తిగా తమ స్వార్థమును మాత్రమే తలపోసి, ప్రకాశస్వరూపులుగు పితృదేవతలను సమీపించి, వారితో ప్రీతి పూర్వకముగా నిట్లనిరి.

దేవా ఊచుః ।

సర్వే శృణుత నో వాక్యం పితర: ప్రీతమానసా : ।
కర్తవ్యం తత్తథైవాశు దేవ కార్యేప్సవో యది ॥
మేనా నామ సుతా యా వో జ్యేష్ఠా మంగలరూపిణీ ।
తాం వివాహ్య చ సుప్రీత్యా హి మా ఖ్యేన మహీభృతా ॥
ఏవం సర్వమహాలాభస్సర్వేషాం చ భవిష్యతి ।
యుష్మాక మమరాణాం చ దు:ఖహాని: పదే పదే ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ పితృదేవతలారా! మీరు ప్రీతితో కూడిన మనస్సు గలవారై, అందరు మా వాక్యమును వినుడు. మీకు దేవ కార్యమును నెరవేర్చు కోరిక ఉన్నచో, మేము చెప్పిన తీరున శీఘ్రముగా ఆచరింపుడు (23) . మంగళ స్వరుపురాలు, మేనయను పేరు గలదీ అగు మీ జ్యేష్ఠకుమార్తెను హిమవ త్పపర్వతునకు ఇచ్చి ప్రీతి పురస్సరముగా వివాహమును చేయుడు (24) . ఇట్లు చేసినచో అందరికి అన్ని గొప్ప లాభములు కలుగగలవు. మరియు మీకు, దేవతలకు కూడ ప్రతి అడుగునందు దుఃఖములు తొలగిపోవును.

బ్రహ్మోవాచ ।

ఇత్యా కర్ణ్యామరవచః పితరస్తే విమృశ్య చ ।
స్మృత్వా శాపం సుతానాం చ ప్రోచురోమితి తద్వచ: ॥
దదుర్మేనాం సువిధినా హిమాగాయ నిజాత్మజామ్ ।
సముత్సవో మహానాసీ త్త ద్వివాహే సుమంగలే ॥
హర్యాదయోఽపి తే దేవా మునయశ్చాపరేఽఖిలా:।
అజగ్ముస్తత్ర సంస్మృత్య వామదేవం భవం ధియా ॥
ఉత్సవం కారయామాసుర్దత్త్వా దానాన్యనేకశః ।
సుప్రశస్య పితౄన్ దివ్యాన్ ప్రశశంసుర్హిమాచలమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పితృదేవతలు దేవతల ఈ మాటను విని, విమర్శించుకుని,కుమార్తెల శాపమును స్మ◌్మరించి, ఆ మాటకు తమ అంగీకారమును తెలిపిరి (26) . వారు తమ కుమార్తెయగు మేనను హిమవత్పర్వతునకిచ్చి యథావిధిగా వివాహమును చేసిరి. పరమ మంగళకరమగు ఆ వివాహములో గొప్ప ఉత్సవము ప్రవర్తిల్లెను (27) . విష్ణువు మొదలగు దేవతలు, మరియు అందరు మహర్షులు వామ దేవుడుగు శంకరుని మనసా స్మరించి ఆ వివాహమునకు వచ్చిరి (28) . వారు అనేక బహుమానములనిచ్చి ఉత్సవమును చేయించిరి. దివ్యులగు పితృదేవతలను మరియు హిమవంతుని అనేక విధములుగా ప్రశంసించిరి.

మహామోదాన్వితా దేవాస్తే సర్వే సమునీశ్వరాః।
సంజగ్ముస్స్వధామాన్ని సంస్మరన్త శ్శివాశివౌ ।
కౌతుకం బహు సంప్రాప్య సువివాహ్య ప్రియాం చ తామ్।
ఆ జగామ స్వభవనం ముదమాప గిరీశ్వరః ॥

దేవతలు , మరియు మహర్షులు అందరు మహానందమును పొందినవారై, ఉమా శివులను స్మరించుకొనుచూ, తమతము నివాసములకు మరలి వెళ్ళిరి (30) . హిమవంతుడు అనేక బహుమానములను పొంది, ఆ సుందరిని చక్కగా వివాహమాడి తన భవనమునకు వచ్చి ఆనందించెను.

బ్రహ్మోవాచ ।

మేనయా హి హిమాగస్య సువివాహో మునీశ్వర ।
ప్రోక్తో మే సుఖదః ప్రీత్యా కిం భూయశ్శ్రోతు మిచ్ఛసి ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితాయాం తృతీయే
పార్వతీ ఖండే హిమాచల వివాహవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! హిమ వంతునికి మేనకతో జరిగిన దివ్యమైన, సుఖ ప్రదమైన వివాహమును ప్రీతితో వర్ణించి చెప్పితిని. ఇంకను ఏమీ వినగోరుచున్నావు?

శ్రీ శివమహాపురాణములో రెండవదియగు రుద్ర సంహితయుందు మూడవది యగు◌ు పార్వతీ ఖండములో హిమవంతుని వివాహ వర్ణనమనే మొదటి అధ్యాయము ముగిసినది.

2 - సనత్కుమారుని శాపము

నారద ఉవాచ ।

విధే ప్రాజ్ఞ వదేదానీం మేనోత్పత్తిం సమాదరాత్ ।
అపి శాపం సమాచక్ష్వ కురు సందేహ భంజనమ్ ॥

నారదుడిట్లు పలికెను -

హే విధే! హే ప్రాజ్ఞా! ఇప్పుడు మేన యొక్క జన్మను గురించి, మరియు శాపమును గురించి విస్తరముగా చెప్పి నా సందేహములను తొలగించుము.

బ్రహ్మో వాచ ।

శృణు నారద సుప్రీత్యా మేనోత్పత్తిం వివేకతః ।
మునిభిస్సహ వక్ష్యేఽహం సుతవర్య మహాబుధ ॥
దక్షనామా మమ సుతో యః పురా కథితో మునే ।
తస్య జాతాస్సుతాష్షష్టి ప్రమితా సృష్టి కారణాః ॥
తాసాం వివాహమకరోత్స వరైః కశ్యపాదిభిః ।
విదితం తే సమస్తం తత్ప్రస్తుతం శృణు నారద ॥
తాసాం మధ్యే స్వధానామ్నీం పితృభ్యో దత్తవాన్ సుతామ్ ।
తిస్రోఽభవన్ సుతాస్తస్యాస్సు భగా ధర్మమూర్తయః॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ నారదా! నా కుమారులలో నీవు శ్రేష్ఠుడవు. మహా పండితుడవు. నేను మేనా దేవి యొక్క జన్మ వృతాంతమును వివేక పూర్వకముగా చెప్పెదను. నీవు మునులతో గూడి మిక్కిలి ప్రీతితో వినుము (2) . ఓ మహర్షీ! నా కుమారుడగు దక్షుని గురించి నీకు పూర్వమే చెప్పియుంటిని. అతనికి అరువది కుమార్తెలు కలిగిరి. వారే ఈ సృష్టికి మూలము అయిరి (3) . ఆతడు వారిని కశ్యపుడు మొదలగు వరుల కిచ్చి వివాహమును చేసిన వృతాంతమంతయు నీకు తెలిసినదే. ఓ నారదా! ప్రస్తుత గాథను వినుము (4) . వారిలో స్వధ అను పేరుగల కుమార్తెను ఆయన పితృదేవతల కిచ్చి వివాహమును చేసెను. ఆమెకు ధర్మమూర్తులు, సుందరీమణులు అగు ముగ్గురు కుమార్తెలు కలిగిరి.

తాసాం నామాని శృణు మే పావనాని మునీశ్వర।
సదా విఘ్నహరాణ్యేవ మహా మంగళదాని చ ॥
మేనా నామ్నీ సుతా జ్యేష్ఠా మధ్యా ధన్యా కలావతీ ।
అంత్యా ఏతాస్సుతాస్సర్వాః పితౄణాం మానసోద్భవా : ॥
అయోనిజాస్స్వధాయశ్చ లోకతస్తత్సుతా మతా : ।
ఆసాం ప్రోచ్య సునామాని సర్వాన్ కామాన్ జనో లభేత్ ॥

జగద్వంద్యాస్సదా లోకమాతరః పరమోదదాః।

యోగిన్యః పరమా జ్ఞాన నిధానాస్త్రిలోకగః॥

ఓ మహర్షీ! పవిత్రము చేయునవి, నిశ్చయముగా సర్వదా విఘ్నములను పారద్రోలి మహా మంగళములనిచ్చునవి అగు వారి నామములను చెప్పెదను. వినుము (6) . పెద్ద కుమార్తె పేరు మేన. రెండవ కుమార్తె ధన్య. మూడవ ఆమె కలావతి. ఈ ముగ్గురు పితృదేవతల మానస పుత్రికలు (7). వీరు అయోనిజలు. కానీ లోకములో స్వధాదేవీ యొక్క కుమార్తెలుగా ప్రసిద్ధిని గాంచిరి. మానవుడు వీరి పవిత్ర నామములనుచ్ఛరించినచో, కోర్కెలనన్నిటిని పొందును (8). వీరు సర్వజగత్తులకు పూజింపదగినవారు. ముల్లోకములకు తల్లులు. గొప్ప, ఆనందమును ఇచ్చువారు. యోగనిష్ఠలు. ముల్లోకముల యందు సంచరించే వీరు పరమజ్ఞాననిధులు.

ఏకస్మిన్ సమయే తిస్రో భగిన్యస్తా మునీశ్వర।

శ్వేతద్వీపం విష్ణులోకం జగ్ముర్దర్శన హేతవే॥

కృత్వా ప్రణామం విష్ణోశ్చ సంస్తుతిం భక్తి సంయుతాః।

తస్థుస్తదాజ్ఞయా తత్ర సుసమాజో మహానభూత్॥

తదైవ సనకాద్యాస్తు సిద్ధా బ్రహ్మసుతా మునే।

గతాస్తత్ర హరిం నత్వా స్తుతా తస్థుస్తదాజ్ఞయా॥

సనకాద్యాన్ మునీన్ దృష్ట్వోత్తస్థుస్తే సకలా ద్రుతమ్।

తత్రస్థాన్ సంస్థితాన్నత్వా దేవాద్యాన్ లోకవందితాన్॥

ఒకనాడు ఈ ముగ్గురు సోదరీమణులు విష్ణువును దర్శించుట కొరకై శ్వేత ద్వీపమునకు వెళ్లిరి. ఓ మహర్షి! (10) . అచట వారు విష్ణువునకు ప్రణమిల్లి, భక్తితో గూడిన వారై ఆయనను స్తుతించి నిలబడిరి. విష్ణువు ఆజ్ఞచే అచట గొప్ప సభ సమయోజితమాయెను (11) . ఓ మహర్షీ! బ్రహ్మపుత్రులగు సనకాది సిద్ధులు అపుడచటకు విచ్చేసి, విష్ణువునకు నమస్కరించి, స్తుతించి, ఆయన ఆజ్ఞచే అచట ఉండిరి (12) . సనకాది మహర్షులను చూచిన సభా సదులందరు వెనువెంటనే లేచి నిలబడిరి. ఆ మహర్షులు అచట నున్న దేవతలను, లోకపూజితులగు ఇతర మహర్షులను దర్శించి ప్రణమిల్లిరి.

తిస్రో భగిన్యస్తాంస్తత్ర నోత్త స్థుర్మోహితా మునే।

మాయయా దైవవివశాశ్శంకరస్య పరాత్మనః॥

మోహినీ సర్వలోకానాం శివమాయా గరీయసీ।

తదధీనం జగత్సర్వం శివేచ్ఛా సా ప్రకీర్త్యతే॥

ప్రారబ్ధం ప్రోచ్యతే సైవ తన్నామాని హ్యనేకశః।

శివేచ్ఛయా భవత్యేవ నాత్ర కార్యా విచారణా॥

భూత్వా తద్వశగాస్తా వై న చక్రురపి తన్నతీమ్।

విస్మితాస్సంప్రద్ర్శ్యైవ సంస్థితాస్త త్ర కేవలమ్॥

ఓ మహర్షీ! కాని ఆ సభలో ఆసీనలైయున్న ఆ ముగ్గురు సోదరిమణులు పరమాత్మ యుగు శంకరదేవుని మాయచే మోహితులగుటచే వివశులై నిలబడలేదు (14) . సర్వలోకములను మోహింపజేయు శివమాయ మిక్కిలి బలమైనది. జగత్తంతయు ఈ మాయకు అధీనమై యున్నది. ఈ మాయయే శివుని సంకల్ప శక్తియని కీర్తింప బడును (15) . ఆ మాయకే ప్రారబ్దమని కూడ పేరు గలదు. ఆ మాయకు అనేక నామములు గలవు. అది శివుని ఇచ్ఛచే లోకములను మోహింపజేయును. దీని విషయములో చేయగల్గినది ఏదీ లేదు (16) . ఆ ముగురు ఆ మాయకు వశులై, ఆ మహర్షులను చూచి విస్మితులై అటులనే చూచుచూ కూర్చుండి రే గానీ, లేచి వారికి నమస్కరించరైరి.

తాదృశీం తద్గతి దృష్ట్వా సనకాద్యా మునీశ్వరా: ।

జ్ఞానినోఽపి పరం చక్రు: క్రోధం దుర్విషహం చ తే ॥

శివేచ్ఛామోహితస్తత్ర సక్రోధస్తా ఉవాచ హ ।

సనత్కుమారో యోగీ శ శ్శాపం దండకరం దదన్ ॥

సనకాది మహర్షులు జ్ఞానులే అయిననూ, వారి ఆ స్థితిని చూచి మిక్కిలి, సహిం౦సిపశక్యము గానీ క్రోధమును పొందిరి (18) . శివుని ఇచ్ఛచే మోహితుడైన సనత్కుమారుడను ఆ యోగి పుంగవుడు కోపించి దండరూపమగు శాపమునిచ్చువాడై వారితో నిట్లనెను.

సనత్కుమార ఉవాచ ।

యూయం తిస్రో భగిన్యశ్చ మూఢాస్సద్వయునోజ్ఝితాః ।

అజ్ఞాత శ్రుతితత్త్వా హి పితృకన్యా అపి ధ్రువమ్ ॥

అభ్యుత్థానం కృతం నో యన్నమస్కా రోఽపి గర్వతః ।

మోహితా నరభావత్వా త్స్వర్గా ద్దూరా భవంతు హి ॥

నరస్త్రియస్సంభవంతు తిస్రోఽపి జ్ఞానమోహితా।

స్వకర్మణః ప్రభావాద్వై లభధ్వం ఫలమీదృశమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

మీరు అక్కా చెల్లెళ్ళు ముగ్గురు మూర్ఖులు. మీలో యోగ్యమగు జ్ఞానము లేదు. మీరు పితృదేవతల కుమార్తెలే అయినా, మీకు వేదతాత్పర్యము ఎరుక లేదనుట నిశ్చయము (2 0) . మీరు గర్వముచే లేచి నిలబడలేదు. మాకు నమస్కరించలేదు. కావున, మోహితులైన మీరు మానవ శరీరమును పొంది స్వర్గమునకు దూరమగుదురు గాక!(21) . జ్ఞానమునుండి వంచితులైన మీరు ముగ్గురు కూడ మానవస్త్రీలై జన్మించెదరు గాక ! మీరు చేసుకున్న కర్మయొక్క ప్రభావము వలననే మీకిట్టి ఫలము లభించుచున్నది.

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య చ సాధ్వ్యస్తాస్తిస్రోఽపి జ్ఞానమోహితాః ।
పతిత్వా పాదయోస్తస్య సమూచుర్నతమస్తకాః ।

బ్రహ్మ ఇట్లు పలికెను –

జ్ఞానము నుండి వంచితులైన వారు, మిక్కిలి భయపడిన వారు, తలవంచుకున్న వారు అగు ఆ ముగ్గురు ఈ మాటలను విని, ఆయన పాదములపై బడి ఇట్లు పలికిరి.

పితృతనయా ఊచుః ।

మునివర్య దయాసింధో ప్రసన్నో భవ చాధునా ।
త్వత్ప్రణామం వయం మూఢా: కుర్మహే స్మ న భావతః
ప్రాప్తం చ తత్ఫలం విప్ర న తే దోషో మహామునే ।
అనుగ్రహం కురుష్వాత్ర లభేమ స్వర్గతిం పునః ॥

పితృదేవతల కుమార్తెలు ఇట్లు పలికిరి –

ఓ మహర్షీ! నీవు దయా సముద్రుడవు. నీ విపుడు ప్రసన్నుడవు కమ్ము. మూర్ఖులమగు మేము నీకు నమస్కరించకపోతిమి. దానికి కారణము అనాదర భావన కాదు (2 4) . హే విప్రా! మా తప్పునకు ఫలమును మేము పొందితిమి. ఓ మహర్షీ! దీనియందు నీ దోషము లేదు. కాని మేము మరల స్వర్గ నివాసమును పొందునట్లు మమ్ములను అనుగ్రహించుము.

బ్రహ్మోవాచ ।

శ్రుత్వా తద్వచనం తాత ప్రోవాచ స మునిస్తదా ।
శాపోద్ధారం ప్రసన్నాత్మా ప్రేరిత శ్శివమాయయా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

వత్సా! అపుడా మహర్షి ఆ మాటను విని ప్రసన్నముగు అంతఃకరణము గలవాడై, శివుని మాయచే ప్రేరేపింపబడి శాపము నుండి ఉద్ధారమును ఇట్లు చెప్పెను.

సనత్కుమార ఉవాచ ।

పితౄణాం తనయాస్తిస్ర శ్శృణుత ప్రీతమానసాః।
వచనం మమ శోకఘ్నం సుఖదం సర్వదైవ వః ॥
విష్ణోరంశ స్య శైలస్య హిమాధారస్య కామినీ ।
జ్యేష్ఠా భవతు తత్కన్యా భవిష్యత్యేవ పార్వతీ ॥
ధన్యా ప్రియా ద్వితీయా తు యోగినీ జనకస్య చ ।
తస్యాః కన్యా మహాలక్ష్మీర్నామ్నా సీతా భవిష్యతి ॥
వృషభానస్య వైశ్యస్య కనిష్ఠా చ కలావతీ ।
భవిష్యతి ప్రియా రాధా తత్సుతా ద్వాపరాంతతః ॥

సనత్కుమారుడిట్లు పలికెను –

పితృదేవతల ముగ్గురు కుమార్తెలారా! వినుడు. మనసులో ప్రీతిని చెందుడు.నా మాట మీకు సర్వదా శోకములను పోగొట్టి సుఖముల నీయగలదు (27) . మీలో జ్యేష్ఠురాలు విష్ణువు యొక్క అంశమైన హిమవత్పర్వతుని భార్య యగు గాక !వారికి పార్వతియను కన్య ఉదయించగలదు (28) . మీలో రెండవది, యోగ సంపన్నురాలు అగు ధన్య జనకునకు ప్రియురాలు కాగలదు. వారికి సీత యను పేర మహాలక్ష్మి కుమార్తె కాగలదు (29) . కనిష్ఠురాలగు కలావతి వృషభానుడగు వైశ్యునకు పత్ని కాగలదు. ద్వాపరయుగాంతమునందు వారికి రాధయను కుమార్తె కలుగును.

మేనకా యోగినీ పత్యా పార్వత్యాశ్చ వరేణ చ ।
తేన దేహేన కైలాసం గమిష్యతీ పరం పదమ్ ॥
ధన్యా చ సీతయా సీరధ్వజో జనక వంశజః ।
జీవన్ముక్తో మహాయోగీ వైకుంఠం చ గమిష్యతి ॥
కలావతీ వృషభానస్య కౌతుకోత్కన్యయా సహ ।
జీవన్ముక్తా చ గోలోకం గమిష్యతి న సంశయః ॥
వినా విపత్తిం మహిమా కేషాం కుత్ర భవిష్యతి ।
సుకర్మిణాం గతే దుఃఖే ప్రభవే ద్దుర్లభం సుఖమ్ ॥

యోగిని యగు మేనక పార్వతి యొక్క వరముచే భర్తతో గూడి ఆ దేహముౖతో పరమపదమగు కైలాసమును పొందగలదు (31) . జనక వంశములో పుట్టిన వాడు, జీవన్ముక్తుడు, మహా యోగి అగు సీరధ్వజుడు మరియు అతని పత్ని యగు ధన్య సీతాదేవితో గూడి వైకుంఠమును పొందగలరు (3 2) . వృషభానుని వివాహమాడిన కలావతి జీవన్ముక్తురాలై తమ కుమార్తెయగు రాధతో గూడి గోలోకమును పొందగలదనుటలో సంశయము లేదు (33) . కష్టములను పడని వారికి ఎవ్వరికైననూ ఎక్కడనైననూ అభ్యున్నతి లేదు. పుణ్యమును చేయు వారికి దుఃఖము దూరముకాగానే దుర్లభమగు సుఖము లభించును.

యూయం పితౄణాం తనయాస్సర్వాస్స్వర్గ విలాసికాః ।

కర్మక్షయశ్చ యుష్మాకమభవద్విష్ణుదర్శనాత్ ॥

ఇత్యుక్త్వా పునరప్యాహ గతక్రోధో మునీశ్వరః ।

శివం సంస్మృత్య మనసా జ్ఞానదం భుక్తిముక్తిదమ్॥

అపరం శృణుత ప్రీత్యా మద్వచస్సుఖదం సదా ।

ధన్యాయూయం శివప్రీతా మాన్యాః పూజ్యా హ్యభీక్ష్ణశః ॥

మేనాయాస్తనయా దేవీ పార్వతీ జగదంబికా ।

భవిష్యతి ప్రియా శంభోస్తపః కృత్వా సుదుస్సహమ్ ॥

పితృ దేవతల కుమార్తెలగు మీరు ముగ్గురు స్వర్గము యొక్క విలాసము గలవారు. విష్ణువును దర్శించుట వలన మీకు కర్మక్షయమైనది (35) . ఇట్లు పలికి తొలగిన క్రోధము గల ఆ మహర్షి జ్ఞానమును, భుక్తిని, ముక్తిని ఇచ్చే శివుని మనస్సులో స్మరించి ఇంకనూ ఇట్లు పలికెను (36). నేను సదా సుఖమును ఇచ్చే మరియొక మాటను చెప్పెదను. ప్రీతితో వినుడు. శివుని ప్రీతికి పాత్రులగు మీరు ధన్యులు. ఆదరణీయులు, మరియు అత్యంత పూజనీయులు (37) . మేన యొక్క కుమార్తెయగు పార్వతీ దేవి దుష్కరమగు తపస్సును చేసి, శివుని ప్రియురాలై జగన్మాత కాగలదు.

ధన్యా సుతా స్మృతో సీతా రామపత్నీ భవిష్యతి ।

లౌకికాచారమాశ్రిత్య రామేణ విహరిష్యతి ॥

కలావతీ సుతా రాధా సాక్షా ద్గోలోక వాసినీ।

గుప్త స్నేహనిబద్ధా సా కృష్ణ పత్నీ భవిష్యతి ॥

ధన్య యొక్క కుమార్తె సీతయను పేర రామునకు భార్యయై, లోకాచారమునను◌ుసరించి రామునితో గూడి విహరించగలదు (39) . కలావతి యొక్క కుమార్తెయగు రాధ కృష్ణుని యందు రహస్య ప్రేమ పూర్ణమగు జీవితమును గడిపి గోలోకమును పొంది కృష్ణ పత్ని కాగలదు.

బ్రహ్మోవాచ ।

ఇత్థమాభాష్య స ముని ర్భ్రాతృభిస్సహ సంస్తుతః ।
సనత్కుమారో భగవాంస్తత్రైవాంతర్హితోఽభవత్ ॥
తిస్రో భగిన్యస్తాస్తాత పితౄణాం మానసీస్సుతాః ।
గతపాపాస్సుఖం ప్రాప్య స్వధామ ప్రయయుర్ద్రుతమ్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితాయాం తృతీయే
పార్వతీఖండే పూర్వగతి వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పరమ పూజనీయుడు, సోదరులతో గూడి సర్వులచే స్తుతింపబడు వాడునగు, సనత్కుమార మహర్షి ఇట్లు పలికి అచటనే అంతర్ధానమయ్యెను (41) . వత్సా! పితృదేవతల మానస పుత్రికలగు ఆ ముగ్గురు సోదరీమణులు తొలగిన దుఃఖమనే పాపము గలవారై సుఖమును పొంది వెనువెంటనే తమ ధామమును పొందిరి.

శ్రీ శివ మహాపురాణములో రెండవది యగు రుద్ర సంహితయందు మూడవది యగు పార్వతీ ఖండలో పూర్వగతి వర్ణనమనే రెండవ అధ్యాయము ముగిసినది.

3 – దేవీస్తుతి

నారద ఉవాచ ।

వీధేప్రాజ్ఞ మహాధీమన్ వద మే వదతాం వర।
తతః పరం కిమభవచ్చరితం విష్ణుసద్గురో ॥
అద్భుతేయం కథా ప్రోక్తా మేనా పూర్వ గతి శ్శుభా ।
వివాహశ్చ శ్రుతస్సమ్యక్ పరమం చరితం వద ॥
మేనాం వివాహ్య స గిరి: కృతవాన్ కిం తతః పరమ్ ।
పార్వతీ కథముత్పన్నా తస్యాం వై జగదంబికా ॥
తతస్సుదుస్సహం కృత్వా కథం ప్రాప పతిం హరమ్ ।
ఏతత్సర్వం సమాచక్ష్వ విస్తరాచ్ఛాంకరం యశః ॥

నారదుడిట్లు పలికెను –

ఓ బ్రహ్మా! నీవు ప్రాజ్ఞుడవు. మహాధీమంతుడవు. వక్తలలో శ్రేష్ఠుడవు. విష్ణువు సద్గురువుగా గలవాడవు. తరువాత జరిగిన వృత్తాంతమును నాకు చెప్పుము(1). శుభకరము, అద్భుతము అగు ఈ మేనకా పూర్వచరిత్రను చెప్పి యుంటివి. ఆమె వివాహమును గురించి కూడ వింటిని. తరువాతి చరితమును చెప్పుము(2). ఆ హిమవంతుడు మేనను వివాహమాడిన పిదప ఏమి చేసెను? ఆమె యందు జగన్మాత యగు పార్వతి జన్మించిన వృత్తాంతమెట్టిది?(3). తరువాత ఆమె దుష్కరమగు తపస్సును చేసి శివుని పొందిన తీరు ఎట్టిది? శివుని యశస్సును వర్ణించే ఈ వృత్తాంతము నంతనూ విస్తరముగా చెప్పుము.

బ్రహ్మోవాచ ।

మునే త్వం శృణు సుప్రీత్యా శాంకరం సుయశశ్శుభమ్ ।
యచ్ఛ్రుత్వా బ్రహ్మహా శుధ్యేత్సర్వాన్ కామానవాప్నుయాత్ ॥
యదా మేనా వివాహం తు కృత్వాగచ్ఛద్గిరే ర్గృహ మ్ ।
తదా సముత్సవో జాతస్త్రిషు లోకేషు నారద ॥
హిమాచలోఽపి సుప్రీతశ్చ కార పరమోత్సవమ్ ।
భూసురాన్ బంధువర్గాంశ్చ పరానానర్చ సద్ధియా ॥
సర్వే ద్విజాశ్చ సంతుష్టా దత్త్వాశీర్వచనం వరమ్ ।
యయుస్త స్మై స్వస్వధామ బంధువర్గాస్తథాపరే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! శంకరుని శుభకరమగు పుణ్యకీర్తిని మిక్కిలి ప్రీతితో వినుము. ఈ కీర్తిని విన్నచో బ్రహ్మ హత్యను చేసినవాడైననూ పవిత్రుడై సమస్త కామనలను పొందును (5). ఓ నారదా! మేన హిమవంతుని వివాహ మాడి ఆయన గృహమునకు వెళ్లినప్పుడు

ముల్లోకములలో గొప్ప ఉత్సవము జరిగెను (6). హిమవంతుడు కూడ మిక్కిలి ఆనందించి గొప్ప వేడుకలను జరిపించి,బ్రాహ్మణులను,బంధువులను, మరియు ఇతరులను మంచి మనస్సుతో పూజించెను (7). బ్రాహ్మణులు, బంధువులు మరియు ఇతరులు అందరు సంతసించి మహదాశీర్వచనములను ఆ హిమవంతునకు ఇచ్చి తమ తమ స్థానములకు మరలి వెళ్లిరి.

హిమాచలోఽపి సుప్రీతో మేనయా సుఖదే గృహే ।

రేమేఽన్యత్ర చ సుస్థానే నందనాది వనేష్వ పి॥

తస్మిన్నవసరే దేవా మునే విష్ణ్వా దయోఽఖిలాః ।

మునయశ్చ మహాత్మానః ప్రజగ్ము ర్భూధరాంతికే ॥

దృష్ట్వా తానాగతాన్దేవాన్ ప్రణనామ ముదా గిరిః ।

సమ్మానం కృతవాన్ భక్త్యా ప్రశంసన్ స్వవిధిం మహాన్ ॥

సాంజలిర్నతశీర్షో హి స తుష్టావ సుభక్తితః ।

రోమోద్గమో మహానాసీద్గిరేః ప్రేమాశ్రవోఽ పతన్ ॥

తతః ప్రణమ్య సుప్రీతో హిమశైలః ప్రసన్నధీః ।

ఉవాచ ప్రణతో భూత్వా మునే విష్ణ్వాదికాన్ సురాన్ ॥

హిమవంతుడు కూడ మిక్కిలి ఆనందించినవాడై, మేనతో గూడి సకల సుఖము:లు గల గృహమునందు మాత్రమే గాక, నందనవనము ఇత్యాది సుందర ప్రదేశముల యందు గూడ రమించెను (9). ఆ సమయములో విష్ణువు మొదలుగా గల సర్వదేవతలు, మరియు మహాత్ములగు మునులు హిమవంతుని వద్దకు వెళ్ళిరి (10). వచ్చిన వారి నందరిని చూచి మహాత్ముడగు హిమవంతుడు తన భాగ్యమును కొనియాడి ఆనందముతో వారికి ప్రణమిల్లి భక్తితో వారిని సన్మానించెను (11). ఆతడు భక్తితో దోసిలి యొగ్గి శిరసు వంచి స్తుతించెను .ఆ పర్వతునకు ఆనందముచే గొప్ప గగుర్పాటు కలుగుటయే గాక, ఆనందబాష్పములు రాలెను (12). అపుడు ప్రసన్నమగు మనస్సు గల హిమవంతుడు గొప్ప ఆనందముతో ప్రణమిల్లెను, ఓ మహర్షీ! ఆతడు అపుడు ప్రణమిల్లిన పిదప, విష్ణువు మొదలుగా గల దేవతలనుద్దేశించి ఇట్లు పలికెను.

హిమాచల ఉవాచ ।

అద్య మే సఫలం జన్మ సఫలం సుమహత్తపః ।

అద్య మే సఫలం జ్ఞాన మద్య మే సఫలాః క్రియాః ।

ధన్యోఽహమద్య సంజాతో ధన్యా మే సకలా క్షితిః ।

ధన్యం కులం తథా దారా స్సర్వం ధన్యం న సంశయః ॥

యతస్సమాగతా యూయం మిలిత్వా సర్వ ఏకదా ।

మాం నిదేశయత ప్రీత్యోచితం మత్వా స్వసేవకమ్ ॥

హిమవంతుడిట్లు పలికెను -

ఈనాడు నా పుట్టుక సఫలమైనది. నేను చేసిన గొప్ప తపస్సు ఫలించినది. ఈనాడు నా జ్ఞానము సార్థకమైనది. ఈనాడు నేను చేసిన పుణ్యకర్మలు ఫలమునిచ్చినవి (14). నేనీనాడు ధన్యుడనైతిని. నా భూభాగమంతయూ ధన్యమైనది. మరియు కులము, భార్య మరియు సర్వము ధన్యమైనదనుటలో సందియము లేదు (15). కారణమేమనగా, మీ సేవకునిగా తలంచి ప్రీతితో ఉచితముగు తీరున నన్ను కార్యమునందు నియోగించుడు.

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా మహీధ్రస్య వచనం తే సురాస్తదా ।
ఊచుర్హర్యాదయః ప్రీతాస్సిద్ధిం మత్వా స్వకార్యతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

హిమవంతుని ఈ మాటను విని విష్ణువు మొదలగు ఆ దేవతలు అపుడు తమ కార్యము సిద్ధించినదని తలంచి సంతసించినవారై, ఇట్లు పలికిరి.

దేవా ఊచుః ।

హిమాచల మహాప్రాజ్ఞ శృణ్వస్మద్వచనం హితమ్।
యదర్థమాగతాస్సర్వే తద్బ్రూమః ప్రీతితో వయమ్ ॥
యా పురా జగదంబోమా దక్ష కన్యాఽభవద్గిరే ।
రుద్రపత్నీ హి సా భూత్వా చిక్రీడే సుచిరం భువి ॥
పితృతోఽనాదరం ప్రాప్య సంస్మృత్య స్వపణం సతీ।
జగామ స్వపదం త్యక్త్వా తచ్ఛరీరం తదాంబికా ॥
సా కథా విదితా లోకే తవాపి హిమ భూధర।
ఏవం సతీ మహాలాభో భవే ద్దేవగణస్య హి॥
సర్వస్య భవతశ్చాపి స్యుస్సర్వే తే వశే సురాః ॥

దేవతలిట్లు పలికిరి –

ఓయీ హిమవంతా! మహాప్రాజ్ఞా! మేము చెప్పే హితకరమగు వచనమును వినుము. మేమందరము ఏ పని కొరకు వచ్చితిమో, దానిని ప్రీతితో చెప్పెదము (18). ఓ పర్వతరాజా! జగన్మాతయగు ఉమ పూర్వము దక్షుని కుమార్తె యై జన్మించి, రుద్రునకు భార్యయై చిరకాలము భూమండలమునందు క్రీడించెను (19). ఆ సతీదేవి తండ్రిచే అవమానంపబడి తన ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చుకొనెను. అపుడా జగన్మాత ఆ దేహమును త్యజించి తన ధామమునకు వెళ్లెను (20). ఓ హిమగిరీ! ఆ కథ లోకములో ప్రసిద్ధి గాంచినది. నీకు కూడ ఆ గాథ తెలియును. ఇట్లు అయినచో, దేవతలకందరికి గొప్ప లాభము ఒనగూరును (21). మరియు నీకు కూడ గొప్ప ప్రయోజనము చేకూరును. దేవతలందరు నీకు వశవర్తులై ఉండగలరు.

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం హర్యాదీనాం గిరీశ్వరః ।
తథాస్త్వితి ప్రసన్నాత్మా ప్రోవాచ స చ సాదరమ్ ॥
అథ తే చ సమాదిశ్య తద్విధిం పరమాదరాత్ ।
స్వయం జగ్ముశ్చ శరణ ముమాయా శ్శంకరస్త్రియః ॥
సుస్థలే మనసా స్థిత్వా సస్మరుర్జగదంబికామ్ ।
ప్రణమ్య బహుశస్తత్ర తుష్టువు శ్శ్రద్ధయా సురాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ పర్వతరాజు విష్ణువు మొదలుగా గల ఆ దేవతల మాటలను విని, ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆదరముతో ' అటులనే అగు గాక!' అని పలికెను (23). అపుడు వారు మిక్కిలి ఆదరముతో ఆ విధివిధానము నంతయూ హిమవంతునకు బోధించి, తాము శంకరపత్నియగు ఉమాదేవిని శరణు జొచ్చిరి (24). వారు మంచి స్థలములో నిలబడి మనస్సులో ఆ జగన్మాతను స్మరించి, అనేక పర్యాయములు ప్రణమిల్లి శ్రద్ధతో స్తుతించిరి.

దేవా ఊచుః ।

దేవ్యుమే జగతామంబ శివలోక నివాసిని ।
సదాశివ ప్రియే దుర్గే త్వాం నమామో మహేశ్వరి॥
శ్రీ శక్తిం పావనాం శాంతాం పుష్టిం పరమపావనీమ్ ।
వయం నమామహే భక్త్యా మహ దవ్యక్తరూపిణీమ్ ॥
శివాం శివకరాం శుద్ధాం స్థూలాం సూక్ష్మాం పరాయణామ్ ।
అంతర్విద్యాసువిద్యాభ్యాం సుప్రీతాం త్వాం నమామహే॥
త్వం శ్రద్ధా త్వం ధృతిస్త్వం శ్రీస్త్వమేవ సర్వగోచరా।
త్వం దీధితి స్సూర్యగతా స్వప్రపంచ ప్రకాశినీ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ ఉమాదేవీ! జగన్మాతా! దుర్గా! మహేశ్వరి! సదాశివునకు ప్రియురాలవై శివలోకము నందు నివసించు నీకు నమస్కారము (26). పవిత్రము చేయునది, శాంతి స్వరూపురాలు, పుష్టిని కలిగించునది, మహత్తు, ప్రకృతి స్వరూపముగా గలది అగు శ్రీ శక్తిని మేము భక్తితో నమస్కరించుచున్నాము (27). మంగళ స్వరూపురాలు, మంగళములనిచ్చు నామె, శుద్ధ, స్థూలరూపిణి (కార్య రూపిణి), సూక్ష్మ(కారణ) రూపిణి, సర్వశ్రేష్ఠ లక్ష్యము, అంతర్ముఖత్వముచే మరియు అధ్యాత్మ విద్యచే మిక్కిలి ప్రీతిని పొందునది అగు నిన్ను నమస్కరించు చున్నాము (28). శ్రద్ధ నీవే. ధైర్యము నీవే. సర్వ ప్రాణులలోని శోభ నీవే. సూర్యుని యందలి ప్రకాశము నీవే. నీ స్వరూపమగు ప్రపంచమును నీవే ప్రకాశింప జేయుచున్నావు.

యా చ బ్రహ్మాండసంస్థానే జగజ్జీవేషు యా జగత్ ।

ఆప్యాయయతి బ్రహ్మాదితృణాంతం తాం నమామహే ॥

గాయత్రీ త్వం వేదమాతా త్వం సావిత్రీ సరస్వతీ ।

త్వం వార్తా సర్వ జగతాం త్వ త్రయీ ధర్మరూపిణీ ॥

నిద్రా త్వం సర్వభూతేషు క్షుధా తృప్తిస్త్వ మేవ హి ।

తృష్ణా కాంతి శ్ఛవిస్తుష్టి స్సర్వానందకరీ సదా ॥

త్వం లక్ష్మీః పుణ్య కర్తృణాం త్వం జ్యేష్ఠా పాపినాం సదా ।

త్వం శాన్తిస్సర్వ జగతాం త్వం ధాత్రీ ప్రాణపోషిణీ ॥

ఏ దేవి బ్రహ్మాండమే దేహముగా కలిగి యున్నదో, బ్రహ్మాండములోని ప్రాణులన్నిటిలో చలన శక్తి రూపములో నున్నదో, బ్రహ్మగారి నుండి తృణము వరకు గల సర్వ ప్రాణులను సంతృప్తి పరచు చున్నదో అట్టి ఆ ఉమాదేవిని నమస్కరించు చున్నాము (30). వేదమాత యగు గాయత్రివి నీవే. సవితృమండలాధిష్ఠాన దేవతవు నీవే. సరస్వతివి నీవే. సర్వ ప్రాణులలోని తెలిసే సామర్థ్యము నీవే. ధర్మమూలమగు వేదము నీవే (31). సర్వ ప్రాణుల యందలి నిద్ర, ఆకలి, మరియు తృప్తి నీవే, ప్రాణుల యందలి తృష్ణ, కాంతి, సౌందర్యము మరియు తుష్టి నీవే, నీవు సదా సర్వులకు ఆనందము నిచ్చెదవు (32). పుణ్యాత్ములకు లభించు లక్ష్మివి నీవే. పాపులకు నిశ్చితముగా సంప్రాప్తమయ్యే దారిద్ర్యము నీవే. సర్వప్రాణులలోనీ శాంతివి నీవే. సర్వ ప్రాణులను పోషించు తల్లివి నీవే.

తత్త్వ స్వరూపా భూతానాం పంచానా మపి సారకృత్ ।

త్వం హి నీతి భృతాం నీతి ర్వ్యవసాయస్వరూపిణీ ॥

గీతిస్త్వం సామవేదస్య గ్రంథిస్త్వం యజుషాం హుతిః ।

ఋగ్వేదస్య తథా మాత్రా థర్వణస్య పరా గతిః ॥

సమస్తగీర్వాణ గణస్య శక్తిః తమో మయీ ధాత్రి గుణైకదృశ్యా ।

రజః ప్రపంచాత్తు భవైకరూపా యా నశ్శ్రుతా భవ్యకరీ స్తుతేహ ॥

పంచభూతములలోని సారతత్త్వము నీ స్వరూపమే. నీతి శాస్త్రజ్ఞుల, మరియు నీతి మంతుల నీతి నీవే. నిశ్చయాత్మకమగు బుద్ధి నీ స్వరూపమే (34). సామవేదమునందలి గీతి నీవే. గ్రంథి నీవే. యజుర్వేదములోని ఆహుతి నీవే. మరియు ఋగ్వేదము యొక్క మాత్ర నీవే. అథర్వణ వేదము యొక్క పరమతాత్పర్యము నీవే (35). సమస్త దేవతా బృందముల శక్తి నీవే. లోకములకు తల్లి వగు నీ యందు తమోగుణము ఒకానొక రూపములో కనబడును. రజోగుణ స్వరూపిణి వగు నీ నుండియే ఈ ప్రపంచము పుట్టినది, మాకు మంగళములనిచ్చు నిన్ను ఇచట మేము వేద వాక్కులచే స్తుతించుచున్నాము.

సంసార సాగర కరాల భవాంగ దుఃఖ నిస్తారకారి తరణిశ్చ నివీత హీనా

।

అష్టాంగ యోగ పరిపాలన కేలి దక్షాం వింధ్యా గవాస నిరతాం ప్రణ

మామ తాం వై ॥

నాసాక్షి వక్త్ర భుజవక్షసి మానసే చ ధృత్వా సుఖాని వితనోషి సదైవ

జన్తోః।

నిద్రేతి యాతి సుభగా జగతీ భవా నః సా నః ప్రసీదతు భవస్థితి

పాలనాయ ॥

సంసార సముద్రములో పుట్టుట యనే భయంకరమగు దుఃఖమును దాటించే పడవ నీవే. అజ్ఞానావరణ నీకు లేదు. ఎనిమిది అంగములతో గూడిన యోగమును పాలించుట అను క్రీడలో సమర్థురాలు, వింధ్య పర్వత నివాసముచే ప్రీతిని పొందునది అగు ఆ దేవిని నమస్కరించుచున్నాము (37). ప్రాణులలో ముక్కు, కన్ను మొదలగు జ్ఞానేంద్రియముల యందు, నోరు, భుజములు మొదలగు కర్మేంద్రియముల యందు మరియు మనస్సు నందు ఓ జోరూపముగ నుండి, మరియు ప్రాణుల హృదయ పుండరీకమునందు నివసించి వారికి సదా నీవు సుఖమును కలిగించుచున్నావు. జగదేక సుందరివగు నీవు మా యందు నిద్రా రూపమున ఉన్నావు. అజ్ఞాన రూపములో ఉన్నావు. అట్టి నీవు ఈ జగత్తు యొక్క ఉనికిని రక్షించి మమ్ములను పాలించుము.

బ్రహ్మోవాచ ।

ఇతి స్తుత్వా మహేశానీం జగదంబాముమాం సతీమ్ ।

సుప్రేయమనసస్సర్వే తస్థుస్తే దర్శనేప్సవః ।

ఇతి శ్రీ శివ మహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే

పార్వతీ ఖండే దేవస్తుతిర్నామ తృతీయోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఆ దేవతలందరు మహేశ్వరి, జగన్మాత, సతీ దేహధారిణి అగు ఉమాదేవిని ఈ విధముగా స్తు్తతించి, మిక్కిలి ప్రీతితో నిండిన మనస్సు గలవారై ఆమెను దర్శించు కోరికతో అచటనే వేచి యుండిరి.

శ్రీ శివ మహాపురాణములో రెండవది యగు రుద్ర సంహితయందు మూడవది యగు పార్వతీ ఖండలో దేవీస్తుతి అనే మూడవ అధ్యాయము ముగిసినది.

4 – దేవి దేవతలనోదార్చుట

బ్రహ్మోవాచ।

ఇత్థం దేవైస్స్తుతా దేవీ దుర్గా దుర్గార్తి నాశినీ।
ఆవిర్బభూవ దేవానాం పురతో జగదంబికా॥
రథే రత్నమయే దివ్యే సంస్థితా పరమాద్భుతే।
కింకిణీ జాలసంయుక్తే మృదుసంస్తరణే వరే॥
కోటి సూర్యాధికా భాస రమ్యావయవభాసినీ।
స్వతేజోరాశిమధ్యస్థా వరరూపా సముచ్ఛవిః॥
అనూపమా మహామాయా సదాశివవిలాసినీ।
త్రిగుణా నిర్గుణా నిత్యా శివలోకనివాసినీ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

భయంకరమగు విపత్తులను నశింపజేసే జగన్మాతయగు దుర్గాదేవి దేవతలచే ఈ విధముగా స్తుతింపబడినదై వారి యెదుట సాక్షాత్కరించెను (1). రత్న నిర్మితము, దివ్యము, పరమాద్భుతము, చిరు గంటల తోరణములతో కూడి యున్నది, మెత్తని పరుపులు అమర్చబడినది అగు శ్రేష్ఠరథములో ఆమె కూర్చుండి యుండెను (2). ఆమె అవయవములు కోటి సూర్యుల కంటే అధికమగు కాంతితో విలసిల్లెను. ఆమె తన నుండి ఉద్భుతమైన కాంతిపుంజము మధ్యలో కూర్చుండి యుండెను. దివ్యమగు రూపము గల ఆమె సౌందర్యమునకు సాటిలేదు (3). సదాశివుని పత్నియై శివలోకములో నివసించు ఆ మహామాయ త్రిగుణాత్మిక, మరియు నిర్గుణస్వరూపిణి. ఆమె నిత్యురాలు.

త్రిదేవ జననీ చండీ శివా సర్వార్తి నాశినీ ।
సర్వమాతా మహానిద్రా సర్వస్వజనతారిణీ ॥
తేజో రాశేః ప్రభావాత్తు సా తు దృష్ట్వా సురైశ్శివా।
తుష్టువుస్తాం పునస్తే వై సురా దర్శన కాంక్షిణః ॥
అథ దేవగణాస్సర్వే విష్ణ్వా ద్యా దర్శనేప్సవః ।
దదృశుర్జగదంబాం తాం తత్ కృపాం ప్రాప్య తత్ర హి ॥
బభూవానంద సందోహస్సర్వేషాం త్రిదివౌకసామ్ ।
పునః పునః ప్రణేముస్తాం తుష్టువుశ్చ విశేషతః ॥

ఆ చండి ముల్లోకములకు తల్లి. కష్టముల నన్నిటినీ తొలగించి మంగళముల నిచ్చునది. ఆమె సర్వప్రాణులకు తల్లి. ఆమె మాయాస్వరూపిణియై జీవులను అజ్ఞాన వశులను చేయును. కాని ఆమె తన భక్తుల నందరినీ సంసారము నుండి తరింపజేయును (5). తేజోరాశి రూపములో వున్న ఆ ఉమాదేవిని చూచిన దేవతలు ఆమెను మరల స్పష్టముగా దర్శించుట కొరకై ఆమెను ప్రార్థించిరి (6). ఆమెను దర్శించు కోరిక గల విష్ణువు మొదలగు దేవతలందరు ఆమె కరుణను పొంది ఆ జగన్మాతను దర్శించిరి (7). ఆమె దర్శనముచే దేవతలందరికీ పట్టరాని

ఆనందము కలిగెను. వారామెకు అనేక పర్యాయములు నమస్కరించి, విశేషముగా స్తుతించిరి.

దేవా ఊచుః।

శివే శర్వాణి కల్యాణి జగదంబ మహేశ్వరి ।
త్వాం నతాస్సర్వథా దేవా వయం సర్వార్తి నాశి నీమ్ ॥
న హి జానంతి దేవేశి వేదాశ్శాస్త్రాణి కృత్స్నశః ।
అతీతో మహిమా ధ్యానం తవ వాఙ్ మనసోశ్శివే ॥
అతద్వ్యా వృత్తితస్త్వాం వై చకితం చకితం సదా ।
అభిధత్తే శ్రుతిరపి పరేషాం కా కథా మతా ॥
జానంతి బహవో భక్తాస్త్వత్కృపాం ప్రాప్య భక్తితః ।
శరణా గతభక్తానాం న కు త్రాపి భయాదికమ్ ॥
విజ్ఞప్తిం శృణు సుప్రీతా యస్యా దాసాస్సదాంబికే ।
తవ దేవి మహాదేవి హీనతో వర్ణమామహే ॥

దేవతలిట్లు పలికిరి –

హే శివే! శర్వుని రాణీ! కల్యాణ స్వరుపురాలా! జగన్మాతా! మహేశ్వరి! సర్వాపదలను గట్టెక్కించే నిన్ను దేవతలమగు మేము సర్వ విధములుగా నమస్కరించు చున్నాము (9). హే దేవేశీ! వేదశాస్త్రములు శ్రీ స్వరూపమును సమగ్రముగా తెలుపజాలవు. నీ మహిమ వాక్కులకు అందదు. హే శివే! నీ మహిమను మనస్సు ధ్యానింపజాలదు (10). శ్రుతి కూడ భయపడుతూ నీ స్వరూపమును సాక్షాత్తుగా గాక 'నేతి నేతి' వాక్యములచే నిషేధముఖముగా మాత్రమే చెప్ప గల్గును. అట్టిచో, ఇతరుల గురించి చెప్పున దేమున్నది? (11). కాని నీ కృప పొందిన భక్తులు ఎందరో భక్తి ప్రభావముచే నిన్ను ఎరుంగుదురు. నిన్ను శరణు జొచ్చిన భక్తులకు ఎచ్చటనైననూ భయము మొదలగునవి లేవు (12). ఓ అంబికా! నీవు ప్రీతురాలవై మా విన్నపమును వినుము. ఓ దేవీ! మహాదేవి! నీకు మేము సదా దాసులము. నీ మహిమను మేము కొద్దిగా మాత్రమే వర్ణించగల్గుదుము.

పురా దక్షసుతా భూత్వా సంజాతా హరవల్ల భా ।
బ్రహ్మణశ్చ పరేషాం వా నాశయ త్వమకం మహత్ ॥
పితృతోఽనాదరం ప్రాప్యాత్యజః పణవశాత్తనుమ్ ।
స్వలోకమగమస్త్వం వాలభద్దుఃఖం హరోఽపి హి ॥
న హి జాతం ప్రపూర్ణం తద్దేవకార్యం మహేశ్వరి ।
వ్యాకులా మునయో దేవాశ్శరణం త్వాం గతా వయమ్ ॥
పూర్ణం కురు మహేశాని నిర్జరాణాం మనోరథమ్ ।
సనత్కుమారవచనం సఫలం స్యాద్యథా శివే ॥

పూర్వము నీవు దక్షుని కుమార్తెగా జన్మించి హరునకు ప్రియురాలవైతివి. ఆ సమయములో నీవు బ్రహ్మకు, మరియు ఇతరులకు మహా దుఃఖమును నివారించి యుంటివి (14). నీవు తండ్రి వలన అనాదరమును పొంది ప్రతిజ్ఞ ప్రకారముగా దేహమును త్యజించి నీ లోకమును చేరితివి. శివుడు ఆ విషయములో ఎంతయూ దుఃఖించెను గదా! (15). ఓ మహేశ్వరీ! ఆదేవ కార్యము పూర్తి కానే లేదు. మహర్షులతో కూడిన దేవతలము మేము దుఃఖితులమై నిన్ను శరణు జొచ్చినాము (16). ఓ మహేశ్వరీ! దేవతల కోర్కెను పూర్తి చేయుము. హే శివే! సనత్కుమారుని వచనము సఫలమగునట్లు చేయుము.

అవతీర్య క్షితౌ దేవి రుద్రపత్నీ పునర్భవ ।

లీలాం కురు యథా యోగ్యం ప్రాప్నుయుర్నిర్జరాస్సుఖమ్ ॥

సుఖీ స్యాద్దేవి రుద్రోఽపి కైలాసాచల సంస్థితః ।

సర్వే భవన్తు సుఖినో దుఃఖం నశ్యతు కృత్స్న శః ॥

నీవు మరల భూమి యందు అవతరించి రుద్రుని భార్యవు కమ్ము. ఓ దేవీ! నీవు యథోచితముగా లీలలను ప్రదర్శించుటచే దేవతలు సుఖమును పొందెదరు (18). ఓ దేవీ! కైలాస పర్వతమునందున్న రుద్రుడు కూడ నీ అవతారముచే సుఖి కాగలడు. అందరు సుఖ మును పొందెదరు. దుఃఖము పూర్ణముగా తొలగి పోవును.

బ్రహ్మోవాచ ।

ఇతి ప్రోచ్యా మరాస్సర్వే విష్ణ్వాద్యాః ప్రేమసంకులా; ।

మౌనమాస్థాయ సంతస్థుర్భక్తి నమ్రాత్మమూర్తయః ॥

శివాపి సుప్రసన్నా భూదాకర్ణ్యా మర సంస్తుతిమ్ ।

అకాలయ్యాథ తద్ధేతుం: సంస్కృత్య స్వప్రభుం శివమ్ ॥

ఉవాచోమా తదా దేవీ సంబోధ్య విబుధాంశ్చ తాన్ ।

విహస్య మాపతి ముఖాన్ సదయా భక్త వత్సలా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు మొదలగు దేవతలందరు ఇట్లు పలికి ప్రేమ నిండిన హృదయములు ు కలవార గుటచే ఆ పైన మాటలాడ లేక మౌనముగా నున్న వారై, భక్తితో శిరసు వంచి నమస్కరిస్తూ నిలబడి యుండిరి (20). ఆ దేవతల స్తోత్రమును వినిన ఉమదేవియూ మిక్కిలి ప్రసన్నురాలై, వారి స్తోత్రమునకు గల హేతువును మనస్సులో తెలుసుకొని, తన ప్రభువగు శివుని స్మరించెను (21). అపుడు ఉమాదేవి చిరునవ్వు నవ్వెను. దయామూర్తి, భక్తవత్సల అగు ఆమె విష్ణువు మొదలగు దేవతలనుద్దేశించి ఇట్లు పలికెను.

ఉమోవాచ ।

హే హరే హే విధే దేవా మునయశ్చ గతవ్యథా: ।
సర్వే శృణుత మద్వాక్యం ప్రసన్నాహం న సంశయః ॥
చరితం మమ సర్వత్ర త్రైలోక్యస్య సుఖావహమ్ ।
కృతం మయైవ సకలం దక్షమోహాదికం చ తత్ ॥
అవతారం కరిష్యామి క్షితౌ పూర్ణం న సంశయః ।
బహవో హేతవోఽప్యత్ర తద్వదామి మహాదరాత్ ॥
పురా హిమాచలో దేవా మేనా చాతి సుభక్తిత: ।
సేవా మే చక్రతుస్తాత జననీ వత్సతీతనోః ॥

ఉమ ఇట్లు పలికెను -

హే విష్ణో! బ్రహ్మా! దేవతలారా! మునులారా! మీరు భయమును వీడి అందరు నా మాటను వినుడు. నేను ప్రసన్నురాలనైతిని. సందేహము లేదు (23). నా చరిత్ర ముల్లోకములలో అంతటా ప్రాణులకు సుఖముల నీయగలదు. దక్షుని మోహము ఇత్యాది సర్వమును నేనే కలుగు నట్లు చేసితిని (24). నేను భూమిపై పూర్ణాంశతో అవతరించగలను. సందేహము లేదు. అట్లు అవతరించుటకు అనేక కారణములు గలవు. నేను వాటిని శ్రద్ధతో మీకు వివరించెదను (25). దేవతలారా! సతీ రూపములో నన్ను పుత్రికగా పొందుటకై దక్షుడు, వీరిణీ తపస్సును చేసిరి గదా! అదే తీరున పూర్వము హిమవంతుడు, మరియు మేన మిక్కిలి భక్తితో నన్ను ఆరాధించిరి.

ఇదానీం కురుతస్సేవాం సుభక్త్యా మమ నిత్యశః ।
మేనా విశేషతస్తత్ర సుతాత్వేనాత్ర సంశయః ॥
రుద్ర ఇచ్ఛతు యూయం చావతారం హిమవద్గృహే ।
అతశ్చావతరిష్యామి దుఃఖనాశో భవిష్యతి॥
సర్వే గచ్ఛత ధామ స్వం స్వం సుఖం లభతాం చిరమ్।
అవతీర్య సుతా భూత్వా మేనాయా దాస్య ఉత్సుఖమ్॥
హరపత్నీ భవిష్యామి సుగుప్తం మతమాత్మనః ।
అద్భుతా శివలీలా హి జ్ఞానినామపి మోహినీ ॥

ఇప్పటి నుండియూ మీరు నిత్యము దృఢమగు భక్తితో నన్ను సేవించుడు. మేన కూడా నన్ను విశేషముగా ఆరాధించు గాక! నేనామే కుమార్తెగా జన్మించగలను. ఈ విషయములో సందేహము లేదు (27). రుద్రుడే గాక మీరు కూడా నేను హిమవంతుని గృహములో అవతరించవలెనని కోరుచుండవచ్చును. నేను అటులనే అవతరించ గలను. అపుడు సర్వుల దుఃఖము తొలగి పోగలదు (28). మీరందరు మీమీ స్థానములకు వెళ్ళుడు. మీరు చిరకాలము సుఖములను పొందగలరు. నేను మేనా దేవి యందు కుమార్తెగా జన్మించి, ఆమెకు పరమానందము నీయగలను (29). నేను శివునకు పత్నిని కాగలను. నా యందలి కోరిక రహస్యముగా దాగి యున్నది. శివుని లీల అద్భుతము. ఆ లీల జ్ఞానులనైననూ మోహింపజేయును.

యావత్ప్రభృతి మే త్యక్తా స్వతనుర్దక్షజా సురా: ।
పితృతోఽనాదరం దృష్ట్వా స్వామినస్తత్ర్కతౌ గతా ॥
తదా ప్రభృతి స స్వామీ రుద్రః కాలాగ్ని సంజ్ఞకః ।
దిగంబరో బభూవాశు మచ్చింతాపరాయణః ॥
మమ రోషం క్రతౌ దృష్ట్వా పితుస్తత్ర గతా సతీ ।
అత్య జత్స్వతనుం ప్రీత్యా ధర్మ జ్ఞేతి విచారత: ॥
యోగ్య భూత్సదనం త్యక్త్వా కృత్వా వేషమ లౌకికమ్ ।
న సేహే విరహం సత్యా మద్రూపాయా మహేశ్వరః ॥

నేను నా తండ్రి యగు దక్షుని యజ్ఞమునకు వెళ్లి అచట నా స్వామికి నా తండ్రి చేసిన అనాదరమును చూచి, దక్షుని వలన కలిగిన నా దేహమును త్యజించితిని. ఓ దేవతరారా! ఆనాటి నుండియు (31). కాలాగ్ని యను పేరు గల ఆ రుద్ర స్వామి నా యందలి చింత యందు నిమగ్నుడై దిగంబరుడైనాడు (32). సతి తండ్రి చేయు యజ్ఞమునకు వెళ్లి, అచట నా కు జరిగిన అవమానమును గాంచి కోపమును పొంది ఆమె నిశ్శంకగా దేహమును త్యజించినది. ఆమె ధర్మజ్ఞురాలు. శివుడిట్లు తలపోసి (33). గృహమును వీడి అలౌకిక మగు వేషమును ధరించి యోగి అయినాడు. మహేశ్వరుడు నా అవతారమైన సతీ దేవి యొక్క విరహమును సహించలేక పోయినాడు.

మమ హేతోర్మహాదుఃఖీ స బభూవ కు వేషభృత్ ।
అత్యజత్స తదారభ్య కామజం సుఖముత్తమమ్ ॥
అన్య చ్ఛృ ణుత హే విష్ణో హే విధే మునయస్సురా: ।
మహాప్రభోర్మహేశస్య లీలాం భువనపాలినీమ్ ॥
విధాయ మాలాం సుప్రీత్యా మమాస్థ్నాం విరహాకుల: ।
న శాంతిం ప్రాప కుత్రాపి ప్రబుద్ధోప్యేక ఏవ స: ॥
ఇతస్తతో రురోదోచ్చైరనీశ ఇవ స ప్రభుః ।
యోగ్యాయోగ్యం న బుబుధే భ్రమన్ సర్వత్ర సర్వదా ॥

ఆయన ఆనాటి నుండియు నా వియోగముచే మహా దుఃఖమును పొందిన వాడై, మలిన వేషమును ధరించి, సర్వములైన ఉత్తమసుఖములను పరిత్యజించెను (35). హే విష్ణో! బ్రహ్మా! మునులారా! దేవతలారా! మరియొక మాటను వినుడు. మహా ప్రభుడగు మహేశ్వరుని లోకరక్షకమగు లీలను చెప్పెదను (36). విరహవ్యథతో గూడిన ఆ శివుడు జ్ఞానియే అయినా ఏకాకి యగుటచే ఏ స్థానము నందైననూ శాంతిని పొందలేకున్నాడు. ఆయన నా అస్థికలతో మాలను చేసి దానిని మిక్కిలి ప్రీతితో ధరించు చున్నాడు (37). ఆ ప్రభుడు ప్రాకృతజనుని వలె అన్నిచోట్లా అన్నివేళలా ఇటునటు తిరుగుచూ బిగ్గరగా నేడ్చెను. ఆయన దుఃఖ వశుడై యో గ్యా యోగ్యములను తెలియకుండెను.

ఇత్థం లీలాం హరోఽకార్షీ ద్దర్శయన్ కామినాం ప్రభుః ।
ఊచే కాముక వద్వాణీం విరహవ్యాకులా మివ: ॥
వస్తుతోఽవికృతోఽదీనోఽ స్త్వజిత: పరమేశ్వరః ।
పరిపూర్ణశ్శివస్స్వామీ మాయాధీశోఽఖిలేశ్వర: ॥
అన్యథా మోహతస్తస్య కిం కామాచ్చ ప్రయోజనమ్ ।
వికారేణాపి కేనాశు మయాలిప్తో న స ప్రభు: ॥
రుద్రోఽతీవేచ్ఛతి విభుస్స మే కర్తుం కరగ్రహమ్ ।
అవతారం క్షితౌ మేనా హిమాచల గృహే సురాః ॥

శివుడు ఈ తీరున కాముకుని వలె విరహ దుఃఖముతో నిండిన పలుకులను పలుకుచూ, కాముకుల ప్రవృతిని లోకమునకు ప్రదర్శించువాడై లీలను ప్రకటించెను (39). పరాజయము లేని ఆ పరమేశ్వరుడు యథార్థముగా వికారము గలవాడు, దీనుడు కాదు. శివస్వామి పరిపూర్ణుడు, మాయను వశము చేసుకున్న సర్వేశ్వరుడు (40). ఆయనకు మోహముతో గాని, కామముతో గాని ప్రయోజనమేమున్నది? మాయ యొక్క లేపము లేని ఆ ప్రభువునకు వికారము కలుగుట యెట్లు సంభవము? (41). ఆ రుద్ర ప్రభుడు నన్ను వివాహమాడ వలెనని తీవ్రమగు కోర్కెను కలిగి యున్నాడు. ఓ దేవతలారా! నేను మేనా హిమవంతుల గృహములో భూమిపై అవతరించవలెనని కూడా ఆయన కోరుచున్నాడు.

అతశ్చావతరిష్యామీ రుద్రసంతోషహేతవే ।
హిమాగపత్న్యాం మేనా యాం లౌకికీం గతిమాశ్రితా ॥
భక్త్యా రుద్రప్రియా భూత్వా తపః కృత్వా సుదుస్సహమ్ ।
దేవకార్యం కరిష్యామి సత్యం సత్యం న సంశయః ॥
గచ్ఛత స్వగృహం సర్వే భవం భజత నిత్యశ: ।
తత్కృపాతోఽఖిలం దుఃఖం వినశ్యతి న సంశయ: ॥
భవిష్యతి కృపాలోస్తు కృపయా మంగలం సదా ।
వంద్యా పూజ్యా త్రిలోకేఽహం తజ్జా యేతి చ హేతుత: ॥

ఈ కారణముచే నేను రుద్రునకు సంతోషమును కలిగించుట కొరకై లోకపు పోకడననుసరించి హిమవంతుని భార్యయగ మేన యందు అవతరించెదను (43). నేను భక్తితో ఘోరమగు తపస్సును చేసి రుద్రునకు ప్రియురాలనై దేవతల కార్యమును చేసెదను. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (44). మీరందరు మీ మీ గృహములకు వెళ్లి, నిత్యము శివుని ఆరాధించుడు. ఆయన దయచే దుఖములన్నియూ నశించుననుటలో సందేహము లేదు (45). నేను దయానిధియగు ఆయన దయచే ఆయనకు భార్యనై, ఆ కారణముగా నేను ముల్లోకములలో నమస్కరింపదగిన దానను, పూజింపదగిన దానను కాగలను. ఆయన కృపచే సర్వమంగళములు సంపన్నము కాగలవు.

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా జగదం బా సా దేవానాం పశ్యతాం తదా ।
అంతర్దధే శివా తాత స్వం లోకం ప్రాప వై ద్రుతమ్ ॥
విష్ణ్వా దయ స్సురాస్సర్వే మునయశ్చ ముదాన్వితా: ।
కృత్వా తద్దిశి సన్నామం స్వస్వధామాని సంయయు: ॥
ఇత్థం దుర్గా సుచరితం వర్ణితం తే మునీశ్వర ।
సర్వదా సుఖదం నృణాం భుక్తిముక్తి ప్రదాయకమ్ ॥
య ఇదం శృణు యాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।
పఠేద్వా పాఠయేద్వాఽపి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం తృతీయే
పార్వతీ ఖండే దేవసాంత్వన నామ చతుర్థోఽధ్యాయ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

కుమారా! జగన్మాత ఇట్లు పలికి, దేవతలు చూచుచుండగా అంతర్ధానమై, శీఘ్రముగా తన లోకమును చేరెను (47). విష్ణువు మొదలగు దేవతలు, మరియు మునులు అందరు ఆమె వెళ్లిన దిక్కువైపు నమస్కారము చేసి తమ తమ స్థానములకు వెళ్లిరి (48). ఓ మహర్షీ! దుర్గాదేవి యొక్క పుణ్యచరిత్రను నీకీతీరున వర్ణించి చెప్పితిని. ఇది మానవులకు సర్వదా సుఖ మును, భక్తిని, ముక్తిని ఈయగలదు(49). ఎవడైతే దీనిని నిత్యము వినునో, స్థిరచిత్తముతో వినిపించునో, లేదా పఠించునో, లేక పఠింపజేయునో, అట్టివాడు సర్వకామనలను పొందును.

శ్రీ శివ మహాపురాణములో రెండవది యగు రుద్ర సంహిత యందు మూడవది యగు పార్వతీ ఖండములో దేవతల నోదార్చుట అనే నాల్గవ అధ్యాయము ముగిసినది.

5 – మేనాదేవి వరములను పొందుట

నారద ఉవాచః

అంతర్హితాయాం దేవ్యాం తు దుర్గాయాం స్వగృహేషు చ ।
గతేష్వమరబృందేషు కిమభూత్తదనంతరమ్ ॥
కథం మేనాగిరీశౌ చ తేపాతే పరమం తపః ।
కథం సుతాభవత్తస్య మేనాయాం తాత తద్వద ॥

నారదుడిట్లు పలికెను -

దుర్గాదేవి అంతర్ధానమై, దేవగణములు తమ గృహములకు వెళ్లిన తరువాత ఏమయ్యె◌ెను? (1) మేనా హిమవంతులు తీవ్రమగు తపస్సును చేసిన తీరు ఎట్టిది? తండ్రీ! ఆయనకు మేన యందు కుమార్తె ఎట్లు జన్మించెను? ఆ వృత్తాంతమును చెప్పుము. **బ్రహ్మోవాచ ।**

విప్రవర్య సురశ్రేష్ఠ శృణు తచ్చరితం మహత్ ।
ప్రణమ్య శంకరం భక్త్యా వచ్మి భక్తి వివర్ధనమ్ ॥
ఉపదిశ్య గతే తాత సుర బృందే గిరీశ్వరః ।
హర్యాదౌ మేనకా చాపి తేపాతే పరమం తపః ॥
అహర్నిశం శివాం శంభుం చింతయంతౌ చ దంపతీ ।
సమ్యగారేధతుర్నిత్యం భక్తి యుక్తేన చేతసా ॥
గిరి ప్రియాతీవ ముదానర్చ దేవీం శివేన సా ।
దానం దదౌ ద్విజే భ్యశ్చ సదా తత్తోషహేతవే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ బ్రాహ్మణ పుంగవా! దేవశ్రేష్ఠా! ఆ గొప్ప చరితమును వినుము. భక్తిని పెం◌ెంపొందించే ఆ చరితమును శంకరునకు భక్తితో నమస్కరించి చెప్పెదను (3). కుమారా! విష్ణువు మొదలగు దేవతల గణము ఉపదేశించి వెళ్లిన తరువాత ఆ పర్వతరాజు, మేనతో కలిసి గొప్ప తపస్సును చేసెను (4). ఆ దంపతులు రాత్రింబగళ్ళు ఉమాశంకరులను స్మరిస్తూ, భక్తితో నిండిన మనస్సుతో ప్రతిదినము చక్కగా ఆరాధించిరి (5). హిమవంతుని ప్రియురాలగు ఆ మేన ప్రీతితో దేవిని పూజించెను. శివుని కూడా మిక్కిలి ప్రీతితో పూజించెను. మరియు శివా శివుల సంతోషము కొరకై ఆమె నిత్యము బ్రాహ్మణులకు దానములను చేసెను.

చైత్రమాసం సమారభ్య సప్తవింశతి వత్సరాన్ ।
శివాం సంపూజయామాసాపత్యార్థి న్యస్పృహం రతా ॥
అష్ట మ్యాముపవాసం తు కృత్వాదాన్నవమీ తిథౌ ।
మోదకైర్బలిపిష్టైశ్చ పాయసై ర్గంధపుష్పకైః ॥
గంగాయామోషధిప్రస్థే కృత్వా మూర్తిం మహీమయీమ్ ।
ఉమాయాః పూజయామాస నానావస్తు సమర్పణైః ॥

కదాచిత్సా నిరాహారా కదాచిత్సా ధృతవ్రతా : ।

కదాచిత్పవనాహారా కదాచిజ్జలభుగ్ హ్యభూత్ ॥

సంతానమును గోరు ఆ మేన చైత్ర మాసము నందారంభించి ఇరవై ఏడు సంవత్సరములు ప్ర(?)తి దినము శ్రద్ధతో ఉమాదేవిని ఆరాధించెను (7). ఆమె అష్టమినాడు ఉపవాసమును చేసి, మరునాడు నవమి యందు దానములను చేసెను. ఆమె ఓషధి ప్రస్థన గరములో గంగా తీరము నందు మట్టితో ఉమయొక్క మూర్తిని చేసి, మోదకములు, అన్న పిండములు, పాయసము, గంధము, పుష్పములు ఇత్యాది అనేక పూజాద్రవ్యములను సమర్పించి ఆరాధించెను (8,9). ఆమె ఒకప్పుడు ఆహారమును తీసుకోకుండా, మరియొకప్పుడు వ్రతమును పాలించునదై, మరియొకప్పుడు గాలిని భుజించి, ఒకప్పుడు జలమును మాత్రమే త్రాగి ఆరాధించెను.

శివా విన్యస్త చేతస్కా సప్తవింశతివత్సరాన్ ।

నినాయ మేనకా ప్రీత్యా పరం సా మృష్ట వర్చసా ॥

సప్తవింశతి వర్షాంతే జగన్మాతా జగన్మయీ ।

సుప్రీతా భవదత్యర్థ ముమా శంకరకామినీ ॥

అనుగ్రహాయ మేనాయా: పురత : పరమేశ్వరీ ।

అవిర్భ భూవ సా దేవీ సంతుష్టా తత్సుభక్తితః ॥

దివ్యావయవ సంయుక్తా తేజో మండల మధ్యగా ।

ఉవాచ విహసన్తీ సా మేనాం ప్రత్యక్షతాం గతా ॥

గొప్ప తేజశ్శాలిని యగు ఆ మేన ఉమపై మనస్సును లగ్నము చేసి, ఇరవై ఏడు సంవత్సరములు ప్రీతితో గడిపెను (11). జగత్స్వ రూపిణి, జగన్మాత, శంకరపత్ని యగు ఉమ ఇరవై ఏడు సంవత్సరముల తరువాత మిక్కిలి ప్రీతురాలాయెను (12). పరమేశ్వరి యగు ఆ దేవి ఆమె గొప్ప భక్తికి మిక్కిలి సంతసించి ఆమెను అను గ్రహించుట కొరకై ఆ మేనా దేవి యెదుట సాక్షాత్కరించెను (13). ప్రకాశించే అవయవములతో గూడి తేజో మండల మధ్యములో నున్న ఆ దేవి మేన యెదుట ప్రత్యక్షమై చిరునవ్వుతో నిట్లనెను.

దేవ్యువాచ ।

వరం బ్రూహి మహాసాధ్వి యత్తే మనసి వర్తతే ।

సుప్రసన్నా చ తపసా తవాహం గిరి కామిని ॥

యత్ప్రార్థితం త్వయా మేనే తపోవ్రత సమాధినా ।

దాస్యే తేఽహం తత్సర్వం వాంఛితం యద్యదా భవేత్ ॥

తతస్సా మేనకా దేవీం ప్రత్యక్షాం కాలికాం తదా ।

దృష్ట్వా చ ప్రణనామాథ వచనం చేదమబ్రవీత్ ॥

దేవి ఇట్లు పలికెను –

ఓ మహాసాధ్వీ! నీ మనసులోని కోర్కెను వెల్లడించుము. ఓ హిమవత్పత్నీ! నీ తపస్సుచే నేను చాల ప్రసన్నురాలనైతిని (15). ఓ మేనా! నీవు దేనిని గోరి తపస్సును, వ్రతములను, సమాధిని అనుష్ఠించితివో ఆ సర్వమును నేను నీకు ఈయగలను (16). అపుడా మేనక తన ఎదుట ప్రత్యక్షమైన కాళీదేవిని చూచి, నమస్కరించి, అప్పుడిట్లనెను.

మేనో వాచ ।

దేవి ప్రత్యక్షతో రూపం దృష్టం తవ మయాధునా ।

త్వామహం స్తోతుమిచ్ఛామి ప్రసన్నా భవ కాలికే ॥

మేన ఇట్లు పలికెను -

ఓ దేవీ! నేనీనాడు నీ రూపమును ప్రత్యక్షముగా చూచితిని. నిన్ను నేను స్తుతింపగోరుచున్నాను. ఓ కాళీ! ప్రసన్నురాలవు కమ్ము.

బ్రహ్మోవాచ ।

అథ సా మేనయేత్యుక్తా కాలికా సర్వమోహినీ ।

బాహుభ్యాం సుప్రసన్నాత్మా మేనకాం పరిషస్వజే ॥

తతః ప్రాప్త మహాజ్ఞానా మేనకా కాలికాం శివామ్ ।

తుష్టావ వాగ్భిరిష్టాభిర్భక్త్యా ప్రత్యక్షతాం గతామ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు మేన ఇట్లు పలుకగా, సర్వులను మోహింపజేయు ఆ కాళీ దేవి మిక్కిలి ప్రసన్నమగు మనస్సు, గలదై బాహువులతో ఆమెను కౌగిలించుకొనెను (19). అపుడు మేనకకు గొప్ప జ్ఞానము కలిగెను. ఆమె తన ఎదుట నున్న కాళికను, శివుని భక్తితో ప్రీతికరములగు వాక్కులతో స్తుతించెను.

మేనో వాచ ।

మహామాయాం జగద్ధాత్రీం చండికాం లోకధారిణీమ్ ।

ప్రణమామి మహాదేవీం సర్వకామార్థ దాయినీమ్ ॥

నిత్యానందకరీం మాయాం యోగనిద్రాం జగత్ప్రసూమ్ ।

ప్రణమామి సదాసిద్ధాం శుభసారసమాలినీమ్ ॥

మాతామహీం సదానందాం భక్త శోకవినాశినీమ్ ।

ఆకల్పం వని తానాం చ ప్రాణినాం బుద్ధి రూపిణీమ్ ॥

సా త్వం బంధ ఛ్ఛేదహేతుర్యతీనాం కస్తే గే యో మా దృశీభి: ప్రభావః ।

హింం సాయా వా థర్వ వేదస్య సా త్వం నిత్యం కామం త్వం మమేష్టం విధేహి ॥

మేన ఇట్లు పలికెను -

మహామాయ, జగత్తును పోషించు తల్లి, లోకములను తన సత్తచే ధరించునది, మహాదేవి, కోర్కెలనన్నిటినీ ఈడేర్చునది అగు చండికను నమస్కరించు చున్నాను (21). శాశ్వతా నందమును ఇచ్చునది, యోగ నిద్రా స్వరూపిణి, జగత్తులను కన్నతల్లి, నిత్య . సిద్ధురాలు, శుభకరములగు పుష్పముల మాలను ధరించునది అగు మహామాయకు నమస్కరించుచున్నాను (22). తల్లులకు తల్లి, నిత్యానందరూపిణి, భక్తుల శోకముల నశిం పజేయునది, కల్పక్షయము వరకు స్త్రీల మరియు ప్రాణుల బుద్ధి రూపములో ప్రకటమగునది అగు దేవికి నమస్కరించుచున్నాను (23). యతీశ్వరుల సంసార బంధమును ఛేదించు జ్ఞానము నీవే. నావంటి వారలు నీ ప్రభావము నెట్లు గానము చేయగలరు? అథర్వవేదము లోని హింసా ప్రయోగము నీ స్వరూపమే. నీవు నిత్యము నాకు అభీష్టములగు కోర్కెల నీడేర్చుము.

నిత్యానిత్యై ర్యావహీనై: పరాస్తై తత్తన్మాత్రై ర్యోజ్యతే భూతవర్గ: ।

తేషాం శక్తి స్త్వం సదా నిత్యరూపా కాలే యోషా యోగయుక్తా సమర్థా ॥

యోనిర్ధరిత్రీ జగతాం త్వమేవ త్వమేవ నిత్యా ప్రకృతి: పరస్తాత్ ।

యయా వశం క్రయతే బ్రహ్మరూపం సా త్వం నిత్యా మే ప్రసీదాద్య మాత: ॥

త్వం జాతవేదే గతశక్తి రుగ్రా త్వం దాహికా సూర్య కరస్య శక్తిః ।

ఆహ్లాదికా త్వం బహు చంద్రి కా యా తాం త్వామహం స్తౌమి నమామి చండీమ్ ॥

ఆకారము లేనివి, కంటికి కనబడనివి, నిత్యానిత్యములు ఆగు భూతసూక్ష్మముల నుం౦ండి ఈ పాంచభౌతిక జగత్తు కూర్చబడుచున్నది. నిత్యరూపిణి వగు నీవే వాటియొక్క ని త్యశక్తివై ఉన్నావు. నీవు త్రిగుణ సంయోగముతో గూడి ఆయా కాలముల యందు సర్వసమర్థమగు స్త్రీ రూపములో అవతరించెదవు (25). జగత్తులు నీ నుండి యే పుట్టినవి. జగత్తు లను పోషించు తల్లివి నీవే. నీవు సనాతనురాలవు. నీవు ప్రకృతికంటె ఉత్కృష్టురాలవు. పరబ్రహ్మ స్వరూపము నీ అను గ్రహము చేతనే తెలియబడుచున్నది. ఓ తల్లీ! అట్టి శాశ్వతురాలవగు నీవు నా యందీనాడు ప్రసన్నురాలవు కమ్ము (26). అగ్ని యందలి తీక్ష్ణమగు ఉష్ణశక్తి నీవే. సూర్య కిరణముల యందలి తపింపచేయు శక్తి నీవే. సర్వత్ర వ్యాపించి ఆహ్లాదింప జేయు వెన్నెల నీవే. ఓ చండీ! అట్టి నిన్ను నేను నమస్కరించి స్తుతించుచున్నాను.

యోషాణం సత్ప్రియా చ త్వం నిత్యా త్వం చోర్ధ్వ రేతసామ్ ।

వాంఛా త్వం సర్వజగతాం మాయా చ త్వం యథా హరేః ॥

యా చేష్ట రూపాణి విధాయ దేవీ సృష్టి స్థితానాశమయీ చ కర్త్రి ।

బ్రహ్మా చ్యుత స్థాణు శరీర హేతుః సా త్వం ప్రసీదాద్య పునర్నమస్తే ॥

స్త్రీలు నిన్ను అధిక ప్రీతితో ఆరాధించెదరు. ఊర్ధ్వ రేతస్కులగు యోగుల నిత్యశక్తి౦వి నీవే. సర్వప్రాణులలోని ఇచ్ఛాశక్తి నీవే. విష్ణువు యొక్క మాయ కూడా నీవే (28). ఓ దేవీ! నీవు స్వేచ్ఛచే వివిధ రూపములను ధరించి జగత్తు యొక్క సృష్టి స్థితిలయములను చేయు చున్నావు. బ్రహ్మ విష్ణు రుద్రుల శరీరములకు హేతువు నీవే. నీకు అనేక నమస్కారములు.నీవీ నాడు నన్ను అను గ్రహించుము.

బ్రహ్మోవాచ ।

తత ఇత్థం స్తుతా దుర్గా కాలికా పునరేవ హి ।
ఉవాచ మేనకాం దేవీం వాంఛితం వరయేత్యుత ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దు:ఖముల నుండి తరింపజేయు ఆ కాలికా దేవి ఇట్లు స్తుతింపబడినదై మేనకా దేవితో " వరమును కోరుకొనుము " అని పలికెను.

ఉమోవాచ ।

ప్రాణప్రియా మమ త్వం హి హిమా చల విలాసినీ ।
యదిచ్ఛసి ధ్రువం దాస్యే నాదేయం విద్యతే మమ ॥
ఇతి శ్రుత్వా మహేశాన్యాః పీయూష సదృశం వచః ।
ఉవాచ పరితుష్టా సా మేనకా గిరికామినీ ॥

ఉమాదేవి ఇట్లు పలికెను -

హిమవంతుని ప్రియురాలవగు నీవు నాకు ప్రాణ ప్రియురాలవు. నీవు దేనిని కోరినా౹ా నేను నిశ్చితముగా నీయగలను. నేను ఈయలేనిది ఏదీ లేదు (31). మహేశ్వరి యొక్క అమృత సమమగు ఈ మాటలను విని, హిమవంతుని ప్రియురాలగు ఆ మేన మిక్కిలి సంతసించి ఇట్లు పలికెను.

మేనోవాచ ।

శివే జయ జయ ప్రాజ్ఞే మహేశ్వరి భవాంబికే ।
వరయోగ్యాస్మ్యహం చేత్తే వృణే భూయో వరం వరమ్ ॥
ప్రథమం శతపుత్రా మే భవంతు జగదంబికే ।
బహ్వాయుషో వీరవంత బుద్ధి సిద్ధి సమన్వితాః ॥
పశ్చాత్తథైకా తనయా స్వరూపగుణశాలినీ ।
కుల ద్వయానందకరీ భువనత్రయ పూజితా ॥
సుతా భవ మమ శివే దేవ కార్యార్థమేవ హి ।
రుద్ర పత్నీ భవ తథా లీలాం కురు భవాంబికే ॥

మేన ఇట్లు పలికెను -

హే శివే! నీకు జయమగు గాక! హే ప్రాజ్ఞే! హే మహేశ్వరీ! హే అంబికే! నేను నీచే ఈయబడే వరములకు యోగ్యురాలనైనచో, నేను ఒక శ్రేష్ఠమగు వరమును కోరెదను (33). ఓ జగన్మాతా! ముందుగా నాకు వందమంది పుత్రులు కలిగెదరు గాక! వారు దీర్ఘాయువులు, బలవంతులు సంపన్నులు, జ్ఞానము గలవారు అగుదురు గాక! (34). ఆ తరువాత సుందర రూపముతో, గుణములతో ఒప్పారునది, పుట్టిన ఇంటికి మెట్టిన ఇంటికి ఆనందమును కలిగించునది, ముల్లోకముల యందు పూజింపబడునది అగు కుమార్తెను నేను కోరుచున్నాను (35). హే శివే! దేవ కార్యము కొరకై నీవు నా కుమార్తె వై జన్మించి, రుద్రుని భార్యవు

కమ్ము. ఓ అంబికా! నీ లీలలను ప్రదర్శించుము.

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా మేనకోక్తం హి ప్రాహ దేవీ ప్రసన్నధీ: ।
స్మితపూర్వం వచస్తస్యా: పూరయంతీ మనోరథమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మేనక చెప్పిన ఆ మాటను విని ప్రసన్నమగు మనస్సు గల ఆ దేవి ఆమె యొక్క మనోరథమును పూర్ణము చేయు చున్నదై, చిరునవ్వుతో నిట్లనెను.

దేవ్యు వాచ ।

శతపుత్రాస్సంభవంతు భవత్యా వీర్య సంయుతా: ।
తత్రైకో బలవాన్ముఖ్య: ప్రథమం సంభవిష్యతి ॥
సుతాహం సంభవిష్యామి సంతుష్టా తవ భక్తితః ।
దేవ కార్యం కరిష్యామి సేవితా నిఖిలైస్సురైః ॥

దేవి ఇట్లు పలికెను -

నీకు బలశాలురగు వందమంది కుమారులు జన్మించ గలరు. వారిలో అతిశయించిన బలము గలవాడు, ప్రధానుడు అగు పుత్రుడు ఒకడు ముందుగా జన్మించగలడు (38). నీ భక్తికి నేను సంతసించితిని. నేను నీకు కుమార్తెనై జన్మించి, దేవతలందరిచే ఆరాధింపబడు దాననై దేవకార్యమును నిర్వర్తించెదను.

బ్రహ్మోవాచ ।

ఏవముక్త్వా జగద్ధాత్రీ కాలికా పరమేశ్వరీ ।
పశ్యంత్యా మేనకాయాస్తు తత్రై వాంతర్దధే శివా ॥
మేనకాపి వరం లబ్ధ్వా మహేశాన్యా అభీప్సితమ్ ।
ముదం ప్రాప్రామితాం తాత తప: క్లేశోప్యనశ్యత ॥
దిశి తస్యాం నమస్కృత్య సుప్రహృష్టమనాస్సతీ ।
జయశబ్దం ప్రోచ్చరన్తీ స్వస్థానం ప్రవివేశ హ ॥
అథ తస్మై స్వపతయే శశంస సువరం చ తమ్ ।
స్వచిహ్నా బుద్ధమివ వై సువాచా పునరుక్తయా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

జగన్మాత, శివపత్నియగు ఆ కాలిక పరమేశ్వరి ఇట్లు పలికి మేనక చూచుచుండగనే అచటనే అంతర్ధానమాయెను (40). ఓ కుమారా! మేనకయు మహేశ్వరి నుండి అభీష్టమగు వరమును పొంది సాటిలేని ఆనందమును పొందెను. తపస్సు చేసినందు వలన కలిగిన శ్రమ అంతయూ మటుమాయమయ్యెను (41). ఆమె పరమేశ్వరి అదృశ్యమైన దిక్కునకు నమస్కరించి మిక్కిలి ఆనందించిన మనస్సు గలదై, జయశబ్దము నుచ్చరించుచూ తన

గృహమును ప్రవేశించెను (42). అపుడామె తాను పొందిన గొప్ప వరమును గూర్చి భర్తతో చెప్పెను. ఆమె ముఖ లక్షణములను బట్టియే భర్తకు సంగతి తెలియుచుండెను. అయిననూ ఆమె ఆ వృత్తాంతమును భర్తకు పదే పదే చెప్పెను.

శ్రుత్వాశైల పతిర్హృష్టోఽభవన్మేనావచో హి తత్ ।

ప్రశశంస ప్రియాం ప్రీత్యా శివాభక్తిరతాం చ తామ్ ॥

కాలక్రమేణాథ తయోః ప్రవృత్తే సురతే మునే ।

గర్భో బభూవ మేనాయా వవృధే ప్రత్యహం చ సః ॥

అసూత సా నాగవధూపభోగ్యం సుతముత్తమమ్ ।

సముద్ర బద్ధ సత్స ఖ్యం మైనాకాఖ్యమద్భుతమ్ ॥

వృత్ర శత్రావపి క్రుద్ధే వైదనాశం సపక్షకమ్ ।

పవిక్షతానాం దేవర్షే పక్షచ్ఛిది వరాంగకమ్ ॥

శైలరాజగు హిమవంతుడా మేనా దేవి యొక్క ఒక వచనమును విని మిక్కిలి సంతసించి, ఉమాదేవి యందు స్థిరముగు భక్తిగల ఆ ప్రియురాలిని ప్రీతితో ప్రశంసించెను (44). ఓ మహర్షీ! వారిద్దరు కలిసి కాపురము చేయుచుండగా కొంత కాలమునకు మేన గర్భవతి ఆయెను. ఆమె గర్భము దినదిన ప్రవర్ధమానమాయెను (45). భవిష్యత్తులో సముద్రునితో గాఢమగు మైత్రిని నెరపి, నాగకన్యలతో భోగింపబోవు, మైనాకుడనే పేరుగల అద్భుతమగు పుత్రరత్నమును ఆమె కనెను (46). పర్వతములకు రెక్కలుండుటచే ప్రాణినాశము జరిగెడిది. దానిపై కోపించిన ఇంద్రుడు వజ్రముతో పర్వతముల రెక్కలను దునుమాడెను. ఓ దేవర్షీ! కాని ఈ మైనాకుని రెక్కలను మాత్రము ద్రుంచలేదు. మైనాకుడు శ్రేష్ఠమగు అంగములతో విరాజిల్లెను.

ప్రవరం శతపుత్రాణాం మహాబల పరాక్రమమ్ ।

స్వోద్భవానాం మహీధ్రాణాం పర్వతేంద్రైకధిష్ఠితమ్ ॥

ఆసీన్మ హోత్సవస్తత్ర హిమాచలపురేఽద్భుతః ।

దంపత్యోః ప్రముదాధిక్యం బభూవ క్లేశ సంక్షయః ॥

దానం దదౌ ద్విజాతిభ్యోఽన్యేభ్యశ్చ ప్రదదౌ ధనమ్ ।

శివాశివపదద్వంద్వే స్నేహోఽభూదధికస్తయోః ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

మేనావరలాభవర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥

హిమవంతుని వందమంది పుత్రులలో మైనాకుడు శ్రేష్ఠుడు, గొప్ప బల పరాక్రమములు గలవాడు. హిమవంతుని కుమారులగు పర్వతములన్నింటిలో ఇతనికి మాత్రమే పర్వతరాజు అను స్థానము తగియున్నది (48). ఆ హిమవంతుని రాజధానిలో అద్భుతమగు మహోత్సవము ప్రవర్తిల్లెను. ఆ దంపతులిద్దరికీ కష్టములు తొలగి అతిశయించిన ఆనందము కలిగెను (49). వారు బ్రాహ్మణులకు దానములిచ్చిరి. ఇతరులకు కూడా ధనమును పంచియిచ్చిరి. వారిద్దరికీ ఉమా పరమేశ్వరుల పాదపద్మముల యందు అధికమగు ప్రీతి కలిగెను.

6 – పార్వతి పుట్టుట

బ్రహ్మోవాచ ।

అథ సంస్మరతుర్భక్త్యా దంపతీ తౌ భవాంబికామ్ ।
ప్రసూతి హేతవే తత్ర దేవకార్యార్థ మాదరాత్ ॥
తతస్సా చండికా యోగాత్త్యక్తదేహా పురా పితుః ।
ఈహయా భవితుం భూయస్సమైచ్ఛద్గిరిదారతః ॥
సత్యం విధాతుం స్వవచః ప్రసన్నాఖిలకామదా ।
పూర్ణాంశాచ్ఛైలచిత్తే సా వివేశాథ మహేశ్వరీ ॥
విరరాజ తతస్సోతి ప్రముదోఽపూర్వసుద్యుతి: ।
హుతాశన ఇవాధృష్యస్తే జోరాశిర్మహామనా: ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అపుడా దంపతులు దేవ కార్యమునందు శ్రద్ధ గలవారై జగన్మాతను కుమార్తెగా పొందగోరి ఆమెను భక్తితో నిత్యము స్మరించుచుండిరి (1). పూర్వము తండ్రివలన అవమానమును పొంది యోగాగ్నిచే శరీరమును త్యజించిన ఆ చండిక అపుడు మరల హిమవంతుని భార్యయొక్క గర్భమునందు జన్మించుటకు సంకల్పించెను (2). ప్రసన్నురాలై కోర్కెలనన్నిటినీ ఈడేర్చు ఆ తల్లి తాను ఇచ్చిన మాటను సత్యము చేయదలచెను. అపుడా మహేశ్వరి పూర్ణాంశముతో హిమవంతుని మనస్సులో ప్రవేశించెను (3). విశాల హృదయుడు అగు ఆ హిమవంతుడు అపుడు మిక్కిలి ఆనందము గలవాడై, అపూర్వ కాంతులతో విరాజిల్లెను. ఆయన అగ్నిహోత్రము వలె తేరిపార చూడరాని తేజస్సుతో విరాజిల్లెను.

తతో గిరిస్స్వప్రియాయాం పరిపూర్ణం శివాంశకమ్ ।
సమాధిమత్త్వాత్సమయే సమధత్త సుశంకరే ॥
సమ ధత్త గిరేః పత్నీ గర్భం దేవ్యా: ప్రసాదతః ।
చిత్తే స్థితాయాః కరుణాకరాయాస్సుఖదం గిరే: ॥

అపుడు హిమవంతుడు మంగళకరమగు సమయములో శివాదేవి యొక్క పూర్ణాశమును పరిశుద్ధమగు చిత్తముతో తన ప్రియురాలియందు ఆధానము చేసెను (5). మేన తన మనస్సునందుండి కరుణను వర్షించే పరమేశ్వరి అనుగ్రహము వలన గర్భమును దాల్చెను. హిమవంతుని పత్ని గర్భవతి కాగా ఆ పర్వత రాజు మిక్కిలి సుఖమును పొందెను.

గిరిప్రియా సర్వజగన్నివాసా సంశ్రయాధికమ్ ।
విరేజే సుతరాం మేనా తేజోమండలగా సదా ॥

సుఖోదయం స్వభర్తుశ్చ మేనా దౌహృదలక్షణమ్ ।
దధౌ నిదానం దేవానా మానందస్యేప్సితం శుభమ్ ॥

దేహ సాదా దసంపూర్ణ భూషణా లో ధ్రసంముఖా ।
స్వల్ప భేందుక్షయే కాలం విచేష్యర్ క్షా విభావరీ ॥

తదాననం మృత్సురభి నాయం తృప్తిం గిరీశ్వరః ।
మునే రహస్యుపాఘ్రాయ ప్రేమాధిక్యం బభూ వ తత్ ॥

హిమవంతుని ప్రియురాలగు మేన, సర్వ బ్రహ్మాండములకు నివాస స్థానమగు జగన్మాతను తన గర్భములో ధరించుటచే, సర్వదా తేజోరాశిచే వ్యాప్తయై అతిశయించిన ప్రకాశముతో ఒప్పారెను (7). మేన యొక్క గర్భిణీ లక్షణములు ఆమె భర్తకు ఆనందమును కలిగించెను. మరియు దేవతల శుభకరమగు కోరిక ఈడేరుటచే, వారికి ఆమె గర్భము ఆనందహేతువు ఆయెను (8). శరీరములో శక్తి తక్కువగా నుండుటచే తక్కువ ఆభరణములను ధరించి, లోధ్ర పుష్పమువలె పాండు వర్ణము గల ముఖముతో ప్రకాశించే ఆమె చంద్రుడు అస్తమించిన తరువాత కనబడీ కనబడని నక్షత్రములు గల రాత్రివలె భాసిల్లెను (9). ఓ మహర్షీ! పర్వతరాజగు హిమవంతుడు ఏకాంతమునందు మృద్గంధముతో గూడియున్న ముఖమును ముద్దాడి అతిశయించిన ప్రేమను ప్రదర్శించెను. అయిననూ, ఆయనకు తృప్తి కలుగలేదు.

మేనా స్పృహావతీ కేషు న మే శంసతి వస్తుషు ।
కించిదిష్టం హ్రియాపృచ్ఛదనువేలం సఖీర్గిరిః ॥

ఉపేత్య దౌహృదం శల్యం యద్వవ్రేఽపశ్యదాశు తత్ ।
ఆనీతం నేష్టమస్యాద్ధా నాసాధ్యం త్రిదివేఽపి హి ॥

ప్రచీయమానావయవా నిస్తీర్య దోహదవ్యథామ్ ।
రేజే మేనా బాలలతా నద్ధ పత్రాధికా యథా ॥

గిరిస్వగర్భాం మహిషీమమంస్త పృథివీమివ ।
నిధాన గర్భామభ్యంతర్లీనవహ్నిం శమీమివ ॥

మేన ఏయే వస్తువులను కోరుచున్నది? ఆమె సిగ్గు వలన నాకు చెప్పకున్నది. ఆమె అభీష్టమేమి? అని హిమవంతుడు ఆమె చెలికత్తెలను పదే పదే ప్రశ్నించెను (11). గర్భసంబంధి క్లేశమును పొందిన మేన దేనిని చూచినా, లేక కోరినా దానిని హిమవంతుడు వెనువెంటనే రప్పించి ఆమెకు ఇచ్చెడివాడు. ఆమెకు ఇష్టమై ముల్లోకములలో ఆయన సంపాదింప శక్యము కాని వస్తువు లేనే లేదు (12). వృద్ధి పొందిన అవయవములు గల ఆ మేన గర్భక్లేశమును అతిక్రమించి, అనేక పత్రములతో నిండుగా నున్న లేత తీగవలె ప్రకాశించెను (13). హిమవంతుడు గర్భవతియగు తన భార్యను, నిధులనన్నిటినీ తనలో దాచుకున్న పృథివిని వలె, అగ్నిని తన గర్భములో దాచుకున్న శమీ వృక్షమును వలే, భావన చేసెను.

ప్రియా ప్రీతేశ్చ మనసః స్వార్జితద్రవిణస్య చ ।
సమున్నతేశ్చ్రుతేః ప్రాజ్ఞః క్రియాశ్చక్రే యథోచితాః ॥
దదర్శ కాలే మేనాం స ప్రతీత: ప్రసవోన్ముఖీమ్ ।
అభ్రితాం చ దివం గర్భగృహే భిషగధిష్ఠితే ॥
దృష్ట్వా ప్రియాం శుభాంగీం వై ముమోదాతి గిరీశ్వరః ।
గర్భస్థ జగదంబాం హి మహాతేజోవతీం తదా ॥
తస్మిన్నవసరే దేవా మునే విష్ణ్వాదయస్తథా ।
మునయశ్చ సమాగమ్య గర్భస్థాం తుష్టువుశ్శివామ్ ॥

వివేకి యగు హిమవంతుడు ప్రియురాలి మనస్సును సంతోషపెట్టుటకు, తాను సంపాదించిన ధనమును సద్వినియోగము చేయుటకు, వేదధర్మము యొక్క ఉన్నతి కొరకు వైదిక సంస్కారములనన్నిటినీ యథావిధిగా జరిపించెను (15). కొంత కాలము తరువాత హిమవంతుడు, వైద్యులచే రక్షింపబడుతూ పురిటి గృహములో నున్న మేనను చూచెను. ఆమె ప్రసవించుటకు సిద్ధముగా నుండి, మేఘములతో నిండి వర్షించుటకు సిద్ధముగా నున్న అంతరిక్షమువలె, ప్రకాశించెను (16). తన గర్భము నందు జగన్మాతను ధరించి మహా తేజస్సుతో నొప్పారు, శుభకరములగు అవయవములు గల ప్రియురాలిని చూచి, ఆ సమయములో హిమవంతుడు మిక్కిలి ఆనందించెను (17). ఓ మహర్షీ! ఆ సమయములో విష్ణువు మొదలగు దేవతలు, మరియు మునులు అచటకు వచ్చి గర్భమునందున్న ఉమా దేవిని స్తుతించిరి.

దేవా ఊచుః ।

దుర్గే జయ జయ ప్రాజ్ఞే జగదంబ మహేశ్వరి ।
సత్యవ్రతే సత్యపరే త్రిసత్యే సత్యరూపిణి ॥
సత్యస్థే సత్యసుప్రీతే సత్యయోనే చ సత్యతః ।
సత్య సత్యే సత్యనేత్రే ప్రపన్నాశ్శరణం చ తే ॥
శివ ప్రియే మహేశాని దేవదుఃఖ క్షయంకరి ।
త్రైలోక్యమాతా శర్వాణీ వ్యాపినీ భక్తవత్సలా ॥
ఆవిర్భూయ త్రిలోకేశి దేవకార్యం కురుష్వ హ ।
సనాథాః కృపయా తే హి వయం సర్వే మహేశ్వరీ ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ దుర్గా! నీకు జయము జయము. ఓ మహేశ్వరీ! నీవు జ్ఞానఘనవు, జగన్మాతవు. సత్య◌్యము నందు నీవు దృఢముగా ప్రతిష్ఠితవై సద్రూపవై ఉన్నావు. సత్యమే నీ స్వరూపము గనుక, నీవు త్రికాలములయందు సత్స్వరూపిణివి (19). నీవు సత్యమునందుండి సత్యము నుండి అవతరించి సత్యముచే సుప్రీతురాలగుదువు. వ్యావహారిక సత్యమగు జగత్తునకు అధిష్ఠాన సత్యము నీవే. నీది సత్యదర్శనము. నిన్ను మేము శరణు పొందుచున్నాము (20). హే శివప్రియే! మహేశ్వరీ! నీవు దేవతల దుఃఖమును హరించెదవు. ముల్లోకములకు తల్లివి, శర్వుని పత్నివి అగు

నీవు సర్వమును వ్యాపించియున్నావు. నీకు భక్తులయందు ప్రేమ మెండు (21). ఓ త్రిలోకములకు అధీశ్వరీ యగు మహేశ్వరీ! నీవు అవతరించి దేవ కార్యమును చేయుము. నీ దయచే మేము అందరము నాథవంతులమైతిమి.

త్వత్తస్సర్వే చ సుఖినో లభన్తే సుఖముత్తమమ్ ।

త్వాం వినా న హి కించిద్వై శోభతే త్రిభవేష్వపి ॥

ఉత్తమ సుఖములను పొందు వారందరూ ఆ సుఖములను నీనుండియే పొందుచున్నారు. ముల్లోకములలో నీవు లేనిదే ఏదియూ శోభించ జాలదు.

బ్రహ్మో వాచ ।

ఇత్థం కృత్వా మహేశాన్యా గర్భ స్థాయా బహుస్తుతిమ్ ।

ప్రసన్నమనసో దేవాస్స్వం స్వం ధామ యయుస్తదా ॥

వ్యతీతే నవమే మాసి దశమే మాసి పూర్ణతః ।

గర్భ స్థాయా గతిం దధ్రే కాలికా జగదంబికా ॥

తదా సుసమయశ్చాసీచ్ఛాంత భగ్రహతారకః ।

నభ: ప్రసన్నతాం యాతం ప్రకాశస్సర్వదిక్షు హి ॥

మహీ మంగల భూయిష్ఠా సవన గ్రామసాగరా ।

సదస్సవంతీ వాపీషు పుపుల్లు: పంకజాని వై ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవతలు ఈ తీరున గర్భమునందున్న మహేశ్వరిని పరి పరి విధముల స్తుతించి, ప్రసన్నమగు మనస్సు గలవారై, అప్పుడు తమ తమ ధామములకు వెళ్ళిరి (24). తొమ్మిది మాసములు గడచి పదియవ మాసము పూర్తి యగు నంతవరకు, జగన్మాతయగు కాళీదేవి గర్భస్థురాలై ఉండెను (25). అపుడు ఒకనొక శుభముహూర్తమునందు, నక్షత్రములు గ్రహములు శాంతములై యుండగా, ఆకాశము ప్రసన్నమై దిక్కులన్నియు ప్రకాశించుచుండగా (26), వనములతో గ్రామములతో సముద్రములతో కూడిన భూమి మంగళములతో నిండియుండెను. సరస్సులలో, నదులలో, దిగుడు బావులలో పద్మములు వికసించియుండెను.

వవుశ్చ వివిధా వాతాస్సుఖస్పర్శా మునీశ్వర ।

ముముదుస్సాధవస్సర్వేఽసంతాన్ దుఃఖమ భూద్ద్రుతమ్ ॥

దందుభీన్ వాదయామాసుర్నభస్యాగత్య నిర్జరా: ।

పుష్ప వృష్టిరభూత్తత్ర జగుర్గంధర్వ సత్తమా: ॥

విద్యాధరస్త్రియో వ్యోమ్ని నన్నృతుశ్చాప్సరాస్తథా ।

తదోత్సవో మహానాసీద్దేవాదీనాం నభస్థ్సలే ॥

తస్మిన్న వసరే దేవీ పూర్వశక్తిశ్శివా సతీ ।

ఆవిర్బభూవ పురతో మేనాయా నిజరూపతః ॥

వసంతర్తౌ మధౌ మాసీ నవమ్యాం మృగధిష్ణ కే ।

అర్ధరాత్రే సముత్పన్నా గంగేవ శశిమండలాత్ ॥

ఓ మహర్షీ! సుఖమగు స్పర్శ కలిగిన గాలులు అన్ని దిక్కుల యందు వీచినవి. సత్పురుషులందరు ఆనందించిరి. దుష్టులు శీఘ్రమే దుఃఖితులైరి (28). దేవతలు అంతరిక్షములోనికి ప్రవేశించి దుందుభులను వాయించిరి. అపుడచట పుష్పవృష్టి కురిసెను. గంధర్వ శ్రేష్ఠులు గానమును చేసిరి (29). ఆకాశము నందు విద్యాధరస్త్రీలు, అప్సరసలు, కూడ నాట్యమును చేసిరి. అపుడు దేవతలు మొదలగువారు అంతరిక్షములో గొప్ప ఉత్సవమును చేసుకొనిరి (30). ఆ సమయములో పూర్వము సతీ రూపముగా అవతరించిన శివశక్తి స్వీయరూపముతో మేన యెదుట సాక్షాత్కరించెను (31). వసంత ఋతువులో చైత్రమాసములో నవమీ తిథినాడు మృగశిరా నక్షత్రమునందు అర్ధరాత్రి సమయమునందు చంద్రమండలము నుండి ఆకాశగంగవలె ఆ దేవి జన్మించెను.

సమయే తత్స్వరూపేణ మేనకా జఠరాద్భువా ।
సముద్భూయ సముత్పన్నా సా లక్ష్మీరివ సాగరాత్ ।
తతస్తస్యాం తు జాతాయాం ప్రసన్నోఽభూత్తదా భవః ।
అనుకూలో వవౌ వాయు ర్గంభీరో గంధయుక్ శుభ: ॥
బభూవ పుష్పవృష్టిశ్చ తోయవృష్టి పురస్సరమ్ ।
జజ్వలుశ్చాగ్నయశ్శాంతా జగర్జుశ్చ తదా ఘనా ! ॥
తస్యాం తు జాయమానాయాం సర్వస్వం సమపద్యత ।
హిమవన్నగరే తత్ర సర్వదుఃఖం క్షయం గతమ్ ॥

ఆ సమయములో ఆ స్వరూపముతో ఉమాదేవి మేన యొక్క, గర్భము నుండి, సముద్రము నుండి లక్ష్మీదేవి వలె జన్మించెను (33). అపుడామె జన్మించగానే జగత్తు ప్రసన్నమాయెను. అనుకూలము, శుభగంధముతో గూడినది అగు వాయువు మెల్లగా వీచెను (34). జలవర్షముతో బాటు పుష్పవర్షము కూడ కురిసెను. అగ్నులు ప్రశాంతముగా ప్రజ్వరిల్లినవి. మేఘములు గర్జించెను (35). ఆమె జన్మించిన ఆ సమయములో హిమవంతుని రాజధాని యందు సర్వము సుసంపన్నమగుటయే గాక, సర్వదుఃఖములు క్షయమయ్యెను.

తస్మిన్నవసరే తత్ర విష్ణ్వాద్యాస్సకలాస్సురా: ।
ఆజగ్ముస్సుఖిన: ప్రీత్యా దదృశుర్జగదంబికామ్ ॥
తుష్టువుస్తాం శివామంబాం కాలికాం శివకామినీమ్ ।
దివ్యరూపాం మహామాయాం శివలోకనివాసినీమ్ ॥

ఆ సమయములో విష్ణువు మొదలగు దేవతలందరు అచటకు వచ్చి ఆనందించి ప్రీతితో జగన్మాతను దర్శించిరి (37). జగన్మాత, శివునకు ప్రియురాలు, దివ్యమగు రూపము గలది, మహామాయ, శివలోకమునందు నివసించునది, శుభకరి అగు ఆ కాళికను వారు స్తుతించిరి.

దేవా ఊచు: ।

జగదంబ మహాదేవీ సర్వసిద్ధివిధాయిని ।
దేవ కార్యకరీ త్వం హి సదాతస్త్వాం నమామహే ॥
సర్వథా కురు కల్యాణం దేవానాం భక్తవత్సలే ।
మేనామనోరథః పూర్ణః కృత: కురు హరస్య చ ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ జగన్మాతా! మహాదేవీ! నీవు సర్వసిద్ధులను ఇచ్చుదానవు. నీవు సర్వదా దేవకా◌ార్యములను చక్కబెట్టెదవు. కాన నిన్ను నమస్కరించుచున్నాము (39). హే భక్తవత్సలే! దేవతలకు అన్ని విధములా కల్యాణమును కలిగించుము. మేన యొక్క మనోరథము పరిపూర్ణమైనది. శివుని మనోరథమును గూడ పరిపూర్ణము జేయుము.

బ్రహ్మో వాచ ।

ఇత్థం స్తుత్వా శివాం దేవీం విషాద్యాస్సుప్రణమ్య తామ్ ।
స్వం స్వం ధామ యయు: ప్రీతాశ్శంసంతస్తద్గతిం పరామ్ ॥
తాం తు దృష్ట్వా తథా జాతాం నీలోత్పలదలప్రభామ్ ।
శ్యామా సా మేనకా దేవీ ముదమాపాతి నారద ॥
దివ్య రూపం విలోక్యాను జ్ఞానమాప గిరిప్రియా ।
విజ్ఞాయ పరమేశానీం తుష్టావాతిప్రహర్షితా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

విష్ణువు మొదలగు దేవతలు ఆ శివాదేవిని ఇట్లు స్తుతించి, ప్రణమిల్లి, ప్రీతులై ఆమె యొక్క ఉత్కృష్టమగు జన్మను ప్రశంసిస్తూ తమ తమ దామములకు వెళ్లిరి (41). ఓ నారదా! నల్ల కలువ రేకులవలె ప్రకాశించుచున్న ఆ బాలికను చూచి సుందరియగు మేన అతిశయించిన ఆనందమును పొందెను (42). మేన ఆమె దివ్యరూపమును చూచి, ఆ పిదప జ్ఞానమును పొంది, ఆమె పరమేశ్వరియని గుర్తించి మిక్కిలి ఆనందించి స్తుతించెను.

మేనో వాచ ।

జగదంబ మహేశాని కృతాతికరుణా త్వయా ।
ఆవిర్భూతా మమ పురో విలసన్తీ యదంబికే ॥
త్వమాద్యా సర్వశక్తీనాం త్రిలోకజననీ శివే ।
శివప్రియా సదా దేవీ సర్వదేవస్తుతా పరా ॥
కృపాం కురు మహేశాని మమ ధ్యానస్థితా భవా ।
ఏత ద్రూపేణ ప్రత్యక్షం రూపం దేహి సుతాసమమ్ ॥

మేన ఇట్లు పలికెను -

ఓ జగదంబా! మహేశ్వరీ నీవు నాయందు అతిశయించిన దయను చూపితివి. ఏలయన, హే అంబికే! నీవు నీ సుందరరూపముతో నా ఎదుట ప్రత్యక్షమైతివి (44). శక్తులన్నింటికి మూలమగు శక్తివి నీవే. హే శివే! నీవు ముల్లోకములకు తల్లివి, నీవు సర్వదా శివునకు ప్రియురాలవగు దేవివి. దేవతలందరు స్తుతించే పరాశక్తివి నీవే (45). ఓ మహేశ్వరీ! దయను చూపుము. నీవు నా ధ్యానమునందు నిలిచి యుండుము. నీవు ఈ రూపములో ప్రత్యక్షమై, కుమార్తెతో సమానమగు రూపమును స్వీకరించుము.

బ్రహ్మో వాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్యా మేనాయా భూధరస్త్రియాః ।
ప్రత్యువాచ శివా దేవీ సుప్రసన్నాం గిరిప్రియామ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హిమవంతునికి ప్రియమగు భార్యయై చక్కని సంతానమును గనిన ఆ మేన యొక్క ఈ మాటను విని శివా దేవి ఇట్లు బదులిడెను.

దేవ్యు వాచ ।

హే మేనే పురా త్వం మాం చ సుసేవితవతీ రతా ।
త్వద్భక్త్యా సుప్రసన్నాహం వరం దాతుం గతాంతికమ్ ॥
వరం బ్రూహీతి మద్వాణీం శ్రుత్వా తే తద్వరో వృతః ।
సుతా భవ మహాదేవీ సా మే దేవహితం కురు ॥
తథా దత్త్వా వరం తేఽహం గతా స్వం పదమాదరాత్ ।
సమయం ప్రాప్య తనయాఽభవం తే గిరికామిని ॥
దివ్య రూపం ధృతం మేఽద్య యత్తే మత్స్మరణం భవేత్ ।
అన్యథా మర్త్య భావేన తవాజ్ఞానం భవేన్మయి ॥

దేవి ఇట్లు పలికెను -

ఓ మేనా! పూర్వము నీవు నన్ను శ్రద్ధతో చక్కగా సేవించితివి. నీ భక్తిచే నేను మిక్కిలి ప్రసన్నురాలనై, వరము నీయుట కొరకు నీ వద్దకు వచ్చితిని (48). 'వరమును కోరుకొనుము' అని నేను పలుకగా, నీవు విని 'ఓ మహాదేవీ! నీవు నాకు కుమార్తెవై జన్మించి, దేవకార్యమును చక్కబెట్టుము' అని నీవు కోరియుంటివి (49). నేనపుడు నీకా వరమునిచ్చి నా ధామమునకు వెళ్లితిని. ఇపుడు దానికి సమయము వచ్చినది. ఓ హిమవంతుని ప్రియురాలా! నీకు కుమార్తెనై జన్మించితిని (50). నేనిపుడు దివ్య రూపముతో నీ ఎదుట ప్రత్యక్షమైతిని. అట్లు ప్రత్యక్షమై నీకు నా స్మరణ కల్గునట్లు చేసితిని. అట్లు గానిచో, నీవు నన్ను గుర్తించలేక అజ్ఞానముచే నన్ను ప్రాకృత స్త్రీ యనీ తలపోసి యుండెడి దానవు.

యువాం మాం పుత్రిభావేన దివ్యభావేన వాసకృత్ ।
చిన్తయన్తౌ కృతస్నేహౌ యాతాస్థో మద్గతిం పరామ్ ॥
దేవ కార్యం కరిష్యామి లీలాం కృత్వాద్భుతాం క్షి తౌ ।
శంభుపత్నీ భవిష్యామి తారయిష్యామి సజ్జనాన్ ॥

మీరిద్దరు నన్ను కుమార్తె యను భావన గలవారై ప్రేమతో పెంచుడు. అప్పుప్పుడప్పుడు నా దివ్యతత్త్వమును కూడ ఎరుంగగలరు. మరియు నా పరమ పదమును పొందగలరు (52). భూమి యందు అద్భుతమగు లీలలను ప్రదర్శించి దేవ కార్యమును సిద్ధింపజేసెదను. శం భుని పత్ని కాగలను. సత్పురుషులను తరింపజేయగలను.

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వాసీద్భవా తూష్ణీ మంబికా స్వాత్మమాయయా ।
పశ్యంత్యాం మాతరి ప్రీత్యా సద్యోఽభూత్తనయా తను: ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పార్వతి జన్మవర్ణనం నామ షష్ఠోఽధ్యాయ: ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఇట్లు పలికి జగన్మాతయగు ఆ శివ మిన్నకుండెను. తల్లి ప్రేమతో చూచుచుండగనే ఆమె వెనువెంటనే తన మాయశక్తిచే శిశు రూపమును స్వీకరించెను.

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో పార్వతీ జన్మవర్ణనమనే ఆరవ అధ్యాయము ముగిసినది.

7 – పార్వతి బాల్యము

బ్రహ్మోవాచ ।

తతో మేనా పురస్తాద్వై సుతా భూత్వా మహాద్యుతిః ।
చకార రోదనం తత్ర లౌకికీం గతి మాశ్రితా ॥
అరిష్టశయ్యాం పరితస్సద్వ్యిసారి సుతేజసా ।
నిశీథ దీపా విహతత్విష ఆసన్నరం మునే ॥
శ్రుత్వా తద్రోదనం రమ్యం గృహస్థాస్సర్వయోషితః ।
జహృషుస్సంభ్రమాత్తత్రాగతాః ప్రీతిపురస్సరాః ॥
తచ్ఛుద్ధాంత చర శ్శీఘ్రం శశంస భూభృతే తదా ।
పార్వతీ జన్మ సుఖదం దేవ కార్యకరం శుభమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

మహా తేజస్విని యగు ఆమె అపుడు మేన యెదుట కుమార్తెయై జన్మించి లోకపు పోకడ ననుసరించి రోదించెను (1). ఓ మహర్షీ! ఆమె పరుండిన మంచము చుట్టూ వ్యాపించిన ఆమె యొక్క గొప్ప తేజస్సుచే, రాత్రి యందు కూడా అచటి దీపములు వెనువెంటనే వెలవెల బోయినవి (2). ఇంటి యందలి స్త్రీలందరు ఆమె ఏడ్పుటను వినిరి. ఆ ఏడుపు మనోహరముగ నుండెను. వారు తొందరగా అచటకు వచ్చి, ప్రేమతో ఆనందముతో పులకించిరి (3). అపుడు దేవ కార్యమును సిద్ధింప జేసే, సుఖకరము శుభకరమునగు ఆ పార్వతి . పుట్టుటను గూర్చి హిమవంతుని అంతఃపుర పరిచారకుడు ఆ రాజునకు శీఘ్రమే తెలిపెను (4).

తచ్ఛుద్ధాంత చరాయాశు పుత్రీజన్మ సుశంసతే ।
సితాత పత్రం నాదేయమా సీత్తస్య మహీభృతః ॥
గతస్తత్ర గిరిః ప్రీత్యా సపురోహిత సద్విజః ।
దదర్శ తనయాం తాం తు శోభమానాం సుభాససా ॥
నీలోత్పల దలశ్యామాం సుద్యుతిం సుమనోరమామ్ ।
దృష్ట్వా చ త దృశీం కన్యాం ముమోదాతి గిరీశ్వరః ॥
సర్వే చ ముముదుస్తత్ర పౌరాశ్చ పురుషా స్త్రీ యః ।
తదోత్సవో మహానాసీన్నే దుర్వాద్యాని భూరిశః ॥

ఆ పర్వత రాజు నకు కుమార్తె జన్మించి నదను శుభవార్తను చెప్పిన ఆ అంతఃపుర పరిచారకునకు తన శ్వేతచ్ఛత్రమును దానము చేయుట విడ్డూర మనిపించలేదు (5). ఆ శైలరాజు పురోహితునితో, బ్రాహ్మణులతో గూడి ఆనందముతో అచటకు వెళ్లి గొప్ప కాంతులతో శోభిల్లుచున్న ఆ కుమార్తెను చూచెను (6). నల్లకలువ రేకుల వలె శ్యామల వర్ణము గలది, గొప్ప కాంతులతో మనస్సును రంజింప జేయునది అగు అట్టి కన్యను చూచి ఆ పర్వత రాజు మిక్కిలి ఆనందించెను (7). అచటనున్న పురుషులు, స్త్రీలు, అందరు పౌరులు కూడ ఆనందించిరి. అపుడు గొప్ప ఉత్సవము జరిగెను. అనేక వాద్యములు మ్రోగించబడినవి (8).

బభూవ మంగలం గానం నన్నృతుర్వారయోషితః ।
దానం దదౌ ద్విజాతిభ్యో జాతకర్మ విధాయ చ ॥
అథ ద్వారం సమాగత్య చకార సుమహోత్సవమ్ ।
హిమాచలః ప్రసన్నాత్మా భిక్షుభ్యో ద్రవిణం దదౌ ॥
అథో ముహూర్తే సుమతే హిమవాన్మునిభిస్సహ ।
నామాకరోత్సుతాయాస్తు కాలిత్యాది సుఖ ప్రదమ్ ॥
దానం దదౌ తదా ప్రీత్యా ద్విజేభ్యో బహు సాదరమ్ ।
ఉత్సవం కారయామాస వివిధం గానపూర్వకమ్ ॥

మంగల గానములు పాడబడెను. వారాంగనలు నాట్యమును చేసిరి. హిమవంతుడు జాతకర్మను చేసి బ్రాహ్మణులకు దానమునిచ్చెను (9). అపుడు హిమవంతుడు సింహద్వారము వద్దకు వచ్చి, గొప్ప ఉత్సవమును చేసెను. ఆయన ప్రసన్నమగుమనస్సుగలవాడై భిక్షుకులకు ధనము నిచ్చెను (10). ఓ సుబుద్ధీ! హిమవంతుడు శుభముహూర్తమునందు మునులతో గూడి ఆమెకు కాళి మొదలగు సుఖకరమగు పేర్లను పెట్టెను (11). అపుడాయన మిక్కిలి ఆదరముతో బ్రాహ్మణులకు దానమునిచ్చెను. మరియు వివిధ గానకచేరీలతో గూడిన ఉత్సవమును చేయించెను (12).

ఇత్థం కృత్వోత్సవం భూరి కాలీం పశ్యన్ముహుర్ముహుః ।
లేభే ముదం సపత్నీకో బహుపుత్రోఽపి భూధరః ॥
తత్ర సా వవృధే దేవీ చార్వంగీ చారుదర్శనా ।
దద్రే చానుదినం రమ్యం చంద్రబింబ కలామివ ॥
కులోచితేన నామ్నా తాం పార్వతీ త్యాజుహావ హ ।
బంధుప్రియాం బంధుజనస్సౌశీల్య గుణ సంయుతామ్ ॥
ఏవం సా కాలికా దేవీ గిరిరాజగృహే శివా ।
గంగేవ వర్షాసమయే శరదీవాథ చంద్రికా ॥

హిమవంతుడు అనేక పుత్రులు గలవాడైననూ భార్యతో గూడి ఈ తీరున పెద్ద ఉత్సవమును చేసి, ఆ కాళిని మరల మరల చూచుచూ, ఆనందమును పొందెను (13). సుందరమగు అంగములతో చూడ చక్కనైన ఆ దేవి అచట ప్రతి దినము సుందరమగు శుక్ల పక్షచంద్ర బింబము వలె పెరుగజొచ్చెను (14). బంధువులకు ఇష్టురాలు, మంచి శీలముతో గుణముతో కూడియున్నది అగు ఆమెను బంధుజనులు కులమునకు తగిన 'పార్వతీ' అను పేరుతో పిలువజొచ్చిరి (15). ఆ ఉమాదేవి హిమవంతుని గృహములో వర్షకాలమందలి గంగవలే, శరత్కాలమందలి వెన్నెలవలె ప్రకాశించెను (16).

ఉమేతి మాత్రా తపసే నిషిద్ధా కాలికా చ సా ।
పశ్చాదుమాఖ్యాం సుముఖీ జగామ భువనే మునే ॥
దృష్టిః పుత్రవతోఽప్య ద్రేస్త స్మింస్తృప్తిం జగామ న ।
అపత్యే పార్వతీ త్యాఖ్యే సర్వసౌభాగ్య సంయుతే ॥
మధో రనంతపుష్పస్య చూతే హి భ్రమరావలిః ।
విశేషసంగా భవతి సహకారే మునీశ్వర ॥
పూతో విభూషితశ్చాపి స బభూవ తయా గిరి: ।
సంస్కారవత్యేవ గిరా మనీషీవ హిమాలయః ॥

ఓ మహర్షి! భవిష్యత్తులో ఆ కాళి తపస్సునకు పక్రమించగా, తల్లి ఉమా (అబ్బేబే, వద్దు)' అని నిషేధించును. అప్పటి నుండియూ ఆ సుందరికి ఉమ అను పేరు లోకములో ప్రసిద్ధిని గాంచెను (17). హిమవంతుడు పుత్రసంతానము గలవాడే. అయిననూ, సర్వ సౌభాగ్యవతి యగు పార్వతియను పుత్రికను ఎంత చూచిననూ, ఆతనికి తనివి తీరలేదు (18). వసంతర్తువు యందు అనంత సంఖ్యలో పుష్పములున్ననూ, తుమ్మెదల దండు మామిడి చెట్టుపై విశేష ప్రీతిని కలిగియుండును గదా! ఓ మహర్షీ! (19) సంస్కారవంతమగు వాక్కుచే విద్వాంసుడు వలె ఆ హిమవంతుడు ఆమెచే పవిత్రితుడాయెను, మరియు అలంకృతుడాయెను (20).

ప్రభామహత్యా శిఖయేవ దీపో భువనస్య చ ।
త్రిమార్గయేవ సన్మార్గ స్తద్వద్గిరిజయా గిరి: ॥
కందుకైః కృత్రిమైః పుత్రైస్స ఖీమధ్య గతా చ సా ।
గంగా సైకతవేదీ బర్భాల్యే రేమే ముహుర్ముహుః ॥
అథ దేవీ శివా సా చోపదేశ సమయే మునే ।
పపాఠ విద్యాస్సు ప్రీత్యా యతచిత్తా చ సద్గురోః ॥

గొప్ప కాంతులను విరజిమ్మే అగ్ని శిఖతో దీపమువలె, మందాకిని (పాలపుంత) తో◌ో బ్రహ్మాండములోని నక్షత్ర మార్గమువలె, హిమవంతుడు గిరిజతో కూడి ప్రకాశించెను (2 1). ఆమె బాల్యమునందు సఖురాండ్రతో గూడి గంగానది యొక్క ఇసుకతిన్నెలపై బంతులతో, ఆట బొమ్మలతో చిరకాలము క్రీడించెడిది (22). ఓ మహర్షీ! తరువాత ఆ శివాదేవి విద్యా రంభ సమయములో ఆరంభించి, సద్గురువు వద్ద నుంచి పరమ ప్రీతితో మనస్సును లగ్నము చేసి విద్యలను స్వీకరించి పఠించెను (23).

ప్రాక్తనా జన్మ విద్యాస్తాం శరదీవ ప్రపేదిరే ।

హంసాళి స్స్వర్ణదీ నక్త మాత్మ భాసో మహౌషధిమ్ ॥

ఇత్థం సువర్ణితా లీలా శివాయాః కాచిదేవ హి ।

అన్య లీలాం ప్రవక్ష్యేక హం శృణు త్వం ప్రేమతో మునే ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పార్వతీ బాల్య లీలావర్ణనం నామ సప్తమోఽధ్యాయః (7).

ఓ మహర్షీ! ఈ తీరున నేను అనిర్వచనీయమగు శివాలీలను చక్కగా వర్ణించితిని. మరి◌కొన్ని లీలలను చెప్పగలను. నీవు ప్రేమపూర్వకముగా వినుము (25).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో పార్వతీ బాల్య లీలల వర్ణనమనే ఏడవ అధ్యాయము ముగిసినది (7).

8 – నారద హిమాలయ సంవాదము

బ్రహ్మోవాచ ।

ఏకదాతు శివజ్ఞానీ శివలీలావిదాం వరః ।
హిమాచలగృహం ప్రీత్యా గమస్త్వం శివప్రేరితః ॥
దృష్ట్వా మునే గిరీశస్త్వాం నత్వానర్చ స నారద ।
ఆహూయ చ స్వతనయాం త్వదంఘ్ర్యోస్తామ పాతయత్ ॥
పునర్నత్వా మునీశ త్వాముపాచ హిమ భూధరః ।
సాంజలిస్స్వ విధిం మత్వా బహుసన్నత మస్తకః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

శివజ్ఞాని, శివలీలల నెరింగిన వారిలో శ్రేష్ఠుడు అగు నీవు ఒకనాడు శివునిచే ప్రేరేపింపబడిన వాడవై, ఆనందముతో హిమవంతుని గృహమునకు వెళ్లితివి (1). ఓ మహర్షీ! నారదా! ఆ పర్వత రాజు నిన్ను చూచి నమస్కరించి పూజించెను. మరియు తన కుమార్తెను పిలిపించి నీ పాదములపై బడవైచెను (2). ఓ మహర్షీ! హిమవంతుడు నీకు చేతులు ఒగ్గి శిరసును బాగుగా వంచి మరల నమస్కరించిన వాడై, ఈ ప్రసంగమును తన విధిగా భావించి చేసెను (3).

హిమాలయ ఉవాచః

హే మునే నారద జ్ఞానిన్ బ్రహ్మ పుత్రవర ప్రభో ।
సర్వజ్ఞస్త్వం సకరుణః పరోపకరణే రతః ॥
మత్సుతా జాతకం బ్రూహి గుణదోష సముద్భవమ్ ।
కస్య ప్రియా భాగ్యవతీ భవిష్యతి సుతా మమ ॥

హిమవంతుడిట్లు పలికెను –

ఓ మహర్షీ! నారదా! ప్రభూ! నీవు బ్రహ్మ పుత్రులలో శ్రేష్ఠుడవగు జ్ఞానివి. నీ◌ీవు సర్వము నెరింగిన దయామూర్తివి. నీకు పరోపకరమునందు ప్రీతి మెండు (4). నా కుమార్తె యొక్క జాతకమును, దాని లోని గుణదోషముల వలన కలుగ బోవు పరిణామములను చెప్పుము. భాగ్యవంతురాలగు నా కుమార్తె ఎవని ప్రియురాలు కాగలదు? (5)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తో ముని వర్య త్వం గిరీశేన హిమాద్రిణా ।
విలోక్య కాలికా హస్తం సర్వాంగం చ విశేషతః ॥
అవోచస్త్వం గిరిం తాత కౌతుకీ వాగ్వి శారదః ।
జ్ఞానీ విదిత వృత్తాంతో నారద: ప్రీతమానసః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! పర్వతరాజగు హిమవంతుడిట్లు పలుకగా, నీవు కాళికా దేవి యొక్క హస్తమును, విశేషించి సర్వావయవములను పరిశీలించితివి (6). వత్సా! ఉత్కంఠను రేకెత్తించువాడు, వాగ్విశారదుడు, జ్ఞాని, వృత్తాంతము నంతనూ ఎరింగిన వాడు అగు నీవు సంతసించిన హృదయము గలవాడవై హిమవంతునితో నిట్లంటివి (7).

నారద ఉవాచః

ఏషా తే తనయా మేనే సుధాంశో రివ వర్ధితా ।
ఆద్యా కలా శైలరాజ సర్వలక్షణ శాలినీ ॥
స్వపతేస్సు ఖదాత్యంతం పిత్రో: కీర్తి వివర్ధినీ ।
మహాసాధ్వీ చ సర్వాసు మహానందకరీ సదా ॥
సులక్షణాని సర్వాణి త్వత్సుతాయాః కరే గిరే ।
ఏకా విలక్షణా రేఖా తత్ఫలం శృణు తత్త్వతః ॥
యోగీ నగ్నోఽ గుణోఽ కామీ మాతృతాత వివర్జితః ।
అమానోఽ శివవేషశ్చ పతిరస్యాః కి లేదృశః ॥

నారదుడిట్లు పలికెను –

ఓ పర్వతరాజా! ఈ నీ కుమార్తె పెరిగి సర్వ లక్షణములతో కూడినదై చంద్రుని ప్రరతిపత్కళ వలె ప్రకాశించుచున్నదని తలంచుచున్నాను (8). ఈమె తన భర్తకు అతి శయించిన సుఖమునిచ్చి, తల్లి దండ్రుల కీర్తిని పెంపొందించ గలదు. ఈమె అన్ని అవస్థలయందు మహా పతివ్రతయై, సర్వదా మహానందము నీయగలదు (9). ఓ పర్వతరాజా! నీ కుమార్తె యొక్క చేతియందు మంచి లక్షణములన్నియూ కనిపించుచున్నవి. మరియు ఒక విలక్షణమైన రేఖ గలదు. దాని యథార్థ ఫలమును వినుము (10). యోగీ, దిగంబరుడు, నిర్గుణుడు, వీతరాగుడు, తల్లి దండ్రులు లేని వాడు, అహంకార విహీనుడు, అమంగళవేషధారి అగు వాడు ఈమెకు భర్త కాబోవు చున్నాడు సుమా! (11).

బ్రహ్మోవాచ ।

ఇత్యా కర్ణ్య వచస్తే హి సత్యం మత్వా చ దంపతీ ।
మేనా హిమాచలశ్చాపి దుఃఖితౌ తౌ బభూవతుః ॥
శివాకర్ణ్య వచస్తే హి తాదృశం జగదంబికా ।
లక్షణైస్తం శివం మత్వా జహర్షాతి మునే హృది ॥
న మృషా నారద వచశ్చేతి సంచింత్య సా శివా ।
స్నేహం శివపదద్వంద్వే చకారాతి హృదా తదా ॥
ఉవాచ దుఃఖితశ్శైల స్త్వాం తదా హృది నారద ।
కముపాయం మునే కుర్యా మతి దుఃఖ మభూదితి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మేనా హిమవంతులనే ఆ దంపతులు నీ ఈ మాటను విని, సత్యమని స్వీకరించి, మిక్కిలి దుః◌ఃఖించిరి (12). ఓ మహర్షీ! ఆ జగన్మాత కూడ నీ ఈ మాటను విని, ఆ లక్షణములను బట్టి ఆతడు శివుడేనని నిర్ణయించుకొని హృదయములో గొప్ప ఆనందమును పొందెను (13). ఆ శివా దేవి నారదుని వచనము అసత్యము కాబోదని తలంచి, అపుడు మనస్సులో శివుని పాదపద్మములపై అతిశయించిన ప్రేమను నింపుకొనెను (14). ఓ నారదా! అపుడా పర్వతరాజు దుఃఖితుడై నీతో నిట్లనెను: ఓ మహర్షీ! నేనేమి ఉపాయమును చేయవలెను. నాకు మహాదుఃఖము కలుగుచున్నది (15).

తచ్ఛ్రుత్వా త్వం మునే ప్రాత్థ మహా కౌతుక కారకః ।
హిమాచలం శుభైర్వాక్యైర్హర్షయన్ వాగ్విశారదః ॥

ఓ మహర్షీ! గొప్ప ఉత్కంఠను రేకెత్తించే వాగ్విశారదుడవగు నీవు ఆ మా◌ాటను విని శుభవాక్యములతో హిమవంతునికి హర్షమును కలిగించు వాడవై ఇట్లు పలికితివి (16).

నారద ఉవాచ।

స్నేహాచ్ఛృణు గిరే వాక్యం మమ సత్యం మృషా న హి ।
కరలేఖా బ్రహ్మలిపిర్న మృషా భవతి ధ్రువమ్ ॥
తాదృశోఽకస్యాః పతిశ్శైల భవిష్యతి న సంశయః ।
తత్రోపాయం శృణు ప్రీత్యా యం కృత్వా లప్స్యసే సుఖమ్ ॥
తాదృశోఽస్తి వరశ్శంభుర్లీలా రూపధరః ప్రభుః ।
కులక్షణాని సర్వాణి తత్ర తుల్యాని సద్గుణైః ॥
ప్రభౌ దోషో న దుః ఖాయ దుఃఖదోఽత్య ప్రభౌ హి సః ।
రవి పావక గంగానాం తత్ర జ్ఞేయా నిదర్శనా ॥

నారదుడిట్లు పలికెను -

ఓ పర్వత రాజా ! నేను ప్రేమతో చెప్పు మాటను వినుము. నా మాట సత్యము. నా మాట ఎన్నటికీ అసత్యము కాదు. బ్రహ్మచే నిర్మించబడిన చేతి లోని రేఖలు నిశ్చయముగా అసత్యము గావు (17). హే పర్వత రాజా! ఈమె భర్త అట్టి వాడగు ననుటలో సందేహము లేదు. కాని ఈ విషయములో ఒక ఉపాయమును వినుము. అట్లు చేసినచో, నీవు సుఖమును పొందగలవు (18). లీలారూపధారి యగు శంభుప్రభుడు అట్టి వరుడై యున్నాడు. కాని ఆయన యందలి చెడు లక్షణములన్నియూ సద్గుణములతో సమానము (19). ఆ ప్రభువు నందు దోషము దుఃఖకారి కాదు. ఆ దోషమే ప్రభువు కంటె ఇతరుల యందున్నచో మహాదుఃఖమును కలిగించును. దీనికి సూర్యుడు, అగ్ని, గంగానది దృష్టాంతములని తెలియదగును (20).

తస్మాచ్ఛివాయ కన్యాం స్వాం శివాం దేహి వివేకతః ।

శివస్సర్వేశ్వరస్సేవ్యోఽ వికారీ ప్రభురవ్యయః ॥

శీఘ్రప్రసాదస్స శివస్తాం గ్రహీష్యత్య సంశయమ్ ।

తపస్సాధ్యో విశేషేణ యది కుర్యాచ్ఛివా తపః ॥

సర్వథా సుసమర్థో హి స శివస్సకలేశ్వరః ।

కులిపేరపి విధ్వంసీ బ్రహ్మాధీనస్సుక ప్రదః ॥

కాన నీవు వివేకము గలవాడవై నీ కుమార్తె యగు శివాదేవిని శివునకు ఇచ్చి వివాహమును చేయుము. సర్వేశ్వరుడు, వికార రహితుడు, అవినాశి యగు శివ ప్రభుడు సేవించదగినవాడు (21). ఆ శివుడు తొందరగా ప్రసన్నుడగును. ఆయన ఈమెను తప్పక స్వీకరించగలడు. ఈ శివా దేవి తపస్సును చేసినచో, ఆయన విశేషించి అట్టి తపస్సుచే పొందదగిన వాడు అగును (22). ఆ శివుడు సర్వవిధములా అత్యంత సమర్థుడు, సర్వేశ్వరుడు, చెడు రాతను గూడ తుడచి పెట్టగలవాడు, బ్రహ్మ అధీనమునందు గల వాడు, మరియు ఆనందము నిచ్చువాడు (23).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా త్వం పునస్తాత కౌతుకీ బ్రహ్మ విన్మునే ।

శైలరాజ మహో చో హి హర్షయన్ వచనైశ్శుభైః ॥

భావినీ దయితా శంభోస్సానుకూలా సదా హరేః ।

మహాసాధ్వీ సువ్రతా చ పిత్రోస్సుఖ వివర్ధినీ ॥

శంభోశ్చిత్తం వశే చైషా కరిష్యతి తపస్వినీ ।

స చాప్యేనామృతే యోషాం న హ్యన్యాముద్వ హిష్యతి ॥

ఏతయో స్సదృశం ప్రేమ న కస్యా ప్యేవ తాదృశమ్ ।

భూతం వా భవితా వాపి నాధునా చ ప్రవర్తతే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హే వత్సా! మహర్షీ! ఉత్కంఠను కలిగించువాడు, బ్రహ్మవేత్త అగు నీవు ఇట్లు పలికి, ఆ పర్వత రాజును శుభవచనములతో ఆనందింపజేయుచూ, మరల నిట్లంటివి (24). ఈమె శంభునకు పత్నియై, ఆయనకు సర్వదా అనుకూలవతియై, మహాపతివ్రతయై, గొప్ప నిష్ఠగలదియై తల్లిదండ్రుల సుఖమును వృద్ధిచేయగలదు (25). ఈ తపస్విని శంభుని చిత్తమును తన వశము చేసుకొనగలదు. ఆయన కూడా ఈమెను తక్క మరియొక స్త్రీని వివాహమాడడు (26). వీరిద్దరి ప్రేమతో తుల్యమగు ప్రేమ ఏ ఇద్దరి మధ్యనైననూ భూతకాలములో లేదు; వర్తమానకాలములో లేదు; భవిష్యత్తులో ఉండబోదు (27).

అనయో స్సురకార్యాణి కర్త వ్యాని మృతాని చ ।
యాని యాని నగశ్రేష్ఠ జీవితాని పునః పునః ॥
అనయా కన్యయా తేఽద్రే అర్ధనారీశ్వరో హరః ।
భవిష్యతి తథా హర్ష మనయోర్మిలితం పునః ॥
శరీరార్ధం హరస్యైషా హరిష్యతి సుతా తవ ।
తపః ప్రభావాత్సంతోష్య మహేశం సకలేశ్వరమ్ ॥
స్వర్ణ గౌరీ సువర్ణాభా తపసా తోష్య తం హరమ్ ।
విద్యుద్గౌరతమా చేయం తవ పుత్రీ భవిష్యతి ॥
గౌరీతి నామ్నా కన్యా తు ఖ్యాతిమేషా గమిష్యతి ।
సర్వదేవగణైః పూజ్యా హరి బ్రహ్మాది భిస్తథా ॥

వీరిద్దరు చేయ దగిన దేవకార్యములు గలవు. ఓ పర్వత రాజా! వీరు మృతులనెందరినో జీవింప చేయవలసి యున్నది (28). ఓ పర్వతరాజా! శివుడు ఈ కన్యకు తన శరీరములోని అర్ధభాగము నిచ్చి అర్ధనారీశ్వరుడు కాగలడు. మరియు వీరిద్దరి కలయిక మరల సర్వత్ర ఆనందమును కలిగించును (29). ఈ నీ కుమార్తె శివుని శరీరము యొక్క అర్ధ భాగమును తన అధీనము చేసుకొనగలదు. ఈమె తన తపశ్శక్తిచే సకలేశ్వరుడగు మహేశ్వరుని సంతోష పెట్ట గలదు (30). తపస్సుచే ఆ శివుని సంతోష పెట్టి, ఈ నీ కుమార్తె బంగారము వలె, మెరుపు తీగవలె పచ్చని కాంతులతో శోభిల్ల గలదు (31). ఈ కన్య గౌరి యను పేరుతో ఖ్యాతిని గాంచగలదు. ఈమెను విష్ణువు, బ్రహ్మ మొదలగు వారితో గూడి దేవతా గణములన్నియూ పూజించగలరు (32).

నాన్యస్మై త్వమిమాం దాతుమిహార్హసి నగోత్తమ ।
ఇదం చోపాంశు దేవానాం న ప్రకాశ్యం కదాచన ॥

ఓ పర్వతరాజా! నీవు ఈమెను మరియొకనికి ఇచ్చి వివాహము చేయుట తగదు. ఇది దేవరహస్యము. ఎవ్వరికైననూ, ఎప్పుడైననూ వెల్లడి చేయరాదు (33).

బ్రహ్మోవాచ ।

ఇతి తస్య వచశ్శ్రుత్వా దేవర్షే తవ నారద ।
ఉవాచ హిమవాన్ వాక్యం మునే త్వాం వాగ్వి శారదః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ నారదా! దేవర్షి! ఈ నీ మాటను విని, వాక్కులో నైపుణ్యము గల ఆ హిమవంతుడు నీతో నిట్లనెను (34).

హిమాలయ ఉవాచః

హే మునే నారద ప్రాజ్ఞ విజ్ఞప్తిం కాంచిదేవ హి ।
కరోమి తాం శృణు ప్రీత్యాతస్త్వం ప్రముదమావహ ॥
శ్రూయతే త్యక్తసంగస్స మహాదేవో యతాత్మవాన్ ।
తపశ్చరతి సన్నిత్యం దేవానా మప్య గోచరః ॥
స కథం ధ్యాన మార్గస్థః పరబ్రహ్మార్పితం మనః ।
భ్రంశయిష్యతి దేవర్షే తత్ర మే సంశయో మహాన్ ॥
అక్షరం పరమం బ్రహ్మ ప్రదీప కలికోపమమ్ ।
సదాశివాఖ్యం స్వం రూపం నిర్వికార మజామరమ్ ॥
నిర్గుణం సగుణం తచ్చ నిర్విశేషం నిరీహకమ్ ।
అతః పశ్యతి సర్వత్ర న తు బాహ్యం నిరీక్షతే ॥

హిమవంతుడిట్లు పలికెను –

ఓ మహర్షి! నారదా! నీవు ప్రజా శాలివి. నేనొక విన్నపమును చేసెదను. దానిని నీవు ప్రీతితో విని, ఆపైన నాకు ఆనందమును కలుగ జేయుము (35). ఆ మహాదేవుడు సర్వ సంగపరిత్యాగి అనియు, ఆత్మ నిగ్రహము గలవాడనియు, నిత్యము తపస్సు చేయు చుండుననియు, దేవతలకు కూడా కానరాడనియు విని యుంటిని (36). ఓ దేవర్షి! పరబ్రహ్మ యందు అర్పితమైన మనస్సు గల ఆ శివుడు ధ్యాన మార్గము నుండి చ్యుతుడగుట యెట్లు? ఈ విషయములో నాకు పెద్ద సంశయము గలదు (37). వినాశము లేనిది, హృదయములో దీప శిఖవలె ప్రకాశించునది, సదాశివ నామధేయము గలది, వికారములు లేనిది, పుట్టుక మరణము లేనిది, నిర్గుణము, గుణములకు అధిష్ఠానము, విశేషరహితము, కామనాసంబంధము లేనిది అగు పరబ్రహ్మను ఆయన స్వస్వరూపముగా దర్శించును. ఆయన సర్వత్ర బ్రహ్మమునే దర్శించును గాన, ఆయనకు బాహ్య దృష్టి లేదు (38,39)

ఇతి స శ్రూయతే నిత్యం కిన్నరాణాం ముఖాన్మునే ।
ఇహాగతానాం సుప్రీత్యా కిం తన్మిథ్యా వచో ధ్రువమ్ ॥
విశేషతశ్రూయతే స సాక్షాన్నామ్నా తథా హరః ।
సమయం కృతవాన్ పూర్వం తన్మయా గదితం శృణు ॥
న త్వామృతేఽన్యాం వరయే దాక్షాయణి ప్రియే సతి ।
భార్యార్థం న గ్రహీష్యామి సత్య మేతద్బ్రవీమి తే ॥
ఇతి సత్యా సమం తేన పురైవ సమయః కృతః ।
తస్యాం మృతాయాం స కథం స్వయమన్యాం గ్రహీష్యతి ॥

ఓ మహర్షీ! ఇచటకు విచ్చేసి నాతో ప్రీతిగా మాటలాడే కిన్నరుల ముఖము నుండి నేను అనేక పర్యాయములు ఇట్లు వినియుంటిని. ఈ మాట అసత్యము అనుట నిశ్చయమేనా? (40). ఆయనకు హరుడని పేరు గలదు. ఆ పేరును బట్టి (హరించువాడు హరుడు) ఆయన అట్టి వాడే అయి ఉండునని లోకములో వినబడు చున్నది. ఆయన పూర్వము ఒక ప్రతిజ్ఞను చేసినాడట. దానిని చెప్పెదను వినుము (4 1). 'దక్షపుత్రీ! సతీ! ప్రియురాలా! నిన్ను తక్క మరియొక స్త్రీని నేను భార్యగా స్వీకరించను. వరించను. నేను సత్యమును చెప్పుచున్నాను' (4 2). ఇట్లు ఆయన పూర్వమే సతీదేవి ఎదుట ప్రతిజ్ఞను చేసియున్నాడు. ఆమె మరణించినది. ఇపుడాతడు మరియొక స్త్రీని ఎట్లు వివాహ మాడగలడు? (43)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా స గిరిస్తూష్ణీ మాస తస్య పురస్తవ ।
తదా కర్ణ్యాథ దేవర్షే త్వం ప్రావోచస్తు తత్త్వతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హిమవంతుడు నీ ఎదుట ఇట్లు పలికి మిన్నకుండెను. ఓ దేవర్షి! నీవా మాటను విని, యథార్థమును నిశ్చయించి, అతనితో నిట్లంటివి (44).

నారద ఉవాచః

న వై కార్యా త్వయా చింతా గిరిరాజ మహామతే ।
ఏషా తవ సుతా కాలీ దక్షజా హ్యభవత్పురా ॥
సతీ నామా భవత్తస్యా స్సర్వమంగలదం సదా ।
సతీ సా వై దక్ష కన్యా భూత్వా రుద్రప్రియాఽ భవత్ ॥
పితుర్యజ్ఞే తథా ప్రాప్యానాదరం శంకరస్య చ ।
తం దృష్ట్వా కోపమాధాయాత్యాక్షీద్దేహం చ సా సతీ ॥
పునస్సైవ సముత్పన్నా తవ గేహేఽ మ్బికా శివా ।
పార్వతీ హరపత్నీయం భవిష్యతి న సంశయః ॥

నారదుడిట్లు పలికెను -

ఓ పర్వతరాజా! మహాత్మా! నీవు చింతిల్లకుము. నీ కుమార్తె యగు ఈ కాళియే పూర్వము దక్ష పుత్రియై జన్మించెను (45). సర్వకాలములలో సర్వమంగళములనిచ్చే సతియను పేర ఆమె అపుడు ప్రసిద్ధిగాంచెను. ఆ సతి దక్ష పుత్రియై రుద్రునకు పత్ని ఆయెను (46). ఆ సతి తండ్రి చేసిన యజ్ఞములో శంకరునకు అనాదరము జరుగుటను గాంచి కోపమును చెంది దేహమును త్యజించెను (47). జగన్మాతయగు ఆ శివాదేవియే మరల నీ గృహములో జన్మించినది. ఈ పార్వతి శివుని పత్ని యగుననుటలో సందేహము

లేదు (48).

ఏతత్సర్వం విస్తరాత్త్వం ప్రోక్తవాన్ భూభృతే మునే ।
పూర్వరూపం చరిత్రం చ పార్వత్యాః ప్రీతి వర్ధనమ్ ॥
తం సర్వం పూర్వవృత్తాంతం కాల్యా మునిముఖాద్గిరిః ।
శ్రుత్వా సపుత్ర దారస్స తదా నిస్సంశయోఽ భవత్ ॥
తతః కాలీ కథాం శ్రుత్వా నారదస్య ముఖాత్తదా ।
లజ్జయాధోముఖీ భూత్వా స్మితవిస్ఫారితాననా ॥
కరేణ తాం తు సంస్పృశ్య శ్రుత్వా తచ్చరితం గిరిః ।
మూర్ధ్ని శశ్వత్తథాఘ్రాయ స్వాసనాన్తే న్యవేశయత్ ॥

ఓ మహర్షీ! నీవు ఈ వృత్తాంతమునంతనూ ఆ పర్వత రాజునకు చెప్పితివి. నీవు చెప్పి◌ిన ఆ పూర్వ చరిత్ర పార్వతికి మహానందమును కలిగించెను (49). హిమవంతుడు, ఆయన భార్య, కుమారులు మహర్షి ముఖము నుండి కాళిక యొక్క ఆ పూర్వ వృత్తాంతము నంతయూ విని, సంశయములను వీడిరి (50). అపుడు నారదుని ముఖము నుండి ఆ గాథను విని కాళిక సిగ్గుతో తలను వంచుకొనెను. ఆమె ముఖము చిరునవ్వుతో విప్పారెను (5 1). ఆ చరిత్రను విని హిమవంతుడు ఆమెను చేతితో స్పృశించి, శిరస్సు పై ముద్దాడి తన ఆసన సమీపములో కూర్చుండబెట్టు కొనెను (52).

తతస్త్వం తాం పునర్దృష్ట్వాఽవోచస్తత్ర స్థితాం మునే ।
హర్షయన్ గిరిరాజం చ మేనకాం తనయైః స్పృహా ॥
సింహాసనం తు కింత్వస్యా శ్శైలరాజ భవేదతః ।
శంభో రూరౌ సదైతస్యా ఆసనం తు భవిష్యతి ॥
హరేరూర్వాసనం ప్రాప్య తనయా తవ సంతతమ్ ।
న యత్ర కస్యాపి దృష్టిర్మానసం వా గమిష్యతి ॥

ఓ మహర్షీ! అచటనున్న ఆమెను చూచి నీవు మరల ఇట్లు పలికితివి. నీ పలుకులు హిమవంతునకు, మేనకు, వారి కుమారులకు ఆనందమును కలిగించినవి (53). ఓ పర్వతరాజా! ఈ పైన ఈమె యొక్క సింహాసనము సర్వదా శివుని ఊరువులు కాగలవు (54). నీ కుమార్తె శివుని ఊరువులు అనే ఆసనమును సర్వకాలముల యందు పొంది, ఎవ్వరి దృష్టికి గాని, మనస్సునకైననూ గాని గోచరము గాని స్థానమును పొందగలదు

బ్రహ్మోవాచ ।

ఇతి వచనముదారం నారద త్వం గిరీశం త్రిదివమగమ ఉక్త్వా తత్క్షణాదేవ ప్రీత్యా।
గిరిపతిరపి చిత్తే చారు సమ్మోద యుక్తః స్వ గృహమగమదేవం సర్వసంపత్సమృద్ధమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే నారద హిమాలయ సంవాదవర్ణనం నామాష్టమోఽధ్యాయః (8).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ నారదా! నీవు ఈ విధముగా పర్వత రాజుతో ఉదారమగు వచనములను పలికి వెంటనే ఆనందముతో స్వర్గమునకు వెళ్లి యుంటివి. ఆ హిమవంతుడు ఆనందముతో నిండిన హృదము గలవాడై సర్వ సంపదలతో నలరారు తన గృహమునకు వెళ్లెను (56).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో నారద హిమాలయ సంవాద వర్ణనమనే ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (8).

శ్రీ శివమహా పురాణము

9 – రుద్రసంహిత – పార్వతీ ఖండః – –

పార్వతి స్వప్నము

నారద ఉవాచః

విధే తాత త్వయా శైవవర ప్రాజ్ఞాద్భుతా కథా ।
వర్ణితా కరుణాం కృత్వా ప్రీతిర్మే వర్ధితాధికమ్ ॥
విధే గతే స్వకం ధామ మయి వై దివ్య దర్శనే ।
తతః కిమభవత్తాత కృపయా తద్వదాధునా ॥

నారదుడిట్లు పలికెను –

తండ్రీ! విధీ! నీవు శివభక్తాగ్రేసురుడవు. ప్రాజ్ఞుడవు. అద్భుత మగు గాథను వర్ణించితివి. నా యందు దయను చూపితివి. నాకు అధికమగు ఆనందము వర్ధిల్లినది (1). హే విధీ! దివ్య దర్శుడనగు నేను నా స్థానమునకు మరలి పోయిన తరువాత ఏమయ్యెను? తండ్రీ! దయతో నాకా వృత్తాంతమును ఇప్పుడు చెప్పుము (2).

బ్రహ్మోవాచ ।

గతే త్వయి మునే స్వర్గే కియత్కాలే గతే సతి ।
మేనా ప్రాప్యైకదా శైలనికటం ప్రణనామ సా ॥
స్థిత్వా సవినయం ప్రాహ స్వనాథం గిరికామినీ ।
తత్ర శైలాధినాథం సా ప్రాణప్రియసుతా సతీ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! నీవు స్వర్గమునకు వెళ్లిన పిదప, కొంతకాలము గడిచిన తరువాత, ఒకనాడు మేన హిమవంతుని సమీపమునకు వచ్చి నమస్కరించెను (3). ఆ హిమ వంతుని ప్రియురాలు ప్రాణముల కంటే అధికమగు ప్రేమ కుమార్తె యందు కలిగి యున్నదై, తన భార్త యగు పర్వత రాజుతో వినయ పూర్వకముగా నిట్లనెను (4).

మేనోవాచ।

ముని వాక్యం న మే బుద్ధం సమ్యక్ నారీ స్వభావతః ।
వివాహం కురు కన్యాయాస్సుందరేణ వరేణ హ ॥
సర్వథా హి భవేత్త త్రోద్వాహోఽపూర్వ సుఖావహః ।
వరశ్చ గిరిజాయాస్తు సులక్షణ కులోద్భవః ॥
ప్రాణప్రియా సుతా మే హి సుఖితా స్యాద్యథా ప్రియ ।
సద్వరం ప్రాప్య సుప్రీతా తథా కురు నమోఽస్తు తే ॥

మేన ఇట్లు పలికెను -

స్త్రీ స్వభావము వలన నాకు మహర్షి వాక్యము సరిగా తెలియలేదు. నీవు మన కుమార్తెకు సుందరుడగు వరునితో వివాహమును చేయుము (5). ఈ వివాహము అన్నివిధములుగా అపూర్వమగు సుఖమును కలిగించునది కావలెను. పార్వతికి మంచి లక్షణములు కలిగి మంచి కులములో పుట్టిన వాడు వరుడు కావలెను (6). హే ప్రియా! నాకు ప్రాణములతో సమముగా ప్రియమగు నా కుమార్తె సుఖమును పొందవలెను. ఆమె మంచి భర్తను పొంది మిక్కిలి ఆనందమును పొందువిధముగా చేయుము. నీకు నమస్కారము (7).

బ్రహ్మో వాచ।

ఇత్యుక్త్వాశ్రుముఖీ మేనా పత్యుం ప్యోః పతితా తదా ।
తాముత్థాప్య గిరిః ప్రాహ యథావ త్ప్రాజ్ఞ సత్తమః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను-

అపుడు మేన ఇట్లు పలికి కన్నుల నీరు స్రవించుచుండగా భర్త పాదములపై పడెను. ప్రాజ్ఞులలో శ్రేష్ఠుడగు హిమవంతుడు ఆమెను పైకి లేవదీసి యోగ్యమగు తీరులో నిట్లు పలికెను (8).

హిమాలయ ఉవాచః

శృణు త్వం మేనకే దేవి యథార్థం వచ్మి తత్త్వతః ।
భ్రమం త్యజమునే ర్వాక్యం వితథం న కదాచన ॥
యది స్నేహస్సుతాయాస్తే సుతాం శిక్షయ సాదరమ్ ।
తపః కుర్యాచ్ఛంకరస్య సా భక్త్యా స్థిరచేతసా ॥
చేత్ప్రసన్నశ్శివః కాల్యాః పాణిం గృహ్ణాతి మేనకే ।
సర్వం భూయాచ్ఛుభం నశ్యేన్నారదోక్త మమంగలమ్ ॥
అమంగలాని సర్వాణి మంగలాని సదాశివే ।
తస్మాత్సుతాం శివ ప్రాప్త్యై తపసే శిక్షయ ద్రుతమ్ ॥

హిమవంతుడిట్లనెను -

ఓ దేవీ! మేనా! నేను విమర్శించి యథార్థమును చెప్పుచున్నాను. నీవు వినుము. భ్రమను విడిచి పెట్టుము. మహర్షి వాక్యము ఎన్నటికీ పొల్లు గాదు (9). నీకు అమ్మాయిపై ప్రేమ గలదు గాన, నీవామెకు శ్రద్ధగా శిక్షణ నిమ్ము. ఆమె స్థిరమగు మనస్సుతో భక్తితో శంకరుని అనుగ్రహము కొరకై తపమాచరించవలెను (10). ఓ మేనా! శివుడు ప్రసన్ను డైనచో, కాళికను వివాహ మాడ గలడు. సర్వము సుసంపన్న మగును. నారదుడు చెప్పిన అమంగళము మటుమాయ మగును (11). అమంగళము లన్నియూ సదా శివుని యందు మంగళములుగా మారును. కావున నీవు వెంటనే అమ్మాయి తపస్సు చేసి శివుని పొందు విధముగా శిక్షణ నిమ్ము (12).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య గిరేర్వాక్యం మేనా ప్రీతతరాఽభవత్ ।
సుతోప కంఠమగ మదుపదేష్టుం తపోరుచిమ్ ॥
సుతాంగం సుకుమారం హి దృష్ట్వాతీవాథ మేనకా ।
వివ్యథే నేత్రయుగ్మే చాశ్రుపూరేఽభవతాం ద్రుతమ్ ॥
సుతాం సముపదేష్టుం తన్న శశాక గిరి ప్రియా ।
బుబుధే పార్వతీ తద్వై జననీంగీతమాశు సా ॥
అథ సా కాలికా దేవీ సర్వజ్ఞా పరమేశ్వరీ ।
ఉవాచ జననీం సద్యస్సమాశ్వాస్య పునః పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

హిమవంతుని ఈ వాక్యమును విని మేన మిక్కిలి సంతసిల్లెను. ఆమె కుమార్తెకు ఉపదేశించి తపస్సు నందు అభిరుచి కలుగ జేయుట కొరకై ఆమె వద్దకు వెళ్లెను (13). సుకుమారమగు కుమార్తె దేహమును చూచి మేన మిక్కిలి దుఃఖించెను. వెను వెంటనే ఆమె కన్నులు నీటితో నిండెను (14). హిమవంతుని ప్రియరాలగు మేన తన అభిప్రాయమును కుమార్తెతో చెప్పలేక పోయెను. కాని ఆ పార్వతి తల్లి యొక్క అభిప్రాయమును శీఘ్రముగా కనిపెట్ట గల్గెను (15). సర్వజ్ఞురాలు, పరమేశ్వరి యగు ఆ కాలికా దేవి అపుడు వెంటనే తల్లిని అనేక పర్యాయములు ఓదార్చి ఇట్లు పలికెను (16).

పార్వత్యువాచ ।

మాత శ్శృణు మహాప్రాజ్ఞేశ ఒద్యతనేఽ జముహూర్తకే ।
రాత్రౌ దృష్టో మయా స్వప్నస్తం వదామి కృపాం కురు ॥
విప్రశ్చైవ తపస్వీ మాం సదయః ప్రీతి పూర్వకమ్ ।
ఉపాదిదేశ సుతపః కర్తుం మాత శ్శివస్య వై ॥

పార్వతి ఇట్లు పలికెను –

తల్లీ! నా మాటను వినుము. నీవు మహా ప్రాజ్ఞురాలవు. నిన్న తెల్లవారు జామున బ్రాహ్మ ముహూర్తము నందు నేను స్వప్నమును గాంచితిని. దానిని చెప్పెదను. దయచేసి వినుము (17). తల్లీ! తపస్వి యగు ఒక విప్రుడు నా యందు

దయ గలవాడై ప్రీతి పూర్వకముగా నన్ను శివుని గురించి మంచి తపస్సును చేయుమని ఉపదేశించెను (18).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా మేనకా శీఘ్రం పతిమాహూయ తత్ర చ ।
తత్స్వప్నం కథయామాస సుతాదృష్ట మశేషతః ॥
సుతాస్వప్న మథాకర్ణ్య మేనకాతో గిరీశ్వరః ।
ఉవాచ పరమప్రీత: ప్రియాం సంబోధయన్ గిరా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మాటను విన్న వెంటనే మేనక భర్తను అచటకు పిలచి కుమార్తె చూచిన స్వప్నమును సమగ్రముగా తెలుపుడు జేసెను (19). అపుడా హిమవంతుడు కుమార్తె యొక్క స్వప్నమును మేనక చెప్పగా విని మిక్కిలి సంతసించి, ప్రియురాలగు మేనకను సంబోధించి ఇట్లు పలికెను (20).

గిరీశ్వర ఉవాచ ।

హే ప్రియేఽపర రాత్రాంతే స్వప్నో దృష్టో మయాపి హి ।
తం శృణు త్వం మహాప్రీత్యా వచ్మ్యహం తం సమాదరాత్ ॥
ఏకస్తపస్వీ పరమో నారదోక్త వరాంగ ధృక్ ।
పురోపకంఠం సుప్రీత్యా తపః కర్తుం సమాగతః ॥
గృహీత్వా స్వసుతాం తత్రాగమం ప్రీతతరోఽప్యహమ్ ।
మయా జ్ఞాతస్సవై శంభుర్నారదోక్త వరః ప్రభుః ॥

హిమవంతుడిట్లు పలికెను -

హే ప్రియే! నేను కూడా తెల్లవారు జామున ఒక స్వప్నమును చూచితిని. నేను దానిని గురించి శ్రద్ధగా చెప్పెదను. నీవు గొప్ప ప్రీతితో దానిని వినుము (21). నారదుడు వర్ణించిన తీరున శ్రేష్ఠమగు అవయవములు గల ఒక గొప్ప తపశ్శాలి తపస్సును చేయుటకొరకై ఆనందముతో మన నగర సమీపమునకు విచ్చేసినాడు (22). నేను కూడ మిక్కిలి సంతసించి మన అమ్మాయిని వెంటబెడుకొని అచటకు వెళ్లితిని. నారదుడు చెప్పిన వరుడగు శంభు ప్రభుడు ఆతడేనని నాకు తెలిసినది (23).

సేవార్థం తస్య తనయా ముపదిశ్య తపస్వినః ।
తం వై ప్రార్థితవాంస్తస్యాం న తదాంగీ చకార సః ॥
అభూద్వివాదస్సుమహాన్ సాంఖ్య వేదాంత సమ్మతః ।
తతస్తదాజ్ఞయా తత్ర సంస్థితా సీత్సుతామమ ॥
నిధాయ హృది తం కామం సిషేవే భక్తితశ్చ సా ।
ఇతి దృష్టం మయా స్వప్నం ప్రోక్త వాంస్తే వరాననే ॥

తతో మేనే కియత్కాలం పరీక్ష్యం తత్ఫలం ప్రియే ।

యోగ్యమస్తీద మేవేహా బుధ్యస్వ త్వం మమ ధ్రువమ్ ॥

నేను అమ్మాయికి ఆ తపశ్శాలిని సేవించుమని ఉపదేశించి, ఆమె సేవను స్వీ◌ీకరించుమని ఆయనను వేడుకొనగా, ఆయన అప్పుడు అంగీకరించలేదు (24). అపుడు సాంఖ్యులు, వేదాంతులు మెచ్చు కొనదగిన గొప్ప వివాదము చెలరేగెను. తరువాత ఆయన అనుమతిని పొంది మన అమ్మాయి అచటనే ఉండెను (25). ఆమె శివుని భర్తగా పొందవలెననే కోరికను మనసులో నిడుకొని భక్తితో ఆయనను సేవించెను. ఓ సుందరీ! నేను చూసిన స్వప్నము ఇది. నీకు వివరించి చెప్పితిని (26). ఓ ప్రియురాలా! మేనా! కావున ఆ స్వప్నము యొక్క ఫలమును మనము కొంతకాలము వరకు వేచి యుండి పరీక్షించ వలెను. ఈ విషయములో ఇదియే యోగ్యమైన కర్తవ్యమని నా అభిప్రాయము. నీవీ విషయమును నిశ్చయముగా తెలియుము (27).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా గిరిరాజశ్చ మేనకా వై మునీశ్వర ।

సంతస్థతుః పరీక్షంతౌ తత్ఫలం శుద్ధచేతసా ॥

ఇష్టం వ్యతీతేఽల్పదినే పరమేశస్సతాం గతిః ।

సతీ విరహసువ్యగ్రో భ్రమన్ సర్వత్ర సూతికృత్ ॥

తత్రాజగామ సుప్రీత్యా కియద్గణ యుతః ప్రభుః ।

తపః కర్తుం సతీ ప్రేమ విరహాకుల మానసః ॥

తపశ్చకార స్వం తత్ర పార్వతీ సేవనే రతా ।

సఖీభ్యాం సహితా నిత్యం ప్రసన్నార్ధ మభూత్తదా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! ఇట్లు పలికి ఆ పర్వతరాజు, మరియు మేనా దేవి శుద్ధమగు మనస్సు గలవా◌ారై ఆ స్వప్న ఫలమును పరీక్షించుచూ నుండిరి (28). ఇట్లు కొద్ది రోజులు గడిచెను. ఇంతలో సత్పురుషులకు శరణ్యుడు, సర్వసృష్టికి కారణుడు అగు పరమేశ్వరుడు సతీ వియోగముచే మిక్కిలి దుఃఖితుడై అంతటా తిరుగాడు చుండెను (29). సతి యందలి ప్రేమతో, విరహ దుఃఖముతో కల్లోలితమగు మనస్సు గల ఆ ప్రభువు కొద్ది గణములతో గూడి ప్రీతితో తపస్సును చేయుట కొరకై అచటకు విచ్చేసెను (30). ఆయన అచట తన దారిన తాను తపస్సు చేసుకొను చుండెను. అపుడు ఆయన అనుగ్రహమును కోరు పార్వతి ఇద్దరు సఖురాండ్రతో గూడి నిత్యము ఆయనను సేవించుట యందు నిమగ్నురాలయ్యెను (31).

విద్ధోఽపి మార్గణై శ్శంభుర్వికృతిం నాప ప్రభుః ।

ప్రేషితేన సురైస్స్వాత్మ మోహనార్థం స్మరేణ వై ॥

దగ్ధ్వా స్మరం చ తత్రైవ స్వవహ్నినయనేన సః ।

స్మృత్వా మమ వచః క్రుద్ధో మహ్యామంతర్దధే తతః ॥

తతః కాలేన మహతా వినాశ్య గిరిజామదమ్ ।

ప్రసాదితస్సు తపసా ప్రసన్నోఽ భూన్మహేశ్వరః ॥

దేవతలచే ఆయనను మోహింప జేయుట కొరకై పంపబడిన మన్మథునిచే బాణములతో కొట్టబడిననూ ఆ శంభుప్రభుడు వికారమును పొందలేదు (32). ఆయన అచటనే తన కంటినుండి బయల్వెడలిన మంటలలో ఆ మన్మథుని దగ్ధము చేసెను. ఆయన నా మాటలను స్మరించి కోపించినవాడై అచట నుండి అంతర్హితుడాయెను (33). తరువాత చాల కాలము పిదప, పార్వతీ దేవి యొక్క గర్వము నడంచిన ఆ మహేశ్వరుడు ఆమె యొక్క ఘోర తపస్సునకు ప్రసన్నుడాయెను (34).

లౌకికాచారమాశ్రిత్య రుద్రో విష్ణు ప్రసాదితః ।

కాలీం వివాహయామాస తతోఽ భూద్బహు మంగలమ్ ॥

ఇత్యేతత్కథితం తాత సమాసా చ్చరితం విభోః ।

శంకరస్య పరం దివ్యం కిం భూయ శ్రోతుమిచ్ఛసి ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే స్వప్న వర్ణనం నామ నవమోఽధ్యాయః (9).

తరువాత విష్ణువుచే ప్రార్థింపబడిన రుద్రుడు లోకాచారము ననుసరించి కాలికా దేవిని వివాహమాడెను. అపుడు అనేక మంగళములు సంపన్నమాయెను (35). వత్సా! నీకు ఆ శంకరవిభుని గొప్ప దివ్య చరితమును సంగ్రహముగా చెప్పి యుంటిని. మరల ఏమి వినగోరుచున్నావు?

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో స్వప్న వర్ణన మను తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (9).

10 - కుజ గ్రహోత్పత్తి

నారద ఉవాచ।

విష్ణు శిష్య మహాభాగ విధే శైవవర ప్రభో ।
శివలీలామిమాం వ్యాసా త్ప్రీత్యా మే వక్తుమర్హసి ॥
సతీవిరహయుక్ శంభుః కిం చక్రే చరితం తథా ।
తపః కుర్తుం కదాయాతో హిమవత్ప్రస్థ ముత్తమమ్ ॥
శివా శివవివాదోఽ భూత్కథం కామక్షయశ్చ మే ।
తపః కృత్వా కథం ప్రాప శివం శంభుం చ పార్వతీ ॥
తత్సర్వమపరం చాపి శివసచ్చరితం పరమ్ ।
వక్తుమర్హసి మే బ్రహ్మన్ మహానందకరం శుభమ్ ॥

నారదుడిట్లు పలికెను -

ఓ విష్ణు శిష్యా! మహాత్మా! విధీ! ప్రభూ! నీవు శివ భక్తులలో శ్రేష్ఠుడవు. ఈ శివలీలను నాకు సంగ్రహముగా ప్రీతితో నీవు చెప్పదగుదువు (1). సతీ విరహముతో కూడి యున్న శివుడు ఏమి చేసెను? శివుడు తపస్సును చేయుటకై హిమవత్పర్వతాగ్ర భాగమునకు ఎప్పుడు వచ్చెను? ఆ చరితమును చెప్పుము (2). శివాశివులకు మధ్య జరిగిన సంభాషణ ఎట్టిది? మన్మథుడు నశించిన తీరు ఏది? పార్వతి తపస్సును చేసి మంగళ స్వరూపుడగు శివుని పొందిన విధమెట్టిది? (3) ఓ బ్రహ్మా! ఈ వృత్తాంతమునంతనూ చెప్పి, ఇతరమగు శివచరితమును కూడ నీవు చెప్పదగుదువు. ఈ శుభ చరితము నాకు మహానందమును కలిగించుచున్నది (4).

సూత ఉవాచః

ఇతి శ్రుత్వా నారదస్య ప్రశ్నం లోకాధిపోత్తమః ।
విధిః ప్రోవాచ సుప్రీత్యా స్మృత్వా శివపదాంబుజమ్ ॥

సూతుడిట్లు పలికెను -

నారదుని ఈ ప్రశ్నను విని, లోకపాలురందరిలో శ్రేష్ఠుడగు బ్రహ్మ శివుని పాదపద్మములను స్మరించి మిక్కిలి ప్రీతితో ఇట్లనెను (5).

బ్రహ్మోవాచ।

దేవర్షే శైవవర్యాద్య తద్యశశ్శృణు చాదరాత్ ।
పావనం మంగలకరం భక్తి వర్ధన ముత్తమమ్ ॥
ఆగత్య స్వగిరిం శంభుః ప్రియా విరహకాతరః ।
సస్మార స్వప్రియాం దేవీం సతీం ప్రాణాధికాం హృదా ॥
గణానా భాష్య శోచంస్తాం తద్గుణాన్ ప్రేమవర్ధనాన్ ।
వర్ణయామాస సుప్రీత్యా దర్శయన్ లౌకికీం గతిమ్ ॥

దిగంబరో బభూవాథ త్యక్త్వా గార్హస్థ్య సద్గతిమ్ ।
పునర్బ భ్రామ లోకాన్ వై సర్వాన్ లీలా విశారదః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ దేవర్షి! నీవు శివభక్తులలో శ్రేష్ఠుడవు. పవిత్రము చేయునది, మంగళము లనిచ్చునది, భక్తిని పెంచునది అగు శివుని ఉత్తమకీర్తిని ఇపుడు శ్రద్ధగా వినుము (6). ప్రియురాలి వియోగముచే దుఃఖితుడై యున్న శంభుడు తన నివాసమగు కైలాసమునకు తిరిగి వచ్చి, ప్రాణముల కంటె అధికముగా తనకు ప్రియురాలైన సతీదేవిని మనస్సులో స్మరించెను (7). ఆయన లోకపు పోకడను అనుకరించువాడై గణములను పిలిచి వారి యెదుట ప్రేమను పెంపొందించు ఆమె గుణములను మిక్కిలి ప్రీతితో వర్ణించెను(8). లీలా పండితుడగు ఆ శివుడు సద్గతినిచ్చు గృహస్థాశ్రమమును విడిచి పెట్టి దిగంబరుడై లోకములనన్నిటినీ తిరుగాడెను (9).

దర్శనమ ప్రాప్య కుత్రాపి సతీవిరహ దుఃఖితః ।
పునశ్చ గిరిమాయాత శ్శంకరో భక్త శంకరః ॥
సమాధాయ మనో యత్నా త్సమాధిం దుఃఖనాశనమ్ ।
చకార చ దదర్శాసౌ స్వరూపం నిజమవ్యయమ్ ॥
ఇత్థం చిరతరం స్థాణుస్తస్థౌ ధ్వస్త గుణత్రయః ।
నిర్వికారీ పరం బ్రహ్మ మాయాధీశస్స్వయం ప్రభుః ॥
తతస్సమాధిం తత్యాజ వ్యతీయ హ్యమితాస్సమాః ।
యదా తదా బభూవాశు చరితం తద్వదామి వః ॥

భక్తులకు మంగళమునిచ్చు ఆ శంకరుడు సతీ వియోగముచే దుఃఖితుడై ఆమెను ఎక్కకడనూ గాన జాలక కైలాస పర్వతమునకు తిరిగి వచ్చెను (10). ఆయన ప్రయత్న పూర్వకముగా మనస్సును నిగ్రహించి దుఃఖ నాశకమగు సమాధిని పొంది నాశ రహితమగు ఆత్మ స్వరూపమును దర్శించు చుండెను (11). మూడు గుణములకు అతీతమైన వాడు, వికారములు లేనివాడు, పరబ్రహ్మ స్వరూపుడు, మాయను వశము చేసుకున్నవాడు అగు ఆ శివప్రభుడు ఈ తీరున చిరకాలము సమాధియందుండెను (12). ఆయన అనేక సంవత్సరములు ఇట్లు గడిపి తరువాత సమాధి నుండి బయటకు వచ్చెను. అపుడు జరిగిన వృత్తాంతమును మీకు చెప్పెదను (13).

ప్రభోర్లలాట దేశాత్తు యత్ పృషచ్ఛ్రమ సంభవమ్ ।
పపాత ధరణౌ తత్ర స బభూవ శిశుర్ద్రుతమ్ ॥
చతుర్భుజోఽరుణాకారో రమణీయా కృతిర్మునే ।
అలౌకిక ద్యుతి శ్రమాన్ తేజస్వీ పరదుస్సహః ॥
రురోద స శిశుస్తస్య పురో హి పరమేశితుః ।
ప్రాకృతాత్మ జవత్తత్ర భవాచార రతస్య హి ॥

తదా విచార్య సుధియా ధృత్వా సుస్త్రీ తనుం క్షితిః ।

ఆవిర్బ భూవ తత్రైవ భయమానీయ శంకరాత్ ॥

ఆ ప్రభుని లలాట భాగమునుండి శ్రమ వలన చెమట పుట్టి నేలపై బడగా, అది వెం◌ంటనే ఒక శిశువాయెను (14). ఓ మహర్షీ! ఆ శిశువు నాలు భుజములతో, అరుణ వర్ణముతో, సుందరమగు ఆకారముతో, దివ్యకాంతులీనుచూ, శోభాయుక్తమై, ఇతరులు చూడ శక్యముకాని తేజస్సుతో వెలుగొందెను (15). అపుడా శిశువు పరమేశ్వరుని యెదుట ఏడ్చెను. లోకాచార పరాయణుడగు శివుని యెదుట ఆ శిశువు ఇతర శిశువుల వలె ఏడ్చెను (16). అపుడా భూదేవి శంకరునకు భయపడి మంచి బుద్ధితో ఆలోచించి సుందర స్త్రీ రూపమును ధరించి అచట సాక్షాత్కరించెను (17).

తం బాలం ద్రుతముత్థాప్య క్రోడాయాం నిదధే వరమ్ ।

స్తన్యం సాపాయయత్ప్రీత్యా దుగ్ధం స్వోపరి సంభవమ్ ॥

చుచుంబ తన్ముఖం స్నేహాత్ మత్వాఽ క్రీడయదాత్మజమ్ ।

సత్యభావాత్స్వయం మాతా పరమేశ హితావహా ॥

తద్దృష్ట్వా చరితం శంభుః కౌతుకీ సూతికృత్స్మృతీ ।

అంతర్యామీ విహస్యాథోవాచ జ్ఞాత్వా రసాం హరః ॥

ధన్యా త్వం ధరణి ప్రీత్యా పాలయైతం సుతం మమ ।

త్వయ్యుద్భూతం శ్రమ జలాన్మ హాతేజస్వినో వరమ్ ॥

ఆ భూదేవి ఆ శ్రేష్ఠ బాలకుని వెంటనే లేవదీసి ఒడిలో కూర్చుండ బెట్టుకొని, తన ఉపరితలముపై లభించు పాలను స్తన్యరూపములో ఆ బాలునకు ప్రేమతో త్రాగించెను (18). సతీదేవి లేకుండుటచే ఆమె బాలుని తన కుమారునిగా భావించి, ఆ బాలుని ముఖమును ప్రేమతో ముద్దాడెను. ఆమె తల్లియగుట పరమేశ్వరునకు ఆనందమును కలిగించెను (19). కృతార్థుడు, జగత్కర్త, అంతర్యామి, పాపహరుడు అగు శంభుడు భూదేవిని గుర్తు పట్టి, ఆమె యొక్క ఆ ప్రవృత్తిని గాంచి చిరునవ్వుతో నిట్లనెను (20). ఓ భూదేవీ! నీవు ధన్యురాలవు. మహాతేజశ్శాలియగు నా యొక్క చెమట నీపై పడగా పుట్టిన ఈ నా శ్రేష్ఠుడగు పుత్రుని ప్రేమతో పెంచుము (21).

మమ శ్రమక భూర్వాలో యద్యపి ప్రియకృత్ క్షితే ।

త్వన్నామ్నా స్యా ద్భవేత్ ఖ్యాత స్త్రీతా పరహితస్సదా ॥

అసౌ బాలః కుదాతా హి భవిష్యతి గుణీ తవ ।

మమాపి సుఖదాతా హి గృహాణైనం యథారుచి ॥

ఇత్యుక్త్వా విరరామాథ కించి ద్విరహముక్తధీః ।

లోకాచారకరో రుద్రో నిర్వికారీ సతాం ప్రియః ॥

అపి క్షితిర్జగామాశు శివాజ్ఞా మధి గమ్య సా ।

స్వస్థానం ససుతా ప్రాప సుఖమాత్యంతికం చ వై ॥



ఓ భూదేవీ! ఈ ప్రీతికరుడగు బాలుడు నా శ్రమజలమునుండి పుట్టిన వాడే అయినా, నిత్యము మూడు విధముల (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక) తాపములు లేని ఈ బాలుడు నీ పేరుతో ప్రసిద్ధిని గాంచుగలడు (22). ఈ నీ కుమారుడు భూమిని దానము చేయు గుణవంతుడు కాగలడు. నాకు కూడా ఈతడు సుఖమును కలిగించగలడు. ఈ బాలుని ప్రేమతో స్వీకరించుము (23). విరహ దుఃఖమునుండి కొద్ది ముక్తిని పొందిన మనస్సు గల ఆ రుద్రుడు లోకాచారమును ప్రవర్తిల్ల జేయుచూ ఇట్లు పలికి మిన్నకుండెను. సత్పురుషులకు ప్రీతి పాత్రుడగు శంభుడు వికారములు లేని వాడు గదా! (24). ఆ భూదేవి కూడా వెను వెంటనే శివుని ఆనతిని పొంది కుమారుని దోడ్కొని తన స్థానమునకు వెళ్లి బ్రహ్మానందమును పొందెను (25).

స బాలో భౌమ ఇత్యాఖ్యాం ప్రాప్య భూత్వా యువా ద్రుతమ్ ।

తస్యాం కాశ్యాం చిరం కాలం సిషేవే శంకరం ప్రభుమ్ ॥

విశ్వేశ్వర ప్రసాదేన గ్రహత్వం ప్రాప్య భూమిజః ।

దివ్యం లోకం జగామాశు శుక్రలో కాత్పరం వరమ్ ॥

ఇత్యుక్తం శంభు చరితం సతీవిరహ సంయుతమ్ ।

తపస్యా చరణం శంభోశ్శృణు చాదరతో మునే ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

భౌమోత్పత్తి వర్ణనం నామ దశమోఽధ్యాయః(10).

ఆ బాలుడు భౌముడు (కుజుడు) అని పేరు గాంచి శీఘ్రముగా పెరిగి యువకు డయ్యెను. ఆతడు కాశీనగరములో చిరకాలము శంకర ప్రభుని సేవించెను (26). ఆ కుజుడు విశ్వేశ్వరుని అనుగ్రహముచే గ్రహత్వమును పొంది, శుక్రలో కము కంటే శ్రేష్ఠమగు దివ్యలోకమును శీఘ్రమే పొందెను (27). సతీ వియోగముతో నున్న శంభుని చరితమును నీకీ తీరున వర్ణించితిని. ఓ మహర్షీ! శంభుని తపశ్చరణమును గూర్చి చెప్పెదను. శ్రద్ధతో వినుము (28).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు పార్వతీ ఖండములో భౌముని పుట్టుక అను పదవ అధ్యాయము ముగిసినది (10).

11 – హిమవంతునితో శివుని సమాగమము

బ్రహ్మోవాచ ।

వర్ధమానా గిరేః పుత్రీ సా శక్తిర్లోక పూజితా ।
అష్ట వర్షా యదా జాతా హిమాలయ గృహే సతీ ॥
తజ్జన్మ గిరిశో జ్ఞాత్వా సతీ విరహకాతరః ।
కృత్వా తామద్భుతా మంతర్ముమోదాతీవ నారద ॥
తస్మిన్నేవాంతరే శంభుర్లౌకికీం గతిమాశ్రితః ।
సమాధాతుం మనస్సమ్యక్తపః కర్తుం సమైచ్ఛత ॥
కాంశ్చిద్గణ వరాన్ శాంతాన్నంద్యా దీనవగృహ్యా చ ।
గంగావతార మగమత్ హిమవత్ప్రస్థ ముత్తమమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

లోకములచే పూజింపబడే ఆ శక్తి హిమవంతుని పుత్రికయై ఆయన గృహములో పెరిగి ఎనిమిది సంవత్సరముల వయస్సు గలది ఆయెను (1). ఓ నారదా! సతీ వియోగ దుఃఖితుడైన శివుడు ఆమె జన్మించిన వృత్తాంతము నెరింగి అద్భుతమగు ఆమె మూర్తిని తన హృదయములో ధ్యానించి మిక్కిలి ఆనందించెను (2). అదే సమయములో లోకాచారము ననుసరించి శంభుడు మనస్సును నియంత్రించి గొప్ప తపస్సును చేయగోరెను (3). ఆయన నంది మొదలగు శాంతస్వభావము గల కొందరు గణములు వెంటరాగా ఉత్తమమగు. హిమవత్పర్వత శిఖరము నందున్న గంగావతార క్షేత్రమును చేరుకొనెను (4).

యత్ర గంగా నిపతితా పురా బ్రహ్మ పురాత్స్రుతా ।
సర్వాఘౌఘ వినాశాయ పావనీ పరమా మునే ॥
తపః ప్రారంభమకరోత్ స్థిత్వా తత్ర వశీ హరః ।
ఏకాగ్రం చింతయామాస స్వమాత్మాన మతంద్రితః ॥
చేతో జ్ఞానభవం నిత్యం జ్యోతీ రూపం నిరామయమ్ ।
జగన్మయం చిదానందం ద్వైతహీనం నిరాశ్రయమ్ ॥
హరే ధ్యానపరే తస్మిన్ ప్రమథా ధ్యానతత్పరాః ।
అభవన్ కేచిదపరే నంది భృంగ్యాదయో గణాః ॥

ఓ మహర్షీ! పరమ పావనియగు గంగ సర్వుల పాపసమూహములను నశింప చేయుట కొరకై పూర్వము బ్రహ్మ పురము నుండి జారి ఇచట పడినది (5). జితేంద్రియుడగు శివుడు అచట నుండి తపము నారంభించెను. ఆయన అలసట ఎరుంగని వాడై ఆత్మ స్వరూపమును ఏకాగ్రతతో ధ్యానించెను (6). నిత్యము, జ్యోతిస్స్వరూపము, నిర్దోషము, చిదానందఘనము, అద్వయము, సర్వాశ్రయము అగు ఆత్మ మనస్సులో అఖండ ధీరూపముగా గోచరించును. ఆత్మయే

జగద్రూపముగా పరిణమించినది (7). శివుడు ధ్యానములో నిమగ్నుడై యుండగా, నంది, భృంగి మొదలగు కొందరు ప్రమథ గణములు కూడా ధ్యానమును చేయ మొదలిడిరి (8).

సేవాం చక్రుస్తదా కేచిద్గణాశ్శంభోః పరాత్మనః ।
నైవా కూజంస్తు మౌనా హి ద్వారపాః కేచనా భవన్ ॥
ఏతస్మిన్నంతరే తత్ర జగామ హిమభూధరః ।
శంకరస్యౌషధి ప్రస్థే శ్రుత్వాగమన మాదరాత్ ॥
ప్రణనామ ప్రభుం రుద్రం సగణో భూధరేశ్వరః ।
సమానర్చ చ సుప్రీతస్తుష్టావ స కృతాంజలిః ॥

అపుడు కొందరు గణములు శంభు పరమాత్ముని సేవను చేసిరి. మరి కొందరు శబ్దమును చేయకుండగా మౌనముగా ద్వార పాలురై నిలబడిరి (9). ఇంతలో ఔషధి ప్రస్థములో శివుని రాకను గురించి విని హిమవంతుడు ఆదరముతో అచటకు విచ్చేసెను (10). గణములతో కూడియున్న ఆ పర్వతరాజు రుద్ర ప్రభువునకు చేతులొగ్గి నమస్కరించి ప్రేమతో పూజించి స్తుతించెను (11).

హిమాలయ ఉవాచ ।

దేవ దేవ మహాదేవ కపర్దిన్ శంకర ప్రభో ।
త్వయైవ లో కనాథేన పాలితం భువనత్రయమ్ ॥
నమస్తే దేవదేవేశ యోగిరూప ధరాయ చ ।
నిర్గుణాయ నమస్తుభ్యం సగుణాయ విహారిణే ॥
కైలాసవాసినే శంభో సర్వలో కాటనాయ చ ।
నమస్తే పరమేశాయ లీలాకారాయ శూలినే ॥
పరిపూర్ణ గుణాధాన వికారరహితాయ తే ।
నమోఽనీహాయ వీహాయ ధీరాయ పరమాత్మనే ॥

హిమాలయుడిట్లు పలికెను -

దేవ దేవా! మహాదేవా! జటాజూట ధారీ! శంకరా! ప్రభో! లోకనాథుడవగు నీవే ముల్లోకములను పాలించుచున్నావు (12). హే దేవదేవా! ఈశ్వరా! యోగి రూపమును ధరించిన నీకు నమస్కారము. నిర్గుణుడవయ్యు సగుణుడవై విహరించు నీకు నమస్కారము (13). హే శంభో! కైలాసవాసి అయ్యు సర్వలోకములను సంచరించు నట్టియు, లీలచే ఆకారమును స్వీకరించి శూలధారివగు నీకు నమస్కారము. నీవు పరమేశ్వరుడవు (14). నీవు సకలగుణ నిధానమవు. వికారములు లేనట్టియు, కామనలు లేనట్టియు, విశిష్టమగు సంకల్ప శక్తి కలిగినట్టియు, జ్ఞాన ఘను డైనట్టియు, పరమాత్మవగు నీకు నమస్కారము (15).

అబహిర్భోగకారాయ జనవత్సల తే నమః ।

త్రిగుణా ధీశ మాయేశ బ్రహ్మణే పరమాత్మనే ॥

విష్ణు బ్రహ్మాది సేవ్యాయ విష్ణు బ్రహ్మ స్వరూపిణే ।

విష్ణు బ్రహ్మ కదాత్రే తే భక్తి ప్రియ నమోఽస్తు తే ॥

తపోరత తపస్స్థాన సుతపః ఫలదాయినే ।

తపః ప్రియాయ శాంతాయ నమస్తే బ్రహ్మరూపిణే ॥

వ్యవహార కరాయైవ లోకాచార కరాయ తే ।

సగుణాయ పరేశాయ నమోఽస్తు పరమాత్మనే ॥

లీలా తవ మహేశానావేద్యా సాధుసుఖ ప్రదా ।

భక్తా ధీన స్వరూపోఽసి భక్తవశ్యోఽసి కర్మకృత్ ॥

హే భక్తజనవత్సలా! నీ ఆనందము బాహ్య విషయ భోగమునందు లేదు. త్రిగుణా◌ాత్మకమగు మాయ నీ అధీనమునందుండును. పరబ్రహ్మ పరమాత్మ వగు నీకు నమస్కారము (16). నీవు విష్ణు బ్రహ్మ స్వరూపుడవు. విష్ణు బ్రహ్మాదులు నిన్ను సేవింతురు. విష్ణు బ్రహ్మలకు ఆనందము నిచ్చునది నీవే. నీకు భక్తి ప్రియమైనది. నీకు నమస్కారమగు గాక! (17). తపస్సుపై నీకు ప్రీతి మెండు. నీవు తపోనిధివి. భక్తుల మంచి తపస్సునకు ఫలమునిచ్చునది నీవే. నీవు శాంతుడవు. పరబ్రహ్మవగు నీకు నమస్కారము (18). నీవు సగుణ రూపములో సర్వేశ్వరుడవై లోకాచారములను ప్రవర్తిల్ల జేయుచూ, వాటిని నీవు స్వయముగా ఆచరించెదవు. పరమాత్మవగు నీకు నమస్కారము (19). ఓ మహేశ్వరా! సాధువులకు సుఖములనిచ్చు నీ లీలను తెలియుట శక్యము కాదు. నీవు భక్తుల వశములో నుండి వారికి అనుకూలమగు కర్మలను చేయుచూ, వారికి ఆత్మరూపుడవై ఉన్నావు (20).

మమ భాగ్యోదయాదత్ర త్వమాగత ఇహ ప్రభో ।

సనాథం కృతవాన్మాం త్వం వర్ణితో దీనవత్సలః ॥

అద్య మే సఫలం జన్మ సఫలం జీవనం మమ ।

అద్య మే సఫలం సర్వం యదత్ర త్వం సమాగతః ॥

జ్ఞాత్వా మాం దాస మవ్య గ్రమాజ్ఞాం దేహి మహేశ్వర ।

త్వత్సేవాం చ మహా ప్రీత్యా కుర్యామహమనన్య ధీః ॥

హే ప్రభో! నీవు ఇచటకు విచ్చేయుట నాకు మహా భాగ్యము. దీనవత్సలుడవని వర్ణిం◌ంపబడు నీవు నన్ను నీ రాకచే సనాథుని చేసినావు (21). ఈనాడు నా పుట్టుక సఫలమైనది. నా జీవనము సఫలమైనది. నీవిచటకు వచ్చుటచే నాకు చెందిన సర్వము సఫలమైనది (22). ఓ మహేశ్వరా! నేను నీ దాసుడనని యెరుంగుము. నిస్సంకోచముగా నన్ను ఆజ్ఞాపించుము. నేను మరియొక తలంపు లేనివాడనై గొప్ప ప్రీతితో నీ సేవను చేసెదను (23).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య గిరీశస్య మహేశ్వరః ।
కించిదున్మీల్య నేత్రే చ దదర్శ సగణం గిరిమ్ ॥
సగణం తం తథా దృష్ట్వా గిరిరాజం వృషధ్వజః ।
ఉవాచ ధ్యానయోగస్థ స్స్మయన్నివ జగత్పతిః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

మహేశ్వరుడు పర్వత రాజు యొక్క ఈ మాటలను విని, కన్నులను కొద్దిగా తెరచి, పరివార సమేతుడగు హిమవంతుని గాంచెను (24). జగత్ప్రభువు, ధ్యాన యోగము నందున్నవాడు అగు వృషధ్వజుడు పరివారముతో గూడి అట్లు సవినయముగా నిలబడి యున్న పర్వత రాజును గాంచి, ఆశ్చర్యమును చెందిన వాడు వోలె ఇట్లు పలికెను (25).

మహేశ్వర ఉవాచః

తవ పృష్ఠే తపస్తప్తుం రహస్య మహమాగతః ।
యథా న కోఽపి నికటం సమాయాతు తథా కురు ॥
త్వం మహాత్మా తపోధామా మునీనాం చ సదాశ్రయః ।
దేవానాం రాక్షసానాం చ పరేషాం చ మహాత్మనామ్ ॥
సదావాసో ద్విజాదీనాం గంగా పూతశ్చ నిత్యదా ।
పరోపకారీ సర్వేషాం గిరీణామధిపః ప్రభుః ॥
అహం తపశ్చ రామ్యత్ర గంగావతరణే స్థలే ।
ఆశ్రితస్తవ సుప్రీతో గిరిరాజ యతాత్మవాన్ ॥

మహేశ్వరుడిట్లు పలికెను –

నేను నీ శిఖరముపై ఏకాంతముగా తపస్సును చేయుటకు వచ్చియుంటిని. నా సమీపమునకు ఎవ్వరైననూ రాని విధముగా ఏర్పాటు చేయుము (26). నీవు మహాత్ముడవు. తపస్సును చేయు అనేక మునులకు నీవు చక్కని ఆశ్రయమై ఉన్నావు. మరియు, దేవతలు, రాక్షసులే గాక ఇతరులగు మహాత్ములు (27), బ్రాహ్మణులు మొదలగు వారు సర్వదా నీయందు నివసించియున్నారు. గంగా జలముచే నీవు నిత్య శుద్ధుడవు. పర్వతములన్నింటికీ రాజగు నీవు పరోపకారమును చేయు ప్రభుడవు (28). నేనీ గంగావతరణ క్షేత్రములో తపస్సును చేసెదను. ఓ పర్వతరాజా! నేను జితేంద్రియుడనై మిక్కిలి ప్రీతితో నిన్ను ఆశ్రయించినాను (29).

నిర్విఘ్నం మే తపశ్చాత్ర హేతునా యేన శైలప ।

సర్వథా హి గిరి శ్రేష్ఠ సుయత్నం కురు సాంప్రతమ్ ॥

మమేదమేవ పరమం సేవనం పర్వతోత్తమ ।

స్వగృహం గచ్ఛ సుప్రీత్యా తత్సంపాదయ యత్నతః ॥

ఓ పర్వత రాజా! నా తపస్సు ఇచట ఇపుడు అన్ని విధములా నిర్విఘ్నముగా కొనసాగునట్లు మంచి యత్నమును చేయుము (30). ఓ పర్వత శ్రేష్ఠమా! నీవు నాకు చేయగల గొప్ప సేవ ఇదియే. కావున, ఆ కార్యమును ప్రయత్న పూర్వకముగా చేయుము. ఇప్పుడు ఆనందముతో ఇంటికి మరలుము (31).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా జగతాం నాథ స్తూష్ణీమాస స సూతికృత్ ।

గిరిరాజస్తదా శంభుం ప్రణయా దిదమబ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

గొప్ప లీలలను ప్రకటించు వాడు జగన్నాథుడు అగు ఆ శివుడిట్లు పలికి మిన్నకుండెను. అపుడా పర్వత రాజు శంభునితో స్నేహపూర్వకముగా నిట్లనెను (32).

హిమాలయ ఉవాచః

పూజితోఽసి జగన్నాథ మయా త్వం పరమేశ్వర ।

స్వాగతేనాద్య విషయే స్థితం త్వాం ప్రార్థయామి కిమ్ ॥

మహతా తపసా త్వం హి దేవైర్యత్న పరాశ్రితైః ।

న ప్రాప్య సే మహేశాన స త్వం స్వయముపస్థితః ॥

మత్తోఽప్యన్యతమో నాస్తి న మత్తోఽన్యోఽస్తి పుణ్యవాన్ ।

భవానితి చ మత్పృష్ఠే తపసే సముపస్థితః ॥

దేవేంద్రాదధికం మన్యే స్వాత్మానం పరమేశ్వర ।

సగణేన త్వయాగత్య కృతోఽనుగ్రహ భాగహమ్ ॥

హిమవంతుడిట్లు పలికెను -

ఓ జగత్ప్రభో! పరమేశ్వరా! నేను ఈనాడు నిన్ను పూజించితిని. ఈ ప్ర◌ాదేశమునకు నేను నిన్ను ఈనాడు స్వాగతము చెప్పుచున్నాను. నా ప్రదేశమునందున్న నిన్ను నేను ఏమి కోరెదను? (33) ఓ మహేశ్వరా! మహాయత్నముతో గొప్ప తపస్సు చేసిన దేవతలకు కూడ దర్శనము నీయని నీవు స్వయముగా ఇచటకు వచ్చితివి (34). నా కంటె గొప్ప పుణ్యాత్ముడు మరియొకడు ఉండబోడు. ఏలయన, నీవు నా శిఖరము పై తపస్సు కొరకు విచ్చేసితివి (35). ఓ పరమేశ్వరా! నీవు గణములతో కూడి ఇచటకు వచ్చి నన్ను అనుగ్రహించుటచే, నేను దేవేంద్రుని కంటే అధికుడనైతినని భావించుచున్నాను (36).

నిర్విఘ్నం కురు దేవేశ స్వతంత్రః పరమం తపః ।

కరిష్యేఽహం తథా సేవాం దాసోఽహం తే సదా ప్రభో ॥

ఓ దేవ దేవా! నీవు స్వతంత్రుడవు. ఇచట నిర్విఘ్నముగా గొప్ప తపస్సును చేసుకొనుము. అట్టి సేవను నేను నీకు చేయగలను. హే ప్రభో! నేను నీకు సర్వదా దాసుడను (37).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా గిరిరాజోఽసౌ స్వం వేశ్మ ద్రుతమాగతః ।

వృత్తాంతం తం సమాచ ఖ్యౌప్రియాయై చ సమాదరాత్ ॥

నీయమానాన్ పరీవారాన్ స్వగణానపి నారద ।

సమాహూయాఖిలాన్ శైలపతిః ప్రోవాచ తత్త్వతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పర్వత రాజు ఇట్లు పలికి వెంటనే తన గృహమునకు వచ్చి ఆ వృత్తాంతమును తన ప్రియురాలికి మిక్కిలి ఆదరముతో వివరించి చెప్పెను (38). ఓ నారదా! ఆ పర్వత రాజు తనతో వచ్చిన సేవకులను, ఇతర గణములను అందరినీ పిలిచి వారితో నిశ్చయముగా నిట్లు చెప్పెను (39).

హిమాలయ ఉవాచ।

అద్య ప్రభృతి నో యాతు కోఽపి గంగావతారణమ్ ।

మచ్ఛాసనేన మత్ప్రస్థం సత్యమేతద్బ్రవీ మ్యహమ్ ॥

గమిష్యతి జనః కశ్చిత్తత్ర చేత్తం మహాఖిలమ్ ।

దండయిష్యే విశేషేణ సత్యమే తన్మ యోదితమ్ ॥

ఇతి తాన్ స నియమ్యాశు స్వగణాన్ని ఖిలాన్మునే ।

సుయత్నం కృతవాన్ శైలస్తం శృణు త్వం వదామి తే ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివశైల సమాగమ వర్ణనం నామైె దశోఽధ్యాయః (11).

హిమవంతుడిట్లు పలికెను -

ఈ నాటినుండి ఎవ్వరైననూ నా శాసనముచే ఈ గంగావతరణమనే నా శిఖరమునకు వచ్చుట నిషేధింపబడినది. నేను సత్యమును పలుకుచున్నాను (40). అచటకు ఎవరైననూ వెళ్లినచో, అట్టి పరమదుర్మార్గుని తీవ్రముగా దండించగలను. నేను సత్యమును పలుకుచున్నాను (41). ఓ మహర్షీ! ఆ పర్వతరాజు ఈ తీరున తన గణములనన్నింటినీ శాసించి, శివుని ఏకాంతమునకు మంచి ఏర్పాటును చేసెను. ఆ వివరములను చెప్పెదను. నీవు వినుము (42).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహిత యందలి పార్వతీ ఖండలో శివశైలసమాగమ వర్ణనమనే పదకొండవ అధ్యాయము ముగిసినది (11).

12 - శివహిమాచల సంవాదము

బ్రహ్మోవాచ ।

అథ శైలపతిర్హృష్ట స్సత్పుష్ప ఫలసంచయమ్ ।
సమాదాయ స్వతనయా సహితోఽగాద్ధరాంతికమ్ ॥
స గత్వా త్రి జగన్నాథం ప్రణమ్య ధ్యానతత్పరమ్ ।
అర్పయామాస తనయాం కాలీం తస్మై హృదాద్భుతామ్ ॥
ఫలపుష్పాదికం సర్వం తత్తదగ్రే నిధాయ సః ।
అగ్రే కృత్వా సుతాం శంభుమిదమాహ స శైలరాట్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు పర్వత రాజు సంతసించి అనేక పుష్పములను, ఫలములను అధిక పరిమాణములో తీసుకొని, తన కుమార్తెతో గూడి శివుని వద్దకు వెళ్లెను (1). ఆయన అచటకు వెళ్లి ధ్యానమగ్నుడై యున్న, ముల్లోకములకు నాథుడగు శివునకు నమస్కరించి, అద్భుతమగు తన కుమార్తె కాళిని ఆయనకు హృదయపూర్వకముగా అప్పజెప్పెను (2). ఆ పర్వత రాజు ఫలములను, పుష్పములను, ఇతరములను శంభుని ఎదుట నుంచి, తన కుమార్తెను ఆయన యెదుట నిలబట్టి, ఆయనతో నిట్లనెను (3).

హిమగిరి రువాచ ।

భగవంస్తనయా మే త్వాం సేవితుం చంద్రశేఖరమ్ ।
సముత్సుకా సమానీతా త్వదారాధన కాంక్షయా ॥

ఆదేశించుటకు గల కారణము నాకు తెలియకున్నది (26).

బ్రహ్మోవాచ ।

తతోఽబ్రవీద్గిరిం శంభుః ప్రహసన్ వృషభధ్వజః ।
లోకాచారం విశేషేణ దర్శయన్ హి కుయోగినామ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు వృషభధ్వజుడగు శంభుడు చిరునవ్వుతో హిమవంతునకు బదులిడెను. ఆయన దుష్టయోగులు లోకములో ప్రవర్తిల్లు తీరుతెన్నులను ప్రత్యేకించి వివరించెను (27).

శంభు రువాచ ।

ఇయం కుమారీ సుశ్రోణీ తన్వీ చంద్రాననా శుభా ।
నానేతవ్యా మత్సమీపే వారయామి పునః పునః ॥
మాయారూపా స్మృతా నారీ విద్వద్భిర్వేద పారగైః ।
యువతీ తు విశేషేణ విఘ్న కర్త్రీ తపస్వినామ్ ॥
అహం తపస్వీ యోగీ చ నిర్లిప్తో మాయయా సదా ।
ప్రయోజనం న యుక్త్యా వైస్త్రియా కిం మేఽస్తి భూధర ॥
ఏవం పునర్న వక్తవ్యం తపస్వివర సంశ్రిత ।
వేద ధర్మ ప్రవీణస్త్వం యతో జ్ఞానివరో బుధః ॥

శంభుడిట్లు పలికెను –

ఈ కుమారి మిక్కిలి అందగత్తె. చంద్రుని వంటి మోము గలది. శు◌ుభదర్శనురాలు. ఈమెను నా వద్దకు తీసుకురా దగదని మరల మరల వారించుచున్నాను (28). వేద వేత్తలగు విద్వాంసులు స్త్రీ మాయాస్వరూపురాలని చెప్పెదరు. ప్రత్యేకించి తపశ్శాలురు విషయములో స్త్రీ విఘ్నకారిణి యగును (29). నేను తపశ్శాలిని. యోగిని. మాయ ఏనాడైననూ నన్ను లేపము చేయదు. ఈ విషయములో యుక్తులను చెప్పి ప్రయోజనమేమున్నది? ఓ పర్వత రాజా! నాకు స్త్రీతో పనియేమి? (30) నీవు మరల ఇట్లు పలుకవలదు. నీవు గొప్ప తపశ్శాలురకు ఆశ్రయము నిచ్చినవాడవు. నీవు వేదధర్మములో నిష్ణాతుడవు, జ్ఞానులలో శ్రేష్ఠుడవు, పండితుడవు (31).

భవత్య చల తత్సంగా ద్విషయోత్పత్తి రాశు వై ।
వినశ్యతి చ వైరాగ్యం తతో భ్రశ్యతి సత్తపః ॥
అతస్తపస్వినా శైల న కార్యా స్త్రీషు సంగతిః ।
మహా విషయమూలం సా జ్ఞానవైరాగ్య నాశనీ ॥

ఓ పర్వత రాజా! స్త్రీ తో కలిసి ఉండుట వలన విషయములయందు ఆసక్తి వెనువెం◌ంటనే ఉదయించి, వైరాగ్యము పూర్తిగా అదృశ్యమగును. అపుడు చక్కని తపస్సు జారిపోవును (32). ఓ పర్వత రాజా! కావున, తపశ్శాలి స్త్రీలతో మైత్రిని చేయరాదు. ఇంద్రియభోగలాలసతకు మూలమగు స్త్రీ జ్ఞానమును, వైరాగ్యమును నశింపజేయును (33).

బ్రహ్మోవాచ ।

ఇత్యాద్యుక్త్వా బహుతరం మహాయోగీ మహేశ్వరః ।
విరరామ గిరీశం తం మహాయోగివరః ప్రభుః ॥
ఏతచ్ఛ్రుత్వా వచనం తస్య శంభోః నిరామయం నిస్స్పృహం నిష్ఠురం చ ।
కాలితాత శ్చకితోఽ భూత్సురర్షే తద్వత్కించిద్వ్యా కులశ్చాస తూష్ణీమ్ ॥
తపస్వినోక్తం వచనం నిశమ్య తథా గిరీశం చకితం విచార్య ।
అతః ప్రణమ్యైవ శివం భవానీ జగాద వాక్యం విశదం తదానీమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివ
హిమాచల సంవాద వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః (12).

బ్రహ్మ ఇట్లు పలికెను –

మహా యోగులలో శ్రేష్ఠుడగు మహేశ్వర ప్రభుడు ఆ పర్వత రాజుతో ఇట్టి మరికొన్ని మాటలను పలికి విరమించెను (34). దోషము లేనిది, కామనలు లేనిది, మరియు పరుషమైనది అగు ఆ శంభువచనమును విని ఆ కాళికి తండ్రియగు హిమవంతుడు ఆశ్చర్యపడెను. ఓ దేవర్షీ! అటులనే ఆయన కొంత మానసిక క్షోభను పొందినవాడై మిన్నకుండెను (35). తపశ్శాలి యగు శివుని మాటలను విని, మరియు ఆశ్చర్యమగ్నుడగు పర్వత రాజును తలపోసి, అపుడు భవానీ దేవి శివునకు ప్రణమిల్లి స్పష్టమగు వాక్యము నిట్లు పలికెను (36).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు పార్వతీ ఖండములో శివ హిమాచల సంవాద వర్ణనమనే పన్నెండవ అధ్యాయము ముగిసినది (12).

13 – పార్వతీ పరమేశ్వర సంవాదము

భవాన్యువాచ ।

కిముక్తం గిరిరాజాయ త్వయా యోగింస్తపస్వినా ।
తదుత్తరం శృణు విభో మత్తో జ్ఞాన విశారద ॥
తపశ్శక్త్యాన్వితశ్శంభో కరోషి విపులం తపః ।
తవ బుద్ధిరియం జాతా తపస్తప్తుం మహాత్మనః ।
సా శక్తిః ప్రకృతిర్ జ్ఞేయా సర్వేషామపి కర్మణామ్ ।
తయా విరచ్యతే సర్వం పాల్యతే చ వినాశ్యతే ॥
కస్త్వం కా ప్రకృతిస్సూక్ష్మా భగవంస్త ద్విమృశ్యతామ్ ।
వినా ప్రకృత్యా చ కథం లింగరూపీ మహేశ్వరః ॥
అర్చనీయోఽసి వంద్యోఽసి ధ్యేయోఽసి ప్రాణినాం సదా ।
ప్రకృత్యా చ విచార్యేతి హృదా సర్వం తదుచ్యతామ్ ॥

భవాని ఇట్లు పలికెను –

ఓ యోగీ! తపశ్శాలివగు నీవు పర్వత రాజుతో నెట్టి మాటలను పలికితివి? హే విభో! నీవు జ్ఞానులలో శ్రేష్ఠుడవు. దానికి సమాధానమును నా నుండి వినుము (1). హే శంభో! నీవు తపశ్శక్తితో కూడియున్నావు. గొప్ప తపస్సును చేయుచున్నావు. మహాత్ముడవగు నీకు ఇట్టి తపస్సును చేయవలెననే బుద్ధి ఉదయించినది (2). కర్మలన్నియు ఆ శక్తి నుండియే పుట్టుచున్నవని యెరుంగుము. ఆమెయే సృష్టినంతనూ రచించి, పాలించి, నశింపజేయుచున్నది (3). నీవెవరు? సూక్ష్మ ప్రకృతి ఏది? హే భగవాన్! ఈ విషయములను విమర్శించి తెలుసుకొనుము. ప్రకృతి లేకుండగా మహేశ్వరుడు సగుణ రూపధారి ఎట్లు కాగల్గును? (4) ప్రకృతితో కూడి యుండుట చేతనే నీవు సర్వదా ప్రాణులచే పూజింపబడి, నమస్కరింపబడి, ధ్యానింపబడుచున్నావు. ఈ సత్యమును మనస్సులో నెరింగి, అపుడు నీవు మాటలనన్నిటినీ పలుకదగును (5).

బ్రహ్మోవాచ ।

పార్వత్యా స్తద్వచశ్శ్రుత్వా మహోతి కరణే రతః ।
సువిహస్య ప్రసన్నాత్మా మహేశో వాక్యమ బ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

గొప్ప లీలను ప్రదర్శించుటలో ప్రీతిగల మహేశ్వరుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై, పార్వతి యొక్క ఆ మాటను విని చక్కగా నవ్వి ఇట్లు పలికెను (6).

మహేశ్వర ఉవాచః

తపసా పరమేణేవ ప్రకృతిం నాశయామ్యహమ్ ।
ప్రకృత్యా రహితశ్శంభురహం తిష్ఠామి తత్త్వతః ॥
తస్మాచ్చ ప్రకృతేస్సద్భిర్న కార్యస్సంగ్రహః క్వచిత్ ।
స్థాతవ్యం నిర్వికారైశ్చ లోకాచార వివర్జితైః ॥

మహేశ్వరుడిట్లు పలికెను –

నేను గొప్ప తపస్సుచే ప్రకృతిని నాశనము చేయుదునా యన్నట్లు చేయుదును. శంభుడనగు నేను ప్రకృతి లేకుండగా ఆత్మ స్వరూపుడనై ఉందును (7). కావున సత్పురుషులు ఏ కాలము నందైననూ ప్రకృతిని (స్త్రీని స్వీకరించరాదు. సత్పురుషులు లో కాచారములను పరిత్యజించి వికారము లేని వారై ఉండవలెను (8).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా శంభునా తాత లౌకిక వ్యవహారతః ।
సువిహస్య హృదా కాలీ జగాద మధురం వచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

వత్సా! శంభుడు లోకపు పోకడనను సరించి ఇట్లు పలుకగా, కాళీదేవి తనలో తాను నవ్వుకొని మధురమగు వచనము నిట్లు పలికెను (9).

కాల్యువాచ।

యదుక్తం భవతా యోగిన్ వచనం శంకర ప్రభో ।
సా చ కిం ప్రకృతిర్న స్యాదతీతస్తాం భవాన్ కథమ్ ॥
ఏతద్విచార్య వక్తవ్యం తత్త్వతో హి యథా తథమ్ ।
ప్రకృత్యా సర్వమేతచ్చ బద్ధమస్తి నిరంతరమ్ ॥
తస్మాత్త్వయా న వక్తవ్యం న కార్యం కించిదేవ హి ।
వచనం రచనం సర్వం ప్రాకృతం విద్ధి చేతసా ॥
యచ్ఛృణోషి యదశ్నాసి యత్పశ్యసి కరోషి యత్ ।
తత్సర్వం ప్రకృతే: కార్యం మిథ్యావాదో నిరర్థకః ॥

కాళీ దేవి ఇట్లు పలికెను –

హే శంకరప్రభో! నీవు ప్రకృతిని అతిక్రమించినానని చెప్పితివి. అట్లైనచో, ప్ర()కృతి స్వరూపురాలగు స్త్రీ ఏల ఉండరాదు? ఉండకూడదన్నచో, నీవు అతీతుడవని ఎట్లు చెప్పగలము? (10) ఈ విషయమును ఉన్నది ఉన్నట్లుగా తత్త్వ బుద్ధితో విచారించి చెప్పవలెను. ఈ సర్వము సర్వకాలములయందు ప్రకృతి చే బంధింపబడి యున్నది (11). నీవు ప్రకృతి లేనిదే మాటలాడలేవు. ఏ పనినీ చేయలేవు. ఈ జగత్తులోని సర్వ వచనములు, సర్వక్రియలు ప్రకృతి నుండి పుట్టినవని నీవు నీ

మనస్సులో నిశ్చయించుకొనుము (12). నీవు ఏది విన్ననూ, ఏది తిన్ననూ, ఏది చూచిననూ, ఏది చేసిననూ ఆ సర్వము ప్రకృతి నుండియే పుట్టును. ప్రకృతిని గురించి మిథ్యావచనములను పలుకుట వ్యర్థము (13).

ప్రకృతేః పరమశ్చేత్త్వం కిమర్థం తప్యసే తపః ।

త్వయా శంభోఽధునా హ్యస్మిన్ గిరౌ హిమవతి ప్రభో ॥

ప్రకృత్యా గిలితోఽసి త్వం న జానాసి నిజం హర ।

నిజం జానాసి చేదీశ కిమర్థం తప్యసే తపః ॥

వాగ్వాదేన చ కిం కార్యం మమ యోగింస్త్వయా సహ ।

ప్రత్యక్షే హ్యనుమానస్య న ప్రమాణం విదుర్బుధాః ॥

ఇంద్రియాణాం గోచరత్వం యావద్భవతి దేహినామ్ ।

తావత్సర్వం విమంతవ్యం ప్రాకృతం జ్ఞానిభిర్ధియా ॥

నీవు ప్రకృతికి అతీతుడవైనచో, తపస్సును ఏల చేయుచున్నావు? హే శంభో! ప్రభో! నీవు ఇపుడు ఈ హిమవత్పర్వతముపై ఏలనున్నావు? (14). హే హరా! నీవు ప్రకృతినుండి విడి పోయినావు. నీ ఆత్మ స్వరూపమును నీవు తెలియకున్నావు. నీకు నీ ఆత్మ

దితమే అయినచో, తపస్సు నేల చేయు చున్నావు? (15) హేయోగీ! నాకు నీతో వాదులాడుట వలన ఏమి ప్రయోజనము గలదు? వస్తువు ప్రత్యక్షముగా నున్న సందర్భములో అనుమాన ప్రమాణమునకు తావు లేదని పండితులు చెప్పెదరు (16). ప్రాణులు తమ ఇంద్రియములచే ఎంతవరకు తెలుసుకొనగలరో, స్వీకరించగలరో, అది అంతయూ ప్రకృతి నుండియే ఉద్భవించినదని జ్ఞానులు తమ బుద్ధిలో దర్శించవలెను (17).

కిం బహూక్తేన యోగీశ శృణు మద్వచనం పరమ్ ।

సా చాహం పురుషోఽసి త్వం సత్యం సత్యం న సంశయః ॥

మదనుగ్రహతస్త్వం హి సుగుణో రూపవాన్మతః ।

మాం వినా త్వం నిరీహోఽసి న కించిత్ కర్తుమర్హసి ॥

పరాధీనస్సదా త్వం హి నానా కర్మ కరో వశీ ।

నిర్వికారీ కథం త్వం హి న లిప్తశ్చ మయా కథమ్ ॥

ప్రకృతేః పరమోఽసి త్వం యది సత్యం వచస్తవ ।

తర్హి త్వయా న భేతవ్యం సమీపే మమ శంకర ॥

ఓ యోగి వర్యా! ఇన్ని మాటలేల? నా శ్రేష్ఠమగు వచనమును వినుము. ఆ ప్రకృతి నేనే. నీవు పురుషుడవు. ఇది ముమ్మాటికీ సత్యము (18). నీవు నా అనుగ్రహము చేతనే రూపమును పొంది సగుణుడవైనావని పెద్దలు చెప్పెదరు. నేను లేనిచో, నీ యందు సంకల్ప శక్తి ఉండదు. నీవు ఏ పనినీ చేయ జాలవు (19). జితేంద్రియుడవగు నీవు పరా ప్రకృతికి అధీనుడవై వివిధ కర్మలననుష్ఠించు చున్నావు. నీవు వికారములు లేనివాడవు ఎట్లు కాగలవు? నా లేపము నీకు లేదనుట ఎట్లు సంభవము? (20) హే శంకరా! నీవు ప్రకృతి కంటే అతీతుడవు అనే నీ మాట సత్యమైనచో, నీవు నా సమీపములో భయ పడవలసిన పని యేమి? (21)

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్యాః సాంఖ్యశాస్త్రోదితం శివః ।
వేదాంతమత సంస్థో హి వాక్యమూచే శివాం ప్రతి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆమె సాంఖ్య శాస్త్రాను సారముగా పలికిన ఈ మాటలను విని శివుడు వేదాంత సిద్ధాంతము నాశ్రయించి శివా దేవితో నిట్లు పలికెను (22).

శ్రీ శివ ఉవాచః

ఇత్యేవం త్వం యది బ్రూషే గిరిజే సాంఖ్య ధారిణీ ।
ప్రత్యహం కురు మే సేవా మనిషిద్ధాం సుభాషిణి ॥
యద్యహం బ్రహ్మ నిర్లిప్తో మాయయా పరమేశ్వరః ।
వేదాంత వేద్యో మాయేశస్త్వం కరిష్యసి కిం తదా ॥

శ్రీ శివుడు ఇట్లు పలికెను -

ఓ పార్వతీ! నీవు సాంఖ్య సిద్ధాంతమునను సరించి ఇట్లు పలుకు చుంటివా? ఓ అందమైన పలుకులు గలదానా! అట్లైనచో, నీవు ప్రతి దినము నా సేవను చేయుము. నాకు నిషేధము లేదు (23). నేను మాయా లేపము లేని వాడను, పరమేశ్వరుడను, వేదాంతములచే తెలియదగు పరబ్రహ్మను, మాయను వశము చేసుకున్న వాడను అయినచో, అపుడు నీవేమి చేయగలవు? (24)

బ్రహ్మోవాచ ।

ఇత్యేవముక్త్వా గిరిజాం వాక్యమూచే గిరిం ప్రభుః ।
భక్తానురంజనకరో భక్తాను గ్రహకారకః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

భక్తులను రంజింపజేసి, అనుగ్రహించు ఆ ప్రభుడు పార్వతితో నిట్లు పలికి, తరువాత హిమవంతునితో నిట్లనెను (25).

శివ ఉవాచ ।

అత్రైవ సోఽహం తపసా పరేణ గిరే తవ ప్రస్థవరేఽతి రమ్యే ।
చరామి భూమౌ పరమార్థ భావ స్వరూప మానందమయం సులోచయన్ ॥

తపస్త్వ మనుజ్ఞా మే దాతవ్యా పర్వతాధిప ।
అనుజ్ఞయా వినా కించిత్తపః కర్తుం న శక్యతే ॥

శివుడిట్లు పలికెను -

ఓ పర్వత రాజా! నేను ఇచట నీ ఈ అతి సుందర పీఠ భూమి యందు మహా తపస్సు◌్సను చేసెదను. ఆనందఘనము, పరమతత్త్వము, సదనమునగు ఆత్మ స్వరూపమును దర్శించుచూ ఈ భూమి యందు సంచరించెదను (26). ఓ పర్వతరాజా! నేను ఇచట తపస్సును చేసుకొనుటకు అనుజ్ఞనిమ్ము అనుజ్ఞ లేకుండగా నీ ఈ స్థానమునందు ఏ విధమైన తపస్సునైననూ చేయుట సంభవము కాదు (27).

బ్రహ్మోవాచ ।

ఏత చ్ఛృత్వా వచస్తస్య దేవ దేవస్య శూలినః ।
ప్రణమ్య హిమవాన్ శంభు మిదం వచన మబ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవ దేవుడు, త్రిశూలధారియగు ఆ శివుని ఈ వచనమును విని, హిమవంతుడు శివునకు నమస్కరించి ఇట్లు పలికెను (28).

హిమవానువాచ ।

త్వదీయం హి జగత్సర్వం సదేవాసుర మానుషమ్ ।
కిమప్యహం మహాదేవ తుచ్ఛో భూత్వా వదామి తే ॥

హిమ వంతుడిట్లు నెను -

దేవతలు, రాక్షసులు, మనుష్యులతో గూడిన జగత్తు అంతయూ నీదే. హే మహాదేవా! నేను అత్యల్పుడను. నీతో నేనేమి చెప్పగలను? (29)

బ్రహ్మోవాచ ।

ఏవముక్తో హిమవతా శంకరో లోకశంకరః ।
విహస్య గిరిరాజం తం ప్రాహ యాహీతి సాదరమ్ ॥
శంకరేణా భ్యనుజ్ఞాతస్స్వ గృహం హిమవాన్ యయౌ ।
సార్ధం గిరిజయా నైస ప్రత్యహం దర్శనే స్థితః ॥
పిత్రా వినాపి సా కాలీ సఖీ భ్యాం సహ నిత్యశః ।
జగామ శంకరాభ్యాశం సేవాయై భక్తి తత్పరా ॥
నిషిషేధ న తాం కోఽపి గణో నందీశ్వరాదికః ।
మహేశశా సనాత్రాత తచ్ఛాసన కరశ్శుచిః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

హిమవంతుడిట్లు పలుకగా, లోకములకు మంగళములనిచ్చే శంకరుడు నవ్వి హిమవంతునితో సాదరముగా 'నీవు వెళ్లుము' అని చెప్పెను (30). హిమవంతుడు శంకరుని అనుమతిని పొంది తన ఇంటికి వెళ్లెను. ఆయన ప్రతి దినము పార్వతితో గూడి శంకరుని దర్శించు చుండెను (31). భక్తి తత్పరురాలగు ఆ కాళి ప్రతి దినము తండ్రి రాకపోయిననూ, ఇద్దరు చెలికత్తెలతో గూడి సేవకొరకై శంకరుని సమీపమునకు వెళ్లుచుండెను (32). వత్సా! మహేశుని ఆజ్ఞను పాలించే పవిత్ర హృదయుడగు నందీశ్వరుడు, ఇతర గణములు శివుని ఆజ్ఞచే ఆమెను వారించలేదు (33).

సాంఖ్య వేదాంత మతయో శ్శివయోశ్శివదస్సదా ।
సంవాదస్సుఖ కృచ్ఛోక్తోఽ భిన్నయోస్సు విచారతః ॥
గిరిరాజస్య వచనాత్తనయాం తస్య శంకరః ।
పార్శ్వే సమీపే జగ్రాహ గౌరవాదపి గోపరః ॥
ఉవాచేదం వచః కాలీం సఖీ భ్యాం సహ గోపతిః ।
నిత్యం మా సేవతాం యాతు నిర్భీతా హ్యత్ర తిష్ఠతు ॥
ఏవముక్త్వా తు తాం దేవీం సేవాయై జగృహే హరః ।
నిర్వికారో మహాయోగీ నానాలీలా కరః ప్రభుః ॥

జాగ్రత్తగా పరిశీలించినచో శివాశివుల మధ్య భేదమే లేదు. అట్టి వారిద్దరు క్రమముగా సాంఖ్యవేదాంత మతముల ననుసరించి చేసిన సుఖకరమగు సంవాదమును వివరించితిని. ఈ సంవాదము సర్వదా మంగళములను కలిగించును (34). జితేంద్రియుడగు శంకరుడు పర్వతరాజు నందు గల గౌరవముచే ఆతని మాట ప్రకారంగా ఆతని కుమార్తెను తన వద్దకు వచ్చుటకు అంగీకరించెను (35). జితేంద్రియుడగు శివుడిట్లు పలికెను. ఈ కాళి సఖురాండ్రిద్దరితో గూడి ప్రతిదినము ,నన్ను సేవించి వెళ్లవచ్చును. మరియు ఇచట నిర్భయముగా నుండవచ్చును (36). ఇట్లు పలికి, వికారములు లేని వాడు, మహాయోగీశ్వరుడు, అనేక లీలలను ప్రదర్శించు వాడునగు శివ ప్రభుడు ఆ దేవిని సేవ కొరకై స్వీకరించెను (37).

ఇదమేవ మహదైశ్వర్యం ధీరా ణాం సుతపస్వినామ్ ।
విఘ్నవంత్యపి సంప్రాప్య యద్విఘ్నైర్న విహన్యతే ॥
తత స్స్వ పురమాయాతో గిరిరాట్ పరిచారకైః ।
ముమోదాతీవ మనసి సత్ప్రియస్స మునీశ్వర ॥
హరశ్చ ధ్యానయోగేన పరమాత్మాన మాదరాత్ ।
నిర్విఘ్నేన స్వమనసా త్వాసీ చ్చింతయితుం స్థితః ॥
కాలీ సఖీభ్యాం సహితా ప్రత్యహం చంద్రశేఖరమ్ ।
సేవమానా మహాదేవం గమనాగమనే స్థితా ॥
ప్రక్షాళ్య చరణౌ శంభోః పపౌ తచ్చరణోదకమ్ ।
వహ్ని శౌచేన వస్త్రేణ చక్రే తద్గా త్రమార్జనమ్ ॥

ధీరులగు తపశ్శాలురకు విఘ్నములు వచ్చుచుండును. కాని అవి వారి తపస్సును భంగము చేయ జాలవు. అదియే వారికి గల గొప్ప ఐశ్వర్యము (సామర్థ్యము) (38).. ఓ మహర్షీ! అపుడు పర్వతరాజు సేవకులతో గూడి తన పురమునకు మరలి వచ్చెను. ఆతడు మనస్సులో గొప్ప ఆనందమును పొందెను (39). శివుడున్నూ విఘ్నముల పీడలేని తనమనస్సుతో ధ్యానయోగము నభ్యసించుచూ, ఆత్మ రూపమును ధ్యానించుచుండెను (40). కాళీ దేవి సఖురాండ్రిద్దరితో గూడి ప్రతిదినము అచటకు వచ్చి చంద్ర భూషణుడగు మహాదేవుని సేవించి మరలు చుండెను (41). ఆమె శంభుని పాదములను కడిగి ఆ పాదోదకమును త్రాగెడిది. మరిగించిన నీటిలో శుభ్రము చేయబడిన వస్త్రముతో శివుని శరీరమును తుడిచెడిది (42).

షోడశేనోప చారేణ సంపూజ్య విధి వద్ధరమ్ ।
పునః పునస్సు ప్రణమ్య యయౌ నిత్యం పితుర్గృహమ్ ॥
ఏవం సంసేవమానాయాం శంకరం ధ్యానతత్పరమ్ ।
వ్యతీయాయ మహాన్ కాల శ్శివాయా మునిసత్తమ ॥
కదాచిత్సహితా కాలీ సఖీ భ్యాం శంకరాశ్రమే ।
వితేనే సుందరం గానం సుతాలం స్మరవర్ధనమ్ ॥
కదాచిత్కుశ పుష్పాణి సమిధం నయతి స్వయమ్ ।
సఖీ భ్యాం స్థానసంస్కారం కుర్వతీ న్యావసత్తదా ॥

ఆమె ప్రతి దినము శివుని యథావిధిగా షోడశోపచారములతో పూజించి, మరల మరల నమస్కరించి తండ్రి గృహమునకు మరలుచుండెడిది (43). ఓ మహర్షీ! ఇట్లు ఆ శివాదేవి ధ్యాననిమగ్నుడైన శంకరుని సేవించుచుండగా చాల కాలము గడిచిపోయెను (44). ఒకప్పుడు ఆ కాళి సఖురాండ్రిద్దరితో గూడి శంకరుని ఆశ్రమములో కామ వర్ధకము, మంచి తాళము గలది అగు మధురమైన పాటను పాడెను (45). మరియొకప్పుడు ఆమె దర్భలను, పుష్పములను, సమిధలను స్వయముగా తెచ్చెడిది. ఆమె అక్కడ స్థలము నంతనూ సఖురాండ్రతో గూడి శుభ్రము చేయుచుండెడిది (46).

కదాచిన్నియతా గేహే స్థితా చంద్రభృతో భృశమ్ ।
వీక్షన్ తీ విస్మయామాస సకామా చంద్రశేఖరమ్ ॥
తతస్తప్తేన భూతేశస్తాం నిస్సంగాం పరిస్థితామ్ ।
సోఽచింతయత్తదా వీక్ష్య భూతదేహే స్థితేతి చ ॥
నా గ్రహీద్గిరిశః కాలీం భార్యార్థే నికటే స్థితామ్ ।
మహాలావణ్య నిచయం మునీనామపి మోహినీమ్ ॥
మహాదేవః పునర్దృష్ట్వా తథా తాం సంయతేంద్రియామ్ ।
స్వసేవనే రతాం నిత్యం సదయస్సమ చింతయత్ ॥

ఒకప్పుడామె అనురాగముతో కూడినదై చంద్రశేఖరుని కుటీరములో ఆయన సమీపములో గూర్చుండి ఆయనను ఆశ్చర్యముతో చూచుచుండెడిది (47). భూతపతియగు ఆ శివుడు విషయాసంగములేనిదై తన సమీపములో నున్న ఆమెను చూచి, పూర్వము సతీ రూపములో నున్న దేవియే ఈమె యని తపః ప్రభావముచే మనస్సుతో దర్శించెను (48). శివుడు తన సమీపమునందున్నట్టియు, మహా లావణ్యనిధి యైనట్టియు, మహర్షులకు కూడ మోహమును కలిగించగల ఆ కాళీ దేవిని వెంటనే భార్యగా స్వీకరించలేదు (49). ఇంద్రియ జయము కలిగి నిత్యము నిష్ఠతో తనను సేవించుచున్న ఆమెను అనేక పర్యాయములు చూచిన పిదప మహాదేవునకు దయ కలిగి ఇట్లు తలపోసెను (50).

యదైవైషా తపశ్చర్యావ్రతం కాలీ కరిష్యతి ।
తదా చ తాం గ్రహీష్యామి గర్వబీజ వివర్జితామ్ ॥

ఈ కాళి ఎప్పుడైతే తపస్సును తీవ్రముగా చేయునో, అప్పుడు ఆమెలోని గర్వము యొక్క బీజము తొలగిపోవును. అపుడామెను నేను స్వీకరించగలను (51).

బ్రహ్మోవాచ।

ఇతి సంచింత్య భూతేశో ద్రుతం ధ్యాన సమాశ్రితః ।
మహాయోగీశ్వరోఽభూద్వై మహాలీలాకరః ప్రభుః ॥
ధ్యానాసక్తస్య తస్యాథ శివస్య పరమాత్మనః ।
హృది నాసీన్మునే కాచి దన్యా చింతా వ్యవస్థితా ॥
కాలీ త్వనుదినం శంభుం సద్భక్త్యా సమసేవత ।
విచింతయంతీ సతతం తస్య రూపం మహాత్మనః ॥
హరో ధ్యానపరః కాలీం నిత్యం ప్రైక్షత సుస్థితామ్ ।
విస్మృత్య పూర్వచింతాం తాం పశ్యన్నపి న పశ్యతి ॥
ఏతస్మిన్నంతరే దేవాశ్శక్రాద్యా మునయశ్చ తే ।
బ్రహ్మాజ్ఞయా స్మరం తత్ర ప్రేషయామాసు రాదరాత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

భూతపతి, మహాయోగి శ్రేష్ఠుడు, గొప్ప లీలలను ప్రదర్శించువాడునగు ఆ ప్రభుడు ఇట్లు తలపోసి వెంటనే ధ్యాననిమగ్నుడయ్యెను (52). ధ్యానమునందు నిమగ్నుడైన ఆ శివపరమాత్మ యొక్క హృదయములో మరియొక తలంపు లేకుండెను. ఓ మహర్షీ! (53) కాళీదేవి సర్వకాలములయందు ఆ మహాత్ముని రూపమును స్మరిస్తూ, ప్రతి దినము ఆ శంభుని మంచి భక్తితో చక్కగా సేవించెను (54). శివుడు నిత్యము ఆ సుందరిని చూచుచూ, పూర్వమందలి దుఃఖమును మరచిపోయెను. ధ్యాన నిమగ్నుడైన ఆ శివుడు ఆమెను చూచుచున్ననూ చూడని వాడు వలెనే యుండెను (55). ఇంతలో ఇంద్రుడు మొదలగు దేవతలు, మరియు మునులు బ్రహ్మ యొక్క ఆజ్ఞను ఆదరముతో స్వీకరించి మన్మథుని అచటకు పంపిరి (56).

తేన కారయితుం యోగం కాల్యా రుద్రేణ కామతః ।
మహా వీర్యేణాసురేణ తారకేణ ప్రపీడితాః ॥
గత్వా తత్ర స్మరస్సర్వ ముపాయ మకరోన్నిజమ్ ।
చుక్షుభే న హరః కించిత్తం చ భస్మీ చకార హ ॥
పార్వత్యపి విగర్వా భూన్మునే తస్య నిదేశతః ।
తతస్తపో మహత్ కృత్వా శివం ప్రాప పతిం సతీ ॥
బభూవతుస్తౌ సుప్రీతౌ పార్వతీపరమేశ్వరౌ ।
చక్రతుర్దేవ కార్యం హి పరోపకరణే రతౌ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పార్వతీ పరమేశ్వర సంవాద వర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః (13).

మహా బలవంతుడగు తారకాసురునిచే మిక్కిలి పీడించబడిన దేవతలు రుద్రుడు కాళిని ప్రేమించి వివాహ మాడునట్లు చేయుటకై మన్మథుని పంపిరి (57). మన్మథుడు అచటకు వెళ్లి తన ఉపాయముల నన్నిటినీ ప్రయోగించెను. శివుడు లేశమైననూ చలించలేదు. పైగా ఆతనిని బూడిదగా చేసెను (58). ఓ మహర్షీ! పార్వతి కూడా తన గర్వమును విడనాడెను. ఆ సతి శివుని ఆదేశముచే గొప్ప తపస్సును చేసి శివుని భర్తగా పొందెను (5 9). ఆ పార్వతీ పరమేశ్వరులు మిక్కిలి ఆనందించిరి. ఇతరులకు ఉపకరించుటలో ప్రీతి గల ఆ దంపతులు దేవ కార్యమును నెరవేర్చిరి (60).

శ్రీ శివ మహా పురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో పార్వతీ పరమేశ్వర సంవాద వర్ణన మనే పదమూడవ అధ్యాయము ముగిసినది (13).

14 - వజ్రాంగుడు

నారద ఉవాచః

విష్ణుశిష్య మహాశైవ సమ్యగుక్తం త్వయా విధే ।
చరితం పరమం హ్యేతచ్ఛివాయాశ్చ శివస్య చ ॥
కస్తారకాసురో బ్రహ్మన్ యేన దేవాః ప్రపీడితాః ।
కస్య పుత్రస్స వై బ్రూహి తత్కథాం చ శివాశ్రయామ్ ॥
భస్మీ చకార స కథం శంకరశ్చ స్మరం వశీ ।
తదపి బ్రూహి సుప్రీత్యాఽద్భుతం తచ్చరితం విభోః ॥
కథం శివా తపోఽత్యుగ్రం చకార సుఖహేతవే ।
కథం ప్రాప పతిం శంభుమాదిశక్తి ర్జగత్పరా ॥
ఏతత్సర్వ మశేషణ విశేషేణ మహాబుధ ।
బ్రూహి మే శ్రద్ధధానాయ స్వపుత్రాయ శివాత్మనే ॥

నారదుడిట్లు పలికెను -

హే విష్ణు శిష్యా! నీవు శివ భక్తులలో శ్రేష్ఠుడవు. హే విధీ! నీవు ఈ శివాశివుల పరమ చరితమును చక్కగా వివరించితివి (1). హే బ్రహ్మన్! దేవతలను తీవ్రముగా పీడించిన తారకాసురుడెవ్వరు? ఆతడెవని కుమారుడు? శివుని చుట్టూ తిరిగే ఆ గాథను చెప్పుము (2). ఆ జితేంద్రియుడగు శంకరుడు . మన్మథుని భస్మము చేసిన విధమెట్టిది? పరమేశ్వరుని ఆ అద్భుత గాథను గూడ మిక్కిలి ప్రీతితో చెప్పుము (3). జగత్స్వరూపిణి, ఆదిశక్తి యగు శివాదేవి శంభుని భర్తగా పొంది ఆ నందించుట కొరకై మిక్కిలి తీవ్రమగు తపస్సును చేసిన విధం బెయ్యది? (4) హే మహాప్రాజ్ఞా! శివభక్తుడను, నీ పుత్రుడను, శ్రద్ధ గలవాడను అగు నాకు ఈ గాథనంతనూ వివరించి చెప్పుము (5).

బ్రహ్మోవాచ ।

పుత్రవర్య మహాప్రాజ్ఞ సురర్షే శంసిత వ్రత ।
వచ్మ్యహం శంకరం స్మృత్వా సర్వం తచ్చరితం శృణు ॥
ప్రథమం తారకస్యైవ భవం సంశృణు నారద ।
యద్వధార్థం మహాయత్నః కృతో దేవైశ్శివాశ్రయైః ॥
మమ పుత్రో మరీచిర్యః కశ్యపస్తస్య చాత్మజః ।
త్రయోదశ మితాస్తస్య స్త్రియో దక్ష సుతాశ్చ యాః ॥
దితిర్జ్యేష్ఠా చ తత్ స్త్రీ హి సుషువే సా సుతద్వయమ్ ।
హిరణ్య కశిపుర్జ్యేష్ఠో హిరణ్యాక్షోఽనుజస్తతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ దేవా! నీవు నా కుమారులలో శ్రేష్ఠుడవు. మహాజ్ఞానివి. నీ భక్తి ముల్లోకములలో ప్రసిద్ధి గాంచినది. నేను శంకరుని స్మరించి ఆయన చరితము నంతనూ చెప్పెదను. వినుము (6). ఓ నారదా! ముందుగా తారకుని జన్మ వృత్తాంతమును వినుము. తారకుని వధ కొరకై దేవతలు శివుని ఆశ్రయించి గొప్ప యత్నమును చేసిరి (7). నా మానస పుత్రుడు మరీచి. ఆతని కుమారుడు కశ్యపుడు. ఆతడు దక్షుని పదముగ్గురు కుమార్తెలను వివాహమాడెను (8). వారిలో దితి పెద్ద భార్య. ఆమెకు ఇద్దరు కుమారులు గలరు. వారిలో హిరణ్య కశిపుడు జ్యేష్ఠుడు. వాని తమ్ముడు హిరణ్యాక్షుడు (9).

తౌ హతౌ విష్ణునా దైత్యౌ నృసింహ క్రోడరూపతః ।
సుదుఃఖదౌ తతో దేవాస్సుఖమాపుశ్చ నిర్భయాః ॥
దితిశ్చ దుఃఖితాసీత్సా కశ్యపం శరణం గతా ।
పునస్సంసేవ్య తం భక్త్యా గర్భమాధత్త సువ్రతా ॥
తద్విజ్ఞాయ మహేంద్రోఽపి లబ్ధఛిద్రో మహోద్యమీ ।
తద్గర్భం వ్యచ్ఛినత్తత్ర ప్రవిశ్య పవినా ముహుః ॥
తద్వ్రతస్య ప్రభావేణ న తద్గర్భో మమార హ ।
స్వపంత్యా దైవయోగేన సప్త సప్తా భవన్ సుతాః ॥

దేవతలకు మిక్కిలి దుఃఖమును కలిగించిన ఆ రాక్షసుల నిద్దరినీ విష్ణువు క్రమముగా నృసింహవరాహ రూపములతో సంహరించెను. అపుడు దేవతలు భయమును వీడి సుఖించిరి (10). దితి దుఃఖితురాలై కశ్యపుని శరణు పొందెను. ఆమె ఆయనను మరల భక్తితో చక్కగా సేవించెను. గొప్ప దీక్ష గల ఆమె గర్భమును ధరించెను (11). ఆ విషయము నెరింగి గొప్ప యత్న శీలుడగు మహేంద్రుడు దోషమును కనిపెట్టి, ఆమె యందు ప్రవేశించి వజ్రముతో పలుమార్లు ఆమె గర్భమును భేదించెను (12). ఆమె వ్రతమహిమచే నిద్రించుచున్న ఆమె గర్భము మరణించలేదు. దైవాను గ్రహముచే ఆమెకు నలభై తొమ్మిది మంది కుమారులు పుట్టిరి (13).

దేవా ఆసన్ సుతాస్తే చ నామతో మరుతోఽఖిలాః ।
స్వర్గం యయుస్తదేంద్రేణ దేవరాజాత్మ సాత్కృతాః ॥
పునర్దితిః పతిం భేజేఽనుతప్తా నిజకర్మతః ।
చకార సుప్రసన్నం తం మునిం పరమసేవయా ॥

మరుత్తులను పేరు గల ఆ కుమారులందరు దేవతలై స్వర్గమును పొందిరి. అపుడు దేవరాజగు ఇంద్రుడు వారిని తన వారినిగా చేసుకొనెను (14). దితి తాను చేసిన దోషమునకు పరితపించి మరల భర్త వద్దకు వెళ్లి గొప్ప సేవను చేసి, ఆ మహర్షిని మిక్కిలి ప్రసన్నునిగా చేసెను (15).

కశ్యప ఉవాచ ।

తపః కురు శుచిర్భూత్వా బ్రహ్మణశ్చాయుతం సమాః ।
చేద్భవిష్యతి తత్పూర్ణం భవితా తే సుతస్తదా ॥
తథా దిత్యా కృతం పూర్ణం తత్తపశ్శ్రద్ధయా మునే ।
తతః పత్యుః ప్రాప్య గర్భం సుషువే తాదృశం సుతమ్ ॥
వజ్రాంగ నామా సోఽభూ ద్వై దితి పుత్రోఽమరోపమః ।
నామతుల్యతను ర్వీర స్సు ప్రతాప్యు ద్భవాద్బలీ ॥
జననీ శాసనాత్సద్యస్స సుతో నిర్జరాధిపమ్ ।
బలాద్ధృత్వా దదౌ దండం వివిధం నిర్జరానపి ॥

కశ్యపుడిట్లు పలికెను –

నీవు శుచి వై పదివేల సంవత్సరములు బ్రహ్మను గురించి తపస్సును చేయుము. నీ వ్రతము పూర్ణము కాగలగినచో, నీకు అపుడు కుమారుడు జన్మించగలడు (16). ఓ మహర్షీ! దితి అటులనే పూర్ణమగు తపస్సును శ్రద్ధతో చేసెను. తరువాత ఆమె భర్తనుండి గర్భమును పొంది గొప్ప కుమారుని గనెను (17). దేవతలతో సమానుడగు ఆ దితిపుత్రుడు వజ్రాంగుడను పేరు గల వాడాయెను. ఆతడు పేరుకు తగ్గ దేహము గలవాడు, వీరుడు, గొప్ప పరాక్రమశాలి, మరియు పుట్టిన నాటినుండియూ బలశాలి (18). ఆ దితిపుత్రుడు తల్లి ఆజ్ఞచే వెను వెంటనే ఇంద్రుని, కొందరు దేవతలను కూడ బలాత్కారముగా తీసుకొని వచ్చి అనేక విధములుగా దండించెను (19).

దితిస్సుఖమతీవాప దృష్ట్వా శక్రాది దుర్దశామ్ ।
అమరా అపి శక్రాద్యా జగ్ముర్దుఃఖం స్వకర్మతః ॥
తదాహం కశ్యపేనాశు తత్రాగత్య సుసామగీః ।
దేవానత్యాజయంస్తస్మా త్సదా దేవహితే రతః ॥
దేవాన్ముక్త్వా సవజ్రాంగస్తతః ప్రోవాచ సాదరమ్ ।
శివభక్తోఽతి శుద్ధాత్మా నిర్వికారః ప్రసన్నధీః ॥

ఇంద్రుడు మొదలుగా గల ఆ దేవతల దుస్థితిని గాంచి దితి ఆనందించెను. ఇంద్రుడు, ఇతర దేవతలు తమ కర్మలకు అను రూపమైన దుఃఖమును పొందిరి (20). నిత్యము దేవతల హితమును చేయ గోరు నేను అపుడు శీఘ్రమే చక్కని సామగానమును చేయుచూ అచటకు వచ్చి వజ్రాంగుని చెరనుండి దేవతలను విడిపించితిని (21). శివభక్తుడు, మిక్కిలి పవిత్రమగు అంతః కరణ గలవాడు, రాగద్వేషములు లేకుండా ప్రసన్నముగా నుండు బుద్ధి గలవాడునగు ఆ వజ్రాంగుడు అపుడా దేవతలను విడిచి పెట్టి ఆదరముతో నిట్లు పలికెను (22).

వజ్రాంగ ఉవాచః

ఇంద్రో దుష్టః ప్రజాఘాతీ మాతుర్మే స్వార్థసాధకః ।
స ఫలం ప్రాప్తవానద్య స్వరాజ్యం హి కరోతు సః ॥
మాతురాజ్ఞావశాద్బ్రహ్మన్ కృతమే తన్మయాఖిలమ్ ।
న మే భోగాభిలాషో వై కస్య చిద్భువనస్య హి ।
తత్త్వసారం విధే బ్రూహి మహ్యాం వేదవిదాం వర ।
యేన స్యాం సుసుఖీ నిత్యం నిర్వికారః ప్రసన్నధీః ॥

వజ్రాంగుడిట్లు పలికెను –

ఇంద్రుడు స్వార్థపరుడగు దుష్టుడు. నా తల్లిగారి సంతానమును హింసిం◌ించినాడు. దానికీ నాడు ఫలమునను భవించినాడు. అతని రాజ్యమును ఆతడు ఏలు కొనవచ్చును (23). హే బ్రహ్మా! దీనినంతనూ నేను తల్లిగారి ఆజ్ఞచే చేసితిని. నాకు ఏ భువనములనైననూ పాలించి భోగించవలెననే ఆశ లేనే లేదు (24). హే విధీ! నీవు వేదవేత్తలలో అగ్రగణ్యుడవు. ఏ ఆత్మతత్త్వ సారము నెరింగి నేను నిత్యానందమును, వికారము లేని ప్రసన్నమగు అంతః కరణమును పొందగలనో, అట్టి తత్త్వసారమును నాకు బోధించుము (25).

తచ్ఛ్రుత్వాహం మునేఽవో చం సాత్త్వికో భావ ఉచ్యతే ।
తత్త్వసార ఇతి ప్రీత్యా సృజామ్యేకాం వరాం స్త్రియమ్ ॥
వరాంగీం నామ తాం దత్త్వా తస్మై దితి సుతాయ వై ।
అయాం స్వధామ సుప్రీతః కశ్యపస్తత్పితాపి చ ॥
తతో దైత్యస్స వజ్రాంగస్సాత్త్వికం భావమాశ్రితః ।
ఆసురం భావముత్సృజ్య నిర్వైర స్సుఖమాప్తవాన్ ॥
న బభూవ వరాంగ్యా హి హృది భావోఽథ సాత్త్వికః ।
సకామా స్వపతిం భేజే శ్రద్ధయా వివిధం సతీ ॥

ఓ మహర్షీ! నేనా మాటను విని ఇట్లు పలికితిని. జ్ఞాన వైరాగ్యాది సాత్త్విక భావనలే తత్త్వసారమని చెప్పబడును. నేను ప్రీతితో ఒక శ్రేష్ఠ కన్యను సృష్టించితిని (26), వరాంగియను ఆ కన్యను ఆ దితి పుత్రునకిచ్చి వివాహము చేసి నేను నా ధామమును చేరితిని. నేను మాత్రమే గాక అతని తండ్రి యగు కశ్యపుడు కూడ మిక్కిలి సంతసించెను (27). అపుడా దితిపుత్రుడగు వజ్రాంగుడు రాక్షస భావనలను విడనాడి, సాత్త్విక భావము నాశ్రయించి, విరోధము లేని వాడై సుఖించెను (28). కాని వరాంగికి హృదయములో సాత్త్విక భావము నెలకొనలేదు. ఆమె కామనతో కూడినదై తన భర్తను శ్రద్ధతో వివిధ పద్ధతులలో సేవించెను (29).

అథ త త్సేవనా దాశు సంతుష్టోఽభూన్మహాప్రభుః ।
స వజ్రాంగః పతిస్తస్యా ఉవాచ వచనం తదా ॥

ఆమె భర్తయగు ఆ వజ్రాంగ మహాప్రభుడు అపుడామె సేవచే సంతసించి వెంటనే ఇట్లు పలికెను (30).

వజ్రాంగ ఉవాచః

కిమిచ్ఛసి ప్రియే బ్రూహి కిం తే మనసి వర్తతే ।
తచ్ఛ్రుత్వా నమ్య తం ప్రాహ సా పతిం స్వమనోరథమ్ ॥

వజ్రాంగుడిట్లు పలికెను –

ఓ ప్రియురాలా! నీ కోరిక యేమి? నీ మనస్సులో నేమున్నది? చెప్పుము. ఆమె ఆ మాటను విని భర్తకు నమస్కరించి తన కోరిక ఆతనితో నిట్లు చెప్పెను (31).

వరాంగ్యువాచ ।

చేత్ ప్రసన్నోఽ భవస్యం వై సుతం మే దేహి సత్పతే ।
మహాబలం త్రిలోకస్య జేతారం హరిదుఃఖదమ్ ॥

వరాంగి ఇట్లు పలికెను –

ఓ మంచి మొగుడా! నీవు నా పై ప్రసన్నుడవైనచో, మహాబలశాలి, ముల్లో꠰్లోకములను జయించువాడు, ఇంద్రునకు దుఃఖము నీయగలవాడు అగు కుమారుని నాకు ఇమ్ము (32).

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా ప్రియావాక్యం విస్మితోఽభూత్స ఆకులః ।
ఉవాచ హృది సజ్ఞానీ సాత్త్వికో వైరవర్జితః ॥
ప్రియేచ్ఛతి విరోధం వై సురైర్మే న హి రోచతే ।
కిం కుర్యాం హి క్వ గచ్ఛేయం కథం నశ్యేన్న మే పణః ॥
ప్రియా మనోరథ శ్చైవ పూర్ణ స్స్యాత్త్రి జగద్భవేత్ ।
క్లేశయుక్తితరాం భూయో దేవాశ్చ మునయస్తథా ॥
న పూర్ణ స్స్యాత్ప్రియా కామస్తదా మే నరకో భవేత్ ।
ద్విధాపి ధర్మ హానిర్వై భవతీత్యను శుశ్రువాన్ ॥
వజ్రాంగ ఇ త్థం బభ్రామ సమునే ధర్మ సంకటే ।
బలాబలం ద్వయోస్తత్ర విచిచింత చ బుద్ధితః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

జ్ఞాని, సత్త్వ గుణ సంపన్నుడు, విరోధము లేనివాడు అగు ఆ వజ్రాంగుడు ప్రియురాలి ఈ మాటను విని ఆశ్చర్యమును దుఃఖమును పొంది, తన మనస్సులో ఇట్లను కొనెను (33). నా ప్రియురాలు దేవతలతో వైరమును కోరుచున్నది. నాకు వైరమునందు అభిరుచి లేదు. ఏమి చేయుదును? ఎక్కడికి వెళ్లేదను? నా ప్రతిజ్ఞ చెడకుండు ఉపాయమేది? (34) ప్రియురాలి కోర్కెను తీర్చినచో, ముల్లోకములు, దేవతలు, మహర్షులు మరల పెద్ద దుఃఖమునకు గురి యగుదురు (35). ప్రియురాలి కోరిక తీరనిచో, నాకు నరకము సంప్రాప్తమగును. ఈ రెండు పక్షములలోనూ ధర్మమునకు హాని నిశ్చితమని ఆతడు తలపోసెను

(36). ఓ మహర్షీ! వజ్రాంగుడు ఈ తీరున ధర్మ సంకటములో పడి తిరుగాడెను. ఆ రెండు పక్షముల బలాబలములను ఆతడు బుద్ధిలో విమర్శించెను (37).

శివేచ్ఛయా స హి మునే వాక్యం మేనే స్త్రియో బుధః ।
తథా స్త్వితి వచః ప్రాహ ప్రియాం ప్రతి స దైత్యరాట్ ॥
తదర్థమకరోత్తీవ్రం తపోఽన్యద్దుష్కరం స తు ।
మాం సముద్దిశ్య సుప్రీత్యా బహువర్షం జితేంద్రియః ॥
వరం దాతుమగాం తస్మై దృష్ట్వాహం తత్తపో మహత్ ।
వరం బ్రూహి హ్యవోచం తం సుప్రసన్నేన చేతసా ॥
వజ్రాంగస్తు తదా ప్రీతం మాం దృష్ట్వా ఖే స్థితం విభుమ్ ।
సుప్రణమ్య బహు స్తుత్వా వరం వవ్రే ప్రియాహితమ్ ॥

ఓ మహర్షీ! విద్వాంసుడగు ఆ వజ్రాంగుడు శివుని సంకల్పముచే ప్రియురాలి వాక్యయమును అంగీకరించెను. ఆ రాక్షసరాజు ప్రియురాలితో 'అటులనే గానిమ్ము' అని పలికెను (38). ఆతడు ఇతరులకు శక్యముగాని తీవ్రమగు తపస్సును ఆమె కోర్కెను తీర్చుటకొరకు చేసెను. ఆతడు జితేంద్రియుడై నన్ను ఉద్దేశించి పరమప్రేమతో అనేక సంవత్సరములు తపస్సు జేసెను (39). నేనా మహాతపస్సును గాంచి, అతనికి వరము నిచ్చుటకై వెళ్లితిని. మిక్కిలి ప్రసన్నమగు మనస్సుతో అతనిని 'వరమును కోరకొమ్మని' చెప్పితిని (40). ఆకాశమునందున్న విభుడనగు నన్ను చూచి, నేను ప్రీతుడనై యుండుటను గాంచి, ఆ వజ్రాంగుడు సాష్టాంగ ప్రణామమును చేసి అనేక విధముల స్తుతించి, అపుడు ప్రియురాలి కోరికను వరముగా అడిగెను (41).

వజ్రాంగ ఉవాచ:

సుతం దేహి స్వమాతుర్మే మహాహితకరం ప్రభో ।
మహాబలం సుప్రతాపం సుసమర్థం తపోనిధిమ్ ॥

వజ్రాంగుడిట్లు పలికెను -

హే ప్రభో! తన తల్లికి గొప్ప హితమును చేకూర్చువాడు, మహా బలశాలి, గొప్ప పరాక్రమము గలవాడు, గొప్ప దక్షుడు, తపస్సునకు నిధి యగు పుత్రుని నాకు ఇమ్ము (42).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య చ తద్వాక్యం తథాస్త్విత్య బ్రువం మునే ।
అయాం స్వధామ తద్దత్వా విమనాస్సంస్మరన్ శివమ్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే
వజ్రాంగతపో వర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః(14).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆతని ఆ వాక్యమును విని, నేను 'అటులనే అగు గాక!' అని పలికితిని. అట్లు వరమునిచ్చి, వికలమైన మనస్సు గలవాడనై, శివుని స్మరించుచూ, నేను నాధామమును చేరుకొంటిని (43).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండములో వజ్రాంగ తపోవర్ణన మనే పదునాల్గవ అధ్యాయము ముగిసినది(14).

15 - తారకుని తపస్సు

బ్రహ్మోవాచ ।

అథ సా గర్భ మాధత్త వరాంగీ తత్ప్రియాదరాత్ ।
స వవర్ధాభ్యంతరే హి బహువర్షైస్సుతేజసా ॥
తతస్సా సమయే పూర్ణే వరాంగీ సుషువే సుతమ్ ।
మహాకాయం మహావీర్యం ప్రజ్వలంతం దిశో దశ ॥
తదైవ చ మహోత్పాతా బభూవుర్దుః ఖహేతవః ।
జాయమానే సుతే తస్మిన్ వరాంగ్యాస్సుర దుఃఖదే ॥
దివి భువ్యంతరిక్షే చ సర్వలోక భయంకరాః ।
అనర్థ సూచకాస్తాత త్రివిధాస్తాన్ బ్రవీమ్యహమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అటు పిమ్మట వజ్రాంగుని ప్రియురాలగు ఆ వరాంగి గర్భమును ధరించెను. ఆ శిశువు ఆమె గర్భములోపల అనేక సంవత్సరములు గొప్ప తేజస్సుతో వర్ధిల్లెను (1). తరువాత, గర్భధారణ సమయము పూర్తి కాగానే ఆ సుందరి పెద్ద శరీరము గలవాడు, గొప్ప బలశాలి, పది దిక్కులను ప్రకాశింప జేయుచున్నవాడునగు కుమారుని కనెను (2). ఆ సుందరికి దేవతలకు దుఃఖమును కలిగింపబోవు ఆ బాలుడు పుట్టుచుండగా, అదే సమయములో పీడను కలిగించు గొప్ప ఉత్పాతములు కలిగినవి (3). రాబోవు అనర్థమును సూచించు .మూడు రకముల ఉత్పాతములు ద్యులోకమునందు, భూలోకమునందు, మరియు అంతరిక్షమునందు కూడ కలిగెను. అవి సర్వ ప్రాణులకు భీతిని గొల్పెను. వాటిని నేను వివరించెదను (4).

సోల్కా శ్చాశనయ: పేతుః మహాశబ్దా భయంకరాః ।
ఉదయం చక్రు రుత్సృష్టాః కంతవో దుఃఖదాయకాః ॥
చచాల వసుధా సాద్రిర్జజ్వలుస్సకలా దిశః ।
చుక్షుభుస్సరితస్సర్వాస్సాగరాశ్చ విశేషతః ॥
హూత్కరానీరయన్ ధీరాన్ ఖరస్పర్శో మరుద్వవౌ ।
ఉన్మూలయన్ మహావృక్షాన్ వాత్యానీకో రజో ధ్వజః ॥
సరాహోః స్సూర్య విధ్వోస్తు ముహుః పరిధయోఽ భవన్ ।
మహాభయస్య విప్రేంద్ర సూచకాస్సుఖహారకాః ॥

భయమును కలిగించే ఉల్కలు, పిడుగులు గొప్ప శబ్దమును చేయుచూ పడినవి. దుఃఖమును కలిగించే క్రూర జంతువులు పుట్ట జొచ్చినవి (5). భూమి,దానితో బాటు పర్వతములు కంపించినవి. దిక్కులన్నియూ మండినవి. సర్వ నదులతో బాటు సముద్రములు విశేషించి క్షోభను పొందినవి (6), తుఫాను గాలులే సైన్యముగా కలిగినట్టియు, ధూళియే ధ్వజముగా గల వాయుదేవుడు పెద్ద

శబ్దమును విచిత్ర ధ్వనులను చేయుచూ, స్పర్శ చేతనే పీడను కలిగించుచూ, పెద్ద వృక్షములను పెకలించుచూ వీయజొచ్చెను (7). రాహువుతో కూడిన సూర్య చంద్రుల చుట్టూ తరచుగా కాంతి మండలము లేర్పడెను. ఓ ద్విజశ్రేష్ఠా! సుఖమును అపహరించు ఈ ఉత్పాతములు రాబోవు మహాభయమును సూచించుచుండెను (8).

మహీధ్ర వివరేభ్యశ్చ నిర్ఘాతా భయసూచకాః ।
రథనిర్హ్రాదతుల్యాశ్చ జజ్ఞిరేఽవసరే తతః ।
సృగాలో లూకటంకారైర్వమంత్యో ముఖతోఽ నలమ్ ।
అంతర్ గ్రామేషు వికటం ప్రణేదు రశివాశ్శివాః ॥
యతస్తతో గ్రామసింహా ఉన్నమయ్య శిరోధరామ్ ।
సంగీతవ ద్రోదన వద్ద్వముంచన్ వివిధాన్ రవాన్ ॥
ఖార్కార రభసా మత్తా: ఖురైర్ఘ్నన్తో రసాం ఖరాః ।
వరూథశస్తదా తాత పర్యధావన్నితస్తతః ॥

ఆ సమయములో కొండ గుహల నుండి భయమును కలిగించే, రథశబ్దమును పోలియున్నన శబ్దము గల భూకంపములు పుట్టినవి (9). అమంగళ కరములగు నక్కలు నోటినుండి నిప్పులను గ్రక్కుచూ గ్రామముల మధ్యలో కర్ణ కఠోరమగు శబ్దములను చేసినవి. వీటికి గుడ్ల గూబల ధ్వనులు తోడయ్యెను (10). కుక్కలు ఇటునటు తిరుగుచూ శిరస్సులను పైకెత్తి నేలను తన్నుచూ ఒకప్పుడు సంగీతమును, మరియొకప్పుడు ఏడ్పులను చేయుచూ అనేక శబ్దములను చేసినవి (11). వత్సా! ఆ సమయములో మదించిన గాడిదలు గుంపులు గుంపులుగా ఇటునటు పరుగెత్తుచున్నవై కర్కశముగా ఓండ్రపెట్టుచున్నవై గిట్టలతో నేలను తన్నుచుండెను (12).

ఖగా ఉదపతన్నీడా ద్భ్రభసత్రస్త మానసా! ।
క్రోశంతో వ్యగ్రచిత్తాశ్చ స్థితిమాపుర్న కుత్రచిత్ ॥
శకృన్మూత్ర మకారుశ్చ గోష్ఠేఽ రణ్యే భయాకులాః ।
బభ్రముస్థ్సితిమాపుర్నో పశవస్తాడితా ఇవ ॥
గావోఽత్ర సన్నసృగ్దోహా బాష్పనేత్రా భయాకులా: ।
తోయదా అభవంస్తత్ర భయదా: పూయవర్షిణః ॥
వ్యరుదన్ ప్రతిమాస్తత్ర దేవానాముత్పతిష్ణవః ।
వినాఽ నిలం ద్రుమాః పేతుర్గ్రహ యుద్ధం బభూవ ఖే ॥

భీకర శబ్దములచే భయమును చెందిన పక్షులు ఏడ్చుచూ గూళ్లనుండి ఎగిరిపోయినవి. అవి ఒకచోట స్థిరముగా కూర్చుండ లేకపోయినవి (13). పశువులు ఎవరో కొడుతున్నారా యన్నట్లు పశువుల శాలలో గాని, అడవిలో గాని స్థిరముగా నుండలేక ఇటునటు తిరుగుతూ మలమూత్రములను విసర్జించినవి (14). గోవులు భయముచే వ్యాకులితములై కనుల వెంబడి నీరు గార్చుచూ పాలకు బదులుగా రక్తమును స్రవించినవి. మేఘములు భయము కలుగు విధముగా

టీమును వర్షించినవి (15). దేవతా ప్రతిమలు ఎగిరిపడుతూ రోదించినవి. గాలి లేకుండగనే చెట్లు నేల గూలినవి. ఆకాశమునందు గ్రహముల మధ్య రగడ చెలరేగెను (16).

ఇత్యాదికా బహూత్పాతా జజ్ఞిరే మునిసత్తమ ।
అజ్ఞానినో జనాస్తత్ర మేనిరే విశ్వసంప్లవమ్ ॥
అథ ప్రజాపతిర్నామా కరోత్తస్యాసురస్య వై ।
తారకేతి విచార్యైవ కశ్యపో హి మహౌజసః ॥
మహావీరస్స సహసా వ్యజ్యమానాత్మ పౌరుషః ।
వవృధేశ్మశ్మ సారేణ కాయేనా ద్రి పతిర్యథా ॥
అథ స తారకో దైత్యో మహాబల పరాక్రమః ।
తపః కర్తుం జనన్యాశ్చాజ్ఞాం యయాచే మహామనాః ॥

ఓ మహర్షీ! ఈ తీరున బహు విధముల ఉత్పాతములు పుట్టినవి. అచటి అజ్ఞానులగు జనులు జగత్తునకు ప్రలయము వచ్చుచున్నదని తలపోసిరి (17). తరువాత కశ్యప ప్రజాపతి విమర్శను చేసి, మహాతేజశ్శాలియగు ఆ రాక్షస బాలకునకు తారకుడని పేరు పెట్టెను (18). మహా వీరుడు, ప్రకటింపబడుచున్న స్వీయ పౌరుషము గలవాడు నగు ఆ తారకుడు పర్వతమువలె పాషాణదృఢమగు శరీరముతో శీఘ్రముగా పెరుగ మొదలిడెను (19). గొప్ప బలపరాక్రమములు గలవాడు, దృఢచిత్తము గలవాడునగు ఆ తారకుడపుడు తపస్సును చేయుటకు తల్లి ఆజ్ఞను వేడుకొనెను (20).

ప్రాప్తాజ్ఞస్స మహామాయీ మాయినా మపి మోహనః ।
సర్వదేవజయం కర్తు తపోర్థం మన ఆదధే ॥
మధోర్వ నముపాగమ్య గుర్వాజ్ఞా ప్రతిపాలకః ।
విధిముద్దిశ్య విధివత్తపస్తేపే సుదారుణమ్ ॥
ఊర్ధ్వ బాహుశ్చైకపాదో రవిం పశ్యన్ స చక్షుషా ।
శతవర్షం తపశ్చ క్రే దృఢచిత్తో దృఢవ్రతః ॥
అంగుష్ఠేన భువం స్పృష్ట్వా శతవర్షం చ తాదృశః ।
తేపే తపో దృఢాత్మా స తారకోఽ సురరాట్ ప్రభుః ॥

మాయావులనైననూ మోహింప చేయగలిగే ఆ మహామాయావి తల్లి ఆజ్ఞను పొంది, దేవతలనందరినీ జయించుటకై తపస్సును చేయుటకు మనస్సులో నిశ్చయించుకొనెను (21). పెద్దల ఆజ్ఞను పాలించు ఆతడు మధువనమును చేరి బ్రహ్మ గారినుద్దేశించి మిక్కిలి తీవ్రమగు తపస్సును యథావిధిగా చేసెను (22). ఆతడు చేతులు పైకెత్తి ఒక కాలిపై నిలబడి సూర్యుని చూచుచూ దృఢమగు మనస్సు, దృఢమగు దీక్ష గలవాడై వంద సంవత్సరములు తపస్సు చేసెను (23). దృఢనిశ్చయము గలవాడు, రాక్షసులకు అధీశ్వరుడు అగు ఆ తారకుడు బొటన వేలిపై నిలబడి అదే తీరున వంద సంవత్సరములు తపస్సు చేసెను (24).

శతవర్షం జలం ప్రాశ్నన్ శతవర్షం చ వాయు భుక్ ।
శతవర్షం జలే తిష్ఠన్ శతం చ స్థండిలేఽ తపత్ ॥
శతవర్షం తథా చాగ్నౌ శతవర్ష మధోముఖః ।
శతవర్షం తు హస్తస్య తలేన చ భువం స్థితః ॥
శతవర్షం తు వృక్షస్య శాఖామాలంబ్య వై మునే ।
పాదాభ్యాం శుచిధూమం హి పిబంశ్చాధో ముఖస్తథా ॥
ఏవం కష్టతరం తేపే సుతపస్స తు దైత్యరాట్ ।
కామముద్దిశ్య విధివచ్ఛృణ్వతామపి దుస్సహమ్ ॥

ఆతడు వంద సంవత్సరములు నీటిని మాత్రమే త్రాగుచూ, వంద సంవత్సరములు గాలిని మాత్రమే భక్షించి, వంద సంవత్సరములు నీటిలో నిలబడి, మరియు వంద సంవత్సరములు నేలపై నిలబడి తపస్సును చేసెను (25). వంద సంవత్సరములు అగ్నుల మధ్యలో, వంద సంవత్సరములు శీర్షాసనములో మరియు వంద సంవత్సరములు అరిచేతిపై నేలమీద నిలబడి తపస్సును చేసెను (26). ఓ మహర్షీ! వంద సంవత్సరములు చెట్టు కొమ్మనుండి కాళ్లతో వ్రేలాడుతూ, మరియు క్రిందకు వ్రేలాడు ముఖముతో నిప్పులనుండి వెలువడు పొగను త్రాగి తపస్సును చేసెను (27). ఈ విధముగా ఆ రాక్షస రాజు వినువారలకు కూడ సహింపశక్యము గాని ఘోరతపస్సును తన కోరిక సిద్ధించుట కొరకై యథా విధిగా చేసెను (28).

తస్యైవం తపతస్తస్య మహత్తేజో వినిస్సృతమ్ ।
శిరసస్సర్వసంసర్పి మహోప ద్రవకృన్మునే ॥
తేనైవ దేవలోకాస్తే దగ్ధప్రాయా బభూవిరే ।
అభితో దుఃఖమాపన్నా స్సర్వే దేవర్షయో మునే ॥
ఇంద్రశ్చ భయమాపేదేఽధికం దేవేశ్వరస్తదా ।
తపస్య త్యద్య కశ్చిద్వై మత్పదం ధర్షయిష్యతి ॥
అకాండే చైవ బ్రహ్మాండం సంహరిష్యత్యయం ప్రభుః ।
ఇతి సంశయమాపన్నా నిశ్చయం నోపలేభిరే ॥

ఇట్లు తపస్సును చేయుచున్న ఆ తారకుని శిరస్సు నుండి గొప్ప తేజస్సు బయల్వెడలి అంతటా వ్యాపించి గొప్ప విపత్తును కలిగించెను. ఓ మహర్షీ! (29) దానిచే ఆ దేవలోకములు దహింపబడుచున్నవా అన్నట్లుండెను. ఓ మునీ! దేవతలు, మునులు అందరూ అన్ని వైపుల నుండియూ దుఃఖమును పొందిరి (30). అపుడు దేవరాజగు ఇంద్రుడు కూడా "వీడెవడో తపస్సును చేసి నా పదవిని ఊడలాగుకొనునేమో !" అని భయపడెను (31). పరమేశ్వరుడు అకాలములో బ్రహ్మాండ ప్రలయమును చేయుచున్నాడని దేవతలు సందేహమును పొందిరి. వారికి నిశ్చయము కలుగలేదు (32).

తతస్సర్వే సుసంమంత్ర్య మిథస్తే నిర్జరర్షయః ।
మల్లో కమగమన్ భీతా దీనా మాం సముపస్థితాః ॥
మాం ప్రణమ్య సుసంస్తూయ సర్వే తే క్లిష్టచేతసః ।
కృతస్వంజలయో మహ్యం వృత్తం సర్వం న్యవేదయన్ ॥
అహం సర్వం సునిశ్చిత్య కారణం తస్య సద్ధియా ।
వరం దాతుం గతస్తత్ర యత్ర తప్యతి సోఽసురః ॥
అవోచం వచనం తం వై వరం బ్రూహీత్యహం మునే ।
తపస్తప్తం త్వయా తీవ్రం నాదేయం విద్యతే తవ ॥
ఇత్యేవం మద్వచశ్రుత్వా తారకస్స మహాసురః ।
మాం ప్రణమ్య సుసంస్తూయ వరం వవ్రేఽతిదారుణమ్ ॥

అపుడు ఆ దేవతలు, మునులు అందరు పరస్పరము చర్చించుకొని భయముతో దీనులైన్కైనా లోకమునకు వచ్చి నన్ను సమీపించిరి (33). దుఃఖముతో గూడిన మనస్సు గల వారందరు చేతులు ఒగ్గి నాకు నమస్కరించి స్తుతించి వృత్తాంతమునంతనూ నివేదించిరి (34). ఆ లోకోప ద్రవమునకు గల కారణమును నేను విమర్శ చేసి నిశ్చయించి, ఆ రాక్షసుడు తపము చేయుచున్న స్థలమునకు వరమునిచ్చుటకై వెళ్లితిని (35). ఓ మహర్షీ! నేనాతనితో నిట్లంటిని: వరమును కోరుకొనుము. నీవు తీవ్రమగు తపస్సును చేసియుంటివి. నీకు ఈయరాని వరము లేదు (36). ఈ నా మాటను విని మహా సురుడగు ఆ తారకుడు నాకు నమస్కరించి చక్కగా స్తుతించి మిక్కిలి దారుణమగు వరమును కోరుకొనెను (37).

తారక ఉవాచ:

త్వయి ప్రసన్నే వరదే కిమసాధ్యం భవేన్మమ ।
అతో యాచే వరం త్వత్తశ్శృణు తన్మే పితామహ ॥
యది ప్రసన్నో దేవేశ యది దేయో వరో మమ ।
దేయం వరద్వయం మహ్యం కృపాం కృత్వా మమోపరి ॥
త్వయా చ నిర్మితే లోకే సకలేఽస్మిన్మహా ప్రభో ।
మత్తుల్యో బలవాన్నూనం న భవేత్కోఽపి వై పుమాన్ ॥
శివవీర్య సముత్పన్నః పుత్రస్సేనా పతిర్యదా ।
భూత్వా శస్త్రం క్షిపేన్మహ్యం తదా మే మరణో భవేత్ ॥

తారకుడిట్లు పలికెను -

వరములనిచ్చు నీవు ప్రసన్నుడవైనచో, నాకు సాధ్యము కానిది ఏమి ఉండును? హే పితామహా! నేను నీ నుండి కోరు వరమును చెప్పెదను. వినుము (38). హే దేవదేవా! నీవు నాయందు ప్రసన్నుడవై, నాకు వరమునీయ నిశ్చయించినచో, నాపై దయ ఉంచి నాకు రెండు వరముల నీయవలెను (39). 'హే మహాప్రభో! నీవు నిర్మించిన బ్రహ్మాండములో ఎక్కడనైననూ నాతో సమమగు బలముగల పురుషుడు మరియొక్కడు ఎవడైననూ ఉండరాదు. ఇది నిశ్చయము

(40). శివుని వీర్యముచే పుట్టిన కుమారుడు సేనాపతియై ఏనాడు నాపై ఆయుధమును ప్రయోగించునో, అపుడు మాత్రమే నాకు మరణము కలుగవలెను (41).

ఇత్యుక్తోఽథ తదా తేన దైత్యేనాహం మునీశ్వర ।
వరం చ తా దృశం దత్త్వా స్వలో కమగమం ద్రుతమ్ ॥
దైత్యోఽపి సవరం లబ్ధ్వా మనసేప్సిత ముత్తమమ్ ।
సుప్రసన్న తరో భూత్వా శోణితాఖ్యపురం గతః ॥
అభిషిక్తస్తదా రాజ్యే త్రైలో క్యస్యాసురై స్సహ ।
శుక్రేణ దైత్య గురుణాజ్ఞయా మే స మహాసురః ॥
తతస్తు స మహాదైత్యోఽ భవత్ త్రైలో క్యనాయకః ।
స్వాజ్ఞాం ప్రవర్తయామాస పీడయన్ సచరాచరమ్ ॥

ఓ మహర్షీ! ఆ రాక్షసుడు అపుడు నాతో అట్లు పలుకగా, నేను ఆ వరములనిచ్చి వెంటనే నా లోకమునకు తిరిగి వచ్చితిని (42). ఆ రాక్షసుడు తాను కోరిన గొప్ప వరములను పొంది మిక్కిలి ప్రసన్నుడై శోణితమను పేరు గల నగరమును చేరెను (43). అపుడు రాక్షసగురువగు శుక్రుడు నా ఆజ్ఞను పొంది ఆ మహాసురుని రాక్షసుల సన్నిధిలో ముల్లోకములకు రాజుగా అభిషేకించెను (44). అపుడా మహా రాక్షసుడు ముల్లోకములకు ప్రభువై, స్థావర జంగమములగు ప్రాణులను పీడించుచూ తన ఆజ్ఞను ప్రవర్తిల్లజేసెను (45).

రాజ్యం చకార విధివత్త్రిలో కస్య స తారకః ।
ప్రజాశ్చ పాలయామాస పీడయన్నిర్జ రాదికాన్ ॥
తతస్స తారకో దైత్య స్తేషాం రత్నాన్యుపాదదే ।
ఇంద్రాదిలో కపాలానాం స్వతో దత్తాని తద్భయాత్ ॥
ఇంద్రేణైరావతస్త స్య భయాత్తస్మై సమర్పితః ।
కుబేరేణ తదా దత్తా నిధయో నవసంఖ్య కాః ॥
వరుణేన హయాశ్శుభ్రా ఋషిభిః కామకృత్తథా ।
సూర్యేణోచ్చైశ్రవా దివ్యో భయాత్తస్మై సమర్పితః ॥

ఆ తారకుడు ముల్లోకములలో యథావిధిగా రాజ్యమునేలెను. ఆతడు దేవతలు మొదలగు వారిని పీడించుచూ, ఇతర ప్రజలను పాలించెను (46). తరువాత ఆ తారకుడు వారి శ్రేష్ఠవస్తువులను లాగుకొనెను. ఇంద్రుడు మొదలగు దేవతలు ఆ రాక్షసునకు భయపడి శ్రేష్ఠవస్తువులను స్వయముగా ఆతనికి సమర్పించిరి (47). ఇంద్రుడు భయముతో తన ఐరావత గజమును ఆతనికి సమర్పించెను. కుబేరుడు నవనిధులను ఇచ్చివేసెను (48). వరుణుడు తెల్లని గుర్రములను, సూర్యుడు దివ్యమగు ఉచ్చైశ్శ్రవమును భయముతో ఆతనికిచ్చివేసిరి. ఋషులు కోర్కెల నీడేర్చు కామధేనువు నిచ్చిరి (49).

యత్ర యత్ర శుభం వస్తు దృష్టం తేనాసురేణ హి ।

తత్త ద్గృహీతం తరసా నిస్సారశ్రీ భవోఽభవత్ ॥

సముద్రాశ్చ తథా రత్నాన్యదుస్తస్మై భయాన్మునే ।

అకృష్ట పచ్యా సీత్పృథ్వీ ప్రజాః కామదుఘాఽ ఇలాః ॥

సూర్యశ్చ తపతే తద్వత్ తద్దుఃఖం న యథా భవేత్ ।

చంద్రస్తు ప్రభయా దృశ్యో వాయుస్సర్వాను కూలవాన్ ॥

దేవానాం చైవ యద్ద్రవ్యం పితౄణాం చ పరస్య చ ।

తత్సర్వం సముపాదత్త మసురేణ దురాత్మనా ॥

ఆ రాక్షసుడు ఎక్కడెక్కడ ఏయే శుభవస్తువు కంట పడినా, దానిని తీసుకొని వెళ్లెను. ఇట్లు ముల్లోకములు సారహీనము లయ్యెను (50). ఓ మహర్షీ! సముద్రములు వానికి భయపడి తమలోని రత్నములను ఇచ్చివేసినవి. భూమి దున్నకుండగనే పంటలు పండినవి. ప్రజలందరు రాజుయొక్క కోర్కెలను దీర్చిరి (51). వానికి దుఃఖము కలుగకుండునట్లు సూర్యుడు ప్రకాశించెను. చంద్రుని కాంతి సర్వదా కన్పట్టెను. వాయువు అందరికీ అనుకూలముగా వీచెను (52). ఆ దుష్టుడు దేవతల హవిస్సులను, పితృ దేవతల హవిర్భాగములను సర్వమును లాగుకొనెను. మరియు ఆతడు ఇతరులందరి సంపదలను హరించి వేసెను (53).

వశీకృత్య స లో కాంస్త్రీన్ స్వయమింద్రో బభూవ హ ।

అద్వితీయః ప్రభుశ్చాసీద్రాజ్యం చక్రేఽద్భుతం వశీ ॥

నిస్సార్య సకలాన్ దేవాన్ దైత్యాన స్థాపయత్తతః ।

స్వయం నియోజయామాస దేవయోనీస్స్వకర్మణి ॥

అథ తద్బాధితాతో దేవాస్సర్వే శక్రపురోగమాః ।

మునే మాం శరణం జగ్ముర నాథా అతివిహ్వలా: ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

తారకాసుర తపో రాజ్య వర్ణనం నామ పంచదశోఽధ్యాయః (15).

ఆతడు ముల్లోకములను వశము చేసుకొని తానే ఇంద్ర పదవి నధిష్ఠించి ఏకైక ప్రభువు అయి, సర్వమును తన వశమునందుంచుకొని, అద్భుతముగా రాజ్యమును చేసెను (54). అపుడాతడు దేవతలనందరినీ వెళ్లగొట్టి ఆ స్థానములలో రాక్షసులను స్వయముగా నియమించెను. గంధర్వాది దేవగణములను తన సేవకులుగా నియమించుకొనెను (55). ఓ మహర్షీ! అపుడు వానిచే పీడింపబడిన ఇంద్రాది దేవతలందరు దిక్కు తోచనివారై మహా దుఃఖముతో నన్ను శరణు జొచ్చిరి (56).

శ్రీ శివ మహా పురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో తారకాసురుని తపస్సు, రాజ్యముల వర్ణన అనే పదునైదవ అధ్యాయము ముగిసినది (15).

16 - బ్రహ్మ దేవతల నోదార్చుట

బ్రహ్మో వాచ ।

అథ తే నిర్జరాస్సర్వే సుప్రణమ్య ప్రజేశ్వరమ్ ।
తుష్టువుః పరయా భక్త్యా తారకేణ ప్రపీడితాః ॥
అహం శ్రుత్వా మరనుతిం యథార్థాం హృదయంగమామ్ ।
సుప్రసన్నతరో భూత్వా ప్రత్యవోచం దివౌకసః ॥
స్వాగతం స్వాధికారా వై నిర్విఘ్నాస్సంతి వస్సురా: ।
కి మర్థమాగతా యూయమత్ర సర్వే వదంతు మే ॥
ఇతి శ్రుత్వా వచో మే తే నత్వా సర్వే దివౌకసః ।
మామూచుర్మతకా దీనాస్తారకేణ ప్రపీడితాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడా దేవతలందరు తారకునిచే పీడింపబడిన వారై ప్రజాపతిని మహాభక్తితో ప్రణమిల్లి స్తుతించిరి (1). సత్యము, మనోహరమునగు దేవతల స్తుతిని విని నేను మిక్కిలి ప్రసన్నుడనై దేవతలకు ఇట్లు బదులిడితిని (2). దేవతలారా! స్వాగతము. మీ మీ అధికారములు విఘ్నములు లేకుండగా కొనసాగుచున్నవా? మీరందరు ఇచటకు ఏల వచ్చితిరి? చెప్పుడు (3). ఆ దేవతలందరు ఈ నా మాటను విని ప్రణమిల్లి తారకుని బెడదచే దీనులుగా నున్నవారై నాతో నిట్లనిరి (4).

దేవా ఊచుః ।

లోకేశ తారకో దైత్యో వరేణ తవ దర్పితః ।
నిరస్యాస్మాన్ హఠాత్ స్థానాన్యగ్రహీన్నో బలాత్ స్వయమ్ ॥
భవతః కిము న జ్ఞాతం దుఃఖం యన్న ఉపస్థితమ్ ।
తద్దుఃఖం నాశయ క్షిప్రం వయం తే శరణం గతాః ॥
అహర్నిశం బాధతేస్మాన్ యత్ర తత్రాస్థితాన్ సవై ।
పలాయమానా: పశ్యామో యత్ర తత్రాపి తారకమ్ ॥
తారకాన్నశ్చ యద్దుః ఖం సంభూతం సకలేశ్వర ।
తేన సర్వే వయం తాత పీడితా వికలా అతి ॥

దేవతలిట్లు పలికిరి -

హే లోకనాథా! నీవు ఇచ్చిన వరముచే గర్వితుడైన తారకాసురుడు మమ్ములను బలాత్కారముగా మా పదవుల నుండి వెళ్లగొట్టి ఆ పదవులను తానే ఆక్రమించెను (5). మాకు కలిగిన ఈ విపత్తు గురించి నీకు తెలియనే లేదా? మేము నిన్ను శరణు జొచ్చితిమి. మా దుఃఖమును వెంటనే దూరము చేయుము (6). మేము ఎచ్చట నున్ననూ మమ్ములనీ దుఃఖము రాత్రింబగళ్లు పీడించుచున్నది. మేము ఎచటకు పారిపోయిననూ, తారకుడచటనే మాకు ప్రత్యక్షమగుచున్నాడు (7). హే సర్వేశ్వరా! తండ్రీ! తారకుని వలన మాకు సంప్రాప్తమైన దుఃఖముచే మేమందరము మిక్కిలి పీడింపబడి దుఃఖితులమై యున్నాము (8).

అగ్నిర్యమోఽథ వరుణో నిర్ ఋతిర్వాయురేవ చ ।
అన్యే దిక్పతయశ్చాపి సర్వే యద్వశగామినః ॥
సర్వే మనుష్య ధర్మాణస్సర్వైః పరికరై ర్యుతాః ।
సేవంతే తం మహాదైత్యం న స్వతంత్రాః కదాచన ॥
ఏవం తేనార్దితా దేవా వశగాస్తస్య సర్వదా ।
తదిచ్ఛాకార్య నిరతాస్సర్వే తస్యాను జీవినః ॥
యావత్యో వనితాస్సర్వా యే చాప్యప్సరసాం గణాః ।
సర్వాంస్తాన గ్రహీద్దైత్యస్తారకోఽసౌ మహాబలీ ॥

అగ్ని, యముడు, వరుణుడు, నీర్ ఋతి, వాయువు, మరియు ఇతర దిక్పాలకులందరు వానికి వశులై (9), మనుష్యులవలె సంచరించుచూ, వివిధ పరికరములను చేతబట్టి, ఆ మహాసురుని సేవించుచున్నారు. వారికి ఒక క్షణమైననూ స్వాతంత్ర్యము లేకున్నది (10). ఇట్లు వానిచే పీడింపబడిన దేవతలందరు అన్ని కాలములయందు వానికి వశులై, వాని కోరికకు అనురూపమగు పనులను చేయుచూ, వాని సేవకులై జీవించుచున్నారు (11). వారి యువతులు అందరు, మరియు అప్సరస స్త్రీ లు ఎవరు గలరో, వారిని అందరినీ మహాబలశాలియగు ఆ తారకాసురుడు తన వశము చేసుకొనెను (12).

న యజ్ఞాస్సం ప్రవర్తంతే న తపస్యంతి తాపసాః ।
దాన ధర్మాదికం కించిన్న లోకేషు ప్రవర్తతే ॥
తస్య సేనాపతిః క్రౌంచో మహాపాప్యస్తి దానవః ।
స పాతాల తలం గత్వా బాధతే త్వనిశం ప్రజాః ॥
తేన నస్తారకేణేదం సకలం భువనత్రయమ్ ।
హృతం హఠాజ్జగద్ధాతః పాపేనా కరుణాత్మనా ॥
వయం చ తత్ర యాస్యామో యత్ స్థానం త్వం వినిర్దిశేః ।
స్వస్థాస్తద్వారితాస్తేన లోకనాథ సురారిణా ॥

యజ్ఞములు ఆగిపోయినవి. తాపసులు తపస్సును చేయుట లేదు. లోకములలో దాన ధర్మాదికము లేమియూ జరుగుట లేదు (13). వాని సేనాపతి, మహా పాపి అగు క్రౌంచాసురుడొకడు గలడు. వాడు ప్రతి దినము పాతాళ లోకమునకు వెళ్లి ప్రజలను బాధించుచున్నాడు (14). ఓ జగత్కర్తా! కఠిన హృదయుడు పాపియగు ఆ తారకుడు హఠాత్తుగా ఈ ముల్లోకముల రాజ్యమును మానుండి అపహరించినాడు (15). హే లోకనాథా! ఆ రాక్షసుడు మా స్థానములకు మేము వెళ్లకుండగా వారించుచున్నాడు. నీవు మాకు ఒక స్థానమును నిర్దేశించుము. మేము అచటకు వెళ్లి స్వస్థులమై ఉండెదము (16).

త్వం నో గతిశ్చ శాస్తా చ ధాతా త్రాతా త్వమేవ హి ।

వయం సర్వే తారకాఖ్య వహ్నౌ దగ్ధాస్సు విహ్వలాః ॥

తేన క్రూరా ఉపాయా నస్సర్వే హతబలాః కృతాః ।

వికారే సంనిపాతే వా వీర్యవంత్యౌషధాని చ ॥

యత్రాస్మాకం జయాశా హి హరిచక్రే సుదర్శనే ।

ఉత్కుంఠిత మభూత్తస్య కంఠే పుష్ప మివార్పితమ్ ॥

మాకు గతి నీవే. మా పాలకుడవు, తండ్రివి, రక్షకుడవు నీవే. మేమందరము తారకుడనే అగ్ని యందు మాడి దుఃఖితులమై యున్నాము (17). మేము ఆతని యందు ప్రయోగించిన భయంకరమగు ఆయుధములన్నియూ, సన్నిపాత రోగికి ఈయబడిన గొప్ప శక్తి గల ఔషధములవలె, నిర్వీర్యములుగా చేయబడినవి (18). విష్ణువు యొక్క సుదర్శన చక్రముపై మాకు జయించగలమనే ఆశ ఉండెడిది. కాని అది ఆతని కంఠమునందు పుష్పమాలవలె అలంకారమై, నిర్వీర్యమైనది (19).

బ్రహ్మోవాచ ।

ఇత్యేతద్వచనం శ్రుత్వా నిర్జరాణామహం మునే ।

ప్రత్యవోచం సురాన్ సర్వాన్ తత్కాలసదృశం వచః ॥

మమైవ వచసా దైత్యస్తారకాఖ్యో సమేధితః ।

న మత్తస్తస్య హననం యుజ్యతే హి దివౌకసః ॥

తతో నైవ వధే యోగ్యో యతో వృద్ధి ముపాగతః ।

విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తుమ సాంప్రతమ్ ॥

యుష్మాకం చాఖిలం కార్యం కర్తుం యోగ్యో హి శంకరః ।

కిం తు స్వయం న శక్తో హి ప్రతికర్తుం ప్రచోదితః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! దేవతల ఈ వచనములను విని నేను దేవతలనందరినీ ఉద్దేశించి ఆ కాలమునకు తగిన విధముగా నిట్లు బదులిడితిని (20). తారకాసురుడు నా ఆజ్ఞచేతనే పెంచి పెద్ద చేయబడినాడు. ఓ దేవతలారా! నేను ఆతనిని సంహరించుట సరిగాదు (21). ఒక వ్యక్తిని ఎవరు పెంచెదరో, వారే ఆతనిని సంహరించుట యోగ్యము కాదు. విషవృక్షమునైననూ పెంచిన వ్యక్తి తన చేతులతో నరికివేయుట తగదు (22). మీ కార్యమునంతనూ చక్క బెట్టుటకు తగిన వాడు శంకరుడు. కాని మీరు ప్రార్థించిననూ ఆయన స్వయముగా ఆ రాక్షసుని మట్టుబెట్టజాలడు (23).

తారకాఖ్యస్తు పాపేన స్వయమేష్యతి సంక్షయమ్ ।
యథా యూయం సంవిదధ్వ ముపదేశ కరస్త్వహమ్ ॥
నమయా తారకో వధ్యో హరిణాపి హరేణ చ ।
నాన్యేనాపి సురైర్వాపి మద్వరాత్సత్య ముచ్యతే ॥
శివవీర్య సముత్పన్నో యది స్యాత్తనయస్సురాః ।
స ఏవ తారకాఖ్యస్య హంతా దైత్యస్య నాపరః ॥
యముపాయమహం వచ్మి తం కురుధ్వం సురోత్తమాః ।
మహాదేవ ప్రసాదేన సిద్ధిమేష్యతి స ధ్రువమ్ ॥

తారకాసురుడు తాను ఆచరించు పాపముల చేతనే వినాశమును పొందగలడు. మీకు తెలియు విధముగా నేను ఉపదేశమును చేసెదను (24). నేను గాని, విష్ణువు గాని, శివుడు గాని, దేవతలలో ఇతరులెవ్వరైననూ గాని నా వరప్రభావముచే తారకుని వధింపజాలరు. నేను సత్యమును చెప్పుచున్నాను (25). ఓ దేవతలారా! శివుని వీర్యము వలన కుమారుడు జన్మించినచో, ఆతడు మాత్రమే తారకాసురుని సంహరించగలడు. ఇతరుడు ఎవ్వడూ ఆతనిని సంహరించజాలడు (26). ఓ దేవతోత్తములారా! నేను చెప్పబోవు ఉపాయమును మీరు ఆచరించుడు. ఆ ఉపాయము మహాదేవుని అనుగ్రహముచే నిశ్చయముగా సిద్ధించగలదు (27).

సతీ దాక్షాయణీ పూర్వం త్యక్త దేహా తు యాభవత్ ।
సోత్పన్నా మేనకా గర్భాత్సా కథా విదితా హి వః ॥
తస్యా అవశ్యం గిరిశః కరిష్యతి కరగ్రహమ్ ।
తత్కురు ధ్వముపాయం చ తథాపి త్రిదివౌ కసః ॥
తథా విదధ్వం సుతరాం తస్యాం తు పరియత్నతః ।
పార్వత్యాం మేనకా జాయాం రేతః ప్రతినిపాతనే ॥
తమూర్ధ్వ రేతసం శంభుం సైవ ప్రచ్యుత రేతసమ్ ।
కర్తుం సమర్థా నాన్యాస్తి తథా కాప్య బలా బలాత్ ॥

పూర్వము దక్షుని కుమార్తెగా జన్మించి దేహమును త్యజించిన సతీదేవియే మేనక గర్భమునందు జన్మించినది. ఈ వృత్తాంతము మీకు తెలిసినదే (28). ఆమెను శివుడు నిశ్చయముగా వివాహమాడు ఉపాయమును మీరు అనుష్ఠించుడు. ఓ దేవతలారా! (29). మేనక కుమార్తె యగు పార్వతి శివుని వీర్యమును తన గర్భమునందు ధరించు ఉపాయమును ప్రయత్న పూర్వకముగా చేయుడు (30). ఊర్ధ్వ రేతస్కుడగు శంభుని సంసారిగా చేయగల శక్తి ఆమెకు తక్క మరియొక స్త్రీ కి ఏ విధముగనైననూ లేదు (31).

సా సుతా గిరిరాజస్య సాంప్రతం ప్రౌఢయౌవనా ।
తపస్యంతం హిమగిరౌ నిత్యం సంసేవతే హరమ్ ॥
వాక్యాద్ధిమవతః కాలీ స్వపితుర్హ్‌ఠతశ్శివా ।
సఖీభ్యాం సేవతే సార్ధం ధ్యానస్థం పరమేశ్వరమ్ ॥
తామగ్రతోఽ ర్చమానాం వై త్రైలో క్యే వరవర్ణినీమ్ ।
ధ్యానాసక్తో మహేశో హి మనసాపి న హీయతే ॥
భార్యాం సమీహేత యథా స కాలీం చంద్రశేఖరః ।
తథా విదధ్వం త్రిదశా న చిరాదేవ యత్నతః ॥

ఆ హిమవత్పుత్రిక ఇప్పుడు పూర్ణయౌవనమై ఉన్నది. హిమవత్పర్వతముపై తపస్సు◌ను చేయుచున్న శివుని ఆమె ప్రతి దినము చక్కగా సేవించుచున్నది(32). శివ పత్నియగు ఆ కాళి హిమవంతుని మాటను బట్టి, మరియు తన పట్టుదలవలన, ధ్యానమునందున్న పరమేశ్వరుని ఇద్దరు సఖురాండ్రతో గూడి సేవించుచున్నది (33). ముల్లోకములలో సుందరియగు ఆమె తన ఎదుట సేవను చేయుచున్ననూ, ధ్యానమగ్నుడగు మహేశ్వరుడు ఆమెను మనస్సులో నైననూ కోరుకొనలేదు (34). ఓ దేవతలారా! ఆ చంద్రశేఖరుడు తొందరలోనే ఆ కాళిని భార్యను చేసుకొను కోరికను పొందునట్లు మీరు దృఢమగు యత్నమును చేయుడు (35).

స్థానం గత్వాథ దైత్యస్య తమహం తారకం తతః ।
నివారయిష్యే కుహఠాత్ స్వస్థానం గచ్ఛతామరాః ॥
ఇత్యుక్త్వాహం సురాన్ శీఘ్రం తారకా ఖ్యా సురస్య వై ।
ఉపసంగమ్య సుప్రీత్యా సమాభాష్యే దమబ్రువమ్ ॥
తేజస్సారమిదం స్వర్గం రాజ్యం త్వం పరిపాసి నః ।
యదర్థం సుతపస్తప్తం వాంఛసి త్వం తతోఽధికమ్ ॥
వరశ్చాప్యవరో దత్తో న మయా స్వర్గరాజ్యతా ।
తస్మాత్స్వర్గం పరిత్యజ్య క్షితౌ రాజ్యం సమాచర ॥

తరువాత నేను ఆ తారకుని స్థానమునకు వెళ్లి ఆతనిని తన చెడు పట్టుదలనుండి◌ి నివారించగలను. ఓ దేవతలారా! మీ స్థానమునకు వెళుడు (36). నేను దేవతలతో నిట్లు పలికి, వెంటనే తారకాసురుని వద్దకు వెళ్లి, మిక్కిలి ప్రీతితో పిలిచి, ఇట్లు చెప్పితిని (37). ఈ స్వర్గము తేజస్సు యొక్క సారము. నీవు మా రాజ్యమును పాలించుచున్నావు. నీవు దేనిని కోరి గొప్ప తపస్సును చేసితివో, అంతకు మించి ఇప్పుడు కోరుచుంటివి (38). నేను నీకు ఇచ్చిన వరము ఇంతకంటే తక్కువది. నేను స్వర్గ రాజ్యవరమును నీకీయలేదు. కావున నీవు స్వర్గమును విడిచిపెట్టి, భూమిపై రాజ్యము నేలుము (39).

దేవయోగ్యాని తత్రైవ కార్యాణి నిఖిలాన్యపి ।
భవిష్యంత్య సురశ్రేష్ఠ నాత్ర కార్యా విచారణా ॥
ఇత్యుక్త్వాహం చ సంబోధ్యాసురం తం సకలేశ్వరః ।
స్మృత్వా శివం చ సశివం తత్రాంతర్ధాన మాగతః ॥
తారకోఽపి పరిత్యజ్య స్వర్గం క్షితి మథాభ్యగాత్ ।
శోణితాఖ్యపురే స్థిత్వా సర్వరాజ్యం చకార సః ॥
దేవాస్సర్వేఽపి తచ్ఛ్రుత్వా మద్వాక్యం సుప్రణమ్య మామ్ ।
శక్రస్థానం యయుః ప్రీత్యా శక్రేణ సుసమాహితాః ॥
తత్ర గత్వా మిలిత్వా చ విచార్య చ పరస్పరమ్ ।
తే సర్వే మరుతః ప్రీత్యా మఘవంతం వచోఽబ్రువన్ ॥

ఓ రాక్షసశేష్ఠా! స్వర్గమునకు ఉచితమగు భోగములన్నియూ అచట కూడ ఉండగలవు. నీవీ విషయములో చింతిల్లకుము (40). నేను ఇట్లు పలికి ఆ రాక్షసుని ఒప్పించితిని. సర్వేశ్వరుడనగు నేను ఉమా పరమేశ్వరులను స్మరించి, అచటనే అంతర్ధానమైతిని (41). తారకుడు కూడా స్వర్గమును వీడి భూలోకమునకు వెళ్లి, శోణితనగరమునందున్నవాడై ముల్లోకముల నేలెను (42). నా ఈ మాటను విని దేవతలందరు నాకు ప్రణమిల్లి ఇంద్రునితో గూడి ప్రేమపూర్వకముగా స్వర్గమునకు వెళ్లిరి (43). అచటకు వెళ్లి ఆ దేవతలందరు తమలో తాము చర్చించుకొని ప్రేమ పూర్వకముగా ఇంద్రునితో నిట్లనిరి. (44).

దేవా ఊచుః ।

శంభో ర్యథా శివాయాం వై రుచిర్జాయేత కామతః ।
మఘవంస్తే ప్రకర్తవ్యం బ్రహ్మోక్తం సర్వమేవ తత్ ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ ఇంద్రా! కాముని ప్రభావముచే శంభునకు శివాదేవి యందు అనురాగము కల్గునట్లు నీవు ప్రయత్నించవలెను. ఈ విషయమునంతనూ బ్రహ్మ గారు చెప్పియున్నారు. గదా! (45)

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం సర్వవృత్తాంతం వినివేద్య సురేశ్వరమ్ ।
జగ్ముస్తే సర్వతో దేవాస్స్వం స్వం స్థానం ముదాన్వితాః ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితాయాం తృతీయే పార్వతీ ఖండే దేవసాంత్వన వర్ణనం నామ షోడశోఽధ్యాయః (16).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ దేవతలు ఈ తీరున దేవరాజునకు వృత్తాంతమునంతనూ నివేదించి, ఆనందముతో గూడిన వారై తమ తమ స్థానములకు వెళ్లిరి (46).

17- ఇంద్ర మన్మథ సంవాదము

బ్రహ్మో వాచ ।

గతేషు తేషు దేవేషు శక్రస్సస్మార వై స్మరమ్ ।
పీడితస్తారకేనాతి దైత్యేన చ దురాత్మనా ॥
ఆగత స్తత్క్షణాత్కామస్స వసంతో రతిప్రియః ।
సావలేపో యుతో రత్యా త్రైలోక్య విజయీ ప్రభుః ॥
ప్రణామం చ తతః కృత్వా స్థిత్వా తత్పురతస్స్మరః ।
మహోన్నత మనాస్తాత సాంజలిశ్శ క్రమబ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ దేవతలు వెళ్లిపోగానే దురాత్ముడగు తారకాసురునిచే మిక్కిలి పీడింపబడియున్న ఇంద్రుడు మన్మథుని స్మరించెను (1). వసంతునితో కూడి యుండువాడు, రతీదేవికి ప్రియుడు, గర్విష్ఠి, రతీదేవితో కూడియున్నవాడు, ముల్లోకములను జయించు వాడు అగు కామప్రభుడు వెంటనే వచ్చెను (2). వత్సా! తరువాత మహోన్నతమగు మనస్సు గల మన్మథుడు ప్రణమిల్లి ఇంద్రుని ఎదుట అంజలి ఘటించి నిలబడి ఇంద్రునితో నిట్లనెను (3).

కామ ఉవాచః

కిం కార్యం తే సముత్పన్నం స్మృతోఽహం కేన హేతునా ।
తత్త్వం కథయ దేవేశ తత్కర్తుం సముపాగతః ॥

మన్మథుడిట్లు పలికెను -

నీకు కలిగిన పని ఏమి? నన్ను స్మరించుటకు కారణమేమి? ఓ దేవరాజా! విషయమును చెప్పుము. నీవు చెప్పు పనిని చేయుటకు వచ్చితిని (4).

బ్రహ్మో వాచ ।

తచ్ఛ్రుత్వా వచనం తస్య కందర్పస్య సురేశ్వరః ।
ఉవాచ వచనం ప్రీత్యా యుక్తం యుక్తమితి స్తువన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మన్మథుని ఆ మాటను విని దేవరాజగు ఇంద్రుడు 'బాగున్నది, బాగున్నది' అని స్తుతిస్తూ ప్రేమ పూర్వకముగా నిట్లు పలికెను (5).

శక్ర ఉవాచః

తవ సాధు సమారంభో యన్మే కార్యముపస్థితమ్ ।
తత్కర్తు ముద్య తోఽసి త్వం ధన్యోఽసి మకరధ్వజ ॥
ప్రస్తుతం శృణు మద్వాక్యం కథయామి తవాగ్రతః ।
మదీయం చైవ యత్కార్యం త్వదీయం తన్న చాన్యథా ॥
మిత్రాణి మమ సంత్యేవ బహూని సుమహాంతి చ ।
పరం తు స్మర సన్మిత్రం త్వత్తుల్యం నహి కుత్రచిత్ ॥
జయార్థం మే ద్వయం తాత నిర్మితం వజ్రముత్తమమ్ ।
వజ్రం చ నిష్ఫలం స్యాద్వై త్వం తు నైవ కదాచన ॥

ఇంద్రుడిట్లు పలికెను -

ఓ మన్మథా! నాకు పని కలుగగానే నీవు దానిని చేయుటకు సంసిద్ధుడవైతివి. నీ ఈ ఉద్యమశీలత కొనియాడ దగినది. నీవు ధన్యుడవు (6). నేను ప్రస్తుతంలో నీ ఎదుట చెప్పబోవు పలుకుల నాలకించుము. నా కార్యము నీ కార్యమే గాని మరియొకటి గాదు (7). నాకు అనేక మంది గొప్ప గొప్ప మిత్రులు గలరు. మన్మథా! కాని నీవంటి మంచి మిత్రుడు ఎక్కడనూ లేడు (8). కుమారా! నా విజయము కొరకై రెండు నిర్మింపడినవి. ఒకటి ఉత్తమమగు నా వజ్రము. రెండవది నీవు. వజ్రము నిష్ఫలము కావచ్చును. కాని నీవు ఎన్నడునూ నిర్వీర్యుడవు కావు (9).

యతో హితం ప్రజాయేత తతః కో ను ప్రియః పరః ।
తస్మాన్మిత్ర వరస్త్వం హి మత్కార్యం కర్తుమర్హసి ॥
మమ దుఃఖం సముత్పన్న మసాధ్యం చాపి కాలజమ్ ।
కేనాపి నైవ తచ్ఛక్యం దూరీకర్తుం త్వయా వినా ॥
దాతుః పరీక్షా దుర్భిక్షే రణే శూరస్య జాయతే ।
ఆపత్కాలే తు మిత్రస్యాశక్తౌ స్త్రీణాం కులస్య హి ॥
వినతేస్సంకటే ప్రాప్తేఽ వితథస్య పరోక్షతః ।
సుస్నేహస్య తథా తాత నాన్యథా సత్యమీరితమ్ ॥

ఎవడు హితమును చేగూర్చునో, వానికంటే అధిక ప్రీతిపాత్రుడు మరెవ్వరు ఉందురు? కావున, నీవు నా మిత్రులలో శ్రేష్ఠుడవు. నా కార్యమును నీవు చేయదగుదువు (10). నాకు కాల ప్రభావముచే అసాధ్యమగు దుఃఖము సంప్రాప్తమైనది. దానిని నీవు తక్క మరియొకరు ఎవరైననూ దూరము చేయజాలరు (11). దుర్భిక్షము నెలకొన్నప్పుడు దాత యొక్క దాతృత్వము, యుద్ధమునందు శూరుని శౌర్యము, ఆపద వచ్చినపుడు మిత్రుని మైత్రి, భర్త అసమర్థుడయినప్పుడు కుల స్త్రీల పాతివ్రత్యము నిగ్గుతేలును (12). కష్టము వచ్చినపుడు వినయము, పరోక్షమునందు వ్యర్థము కాని మంచి స్నేహము నిగ్గు దేలును. వీటి పరీక్షకు మరో మార్గము లేదు. నేను సత్యమును పలికితిని (13).

ప్రాప్తాయం వై మమాపత్తా వవార్యాయాం పరేణ హి ।

పరీక్షా చ త్వదీయాఽద్య మిత్రవర్య భవిష్యతి ॥

న కేవలం మదీయం చ కార్యమస్తి సుఖావహమ్ ।

కిం తు సర్వసురాదీనాం కార్యమేతన్న సంశయః ॥

ఓ మిత్ర శ్రేష్ఠా! నాకు ఆపద వచ్చినది. దానిని ఇతరులెవ్వరూ వారించలేరు. ఈనాడు ఇది నీకు పరీక్ష కాగలదు (14). ఈ పని కేవలము నా వ్యక్తిగత కార్యము కాదు. దీనియందు దేవతలు, ఇతరులు అందరి క్షేమము ఇమిడియున్నది. దీనిలో సందియము లేదు (15).

బ్రహ్మోవాచ ।

ఇత్యేతన్మఘవద్వాక్యం శ్రుత్వా తు మకరధ్వజః ।

ఉవాచ ప్రేమగంభీరం వాక్యం సుస్మిత పూర్వకమ్ ॥

మన్మథుడు ఇంద్రుని ఈ పలుకులను విని, చిరునవ్వుతో మరియు ప్రేమతో గంభీరముగా నిట్లు పలికెను (16).

కామ ఉవాచ ।

కిమర్థ మిత్థం వదసి నోత్తరం వచ్మ్యహం తవ ।

ఉపకృత్ కృత్రిమం లోకే దృశ్యతే కథ్యతే న చ ॥

సంకటే బహు యో బ్రూతే స కిం కార్యం కరిష్యతి ।

తథాపి చ మహారాజ కథయామి శృణు ప్రభో ॥

పదం తే కర్షితుం యో వై తపస్తపతి దారుణమ్ ।

పాతయిష్యామ్యహం తం చ శత్రుం తే మిత్ర సర్వథా ॥

క్షణేన భ్రంశయిష్యామి కటాక్షేణ వరస్త్రియాః ।

దేవర్షి దానవాదీంశ్చ నరాణాం గణనా న మే ॥

మన్మథుడిట్లు పలికెను -

నీవు ఇట్లు ఏల పలుకుచుంటివి? నేను నీకు సమాధానమునీయను. ఉపకారమును చేయు మిత్రుని, కృత్రిమ మిత్రుని లోకమునందు పరిశీలించెదరే గాని, వారి గురించి మాటలాడరు (17). కష్టము కలిగినప్పుడు అధికముగా మాటలాడు వాడు కార్యమునేమి చేయగలడు ? మహారాజా! ప్రభూ! అయిననూ చెప్పెదను. వినుము (18). నీ పదవిని లాగుకొనుటకై ఎవరైననూ ఘోరపతపస్సును చేయుచున్నాడా యేమీ ? ఓ మిత్రమా! అట్టి నీ శత్రువును నిశ్చితముగా పడకొట్టగలను (19). ఒక సుందరి యొక్క వాలు చూపుతో దేవతలను గాని, ఋషులు రాక్షసులు మొదలగు వారిని గాని, క్షణములో భ్రష్టులను చేయగలను. మానవులు నాకు లెక్క కాదు (20).

వజ్రం తిష్ఠతు దూరే వై శస్త్రాణ్యన్యాన్యనేకశః ।
కిం తే కార్యం కరిష్యంతి మయి మిత్ర ఉపస్థితే ॥
బ్రహ్మాణం వా హరిం వాపి భ్రష్టం కుర్యాం న సంశయః ।
అన్యేషాం గణనా నాస్తి పాతయేయం హరం త్వపి ॥
పంచైవ మృదవో బాణాస్తే చ పుష్పమయా మమ ।
చాపస్త్రిధా పుష్పమయ శ్శింజినీ భ్రమరార్జితా ॥
బలం సుదయితా మే హి వసంత స్సచివస్స్మృతః ।
అహం పంచబలో దేవ మిత్రం మమ సుధానిధిః ॥

వజ్రము, ఇతర అనేక ఆయుధములు దూరములో నుండుగాక! మిత్రుడనగు నేను వచ్చిన తరువాత అవి దేనికి పనికి రాగలవు? (21) బ్రహ్మను గాని, విష్ణువును గాని నేను నిస్సంశయముగా భ్రష్టుని చేయగలను. ఇతరుల లెక్క లేదు. నేను శివునియైనను పడగొట్టగలను (22). నాకు అయిదు బాణములు మాత్రమే గలవు. అవి పుష్పములచే చేయబడినవి. మృదువైనవి. నా ధనస్సు పుష్పములచే నిర్మింపబడి మూడు భాగములుగా నున్నది. నారిత్రాడును తుమ్మెదలు సమగూర్చును (23). నాకు మిత్రుడు, మంత్రియగు వసంతుడే నా సైన్యము. అయిదు బాణములే నా బలము. హే దేవా! చంద్రుడు నాకు మిత్రుడు (24).

సేనాధిపశ్చ శృంగారో హావభావాశ్చ సైనికాః ।
సర్వే మే మృదవశ్శక్ర అహం చాపి తథా విధః ॥
యద్యేన పూర్యతే కార్యం ధీమాంస్తత్తేన పూరయేత్ ।
మమ యోగ్యం తు యత్కార్యం సర్వం తన్మే నియోజయ ॥

శృంగారము నాకు సేనాధ్యక్షుడు, హావ భావములే నా సైనికులు. ఇంద్రా! నా [illegible] బాణములన్నియూ మృదువైనవి. నేను గూడ అట్టివాడనే (25). ఏ కార్యము దేనిచే పూర్తి యగునో, బుద్ధిమంతుడు ఆ కార్యమును ఆ సాధనముతో పూర్తి చేయవలెను. నాకు ఏ కార్యము ఉచితమో, దానియందు నన్ను సంపూర్ణముగా నియోగించుము (26).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం తు వచస్తస్య శ్రుత్వా శక్రస్సుహర్షితః ।
ఉవాచ ప్రణమన్ వాచా కామం కాంత సుఖావహమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వాని ఈ మాటలను విని ఇంద్రుడు మిక్కిలి ఆనందించి, నమస్కరించి, ప్రేమికులకు సుఖమునిచ్చు మన్మథునితో నిట్లు పలికెను (27).

శక్ర ఉవాచః

యత్కార్యం మనసోద్దిష్టం మయా తాత మనోభవ ।
కర్తుం తత్త్వం సమర్థోఽసి నాన్యస్మాత్తస్య సంభవః ॥
శృణు కామ ప్రవక్ష్యామి యథార్థం మిత్ర సత్తమ ।
యదర్థే చ స్పృహా జాతా తవ చాద్య మనోభవ ॥
తారకాఖ్యో మహాదైత్యో బ్రహ్మణో వరమద్భుతమ్ ।
అభూదజేయస్సం ప్రాప్య సర్వేషామపి దుఃఖదః ॥
తేన సంపీడ్యతే లోకో నష్టా ధర్మా హ్యనేకశః ।
దుఃఖితా నిర్జరాస్సర్వే ఋషయశ్చ తథాఖిలా: ॥

ఇంద్రుడిట్లు పలికెను -

వత్సా! మన్మథా! నేను నా మనస్సులో తలపెట్టిన కార్యమును చేయుటకు నీవే సమర్థుడవై ఉన్నావు. నీవు గాక మరియొకరి వలన ఈ పని సంభవము గాదు (28). మన్మథా! మిత్ర శ్రేష్ఠమా! ఈనాడు నిన్ను చూడవలెననే కోరిక కలుగుటకు గల వాస్తవ కారణమును చెప్పెదను. వినుము (29). తారకుడనే మహారాక్షసుడు బ్రహ్మ నుండి అద్భుతమగు వరమును పొంది, అందరికీ దుఃఖమును కలిగించుచున్నాడు. ఆతనిని జయించగలవారు లేరు (30). ఆతడు లోకములను పీడించుచున్నాడు. ధర్మములన్నియూ అనేక విధములుగా భ్రష్టమైనవి. దేవతలు, ఋషులు, ఇతరులు అందరు దుఃఖితులై ఉన్నారు (31).

దేవైశ్చ సకలైస్తేన కృతం యుద్ధం యథా బలమ్ ।
సర్వేషాం చాయుధాన్యత్ర విఫలాన్య భవన్ పురా ॥
భగ్నః పాశో జలేశస్య హరిచక్రం సుదర్శనమ్ ।
తత్కుంఠిత మభూత్తస్య కంఠే క్షిప్తం చ విష్ణునా ॥
ఏతస్య మరణం ప్రోక్తం ప్రజేశేన దురాత్మనః ।
శంభోర్వీర్యోద్భవా ద్బాలాన్మహాయోగీశ్వరస్య హి ॥
ఏతత్కార్యం త్వయా సాధు కర్తవ్యం సుప్రయత్నతః ।
తతస్స్యాన్మిత్ర వర్యాతి దేవానాం నః పరస్సుఖమ్ ॥

ఒకప్పుడు దేవతలందరు వానితో యథాశక్తి గా యుద్ధమును చేసిరి. వారి అందరి ఆయుధములు ఆతనియందు వ్యర్థమైనవి (32). వరుణుని పాశము భగ్నమయ్యెను. విష్ణువు సుదర్శన చక్రమును ఆతనిపై ప్రయోగించగా, అది మొక్క వోయి ఆతని కంఠములో పడెను (33). మహాయోగీశ్వరుడగు శంభుని కుమారుని చేతిలో ఈ దుష్టుడు మరణించునని బ్రహ్మ చెప్పెను (34). ఓ మిత్ర శ్రేష్ఠమా! కావున నీవీ పనిని గొప్ప ప్రయత్నమును చేసి సాధించవలెను. ఈ కార్యము సిద్ధించినచో, దేవతలకు మహా సుఖము కలుగును (35).

మమాపి విహితం తస్మాత్సర్వ లోకసుఖావహమ్ ।

మిత్ర ధర్మం హృది స్మృత్వా కర్తుమర్హసి సాంప్రతమ్ ॥

శంభుస్స గిరిరాజే హి తపః పరమమాస్థితః ।

స ప్రభుర్నాపి కామేన స్వతంత్రః పరమేశ్వరః ॥

తత్సమీపే చ దేవాథ పార్వతీ స్వసఖీయుతా ।

సేవమానా తిష్ఠతీతి పిత్రాజ్ఞప్తా మయా శ్రుతమ్ ॥

యథా తస్యాం రుచిస్తస్య శివస్య నియతాత్మనః ।

జాయతే నితరాం మార తథా కార్యం త్వయా ధ్రువమ్ ॥

సర్వ లోకములకు సుఖము నీయగలిగే ఈ కర్మను ఆ కారణము చేతనే నేను తప్పపక చేయదగియున్నది. నీవు స్నేహ ధర్మమును మనసునందిడుకొని ఇపుడీ పనిని చేయదగుదువు (36). ఆ శంభుడు హిమవత్పర్వతము నందు గొప్ప తపస్సును చేయుచున్నాడు. ఆ ప్రభుడు కామమునకు వశుడు కాడు. ఆయన స్వతంత్రుడగు పరమేశ్వరుడు (37). ఓ కామదేవా! తండ్రి ఆజ్ఞచే పార్వతీ తన సఖురాండ్రతో గూడి శివుని సమీపమునందుండి ఆయనను సేవించుచున్నదని నేను వినియుంటిని (38). జితేంద్రియుడగు శివునకు ఆమె యందు గొప్ప ప్రేమ కలుగునట్లు నీవు చేయవలెను. మన్మథా! నీవీ కార్యమును తప్పక సఫలము చేయవలెను (39).

ఇతి కృత్వా కృతీ స్యాస్త్వం సర్వం దుఃఖం వినంక్ష్యతి ।

లోకే స్థాయీ ప్రతాపస్తే భవిష్యతి న చాన్యథా ॥

నీవీ కార్యమును చేసి కృతార్థుడవు కమ్ము, దుఃఖమంతయూ నశించగలదు. నీ ప్రతాపము లోకమునందు చిరస్థాయిగా నుండగలదు. దీనికి భిన్నముగా జరిగే అవకాశము లేదు (40).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తస్స తు కామో హి ప్రఫుల్ల ముఖపంకజః ।
ప్రేమ్ణోవాచేతి దేవేశం కరిష్యామి న సంశయః ॥
ఇత్యుక్త్వా వచనం తస్మై తథేత్యోమితి తద్వచః ।
అగ్రహీత్తరసా కామశ్శివమాయా విమోహితః ॥
యత్ర యోగీశ్వరస్సాక్షాత్తప్యతే పరమం తపః ।
జగామ తత్ర సుప్రీత స్సదారస్సవ సంతకః ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శక్ర కామ సంవాద వర్ణనం నామ సప్తదశోఽధ్యాయః (17).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇంద్రుడిట్లు పలుకగా, వికసించిన పద్మము వంటి ముఖము గల మన్మథుడు ఇంద్రునితో 'ఈ పనిని నిస్సందేహముగా చేసెదను' అని ప్రేమతో పలికెను (41). శివమాయచే విమోహితుడైన ఆ మన్మథుడు ఇంద్రునితో నిట్లు పలికి, తన అంగీకారమును తెలిపి వెంటనే ఆయన వద్ద సెలవు తీసుకొనెను (42). ఆతడు భార్యతో వసంతునితో గూడి ఆనందముతో, యోగీశ్వరుడగు శివుడు స్వయముగా గొప్ప తపస్సును చేయుచున్న స్థానమునకు వెళ్లెను (43).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో ఇంద్రమన్మథ సంవాద వర్ణనమనే పదిహేడవ అధ్యాయము ముగిసినది (17).

18 - కాముడు వికారములను కల్గించుట

అవయవములలో ప్రకటమగు చున్న శోభను కైలాసపతి యగు శివ ప్రభుడు చూచెను (29). పూర్వము ఆమెకు బ్రహ్మ ఇచ్చిన వరమును శివుడు స్మరించుకొనెను. ఓ మహర్షీ! అపుడా ప్రభుడు ఆనందముతో ఆమె అంగములను వర్ణించెను (30).

శివ ఉవాచః

కిం ముఖం కి శశాంకశ్చ కిం నేత్రే చోత్పలే చ కిమ్ ।
భ్రుకుట్యౌ ధనుషీ చైతే కందర్పస్య మహాత్మనః ॥
అధరః కిం చ బింబం కిం కిం నాసా శుక చంచుకా ।
కిం స్వరః కోకిలాలాపః కిం మధ్యం చాథ వేదికా ॥
కిం గతిర్వర్ణ్య తే హ్యస్యాః కిం రూపం వర్ణ్యతే ముహుః ।
పుష్పాణి కిం చ వర్ణ్యంతే వస్త్రాణి చ తథా పునః ॥
లాలిత్యం చారు యత్సృష్టౌ తదేకత్ర వినిర్మితమ్ ।
సర్వథా రమణీయాని సర్వాంగాని న సంశయః ॥

శివుడిట్లు పలికెను -

ఇది ముఖమా? చంద్రుడా? ఇవి నేత్రములా? కలువలా? ఇవి కనుబొమలా? మహాత్ముడగు మన్మథుని ధనస్సులా? (31) ఇది అధరమా? దొండపండా? ఇది నాసికయా? లేక చిలుక ముక్కు అగునా? ఆహా! ఏమి కంఠధ్వని? కోకిల గీతమును పోలియున్నది. ఈమె నడుము అగ్ని హోత్రవేది వలె సన్నగా నున్నది (32). ఈమె నడకను ఏమని వర్ణించెదను? ఈమె రూపమును ఎన్నిసార్లు వర్ణించెదను? ఈమె ధరించిన పుష్పములను, వస్త్రములను ఏమని వర్ణించగలను? (33) సృష్టిలోని సౌందర్యము అంతయూ ఒక్కచోట ప్రోగు చేసినట్లున్నది. ఈమె అవయవములు పూర్ణ రమణీయములనుటలో సందియము లేదు (34).

అహో ధన్యతగా చేయం పార్వత్యద్భుత రూపిణీ ।
ఏతత్సమా న త్రైలోక్యే నారీ కాపి సురూపిణీ ॥
సులావణ్య నిధిశ్చేయ మద్భుతాంగాని బిభ్రతీ ।
విమోహినీ మునీనాం చ మహా సుఖ వివర్ధినీ ॥

అహో! అద్భుతమగు రూపముగల ఈ పార్వతి ధన్యురాలు. ఇంతటి సుందరి ముల్లోకములలోనైననూ మరియొక స్త్రీ లేదు (35). అద్భుతమగు అవయవములను కలిగియున్న ఈమె మంచి లావణ్యమునకు నిధియై యున్నది. గొప్ప సుఖమును వర్ధిల్లజేయు ఈమె మునులనైననూ మోహపెట్టగలదు (36).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం వర్ణయిత్వా తు తదంగాని ముహుర్ముహుః ।
విధి దత్త వరధ్యానాద్ధరస్తు విరరామ హ ॥
వివృణ్వతీ నిజముఖం పశ్యంతీ చ ముహుర్ముహుః ।
సువీక్షణైర్మహామోదాత్సు స్మితా భూద్శివా మునే ॥
ఏవం చేష్టాం తదా దృష్ట్వా శంభుర్మోహ ముపాగతః ।
ఉవాచ వచనం చైవం మహాలీలో మహేశ్వరః ॥
అస్యా దర్శన మాత్రేణ మహానందో భవత్యలమ్ ।
యదాలింగ సమేతస్యాః కుర్యాం కిం తు తతస్సుఖమ్ ॥

హరుడు ఈ విధముగా అనేక పర్యాయములు ఆమె అవయవములను వర్ణించి, బ్రహ్మ ఇచ్చిన వరమును గుర్తు చేసుకొని విరమించెను (37). ఓ మహర్షీ! పార్వతి తన ముఖమును ప్రకటము చేసి, పదే పదే ప్రేమ వీక్షణములతో మహానందముతో చూచుచూ చక్కటి చిరునవ్వుతో కూడి యుండెను (38). ఆమె యొక్క ఆ చేష్టను చూచిన వాడై, గొప్ప లీలలు గలవాడు, మహేశ్వరుడునగు శంభుడు మోహమును పొంది ఇట్లు పలికెను (39). ఈమెను చూచినంత మాత్రాన మహానందము కలుగుచున్నది. ఈమెను నేను కౌగిలించుకున్నప్పుడు ఎంతటి సుఖము కలుగునో గదా! (40)

క్షణమాత్రం విచార్యేత్థం సంపూజ్య గిరిజాం తతః ।
ప్రబుద్ధస్స మహాయోగీ సువిరక్తో జగావితి ॥
కిం జాతం చరితం చిత్రం కిమహం మోహమాగతః ।
కామేన వికృతశ్చాద్య భూత్వాపి ప్రభురీశ్వరః ॥
ఈశ్వరోఽహం యదిచ్ఛేయం పరాంగ స్పర్శనం ఖలు ।
తర్హి కోఽన్యోఽక్షయః క్షుద్రః కిం కిం నైవ కరిష్యతి ॥
ఏవం వైరాగ్యమాసాద్య పర్యంకాసాదనం చ తత్ ।
వారయామాస సర్వాత్మా పరేశః కిం పతేదిహ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే కామకృత వికార వర్ణనం నామ అష్టాదశోఽధ్యాయః (18).

మహాయోగి యగు ఆ శివుడు క్షణకాలము ఇట్లు ఆలోచించి, తరువాత పార్వతిని ఆదరించెను. ఆయన తెలివిని పొంది (మోహమును వీడి) గొప్ప వైరాగ్యము గలవాడై ఇట్లు అనుకొనెను (41). ఏమైనది? చిత్రమగు ఘటన జరిగినది. నేను మోహితుడనైతిని యేమి? నేను సమర్థుడను, ప్రభుడను అయి ఉండియూ, ఈనాడు కామునిచే వికారమును పొందునట్లు చేయబడితిని (42). ఈశ్వరుడనగు నేనే పరస్త్రీని స్పృశించ గోరినచో, ఇతరులగు సామాన్య ప్రాణులు ఏ పనిని చేయుటకు తగరు? ఏయే పనులను చేయకుందురు? (43) సర్వప్రాణుల ఆత్మభూతుడు ఆ పరమేశ్వరుడు 'దీనివలన ప్రయోజనమేమున్నది?' అని నిశ్చయించుకొని, వైరాగ్యము నాశ్రయించి, ఆమెను పొందవలెననే ఆకాంక్షను నివారించుకొనెను (44).

19 – కామదహనము

నారద ఉవాచ ।

బ్రహ్మన్ విధే మహాభాగ కిం జాతం తదనంతరమ్ ।
కథయ త్వం ప్రసాదేన తాం కథాం పాపనాశినీమ్ ॥

నారదుడిట్లు పలికెను –

ఓ బ్రహ్మా! విధీ! మహాత్మా! తరువాత ఏమైనది? నీవు అనుగ్రహించి పాపములను నశింపజేయు ఆ గాథను చెప్పుము (1).

బ్రహ్మోవాచ।

శ్రూయతాం సా కథా తాత యజ్జాతం తదనంతరమ్ ।
తవ స్నేహాత్ప్ర వక్ష్యామి శివలీలాం ముదావహామ్ ॥
ధైర్యస్య వ్యసనం దృష్ట్వా మహాయోగీ మహేశ్వరః ।
విచింతితం మనస్యేవం విస్మితోఽతి తతః పరమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఆ తరువాత జరిగిన గాథను వినుము. వత్సా! ఆనందమును గొల్పు శివలీలను నీయందలి ప్రేమచే చెప్పగలను (2). మహాయోగియగు మహేశ్వరుడు తాను ధైర్యమును గోల్పోవుటను గాంచి మిక్కిలి చకితుడై, తరువాత మనస్సులో ఇట్లు తలపోసెను (3).

కిము విఘ్నా స్సముత్పన్నాః కుర్వతస్తప ఉత్తమమ్ ।
కేన మే వికృతం చిత్తం కృతమత్ర కుకర్మిణా ॥
కువర్ణనం మయా ప్రీత్యా పరస్త్ర్యుపరి వై కృతమ్ ।
జాతో ధర్మవిరో ధోఽత్ర శ్రుతిసీమా విలంఘితా ॥

ఉత్తమమగు తపస్సును చేయుచున్న నాకు విఘ్నములు కలుగుటకు కారణమేమి? ఈ సమయములో నా మనస్సులో వికారమును కలిగించిన దుష్టుడెవరు? (4) నేను పరస్త్రీని ఉద్దేశించి చెడు వర్ణనను చేసితిని. ఇపుడు ధర్మమునకు విరుద్ధముగా జరిగినది. వేదమర్యాద ఉల్లంఘింపబడినది (5).

బ్రహ్మోవాచ ।

విచింత్యేత్థం మహాయోగీ పరమేశస్సతాం గతిః ।
దిశో విలోకయామాస పరితశ్శంకితస్తదా ॥
వామభాగే స్థితం కామం దదర్శ కృష్టబాణకమ్ ।
స్వశరం క్షేప్తుకామం హి గర్వితం మూఢ చేతసమ్ ॥
తం దృష్ట్వా తాదృశం కామం గిరీశస్య పరాత్మనః ।
సంజాతః క్రోధసంమర్దస్తత్క్షణా దపి నారద ॥
కామస్స్థి తోఽన్తరిక్షే స ధృత్వా తత్సశరం ధనుః ।
చిక్షేపాస్త్రం దుర్నివార మమోఘం శంకరే మునే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

సత్పురుషులకు ఆశ్రయము, మహాయోగి అగు పరమేశ్వరుడు ఇట్లు తలపోసి, శంకను పొందినవాడై చుట్టూ దిక్కులనన్నింటినీ పరికించెను (6). గర్విష్ఠి, మూర్ఖుడు,బాణమును ధనస్సునందు ఎక్కు పెట్టి ప్రయోగించుటకు సిద్ధముగా నున్నవాడు అగు మన్మథుని ఆయన తన ఎడమవైపున ఉండగా గాంచెను (7). ఓ నారదా! పరమాత్ముడగు శివునకు ఆ స్థితిలో నున్న కాముని చూడగానే వెను వెంటనే తీవ్రమగు క్రోధము కలిగెను (8). ఓ మహర్షీ! బాణము ఎక్కు పెట్టియున్న ధనస్సును చేతబట్టి అన్తరిక్షమునందు నిలబడియున్న మన్మథుడు నివారింప శక్యము కానిది, వ్యర్థము కానిది అగు అస్త్రమును శంకరునిపై ప్రయోగించెను (9).

బభూవామోఘమస్త్రం తు మోఘం తత్పరమాత్మని ।
సమశామ్యత్త తస్తస్మిన్ సంక్రుద్ధే పరమేశ్వరే ॥
మోఘీ భూతే శివే స్త్రేఽస్త్రే భయామాపాశు మన్మథః ।
చకంపే చ పురస్స్థిత్వా దృష్ట్వా మృత్యుంజయం ప్రభుమ్ ॥
సస్మార త్రిదశాన్ సర్వాన్ శక్రాదీన్ భయవిహ్వలః ।
స స్మరో మునిశార్దూల స్వప్రయాసే నిరర్థకే ॥
ద్వారకాయాం యదా స్థిత్వా పుత్రా నుత్పాద యిష్యతి ।
తదా కృష్ణస్తు రుక్మిణ్యాం కామముత్పాద యిష్యతి ॥
ప్రద్యుమ్న నామ తస్యైవ భవిష్యతి న సంశయః ।
జాత మాత్రం తు తం పుత్రం శంబరస్సంహరిష్యతి ॥

శివుడిట్లు పలికెను –

దేవతలారా! ఋషులారా! మీరందరు నామాటను శ్రద్ధగా వినుడు. నా క్రోధముచే ఏది జరిగినదో అది అటులనే జరుగవలసి యున్నది. మరియొక విధానము లేదు (37). భూమి యందు కృష్ణుడు అవతరించి రుక్మిణిని చెట్టపట్టునంతవరకు రతీదేవి భర్తయగు కామ ప్రభుడు దేహము లేనివాడై ఉండుగాక! (38) కృష్ణుడు ద్వారకయందు నివసించి రుక్మిణి యందు

సంతానమును పొందగలడు. వారిలో మన్మథుడు కూడ ఒకడై జన్మించగలడు (39). వానికి ప్రద్యుమ్నుడను పేరు ఉండును. దీనిలో సందేహము లేదు. ఆ బాలుడు పుట్టగానే శంబరుడు వానిని అపహరించగలడు (40).

హృత్వా ప్రాస్య సముద్రం తం శంబరో దానవోత్తమః ।
మృతం జ్ఞాత్వా వృథా మూఢ నగరం స్వం గమిష్యతి ॥
తావచ్చ నగరం తస్య రతే స్థేయం యథా సుఖమ్ ।
తత్రైవ స్వపతేః ప్రాప్తిః ప్రద్యుమ్నస్య భవిష్యతి ॥
తత్ర కామో మిలిత్వా తం హత్వా శంబరమాహవే ।
భవిష్యతి సుఖీ దేవాః ప్రద్యుమ్నాఖ్యస్స్వ కామినీమ్ ॥
తదీయం చైవ యద్ద్రవ్యం నీత్వా స నగరం పునః ।
గమిష్యతి తయా సార్ధం దేవాస్సత్యం వచో మమ ॥

మూర్ఖుడగు శంబరాసురుడు ఆ బాలుని అపహరించి సముద్రములో పారవేసి మరణించి్సెడని భ్రమించి తన నగరమునకు వెళ్లగలడు (41). ఓ రతీ! నీవు అంతవరకు ఆ నగరమునందు సుఖముగా నుండుము. నీ భర్తయగు ప్రద్యుమ్నుడు నీకు అచటనే లభించగలడు (42). అచట కాముడు యుద్ధములో శంబరుని వధించగలడు. ప్రద్యుమ్నుడను పేరుతో ప్రసిద్ధి గాంచిన వాడై ఆతడు తన ప్రియురాలిని కలిసి సుఖించగలడు. ఓ దేవతలారా! (43) ఆతడు శంబరుని ధనమునంతనూ తీసుకొని రతీదేవి తోడు రాగా తన నగరమునకు వెళ్లగలడు. దేవతలారా! నామాట సత్యము (44).

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా వచశ్శంభోర్దేవా ఊచుః ప్రణమ్య తమ్ ।
కించిదుచ్ఛ్వసితాశ్చిత్తే కరౌ బద్ధ్వా నతాంగకాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

శంభుని ఈ మాటలను విని దేవతలు మనసులో కొంత ఓదార్పును పొందిన వారై శివునకు చేతులు జోడించి శిరసులను వంచి నమస్కరించిన వారై ఇట్లు పలికిరి (45).

దేవా ఊచుః ।

దేవ దేవ మహాదేవ కరుణా సాగర ప్రభో ।
శీఘ్రం జీవయ కామం త్వం రక్ష ప్రాణాన్ రతేర్హ ర ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! ప్రభూ! హరా! నీవు మన్మథుని శీఘ్రముగా జీవింపజేసి రతీదేవి యొక్క ప్రాణములను కాపాడుము (46).

బ్రహ్మోవాచ।

ఇత్యా కర్ణ్యా మరవచః ప్రసన్నః పరమేశ్వరః ।
పునర్బభాషే కరుణా సాగరస్స కలేశ్వరః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవతల ఈ మాటను విని ప్రసన్నుడైనట్టియు, కరుణాసముద్రుడు, సర్వేశ్వరుడునగు పరమేశ్వరుడు మరల ఇట్లు పలికెను (47).

శివ ఉవాచః

హే దేవా స్సుప్రసన్నోఽ స్మి జీవయిష్యామి చాంతరే ।
కామస్స మద్గణో భూత్వా విహరిష్యతి నిత్యశః ॥
నాఖ్యేయమిదయమా ఖ్యానం కస్యచిత్సురతస్సురా: ।
గచ్ఛత స్వస్థలం దుఃఖం నాశయిష్యామి సర్వతః ॥

శివుడిట్లు పలికెను -

ఓ దేవతలారా! మిక్కిలి ప్రసన్నుడనైతిని. కాముని ఈ లోపులోననే జీ◌ీంపజేసెదను. కాముడు నా గణమై నిత్యము విహరించగలడు (48). ఓ దేవతలారా! ఈ వృత్తాంతమునెవ్వరికీ చెప్పకుడు. మీ స్థలములకు వెళ్లుడు. దుఃఖములనన్నిటినీ నశింపజేసెదను (49).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వాంతర్దధే రుద్రో దేవానాం స్తువతాం తదా ।
సర్వే దేవాస్సు ప్రసన్నా బభూవుర్గతి విస్మయా: ॥
తతస్తాం చ సమాశ్వాస్య రుద్రస్య వచనే స్థితాః ।
ఉక్త్వా వచస్తదీయం చ స్వం స్వం ధామ యయుర్మునే ॥
కామపత్నీ సమాదిష్టం నగరం సా గతా తదా ।
ప్రతీక్షమాణా తం కాలం రుద్రా దిష్టం మునీశ్వర ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే
కామనాశవర్ణనం నామ ఏకోనవింశోఽధ్యాయః (19).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు పలికి అపుడు రుద్రుడు దేవతలు స్తుతించుచుండగా అంతర్ధానమయ్యెను. దేవతలందరు మిక్కిలి ప్రసన్నులైరి. కాలగతికి చకితులైరి (50). ఓ మహర్షీ! అపుడు వారు ఆమెను ఓదార్చి రుద్రుని వచనమును స్వీకరించి తమలో తాము రుద్రుని మాటలను చెప్పుకొనుచూ తమ తమ ధామములకు వెళ్లిరి (51). ఓ మహర్షీ! కాముని భార్య యగు రతి రుద్రుడు ఆదేశించిన నగరమునకు వెళ్లి అచట రుద్రుడు ఆదేశించిన కాలము కొరకు ఎదురు చూచుచుండెను (52).

20- బడబాగ్ని

నారద ఉవాచః

విధే నేత్ర సముద్భూత వహ్ని జ్వాలా హరస్య సా ।
గతా కుత్ర వద త్వం తచ్చరితం శశిమౌలినః ॥

నారదుడిట్లు పలికెను –

ఓ విధీ! శివుని నేత్రము నుండి పుట్టిన ఆ అగ్ని జ్వాల ఎక్కడకు పోయినది? చంద్రశేఖరుని ఆ వృత్తాంతమును నీవు చెప్పుము (1).

బ్రహ్మోవాచ ।

యదా భస్మ చకారాశు తృతీయనయనా నలః ।
శంభోః కామం ప్రజజ్వాల సర్వతో విఫలస్తదా ॥
హాహాకారో మహానాసీత్ త్రైలోక్యే సచరాచరే ।
సర్వ దేవర్షయస్తాత శరణం మాం యయుర్ద్రుతమ్ ॥
సర్వే నివేదయ మాసుస్త దుః ఖం మహ్యామాకులాః ।
సుప్రణమ్య సుసంస్తూయ కరౌ బద్ధ్వా నతాననాః ॥
తచ్ఛృత్వాహం శివం స్మృత్వా తద్ధేతుం సువిమృశ్య చ ।
గతస్తత్ర వినీతాత్మా త్రిలో కావన హేతవే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

శంభుని మూడవ కన్నునుండి పుట్టిన అగ్ని కాముని శీఘ్రమే దహించి మరియొక ప్రయోజనము లేనిదై అంతటా వ్యాపించెను (2). స్థావర జంగమాత్మకమగు ముల్లోకములలో గొప్ప హాహాకారము బయలుదేరెను. వత్సా! దేవతలు, ఋషులు అందరు నన్ను శీఘ్రమే శరణుజొచ్చిరి (3). వారందరు భయభీతులై చేతులు జోడించి నాకు ప్రణమిల్లి తలలు వంచుకొని చక్కగా స్తుతించి వారికి కలిగిన ఆపత్తును నాకు నివేదించిరి (4). నేను వారి మాటలను విని, శివుని స్మరించి, వారి దుఃఖమునకు గల కారణమును బాగుగా విమర్శించి, ముల్లోకములను రక్షించుట కొరకై వినయముతో నిండిన మనస్సు గలవాడనై అచటకు వెళ్లితిని (5).

సందగ్ధుకామస్స శుచి ర్జ్వాలా మాలాతి దీపితః ।
స్తంభితోఽరం మయా శంభు ప్రసా దాప్త సుతేజసా ॥
అథ క్రోధమయం వహ్నిం దగ్ధుకామం జగత్త్రయమ్ ॥
వాడవాం తమకార్షం చ సౌమ్య జ్వాలాముఖం మునే ॥
తం వాడవతను మహం సమాదాయ శివేచ్ఛయా ।
సాగరం సమగాం లో కహితాయ జగతాం పతిః ॥
ఆగతం మాం సమాలో క్య సాగరస్సాంజలిర్మునే ।
ధృత్వా చ పౌరుషం రూప మాగతస్సన్నిధిం మమ ॥
సుప్రణమ్యాథ మాం సింధుస్సంస్తూయ చ యథావిధి ।
స మామువాచ సుప్రీత్యా సర్వలోక పితామహమ్ ॥

జ్వాలల మాలలతో అతిశయించి ప్రకాశించే ఆ అగ్ని దహింపబోవుచుండగా, శం◌ంభుని అనుగ్రహముచే లభించిన గొప్ప తేజస్సు గల నేను శీఘ్రమే దానిని స్తంభింపజేసితిని (6). ఓ మహర్షీ! ముల్లోకములను తగులబెట్టగోరే ఆ క్రోధాగ్నిని నేను అపుడు సౌమ్యమగు జ్వాలలను వెదజల్లు ముఖము గల బడబా (గుర్రము) అగ్నిగా మార్చివేసితిని (7). జగత్ప్రభువగు నేను లోకముల హితము కొరకై శివుని ఇచ్ఛచే ఆ బడబాగ్నిని తీసుకొని సముద్రము వద్దకు వెళ్లితిని (8). ఓ మహర్షీ! నా రాకను చూచిన సముద్రుడు పురుషరూపమును ధరించి చేతులు జోడించి నా సన్నిధికి విచ్చేసెను (9). అపుడా సముద్రుడు సర్వలోకములకు పితామహుడనగు నన్ను యథావిధిగా స్తుతించి నమస్కరించి పరమ ప్రీతితో నిట్లనెను (10).

సాగర ఉవాచః

కిమర్థ మాగతోఽసి త్వం బ్రహ్మన్నత్రా ఖిలాధిప ।
తన్నిదేశయ సుప్రీత్యా మత్వా మాం చ స్వసేవకమ్ ॥

సముద్రుడిట్లు పలికెను –

సర్వ జగత్పతీ! హే బ్రహ్మన్! నీవు ఇచటకు వచ్చుటలో గల కారణమేమి? నన్ను నీ సేవకునిగా భావించి ప్రీతితో నీ పనియందు నియోగించుము (11).

బ్రహ్మో వాచ।

అథాహం సాగరవచశ్శ్రుత్వా ప్రీతిపురస్సరమ్ ।
ప్రావోచం శంకరం స్మృత్వా లౌకికం హిత మావహన్ ॥
శృణు తాత మహాధీమన్ సర్వలోక హితావహా ।
వచ్మ్యహం ప్రీతితస్సింధో శివేచ్ఛా ప్రేరితో హృదా ॥
అయం క్రోధో మహేశస్య వాడవాత్మా మహాప్రభుః ।
దగ్ధ్వా కామం ద్రుతం సర్వం దగ్ధుకామోఽ భవత్తతః ॥

ప్రార్థితోఽహం సురైశ్శీఘ్రం పీడితైశ్శంకరేచ్ఛయా ।

తత్రా గత్య ధృతం తం వై తాత స్తంభితవాన్ శుచిమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు నేను ప్రీతి పూర్వకముగా సముద్రుడు పలికిన పలుకులను విని లో కహితమును గోరువాడనై శంకరుని స్మరించి ఇట్లు పలికితిని (12). వత్సా! వినుము. నీవు గొప్ప బుద్ధిమంతుడవు. సర్వలోకములకు హితమును చేయువాడవు. ఓ సముద్రమా! హృదయములో శివుని ఇచ్ఛచే ప్రేరితుడనై ప్రీతితో నేను చెప్పుచున్నాను (13). గొప్ప సామర్థ్యము గల ఈ మహేశ్వరుని క్రోధము మన్మథుని భస్మము చేసి, వెనువెంటనే సర్వమును తగులబెట్టుటకు తలపడగా, నేను బడబాగ్నిగా స్తంభింప జేసితిని (14). దుఃఖితులగు దేవతలు నన్ను శీఘ్రమే ప్రార్థించగా నేను శంకరుని ఇచ్ఛచే శీఘ్రముగా అచటికి వచ్చితిని. ఓ కుమారా! నేనా అగ్నిని స్తంభింపజేసితిని (15).

వాడవం రూపమాధత్త తమాదాయాగతోఽత్ర హ ।

నిర్దిశామి జలాధార త్వామహం కరుణాకరః ॥

అయం క్రోధో మహేశస్య వాడవం రూపమాశ్రితః ।

జ్వాలాముఖస్త్వయా ధార్యో యావదాభూత సంప్లవమ్ ॥

యదా త్రాహం సమాగమ్య వత్స్యామి సరితాం పతే ।

తదా త్వయా పరిత్యాజ్యః క్రోధోఽయం శాంకరోఽద్భుతః ॥

భోజనం తోయమేతస్య తవ నిత్యం భవిష్యతి ।

యత్నా దేవావధార్యోఽయం యథా నోపైతి చాంతరమ్ ॥

ఓ సముద్రమా! బడబా రూపమును ధరించిన ఈ అగ్నిని తీసుకొని కరుణానిధి యగు నేను ఇచటకు వచ్చి నిన్ను ఆదేశించుచుంటిని (16). ఈ మహేశ్వరుని క్రోధము బడబా రూపమును ధరించి నోటినుండి నిప్పులను గ్రక్కుచున్నది. ప్రలయకాలము వరకు నీవు దీనిని ధరించవలెను (17). ఓ నదీ పతీ! నేను ఇచటకు వచ్చి ప్రలయములో నివసించగలను. అపుడు నీవు ఈ శంకరుని అద్భుతమగు క్రోధమును విడిచిపెట్టవచ్చును (18). ఈ అగ్నికి నీ జలము నిత్యము భోజనమగుచుండును. ఈ అగ్ని నీ గర్భములోనికి వెళ్లకుండునట్లు నీవు ప్రయత్న పూర్వకముగా ధరించి యుండుము (19).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తో హి మయా సింధురంగీ చక్రే తదా ధ్రువమ్ ।
గ్రహీతుం వాడవం వహ్నిం రౌద్రం చాశక్య మన్యతః ॥
తతః ప్రవిష్టో జలధౌ స వాడవతనుశ్శుచిః ।
వార్యోఘాన్సు దహంస్తస్య జ్వాలా మాలాభి దీపితః ॥
తతస్సంతుష్ట చేతస్కస్స్వం ధామాహం గతో మునే ।
అంతర్ధానమగా త్సింధుర్దివ్యరూపః ప్రణమ్య మామ్ ॥
స్వాస్థ్యం ప్రాప జగత్సర్వం నిర్ముక్తం తద్భవాద్భయాత్ ।
దేవా బభూవుస్సుఖినో మునయశ్చ మహామునే ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే వడవానలచరితం నామ వింశోఽధ్యాయః (20).

బ్రహ్మ ఇట్లు పలికెను -

నేనిట్లు పలుకగా, అపుడా సముద్రుడు రుద్రుని కోపరూపమగు ఆ బడబాగ్నిని ధరించుటకు నిశ్చయముగా నంగీకరించెను. ఆ పనిని సముద్రుడు తక్క ఇతరులు చేయజాలరు (20). అపుడు జ్వాలలతో మండిపడుచున్న ఆ అగ్ని బడబా రూపముతో సముద్రములో ప్రవేశించి జలసమూహములను దహింపనారంభించెను (21). ఓ మహర్షీ! అపుడు సంతసముతో నిండిన మనస్సుగల వాడనై నేను నా లోకమునకు వెళ్లితిని. దివ్యరూపము గల సముద్రుడు నాకు ప్రణమిల్లి అంతర్ధానము జెందెను (22). ఓ మహర్షీ! రుద్ర కోపాగ్ని వలన కలిగిన భయమునుండి జగత్తు సర్వము విముక్తిని పొందెను. దేవతలు మరియు ఋషులు స్వస్థులైరి (23).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహిత యందలి పార్వతీ ఖండములో బడబాగ్ని చరితమనే ఇరువదియవ అధ్యాయము ముగిసినది (20).

21 - పార్వతికి నారదుని ఉపదేశము

నారద ఉవాచః

విధే తాత మహాప్రాజ్ఞ విష్ణుశిష్య త్రిలోకకృత్ ।
అద్భుతేయం కథా ప్రోక్తా శంకరస్య మహాత్మనః ॥
భస్మీ భూతే స్మరే శంభు తృతీయ నయనాగ్నినా ।
తస్మిన్ ప్రవిష్టే జలధౌ వద త్వం కిమభూత్తతః ॥
కిం చకార తతో దేవీ పార్వతీ కుధరాత్మజా ।
గతా కుత్ర సఖీభ్యాం సా తద్వదాద్య దయానిధే ॥

నారదుడిట్లు పలికెను -

ఓ విధీ! తండ్రీ! నీవు మహాబుద్ధి శాలివి. విష్ణు శిష్యుడవు. ముల్లోకములను నీవు సృష్టించినావు. శంకరమహాత్ముని ఈ అద్భుతమగు గాథను చెప్పితివి (1). శంభుని మూడవ నేత్రము నుండి పుట్టిన అగ్నిచే మన్మథుడు భస్మము కాగా, ఆ అగ్ని సముద్రములో ప్రవేశించగా, తరువాత ఏమి జరిగినదో నీవు చెప్పుము (2). హిమవత్పుత్రిక యగు పార్వతీ దేవి అపుడేమి చేసెను? ఆమె సఖురాండ్రిద్దరితో గూడి ఎచటకు వెళ్లెను? ఓ దయానిధీ! ఇపుడా వృత్తాంతమును చెప్పుము (3).

బ్రహ్మో వాచ ।

శృణు తాత మహాప్రాజ్ఞ చరితం శశిమౌలినః ।
మహోతి కారకస్యైవ స్వామినో మమ చాదరాత్ ॥
అదహత్ శంభునే త్రోద్భవో హి మదనం శుచిః ।
మహాశబ్దోఽద్భుతోఽ భూద్వై యేనాకాశః ప్రపూరితః ॥
తేన శబ్దేన మహతా కామం దగ్ధం సమీక్ష్య చ ।
సఖీభ్యాం సహ భీతా సా యయౌ స్వగృహమాకులా ॥
తేన శబ్దేన హిమవాన్ పరివార సమన్వితః ।
విస్మితోఽ భూదతి క్లిష్ట స్సుతాం స్మృత్వా గతాం తతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వత్సా! నీవు మహా బుద్ధిశాలివి. నేను గొప్ప లీలాకరుడగు చంద్రశేఖర స్వామి చరితమును వర్ణించెదను. నీవు ఆదరముతో వినుము (4). శంభుని కంటినుండి బయల్వెడలిన అగ్ని మన్మథుని దహించివేసినది గదా! దాని ప్రభావముచే అద్భుతమగు మహాశబ్దము పుట్టి ఆకాశము నిండిపోయెను (5). దహింపబడిన కాముని చూచి, ఆ గొప్ప శబ్దమును విని ఆ పార్వతి భయపడినదై సఖురాండ్రిద్దరితో గూడి కంగారుగా తన గృహమునకు వెళ్లెను (6). ఆ శబ్దమును కుటుంబ సభ్యులతో గూడియున్న హిమవంతుడు గూడ విని శివుని వద్దకు వెళ్లియున్న కుమార్తెను స్మరించి విస్మయమును, మహా దుఃఖమును పొందెను (7).

జగామ శోకం శైలేశో సుతాం దృష్ట్వా తివిహ్వలామ్ ।
రుదంతీం శంభు విరహో దాససాదా చలేశ్వరః ॥
ఆసాద్య పాణినా తస్యా మార్జయన్న యనద్వయమ్ ।
మా బిభీహి శివేఽ రో దీరిత్యుక్త్వా తాం తదా గ్రహీత్ ॥
క్రోడే కృత్వా సుతాం శీఘ్రం హిమవాన చలేశ్వరః ।
స్వమాలయ మథానిన్యే సాంత్వయన్నతి విహ్వలామ్ ॥
అంతర్హితే స్మరం దగ్ధ్వా హరే తద్విరహోఽభ్భవా ।
వికలా భూ దృశం సా వై లేభే శర్మ న కుత్రచిత్ ॥

శంభుని విరహముచే మహా దుఃఖమును పొంది రోదించుచున్న కుమార్తెను చూచి పర్వత రాజగు హిమవంతుడు శోకమును పొంది ఆమె వద్దకు వచ్చెను (8). ఆమెను తన దగ్గరకు తీసుకొని, ఆయన కన్నీటిని తుడిచి 'ఓ పార్వతీ! భయపడకుము, ఏడ్వకుము' అని పలికి ఓదార్చెను (9). పర్వతరాజగు హిమవంతుడు వెంటనే తన కుమార్తెను ఒడిలో కూర్చుండ బెట్టుకొనెను. మరియు మిక్కిలి దుఃఖితురాలై యున్న ఆమెను ఓదార్చుచూ తన ప్రాసాదములోనికి తీసుకొని వెళ్లెను (10). శివుడు మన్మథుని బూడిద చేసి అంతర్ధానము కాగానే పార్వతి ఆయన యొక్క విరహముచే మిక్కిలి దుఃఖితురాలై ఎక్కడనూ మనశ్శాంతిని పొందలేకపోయెను (11).

పితుర్గృహం తదా గత్వా మిలిత్వా మాతరం శివా ।
పునర్జాతం తదా మేనే స్వాత్మానం సా ధరాత్మజా ॥
నినింద చ స్వరూపం సా హా హతాస్మీత్యథా బ్రవీత్ ।
సఖీభిర్బోధితా చాపి న బుబోధ గిరీంద్రజా ॥
స్వపతీ చ పిబంతీ చ సా స్నాతీ గచ్ఛతీ శివా ।
తిష్ఠతీ చ సఖీమధ్యే న కించిత్సుఖమాప హ ॥
ధిక్ స్వరూపం మదీయం చ తథా జన్మ చ కర్మ చ ।
ఇతి బ్రువంతీ సతతం స్మరంతీ హరచేష్టితమ్ ॥

ఆ పార్వతి తండ్రి గృహమును చేరిన తరువాత తల్లిని కలుసుకొనెను. అపుడామెకు తాను పునర్జన్మను పొందినట్లు భాసించెను (12). మరియు ఆమె తన రూపమును నిందించుకొని, అయ్యో! హతురాలనైతిని' అని దుఃఖించెను. సఖురాండ్రు ఆమెను ఓదార్చిరి. అయిననూ ఆమెకు దుఃఖ విముక్తి కలుగలేదు (13). ఆ పార్వతి నిద్రించుచున్నప్పుడు గాని, నీటిని త్రాగునప్పుడు గాని, స్నానమును చేయునప్పుడు గాని, ఇటునటు నడచునప్పుడు గాని, సఖురాండ్ర మధ్యలో నున్నప్పుడుగాని లేశమైననూ సుఖమును పొందలేక పోయెను (14). 'నా రూపము, మరియు కర్మ నిందింపదగినవి' అని పలుకుచూ, ఆమె సర్వదా శివుని చేష్టలను స్మరింపజొచ్చెను (15).

ఏవం సా పార్వతీ శంభువిరహోత్క్లిష్ట మానసా ।

సుఖం న లేభే కించిద్వాఽ బ్రవీచ్ఛివ శివేతి చ ॥

నివసంతీ పితుర్గేహే పినాకిగత చేతనా ।

శుశోచాథ శివా తాత ముమోహ చ ముహుర్ముహుః ॥

శైలాధి రాజోప్యథ మేనకాపి మైనాక ముఖ్యాస్తనయాశ్చ సర్వే ।

తాం సాంత్వయామా సురదీన సత్వా హరం విసస్మార తథాపి నో సా ॥

అథ దేవమునే ధీమన్ హిమవత్ప్రస్తరే తదా ।

నియోజితో బలభిదా గమస్త్వం కామచారతః ॥

ఈ తీరున శంభుని విరహముచే గొప్ప క్లేశమును పొందిన మనస్సు గల ఆ పార్వతి లేశమైననూ సుఖమును పొందజాలక, శివా! శివా! అని పలుకజొచ్చెను (16). వత్సా! ఆ పార్వతి తండ్రిగారి ఇంటివద్ద ఉన్ననూ, ఆమె మనస్సు శివునిపై నుండెను. ఆమె తీవ్రమగు దుఃఖము గలదై అనేక పర్యాయములు స్పృహను గోల్పోయెను (17). దైన్యము నెరుంగని దృఢచిత్తులైన హిమవంతుడు, మేనక, మరియు మైనాకుడు మొదలగు హిమవత్పుత్రులందరు ఆమెను ఓదార్చిరి. కాని, ఆమె శివుని మరువలేకపోయెను (18). ఓ దేవర్షీ! ఓ బుద్ధిశాలీ! అపుడు నీవు యథేచ్ఛగా సంచరించుచున్నవాడవై, ఇంద్రునిచే నియోగింపబడి హిమవత్పర్వతమునకు విచ్చేసితివి (19).

తతస్త్వం పూజితస్తేన భూధరేణ మహాత్మనా ।

కుశలం పృష్టవాంస్తం వై తదావిష్టో వరాసనే ॥

తతః ప్రోవాచ శైలేశః కన్యాచరిత మాదితః ।

హరసేవాన్వితం కామదహనం చ హరేణ హ ॥

శ్రుత్వా వోచో మునే త్వం తు తం శైలేశం శివం భజ ।

తమామంత్ర్యోద తిష్ఠస్త్వం సంస్మృత్య మనసా శివమ్ ॥

తం సముత్సృజ్య రహసి కాలీం తామాగమంస్త్వరా ।

లో కోపకారకో జ్ఞానీ త్వం మునే శివవల్లభః ॥

అపుడు మహాత్ముడగు ఆ హిమవంతుడు నిన్ను పూజించి శ్రేష్ఠమగు ఆసనమునందు గూర్చుండబెట్టి కుశల ప్రశ్నలనడిగెను (20). పార్వతి. ప్రారంభము నుండియూ శివుని సేవలో లగ్నమై యుండుట, శివుడు మన్మథుని దహించుట మొదలగు వృత్తాంతమును హిమవంతుడు ఆ తరువాత నీకు వివరించెను (21). ఓ మహర్షీ! నీవా మాటలను విని హిమవంతునితో 'శివుని సేవింపుము' అని బోధించి, మనస్సులో శివుని స్మరిస్తూ లేచివచ్చితివి (22). ఓ మహర్షీ! లోకములకు ఉపకారమును చేయునట్టియు, శివునకు ప్రీతి పాత్రుడవైనట్టియు, జ్ఞాని యగు నీవు హిమవంతుని విడిచిపెట్టి, వెంటనే ఏకాంతములో పార్వతిని కలుసుకొంటివి (23).

ఆసాద్య కాలీం సంబోధ్య తద్ధితే స్థిత ఆదరాత్ ।

అపోచస్త్వం వచస్తథ్యం సర్వేషాం జ్ఞానినాం వరః ॥

జ్ఞానులందరిలో శ్రేష్ఠుడవగు నీవు పార్వతీ దేవి యొక్క హితమును గోరి ఆమెను ఆదరముతో సమీపించి సంబోధించి సత్యమును ఇట్లు పలికితివి (24).

నారద ఉవాచః

శృణు కాలి వచో మే హి సత్యం వచ్మి దయారతః ।

సర్వథా తే హితకరం నిర్వికారం సుకామదమ్ ॥

సేవితశ్చ మహాదేవస్త్వయేహ తపసా వినా ।

గర్వవత్యా యదధ్వం సిద్ధినానుగ్రహ కారకః ॥

విరక్తశ్చ స తే స్వామీ మహాయోగీ మహేశ్వరః ।

విసృష్టవాన్ స్మరం దగ్ధ్వా త్వాం శివే భక్తవత్సలః ॥

తస్మాత్త్వం సుతపోయుక్తా చిరమారాధ యేశ్వరమ్ ।

తపసా సంస్కృతాం రుద్రస్స ద్వితీయాం కరిష్యతి ॥

నారదుడిట్లు పలికెను -

ఓ పార్వతీ! నా మాటను వినుము. దయామయుడనగు నేను నీకు అన్ని విధములుగా హితమును చేగూర్చునది, రాగద్వేషాది దోషములు లేనిది, కోర్కెలనీడేర్చునది అగు సత్యమును చెప్పెదను. (25), దీనులను అనుగ్రహించే మహాదేవుని నీవిచట సేవించి యుంటివి. కాని నీవు తపస్సును చేయలేదు. మరియు గర్వమును కలిగియుంటివి. దానితో సర్వము ధ్వంసమాయెను (26). ఓ పార్వతీ! విరాగి, మహాయోగి, భక్తవత్సలుడునగు ఆ మహేశ్వర ప్రభుడు మన్మథుని దహించి, నిన్ను విడిచిపెట్టి వెళ్లినాడు (27). కావున నీవు చిరకాలము గొప్ప తపస్సును చేసి ఈశ్వరుని ఆరాధించుము. తపస్సుచే పవిత్రురాలవగు నిన్ను ఆయన తన భార్యగా స్వీకరించగలడు (28).

త్వం చాపి శంకరం శంభుం న త్యక్ష్యసి కదాచన ।

నాన్యం పతిం హఠాద్దేవి గ్రహీష్యసి శివాదృతే ॥

ఇత్యాకర్ణ్య వచస్తే హి మునే సా భూధరాత్మజా ।

కించిదుచ్ఛ్వసితా కాలీ ప్రాహ త్వాం సాంజలిర్ముదా ॥

నీవు ఏ నాడైననూ శివశంకరుని వీడి యుండవు. ఓ దేవీ! నీవు శివుడు తక్క మరియొకనిని హఠాత్తుగా భర్తగా స్వీకరించుట జరుగబోదు (29). ఓ మహర్షీ! హిమవత్పుత్రిక యగు ఆ పార్వతి నీ ఈ మాటలను విని, చిన్న నిట్టూర్పును విడచి, ఆనందముతో చేతులెత్తి నమస్కరించి ఇట్లనెను (30).

శివోవాచ ।

> **త్వం తు సర్వజ్ఞ జగతాముప కారకర ప్రభో ।**
> **రుద్ర స్యారాధనార్థాయ మంత్రం దేహి మునే హి మే ॥**
> **న సిధ్యతి క్రియా కాపి సర్వేషాం సద్గురుం వినా ।**
> **మయా శ్రుతా పురా సత్యం శ్రుతిరేషా సనాతనీ ॥**

పార్వతి ఇట్లు పలికెను -

హే ప్రభో! నీవు సర్వజ్ఞుడవు. జగత్తులకు ఉపకారమును చేయువాడవు. ఓ మహర్షీ! నేను రుద్రుని ఆరాధించుట కొరకై నాకు ఒక మంత్రము నిమ్ము (31). ఎవ్వరికైననూ సద్గురువు లేనిదే పుణ్యకర్మలేవియూ సిద్ధించవని నేను పూర్వము వినియున్నాను. సనాతనమగు వేదము ఈ సత్యమును చెప్పుచున్నది (32).

బ్రహ్మోవాచ ।

> **ఇతి శ్రుత్వా వచస్తస్యాః పార్వత్యా మునిసత్తమ ।**
> **పంచాక్షరం శంభుమంత్రం విధిపూర్వముపాదిశః ॥**
> **అవోచశ్చ వచస్తాం త్వం శ్రద్ధాముత్పాదయన్ మునే ।**
> **ప్రభావం మంత్రరాజస్య తస్య సర్వాధికం మునే ॥**

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ పార్వతి యొక్క ఇట్టి పలుకులను విని నీవు శివ పంచాక్షరీ మంత్రమును ఆమెకు యథావిధిగా ఉపదేశించితివి (33). ఓ 'మునీ! మరియు నీవు ఆమెకు ఆ మహామంత్రము యొక్క సర్వ శ్రేష్ఠమగు మహిమను చెప్పి, ఆమె యందు దానిపై శ్రద్ధను కలిగించితివి (34).

నారద ఉవాచ ।

> **శృణు దేవి మనోరస్య ప్రభావం పరమాద్భుతమ్ ।**
> **యస్య శ్రవణ మాత్రేణ శంకరస్సు ప్రసీదతి ॥**
> **మంత్రోఽయం సర్వమంత్రాణామధి రాజశ్చ కామదః ।**
> **భుక్తిముక్తి ప్రదోఽత్యంతం శంకరస్య మహాప్రియః ॥**
> **సుభగే యేన జప్తేన విధినా సోఽచిరాద్ధ్రుతమ్ ।**
> **ఆరాధితస్తే ప్రత్యక్షో భవిష్యతి శివో ధ్రువమ్ ॥**
> **చింతయంతీ చ తద్రూపం నియమస్థా శరాక్షరమ్ ।**
> **జపమంత్రం శివే త్వం హి సంతుష్యతి శివో ద్రుతమ్ ॥**
> **ఏవం కురు తపస్సాధ్వి తపస్సాధ్యో మహేశ్వరః ।**
> **తపస్యేవ ఫలం సర్వైః ప్రాప్యతే నాన్యథా క్వచిత్ ॥**

22 - పార్వతీ తపో వర్ణనము

పార్వత్యువాచ ।

మాతస్త్వం గమిష్యామి ప్రాతః ప్రాప్తుం మహేశ్వరమ్ ।
అనుజానీహి మాం గంతుం తపసేఽద్య తపోవనమ్ ॥

పార్వతి ఇట్లు పలికెను -

తల్లీ! నేను మహేశ్వరుని పొందగోరి తపస్సును చేయుటకై ఉదయమే వెళ్లబోవుచున్నాను. తపస్సు కొరకై తపోవనమునకు వెళ్లుటకు నాకిప్పుడు అనుమతినిమ్ము (17).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచః పుత్ర్యా మేనా దుఃఖముపాగతా ।
సోపాహూయ తదా పుత్రీముకాచ వికలా సతీ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మేన కుమార్తె యొక్క ఈ మాటలను విని దుఃఖితురాలయ్యెను. ఆమె మనస్సు వికలమయ్యెను. ఆమె కుమార్తెను దగ్గరకు పిలిచి ఇట్లు పలికెను (18).

మేనోవాచ ।

దుఃఖితాసి శివే పుత్రి తపస్త్వం పురా యది ।
తపశ్చర గృహేఽ ద్య త్వం న బహిర్గచ్ఛ పార్వతి ॥
కుత్ర యాసి తపః కర్తుం దేవాస్సంతి గృహే మమ ।
తీర్థాని చ సమస్తాని క్షేత్రాణి వివిధాని చ ॥
కర్తవ్యో న హఠః పుత్రి గంతవ్యం న బహిః క్వచిత్ ।
సాధితం కిం త్వయా పూర్వం పునః కిం సాధయిష్యసి ॥
శరీరం కోమలం వత్సే తపస్తు కఠినం మహత్ ।
ఏతస్మాత్తు త్వయా కార్యం తపోఽత్ర న బహిర్వ్రజ ॥
స్త్రీణాం తపోవన గతిర్న శ్రుతా కామనార్థినీ ।
తస్మాత్త్వం పుత్రి మాకార్షీస్తపోర్థం గమనం ప్రతి ॥

మేన ఇట్లు పలికెను -

హే శివే! పుత్రీ! పూర్వము తపస్సును చేసి దుఃఖమును పొందితివి. ఇపుడు ఇంటిలో నుండి తపస్సును చేయుము. పార్వతీ! బయటకు వెళ్లకుము (19). నీవు తపస్సు చేయుట కొరకై ఎచటికి వెళ్లెదవు? నా ఇంటిలో దేవతలు గలరు. పుత్రీ! మొండితనమును వీడుము. బయటకు ఎచ్చటి కైననూ వెళ్లబనిలేదు. పూర్వము నీవు సాధించిన దేమి? భవిష్యత్తులో సాధించబోవునదేమి? ఇచటనే సర్వతీర్థములు, వివిధ క్షేత్రములు గలవు (20,21). అమ్మాయీ! నీ శరీరము

సుకుమారమైనది. తపస్సులో చాల క్లేశము గలదు. కావున నీవు ఇచటనే యుండి తపస్సును చేయుము. బయటకు వెళ్లవద్దు (22). కోర్కెలను సిద్ధింపజేయుటకై స్త్రీలు తపోవనమునకు వెళ్లిరను మాటను ఇంతకుముందు విని యుండలేదు. ఓ పుత్రీ! కావున నీవు తపస్సు కొరకై వెళ్లు తలంపును చేయకుము (23).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం బహుధా పుత్రీ తన్మాత్రా వినివారితా ।
సంవేదే న సుఖం కించి ద్వినారాధ్య మహేశ్వరమ్ ॥
తపోనిషిద్ధా త పసే వనం గంతుం చ మేనయా ।
హేతునా తేన సోమేతి నామ ప్రాప శివా తదా ॥
అథ తాం దుఃఖితాం జ్ఞాత్వా మేనా శైలప్రియా శివామ్ ।
నిదేశం సా దదౌ తస్యాః పార్వత్యా స్తపసే మునే ॥
మాతురాజ్ఞాం చ సంప్రాప్య సువ్రతా మునిసత్తమ ।
తతస్స్వాంతే సుఖం లేభే పార్వతీ స్మృతశంకరా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఈ విధముగా ఆ తల్లి తన కుమార్తెను అనేక తెరంగుల వారించెను. ఆమె మహేశ్వరుని ఆరాధించని ఆ స్థితిలో లేశమైననూ సుఖమును పొందలేక పోయెను (24). మేన ఆమెను తపస్సు కొరకై వనమునకు వెళ్లవద్దని నిషేధించుటచే (ఉమా= అమ్మాయీ! వద్దు) పార్వతికి ఉమా అని పేరు స్థిరమయ్యెను (25). ఓ మహర్షీ! హిమవంతుని భార్యయగు ఉమ తన కుమార్తెయగు శివాదేవి దుఃఖించి యుండుటను గాంచెను. అపుడామె పార్వతికి తపస్సును చేయుటకై అనుమతినిచ్చెను (26). ఓ మహర్షీ! గొప్ప నిష్ఠగల పార్వతి తల్లి అనుమతిని పొంది శంకరుని స్మరించి తన అంతరంగములో సుఖమును పొందెను (27).

మాతరం పితరం సాథ ప్రణిపత్య ముదా శివా ।
సఖీభ్యాం చ శివాం స్మృత్వా తపస్తప్తుం సముద్గతా ॥
హిత్వా మతాన్యనే కాని వస్త్రాణి వివిధాని చ ।
వల్కలాని ధృతాన్యాశు మౌంజీం బద్ధ్వా తు శోభనామ్ ॥
హిత్వా హారం తథా చర్మ మృగస్య పరమం ధృతమ్ ।
జగామ తపసే తత్ర గంగావతరణం ప్రతి ॥
శంభునా కుర్వతా ధ్యానం యత్ర దగ్ధో మనో భవః ।
గంగావతరణో నామ ప్రస్థో హిమవతస్స చ ॥
హరశూన్యోఽ థ దదృశే స ప్రస్థో హిమభూభృతః ।
కాల్యా తత్రేత్య భోస్తాత పార్వత్యా జగదంబయా ॥

అపుడా పార్వతి తల్లిదండ్రులకు ఆనందముతో ప్రణమిల్లి సఖురాండ్రిద్దరితో గూడి సిద్దై, శివుని స్మరించి తపస్సును చేయుటకై ఇంటినుండి బయలుదేరెను (28). ఆమె తనకు ప్రీతిపాత్రములగు వివిధ వస్త్రములను విడనాడి నారబట్టలను ధరించి ముంజ త్రాడును బంధించి శోభిల్లెను (29). ఆ హారమును వీడి చక్కని మృగచర్మను ధరించి తపస్సు చేయుటకై, గంగానది దివినుండి భువికి దిగిన స్థానమును చేరుకొనెను (30). గంగావతరణమని ప్రసిద్ధి గాంచిన ఆ హిమవంతుని శిఖరము పైననే శంభుడు ధ్యానము చేయుచూ, విఘ్న కారకుడగు మన్మథుని దహించెను (31). హిమవంతుని ఆ శిఖరమునకు జగదంబయగు పార్వతీ దేవి విచ్చేసెను. ఓ వత్సా! అచట ఆమెకు శివుడు ఎచ్చటనూ కానరాలేదు (32).

యత్ర స్థిత్వా పురా శంభుస్తప్తవాన్ దుస్తరం తపః ।
తత్ర క్షణం తు సా స్థిత్వా బభూవ విరహార్దితా ॥
హా హరేతి శివా తత్ర రుదన్ తీ సా గిరేస్సుతా ।
విలలాపాతి దుఃఖార్తా చింతాశోక సమన్వితా ॥
తతశ్చిరేణ సా మోహం ధైర్యాత్త్సం స్తభ్య పార్వతీ ।
నియమాయా భవత్తత్ర దీక్షితా హిమవత్సుతా ॥
తపశ్చకార సా తత్ర శృంగితీర్థే మహోత్తమే ।
గౌరీ శిఖర నామాసీత్తత్తపః కరణాద్ధి తత్ ॥

ఏ స్థలములో పూర్వము శంభుడు కూర్చుండి ఘోరమగు తపస్సును ఆచరించినాడో, అదే స్థలము నందు ఆమె క్షణ కాలము నిలుచుండి విరహముచే దుఃఖితురాలయ్యెను (33). ఆ పార్వతీ దేవి చింతాశోకములతో నిండిన మనస్సు గలదై మిక్కిలి దుఃఖితురాలై అచట 'హా హరా!' అని బిగ్గరగా రోదించెను (34). తరువాత చాల సేపటికి ఆ పార్వతీ దేవి ధైర్యమును వహించి, మోహమును వీడి, తపోనియమముల నారంభించుటకై దీక్షను గైకొనెను (35). పరమ పవిత్ర తీర్థమగు ఆ శిఖరము నందామె తపస్సును చేసెను. ఆమె తపస్సును చేయుటచే ఆ శిఖరమునకు గౌరీశిఖరమను పేరు వచ్చినది (36).

సుందరాశ్చ ద్రుమాస్తత్ర పవిత్రాశ్శివయా మునే ।
ఆరోపితా: పరీక్షార్థం తపసః ఫలభాగినః ॥
భూమి శుద్ధిం తతః కృత్వా వేదీం నిర్మాయ సుందరీ ।
తథా తపస్సమారబ్ధం మునీనామపి దుష్కరమ్ ॥
నిగృహ్య మనసా సర్వాణీంద్రియాణి సహోశు సా ।
సముపస్థానికే తత్ర చకార పరమం తపః ॥

ఓ మహర్షీ! తపస్సును చేయు కాలము యొక్క గణన కొరకై ఆమె అచట సుందరమైనవి, పవిత్రమైనవి, పండ్లను ఇచ్చునని అగు వృక్షములను పాతెను (37). సుందరియగు ఆ శివాదేవి. అచట భూమిని శుద్ధి చేసి వేదికను నిర్మించి, తరువాత మునులకైన చేయ శక్యము గాని కఠిన తపస్సును చేయుట ఆరంభించెను (38),

ఆమె వెనువెంటనే మనస్సును, ఇతర ఇంద్రియము లన్నింటినీ నిగ్రహించి, శివుడు తపస్సు చేసిన స్థానమునకు సమీపములో గొప్ప తపస్సును చేసెను (39).

గ్రీష్మే చ పరితో వహ్నిం ప్రజ్వలంతం దివానిశమ్ ।
కృత్వా తస్థౌ చ తన్మధ్యే సతతం జపతీ మనుమ్ ॥
సతతం చైవ వర్షాసు స్థండిలే సుస్థిరాసనా ।
శిలాపృష్ఠే చ సంసిక్తా బభూవ జలధారయా ॥

గ్రీష్మ కాలములో చుట్టూ అగ్ని ప్రజ్వరిల్లు చుండగా ఆమె మధ్యలో కూర్చుండి రాత్రింబగళ్లు నిరంతరముగా మంత్రమును జపించెను (40). వర్షకాలమునందు ఆమె వేదికపై స్థిరమగు ఆసనములో కూర్చుండి, లేదా రాయిపై గూర్చుండి నిరంతరముగా జపము చేయుచుండగా, ఆమెపై జలధారలు వర్షించెడివి (41).

శీతే జలాంతరే శశ్వత్తస్థౌ సా భక్తితత్పరా ।
అనాహారాతపత్తత్ర నీహారేషు నిశాసు చ ॥
ఏవం తపః ప్రకుర్వాణా పంచాక్షర జపే రతా ।
దధ్యౌ శివం శివా తత్ర సర్వకామ ఫలప్రదమ్ ॥
స్వారోపితాన్ శుభాన్ వృక్షాన్ సఖీభిస్సించతీ ముదా ।
ప్రత్యహం సావకాశే సా తత్రాతిథ్యమక ల్పయత్ ॥
వాతశ్చైవ తథా శీతవృష్టిశ్చ వివిధా తథా ।
దుస్సహోఽపి తథా ఘర్మస్తయా సేహే సుచిత్తయా ॥

భక్తియందు తత్పరురాలైన ఆ పార్వతి ఆహారము లేనిదై శీతకాలములో మంచు కురియు రాత్రులందు కూడా నీటి మధ్యలో నిరంతరముగా నిలబడి తపస్సును చేసెను (42). ఈ విధముగా శివాదేవి పంచాక్షరీ జపమునందు నిమగ్నురాలై తపస్సును చేయుచూ, సర్వకామనలను ఫలములను ఇచ్చు శివుని ధ్యానించెను (43). ఆమె ప్రతిదినము సఖురాండ్రతో గూడి తాను పాతిన శుభకరమగు వృక్షములకు నీరు పోసెడిది. ఆమె అచట అతిథులకు ఆనందముతో స్వాగత సత్కారముల నిచ్చెడిది (44). దృఢమగు చిత్తముగల ఆ పార్వతి సహింప శక్యము గాని గాలిని, చలిని, వర్షమును, మరియు ఎండలను, ఇట్టి వివిధ వాతావరణములను సహించెను (45).

దుఃఖం చ వివిధం తత్ర గణితం న తయా గతమ్ ।
కేవలం మన ఆధాయ శివే సాసీత్ స్థితా మునే ॥
ప్రథమం ఫలభోగేన ద్వితీయం పర్ణభోజనైః ।
తపః ప్రకుర్వతీ దేవీ క్రమాన్నిన్యేఽ మితాస్సమాః ॥

ఆమె తనకు సంప్రాప్తమైన వివిధ దుఃఖములను లెక్క చేయలేదు. ఓ మహర్షీ! ఆమె మనస్సును శివుని యందు మాత్రమే లగ్నము చేసి నిర్వికారముగా నుండెను (46). ఆ దేవి ముందు ఫలములను ఆ తరువాత పత్రములను భుజించి తపస్సును చేసెను. ఆమె ఇట్లు వరుసగా అనేక సంవత్సరములను తపస్సుతో గడిపెను (47).

తతః పర్ణాన్యపి శివా నిరస్య హిమవత్సుతా ।
నిరాహారాభవద్దేవీ తపశ్చరణ సంరతా ॥
ఆహారే త్యక్తపర్ణా భూ ద్యస్మాద్ధిమవతస్సుతా ।
తేన దేవైరపర్ణేతి కథితా నామతశ్శివా ॥
ఏకపాదస్థితా సాసీచ్ఛివం సంస్మృత్య పార్వతీ ।
పంచాక్షరం జపంతీ చమనుం తేపే తపో మహత్ ॥
చీరవల్కల సంవీతా జటాసంఘాత ధారిణీ ।
శివచింతన సంసక్తా జిగాయ తపసా మునీన్ ॥

పర్వత పుత్రియగు ఆ శివాదేవి తరువాత పత్రములను కూడ విడనాడి, ఆహారమును భుజించకుండగనే తపస్సును చేయుటలో నిమగ్నమాయెను (48). ఆమె పత్రములను కూడ భుజించుట మానివేసినది గనుక, ఆ పార్వతీ దేవికి దేవతలు అపర్ణ అను పేరును ఇచ్చిరి (49). ఆ పార్వతి ఒంటికాలిపై నిలబడి శివుని స్మరిస్తూ పంచాక్షర మంత్రమును జపిస్తూ గొప్ప తపస్సును చేసెను (50). నార బట్టలను ధరించిన ఆమె యొక్క కేశములు జడలు గట్టినవి. శివుని ఆరాధించుటయందు లగ్నమైన మనస్సుగల ఆ దేవి తపస్సును చేయుటలో మునులను కూడ జయించెను (51).

ఏవం తస్యాస్తపస్యంత్యా చింతయంత్యా మహేశ్వరమ్ ।
త్రీణి వర్ష సహస్రాణి జగ్ముః కాల్యాస్త పోవనే ॥
షష్టి వర్ష సహస్రాణి యత్ర తేపే తపో హరః ।
తత్ర క్షణమథోషిత్వా చింతయామాస సా శివా ॥
నియమస్థాం మహాదేవ కిం మాం జానాసి నాధునా ।
యేనాహం సుచిరం తేన నానుయాతా తపోరతా ॥
లోకే వేదే చ గిరిశో మునిభిర్గీయతే సదా ।
శంకరస్స హి సర్వజ్ఞస్సర్వాత్మా సర్వదర్శనః ॥

ఈ విధముగా ఆ కాళి మహేశ్వరుని ధ్యానిస్తూ తపోవనములో తపస్సును చేయుచుండగా మూడువేల సంవత్సరములు గడచిపోయినవి (52). ఏ స్థానములో శివుడు అరవై వేల సంవత్సరములు తపస్సును చేసెనో, అదే స్థానమునందు ఆ పార్వతి కొంత సేపు కూర్చుండి ఇట్లు తలపోసెను (53). ఓ మహాదేవా! నేను చిరకాలము నుండియు తపస్సును చేయుచున్ననూ నీవు నన్ను అనుగ్రహించ లేదు. నేనీ నియమములో ఉన్నాను అను విషయము నీకు ఇంత వరకు తెలియదా యేమి? (54) లోకములలోని భక్తులు, వేదములు మరియు మహర్షులు శంకరుడు, కైలాసగిరివాసి సర్వజ్ఞుడనియు, సర్వుల ఆత్మరూపుడనియు, సర్వసాక్షి అనియు సర్వదా కీర్తించుచుందురు (55).

సర్వభూతి ప్రదో దేవస్సర్వ భావానుభావనః ।
భక్తా భీష్ట ప్రదో నిత్యం సర్వక్లేశ నివారణః ॥
సర్వకామాన్ పరిత్యజ్య యది చాహం వృషధ్వజే ।
అనురక్తా తదా సోఽత్ర సంప్రసీదతు శంకరః ॥
యది నారద తంత్రోక్త మంత్రో జప్తశ్శరాక్షరః ।
సుభక్త్యా విధినా నిత్యం సంప్రసీదతు శంకరః ॥
యది భక్త్యా శివస్యాహం నిర్వికారా యథోదితమ్ ।
సర్వేశ్వరస్య చాత్యంతం సంప్రసీదతు శంకరః ॥
ఏవం చింతయతీ నిత్యం తేపే సా సుచిరం తపః ।
అధోముఖీ నిర్వికారా జటావల్కల ధారిణీ ॥

ఆ దేవుడు సర్వ సంపదలనిచ్చువాడు, అందరి మనస్సులలోని భావముల నెరుంగువాడు, నిత్యయము భక్తుల కోర్కెలనీడేర్చి కేశములనన్నిటినీ తొలగించువాడు (56). నేను కోర్కెలనన్నిటినీ విడిచి పెట్టి శివుని యందు అనురాగము కలిగియున్న దాననైనచో వృషభధ్వజుడగు ఆ శంకరుడు నన్ను అనుగ్రహించుగాక! (57) నారదుడు ఉపదేశించిన పంచాక్షర మంత్రమును నేను తంత్ర పూర్వకముగా చక్కని భక్తితో యథావిధిగా ప్రతిదినము జపించి యున్నచో, శంకరుడు ప్రసన్నుడగుగాక! (58) నేను సర్వేశ్వరుడగు శివుని భక్తితో వికారములు లేనిదాననై యథావిధిగా ఆరాధించి యున్నచో శంకరుడు ప్రసన్నుడగుగాక! (59) ఆమె తలను వంచుకొని, వికారములు లేనిదై జటలను నారబట్టలను ధరించి ఇట్లు నిత్యము తలపోయుచూ చిరకాలము తపస్సును చేసెను (60).

తథా తయా తపస్తప్తం మునీనామపి దుష్కరమ్ ।
స్మృత్వా చ పురుషస్తత్ర పరమం విస్మయం గతాః ॥
తత్తపోదర్శనార్థం హి సమాజగ్ముశ్చ తేఽఖిలా: ।
ధన్యాన్ని జన్మన్యమానా జగదుశ్చేతి సమ్మతాః ॥
మహతాం ధర్మ వృద్ధేషు గమనం శ్రేయ ఉచ్యతే ।
ప్రమాణం తపసో నాస్తి మాన్యో ధర్మస్సదా బుధైః ॥
శ్రుత్వా దృష్ట్వా తపోఽస్యాస్తు కిమన్యైః క్రియతే తపః ।
అస్మాత్త పోఽధికం లోకే న భూతం న భవిష్యతి ॥

ఆమె ఆ విధముగా మునులకు కూడ చేయ శక్యము గాని తపస్సును చేసెను. అచటి వ్యక్తులు ఆమె తపస్సు గుర్తుకు వచ్చినప్పుడు గొప్ప ఆశ్చర్యమును పొందెడివారు (61) వారందరు ఆమె తపస్సును చూచుటకు వచ్చి తాము ధన్యులమైతిమని తలపోయుచూ పరస్పరము ఆమె తపస్సును గురించి చర్చించుకొనెడివారు. ఆమె తపోమహిమ విషయములో వారికి ఒకే అభిప్రాయముండెడిది (62), గొప్ప వారిని, ధర్మ వృద్ధులను చేరి నమస్కరించుట శ్రేయోదాయకమని పెద్దలు చెప్పెదరు. తపస్సునకు కొలత లేదు. వివేకులు సర్వదా ధర్మమును ఆదరించవలెను గదా! (63) ఈమె చేయు తపస్సును గురించి విని, చూచి ఇతరులు తపస్సును ఏల కొనసాగించుచున్నారు? ఈమె తపస్సు కంటే

అధికమగు తపస్సు ఇంతకు ముందు లోకములో లేదు. ఈ పైన ఉండబోదు (64).

జల్పంత ఇతి తే సర్వే సుప్రశస్య శివాతపః ।

జగ్ముస్స్వం ధామ ముదితాః కఠినాంగాశ్చ యే హ్యపి ॥

అన్యచ్ఛృణు మహర్షే త్వం ప్రభావం తపసోఽధునా ।

పార్వత్యా జగదంబాయాః పరాశ్చర్యకరం మహత్ ॥

తదాశ్రమగతా యే చ స్వభావేన విరోధినః ।

తేప్యా సంస్తత్ర భావేణ విరోధరహితాస్తదా ॥

సింహో గావశ్చ సతతం రాగాది దోషసంయుతాః ।

తన్మహిమ్నా చ తే తత్ర నాబాధంత పరస్పరమ్ ॥

వారందరు ఇట్లు పలుకుచూ పార్వతి యొక్క తపస్సును అధికముగా ప్రశంసించి ఆనందముతో తమ స్థానములకు వెళ్లిరి. రాటు దేలిన దేహము గల వారు గూడా ఆమె తపస్సునకు విస్తుపోయిరి (65). ఓ మహర్షీ! ఆమె తపస్సు యొక్క మహిమను మరియొక దానిని ఇప్పుడు చెప్పెదను. వినుము. జగన్మాతయగు పార్వతి యొక్క ఆ గొప్ప తపస్సు పరమాశ్చర్యమును కలిగించును (66). ఆమె ఆశ్రమము వద్దకు వెళ్లిన జంతువులు సహజవిరోధము కలవి కూడా ఆ తపః ప్రభావముచే విరోధమును వీడి జీవించినవి (67). ఆమె యొక్క మహిమచే గోవులకు నిత్య విరోధియగు సింహము ఇత్యాది క్రూర మృగములు ఇతర మృగములను బాధించుటను మానివేసినవి. మృగములయందు కూడ రాగద్వేషాది దోషములు అదృశ్యమైనవి (68).

అథాన్యే చ ముని శ్రేష్ఠ మార్జారా మూషకాదయః ।

నిసర్గాద్వైరిణో యత్ర వికుర్వంతే స్మ న క్వచిత్ ॥

వృక్షాశ్చ సఫలాస్తత్ర తృణాని వివిధాని చ ।

పుష్పాణి చ విచిత్రాణి తత్రాసన్మునిసత్తమ ॥

తద్వనం చ తదా సర్వం కైలాసేనోప మాన్వితమ్ ।

జాతం చ తపసస్తస్యాస్సిద్ధి రూపమభూత్తదా ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పార్వతీ తపో వర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః (22).

ఓ మహర్షీ! పిల్లి ఎలుక మొదలగు సహజవైరముగల ఇతర జంతువులు గూడ అచట ఏకాలమునందైననూ వికారమును పొందకుండగా జీవించెను (69). అచటి చెట్లు పండ్లను కాయుచుండెడివి. పశువులకు పచ్చగడ్డి సమృద్ధిగ నుండెను. రంగు రంగుల పువ్వులతో ఆ స్థలము ప్రకాశించెను. ఓ మహర్షీ! (70) ఆ కాలములో ఆమె తపస్సు యొక్క సిద్ధియే వనరూపమును దాల్చినదా యన్నట్లు, ఆ వనము అంతయూ కైలాసమును బోలి ప్రకాశించెను (71).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో
పార్వతీ తపోవర్ణనమనే ఇరువది రెండవ అధ్యాయము ముగిసినది (22).

23 - దేవతలు శివుని దర్శించుట

బ్రహ్మోవాచ ।

ఏవం తపంత్యాం పార్వత్యాం శివ ప్రాప్త్యై మునీశ్వర ।
చిరకాలో వ్యతీయాయ ప్రాదుర్భూతో హరో న హి ॥
హిమాలయస్త దాగత్య పార్వతీం కృతనిశ్చయామ్ ।
సభార్యస్ససుతామాత్య ఉవాచ పరమేశ్వరీమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! శివుని పొందుట కొరకై పార్వతి ఈ విధముగా తపస్సును చేయుచుండగా చాలా కాలము గడిచిపోయెను. కాని శివుడు సాక్షాత్కరించలేదు (1). అపుడు హిమవంతుడు భార్యతో, కుమారులతో, మంత్రులతో గూడి అచటకు వచ్చి, దృఢనిశ్చయము గల, పరమేశ్వరియగు పార్వతితో నిట్లనెను (2).

హిమాలయ ఉవాచ ।

మా ఖిద్యతాం మహాభాగే తపసానేన పార్వతి ।
రుద్రో న దృశ్యతే బాలే విరక్తో నాత్ర సంశయః ॥
త్వం తన్వీ సుకుమారాంగీ తపసా చ విమోహితా ।
భవిష్యసి న సందేహస్సత్యం సత్యం వదామి తే ॥
తస్మాదుత్తిష్ఠ చైహి త్వం స్వగృహం వరవర్ణిని ।
కిం తేన తవ రుద్రేణ యేన దగ్ధః పురా స్మరః ॥
అతో హి నిర్వికారత్వా త్త్వా మాదాతుం వరాం హరః ।
నాగమిష్యతి దేవేశి తం కథం ప్రార్థయిష్యసి ॥
గగనస్థో యథా చంద్రో గ్రహీతుం న హి శక్యతే ।
తథైవ దుర్గమం శంభుం జానీహి త్వమిహానఘే ॥

ఓ పార్వతీ! నీ భాగ్యము గొప్పది. నీవు ఇట్లు తపస్సును చేస్తూ ఖేదమును పొందకుము. అమ్మాయీ! రుద్రుడు కానవచ్చుట లేదు. ఆయన విరాగియనుటలో సందియము లేదు (3). నీవు సుకుమారమగు అవయవములు గలదానవు. కృశించి యున్నావు. నీవు స్పృహను కోల్పోయెదవు. దీనిలో సందేహము లేదు. నేను నీకు ముమ్మాటికీ సత్యమును చెప్పుచున్నాను (4). ఓ అందమైనదానా! కావున నీవు లేచి, నీ ఇంటికి రమ్ము. పూర్వము మన్మథుని బూడిదగా చేసిన ఆ రుద్రునితో నీకు పనియేమి? (5) ఓ దేవదేవీ! ఆయన వికారము నెరుంగనివాడు. కావున ఆ శివుడు నిన్ను వివాహ మాడుటకు రాబోడు. ఆయనను నీవు ఎట్లు ప్రార్థించెదవు? (6) ఆకాశమునందున్న చంద్రుని పట్టుకొనుట సంభవము కాదు. ఓ పుణ్యాత్మురాలా! శివుడు కూడ అటులనే పొంద శక్యము కానివాడని తెలుసుకొనుము (7).

బ్రహ్మోవాచ ।

తథైవ మేనయా ప్రోక్తా తథా సహ్యాద్రిణా సతీ ।
మేరుణా మందరేణైవ మైనాకేన తథైవ సా ॥
ఏవమన్యైః క్షితిధ్రైశ్చ క్రౌంచాదిభిర నా తురా ।
తథైవ గిరిజా ప్రోక్తా నానావాద విధాయిభిః ॥
ఏవం ప్రోక్తా యదా తన్వీ సా సర్వైస్తపసి స్థితా ।
ఉవాచ ప్రహసంత్యేవ హిమవంతం శుచిస్మితా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మేనాదేవి, సహ్య పర్వతుడు, మేరువు, మందరుడు, మైనాకుడు (8), మరియు క్రౌంచుడు మొదలగు ఇతర పర్వతములన్నియు అనేక యుక్తులను పలికి ఆమెను అదే తీరున కోరిరి. అయిననూ పార్వతి కంగారుపడలేదు (9). వారందరు తపస్సును చేయుచున్న ఆ సుందరితో నిట్లు పలుకగా, స్వచ్ఛమగు చిరునవ్వు గల ఆ పార్వతి నవ్వుచున్నదై హిమవంతునితో నిట్లనెను (10).

పార్వత్యువాచ ।

పురా ప్రోక్తం మయా తాత మాతః కిం విస్మృతం త్వయా ।
అధునాపి ప్రతిజ్ఞాం చ శృణుధ్వం మమ బాంధవాః ॥
విరక్తోఽసౌ మహాదేవో యేన దగ్ధో రుషా స్మరః ।
తం తోషయామి తపసా శంకరం భక్తవత్సలమ్ ॥
సర్వే భవంతో గచ్ఛంతు స్వం స్వం ధామ ప్రహర్షితాః ।
భవిష్యత్యేవ తుష్టోఽసౌ నాత్ర కార్యా విచారణా ॥
దగ్ధో హి మదనో యేన యేన దగ్ధం గిరేర్వనమ్ ।
తమానయిష్యే చాత్రైవ తపసా కేవలేన హి ॥

పార్వతి ఇట్లు పలికెను -

తండ్రీ! పూర్వము మీకు చెప్పియుంటిని. తల్లీ! నీవు మరచితివా యేమి? బంధులా◌ారా! ఇప్పుడైననూ నా ప్రతిజ్ఞను వినుడు (11). ఈ మహాదేవుడు విరాగి. ఆయన కోపించి మన్మథుని భస్మము చేసినాడు. భక్త వత్సలుడగు అట్టి శంకరుని తపస్సు చేసి సంతోషపెట్టెదను (12). మీరందరూ ఆనందముగా మీ మీ గృహములకు వెళ్లుడు. శివుడు తప్పక ప్రసన్నుడు కాగలడు. ఈ విషయములో చర్చను చేయ తగదు (13). ఏ శివుడు మన్మథుని, హిమవంతుని వనమును తగులబెట్టినాడో, అట్టి శివుని కేవలము తపః ప్రభావముచే ఇదే స్థానమునకు తీసుకొని వచ్చెదను (14).

తపోబలేన మహతా సుసేవ్యో హి సదాశివః ।

జానీధ్వం హి మహాభాగాస్సత్యం సత్యం వదామి వః ॥

ఆ భాష్య చైవం గిరిజా చ మేనకాం మైనాక బంధుం పితరం హిమాలయమ్ ।

తూష్ణీం బభూవాతు సుభాషిణీ శివా సమందరం పర్వతరాజ బాలికా ॥

జగ్ముస్తథోక్తా శ్శివయా హి పర్వతా యథాగతేనాపి విచక్షణాస్తే ।

ప్రశంసమానా గిరిజాం ముహుర్ముహుః సువిస్మితా హేమ నగేశ్వరాద్యాః ॥

గొప్ప తపస్సు యొక్క బలముచే సదాశివుని సులభముగా సేవించవచ్చును. మహాత్ములారా! మీకు నేను ముమ్మాటికీ సత్యమును చెప్పుచున్నాను. తెలియుడు (15). చక్కగా మాటలాడునది, పరమేశ్వరి యగు పార్వతి మేనకను, అన్నగారు అగు మైనాకుని, మందరుని, తండ్రియగు హిమవంతుని ఉద్దేశించి ఇట్లు పలికి మిన్నకుండెను (16). పార్వతి ఇట్లు పలుకగా, మేరువు మొదలగు విద్వాంసులైన ఆ పర్వత రాజులు విస్మితులై పార్వతిని అనేక విధముల కొనియాడుచూ వచ్చిన దారిని వెళ్లిరి (17).

గతేషు తేషు సర్వేషు సఖీభిః పరివారితా ।

తపస్తేపే తదధికం పరమార్థ సునిశ్చయా ॥

తపసా మహతా తేన తప్త మాసీ చ్చరాచరమ్ ।

త్రైలోక్యం హి మునిశ్రేష్ఠ సదేవాసుర మానుషమ్ ॥

తదా సురాసురాస్సర్వే యక్ష కిన్నర చారణాః ।

సిద్ధాస్సాధ్యాశ్చ మునయో విద్యాధర మహోరగాః ॥

సప్రజాపతయశ్చైవ గుహ్య కాశ్చ తథాపరే ।

కష్టాత్ కష్టతరం ప్రాప్తాః కారణం న విదుః స్మ తత్ ॥

వారందరు వెళ్లగానే సఖురాండ్రతో గూడియున్న పార్వతి శివదర్శనమనే పరమ లక్ష్యమునందు దృఢమైన చిత్తము గలదై, అంతకంటే అధికమగు తపస్సును చేసెను (18). ఓ మునిశ్రేష్ఠ! స్థావర జంగమములతో, దేవరాక్షసులతో, మానవులతో కూడియున్న ముల్లోకములు ఆ గొప్ప తపస్సుచే తాపమును పొందెను (19). అపుడు దేవతలు, రాక్షసులు, యక్షులు, కిన్నరులు, చారణులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, విద్యాధరులు, నాగులు (20), ప్రజాపతులు, గుహ్యకులు మరియు ఇతరులు అందరు తీవ్రమగు కష్టమును పొందిరి. కాని దాని కారణమును వారెరుగరైరి (21).

సర్వే మిలిత్వా శక్రాద్యా గురుమామంత్ర్య విహ్వలాః ।
సుమేరౌ తప్త సర్వాంగా విధిం మాం శరణం యయుః ॥
తత్ర గత్వా ప్రణమ్యాశు విహ్వలా నష్టసుత్విషః ।
ఊచుస్సర్వే చ సంస్తూయ హ్యైకపద్యేన మాం హి తే ॥

సర్వావయవముల యందు తాపమును పొందిన ఇంద్రాది దేవతలందరు కంగారును పొంది ఒకచో గూడి బృహస్పతిని పిలిచి సుమేరు పర్వతమునందున్న బ్రహ్మను (నన్ను) శరణు జొచ్చిరి (22). వారందరు నష్టమైన కాంతిగలవారై కంగారు పడుతూ అచటకు చేరి నన్ను స్తుతించి ముక్త కంఠముతో నిట్లనిరి (23).

దేవా ఊచుః ।

త్వయా సృష్టమిదం సర్వం జగదేతచ్చరాచరమ్ ।
సంతప్తమతి కస్మాద్వై న జ్ఞాతం కారణం విభో ॥
తద్బ్రూహి కారణం బ్రహ్మన్ జాతుమర్హసి నః ప్రభో ।
దగ్ధ భూతతనూన్ దేవాన్ త్వత్తో నాన్యోఽస్తి రక్షకః ॥

దేవతలిట్లు పలికిరి -

ఈ స్థావర జంగమాత్మకమగు జగత్తంతయూ నీచే సృష్టింపబడినది. హే విభో! ఇపుడీ జగత్తు గొప్ప తాపమును పొందియున్నది. కారణము తెలియుట లేదు (24). హే ప్రభో! బ్రహ్మా! అట్లు జరుగుటకు గల కారణము నీకు తెలియును. దానిని మాకు చెప్పుము. నల్లగా మాడిపోయిన దేహములు గల దేవతలను రక్షించ గలవాడు నీవు తక్క మరియొకడు గానరాడు (25).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషామహం స్మృత్వా శివం హృదా ।
విచార్య మనసా సర్వం గిరిజాయాస్తపః ఫలమ్ ॥
దగ్ధం విశ్వమితి జ్ఞాత్వా తైస్సర్వైరిహ సాదరాత్ ।
హరయే తత్కథయితుం క్షీరాబ్ధిమగమం ద్రుతమ్ ॥
తత్ర గత్వా హరిం దృష్ట్వా విలసంతం సుఖాసనే ।
సుప్రణమ్య సుసంస్తూయ ప్రావోచం సాంజలిస్సురైః ॥
త్రాహి త్రాహి మహావిష్ణో తప్తాన్నశ్శరణాగతాన్ ।
తపసోగ్రేణ పార్వత్యా స్తపంత్యాః పరమేణ హి ॥
ఇత్యాకర్ణ్య వచస్తేషా మస్మదాది దివౌకసామ్ ।
శేషాసనే సమావిష్టోఽ స్మానువాచ రమేశ్వరః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వారి ఈ మాటలనాలకించి నేను మనస్సులో శివుని స్మరించి, అదంతా పార్వతి యొక్క తపః ప్రభావమేనని మనస్సులో నిశ్చయించుకొంటిని (26). జగత్తు దహింప బడుచున్నది యని తెలుసుకొని, నేను వారందరితో కలిసి, విష్ణువునకు ఆదరముతో ఆ వృత్తాంతమును చెప్పుట కొరకై, వెంటనే పాలసముద్రము వద్దకు వెళ్లితిని (27). అచటకు వెళ్లి, సుఖమగు ఆసనము నందు కులాసాగా ఉన్న విష్ణువును చూచి, దేవతలతో సహా చేతులు జోడించి నమస్కరించి స్తుతించి ఇట్లు పలికితిని (28). హే మహావిష్ణో! రక్షింపుము, రక్షింపుము. మేము తాపపీడితులమై నిన్ను శరణు పొందినాము. పార్వతి చేయుచున్న పరమోగ్ర తపస్సు మమ్ములను దహించుచున్నది (29). దేవతలతో గూడి యున్న నా ఈ మాటలను విని శేషశయ్యపై కూర్చుండియున్న లక్ష్మీపతి మాతో నిట్లనెను (30).

విష్ణురువాచ ।

జ్ఞాతం సర్వం నిదానం మే పార్వతీ తపసోఽ ద్య వై ।
యుష్మాభిస్సహితస్త్వద్య వ్రజామి పరమేశ్వరమ్ ॥
ముదా దేవం ప్రార్థయామో గిరిజా ప్రాపణాయ తమ్ ।
పాణిగ్రహార్థ మధునా లో కానాం స్వస్తయేఽమరాః ॥
వరం దాతుం శివాయై హి దేవ దేవః పినాకధృక్ ।
యథా చేష్యతి తత్రైవ కరిష్యామోఽధునా హి తత్ ॥
తస్మాద్వయం గమిష్యామో యత్ర రుద్రో మహా ప్రభుః ।
తపసో గ్రేణ సంయుక్తోఽధ్యాస్తే పరమమంగలః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

పార్వతీ దేవి చేయుచున్న తపస్సు యొక్క పరిస్థితి అంతయూ నాకు తెలియును. నేనిపుడు మీతో గూడి పరమేశ్వరుని వద్దకు వెళ్లుచున్నాను (31). ఓ దేవతలారా! ఆయన లోకకల్యాణము కొరకై ఇప్పుడు పార్వతిని చేబట్టవలయుననియు, ఆమె వద్దకు వెంటనే వెళ్ళుడనియు మనము ఆనందముతో ఆయనను ప్రార్థించెదము (32). పినాక పాణియగు ఆ దేవదేవుడు శివాదేవికి ఇప్పుడే వరమునిచ్చు విధముగా ఆయనను ఒప్పించవలయును. మనమా ప్రయత్నమును అచటనే చేయుదము (33). కావున, మహాప్రభుడు, పరమ మంగళ స్వరూపుడునగు రుద్రుడు ఉగ్రమగు తపస్సును చేయుచున్న స్థలమునకు ఇప్పుడే మనము వెళ్లెదము (34).

బ్రహ్మో వాచ।

విష్ణోస్తద్వచనం శ్రుత్వా సర్వ ఊచుస్సురాదయః ।
మహా భీతా హఠాత్ క్రుద్ధా ద్దగ్ధు కామాలయంకరాత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు యొక్క ఆ మాటను విని దేవతలు మొదలగు వారందరు, లయకారకుడగు రుద్రుడు హఠాత్తుగా కోపించి దహింప గోరునేమో యని మహా భయమును పొంది, ఇట్లు పలికిరి (35).

దేవా ఊచుః ।

మహాభయంకరం క్రుద్ధం కాలానల సమప్రభమ్ ।
న యాస్యామో వయం సర్వే విరూపాక్షం మహాప్రభుమ్ ॥
యథా దగ్ధః పురా తేన మదనో దురతిక్రమః ।
తథైవ క్రోధయుక్తో న స్స ధక్ష్యతి న సంశయః ॥

దేవతలిట్లు పలికిరి –

మహా భయంకరుడు, క్రోధములో ప్రలయ కాలాగ్నితో సమమగు కాంతి గలవాడు, ముక్కంటి, మహా ప్రభుడు అగు రుద్రుని వద్దకు మేము ఎవ్వరమైననూ వెళ్లము (36). పూర్వము ఆయన దుర్జయుడగు మన్మథుని ఎట్లు దహించినాడో, అదే తీరున క్రోధముగలవాడై ఆయన మమ్ములను కూడ దహించివేయును. సందేహము లేదు (37).

బ్రహ్మోవాచ।

తదాకర్ణ్య వచస్తేషాం శక్రాదీనాం రమేశ్వరః ।
సాంత్వయంస్తాన్ సురాన్ సర్వాన్ ప్రోవాచ స హరిర్మునే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఇంద్రుడు మొదలగు వారి ఆ మాటను విని లక్ష్మీపతి ఆ దేవతలనందరినీ ఓదార్చెను. ఓ, మునీ! విష్ణువు అపుడు వారితో నిట్లనెను (38).

హరిరువాచ ।

హే సురా మద్వచః ప్రీత్యా శృణుతాదరతోఽఖిలా: ।
న వో ధక్ష్యతి స స్వామీ దేవానాం భయనాశనః ॥
తస్మాద్భవద్భిర్గంతవ్యం మయా సార్ధం విచక్షణైః ।
శంభుం శుభకరం మత్వా శరణం తస్య సుప్రభోః ॥
శివం పురాణం పురుషమధీశం వరేణ్య రూపం హి పరం పురాణమ్ ।
తపో జుషాణం పరమాత్మరూపం పరాత్పరం తం శరణం ప్రజామః ॥

విష్ణువు ఇట్లు పలికెను –

ఓ దేవతలారా! మీరందరు నా మాటను ప్రీతితో ఆదరముతో వినుడు. దేవతల భయమును పోగొట్టే ఆ స్వామి మిమ్ములను దహించడు (39). కావున మీరు వివేకము గలవారై, శంభుడు శుభములనిచ్చువాడని యెరింగి నాతో గూడి ఆ మహాప్రభుని శరణు పొందుడు (40). సనాతనుడు, పరమ పురుషుడు, అధీశ్వరుడు, శ్రేష్ఠమగు రూపము గలవాడు, తపస్సును చేయుచున్న వాడు, పరమాత్మ స్వరూపుడు, సర్వోత్కృష్టుడు అగు ఆ శివుని శరణు వేడెదము (41).

బ్రహ్మోవాచ।

ఏవముక్తాస్తదా దేవా విష్ణునా ప్రభవిష్ణునా ।
జగ్ము స్సర్వే తేన సహ ద్రష్టుకామాః పినా కినమ్ ॥
ప్రథమం శైలపుత్ర్యాస్తత్తపో ద్రష్టుం తదాశ్రమమ్ ।
జగ్ముర్మార్గవ శాత్సర్వే విష్ణ్వాద్యాస్స కుతూహలాః ॥
పార్వత్యాస్సుతపో దృష్ట్వా తేజసా వ్యాపృతాస్తదా ।
ప్రణేముస్తాం జగద్ధాత్రీం తేజో రూపాం తపస్థ్సి తామ్ ॥
ప్రశంసంత స్తపస్తస్యా స్సాక్షాత్సిద్ధి తనోస్సు రా: ।
జగ్ముస్తత్ర తదా తే చ యత్రాస్తే వృషభధ్వజః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

సర్వసమర్థుడగు విష్ణువు ఇట్లు పలుకగా, దేవతలందరు అపుడు విష్ణువుతో గూడి పినాకధారియగు శివుని చూచుటకు వెళ్లిరి (42). విష్ణువు మొదలుగా గల వారందరు ముందుగా పార్వతి యొక్క తపస్సును చూచు కుతూహలము గలవారై మార్గమునందున్న ఆమె ఆశ్రమమునకు వెళ్లిరి (43). పార్వతి యొక్క గొప్ప తపస్సును చూడగానే వారందరు తేజస్సుచే వ్యాప్తులైరి. వారప్పుడు జగన్మాత, తేజస్స్వరూపిణి, తపోనిష్ఠురాలు అగు ఆమెకు ప్రణమిల్లిరి (44). మూర్తీభవించి తపస్సిద్ధివలె నున్న ఆమె యొక్క తపస్సును కొనియాడుతూ, ఆ దేవతలు తరువాత వృషభధ్వజుడగు శంకరుడు ఉన్న స్థానమునకు వెళ్లిరి (45).

తత్ర గత్వా చ తే దేవాస్త్వాం మునే ప్రైషయంస్తదా ।
పశ్యంతో దూరతస్తస్థు: కామ భస్మకృతో హరాత్ ॥
నారద త్వం శివస్థానం తదా గత్వాఽభయస్తదా ।
శివభక్తో విశేషేణ ప్రసన్నం దృష్టవాన్ ప్రభుమ్ ॥
పునరాగత్య యత్నేన దేవానాహూయ తాంస్తతః ।
నినాయ శంకరస్థానం తదా విష్ణ్వాది కాన్మునే ॥
అథ విష్ణ్వాదయస్సర్వే తత్ర గత్వా శివం ప్రభుమ్ ।
దదృశుస్సుఖమాసీనం ప్రసన్నం భక్తవత్సలమ్ ॥

ఓ మహర్షీ! అపుడా దేవతలు అచటకు చేరి శివుని వద్దకు నిన్ను పంపిరి. కాముని భస్మము చేసిన శివునకు వారు దూరముగా నుండి చూచుచుండిరి (46). ఓ నారదా! అపుడు భయమునెరుంగని నీవు శివుని స్థానమునకు వెళ్లి యుంటివి. విశేషించి శివభక్తుడవగు నీవు అపుడు ప్రసన్నుడై యున్న ఆ ప్రభుని చూచితివి (47). నీవు అపుడు తిరిగి వచ్చి విష్ణువు మొదలగు దేవతలను పిలిచి ప్రయత్న పూర్వకముగా శంకరుని వద్దకు తీసుకువెళ్లితివి. ఓ మహర్షీ! (48) అపుడు విష్ణువు మొదలగు దేవతలందరు అచటకు వెళ్లి, సుఖాసీనుడై ప్రసన్నుడై యున్న భక్తవత్సలుడగు శివ ప్రభుని దర్శించిరి (49).

యోగపట్ట స్థితం శంభుం గణైశ్చ పరివారితమ్ ।
తపోరూపం దధానం చ పరమేశ్వర రూపిణమ్ ॥
తతో విష్ణుర్మయాన్యే చ సురసిద్ధ మునీశ్వరాః ।
ప్రణమ్య తుష్టువుస్సూక్తై ర్వేదోపనిషదన్వితైః ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే సాంత్వన శివదేవదర్శన వర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః (23).

యోగపట్టము (ఒక విశేష బంధములోనున్న వస్త్రము) నందున్న వాడు, గణములచే పరివేష్టించబడియున్నవాడు, తపస్సునకు అనుకూలమగు రూపమును ధరించినవాడు, పరమేశ్వర స్వరూపుడు (50) అగు శివుని విష్ణువు, నేను, దేవతలు, సిద్ధులు, మహర్షులు మరియు ఇతరులు నమస్కరించి వేదములతో, ఉపనిషత్తులతో గూడిన సూక్తములతో స్తుతించితిమి (5 1).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో దేవతలు శివుని దర్శించుట అనే ఇరువది మూడవ అధ్యాయము ముగిసినది (23).

24 - దేవతలు శివునితో మొరపెట్టుకొనుట

దేవా ఊచుః ।

నమో రుద్రాయ దేవాయ మదనాంతకరాయ చ ।
స్తుత్యాయ భూరిభాసాయ త్రినేత్రాయ నమో నమః ॥
శిపివిష్టాయ భీమాయ భీమాక్షాయ నమో నమః ।
మహాదేవాయ ప్రభవే త్రివిష్టపతయే నమః ॥
త్వం నాథస్సర్వ లోకానాం పితా మాతా త్వమీశ్వరః ।
శంభురీశ శ్శంకరోఽ సి దయాలుస్త్వం విశేషతః ॥
త్వం ధాతా సర్వజగతాం త్రాతుమర్హసి నః ప్రభో ।
త్వాం వినా కస్సమర్థోఽస్తి దుఃఖనాశే మహేశ్వర ॥

దేవతలిట్లు పలికిరి -

ప్రకాశస్వరూపుడు, మన్మథుని దహించినవాడు, స్తుతింపదగిన వాడు, గొప్ప తేజశ్శాలి, ముక్కంటి అగు రుద్రునకు అనేక నమస్కారములు (1). రశ్ములచే సర్వమును ప్రకాశింపజేయు ఆదిత్యుడు నీవే. భయంకరాకారుడు, భయమును గొల్పు కన్నులు గలవాడు, ప్రభుడు, మహాదేవుడు అగు నీకు నమస్కారము. నీవు ఇంద్రరూపుడవై స్వర్గమును పాలించుచున్నావు (2). లోకములన్నింటికీ నాథుడు, తండ్రి, తల్లి మరియు పాలకుడు నీవే. నీవు మంగళ స్వరూపుడవు, ఈశ్వరుడవు, మంగళముల నిచ్చువాడవు. నీయందు దయ విశేషముగా గలదు (3). హే ప్రభో! లోకములనన్నింటినీ పోషించు నీవు మమ్ములను రక్షింప తగుదువు. మహేశ్వరా! దుఃఖమును పోగొట్టుటలో సమర్థుడు నీవు తక్క మరి ఎవ్వరు గలరు? (4)

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం సురాణాం నందికేశ్వరః ।
కృపయా పరయా యుక్తో విజ్ఞప్తుం శంభుమారభత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

నందికేశ్వరుడు ఆ దేవతల ఈ మాటలను విని గొప్ప దయగలవాడై శంభునితో విన్నపమును చేయుటకారంభించెను (5).

నందికేశ్వర ఉవాచః

విష్ణ్వాదయస్సురగణా మునిసిద్ధ సంఘాః త్వాం ద్రష్టుమేవ సురవర్య విశేషయంతి ।
కార్యార్థినోఽ సురవరైః పరిభర్త్స్య మానాః సమ్యక్ పరాభవ పదం పరమం ప్రపన్నాః ॥
తస్మాత్త్వయా హి సర్వేశ త్రాతవ్యా మునయస్సురాః ।
దీనబంధుర్విశేషేణ త్వముక్తో భక్తవత్సలః ॥

నందికేశ్వరుడిట్లనెను –

విష్ణువు ప్రముఖముగా గల దేవగణములు, మునిగణములు, సిద్ధగణములు నిన్ను చూచుటకై వేచియున్నారు. ఓ దేవోత్తమా! గొప్ప రాక్షసులచే పీడింపబడి, తీవ్రమగు పరాభవమునకు గురియైన వీరలు నీ అనుగ్రహముచే కార్యసిద్ధిని గోరుచున్నారు (6). హే సర్వేశ్వరా! కావున నీవు మునులను, దేవతలను రక్షించవలెను. నీవు విశేషించి దీనులకు బంధుడవని, భక్తవత్సలుడవని ఖ్యాతిని గాంచినావు (7).

బ్రహ్మోవాచ ।

ఏవం దయావతా శంభుర్విజ్ఞప్తో నందినా భృశమ్ ।
శనైశ్శనైరు పరమద్ధ్యానాదున్మీల్య చాక్షిణీ ॥
ఈశోఽథో పరతశ్శంభుస్తదా పరమకోవిదః ।
సమాధేః పరమాత్మాసౌ సురాన్ సర్వానువాచ హ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

దయాళువు అగు నంది ఇట్లు పరిపరివిధముల విన్నవించగా, శంభుడు మెల్లమెల్లగా ధ్యానమునుండి విరమించి కన్నులను తెరచెను (8). అపుడు ఈశ్వరుడు, పరమజ్ఞాని, పరమాత్మయగు ఈ శంభుడు సమాధిని ఉపసంహరించి, దేవతలందరితో నిట్లనెను (9).

శంభురువాచ ।

కస్మాద్యూయం సమాయాతా మత్సమీపం సురేశ్వరాః ।
హరి బ్రహ్మాదయస్సర్వే బ్రూత కారణమాశు తత్ ॥

శంభుడిట్లు పలికెను –

ఓ దేవతా శ్రేష్ఠులారా! బ్రహ్మ విష్ణువులను ముందిడు కొని మీరందరు నా వద్దకు వచ్చుటకు గల కారణమును వెంటనే చెప్పుడు (10).

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా వచశ్శంభోస్సర్వే దేవా ముదాన్వితాః ।
విష్ణోర్వ్యలోకయామాసుర్ముఖం విజ్ఞప్తి హేతవే ॥
అథ విష్ణుర్మహాభక్తో దేవానాం హితకారకః ।
మదీరిత మువాచేదం సురకార్యం మహత్తరమ్ ॥
తారకేణ కృతం శంభో దేవానాం పరమాద్భుతమ్ ।
కష్టాత్కష్టతరం దేవా విజ్ఞప్తుం సర్వ ఆగతాః ॥
హే శంభో తవ పుత్రేణౌ రసేన హి భవిష్యతి ।
నిహతస్తారకో దైత్యో నాన్యథా మమ భాషితమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

శంభుని ఈ మాటలను విని దేవతలందరు ఆనందముతో నిండినవారై, శంభునకు విన్న వించుట కొరకై విష్ణువు యొక్క ముఖము వైపునకు చూచిరి (11). అపుడు మహాభక్తుడు, దేవతలకు మేలు చేయువాడునగు విష్ణువు గొప్ప దేవకార్యమును సాధింపగోరి నేను చెప్పిన ఈ మాటలను పలికెను (12). హే శంభో! తారకుడు దేవతలకు పరమాశ్చర్యకరమగు పద్ధతిలో తీవ్రవేదనలను కలిగించుచున్నాడు. ఆ సంగతిని విన్నవించుటకై దేవతలందరు ఇచటకు వచ్చియున్నారు (13). హే శంభో! నీనుండి జన్మించిన నీ కుమారుని చేతిలో మాత్రమే ఈ తారకాసురుడు హతుడగును. నా మాట తప్పు గాదు (14).

విచార్యేత్థం మహాదేవ కృపాం కురు నమోఽస్తు తే ।
దేవాన్ సముద్ధర స్వామిన్ కష్టాత్తారక నిర్మితాత్ ॥
తస్మాత్త్వయా గిరిజా దేవ శంభో గ్రహీతవ్యా పాణినా దక్షిణేన ।
పాణిగ్రహేణైవ మహానుభావాం దత్తాం గిరీంద్రేణ చ తాం కురుష్వ ॥
విష్ణోస్తద్వచనం శ్రుత్వా ప్రసన్నో హ్యబ్రవీచ్ఛివః ।
దర్శయన్ సద్గతిం తేషాం సర్వేషాం యోగతత్పరః ॥

ఓమహాదేవా! నీవీ విషయమును విమర్శించి దయను చూపుము. నీకు నమస్కారమగు గాక! ఓ స్వామీ! తారకుడు కలిగించిన కష్టమునుండి దేవతలను ఉద్ధరించుము (15). హే దేవా! శంభో! కావున నీవు నీ కుడిచేతితో పార్వతిని స్వీకరించవలెను. పర్వతరాజు సమర్పించగా మహా పతివ్రతయగు ఆమెను పాణిగ్రహణము చేయుము (16). విష్ణువు యొక్క మాటలను విని శివుడు ప్రసన్నుడాయెను. యోగ నిష్ఠుడగు శివుడు వారందరికీ మంచి మార్గమును చూపుచున్నవాడై ఇట్లు పలికెను (17).

శివ ఉవాచః

యదా మే స్వీకృతా దేవీ గిరిజా సర్వ సుందరీ ।
తదా సర్వే సురేంద్రాశ్చ మునయో ఋషయస్తదా ॥
సకామాశ్చ భవిష్యంతి న క్షమాశ్చ పరే పథి ।
జీవయిష్యతి దుర్గా సా పాణిగ్రహణ తస్స్మరమ్ ॥
మదనో హి మయా దగ్ధస్సర్వేషాం కార్యసిద్ధయే ।
బ్రహ్మణో వచనాద్విష్ణో నాత్ర కార్యా విచారణా ॥
ఏవం విమృశ్య మనసా కార్యాకార్య వ్యవస్థితౌ ।
సుధీస్సర్వైశ్చ దేవేంద్ర హఠం నో కర్తుమర్హసి ॥

శివుడిట్లు పలికెను -

నేను సర్వాంగ సుందరియగు పార్వతీ దేవిని స్వీకరించిన నాడు దేవతలు, దిక్పాలకులు, మునులు, ఋషులు అందరు (18) కోరిక తీరిన వారు కాగలరు. కాని వారు మోక్ష మార్గమునందు సమర్థులు కాజాలరు. పాణిగ్రహణ మాత్రముచే ఆ దుర్గ మన్మథుని జీవింపచేయగలదు (19). హే విష్ణో! అందరి కార్యము సిద్ధించుట కొరకై బ్రహ్మ యొక్క వచనమునను సరించి నేను మన్మథుని దహించితిని. ఈ విషయములో నీవు విమర్శ చేయకుము (20). ఏది కర్తవ్యము, ఏది కాదు అను వ్యవస్థను చేయుటలో వివేకి మనస్సులో చక్కగా విమర్శను చేయవలెను. ఓ దేవేంద్రా! నీవు దేవతలందరితో గూడి హఠమును చేయదగదు (21).

దగ్ధే కామే మయా విష్ణో సురకార్యం మహత్ కృతమ్ ।
సర్వే తిష్ఠంతు నిష్కామా మయా సహ సునిశ్చితమ్ ॥
యథా హం చ సురాస్సర్వే తథా యూయమయత్నతః ।
తపః పరమ సంయుక్తాః కరిష్య ధ్వం సుదుష్కరమ్ ॥
యూయం సమాధినా తేన మదనేన వినా సురాః ।
పరమానంద సంయుక్తా నిర్వికారా భవంతు వై ॥
పురా వృత్తం స్మరకృతం విస్మృతం యద్విధే హరే ।
మహేంద్ర మునయో దేవా యత్తత్సర్వం విమృశ్యతామ్ ॥

హే విష్ణో! నేను మన్మథుని దహించి గొప్ప దేవ కార్యమును చేసితిని. మీరందరు నాతో గూడి కామము లేనివారై ఉందురుగాక! ఇది నిశ్చయము (22). ఓ దేవతలారా! మీరందరు ప్రయత్నము లేకుండగనే నా వలెనే గొప్ప ఏకాగ్రత గలవారై ఉగ్రమగు తపస్సును చేయుడు (23). ఓ దేవతలారా! మన్మథుడిపుడు లేడు గనుక మీరు పరమానందముతో గూడినవారై వికారములు లేనివారై సమాధినిష్ఠులు కండు (24). ఓ బ్రహ్మా! హే విష్ణో! మహేంద్రా! మునులారా! దేవతలారా! పూర్వము మన్మథుడు చేసిన పనిని మీరు విస్మరించినారు. ఆ వృత్తాంతమునంతనూ విమర్శ చేయుడు (25).

మహో ధనుర్ధ రేణైవ మదనేన హఠాత్సురాః ।
సర్వేషాం ధ్యాన విధ్వంసః కృతస్తేన పురా పురా ॥
కామో హి నరకాయైవ తస్మాత్క్రోధోఽభిజాయతే ।
క్రోధాద్భవతి సంమోహో మోహాచ్చ భ్రంశతే తపః ॥
కామక్రోధౌ పరిత్యాజ్యౌ భవద్భిస్సు రసత్తమైః ।
సర్వైరేవ చ మంతవ్యం మద్వాక్యం నాన్యథా క్వచిత్ ॥

ఓ దేవతలారా! మహాధనుర్ధారి యగు మన్మథుడు పూర్వము హఠాత్తుగా అందరి ధ్యానమును నాశనము చేసినాడు (26). కామము నరకమునకు దారి తీయును. దాని నుండి క్రోధము పుట్టును. క్రోధమునుండి వ్యామోహము పుట్టును. వ్యామోహము వలన తపస్సు భ్రష్టమగును (27). దేవతా శ్రేష్ఠులగు మీరందరు కామక్రోధములను విడనాడుడు. నామాటను మననము చేయుడు. నా మాట ఎన్నటికీ అసత్యము కాబోదు (28).

బ్రహ్మోవాచ ।

ఏవం విశ్రావ్య భగవాన్ మహాదేవో వృషధ్వజః ।
సురాన్ ప్రవాచయామాస విధివిష్ణూ తథా మునీన్ ॥
తూష్ణీం భూతోఽభవచ్ఛంభుర్ధ్యా నమాశ్రిత్య వై పునః ।
ఆస్తే పురా యథా స్థాణుర్గణైశ్చ పరివారితః ॥
స్వాత్మాన మాత్మనా శంభురాత్మన్యేవ వ్యచింతయత్ ।
నిరంజనం నిరాభాసం నిర్వికారం నిరామయమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వృషభధ్వజుడు, భగవంతుడు అగు మహాదేవుడు బ్రహ్మ విష్ణువులను, మరియు దేవతలను మునులను ఉద్దేశించి ఈ విధముగా ధర్మమును బోధించెను (29). అపుడాయన మాటలాడుటను విరమించి మరల ధ్యానమగ్నుడై పూర్వములో వలెనే కదలిక లేనివాడై ఉండెను. గణములు ఆయనను చుట్టువారి యుండెను (30). సంగము, భ్రాంతి, వికారము, దోషము లేని ఆత్మతత్త్వమును శంభుడు తన మనస్సుచే తన హృదయము నందు ధ్యానించెను (31).

పరాత్పరతరం నిత్యం నిర్మమం నిరవగ్రహమ్ ।
శబ్దాతీతం నిర్గుణం చ జ్ఞానగమ్యం పరాత్పరమ్ ॥
ఏవం స్వరూపం పరమం చింతయన్ ధ్యానమాస్థితః ।
పరమానంద సంమగ్నో బభూవ బహుసూతికృత్ ॥
ధ్యానస్థితం చ సర్వేశం దృష్ట్వా సర్వే దివౌకసః ।
హరిశక్రాదయస్సర్వే నందినం ప్రోచురానతాః ॥

ఉత్కృష్టమైన వాటి అన్నిటికంటే ఉత్కృష్టమైనది, నిత్యము, మమకారము లేనిది ్, దోషములు లేనిది, శబ్దములకు అందనిది, నిర్గుణము, జ్ఞానము చేత మాత్రమే పొందబడునది (32) అగు పరమాత్మ స్వరూపమును మనస్సులో

ధ్యానిస్తూ, ఆ జగత్కారణుడగు శివుడు పరమానంద నిమగ్నుడై యుండెను (33). విష్ణువు, ఇంద్రుడు మొదలగు దేవతలందరు ధ్యానమునందున్న ఆ సర్వేశ్వరుని చూచి, నందీశ్వరుని ఉద్దేశించి వినయముతో నిట్లు పలికిరి (34).

దేవా ఊచుః ।

కింవయం కరవామాద్య విరక్తో ధ్యాన మాస్థితః ।
శంభుస్త్వం శంకరసఖస్సర్వజ్ఞ శ్శుచిసేవకః ॥
కేనోపాయేన గిరిశః ప్రసన్నస్స్యాద్గణాధిప ।
తదుపాయం సమాచక్ష్వ వయం త్వచ్ఛరణం గతాః ॥

దేవతలిట్లు పలికిరి –

శంభుడు విరక్తుడై ధ్యానమునందున్నాడు. మేమిప్పుడు ఏమి చేయవలెనను? నీవు శంకరుని మిత్రుడవు. సర్వము తెలిసిన వాడవు. శుద్ధహృదయము గల సేవకుడవు (35). ఓ గణాధ్యక్షా! ఏ ఉపాయముచే కైలాసపతి ప్రసన్నుడగునో, అట్టి ఉపాయమును చెప్పుము. మేము నిన్ను శరణు పొందుచున్నాము (36).

బ్రహ్మోవాచ ।

ఇతి విజ్ఞాపితో దేవైర్మునే హర్యాదిభిస్తదా ।
ప్రత్యువాచ సురాంస్తాన్స నందీ శంభుప్రియో గణః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! విష్ణువు మొదలగు దేవతలు ఈ విధముగా విన్నవించుకొనగా, శంభునకు ప్రియుడైన గణాధ్యక్షుడగు నందీశ్వరుడు ఆ దేవతలకు ఇట్లు ప్రత్యుత్తరము నిచ్చెను (37).

నందీశ్వర ఉవాచః

హే హరే హే విధే శక్ర నిర్జరా మునయస్తథా ।
శృణుధ్వం వచనం మే హి శివసంతోష కారకమ్ ॥
యది వో హఠ ఏవాద్య శివదార పరిగ్రహే ।
అతిదీనతయా సర్వే సునుతిం కురుతాదరాత్ ॥
భక్తేర్వశ్యో మహాదేవో న సాధారణతస్సు రాః ।
అకార్యమపి సద్భక్త్యా కరోతి పరమేశ్వరః ॥
ఏవం కురుత సర్వే హి విధివిష్ణు ముఖాస్సురాః ।
యథాగతేన మార్గేణాన్యథా గచ్ఛత మా చిరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

హే విష్ణో! ఓ బ్రహ్మ! ఇంద్రా! దేవతలారా! మునులారా! శివునకు సంతోషమును కలిగించు మాటను చెప్పెదను. వినుడు (38). ఈనాడే శివుడు వివాహమాడవలెనని మీకు పట్టుదల ఉన్నచో, మీరందరు మిక్కిలి దైన్యముతో ఆదరముతో చక్కని స్తోత్రమును చేయుడు (39). దేవతలారా! సాధారణముగా వశముగాని మహాదేవుడు భక్తికి వశుడగును. ఆ పరమేశ్వరుడు మంచి భక్తి గల వాని విషయములో చేయదగని పనిని కూడ చేసిపెట్టును (40). బ్రహ్మ, విష్ణువు మొదలుగా గల ఓ దేవతలారా! మీరందరు ఈ తీరున చేయుడు. లేదా, ఆలస్యము చేయకుండగా వచ్చిన దారిని వెళుడు (41).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య మునే విష్ణ్వాదయస్సురాః ।
తథేతి మత్వా సుప్రీత్యా శంకరం తుష్టువుర్వ్రతే ॥
దేవ దేవ మహాదేవ కరుణా సాగర ప్రభో ।
సముద్ధర మహాక్లేశా త్త్రాహి నశ్శరణాగతాన్ ॥
ఇత్యేవం బహుదీనోక్త్యా తుష్టువుశ్శంకరం సురాః ।
రురుదుస్సుస్వరం సర్వే ప్రేమవ్యాకుల మానసాః ॥
హరిర్మయా సుదీనోక్త్యా సువిజ్ఞప్తిం చకార హ ।
సంస్మరన్మనసా శంభుం భక్త్యా పరమయాన్వితః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మహర్షీ! విష్ణువు మొదలగు దేవతలు ఆతని మాటను విని అటులనే చేయుదమని అంగీకరిం◌ిచి, మిక్కిలి ప్రీతితో శంకరుని స్తుతించిరి (42). ఓ దేవ దేవా! మహాదేవా! కరుణా సముద్రా! ప్రభో! శరణుజొచ్చిన మమ్ములను ఈ మహాదుఃఖము నుండి ఉద్ధరించి రక్షించుము (43). దేవతలు ఈ తీరున మిక్కిలి దీనమగు పలుకులతో శంకరుని స్తుతించిరి. ప్రేమచే నిండిన మనస్సుగల ఆ దేవతలందరు చక్కని స్వరముతో రోదించిరి (44). విష్ణువు నాతో కలిసి పరమభక్తితో కూడినవాడై మనస్సులో శంభుని స్మరించుచూ మిక్కిలి దీనముగా విన్నవించుకొనెను (45).

సురైరేవం స్తుతశ్శంభు ర్హరిణా చ మయా భృశమ్ ।
భక్త వాత్సల్యతో ధ్యానాద్విరతోఽ భూన్మహేశ్వరః ॥
ఉవాచ సుప్రసన్నాత్మా హర్యాదీన్ హర్షయన్ హరః ।
విలోక్య కరుణా దృష్ట్యా శంకరో భక్తవత్సలః ॥

నేను, విష్ణువు మరియు దేవతలు ఈ తీరున పరిపరివిధముల స్తుతించగా, మహేశ్వరుడు◌ు భక్తుల యందలి ప్రేమచే ధ్యానమును ఆపివేసెను (46). భక్తవత్సలుడు, పాపహారియగు శంకరుడు మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై విష్ణువు మొదలగు దేవతలకు ఆనందము కల్గునట్లు దయాదృష్టితో చూచి ఇట్లు పలికెను (47).

శంకర ఉవాచ ।

హే విధే హే హరే దేవాశ్శక్రాద్యా యుగపత్త్వమే ।
కిమర్థ మాగతా యూయం సత్యం బ్రూత మమాగ్రతః ॥

శంకరుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! హే విష్ణో! ఇంద్రాది దేవతలారా! మీరందరు ఒక్కసారి ఇచటకు వచ్చుటకు కారణమేమి? నా ఎదుట సత్యమును పలుకుడు (48).

హరి రువాచ ।

సర్వజ్ఞస్త్వం మహేశాన త్వంతర్యామ్య ఖిలేశ్వరః ।
కిం న జానాసి చిత్తస్థం తథా వచ్మ్యపి శాసనాత్ ॥
తారకాసురతో దుఃఖం సంభూతం వివిధం మృడ ।
సర్వేషాం నస్త దర్థం హి ప్రసన్నోఽకారి వై సురైః ॥
శివా సా జనితా శైలాత్త్వ దర్థం హి హిమాలయాత్ ।
తస్యాం త్వదుద్భవాత్పు త్రాత్తస్య మృత్యుర్న చాన్యథా ॥
ఇతి దత్తో బ్రహ్మణా హి తస్మై దైత్యాయ యద్వరః ।
తదన్య స్మాదమృత్యుస్స బాధతే నిఖిలం జగత్ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ మహేశ్వరా! నీవు సర్వజ్ఞుడవు. అంతర్యామివి. సర్వేశ్వరుడవు. మా మనస్సు◌్సులోని మాట నీకు తెలియదా? అయిననూ, నీ శాసనముచే చెప్పుచున్నాను (49). హే మృడా! మాకందరికీ తారకాసురుని వలన అనేక రకముల దుఃఖము సంప్రాప్తమైనది. ఇందువలననే దేవతలు నిన్ను స్తుతించి ప్రసన్నునిగా చేసుకొనిరి (50). ఉమా దేవి నీ కొరకై హిమవంతుని కుమార్తెగా జన్మించియున్నది. . ఆమె యందు నీకు కలిగే పుత్రునిచే మాత్రమే ఆ తారకుడు సంహరింపబడును. దీనికి మరియొక ఉపాయము లేదు (51). ఆతనికి ఇట్టి వరమును ఇచ్చి యున్నాడు. కావున ఇతరుల చేతిలో ఆతనికి చావు లేదు. ఆతడు జగత్తు నంతనూ పీడించుచున్నాడు (52).

నారదస్య నిదేశాత్సా కరోతి కఠినం తపః ।
తత్తేజ సాఖిలం వ్యాప్తం త్రైలో క్యం సచరాచరమ్ ॥
వరం దాతుం శివాయై హి గచ్ఛ త్వం పరమేశ్వర ।
దేవదుఃఖం జహి స్వామిన్ అస్మాకం సుఖమావహ ॥

ఆ పార్వతి నారదుని ఉపదేశమును పొంది కఠినమగు తపస్సును చేయుచున్నది. స్థావర జంగమ ప్రాణులతో గూడిన ముల్లోకములు ఆమె యొక్క తేజస్సుచే వ్యాప్తమై యున్నవి (53). ఓ పరమేశ్వరా! నీవు ఆ పార్వతికి వరమునిచ్చుటకు వెళ్లుము. ఓ స్వామీ! దేవతలమగు మా దుఃఖమును పోగొట్టి సుఖములనిమ్ము (54).

దేవానాం మే మహోత్సాహో హృదయే చాస్తి శంకర ।
వివాహం తవ సంద్రష్టుం తత్కురు యథోచితమ్ ॥
రత్యై యద్భవతా దత్తో వరస్తస్య పరాత్పర ।
ప్రాప్తోఽవసర ఏవాశు సఫలం స్వపణం కురు ॥

ఓ శంకరా! దేవతలకు నాకు హృదయములో నీ వివాహమును చూడవలెననే ఉత్సాహము అధికముగా గలదు. కావున నీవు యథా యోగ్యముగా చేయుము (55). ఓ పరాత్పరా! నీవు రతికి ఇచ్చిన వరమును నెరవేర్చే సమయము ఆసన్నమైనది. నీ ప్రతిజ్ఞను సఫలము చేయుము (56).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా తం ప్రణమ్యైవ విష్ణుర్దేవా మహర్షయః ।
సంస్తూయ వివిధైస్స్తోత్రైస్సంతస్థుస్తత్పు రోఽఖిలాః ॥
భక్తాధీనశ్శంకరోఽపి శ్రుత్వా దేవవచస్తదా ।
విహస్య ప్రత్యువాచాశు వేదమర్యాద రక్షకః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు, దేవతలు, మహర్షులు ఇట్లు పలికి శివునకు నమస్కరించి అనేక స్తోత్రములతో చక్కగా స్తుతించి, వారందరు ఆయన ఎదుట నిలబడిరి (57). అపుడు భక్తులకు వశుడై ఉండే శంకరుడు కూడా దేవతల మాటలను విని నవ్వెను. వేద మర్యాదను రక్షించు శివుడు వెంటనే వారికి ఇట్లు బదులిడెను (58).

శంకర ఉవాచః

హే హరే హే విధే దేవా శ్శృణుతాదరతోఽఖిలాః ।
యథోచితమహం వచ్మి సవిశేషం వివేకతః ॥
నోచితం హి విధానం వై వివాహకరణం నృణామ్ ।
మహానిగడ సంజ్ఞో హి వివాహో దృఢబంధనః ॥
కుసంగా బహవో లోకే స్త్రీ సంగస్తత్ర చాధికః ।
ఉద్ధరేత్ సకలబంధైర్న స్త్రీ సంగాత్ప్రముచ్యతే ॥
లోహదారుమయైః పాశైర్దృఢం బద్ధోఽపి ముచ్యతే ।
స్త్ర్యాదిపాశ సుసంబద్ధో ముచ్యతే న కదాచన ॥

శంకరుడిట్లు పలికెను -

ఓహరీ! బ్రహ్మా! దేవతలారా! అందరు ఆదరముతో వినుడు. నేను వివేకముతో కూడియున్న యథోచితమగు ప్రత్యేక వచనమును చెప్పెదను (59). మానవులు వివాహమాడుట యోగ్యమగు కర్మ కాదు. వివాహము దృఢమగు బంధము. అది పెద్ద సంకెల అని చెప్పవచ్చును (60). లోకములో చెడు సంగములనేకములు గలవు. వాటిలో అన్నింటి కంటే అధికమైనది స్త్రీలతోడి సంగము. మానవుడు బంధములనన్నింటినీ విడిపించుకొనగలడు. కాని స్త్రీ

సంగము నుండి విడిపించుకొనలేడు (61). ఇనుప సంకెళ్లతో గాని, చెక్కల సంకెలతో గాని దృఢముగా బంధింపబడిన వ్యక్తి విడిపించు కొనగలడు. కాని స్త్రీ అను పాశముచే బంధింపబడిన వ్యక్తి ఏనాటికైనను విముక్తుడు కాలేడు (62).

వర్ధంతే విషయా శ్శశ్వన్మహా బంధనకారిణః ।
విషయాక్రాంతమనస స్స్వప్నే మోక్షోఽ పి దుర్లభః ॥
సుఖమిచ్ఛతు చేత్ప్రాజ్ఞో విషవత్ విషయాంస్త్యజేత్ ।
విషవ ద్విషయానాహు ర్విషయైర్యై విహన్యతే ॥
జనో విషయిణా సాకం వార్తాతః పతతి క్షణాత్ ।
విషయం ప్రాహురాచార్యాస్సి తాలిప్తేంద్ర వారుణీమ్ ॥
యద్య ప్యేవం హి జానామి సర్వం జ్ఞానం విశేషతః ।
తథాప్యహం కరిష్యామీ ప్రార్థనాం సఫలాం చ వః ॥

దృఢముగా బంధించే ఈ ఇంద్రియ సుఖములు ఎల్లవేళలా వృద్ధి పొందుచుండును. భోగలాలసతతో నిండిన మనస్సు గలవానికి మోక్షప్రాప్తి స్వప్నము నందైననూ అసంభవము (63). వివేకవంతుడగు మానవుడు సుఖమును కోరువాడైనచో విషయ సుఖములను విషమునువలె విడువవలెను. విషయ సుఖములు విషమువంటివని పెద్దలు చెప్పెదరు. ఇంద్రియ సుఖములు మానవుని నాశమును గొని తెచ్చును (64). భోగలాలసునితో మాటలాడు వ్యక్తి కూడ క్షణములో పతితుడగును. ఇంద్రియ సుఖములు పంచదార స్ఫటికము కలిపిన మద్యము వంటి వని ఆచార్యులు చెప్పుచున్నారు (65). సర్వ జ్ఞానములు నాకు ఎరుకయే. అయిననూ, మీ ప్రార్థనను నేను సఫలము చేసెదను (66).

భక్తాధీనోఽహ మేవాస్మి తద్వశాత్సర్వ కార్యకృత్ ।
అయథోచితకర్తా హి ప్రసిద్ధో భువనత్రయే ॥
కామరూపాధి పస్యైవ పణశ్చ సఫలః కృతః ।
సుదక్షిణస్య భూపస్య భైమబంధ గతస్య హి ॥
గౌతమక్లేశ కర్తాహం త్ర్యంబకాత్మా సుఖావహః ।
తత్కష్ట ప్రదదుష్టానాం శాపదాయీ విశేషతః ॥
విషం పీతం సురార్థం హి భక్త వత్సల భావధృక్ ।
దేవకష్టం హృతం యత్నాత్సర్వదైవ మయా సురాః ॥

నేను మాత్రమే భక్తులకు అధీనుడనై సర్వకార్యములను వారి ఇచ్ఛను అనుసరించి చేయుదును. భక్తుల కొరకై నేను ఉచితము కాని పనిని కూడ చేసెదనని ముల్లోకములలో ప్రసిద్ధి గలదు (67). భీమ మహారాజుచే బంధింపబడిన సుదక్షిణుడనే కామరూప దేశాధిపతి యొక్క ప్రతిజ్ఞను సఫలము చేసితిని (68). ముక్కంటినగు నేను గౌతముని కష్టములను తొలగించి, సుఖములను కలిగించి, ఆయనకు కష్టమును కలిగించిన దుష్టులకు కఠిన శాపములనిచ్చి యుంటిని (69). భక్తవాత్సల్య మే నా స్వరూపము గనుకనే, నేను దేవతల కొరకై విషమును త్రాగితిని. ఓ దేవతలారా! నేను అన్ని వేళలా దేవతల కష్టమును యత్నపూర్వకముగా నివారించియుంటిని (70).

భక్తార్థమసహం కష్టం బహుశో బహుయత్నతః ।
విశ్వానరము నేర్దుః ఖం హృతం గృహపతిర్భవన్ ॥
కిం బహూక్తేన చ విధే హరే సత్యం బ్రవీమ్యహమ్ ।
మత్పణోఽస్తీతి యూయం వై సర్వే జానీథ తత్త్వతః ॥
యదా యదా విపత్తిర్హి భక్తానాం భవతి క్వచిత్ ।
తదా తదా హరామ్యాశు తత్ క్షణాత్సర్వశస్సదా ॥
జానేఽహం తారకా ద్దుః ఖం సర్వేషాం వస్సముత్థితమ్ ।
అసురాత్తద్ధరిష్యామి సత్యం సత్యం వదామ్యహమ్ ॥

నేను అనేక పర్యాయములు అధిక ప్రయత్నమును చేసి భక్తుల కొరకై కష్టమును సహించితిని. నేను గృహపతినై విశ్వానర మహర్షి యొక్క దుఃఖమును తొలగించితిని (71). ఓ బ్రహ్మా! హే విష్ణో! పెక్కు మాటలేల? నేను సత్యమును పలుకుచున్నాను. నేను ప్రతిజ్ఞను చేసితినని మీరందరు ఎరుంగుదురు. ఆ ప్రతిజ్ఞ యొక్క తత్త్వము మీకు తెలియును (72). ఎప్పుడైననూ ఎక్కడైననూ భక్తులకు కష్టము వచ్చినచో, నేను అప్పుడు అక్కడ వెంటనే ప్రత్యక్షమై ఆ కష్టమును తొలగించెదను (73). మీకు అందరికీ తారకాసురుని వలన సంప్రాప్తమైన దుఃఖమును గురించి నేను ఎరుంగుదును. నేనా దుఃఖమును తొలగించెదను. నేను ముమ్మాటికీ సత్యమును పలుకుచున్నాను (74).

నాస్తి యద్యపి మే కాచి ద్విహారకరణే రుచిః ।
వివాహయిష్యే గిరిజాం పుత్రోత్పాదన హేతవే ॥
గచ్ఛత స్వగృహాణ్యేవ నిర్భయాస్స కలాస్సు రాః ।
కార్యం వస్సాధయిష్యామి నాత్ర కార్యా విచారణా ॥

నాకు భోగ విలాసముల యందు అభిరుచి లేకపోయిననూ, పుత్ర సంతానము కొరకై పార్వతిని వివాహ మాడెదను (75). దేవతలారా! మీరందరు నిర్భయముగా మీ గృహములకు వెళ్లుడు. మీ కార్యమును నేను సిద్ధింపజేసెదను. మీరీ విషయములో విచారించకుడు (76).

బ్రహ్మోవాచ।

ఇత్యుక్త్వా మౌనమాస్థాయ సమాధిస్థోఽ భవద్ధరః ।
సర్వే విష్ణ్వాదయో దేవాస్స్వధామాని యయుర్మునే ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పార్వతీ
వివాహస్వీకారో నామ చతుర్వింశోఽధ్యాయః (24).

బ్రహ్మ ఇట్లు పలికెను –

శివుడు ఇట్లు పలికి మౌనమును వహించి సమాధిలోనికి వెళ్లిపోయెను. ఓ మహర్షీ! విష్ణువు మొదలగు దేవతలందరు తమ ధామములకు వెళ్లిరి (77).

శ్రీ శివ మహా పురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో
పార్వతీ వివాహ స్వీకారమనే ఇరువది నాలుగవ అధ్యాయము ముగిసినది (24).

25 - సప్తర్షులు పార్వతిని పరీక్షించుట

నారద ఉవాచ।

గతేషు తేషు దేవేషు విధివిష్ణ్వాదికేషు చ ।
సర్వేషు మునిషు ప్రీత్యా కిం బభూవ తతః పరమ్ ॥
కిం కృతం శంభునా తాత వరం దాతుం సమాగతః ।
కియత్కాలేన చ కథం తద్వద ప్రీతి మావహన్ ॥

నారదుడిట్లు పలికెను -

బ్రహ్మ, విష్ణువు మొదలగు ఆ దేవతలు, మునులు అందరూ ఆనందముతో మరలి వెళ్లిన తరువాత ఏమాయెను? (1) తండ్రీ! శంభువు ఏమి చేసినాడు? ఆయన ఎంత కాలము తరువాత వరము నిచ్చుటకు వచ్చినాడు? ఎట్లు వచ్చినాడు? ఆ విషయమును చెప్పి ప్రీతిని కలిగించుము (2).

బ్రహ్మో వాచ।

గతేషు తేషు దేవేషు బ్రహ్మాదిషు నిజాశ్రమమ్ ।
తత్తపస్సు పరీక్షార్థం సమాధి స్థోఽభవద్భవః ॥
స్వాత్మాన మాత్మనా కృత్వా స్వాత్మన్యేవ వ్యచింతయత్ ।
పరాత్పరతరం స్వస్థం నిర్మాయం నిరవగ్రహమ్ ॥
తద్వస్తు భూతో భగవానీశ్వరో వృషభధ్వజః ।
అవిజ్ఞాతగతి స్సూతిస్స హరః పరమేశ్వరః ॥
గిరిజా హి తదా తాత తతాప పరమం తపః ।
తపసా తేన రుద్రోఽపి పరం విస్మయ మాగతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

బ్రహ్మ మొదలగు ఆ దేవతలు తమ స్థానములకు వెళ్లిన తరువాత, శివుడు ఆమె యొక్క తపస్సును బాగుగా పరీక్షింపగోరి సమాధిలోనికి వెళ్లిపోయెను (3). సర్వము కంటె శ్రేష్ఠమైనది, స్వరూపభూతమైనది, మాయకు అతీతమైనది, ఆటంకములు లేనిది అగు ఆత్మ తత్త్వమును ఆయన మనస్సుతో హృదయమునందు ధ్యానించెను (4). ఆ హరుడు తత్పద వాచ్యమగు వస్తు స్వరూపుడు, భగవానుడు, ఈశ్వరుడు, వృషభము ధ్వజము నందు గలవాడు, తెలియబడని స్వరూపము గలవాడు, సర్వకారణుడు మరియు పరమేశ్వరుడు (5). వత్సా! అపుడా పార్వతి ఉగ్రతపస్సును చేయుచుండెను. ఆ తపస్సును గని రుద్రుడు కూడ మిక్కిలి విస్మయమును పొందెను (6).

సమాధేశ్చలితస్సోఽ భూద్భక్త్యా ధీనోఽపి నాన్యథా ।

వసిష్ఠాదీన్ మునీన్ సప్త సస్మార సూతికృద్ధరః ॥

సప్తాపి మునయశ్శీఘ్రం మాయయుస్స్మృతి మాత్రతః ।

ప్రసన్న వదనాస్సర్వే వర్ణయంతో విధిం బహు ॥

ప్రణమ్య తం మహేశానం తుష్టువుర్హర్ష నిర్భరాః ।

వాణ్యా గద్గదయా బద్ధకరా వినత కంధరాః ॥

ఆయన భక్తులకు అధీనుడే గాని మరియొకటి కాదు. ఆయన సమాధి నుండి చలించెను. జగత్కారణుడగు హరుడు వసిష్ఠాది సప్తర్షులను స్మరించెను (7). ప్రసన్నమగు ముఖము గల సప్తర్షులు స్మరించినంత మాత్రాన తమ భాగ్యమును అనేక విధములుగా వర్ణించుకొనుచున్నవారై విచ్చేసిరి (8). వారు ఆనంద భరితులై ఆ మహేశ్వరునకు ప్రణమిల్లి, చేతులు జోడించి, తలలు వంచి, గద్గదమగు వాక్కుతో నిట్లు స్తుతించిరి (9).

సప్తర్షయ ఊచుః ।

దేవ దేవ మహాదేవ కరుణా సాగర ప్రభో ।

జాతా వయం సుధన్యా హి త్వయా యదధునా స్మృతాః ॥

కిమర్థం సంస్మృతా వాథ శాసనం దేహి తద్ధి నః ।

స్వదాస సదృశం స్వామిన్ కృపాం కురు నమోఽస్తు తే ॥

సప్తర్షులిట్లు పలికిరి –

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసముద్రా! ప్రభూ! నీవీనాడు మమ్ములను స్మరించుటచే మేము మిక్కిలి ధన్యులమైతిమి (10). ఓ స్వామీ! నీవు మమ్ములను దేనికొరకు స్మరించితివి? నీవా విషయమును మాకు ఆజ్ఞాపించుము. నీ దాసులయందు చూపించే కృపవంటి కృపను చూపుము. నీకు నమస్కారమగు గాక! (11)

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య మునీనాం తు విజ్ఞప్తిం కరుణానిధిః ।

ప్రోవాచ విహసన్ ప్రీత్యా ప్రోత్ఫుల్ల నయనాంబుజః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

కరుణా సముద్రుడగు శివుడు మహర్షుల ఈ విన్నపమును విని, వికసించిన పద్మముల వంటి నేత్రములు గలవాడై ప్రేమతో నవ్వి ఇట్లు పలికెను (12).

మహేశ్వర ఉవాచ ।

హే సప్త మునయస్తాతాశ్శృణు తారం వచో మమ ।
అస్మద్ధితకరా యూయం సర్వజ్ఞాన విచక్షణాః ॥
తపశ్చరతి దేవేశీ పార్వతీ గిరిజాఽధునా ।
గౌరీ శిఖర సంజ్ఞే హి పర్వతే దృఢమానసా ॥
మాం పతిం ప్రాప్తు కామా హి సా సఖీ సేవితా ద్విజాః ।
సర్వాన్ కామాన్ విహాయాన్యాన్ పరం నిశ్చయమాగతా ॥
తత్ర గచ్ఛత యూయం మచ్ఛాసనాన్ముని సత్తమాః ।
పరీక్షాం దృఢతాయాస్తత్కురుత ప్రేమచేతసః ॥
సర్వథా ఛల సంయుక్తం వచనీయం వచశ్చ వః ।
న సంశయః ప్రకర్తవ్య శ్శాసనాన్మమ సువ్రతాః ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

ఓ సప్తర్షులారా! కుమారులారా! నా మాటను వెంటనే వినుడు. సర్వజ్ఞులగు మీరు మాకు హితమును చేయువారు (13). దేవ దేవి యగు పార్వతి ఈ సమయములో గౌరీ శిఖరమను పేరుగల పర్వతమునందు దృఢచిత్తయై తపము నాచరించుచున్నది (14). ఓ ద్విజులారా! ఆమె నన్ను భర్తగా పొందవలెననే అంతిమ నిశ్చయమును చేసుకొని ఇతర కామనలనన్నిటినీ వీడినది. ఆమెను సఖురాండ్రు కనిపెట్టియున్నారు (15). ఓ మహర్షులారా! మీరు నా ఆజ్ఞచే అచటకు వెళ్లి, ప్రేమతో నిండిన మనస్సు గలవారై, ఆమె మనస్సు ఎంత దృఢమైనది? అను విషయమును పరీక్షించుడు (16). మీరు పూర్తి అసత్యములను, నిందావాక్యములను పలుకుడు. దృఢమగు వ్రతము గల ఓ ఋషులారా! మీరు నా శాసనముచే ఈ విషయములో ఎట్టి సంశయమునైననూ పొందకుడు (17).

బ్రహ్మోవాచ ।

ఇత్యాజ్ఞ ప్తాశ్చ మునయో జగ్ముస్తత్ర ద్రుతం హి తే ।
యత్ర రాజతి సా దీప్తా జగన్మాతా నగాత్మజా ॥
తత్ర దృష్టా శివా సాక్షా తపస్సిద్ధిరివాపరా ।
మూర్తా పరమతేజస్కా విలసన్ తీ సుతే జసా ॥
హృదా ప్రణమ్య తాం తే తు ఋషయస్సప్త సువ్రతాః ।
సన్నతా వచనం ప్రోచుః పూజితాశ్చ విశేషతః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు ఆజ్ఞాపింపబడిన ఆ మునులు శీఘ్రమే అచటకు వెళ్లిరి. అచట జగన్మాతయగు పార్వతి గొప్ప తేజస్సుతో విరాజిల్లు చుండెను (18). మూర్తీభవించిన తపస్సిద్ధివలె నున్న, పరమతేజస్సుతో విలసిల్లు చున్న పార్వతిని వారచట చూచిరి (19). దృఢవ్రతులగు ఆ సప్తర్షులు ఆమెకు మనస్సులో నమస్కరించి, ఆమెచే ప్రత్యేకముగా పూజింపబడినవారై, వినయముతో నిట్లు పలికిరి (20).

ఋషయ ఊచుః ।

శృణు శైలసుతే దేవి కి మర్థం తప్యతే తపః ।
ఇచ్ఛసి త్వం సురం కంచ కిం ఫలం తద్వదాధునా ॥

ఋషులిట్లు పలికిరి -

ఓ పార్వతీ దేవీ! వినుము. నీవు దేని కొరకు తపస్సును చేయుచున్నావు? ఏ దేవతను కోరుచున్నావు? ఏ ఫలమును కోరుచున్నావు? ఇపుడా విషయమును చెప్పుము (21).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తా సా శివా దేవీ గిరీంద్ర తనయా ద్విజైః ।
ప్రత్యువాచ వచస్సత్యం సుగూఢమపి తత్పురః ॥

ఆ బ్రాహ్మణులిట్లు పలుకగా, ఆ పార్వతీ దేవి వారి యెదుట పరమ రహస్యమే అయిననూ సత్యము నిట్లు పలికెను (22).

పార్వత్యు వాచ ।

మునీశ్వరాస్సంశ్శృణుత మద్వాక్యం ప్రీతితో హృదా ।
బ్రవీమి స్వవిచారం వై చింతితో యో ధియా స్వయా ।
కరిష్యథ ప్రహాసం మే శ్రుత్వా వాచో హ్యసంభవాః ।
సంకోచో వర్ణనే విప్రా భవత్యేవ కరోమి కిమ్ ॥
ఇదం మనో హి సుదృఢమవశం పరకర్మకృత్ ।
జలోపరి మహా భిత్తిం చికీర్షతి మహోన్నతామ్ ॥

పార్వతి ఇట్లు పలికెను -

మునివరులారా! నా మాటను ప్రీతితో మనస్సును లగ్నము చేసి వినుడు. నేను నా బుద్ధితో ఆలోచించి నిశ్చయించిన నా విచారమును చెప్పెదను (23). అసంభవమగు నా మాటలను విని మీరు పరిహాసము చేసెదరు. ఓ విప్రులారా! మీ ఎదుట వర్ణించుటకు సంకోచము అగుచున్నది. నేనేమి చేయుదును? (24). ఈ నా మనస్సు నియంత్రింప సంభవము కానిది. నా వశములో లేదు. అసంభవమగు కర్మలనపేక్షించుచున్నది. ఈ నా మనస్సు నీటిపై ఎత్తైన మహా ప్రాసాదమును నిర్మింపగోరుచున్నది (25).

సురర్షేశ్శాసనం ప్రాప్య కరోమి సుదృఢం తపః ।
రుద్రః పతిర్భవేన్మే హి విధాయేతి మనోరథమ్ ॥
అపక్షో మన్మనః పక్షీ వ్యోమ్ని ఉడ్డీయతే హఠాత్ ।
తదాశాం శంకరస్స్వామీ పిపర్తు కరుణానిధిః ॥

రుద్రుడు నాకు భర్త కావలెననే కోర్కెను మనస్సులో నిడుకొని, దేవర్షియగు ఌ నారదుని అనుమతిని పొంది తీవ్రమగు తపస్సును చేయుచున్నాను (26). రెక్కలు లేని నా మనస్సు అనే పక్షి హఠాత్తుగా ఆకాశమునందు ఎగురుచున్నది. కరుణా సముద్రుడగు శంకరస్వామి దాని యాశను పరిపూర్ణము చేయును గాక! (27)

బ్రహ్మోవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తస్యా విహస్య మునయశ్చ తే ।
సంమాన్య గిరిజాం ప్రీత్యా ప్రోచుశ్ఛలవచో మృషా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆమె యొక్క ఈ మాటలను విని ఆ మహర్షులు నవ్వి ఆ పార్వతిని ప్రీతితో ఆదరించి (మనస్సులో), మాయమాటలను ఇట్లు పలికిరి (28).

ఋషయ ఊచుః ।

న జ్ఞాతం తస్య చరితం వృథా పండితమానినః ।
దేవర్షేః క్రూరమనసః సుజ్ఞా భూత్వాప్య గాత్మజే ॥
నారదః కూటవాదీ చ పరచిత్త ప్రమంథకః ।
తస్య వార్తాశ్రవణతో హానిర్భవతి సర్వథా ॥
తత్ర త్వం శృణు సద్బుద్ధ్యా చేతిహాసం సుశోభితమ్ ।
క్రమాత్త్వాం బోధయంతో హి ప్రీత్యా తముపధారయ ॥
బ్రహ్మ పుత్రోహి యో దక్షస్సుషువే పితురాజ్ఞయా ।
స్వపత్న్యా మయుతం పుత్రానయుంక్త తపసి ప్రియాన్ ॥

ఋషులు ఇట్లు పలికిరి -

వ్యర్థముగా తాను పండితుడనను ధారణ గలవాడు, క్రూరమగు మనస్సు గలవాడు అగు ఆ దేవర్షి యొక్క చరిత్ర నీకు తెలియదు. ఓ పార్వతీ! నీవు సహజముగా బుద్ధిమంతురాలవే (29). నారదుడు మోసపు మాటలను చెప్పి ఇతరుల మనస్సులను కల్లోల పెట్టును. ఆతని మాటలను విన్నవారికి అన్ని విధములుగా హాని కలుగును (30). మేము నీకు క్రమముగా బోధించెదము. నీవు మంచి బుద్ధితో ఈ చక్కని వృత్తాంతమును విని ప్రీతితో దానిని తెలుసుకొని మనస్సులో నిశ్చయించుము (31). బ్రహ్మపుత్రుడగు దక్షుడు తండ్రి ఆజ్ఞచే తన భార్యయందు పదివేల పుత్రులను గని, ఆ ప్రియపుత్రులను తపస్సు చేయుడని నియోగించెను (32).

తే సుతా: పశ్చిమదిశి నారాయణసరో గతాః ।
తపోఽర్థే తే ప్రతిజ్ఞాయ నారదస్తత్ర వై యయౌ ।
కూటోపదేశమా శ్రావ్య తత్ర తాన్నారదో మునిః ।
తదాజ్ఞయా చ తే సర్వే పితుర్న గృహమాయయుః ॥
తచ్ఛ్రుత్వా కుపితో దక్షః పితాశ్వాసిత మానసః ।
ఉత్పాద్య పుత్రాన్ ప్రాయుంక్త సహస్ర ప్రమితాంస్తతః ॥
తేఽపి తత్ర గతాః పుత్రాస్తపోఽర్థం పితురాజ్ఞయా ।
నారదోఽపి యయౌ తత్ర పునస్తత్స్వోప దేశకృత్ ॥

ఆ కుమారులు తపస్సును చేసెదమని ప్రతిజ్ఞచేసి పశ్చిమ దిక్కున నున్న నారాయణ సరస్సునకు వెళ్లిరి. నారదుడు కూడ అచటకు వెళ్లి (33), వారికి మోసపు ఉపదేశమును చేసెను. వారాతని ఉపదేశముచే తిరిగి తండ్రి వద్దకు ఒక్కడైననూ మరలి వెళ్లలేదు (34). ఈ వార్తను విని దక్షుడు కుపితుడు కాగా తండ్రి ఆతనిని ఓదార్చెను. ఆతడు తరువాత మరల వేయిమంది కుమారులను గని తపస్సు కొరకు పంపెను (35). ఆ కుమారులు కూడా తండ్రి యాజ్ఞచే తపస్సును చేయుట కొరకు అచటకు వెళ్లిరి. నారదుడు కూడ అచటకు వెళ్లి మరల వారికి వైరాగ్యము నుపదేశించెను (36).

దదౌ తదుపదేశం తే తేభ్యో భ్రాతృపథం యయుః ।
ఆయయుర్న పితుర్గేహం భిక్షు వృత్తి రతాశ్చ తే ॥
ఇత్థం నారదసద్వృత్తిర్విశ్రుతా శైలకన్యకే ।
అన్యాం శృణుహి తద్వృత్తం వైరాగ్యకరణీం నృణామ్ ॥
విద్యాధరశ్చిత్ర కేతుర్యో బభూవ పురాకరోత్ ।
స్వోపదేశమయం దత్త్వా తస్మై శూన్యం చ తద్గృహమ్ ॥
ప్రహ్లాదాయ స్వోపదేశాన్ హిరణ్య కశిపోః పరమ్ ।
దత్త్వా దుఃఖం దదౌ చాయం పరబుద్ధి ప్రభేదకః ॥

ఆతని ఉపదేశముచే వారు కూడ సోదరుల మార్గములో వెళ్లిరి. వారు భిక్షాటన యందభిరుచి గలవారై తండ్రి గృహమునకు మరలి పోలేదు (37). ఓ శైలజా! నారదుని మంచిదనము ఈ తీరున లోకప్రసిద్ధమై యున్నది. మానవులలో వైరాగ్యమును కలిగించే ఆతని మరియొక గాథను వినుము (38). పూర్వము చిత్రకేతు డనే విద్యాధరుడుండెను. నారదుడాతనికి తన ఉపదేశమును చేసి ఆతని ఇంటిని శూన్యము చేసెను (39). ఇతరుల బుద్ధిలో భేదములను కల్పించే ఈ నారదుడు తన ఉపదేశములను ప్రహ్లాదునకు చేసి హిరణ్య కశిపునకు మహా దుఃఖమును కలిగించెను (40).

మునినా నిజ విద్యా యచ్ఛ్రావితా కర్ణరోచనా ।

స స్వగేహం విహాయాశు భిక్షాం చరతి ప్రాయశః ॥

నారదో మలినాత్మా హి సర్వదోజ్జ్వల దేహవాన్ ।

జానీ మస్తం విశేషణ వయం తత్సహవాసినః ॥

బకం సాధుం వర్ణయంతి న మత్స్యానత్తి సర్వథా ।

సహవాసీ విజానీయాచ్చరిత్రం సహవాసినామ్ ॥

లబ్ధ్వా తదుపదేశం హి త్వమపి ప్రాజ్ఞ సంమతా ।

వృథైవ మూర్ఖీభూతా తు తపశ్చరసి దుష్కరమ్ ॥

యదర్థ మీ దృశం బాలే కృషి విపులం తపః ।

సదోదాసీ నిర్వికారో మదనార్ని సంశయః ॥

ఆ ముని ఎవనికి వినుటకు రుచించే తన విద్యను వినిపించునో, వాడు తప్పని సరిగా తన ఇంటిని వీడి వెంటనే భిక్షాటనను మొదలిడును (41) నారదుని దేహము సదా ప్రకాశించునదే. కాని ఆతని మనస్సు మలినము. ఆతనితో కలిసి నివసించే మాకు ఆతని గురించి పూర్తిగా తెలియదు. (42). కొంగ సాధువు అని కొందరు చెప్పెదరు. కొంగ అన్ని వేళలా చేపలను తినదు గదా! సహవాసుల చరిత్ర సహవాసులకు మాత్రమే తెలియును గదా! (43). నీవు బుద్ధి మంతురాలవే అయిననూ, ఆతని ఉపదేశమును పొంది మూర్ఖురాలవై వ్యర్థముగా కఠినమగు తపస్సును చేయుచున్నావు (44), అమ్మాయీ! నీవు ఎవని కొరకై ఇంత విస్తారమగు తపస్సును చేయుచున్నావో, ఆ శివుడు సర్వదా ఉదాసీనుడై ఉండును. ఆయన నిర్వికారుడు, మన్మధ శత్రువు అనుటలో సందేహము లేదు (45).

అమంగలవపుర్ధారీ నిర్లజ్జోఽ సదనోఽ కులీ ।

కువేషీ ప్రేత భూతాది సంగీ నగ్నో హి శూలభృత్ ॥

స ధూర్తస్తవ విజ్ఞానం వినాశ్య నిజమాయయా ।

మోహయామాస సద్యుక్త్యా కారయామాస వై తపః ॥

ఈ దృశం హి వరం లబ్ధ్వా కిం సుఖం సంభవిష్యతి ।

విచారం కురు దేవేశి త్వమేవ గిరి జాత్మజే ॥

ప్రథమం దక్షజాం సాధ్వీం వివాహ్య సుధియా సతీమ్ ।

నిర్వాహం కృతవాన్నైవ మూఢః కించిద్దినాని హి ॥

శూల ధారియగు శివుడు అమంగళమగు శరీరమును కలిగి సిగ్గులేని వాడై యుండును. ఆయనకు ఇల్లు లేదు, కులము లేదు. ఆయన దిగంబరుడై చెడు వేషమును కలిగి ప్రేతపిశాచాదులతో స్నేహమును చేయును (46). ఆ మోసగాడు తన మాయచే నీ బుద్ధిని చెడగొట్టి నిన్ను అనేక గొప్ప యుక్తులతో మోహింప జేసి నీచే తపస్సును చేయించుచున్నాడు (47). ఇట్టి వానిని వివాహమాడిన స్త్రీ కి ఏమి సుఖము కలుగును? ఓ దేవదేవీ ! పార్వతీ! నీవే ఆలోచించుము (48). ఆ మూర్ఖుడు ముందుగా దక్షపుత్రి, పతి వ్రతయగు సతిని వివాహమాడి సద్బుద్ధితో కొద్దిరోజులైననూ సరిగా కాపురము చేసినాడు కాదు (49).

తాం తథైవ స వై దోషం దత్త్వాత్యాక్షీత్స్వయం ప్రభుః ।
ధ్యాయన్ స్వరూపము కలమశో కమరమత్సుఖీ ॥
ఏకలః పరనిర్వాణో హ్యసంగోఽ ద్వయ ఏవ చ ।
తేన నార్యాః కథం దేవి నిర్వాహస్సంభవిష్యతి ॥
అద్యాపి శాసనం ప్రాప్య గృహమాయాహి దుర్మతిమ్ ।
త్యజాస్మాకం మహాభాగే భవిష్యతి చ శం తవ ॥

ఆ ప్రభువు ఆమె యందు స్వయముగా దోషమును చూపి పరిత్యజించినాడు. ఆయన నిరవయవము, శోకరహితమునగు ఆత్మ తత్త్వమును ధ్యానిస్తూ సుఖముగా రమించుచున్నాడు (50). ఆయన ఏకాకి, పరమమోక్ష స్వరూపుడు, సంగరహితుడు, అద్వితీయుడు. ఓ దేవీ! ఒక యువతి ఆతనితో ఎట్లు వేగ గలదు? అది సంభవము కాదు (51). ఈనాటికైననూ మా ఆజ్ఞను మన్నించి, చెడు బుద్ధిని వీడి ఇంటికి వెళ్లుము. ఓ పుణ్యాత్మురాలా! నీకు శుభము కలుగగలదు (52).

త్వద్యోగ్యో హి వరో విష్ణుస్సర్వ సద్గుణవాన్ ప్రభుః ।
వైకుంఠవాసీ లక్ష్మీశో నానా క్రీడా విశారదః ॥
తేన తే కారయిష్యామో వివాహం సర్వసౌఖ్యదమ్ ।
ఇతిదృశం త్యజ హఠం సుఖితా భవ పార్వతి ॥

మంచి గుణములన్నింటినీ కలిగి యున్న విష్ణు ప్రభుడు నీకు తగిన వరుడు. ఆయన వైకుంఠము నందుండును. లక్ష్మీ పతియగు విష్ణువు వివిధ క్రీడలలో నిపుణుడు (53). ఆయన తోడి వివాహము సర్వసుఖముల నిచ్చును. నీకు ఆ వివాహమును మేము చేయించెదము. ఈ మొండి పట్టును విడువుము. ఓ పార్వతీ! సుఖపడుము (54).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా పార్వతీ జగదంబికా ।
విహస్య చ పునః ప్రాహ మునీన్ జ్ఞానవిశారదాన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

జగన్మాత యగు పార్వతి ఈ మాటలను విని నవ్వి శుద్ధ జ్ఞానము గల ఆ మునులతో మరల నిట్లనెను (55).

పార్వత్యువాచ ।

సత్యం భవద్భిః కథితం స్వజ్ఞానేన మునీశ్వరాః ।
పరం తు మే హఠో నైవ ముక్తో భవతి హే ద్విజాః ॥
స్వతనోశ్శైల జాతత్వాత్కాఠిన్యం సహజం స్థితమ్ ।
ఇత్థం విచార్య సుధియా మాం నిషేద్ధుం న చార్హథ ॥
సురర్షేర్వచనం పథ్యం త్యక్ష్యే నైవ కదాచన ।
గురూణాం వచనం పథ్యమితి వేదవిదో విదుః ॥
గురుణాం వచనం సత్యమితి యేషాం దృఢా మతిః ।
తేషామిహాముత్ర సుఖం పరమం నాసుఖం క్వచిత్ ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ మహర్షులారా! మీరు మీకు తెలిసిన సత్యమును పలికితిరి. ఓ బ్రాహ్మణులారా! కాని, నాకు గల ఈ హఠము తొలగిపోయేది కానే కాదు (56). నేను పర్వతుని కుమార్తెను అగుటచే సహజముగానే కఠినురాలను. మీరు మంచి బుద్ధితో ఈ సత్యమును విచారించి నన్ను తపస్సు చేయవద్దని వారించుట తగదు (57). దేవర్షి యగు నారదుని హితకరమగు వచనమును నేను ఎన్నటికీ త్యజించను. గురువుల వచనము హితకరమని వేదవేత్తలు చెప్పెదరు (58). గురువుల వచనము సత్యమని ఎవరికైతే దృఢమగు నిశ్చయము ఉండునో, వారికి ఇహ పరలోకములలో పరమ సుఖము కలుగును. వారికి ఎచ్చటనైననూ దుఃఖము లేదు (59).

గురూణాం వచనం సత్యమితి యద్హృదయే న ధీః ।
ఇహాముత్రాపి తేషాంహి దుఃఖం న చ సుఖం క్వచిత్ ॥
సర్వథా న పరిత్యాజ్యం గురూణాం వచనం ద్విజా: ।
గృహం వసేద్వా శూన్యం స్యాన్మే హఠ స్సుఖదస్సదా ॥
యద్భవద్భి స్సుభణితం వచనం మునిసత్తమాః ।
తదన్యథా తద్వివేకం వర్ణయామి సమాసతః ॥
గుణాలయో విహారీ చ విష్ణుస్సత్యం ప్ర కీర్తితః ।
సదాశివోఽ గుణః ప్రోక్తస్తత్ర కారణముచ్యతే ॥

గురువుల వచనం సత్యమనే నిర్ణయం ఎవరి హృదయములో ఉండదో, వారికి ఇహమునందు, పరమునందు కూడ దుఃఖము కలుగును. వారికి ఎచ్చటనైననూ సుఖము కలుగదు (60). ఓ బ్రాహ్మణులారా! గురువచమును ఎట్టి పరిస్థితులలోనైనా వీడరాదు. నా ఈ హఠము నన్ను గృహిణిని చేసి శాశ్వత సుఖము నీయ వచ్చును. లేదా, నాకు శూన్యము మిగులవచ్చును (61). ఓ ముని శ్రేష్ఠులారా! మీరు చక్కగా చెప్పిన వచనము సరిగాదు. దానిలో గల వివేకమును సంగ్రహముగా చెప్పెదను (62). విష్ణువు గుణ సంపన్నుడనియు, విహరించువాడనియు చెప్పి తిరి. సత్యమే. సదాశివుడు గుణహీనుడని చెప్పబడినాడు. దానికి గల కారణమును చెప్పెదను (63).

శివో బ్రహ్మ వికారస్స భక్త హేతోర్ధృతాకృతిః ।

ప్ర భుతాం లౌకికీం నైవ సందర్శయితు మిచ్ఛతి ॥

అతః పరమహంసానాం ధార్యతే సుప్రి యా గతిః ।

అవధూత స్వరూపేణ పరానందేన శంభునా ॥

భూషణాది రుచిర్మాయా లిప్తానాం బ్రహ్మణో న చ ।

స ప్ర భుర్నిర్గుణోఽ జో నిర్మాయోఽ లక్ష్య గతిర్విరాట్ ।।

ధర్మజాత్యా దిభిశ్శంభుర్నాను గృహ్ణాతి వై ద్విజాః ।

గురోరనుగ్ర హేణైవ శివం జానామి తత్త్వతః ॥

పరబ్రహ్మ యొక్క సగుణ రూపమే శివుడు. ఆయన భక్తుల కొరకె ఆకారమును పొందినాడు. ఆయనకు లౌకికమగు సామర్థ్యమును ప్రదర్శించవలెననే ఆకాంక్ష లేనే లేదు (64). ఇందువలననే అవధూత స్వరూపుడు, పరమానంద ఘనుడునగు శివుడు పరమహంసలకు ఆనందముతో పొందదగిన పరమగతియె ఉన్నాడు (65). మాయా లేపము గలవారికి అలంకారాదులయందు అభిరుచి ఉండును. కాని పరబ్రహ్మకు అట్టి అభిరుచి ఉండదు. ఆ ప్రభుడు నిర్గుణుడు, పుట్టుక లేని వాడు. మాయా లేపము లేనివాడు, ఆయన స్వరూపము ఇంద్రియ గోచరము కాదు. కాని విరాడ్రూపములో నున్నది ఆయనయే (66). ఓ బ్రాహ్మణులారా! ధర్మము, జాతి మొదలగునవి శివుని అనుగ్రహమును పొందుటలో హేతువులు కాజాలవు. గురువు యొక్క అనుగ్రహము చేత మాత్రమే నేను శివుని యథార్థ స్వరూపము నెరింగినాను (67).

చేచ్ఛివస్స హి మే విప్రా వివాహం న కరిష్యతి ।

అవివాహా సదాహం స్యాం సత్యం సత్యం వదామ్యహమ్ ॥

ఉదయతి యది భానుః పశ్చిమే దిగ్విభాగే ప్రచలతి యది మేరు శ్శీతతాం యాతి వహ్నిః ।

వికసతి యది పద్మం పర్వతాగ్రే శిలాయాం న హి చలతి హఠో మే సత్యమేతద్ధ్రు వీమి ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ శివుడు నన్ను వివాహమాడనిచో, నేను అవివాహితురా◌ాలిగా శాశ్వత కాలము మిగిలి యుందును. నేను ముమ్మాటికీ సత్యమును పలుకుచున్నాను (68). సూర్యుడు పశ్చిమ దిక్కునందు ఉదయించిననూ, మేరు పర్వతము కదలడొచ్చిననూ, అగ్ని చల్లబడిననూ, పర్వతశిఖరముపై రాతి మీద పద్మము వికసించిననూ, నా ఈ హఠము చలించదు. నేను సత్యమును పలుకుచున్నాను (69).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా తాన్ ప్రణమ్యాశు మునీన్ సా పర్వతాత్మజా ।
విరరామ శివం స్మృత్వా నిర్వికారేణ చేతసా ॥
ఋషయోఽపీత్థ మాజ్ఞాయ గిరిజాయాస్సు నిశ్చయమ్ ।
ప్రాచుర్జయగిరం తత్ర దదుశ్చాశిష ముత్తమామ్ ॥
అథ ప్రణమ్య తాం దేవీం మునయో హృష్ట మానసాః ।
శివస్థానం ద్రుతం జగ్ముస్తత్పరీక్షా కరా మునే ॥
తత్ర గత్వా శివం నత్వా వృత్తాంతం వినివేద్య తమ్ ।
తదాజ్ఞాం సమను ప్రాప్య స్వర్లోకం జగ్మురాదరాత్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే సప్తర్షికృత పరీక్షావర్ణనం నామ పంచవింశోఽధ్యాయః (25).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు పలికి ఆ పార్వతి వెంటనే ఆ మహర్షులకు నమస్కరించి, వికారము లేని మనస్సు[illegible]స్సుతో శివుని స్మరించి, విరమించెను (70). ఆ ఋషులు కూడా పార్వతి యొక్క ఇట్టి దృఢనిశ్చయము నెరింగి, 'జయము కలుగుగాక!' అని ఉత్తమమగు ఆశీర్వచనమును పలికిరి (71). అపుడు ఆనందముతో నిండిన మనస్సుగల ఆ మునులు ఆ దేవికి నమస్కరించిరి. ఓ మహర్షి! వారీ విధముగా ఆమెను పరీక్షించి వెంటనే శివుని స్థానమునకు వెళ్లిరి (72). వారు అచటకు వెళ్లి శివునకు నమస్కరించి ఆ వృత్తాంతమును నివేదించి ఆయన ఆజ్ఞను పొంది ఆదరముతో స్వర్గలోకమునకు వెళ్లిరి (73).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు పార్వతీ ఖండలో సప్తర్షులు పరీక్ష చేయుట అనే ఇరువది యెదవ అధ్యాయము ముగిసినది (25).

26- బ్రహ్మచారి రాక

బ్రహ్మోవాచ ।

గతేషు తేషు మునిషు స్వం లోకం శంకరస్స్వయమ్ ।
పరీక్షితుం తపో దేవ్యా ఐచ్ఛత్సృష్టి కరః ప్రభుః ॥
పరీక్షాచ్ఛద్మనా శంభుర్ద్రష్టుం తాం తుష్టమానసః ।
జటిలం రూపమాస్థాయ స యయౌ పార్వతీవనమ్ ॥
అతీవ స్థవిరో విప్రదేహధారీ స్వతేజసా ।
ప్రజ్వలన్మనసా హృష్టో దండీ ఛత్రీ బభూవ సః ॥
తత్రాపశ్యత్ స్థితాం దేవీం సఖీభిః పరివారితామ్ ।
వేదికోపరి శుద్ధాం తాం శివామివ విధోః కలామ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మునులు తమ లోకమునకు వెళ్లగానే, సృష్టికారణుడగు శంకర ప్రభుడు పార్వతీ దేవియొక్క తపస్సును స్వయముగా పరీక్షింపగోరెను (1). శంభుడు పరీక్షయను నెపముతో ఆమెను చూడగోరి, సంతోషముతో గూడిన మనస్సు గలవాడై, జటాధారియగు విప్రుని రూపమును ధరించి పార్వతి తపస్సు చేయుచున్న వనమునకు వెళ్ళెను (2). సంతసముతో నిండిన మనస్సుగల ఆ శివుడు తన తేజస్సుచే ప్రకాశించువాడు, కర్రను గొడుగును పట్టుకున్నవాడు, మిక్కిలి ముదుసలి యగు బ్రాహ్మణుని వేషమును ధరించి యుండెను (3). ఆయన అచట సఖురాండ్రచే చుట్టువార బడి, తపోవేదికపై స్వచ్ఛమగు చంద్రకళవలె ప్రకాశించుచున్న ఆ పార్వతీదేవిని చూచెను (4).

శంభుర్నిరీక్ష్య తాం దేవీం బ్రహ్మచారి స్వరూపవాన్ ।
ఉపకంఠం యయౌ ప్రీత్యా తదాఽసౌ భక్తవత్సలః ॥
ఆగతం తం తదా దృష్ట్వా బ్రాహ్మణం తేజసాద్భుతమ్ ।
అపూజయచ్ఛివా దేవీ సర్వపూజోప హారకైః ॥
సుసత్కృతం సంవిధాభిః పూజితం పరయా ముదా ।
పార్వతీ కుశలం ప్రీత్యా పప్రచ్ఛ ద్విజమాదరాత్ ॥

భక్తవత్సలుడగు ఆ శంభుడు బ్రహ్మచారి రూపమును ధరించిన వాడై ఆ దేవిని చూచి, అపుడు ప్రేమతో సమీపమునకు వెళ్లెను (5). అద్భుతమగు తేజస్సుతో ప్రకాశిస్తూ అచటకు విచ్చేసిన బ్రాహ్మణుని చూచి, అపుడా పార్వతీదేవి ఆయనను సర్వోపచారములతో, మరియు బహుమానములతో పూజించెను (6). పార్వతీ దేవి పరమానందముతో మరియు చక్కగా అమర్చబడిన పూజా ద్రవ్యములతో ఆ బ్రాహ్మణుని పూజించి ఆదరముతో ప్రేమతో కుశలము నడిగెను (7).

పార్వత్యువాచ ।

బ్రహ్మచారి స్వరూపేణ కస్త్వం హి కుత ఆగతః ।
ఇదం వనం భాసయసే వద వేద విదాం వర ॥

పార్వతి ఇట్లు పలికెను -

వేదవేత్తలలో శ్రేష్ఠమైనవాడా! బ్రహ్మచారి రూపములో నున్న నీవు ఎవరివి? ఈ వనము నీచే ప్రకాశించుచున్నది. చెప్పుము (8).

విప్ర ఉవాచః

అహమిచ్ఛాభిగామీ చ వృద్ధో విప్రతనుస్సుధీః ।
తపస్వీ సుఖదోఽన్యేషా ముపకారీ న సంశయః ॥
కా త్వం కస్యాసి తనయా కి మర్థం విజనే వనే ।
తపశ్చరసి దుర్ధర్షం మునిభి: ప్రపదైరపి ॥
న బాలా న చ వృద్ధాసి తరుణీ భాసి శోభనా ।
కథం పతిం వినా తీక్ష్ణం తపశ్చరసి వై వనే ॥
కిం త్వం తపస్వినీ భద్రే కస్య చిత్సహచారిణీ ।
తపస్వీ స న పుష్ణాతి దేవి త్వాం చ గతోఽన్యతః ॥

ఆ బ్రాహ్మణుడిట్లు పలికెను -

నేను ఇచ్ఛవచ్చిన చోట సంచరించే వృద్ధ బ్రాహ్మణుడను, విద్వాంసుడను, తపశ్శాలిని. నేను ఇతరులకు ఉపకారమును చేసి సుఖమును కలిగించెద ననుటలో సందియము లేదు (9). నీ వెవరు? ఎవరి కుమార్తెవు? నిర్జనమగు ఈ వనములో నీవు, నిలబడి తపస్సును చేయు మునులు కూడ చేయ శక్యము కాని తపస్సును ఎందులకు చేయుచున్నావు? (10) నీవు చిన్న పిల్లవు కాదు. వృద్ధురాలవు కాదు. నీవు అందమగు యువతివి యని స్పష్టమగు చున్నది. భర్త తోడు లేకుండగా ఈ వనములో ఉగ్రమగు తపస్సును ఏల చేయుచున్నావు? (11) ఓ మంగళస్వరూపురాలా! తపస్సును చేయుచున్న నీవు ఎవని భార్యవు? ఆ, అభాగ్యుడు నిన్ను పోషించుటలేదు. ఓ దేవీ! ఆతడు నిన్ను వీడి మరియొక చోటకు వెళ్ళినాడా యేమి? (12)

వద కస్య కులే జాతా కః పితా తవ కా విధా ।
మహా సౌభాగ్యరూపా త్వం వృథా తవ తపో రతిః ॥
కిం త్వం వేద ప్రసూర్లక్ష్మీః కిం సురూపా సరస్వతీ ।
ఏతాసు మధ్యే కా వా త్వం నాహం తర్కి తుముత్సహే॥

నీవు ఎవరి కులములో జన్మించితివో చెప్పుము. నీ తండ్రి ఎవరు? నీకున్న జీవనాధారమేమి? నీరూపము మహా సౌభాగ్యవంతమై యున్నది. తపస్సుపై నీకు గల ప్రేమ వ్యర్థము (13). నీవు వేదమాతవా? లక్ష్మివా? లేక, సుందర రూపిణి యగు సరస్వతివా? వీరిలో నీ వెవ్వరివి అను విషయమును ఊహించుట నాకు శక్యము కాదు (14).

పార్వత్యువాచ ।

నాహం వేదప్రసూర్విప్ర న లక్ష్మీశ్చ సరస్వతీ ।
అహం హిమాచల సుతా సాంప్రతం నామ పార్వతీ ॥
పురా దక్షసుతా జాతా సతీ నామాన్య జన్మని ।
యోగేన త్యక్త దేహోఽహం యత్పి త్రా నిందితః పతిః ॥
అత్ర జన్మని సంప్రాప్తి శ్శివోఽ పి విధివైభవాత్ ।
మాం త్యక్త్వా భస్మ సాత్కృత్య మన్మథం స జగామ హ ॥
ప్రయాతే శంకరే తాపో ద్విజితాహం పితుర్గృహాత్ ।
ఆగతా తపసే విప్ర సుదృఢా స్వర్నదీ తటే ॥

పార్వతి ఇట్లు పలికెను -

నేను వేదమాతను గాను, లక్ష్మిని గాను, సరస్వతిని కూడ గాను. నేను ఈ జన్మలో హిమవంతుని కుమార్తెను. నా పేరు పార్వతి (15). పూర్వ జన్మలో నేను సతియను పేర దక్షుని కుమార్తెనై జన్మించితిని. నా భర్తను నా తండ్రి నిందించుటచే, నేను యోగ మార్గములో దేహమును త్యజించితిని (16). ఈ జన్మలో శివుడు లభించినాడు. కాని విధివిలాసముచే ఆయన మన్మథుని దహించి నన్ను వీడి వెళ్లినాడు (17). శంకరుడు వెళ్లిన తరువాత నేను దుఃఖముచే పీడింపబడిన దాననై తండ్రిగారి గృహమును విడిచి పెట్టితిని. హే విప్రా! గంగానదీ తీరమునందు తపస్సు చేయవలననే దృఢనిశ్చయముతో వచ్చి యుంటిని (18).

కృత్వా తపః కఠోరం చ సుచిరం ప్రాణవల్లభమ్ ।
న ప్రాప్యా గ్నౌ వివిక్షంతీ త్వాం దృష్ట్వా సంస్థితా క్షణమ్ ॥
గచ్ఛ త్వం ప్రవిశామ్య గ్నౌ శివేనాంగీ కృతా నహి ।
యత్ర తత్ర తనుర్లప్స్యే వరిష్యామి శివం వరమ్ ॥

నేను చిరకాలము కఠినమగు తపస్సును చేసియూ ప్రాణ ప్రియుని పొందజాలక, అగ్నిలో ప్రవేశించ గోరి, నిన్ను చూచి కొద్దిసేపు ఆగితిని (19). నీవు వెళ్లుము. నేను అగ్నిలో ప్రవేశించెదను. ఏలయన, శివుడు నన్ను స్వీకరించలేదు. నేను ఎక్కడ జన్మించిననూ శివుని భర్తగా వరించెదను (20).

బ్రహ్మో వాచ ।

ఇత్యుక్త్వా పార్వతీ వహ్నౌ తత్పురః ప్రవివేశ సా ।
నిషిధ్యమానా పురతో బ్రాహ్మణేన పునః పునః ॥
వహ్నౌ ప్రవేశం కుర్వంత్యాః పార్వత్యాస్త్ర త్ప్రభావతః ।
బభూవ తత్ క్షణం వహ్నిః స్సద్యశ్చందన పంకవత్ ॥
క్షణం తదంతరే స్థిత్వా హ్యుత్పతంతీం దివం ద్విజః ।
పునః పప్రచ్ఛ సహసా విహసన్ సుతనుం శివః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు పలికి ఆ పార్వతి ఆయన యెదుట అగ్నిలో ప్రవేశించెను. ఆ బ్రాహ్మణుడు వద్దు వద్దని ఎన్నిసార్లు వారించిననూ ఆమె లెక్క చేయలేదు. (2 1). ఆయన మహిమచే, అగ్నిలో ప్రవేశించిన పార్వతికి అగ్ని వెనువెంటనే గంధపు ముద్దవలె ఆయెను (22). క్షణకాలము అగ్నియందుండి ఆకసము పైకి వచ్చుచున్న సుందరియగు పార్వతిని చూచి శివుడు చిరునవ్వుతో వెంటనే ఇట్లు ప్రశ్నించెను (23).

ద్విజ ఉవాచః

అహో తపస్తే కిం భద్రేన బుద్ధం కించిదేవ హి ।
న దగ్ధో వహ్నినా దేహో న చ ప్రాప్తం మనీషితమ్ ॥
అతస్సత్యం నికామం వై వద దేవి మనోరథమ్ ।
మమాగ్రే విప్రవర్యస్య సర్వానంద ప్రదస్య హి ॥
యథావిధి త్వయా దేవి కీర్త్యతాం సర్వథాత్మనా ।
తస్మాన్ మైత్రీ చ సంజాతా కార్యం గోప్యం త్వయా న హి ॥
కిమిచ్ఛసి వరం దేవి ప్రష్టుమిచ్ఛామ్యతః పరమ్ ।
త్వయ్యేవ తదసౌ దేవి ఫలం సర్వం ప్రదృశ్యతే ॥

ఆ బ్రాహ్మణుడిట్లు పలికెను -

ఓ మంగళ స్వరూపురాలా! నీవు చేయు తపస్సు పరమాశ్చర్యము. నాకేమియూ తెలియకున్నది. అగ్నిలో ప్రవేశించిననూ నీకేమియు తెలియలేదు. నీ దేహమును అగ్ని దహించలేదు. నీ కోరిక నెరవేరలేదు (24). కావున, సర్వులకు ఆనందమునిచ్చే బ్రాహ్మణ శ్రేష్ఠుడనగు నా యెదుట నీ మనస్సులోని కోరికను యథాతథముగా చెప్పుము. ఓ దేవీ! (25) నీవు నన్ను యథావిధిగా ఆదరించితివి. నీ మనస్సులోని మాటను చెప్పుము. నీకు నాకు మధ్య స్నేహము ఏర్పడినది గాన, నీవు నీ కోరికను దాచిపెట్టకుము (26). ఓ దేవీ! నీకేమి వరము కావలెను? ఇంకనూ నిన్ను ప్రశ్నించవలయుననే కోరిక గలదు. ఓ దేవీ! నీ తపస్సు యొక్క ఫలమంతయూ నీ యందే గానవచ్చుచున్నది (27).

పరార్థే చ తపశ్చే ద్వై తిష్ఠేత్తు తప ఏవ తత్ ।
రత్నం హస్తే సమాదాయ హిత్వా కాచస్తు సంచితః ॥
ఈ దృశం తవ సౌందర్యం కథం వ్యర్థీకృతం త్వయా ।
హిత్వా వస్త్రాణ్యనే కాని చర్మాది చ ధృతం త్వయా ॥
తత్సర్వం కారణం బ్రూహి తపసస్త్వస్య సత్యతః ।
తచ్ఛ్రుత్వా విప్రవర్యోఽహం యథా హర్ష మవాప్నుయామ్ ॥

పరలోకము కొరకై తపస్సును చేయుచున్నావా? అట్లైనచో, ఆ తపస్సును దూరముగా నుంచుము. చేతిలోనికి వచ్చిన రత్నమును వీడి గాజు ముక్కను పట్టుకున్నట్లే యగును (28). నీవు ఇట్టి నీ సౌందర్యమును వ్యర్థము చేయుటకు కారణమేమి? అనేక వస్త్రములను విడనాడి నీవు చర్మము మొదలగు వాటిని ధరించుచున్నావు (29). కావున నీవు ఈ తపస్సునకు గల యథార్థ కారణమును పూర్తిగా వివరించి చెప్పుము. బ్రాహ్మణ శ్రేష్ఠుడనగు నేను ఆ వివరములను విని ఆనందించెదను (30).

బ్రహ్మోవాచ ।

ఇతి పృష్టా తదా తేన సఖీం ప్రైరయతాం జికా ।
తన్ముఖే నైవ తత్సర్వం కథయామాస సువ్రతా ॥
తయా చ ప్రేరితా తత్ర పార్వత్యా విజయాభిధా ।
ప్రాణ ప్రియా సువ్రతజ్ఞా సఖీ జటిల మబ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆయన ఇట్లు ప్రశ్నించగా, అపుడా దృఢవ్రతయగు పార్వతి చెలికత్తెను ప్రేరేపించి, ఆమె ద్వారా వృత్తాంతమునంతను చెప్పించెను (31). ఆ పార్వతిచే ప్రేరేపింపబడినదై, ఆమెకు ప్రాణ ప్రియురాలు, వ్రతము గురించి చక్కని జ్ఞానము గలది, విజయ అను పేరు గలది అగు చెలికత్తె ఆ బ్రహ్మచారితో నిట్లనెను (32).

సఖ్యువాచ।

శృణు సాధో ప్రవక్ష్యామి పార్వతీ చరితం పరమ్ ।
హేతుం చ తపస స్సర్వం యది త్వం శ్రోతుమిచ్ఛసి ॥
సఖీ మే గిరిరాజస్య సుతేయం హిమభూ భృతః ।
ఖ్యాతా వై పార్వతీ నామ్నా సా కాలీతి చ మేనకా ॥
ఊఢేయం న చ కేనాపి న వాంఛతి శివాత్పరమ్ ।
త్రీణి వర్ష సహస్రాణి తపశ్చరణ సాధినీ ॥
తదర్థం మోఽనయా సఖ్యా ప్రారబ్ధం తప ఈ దృశమ్ ।
తదత్ర కారణం వక్ష్యే శృణు సాధో ద్విజోత్తమ ॥

చెలికత్తె ఇట్లనెను -

ఓ సాధూ! శ్రేష్ఠమగు పార్వతీ చరిత్రను, ఆమె తపస్సునకు గల కారణమును సర్వమును, నీవు వినగోరుచున్నచో, చెప్పెదను. వినుము (33). ఈ నా చెలికత్తె పర్వతరాజగు హిమవంతునికి మేనకయందు జన్మించినది. ఈమెకు పార్వతి, కాలి అనుపేర్లు ప్రసిద్ధముగా నున్నవి (34). ఈమెకు ఇంకనూ వివాహము కాలేదు. ఈమె శివుని తక్క మరియొకనిని కోరుట లేదు. ఈమె మూడువేల సంవత్సరముల నుండి తపస్సును చేయుచున్నది (35). ఈ నా చెలికత్తె శివుని కొరకు ఇట్టి తపస్సును ఆరంభించినది. హే సాధో! బ్రాహ్మణ శ్రేష్ఠా! దానికి గల కారణమును చెప్పెదను. వినుము (36).

హిత్వేంద్ర, ప్రముఖాన్ దేవాన్ హరిం బ్రహ్మాణమేవ చ ।

పతిం పినాకపాణిం వై ప్రాప్తుమిచ్ఛతి పార్వతీ ॥

ఇయం సఖీ మదీయా వై వృక్షానారోపయత్పురా ।

తేషు సర్వేషు సంజాతం ఫల పుష్పాదికం ద్విజ ॥

రూపసార్థాయ జనక కులాలం కరణాయ చ ।

సముద్దిశ్య మహేశానం కామస్యాను గ్రహాయ చ ॥

మత్సఖి నారదోప దేశాత్తపస్తపతి దారుణమ్ ।

మనోరథః కుతస్తస్యా న ఫలిష్యతి తాపస ॥

ఇంద్రాది దేవతలను, విష్ణువును, బ్రహ్మను కూడా విడిచి పార్వతి పినాక పాణియగు శివుని భర్తగా పొందగోరుచున్నది (37). ఈ నా చెలికత్తె పూర్వము వృక్షములను నాటెను. ఓ బ్రాహ్మణుడా! అవి అన్నీ పూవులు పూచి కాయలు కాచినవి (38). తన రూపమును సార్థకము చేయుట కొరకు, తండ్రి వంశమును భూషితము చేయుట కొరకు, మన్మథుని అనుగ్రహించుట కొరకు, నా చెలికత్తె మహేశ్వరుని ఉద్దేశించి (39), నారదుని ఉపదేశముచే మిక్కిలి తీవ్రమగు తపస్సును చేయుచున్నది. ఓ తపశ్శాలీ! ఆమె కోరిక ఎందువలన నెరవేరదు? (40)

యత్తే పృష్టం ద్విజ శ్రేష్ఠ మత్సఖ్యా మనసీప్సితమ్ ।

మయా ఖ్యాతం చ తత్ప్రీత్యా కిమన్య చ్ఛ్రోతుమిచ్ఛసి ॥

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానమును చెప్పితిని. నా చెలియొక్క మనోరథమును ప్రీతితో వివరించితిని. నీవు ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? (41)

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా విజయాయా యథార్థతః ।
మునే స జటిలో రుద్రో విహసన్వాక్య మబ్రవీత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! విజయ యొక్క ఆ యథార్థ వచనములను విని, బ్రహ్మచారి రూపములో నున్న ఆ రుద్రుడు నవ్వి ఇట్లనెను (42).

జటిల ఉవాచః

సఖ్యేదం కథితం తత్ర పరిహాసోఽను మీయతే ।
యథార్థం చేత్తదా దేవీ స్వముఖే నాభి భాషతామ్ ॥

బ్రహ్మచారి ఇట్లు పలికెను -

ఈ చెలికత్తె చెప్పిన మాటలో పరిహాసము ఉన్నట్లు తోచుచున్నది. ఈ వచనము యథార్థమైనచో, ఈ దేవి తననోటితో ఆ మాటను చెప్పు గాక! (43)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తే చ తదా తేన జటిలేన ద్విజన్మనా ।
ఉవాచ పార్వతీ దేవీ స్వముఖేనైవ తం ద్విజమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివాజటిల సంవాదో నామ షడ్వింశోఽధ్యాయః (26).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ బ్రాహ్మణ బ్రహ్మచారి ఇట్లు పలుకగా, అపుడు పార్వతీదేవి తన నోటితో ఆ బ్రాహ్మణునితో నిట్లనెను (44).

శ్రీ శివ మహాపురాణములో రుద్రసంహిత యందతి పార్వతీ ఖండలో శివాజటిల సంవాదమనే ఇరువది ఆరవ అధ్యాయము ముగిసినది (44).

27 - బ్రహ్మచారి శివుని నిందించుట

పార్వత్యువాచ ।

శృణు ద్విజేంద్ర జటిల మద్వృత్తం నిఖిలం ఖలు ।
సఖ్యుక్తం మేఽద్య యత్సత్యం తత్తథైవ న చాన్యథా ॥
మనసా వచసా సాక్షాత్కర్మణా పతి భావతః ।
సత్యం బ్రవీమి నోఽసత్యం వృతో వై శంకరో మయా ॥
జానామి దుర్లభం వస్తుం కథం ప్రాప్యం మయా భవేత్ ।
తథాపి మన ఔత్సుక్యాత్తప్య తేఽద్య తపో మయా ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! బ్రహ్మచారీ! నా వృత్తాంతము నంతనూ వినుము. నా సఖి ఇప్పుడు చెప్పిన వచనములు సత్యమే గాని మరియొకటి గాదు (1). నేను మనస్సుచే సత్యమును సంకల్పించి, వాక్కుచే సత్యమును పలికి, కర్మచే సత్యము ననుష్ఠించెదను. అసత్యము పలుకను. నేను శంకరుని భర్తగా వరించితిని (2). దుర్లభమగు వస్తువును నేను ఎట్లు పొందదగును? ఈ విషయమును నేను ఎరుంగుదును. అయిననూ మనస్సునందు ఉత్సాహముండుటచే నేనీనాడు తపస్సును చేయుచున్నాను (3).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా వచనం తస్మై స్థితా సా గిరిజా తదా ।
ఉవాచ బ్రాహ్మణస్తత్ర త చ్ఛృ త్వా పార్వతీవచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడా పార్వతి ఆ బ్రహ్మచారితో నిట్లు పలికి మిన్నకుండెను. పార్వతి యొక్క ఆ మాటలను విని ఆ బ్రాహ్మణుడిట్లు పలికెను (4).

బ్రాహ్మణ ఉవాచః

ఏతావత్కాల పర్యంతం మమేచ్ఛా మహతీ హ్యా భూత్ ।
కిం వస్తు కాంక్షతీ దేవీ కురుతే సుమహత్త పః ॥
తద్ జ్ఞాత్వా నిఖిలం దేవి శ్రుత్వా త్వన్ముఖ పంకజాత్ ।
ఇతో గచ్ఛామ్యహం స్థానాద్యథేచ్ఛసి తథా కురు ॥
న కథ్యతే త్వయా మహ్యం మిత్రత్వం నిష్ఫలం భవేత్ ।
యథా కార్యం తథా భావి కథనీయం సుఖేన చ ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను -

ఈ దేవి ఏ వస్తువును .గోరి తీవ్రమగు తపస్సును చేయుచున్నదో తెలియవలెనని నాకు ఇంతకాలము నుండియు కోరిక గలదు. (5). ఓ దేవీ! ఇపుడా వృత్తాంతమునంతనూ నీ పద్మమువంటి ముఖమునుండి వినియుంటిని. ఇపుడీ స్థానమునుండి నేను వెళ్లిపోవుచున్నాను. నీకు తోచినట్లు చేయుము (6). నీవు నాకు చెప్పని, స్నేహభావము వ్యర్థమయ్యెడిది. నీవు ఎట్లు ప్రవర్తించెదవో, నీ భవిష్యత్తు అటులనే నిర్మాణమగును. నీకు దీనియందే సుఖము ఉన్నచో, చెప్పవలసినది ఏమియూలేదు (7).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా వచనం తస్య యావద్గంతు మియేష సః ।
తావచ్చ పార్వతీ దేవీ ప్రణమ్యోవాచ తం ద్విజమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఇట్లు పలికి ఆ బ్రహ్మచారి బయలుదేరుటకు సిద్ధపడుచుండెను. ఇంతలో పార్వతీదేవి ఆ బ్రాహ్మణునకు నమస్కరించి ఇట్లు పలికెను (8).

పార్వత్యువాచ ।

కిం గమిష్యసి విప్రేంద్ర స్థితో భవ హితం వద ।
ఇత్యుక్తే చ తయా తత్ర స్థిత్వోవాచ స దండధృక్ ॥

పార్వతి ఇట్లు పలికెను –

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! ఏల వెళ్లి పోవుచున్నావు? ఉండుము. నాకు హితమును బోధించుము. ఆమె ఇట్లు పలుకగా దండమును ధరించి యున్న బ్రాహ్మణుడు నిలబడి ఇట్లు పలికెను (9).

ద్విజ ఉవాచః

యది శ్రోతుమనా దేవి మాం స్థాపయసి భక్తితః ।
వదామి తత్త్వం తత్సర్వం యేన తే వయునం భవేత్ ॥
జానామ్యహం మహాదేవం సర్వథా గురుధర్మతః ।
ప్రవదామి యథార్థం హి సావధానతయా శృణు ॥
వృషధ్వజో మహాదేవో భస్మదిగ్ధో జటాధరః ।
వ్యాఘ్రచర్మాంబరధర స్సంవీతో గజకృత్తినా ॥
కపాలధారీ సర్పౌఘైస్సర్వ గా త్రేషు వేష్టితః ।
విషదిగ్ధోఽ భక్ష్య భక్షో విరూపాక్షో విభీషణః ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను –

ఓ దేవీ! నేను వెళ్లకుండగా భక్తి పూర్వకముగా ఆపివేయుచున్నావు. నా మాటను వినగోరుచున్నావా? అట్లైనచో నీకు జ్ఞానమును కలిగించే సత్యమునంతనూ చెప్పెదను (10). నేను మహాదేవుని బాగుగా ఎరుంగుదును. నేను

నీకు గురువు యొక్క ధర్మము ననుసరించి, సత్యము చెప్పుచున్నాను. శ్రద్ధగా వినుము (11). మహాదేవుడు వృషభము ధ్వజమునందు గలవాడు, భస్మచే లిప్తమైన దేహము గలవాడు, జటలను ధరించువాడు, పెద్దపులి చర్మమును వస్త్రముగా ధరించువాడు, ఏనుగు చర్మము ఉత్తరీయముగా గలవాడు (12). ఆయన కపాలమును ధరించును. ఆయన శరీరమంతయూ పాములచే చుట్టబడి యుండును. ఆయన విషమును ధరించి యుండును. ఆయన తినకూడని పదార్థములను తినును. వికృతమగు కన్నులుగల ఆయనను చూచినచో భయము కలుగును

అవ్యక్త జన్మా సతతం గృహభోగ వివర్జితః ।
దిగంబరో దశభుజో భూత ప్రేతాన్వి తస్సదా ॥
కేన వా కారణేన త్వం తం భర్తారం సమీహసే ।
క్వ జ్ఞానం తే గతం దేవి తద్వదాద్య విచారతః ॥
పూర్వం శ్రుతం మయా చైవ వ్రతం తస్య భయంకరమ్ ।
శృణు తే నిగదామ్యద్య యది తే శ్రవణే రుచిః ॥
దక్షస్య దుహితా సాధ్వీ సతీ వృషభ వాహనమ్ ।
వ పతిం పురా దైవాత్తత్సంభోగః పరిశ్రుతః ॥

ఆయన పుట్టుక గురించి ఎవ్వరికీ తెలియదు. ఆయన ఏనాడూ గృహ సుఖములనెరుంగడు. ఆయన దిగంబరుడు. పది చేతులు గలవాడు. భూత ప్రేతములు సర్వదా ఆయనను చుట్టువారి యుండును (14). ఆయనను నీవు భర్తగా కోరుటకు కారణమేమి? ఓ దేవీ! నీ జ్ఞానము ఎచ్చటకు పోయినది? నాకీ విషయమును ఆలోచించి చెప్పుము (15). నేనాతని భయంకరమగు వ్రతమును గూర్చి పూర్వమే వినియుంటిని. నీకు కూడా వినుట యందు అభిరుచి యున్నచో, ఇప్పుడు చెప్పెదను. వినుము (16). దక్షపుత్రి, పతివ్రత యగు సతి వృషభము వాహనముగా గల ఆ శివుని పూర్వము దైవవశముచే భర్తగా పొందెను. ఆమె పొందిన భోగము అందరికీ తెలిసినదే (17).

కపాలి జాయేతి సతీ దక్షేణ పరివర్జితా ।
యజ్ఞే భాగప్రదానాయ శంభుశ్చాపి వివర్జితః ॥
సా తత్రైవాప మానేన భృశం కోపాకులా సతీ ।
తత్యాజాసూన్ ప్రియాంస్తత్ర తయా త్యక్తశ్చ శంకరః ॥
త్వం స్త్రీ రత్నం తవ పితా రాజా నిఖిల భూభృతామ్ ।
తథావిధం పతిం కస్మాదు గ్రేణ తపసేహసే ॥
దత్త్వా సువర్ణ ముద్రాంచ గ్రహీతుం కాచమిచ్ఛసి ।
హిత్వా చ చందనం శుభ్రం కర్దమం లేప్తుమిచ్ఛసి ॥

సతీదేవి కపాలమును ధరించువాని భార్యయను కారణముచే దక్షుడామెను(ను) తిరస్కరించినాడు. మరియు యజ్ఞములో భాగము ఈయబడే దేవతలలో శంభుని జేర్చలేదు (18). ఆ అవమానముచే మిక్కిలి కోపమును,

దుఃఖమును పొందిన సతీదేవి శంకరుని విడిచిపెట్టి, ప్రియమగు ప్రాణములను కూడ త్యజించెను (19). నీవు స్త్రీలలో గొప్పదానవు. నీ తండ్రి పర్వతములన్నింటికీ రాజు. నీవు ఉగ్రమగు తపస్సును అట్టి భర్తను పొందవలెననే కోరికతో ఏల చేయుచున్నావు? (20) బంగరు నాణెమునిచ్చి నీవు గాజు ముక్కను పొందగోరుచున్నావు. నీవు స్వచ్ఛమగు చందనమును త్రోసిపుచ్చి బురదను శరీరముపై లేపము చేయగోరుచున్నావు (21).

సూర్యతేజః పరిత్యజ్య ఖద్యోతద్యుతిమిచ్ఛసి ।
చీనాంశుకం విహాయైవ చర్మాంబర మిహేచ్ఛసి ॥
గృహవాసం పరిత్యజ్య వనవాసం సమీహసే ।
లోహమిచ్ఛసి దేవేశి త్యక్త్వా శేవధి ముత్తమమ్ ॥
ఇంద్రాది లో కపాలాంశ్చ హిత్వా శివమను వ్రతా ।
నైతత్సూక్తం హి లోకేషు విరుద్ధం దృశ్య తేఽ ధునా ॥
క్వ త్వం కమల పత్రాక్షీ క్వాసౌ వై త్రివిలోచనః ।
శశాంకవదనా త్వం చ పంచవక్త్ర శ్శివస్స్మృతః ॥

నీవు సూర్యతేజస్సును విడిచిపెట్టి మిణుగురు పురుగుల కాంతిని గోరుచున్నావు. పట్టు వస్త్రములను వీడి చర్మవస్త్రమును గోరుచున్నావు(22). నీవు గృహమునందు నివాసమును విడిచిపెట్టి వనమునందు నివసించ గోరుచున్నావు. ఓ దేవదేవీ! నీవు ఉత్తమమగు నిధిని విడిచిపెట్టి ఇనుపముక్కను కోరుచున్నావు (23). నీవు ఇంద్రుడు మొదలగు లోకపాలురను విడిచిపెట్టి శివుని గురించి వ్రతమునను ష్ఠించుచున్నావు. లోకులు ఈ చర్యను మంచిగా చెప్పుకొనరు. నీ చర్య విడ్డూరముగా కన్పట్టుచున్నది (24). పద్మ పత్రముల వంటి కన్నులు గల నీ వెక్కడ? ఆ ముక్కంటి యెక్కడ? చంద్రుని వలె ఆహ్లాదకరమగు ముఖముగల నీవెక్కడ? ఆ అయిదు ముఖముల శివుడెక్కడ? (25)

వేణీ శిరసి తే దివ్యా సర్పిణీవ విభాసితా ।
జటాజూటం శివస్యైవ ప్రసిద్ధం పరిచక్షతే ॥
చందనం చ త్వదీయాంగే చితా భస్మ శివస్య చ ।
క్వ దుకూలం త్వదీయం వై శాంకరం క్వ గజాజినమ్ ॥
భూషణాని చ దివ్యాని క్వ సర్పాశ్శంకరస్య చ ।
క్వ చరా దేవతాస్సర్వాః క్వ చ భూతబలి ప్రియః ॥
క్వ వా మృదంగవా దశ్చ క్వ చ తడ్డమరుస్తథా ।
క్వ చ భేరీకలాపశ్చ క్వ చ శృంగరవోఽశుభః ॥

నీ శిరస్సుపై జడ దివ్య సర్పమువలె భాసించుచున్నది. శివుని జటాజూటము లోకములో చాల ప్రసిద్ధి చెందినట్లున్నది (26). నీ శరీరమునందు చందనము ఉండగా, శివుని శరీరముపై చితా భస్మ ఉండును. నీ పట్టు చీర యెక్కడ? శంకరుని గజచర్మము ఎక్కడ? (27) నీ దివ్యములగు అలంకారములెక్కడ? శంకరుని సర్పములెక్కడ? నిన్ను సేవించుటకు ఉత్సాహపడే

అందరు దేవతలెక్కడ? భూతములకు ఇచ్చు ఆహారమును ఇష్టపడే శివుడెక్కడ? (28) మృదంగ ధ్వని ఎక్కడ? ఆ శివుని డమరుకము యొక్క శబ్దము ఎక్కడ? భేరీ ధ్వనులు ఎక్కడ? అశుభమగు కొమ్ము బూరాల ధ్వని యెక్కడ? (29)

క్వ చ ఢక్కా మయశ్శబ్దో గలనాదః క్వ చాశుభః ।
భవత్యాశ్చ శివస్యైవ న యుక్తం రూపముత్తమమ్ ॥
యది ద్రవ్యం భవేత్తస్య కథం స్యాత్స దిగంబరః ।
వాహనం చ బలీవర్ద స్సామగ్రీ కాపి తస్య న ॥
వరేషు యే గుణాః ప్రోక్తా నారీణాం సుఖదాయకాః ।
తన్మధ్యే హి విరూపాక్షే ఏకోపి న గుణస్స్మృతః ॥
తవాపి కామో దయితో దగ్ధస్తేన హరేణ చ ।
అనాదరస్తదా దృష్టో హిత్వా త్వామన్యతో గతః ॥

ఢక్కా శబ్దమెక్కడ? గలమనే వాద్యము యొక్క అమంగళ ధ్వని ఎక్కడ? నీ ఉత్తమమగు సౌందర్యము శివునకు అర్హమైనది కానే కాదు (30). ఆయన వద్ద ధనమున్నచో దిగంబరుడై ఉండనేల? ఎద్దు ఆయనకు వాహనము. ఆయన వద్ద సామగ్రి ఏమియూ లేదు (31), వరులయందలి ఏయే గుణములు స్త్రీలకు సుఖమునిచ్చునవి చెప్పబడినవో, వాటిలో ఒక్క గుణమైననూ ఆ ముక్కంటి యందు లేదు (32). నీకు ఆప్తుడగు మన్మథుని ఆ హరుడు దహించివేసినాడు. మరియు ఆయన చూపిన అనాదరమును నీవు ఎరుగుదువు. ఆయన నిన్ను విడచి ఎక్కడికో వెళ్లినాడు (33).

జాతిర్న దృశ్యతే తస్య విద్యా జ్ఞానం తథైవ చ ।
సహాయాశ్చ పిశాచా హి విషం కంఠే హి దృశ్యతే ॥
ఏకాకీ చ సదా నిత్యం విరాగీ చ విశేషతః ।
తస్మాత్త్వం హి హరే నైవ మనో యోక్తుం తు చార్హసి ॥
క్వ చ హారస్త్వదీయో వై క్వ చ తన్ముండమాలికా ।
అంగరాగః క్వ తే దివ్యః చితా భస్మ క్వ తత్తనౌ ॥
సర్వం విరుద్ధం రూపాది తవ దేవి హరస్య చ ।
మహ్యం న రోచతే హ్యేతద్య దిచ్ఛసి తథా కురు ॥
అసద్వస్తు చ యత్కించిత్ తత్సర్వం స్వయమీహసే ।
నివర్తయ మనస్తస్మాన్నో చేదిచ్ఛసి తత్కురు ॥

ఆయనకు జాతిగాని, విద్యగాని, జ్ఞానముగాని ఉన్నట్లు కానరాదు. ఆయనకు పిశాచములు తోడు. కంఠములో విషము స్పష్టముగా కనబడుచుండును (34). ఆయన సర్వదా ఒంటరిగా నుండును. ఆయన నిత్యవైరాగ్యము దృఢముగా గలవాడు. కావున నీవు శివుని మనస్సులో కోరుకొనుట ఎంతయూ తగని విషయము (35). నీ హారమెక్కడ? ఆయన యొక్క నరకపాలముల మాల యెక్కడ ? నీ దివ్యమగు శరీరలేపనమెక్కడ? ఆయన శరీరమునందలి చితా భస్మము ఎక్కడ? (36) ఓ దేవీ! నీకు, శివునకు రూపము మొదలగు వాటి యందు సర్వము నందు విరోధము గలదు. కావున, నాకీ వివాహము నచ్చుబాటు అగుటలేదు. నీకు తోచినట్లు చేయుము (37). నీవు ఈ సృష్టిలోని చెడువస్తువుల నన్నిటినీ పొందగోరుచున్నావు. మనస్సును శివుని నుండి మళ్ళించుము. లేనిచో, నీకు తోచినట్లు చేసుకొనుము (38).

బ్రహ్మోవాచ।

ఇత్యేవం వచనం శ్రుత్వా తస్య విప్రస్య పార్వతీ ।
ఉవాచ క్రుద్ధమనసా శివనిందాపరం ద్విజమ్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే బ్రహ్మచారి ప్రతారణ వాక్య వర్ణనం నామ సప్తవింశోఽ ధ్యాయః (39).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ బ్రాహ్మణుని ఈ మాటలను విని మనస్సులో క్రోధమును పొందిన పార్వతి శివుని నిందించుటలో ఉత్సాహముగల ఆ బ్రాహ్మణునితో నిట్లనెను (39).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో బ్రహ్మచారి మోసపు మాటలను వర్ణించే ఇరువది ఏడవ అధ్యాయము ముగిసినది (27).

28 – శివుని సాక్షాత్కారము

పార్వత్యువాచ ।

ఏతావద్ధి మయా జ్ఞాతం కశ్చిదన్యోఽన్యమాగతః ।
ఇదానీం సకలం జ్ఞాతమవధ్యస్త్వం విశేషతః ॥
త్వయోక్తం విదితం దేవ తదలీకం న చాన్యథా ।
యది త్వయోదితం స్యాద్వై విరుద్ధం నోచ్యతే త్వయా ॥
కదాచిద్దృశ్యతే తాదృక్ వేషధారీ మహేశ్వరః ।
స్వలీలయా పరబ్రహ్మ స్వరాగోపాత్త విగ్రహః ॥
బ్రహ్మచారి స్వరూపేణ ప్రతారయితు ముద్యతః ।
ఆగతశ్ఛల సంయుక్తం వచోవాదీః కుయుక్తితః ॥

పార్వతి ఇట్లు పలికెను –

ఎవరో ఒక మహాత్ముడు వచ్చినాడని మాత్రమే నేను తలంచితిని. ఇపుడు విషయమంతయూ తెలిసినది. పైగా నీవు పవిత్రమగు బ్రాహ్మణుడవు (1). ఓ దేవా! నీవు చెప్పినది నాకు తెలిసినది. అది అసత్యమే గాని సత్యము కాదు. సర్వము తెలియునని నీవు చెప్పిన మాట సత్యమే అయినచో, నీవు ఇట్లు విరుద్ధముగా మాటలాడియుండవు (2). పరబ్రహ్మ, తన ఇచ్ఛచే స్వీకరింపబడిన దేహము గలవాడునగు మహేశ్వరుడు అప్పుడప్పుడు తన లీలచే అట్టి వేషమును ధరించి కొనవచ్చును (3). నీవు బ్రహ్మచారి వేషముతో మోసగించుటకు వచ్చి కుయుక్తులు పన్ని మోసపూరితములగు మాటలను పలికితివి (4).

శంకరస్య స్వరూపం తు జానామి సువిశేషతః ।
శివతత్త్వమతో వచ్మి సువిచార్య యథార్థతః ॥
వస్తుతో నిర్గుణో బ్రహ్మ సగుణః కారణేన సః ।
కుతో జాతిర్భవేత్తస్య నిర్గుణస్య గుణాత్మనః ॥
స సర్వాసాం హి విద్యానామధిష్ఠానం సదాశివః ।
కిం తస్య విద్యయా కార్యం పూర్ణస్య పరమాత్మనః ॥
వేదా ఉచ్ఛ్వాసరూపేణ పురా దత్తాశ్చ విష్ణవే ।
శంభునా తేన కల్పాదౌ తత్సమః కోఽస్తి సుప్రభుః ॥

నేను శంకరుని స్వరూపమును ప్రత్యేకించి ఎరుంగుదును. శివతత్త్వము నెరుంగుదును. కావున నా యోగ్యతకను గుణముగా బాగుగా విమర్శించి చెప్పుచున్నాను (5). శివుడు స్వరూప దృష్ట్యా నిర్గుణ బ్రహ్మ. కాని కారణమగు ప్రకృతితో గూడి సగుణుడైనాడు. నిర్గుణుడు, గుణ స్వరూపుడునగు ఆయనకు జాతి ఎట్లుండును? (6) ఆ సదాశివుడు విద్యలన్నింటికీ నిధానము. పూర్ణ పరమాత్ముడగు ఆ శివునకు విద్యతో పనియేమి? (7) ఆ శంభుడు కల్ప ప్రారంభములో వేదములను ఉచ్ఛ్వాస రూపముగా పూర్వము విష్ణువునకు ఇచ్చెను. ఆయనతో సమమగు గొప్ప ప్రభువు మరియొకడు లేడు (8).

సర్వేషామాది భూతస్య వయోమానం కుతస్తతః ।

ప్రకృతిస్తు తతో జాతా కిం శక్తేస్తస్య కారణమ్ ॥

యే భజంతి చ తం ప్రీత్యా శక్తీశం శంకరం సదా ।

తస్మై శక్తిత్రయం శంభుస్స దదాతి సదావ్యయమ్ ॥

తస్యైవ భజనాజ్జీవో మృత్యుం జయతి నిర్భయః ।

తస్మాన్మృత్యుంజయనామ ప్రసిద్ధం భువనత్రయే ॥

తస్యైవ పక్ష పాతేన విష్ణుర్విష్ణుత్వ మాప్నుయాత్ ।

బ్రహ్మత్వం చ యథా బ్రహ్మ దేవా దేవత్వమేవ చ ॥

సర్వప్రాణులకు ఆదియందున్న సద్గునుడగు పరమేశ్వరునకు వయస్సు యొక్క లెక్క ఎక్కడిది? ప్రకృతి ఆయన నుండి పుట్టినది. ఆయన యొక్క శక్తికి కారణమేమి ఉండును? (9) శక్తికి ప్రభువు, అవ్యయుడు అగు ఆ శంకరుని ఎవడైతే సర్వదా ప్రేమతో సేవించునో, అట్టివానికి ఆ శంభుడు ఇచ్ఛాశక్తి క్రియాశక్తి జ్ఞానశక్తులను ఇచ్చును (10). శివుని భజించిన మానవుడు భయము లేనివాడై మృత్యువును జయించును. అందువలననే ముల్లోకములలో మృత్యుంజయుడు అను పేరు ప్రసిద్ధి గాంచినది (11). ఆయన అనుగ్రహముచేతనే విష్ణువు విష్ణుత్వమును, బ్రహ్మ బ్రహ్మత్వమును మరియు దేవతలు దేవత్వమును పొందియున్నారు (12).

దర్శనార్థం శివస్యాదౌ యథా గచ్ఛతి దేవరాట్ ।

భూతాదయస్తత్పరస్య ద్వార పాలాశ్శివస్య తు ॥

దండైశ్చ మకుటం విద్ధం మృష్టం భవతి సర్వతః ।

కిం తస్య బహుపక్షేణ స్వయమేవ మహా ప్రభుః ॥

కల్యాణ రూపిణస్తస్య సేవయేహ న కిం భవేత్ ।

కిం న్యూనం తస్య దేవస్య మామిచ్ఛతి సదాశివః ॥

సప్త జన్మదరిద్రస్స్యా త్సేవేన్నో యది శంకరమ్ ।

తస్యైతత్సే వనాల్లో కో లక్ష్మీ స్స్యాదనపాయినీ ॥

శివుని దర్శనము కొరకు దేవరాజగు ఇంద్రుడు ముందుగా వెళ్లును. ఆత్మధ్యాన పరుడగు శివుని ద్వారమును భూతములు, గణములు మొదలగు వారు కాపలా కాయుచుందురు (13). వారు బెత్తములతో ఇంద్రుని కిరీటముపై మోదుచుందురు. మరియు ఇంద్రుడు తొక్కిసలాటలో నలిగిపోవుచుండును. ఆయన పక్షమును స్వీకరించి అనేక వచనములను చెప్ప బని లేదు. ఆయన తనంత తానుగా మహా ప్రభువై ఉన్నాడు (14). మంగళ రూపుడగు ఆయనను సేవించినచో ఇహలోకములో లభించనిది యేది? ఆ దేవునకు లోటు యేమి గలదు? ఆ సదాశివుడు నన్ను ఏల గోరును? (15) శంకరుని సేవించని మానవుడు ఏడు జన్మలలో దరిద్రుడగును. ఆయనను సేవించు మానవుడు తొలగిపోని సంపదలను పొందును (16).

యదగ్రే సిద్ధయోఽష్టౌ చ నిత్యం నృత్యంతి తోషితుమ్ ।

అవాఙ్ముఖాస్సదా తత్ర తద్ధితం దుర్లభం కుతః ॥

యద్యస్య మంగలానీహ సేవతే శంకరస్య న ।

యథాపి మంగలం తస్య స్మరణాదేవ జాయతే ॥

యస్య పూజా ప్రభావేణ కామాస్సిధ్యంతి సర్వశః ।

కుతో వికారస్తస్యాస్తి నిర్వికారస్య సర్వదా ॥

శివేతి మంగళం నామ ముఖే యస్య నిరంతరమ్ ।

తస్యైవ దర్శనాదన్యే పవిత్రాస్సంతి సర్వదా ॥

అష్టసిద్ధులు ఎవనిని సంతోషపెట్టుటకై నిత్యము తలవంచుకొని ఎవని ఎదుట నాట్యము చేయునో, అట్టి ఈశ్వరుని వలన హితము కలుగకుండుట ఎట్లు పొసగును? (17) మంగళకరములగు వస్తువులు శంకరుని సేవను చేయకున్ననూ, ఆయనను స్మరించినంత మాత్రాన మంగళములు కలుగును (18). ఎవని పూజ చేసినచో ఆ ప్రభావముచే కోర్కెలన్నియూ సిద్ధించునో, అట్టి వికారరహితుడగు శివునకు ఏ కాలమునందైననూ వికారమెక్కడిది? (19) ఎవని నోట 'శివ' అను మంగళనామము నిరంతరముగా వెలువడునో, అట్టి వానిని దర్శించినంత మాత్రాన మానవులు పవిత్రులగుదురు (20).

యద్యపూతం భవేద్భస్మ చితాయాశ్చ త్వయోదితమ్ ।

నిత్యమస్యాంగగం దేవై శ్శిరో భిర్ధార్యతే కథమ్ ॥

యో దేవో జగతాం కర్తా భర్తా హర్తా గుణాన్వితః ।

నిర్గుణ శ్శివసంజ్ఞశ్చ స విజ్ఞేయః కథం భవేత్ ॥

అగుణం బ్రహ్మణో రూపం శివస్య పరమాత్మనః ।

తత్కథం హి విజానంతి త్వాదృశాస్తద్బ హిర్ముఖాః ॥

దురాచారాశ్చ పాపాశ్చ దేవేభ్యస్తే వినిర్గతాః ।

తత్త్వం తే నైవ జానంతి శివస్యా గుణరూపిణః ॥

నీవు చెప్పిన తీరున చితా భస్మ అపవిత్రమైనచో, ఆయన శరీరమునుండి జారిన భస్మను దేవతలు నిత్యము శిరస్సుపై ధరించుటకు కారణమేమి? (21) ఏ దేవుడు సగుణుడై జగత్తులను సృష్టించి పోషించి సంహరించునో, నిర్గుణస్వరూపుడై శివనామధేయమును కలిగియుండునో, అట్టి దేవుడు ఎట్లు తెలియబడును? (22) పరబ్రహ్మ పరమాత్మయగు శివుని నిర్గుణ స్వరూపమును నీ వంటి బహిర్ముఖులు ఎట్లు తెలియగల్గుదురు? (23) దురాచారపరులు, పాపప్రవృత్తి గలవారు, దేవతాగణమునుండి బహిష్కరింపబడినవారు నిర్గుణ స్వరూపుడగు శివుని తత్త్వమును ఎన్నటికీ తెలియజాలరు (24).

శివనిందాం కరోతీహ తత్త్వమజ్ఞాయ యః పుమాన్ ।

ఆ జన్మ సంచితం పుణ్యం భస్మీ భవతి తస్య తత్ ॥

త్వయా నిందా కృతా యాత్ర హరస్యామిత తేజసః ।

త్వత్పూజా చ కృతా యస్మే తస్మాత్పాపం భజామ్యహమ్ ॥

శివవిద్వేషిణం దృష్ట్వా సచైలం స్నానమాచరేత్ ।

శివవిద్వేషిణం దృష్ట్వా ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥

రే రే దుష్ట త్వయా చోక్తమహం జానామి శంకరమ్ ।

నిశ్చయేన న విజ్ఞాతశ్శివ ఏవ సనాతనః ॥

ఏ పురుషుడైతే తత్త్వము నెరుంగక శివుని నిందించునో, వానికి పూర్వజన్మల నుండియూ సంపాదించుకున్న పుణ్యము బూడిద యగును (25). మహాతేజస్వియగు శివుని నీవిచట నిందించితివి. అట్టి నిన్ను పూజించిన నాకు పాపము కలుగును (26), శివుని ద్వేషించువానిని చూచినచో కట్టుబట్టలతో స్నానము చేయవలెను (27). ఓరీ! దుష్టా! నాకు శంకరుడు ఎరుకయేనని నీవు చెప్పితివి. కాని సనాతనుడగు ఆ శివుడు నీచే నిశ్చయముగా తెలియబడలేదు (28).

యథా తథా భవేద్రుద్రో యథా వా బహురూపవాన్ ।

మమా భీష్టతమో నిత్యం నిర్వికారీ సతాం ప్రియః ॥

విష్ణుర్బ్రహ్మాపి న సమస్తస్య క్వాపి మహాత్మనః ।

కుతోఽన్యే నిర్జరాద్యాశ్చ కాలాధీనాస్సదైవ తమ్ ॥

ఇతి బుద్ధ్వా సమాలోక్య స్వయా సత్యా సుతత్త్వతః ।

శివార్థం వనమాగత్య కరోమి విపులం తపః ॥

స ఏవ పరమేశానస్సర్వేశో భక్తవత్సలః ।

సంప్రాప్తుం మేఽభిలాషో హి దీనాను గ్రహకారకమ్ ॥

రుద్రుడు ఎట్లైనా ఉండుగాక! ఆయన వివిధ రూపములను ధరించుగాక! వికారరహితుడు, సత్పురుషులకు ప్రియుడునగు రుద్రుడు నాకు ఎల్లవేళలా మిక్కిలి ప్రియమైనవాడు (29), విష్ణువు, బ్రహ్మ కూడ ఏకాలమునందైననూ ఆ మహాత్మునితో సరిదూగరు. కాలాధీనులగు ఇతర దేవతల గురించి చెప్పనదేమున్నది? (30) ఈ సత్యమును సద్బుద్ధితో విచారించి తెలుసుకొని నేను శివుని పొందుటకొరకై అడవికి వచ్చి విస్తారమగు తపస్సును చేయుచున్నాను (31). ఆయనయే పరమేశ్వరుడు, సర్వేశ్వరుడు, భక్తవత్సలుడు. దీనులను అనుగ్రహించే ఆయనను పొందవలెననే అభిలాష నాకు గలదు (32).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా గిరిజా సాహి గిరీశ్వరసుతా మునే ।
విరరామ శివం దధ్యౌ నిర్వికారేణ చేతసా ॥
తదాకర్ణ్య వచో దేవ్యా బ్రహ్మచారీ స వై ద్విజః ।
పునర్వచన మాఖ్యాతుం యావదేవ ప్రచక్రమే ॥
ఉవాచ గిరిజా తావత్స్వ సఖీం విజయాం ద్రుతమ్ ।
శివశక్త మనోవృత్తి శ్శివనిందా పరాఙ్ముఖీ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ పర్వత రాజపుత్రిక ఇట్లు పలికి మిన్నకుండి, వికారములేని మనస్సుతో శివుని ధ్యానించెను (33). దేవి యొక్క ఆ మాటలను విని ఆ బ్రాహ్మణ బ్రహ్మచారి మరల ఏదో చెప్పుటకు సిద్ధపడెను (3 4). కాని ఇంతలో, శివుని యందు లగ్నమైన మనోవృత్తులు గలది, శివనిందను సహింపలేనిది అగు పార్వతి వెంటనే తన చెలికత్తెయగు విజయతో నిట్లనెను (35).

గిరిజోవాచ ।

వారణీయః ప్రయత్నేన సఖ్యయం హి ద్విజాధమః ।
పునర్వక్తు మనాశ్చైవ శివనిందాం కరిష్యతి ॥
న కేవలం భవేత్పాపం నిందాం కర్తుశ్శివస్య హి ।
యో వై శృణోతి తన్నిందాం పాపభాక్ స భవేదిహ ॥
శివనిందాకరో వధ్య స్సర్వథా శివకింకరైః ।
బ్రాహ్మ శ్చైత్స వై త్యాజ్యో గంతవ్యం తత్ స్థలా ద్రుతమ్ ॥
అయం దుష్టః పునర్నిందాం కరిష్యతి శివస్య హి ।
బ్రాహ్మణత్వా దవధ్యశ్చే త్త్యా జ్యోఽ దృశ్యశ్చ సర్వథా ॥
హిత్వైతత్ స్థలమద్యైవ యాస్యామోఽ న్యత్ర మా చిరమ్ ।
యథా సంభాషణం న స్యాదనేనాఽ విదుషా పునః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ సఖీ! ఈ బ్రాహ్మణాధము డింకనూ ఏదో చెప్పగోరుచున్నాడు. మరల శివుని నిందించగలడు. కావున ఈతనిని ప్రయత్న పూర్వకముగనైననూ నిలుపు జేయవలెను (36) శివుని నిందించువానికి మాత్రమే గాక ఆ నిందను వినువానికి కూడ పాపము చుట్టుకొనును (37). శివభక్తులు శివనింద చేయువానిని ఎట్లైననూ వధించవలెను. ఆతడు బ్రాహ్మణుడైనచో విడిచిపెట్టవలెను. అచ్చోట నుండి వెంటనే తొలగిపోవలెను (38). ఈ దుష్టుడు మరల శివుని నిందించగలడు. బ్రాహ్మణుడు గనుక ఈతడు వధార్హుడు కాడు. కాన ఈతనిని విడిచి పోవలెను. ఎట్టి పరిస్థితులలోనైననూ ఈతనిని చూడరాదు (39). మనమీ స్థలమును విడిచి ఈ క్షణమునందే మరియొక చోటికి శీఘ్రముగా పోదము. అట్లు చేయుట వలన ఈ మూర్ఖునితో మరల సంభాషించుట తప్పిపోవును (40).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా చోమయా యావత్పాదముత్ క్షప్యతే మునే ।
అసౌ తావచ్ఛివస్సాక్షా దాలంబే ప్రియయా స్వయమ్ ॥
కృత్వా స్వరూపం సుభగం శివాధ్యానం యథా తథా ।
దర్శయిత్వా శివాయై తామువాచా వాఙ్ముఖీం శివః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! ప్రియురాలగు ఉమాదేవి. ఇట్లు పలికి వెళ్లుటకు ముందుడుగు వేయునంతలో ఆ శివుడు స్వస్వరూపముతో ప్రత్యక్షమై ఆమెను పట్టుకొనెను (41). ఉమాదేవి శివుని ఏసగుణ రూపమును ధ్యానించెడిదో, అదే రూపమును ఆమెకు దర్శింపజేసి శివుడు తలవంచుకొనియున్న ఆమెతో నిట్లనెను (42).

శివ ఉవాచః

కుత్ర యాస్యసి మాం హిత్వా న త్వం త్యాజ్యా మయా పునః ।
ప్రసన్నోఽస్మి వరం బ్రూహి నాదేయం విద్యతే తవ ॥
అద్య ప్రభృతి తే దాసస్తపోభిః క్రీత ఏవ తే ।
క్రీతోఽస్మి తవ సౌందర్యాత్ క్షణమేకం యుగాయతే ॥
త్యజ్యతాం చ త్వయా లజ్జా మమ పత్నీ సనాతనీ ।
గిరిజే త్వం హి సద్బుద్ధ్యా విచారయ మహేశ్వరి ॥
మయా పరీక్షితాసి త్వం బహుధా దృఢమానసే ।
తత్ క్షమస్వాపరాధం మే లో కలీలాను సారిణః ॥

శివుడిట్లు పలికెను -

నన్ను విడిచి నీవు ఎచటకు పోయెదవు? నిన్ను నేను రెండవసారి విడిచిపెట్టను. నేను ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొనుము. నీకు ఈయదగని వరము లేదు (43). ఈ నాటినుండి నేను నీ దాసుడను. నేను నీ తపస్సులచే కొనివేయబడితిని. నీ సౌందర్యముచే కొనివేయబడితిని. నీవు లేని క్షణము యుగమువలె నున్నది (44). నీవు సిగ్గును విడువుము. నీవు నా సనాతన ధర్మపత్నివి. ఓ గిరిజా! మహేశ్వరీ! నీవు సద్బుద్ధితో విచారించుము (45). దృఢమగు చిత్తము గలదానా! నేను నిన్ను పరిపరివిధముల పరీక్షించితిని. లో కలీలను అనుసరించే నా ఈ అపరాధమును మన్నించుము (46).

న త్వాదృశం ప్రణయినీం పశ్యామి చ త్రిలోకకే ।

సర్వథాహం తవా ధీనస్స్వకామః పూర్యతాం శివే ॥

ఏహి ప్రియే మత్సకాశం పత్నీ త్వం మే వరస్తవ ।

త్వయా సాకం ద్రుతం యాస్యే స్వగృహం పర్వతోత్తమమ్ ॥

నీ వంటి ప్రేమమూర్తి ముల్లోకములలో కానరాదు. నేను అన్ని విధములా నీకు అధీనుడనై యున్నాను. ఓ శివా! నీ కోర్కె నెరవేరుగాక! (47) ఓ ప్రియురాలా! నా వద్దకు రమ్ము. నీవు నాకు పత్నివి. నేను నీ వరుడను. నా నివాసమగు ఉత్తమకైలాసమునకు నేను నిన్ను దోడ్కొని తొందరలో వెళ్లగలను (48).

బ్రహ్మో వాచ ।

ఇత్యుక్తే దేవదేవేన పార్వతీ ముదమాప సా ।

తపోజాతం తు యత్కష్టం తజ్జహౌ చ పురాతనమ్ ॥

సర్వశ్శ్రమో వినష్టోఽ భూత్పార్వత్యాస్తు మునిసత్తమ ।

ఫలే జాతే శ్రమః పూర్వో జంతో ర్నాశ మవాప్నుయాత్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

పార్వత్యాశ్శివ రూప దర్శనం నామాష్టా వింశోఽధ్యాయః (28).

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవదేవుడు ఇట్లు పలుకగా ఆ పార్వతి చాల సంతసించెను. అంతవరకు ఆమె తపస్సును చేయుటలో పడిన క్లేశము మటుమాయమయ్యెను (49). ఓ మునిశ్రేష్ఠా! పార్వతీ దేవి యొక్క శ్రమ అంతయూ తొలగిపోయెను. మానవులకు చేసిన కష్టమునకు ఫలము లభించినప్పుడు అంతవరకు పడిన శ్రమ మటుమాయమగును (50).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో పార్వతికి శివుడు దర్శనమిచ్చుట అనే ఇరవై ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (28).

29 - శివపార్వతుల సంవాదము

నారద ఉవాచ।

బ్రహ్మన్ విధే మహాభాగ కిం జాతం తదనంతరమ్ ।
సత్సర్వం శ్రోతుమిచ్ఛామి కథయ త్వం శివాయశః ॥

నారదుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మా! విధీ! మహాత్మా! తరువాత ఏమైనది? పవిత్రమగు ఆ వృత్తాంతము నంతనూ వి:ినగోరుచున్నాను. నీవు శివాదేవి యొక్క కీర్తిని గురించి చెప్పుము (1).

బ్రహ్మోవాచ।

దేవర్షే శ్రూయతాం సమ్యక్ కథయామి కథాం ముదా ।
తాం మహాపాప సంహర్త్రీం శివభక్తి వివర్ధినీమ్ ॥
పార్వతీ వచనం శ్రుత్వా హరస్య పరమాత్మనః ।
దృష్ట్వానందకరం రూపం జహర్షాతీవ చ ద్విజ ॥
ప్రత్యువాచ మహాసాధ్వీ స్వోపకంఠ స్థితం విభుమ్ ।
అతీవ సుఖితా దేవీ ప్రీత్యుత్ఫుల్లాననా శివా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ దేవర్షీ! నేనీగాథను ఆనందముతో చెప్పెదను. నీవు చక్కగా వినుము. ఈ గాథ మహాపాపములను పాగొట్టి శివభక్తిని వర్ధిల్లజేయును (2). పరమాత్మ యగు శివుని మాటను విని, ఆనందదాయకమగు ఆయన రూపమును చూచి, పార్వతి చాల సంతసిల్లెను. ఓ బ్రాహ్మణా! (3) మహాపతివ్రత, మిక్కిలి ఆనందముతో నున్నది, ప్రీతిచే వికసించిన నేత్రములు గలది అగు శివాదేవి తన సమీపమునందున్న శివవిభునకు ఇట్లు బదులిడెను (4).

పార్వత్యువాచ ।

త్వం నాథో మమ దేవేశ త్వయా కిం విస్మృతం పురా ।
దక్ష యజ్ఞ వినాశం హి యదర్థం కృతవాన్ హఠాత్ ॥
స త్వం సాహం సముత్పన్నా మేనాయాం కార్యసిద్ధయే ।
దేవానాం దేవ దేవేశ తారకాప్తా సుఖాత్మనామ్ ॥
యది ప్రసన్నో దేవేశ కరోషి చ కృపాం యది ।
పతిర్భవ మమేశాన మమ వాక్యం కురు ప్రభో ॥॥
పితుర్గేహే మయా సమ్యగ్గమ్యతే త్వదనుజ్ఞయా ।
ప్రసిద్ధం క్రియతాం తద్వై విశుద్ధం పరమం యశః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! నీవు.నా నాథుడవు. నీవు నా కోసమై ఆగ్రహించి దక్షయజ్ఞమును ధ్వంసమొనర్చితివి. ఆ పూర్వగాథను మరచితివా యేమి? (5) ఓ దేవదేవా! ఈశ్వరా! అట్టి నేను తారకునిచే పీడింపబడిన దేవతల కార్యము సిద్ధించుట కొరకై మేనయందు జన్మించితిని (6). ఓ దేవ దేవా! ఈశానా! ప్రభూ! నీవు ప్రసన్నుడవైనచో, నీకు దయ కలిగినచో, నా మాటను పాలించి నా భర్తవు కమ్ము (7). నీ అనుజ్ఞను పొంది నేను మా తండ్రిగారి ఇంటికి వెళ్లెదను. నీ పరమపవిత్రమగు కీర్తి నలుదిక్కులా వ్యాపించునట్లు చేయుము (8).

గంతవ్యం భవతా నాథ హిమవత్పార్శ్వతః ప్రభో ।

యాచస్వ మాం తతో భిక్షుర్భూత్వా లీలా విశారదః ॥

తథా త్వయా ప్రకర్తవ్యం లోకే ఖ్యాపయతా యశః ।

పితుర్మే సఫలం సర్వం కురుష్వైవం గృహాశ్రమమ్ ॥

ఋషిభిర్బోధితః ప్రీత్యా స్వబంధు పరివారితః ।

కరిష్యతి న సందేహస్తవ వాక్యం పితా మమ ॥

దక్ష కన్యా పురాహం వై పిత్రా దత్తా యదా తవ ।

యథోక్తవిధినా తత్ర వివాహో న కృతస్త్వయా ॥

హే నాథా! ప్రభూ! నీవు హిమవంతుని వద్దకు వెళ్లవలెను. లీలాపండితుడవగు నీవు భిక్షుకుడవై ఆతని నుండి నన్ను కోరుము (9). అట్లు నీవు చేసి నీ కీర్తిని లోకములో విస్తరిల్ల జేయుము. మరియు నా తండ్రి యొక్క గృహస్థాశ్రమమును సఫలము చేయుము (10). మహర్షులచే బోధింపబడిన వాడై నా తండ్రి బంధువులతో గూడి ప్రీతియుక్తముగా నీ కోర్కెను మన్నించగలడు. ఈ విషయములో సందేహము వలదు (11). పూర్వము నేను దక్షకన్యనై జన్మించినపుడు నా తండ్రి నన్ను నీ కిచ్చి వివాహమును చేసినాడు. కాని ఆ సమయములో నీవు యథావిధిగా వివాహకార్యమును నిర్వర్తించలేదు (12).

న గ్రహాః పూజితాస్తేన దక్షేణ జనకేన మే ।

గ్రహాణాం విషయస్తేన సచ్ఛిద్రోఽయం మహానభూత్ ॥

తస్మాద్యథోక్త విధినా కర్తుమర్హసి మే ప్రభో ।

వివాహం త్వం మహాదేవ దేవానాం కార్యసిద్ధయే ॥

వివాహస్య యథా రీతిః కర్తవ్యా సా తథా ధ్రువమ్ ।

జానాతు హిమవాన్ సమ్యక్ కృతం పుత్ర్యా శుభం తపః ॥

నా తండ్రియగు ఆ దక్షుడు గ్రహములను పూజించలేదు. గ్రహముల విషయములో అది పెద్ద పొరపాటుగా పరిణమించెను (13). హే ప్రభో! మహాదేవా! కావున, నీవు యథావిధిగా చేయతగుదువు. దేవతల కార్యసిద్ధి కొరకై నీవు వివాహమాడుచున్నావు (14). వివాహమును ఏరీతిగా నిర్వర్తించవలయునో, అదే రీతిని నీవు పాటించుము. ఇది తప్పని సరి. హిమవంతుడు తన కుమార్తె చేసిన శుభకరమగు తపస్సును గురించి చక్కగా తెలుసుకొనును గాక! (15)

మాయామయం కృతమిదం చ జగత్సమగ్రం సర్వాత్మనా హి విధృతం
పరయా స్వబుద్ధ్యా ।
సర్వాత్మభిస్సు కృతిభిః పరమాత్మ భావై: సంసిక్త మాత్మని గుణైః
పరివేష్టితం చ ॥
కే గ్రహాః కే ఋతుగణా కే వాఽ న్యేఽపి త్వయా గ్రహాః ।
కిముక్తం చాధునా దేవి శివార్థం వరవర్ణిని ॥
గుణకార్య ప్రభేదేనావాభ్యాం ప్రాదుర్భవః కృతః ।
భక్తహేతోర్జ గత్యస్మిన్ భక్తవత్సల భావతః ॥

నేను మాయా మయమగు ఈ జగత్తు నంతనూ సృష్టించితిని. నా అమోఘమగు సంకల్పశక్తి చే సృష్టింపబడిన ఈ జగత్తును నేను సర్వాత్మరూపుడనై ధరించి యున్నాను. సర్వాత్మ భావము గల పుణ్యాత్ములు సర్వత్రా పరమాత్మను దర్శించువారై త్రిగుణాత్మకమగు ఈ జగత్తును ఆత్మయందు మాత్రమే అధిష్ఠితమై ఉన్నదిగా దర్శించెదరు (21). గ్రహములనగా నేమి? ఋతుసమూహములు ఏవి? నీ కంటె భిన్నముగా ఉపగ్రహములు గలవా? ఓ బ్రహ్మచారిణీ! నీవు శివుని కొరకు ఇప్పుడు తపస్సు చేయుచున్నావను మాట ఎట్టిది? (22) మనమిద్దరము భక్తుల యందలి ప్రేమతో నిండిన హృదయము గలవారమై ఈ జగత్తులో గుణభేదమును బట్టి విభిన్న కార్యరూపముగా సృష్టించి యున్నాము (23).

త్వం హి వై ప్రకృతిస్సూక్ష్మా రజస్సత్త్వ తమోమయీ ।
వ్యాపారదక్షా సతతం సగుణా నిర్గుణాపి చ ॥
సర్వేషామిహ భూతానా మహమాత్మా సుమధ్యమే ।
నిర్వికారీ నిరీహశ్చ భక్తే చ్ఛోపాత్త విగ్రహః ॥
హిమాలయం న గచ్ఛేయం జనకం తవ శైలజే ।
తతస్త్వాం భిక్షుకో భూత్వా న యాచేయం కథంచన ॥
మహాగుణైర్గరిష్ఠోఽపి మహాత్మాపి గిరీంద్రజే ।
దేహీతి వచనాత్సద్యః పురుషో యాతి లాఘవమ్ ॥

సూక్ష్మము, రజస్సత్త్వ తమో గుణాత్మకము, జగద్వ్యాపారమునందు సమర్థమైనది, నిర్గుణమైనదే అయిననూ నిత్యము, సగుణ రూపములో నుండునది అగు ప్రకృతి నీవే (24). ఓ సన్నని నడుము గల దానా! ఈ జగత్తులోని సర్వప్రాణులకు ఆత్మ నేనే. వికారములు, కామనలు లేని నేను భక్తుల కోరిక మేరకు దేహమును స్వీకరించినాను (25). ఓ పార్వతీ! నేను నీ తండ్రియగు హిమవంతుని వద్దకు వెళ్లను. మరియు నేను భిక్షకుడనై నిన్ను ఇమ్మని ఎన్నటికీ యాచించను (26). ఓ పర్వతరాజ పుత్రీ! మహాగుణశాలి, మహాత్ముడు, మహాపురుషుడు అగు వ్యక్తి కూడా 'ఇమ్ము' అను మాటను పలికిన మరుక్షణములో తేలికయై పోవును (27).

ఇత్థం జ్ఞాత్వా తు కల్యాణి కిమస్మాకం వదస్యథ ।
కార్యం త్వదాజ్ఞయా భద్రే యథేచ్ఛసి తథా కురు ॥

ఓ కల్యాణీ! మంగళ స్వరూపురాలా! ఈ విషయమును నీ వెరుంగుదువు. ఇపుడు నీవు ఈ మాకు ఏమని చెప్పెదవు? నీ ఆజ్ఞ తప్పక అనుసరించ దగినదియే. కావున, నీకు ఎట్లు నచ్చినచో, అట్లు చేయుము (28).

బ్రహ్మోవాచ ।

తేనోక్తాపి మహాదేవీ సా సాధ్వీ కమలేక్షణా ।
జగాద శంకరం భక్త్యా సుప్రణమ్య పునః పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

సాధ్వి, మహాదేవి, పద్మములు వంటి కన్నులు గలది అగు ఆమె ఈశ్వరుడు ఇట్లు చెప్పిననూ, భక్తితో అనేక పర్యాయములు సాష్టాంగపడి శంకరునితో నిట్లు పలికెను (29).

పార్వత్యువాచ ।

త్వమాత్మా ప్రకృతిశ్చాహం నాత్ర కార్యా విచారణా ।
స్వతంత్రౌ భక్తవశగౌ నిర్గుణౌ సగుణావపి ॥
ప్రయత్నేన త్వయా శంభో కార్యం వాక్యం మమ ప్రభో ।
యాచస్వ మాం హిమగిరే స్సౌభాగ్యం దేహి శంకర ॥
కృపాం కురు మహేశాన తవ భక్తాస్మి నిత్యశః ।
తవ పత్నీ సదా నాథ హ్యహం జన్మని జన్మని ॥

పార్వతి ఇట్లు పలికెను -

నీవు ఆత్మ, నేను ప్రకృతి అను విషయములో చర్చ లేదు. మనము స్వతంత్రులము; కాని భక్తుల అధీనములో నుండెదము. నిర్గుణులము, సగుణులము కూడా (30). ఓ శంభో! ప్రభో! నేను చెప్పిన తీరున నీవీ పనిని ప్రయత్నపూర్వకముగా చేయవలసి యున్నది. హే శంకరా! హిమవంతునికి ఈ భాగ్యమును కలిగించుము. నన్ను ఇమ్మని ఆయనను కోరుము (31). మహేశ్వరా! నాపై దయ చూపుము. నేను నీకు నిత్య భక్తురాలను. నాథా! నేను జన్మ జన్మలయందు సర్వదా నీకు భార్యను (32).

త్వం బ్రహ్మ పరమాత్మా హి నిర్గుణః ప్రకృతేః పరః ।
నిర్వికారీ నిరీహశ్చ స్వతంత్రః పరమేశ్వరః ॥
తథాపి సగుణోఽ పీహ భక్తోద్ధార పరాయణః ।
విహారీ స్వాత్మనిరతో నానాలీలా విశారదః ॥
సర్వథా త్వామహం జానే మహాదేవ మహేశ్వర ।
కిముక్తేన చ సర్వజ్ఞ బహునా హి దయాం కురు ॥
విస్తారయ యశో లోకే కృత్వా లీలాం మహాద్భుతామ్ ।
యత్ సుగీయ జనా నాథాంజసోత్తీర్ణా భవాంబుధేః ॥

పరమాత్మ, పరబ్రహ్మ నీవే. నిర్గుణుడవగు నీవు ప్రకృతికి అతీతుడవు. నీవు వికారములు, కామనలు లేని స్వతంత్ర పరమేశ్వరుడవు అయిననూ నీవు సగుణుడవై భక్తులను ఉద్ధరించుట ప్రధానలక్ష్యముగా కలిగి విహరించు చున్నావు. అనేక లీలలను ప్రదర్శించుటలో పండితుడవగు నీవు ఆత్మనిష్ఠుడవై ఉండెదవు (34). ఓమహాదేవా! మహేశ్వరా! నిన్ను నేను పూర్తిగా ఎరుంగుదును. పెక్కు మాటలేల? నీవు సర్వజ్ఞుడవు. దయను చూపుము (35). గొప్ప అద్భుతమగు లీలను ప్రదర్శించి లోకములో కీర్తిని విస్తరిల్ల జేయుము. నాథా! ఆ కీర్తిని చక్కగా గానము చేయు జనులు శీఘ్రమే సంసారసముద్రము నుండి ఉత్తీర్ణులగుదురు (36).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవముక్త్వా గిరిజా సుప్రణమ్య పునః పునః ।
విరరామ మహేశానం నతస్కంధా కృతాంజలిః ॥
ఇత్యేవముక్త స్స తయా మహాత్మా మహేశ్వరో లోక విడంబనాయ ।
తథేతి మత్వా ప్రహసన్ బభూవ ముదాన్వితః కర్తు మనాస్త దేవ ॥
తతో హ్యంతర్హితశ్శంభుర్బభూవ సుప్రహర్షితః ।
కైలాసం ప్రయయౌ కాల్యా విరహా కృష్ణమానసః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పార్వతి ఇట్లు పలికి అనేక పర్యాయము తలవంచి చేతులు ఒగ్గి మహేశ్వరునకు నమస్కరించి మిన్నకుండెను (37). ఆమె ఇట్లు పలుకగా మహాత్ముడగు ఆ మహేశ్వరుడు లోకపు తీరును అనుకరించుట కొరకై అటులనే చేసెదనని తలంచి, నవ్వుతూ ఆనందించెను (38). అపుడు మిక్కిలి ఆనందించిన శంభుడు అంతర్ధానమును చెంది కాళి యొక్క విరహముచే పీడితమైన మనస్సు గలవాడై కైలాసమును చేరుకొనెను (39).

తత్ర గత్వా మహేశానో నంద్యాది భ్యశ్చ ఊచివాన్ ।

వృత్తాంతం సకలం తం వై పరమానంద నిర్భరః ॥

తేఽపి శ్రుత్వా గణాస్సర్వే భైరవాద్యాశ్చ సర్వశః ।

బభూవుస్సుఖినోఽ త్యంతం విదధుః పరమోత్సవమ్ ॥

సుమంగలం తత్ర ద్విజ బభూవాతీవ నారద ।

సర్వేషాం దుఃఖనాశోఽ భూద్రుద్రః ప్రాపాపి సంముదమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే శివాశివ సంవాద వర్ణనం నామ ఏకోన త్రింశోఽ ధ్యాయః ॥

అచటకు వెళ్లి పరమానందముతో నిండియున్న మహేశ్వరుడు ఆ వృత్తాంతము◌ునంతనూ నంది మొదలగు వారికి చెప్పెను (40). భైరవాది గణములన్నియూ ఆ వృత్తాంతమును విని మిక్కిలి ఆనందించిన వారై మహోత్సవమును జరుపు కొనిరి (41). ఓ నారదా! ద్విజా! అచట గొప్ప మంగళము ప్రవర్తిల్లెను. అందరికీ దుఃఖము తొలగిపోయెను. రుద్రుడు కూడ మహానందమును పొందెను (42).

శ్రీ శివ మహాపురాణములో రుద్రసంహితయందు పార్వతీ ఖండలో శివాశివ సంవాదమనే ఇరువది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (29).

30 - పార్వతి గృహమునకు మరలి వచ్చుట

నారద ఉవాచ ।

విధే తాత మహాభాగ ధన్యస్త్వం పరమార్థ దృక్ ।
అద్భుతేయం కథా శ్రావి త్వదను గ్రహతో మయా ॥
గతే హరే స్వశైలే హి పార్వతీ సర్వమంగలా ।
కిం చకార గతా కుత్ర తన్మే వద మహామతే ॥

నారదుడిట్లు పలికెను -

ఓ విధీ! తండ్రీ! మహాత్మా! పరమసత్యమును దర్శించు నీవు ధన్యుడవు. నీ అనుగ్రహముచే నేనీ అద్భుతగాథను వింటిని (1). శివుడు తన పర్వతమునకు వెళ్లిన పిదప సర్వమంగళయగు పార్వతి ఏమి చేసెను? ఎచటకు వెళ్లెను? ఓ మహా బుద్ధీ! నాకు ఆ గాథను చెప్పుము (2).

బ్రహ్మోవాచ ।

శృణు సుప్రీతితస్తాత యజ్జాతం తదనంతరమ్ ।
హరే గతే నిజస్థానే తద్వదామి శివం స్మరన్ ॥
పార్వత్యపి సఖీయుక్తా రూపం కృత్వా తు సార్థకమ్ ।
జగామ స్వపితుర్గేహం మహాదేవేతి వాదినీ ॥
పార్వత్యాగమనం శ్రుత్వా మేనా చ స హిమాచలః ।
దివ్యం యానం సమారుహ్య ప్రయయౌ హర్ష విహ్వలః ॥
పురోహితశ్చ పౌరాశ్చ సఖ్యశ్చైవాప్యనేకశః ।
సంబంధినస్త థాన్యే చ సర్వే తే చ సమాయయుః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వత్సా! ప్రీతితో వినుము. నేను శివుని స్మరించి, శివుడు తన ధామమునకు వెళ్లిన తరువాత జరిగిన వృత్తాంతమును చెప్పెదను (3). తన రూపమును సార్థకము చేసుకున్న పార్వతి కూడా సఖురాండ్రతో గూడి మహాదేవనామమును జపిస్తూ తన తండ్రిగారి గృహమునకు వెళ్లెను (4). మేనా హిమవంతులు పార్వతి రాకను గురించి విని హర్షమును పట్టజాలక దివ్యమగు రథము నధిష్ఠించి ఎదురేగిరి (5). పురోహితులు, పౌరులు, పెద్ద సంఖ్యలో సఖురాండ్రు, బంధువులు మరియు ఇతరులు అందరు విచ్చేసిరి (6).

భ్రాతరస్సకలా జగ్ముర్మైనాక ప్రముఖాస్తదా ।
జయశబ్దం ప్రబ్రువంతో మహాహర్ష సమన్వితాః ॥
సంస్థాప్య మంగల ఘటం రాజవర్త్మని రాజితే ।
చందనాగరు కస్తూరీ ఫలశాఖా సమన్వితే ॥

సపురోధో బ్రాహ్మణైశ్చ మునిభి ర్బహ్మ వాదిభిః ।
నారీభిర్నర్తకీ భిశ్చ గజేంద్రాద్రి సుశోభితే ॥
పరితః పరితో రంభాస్తంభ బృంద సమన్వితే ।
పతి పుత్రవతీ యోషిత్సమూ హైర్దీపహస్తకైః ॥

అపుడు మైనాకుడు మొదలగు సోదరులందరు మహానందముతో నిండిన వారై జయధ్వానమును చేస్తూ విచ్చేసిరి (7). ప్రకాశించే రాజ మార్గమునందు మంగళఘటమును స్థాపించిరి. రాజమార్గము చందనము, అగరు, కస్తూరి, ఫలములు మరియు శాఖలతో ప్రకాశించెను (8). పురోహితులగు బ్రాహ్మణులతో, బ్రహ్మవేత్తలగు ఋషులతో, నాట్యముచేయు స్త్రీలతో, మరియు పర్వతముల వంటి గొప్ప ఏనుగులతో రాజమార్గము శోభిల్లెను (9). రెండు వైపులా అరటి స్తంభములచే అలంకరింపబడిన ఆ రాజమార్గములో భర్త, పిల్లలు గల ముత్తైదువలు దీపములను చేతబట్టి గుంపులుగా నిలబడిరి (10).

ద్విజ బృందైశ్చ సంయుక్తే కుర్వద్భిర్మంగల ధ్వనిమ్ ।
నానా ప్రకారావాద్యైశ్చ శంఖధ్వనిభిరన్వితే ॥
ఏతస్మిన్నంతరే దుర్గా జగామ స్వపురాంతికమ్ ।
విశంతీ నగరం దేవీ దదర్శ పితరౌ పునః ॥
సుప్రసన్నౌ ప్రధావంతౌ హర్షవిహ్వల మానసౌ ।
దృష్ట్వా కాలీ సుప్రహృష్టా స్వాలిభిః ప్రణనామ తౌ ॥
తౌ సంపూర్ణాశిషం దత్త్వా చక్రతుస్తాం స్వవక్షసి ।
హే వత్సే త్వేవముచ్చార్య రుదంతౌ ప్రేమవిహ్వలౌ ॥

అచట బ్రాహ్మణ బృందములు మంగళ ధ్వనిని చేయుచుండిరి. శంఖము మొదలగు అనేక వాద్యములు మ్రోయింపబడుచుండెను (11). ఇంతలో దుర్గ తన నగరమునకు సమీపించెను. ఆమె నగరములో ప్రవేశిస్తూనే, ఆనందము పట్ట జాలని తల్లిదండ్రులను చూచెను (12). మిక్కిలి ప్రసన్నులై వేగముగా వచ్చిన వారిని చూచి కాళి మిక్కిలి సంతసించి, తన సఖురాండ్రతో సహా వారికి నమస్కరించెను (13). వారు పూర్ణమగు ఆశీర్వచనములను పలికి ' ఓ అమ్మాయీ!' అని అక్కున చేర్చుకుని ప్రేమను పట్ట జాలక ఆనందబాష్పములను రాల్చిరి (14).

తతస్స్వకీయా అప్యస్యా అన్యా నార్యోఽపి సంముదా ।
భ్రాతృస్త్రియోఽపి సుప్రీత్యా దృఢాలింగన మాదధుః ॥
సాధితం హి త్వయా సమ్యక్ సుకార్యం కుల తారణమ్ ।
త్వత్సదాచరణేనాపి పావితాస్స్మాఖిలా వయమ్ ॥
ఇతి సర్వే సుప్రశంస్య ప్రణేముస్తాం సుహర్షితాః ।
చందనైస్సు ప్రసూనైశ్చ సమానర్చు శ్శివాం ముదా ॥
తస్మిన్నవసరే దేవా విమానస్థా ముదాంబరే ।
పుష్పవృష్టిం శుభాం చక్రుర్నత్వా తాం తుష్టువుస్స్ వైః ॥

తరువాత ఆమెకు బంధువులగు ఇతర స్త్రీలు, సోదరుల భార్యలు గూడ మహానందముతో పరమ ప్రీతితో ఆమెను గట్టిగా కౌగిలించుకొనిరి(15). నీవు వంశమును తరింపజేయు పుణ్య కార్యమును చక్కగా సాధించితివి. నీ పవిత్రమగు ఆచరణచే మేమందరము కూడా పవిత్రులమైతిమి (16). ఇట్లు వారందరు మహాహర్షముతో ఆమెను బాగుగా కొనియాడి, సుగంధ ద్రవ్యములతో, మరియు మంచి పుష్పములతో ఆ శివాదేవిని ఉల్లాసముగా చక్కగా పూజించిరి (17). ఆ సమయములో ఆకసమునందు విమానములలో నున్న దేవతలు ఆనందముతో మంగళకరమగు పుష్పవృష్టిని గురిపించి ఆమెకు నమస్కరించి స్తోత్రములను చేసిరి (18).

తదా తాం చ రథే స్థాప్య సర్వే శోభాన్వితే వరే ।

పురం ప్రవేశయామాసుస్సర్వే విప్రాదయో ముదా ॥

అథ విప్రాః పురోధాశ్చ సఖ్యో ఽన్యాశ్చ స్త్రియశ్శివామ్ ।

గృహం ప్రవేశయామాసుర్బహు మానపురస్సరమ్ ॥

స్త్రియో నిర్మ్ఛనం చక్రు ర్విప్రా యుయుజు రాశిషః ।

హిమవాన్ మేనకా మాతా ముమోదాతి మునీశ్వర ॥

స్వాశ్రమం సఫలం మేనే కుపుత్రాత్ పుత్రికా వరా ।

హిమవాన్ నారదం త్వాం చ సంస్తువన్ సాధు సాధ్వితి ॥

అపుడు బ్రాహ్మణులు మొదలగు వారందరు ఆనందముతో ఆమెను ప్రకాశించే గొప్ప రథములో కూర్చుం()ండ బెట్టి నగరములో ప్రవేశబెట్టిరి (19). అపుడు బ్రాహ్మణులు, పురోహితుడు, చెలికత్తెలు మరియు ఇతర స్త్రీ లు పార్వతిని సన్మాన పూర్వకముగా ఇంటిలో ప్రవేశపెట్టిరి (20), స్త్రీలు ఆమెకు దిష్టి తీసిరి. బ్రాహ్మణులు ఆశీర్వచనములను పలికిరి. ఓ మహర్షీ! తల్లిదండ్రులగు మేనా హిమవంతులు మిక్కిలి ఆనందించిరి (21). తన గృహస్థాశ్రమము సఫలమైనదనియు, చెడు పుత్రునికంటె పుత్రికయే శ్రేష్ఠమనియు భావించిన హిమవంతుడు నిన్ను (నారదుని) 'బాగు, బాగు' అని స్తుతించెను (22).

బ్రాహ్మణేభ్యశ్చ బందిభ్యః పర్వతేంద్రో ధనం దదౌ ।

మంగలం పాఠయామాస స ద్విజేభ్యో మహోత్సవమ్ ॥

ఏవం స్వకన్యయా హృష్టౌ పితరౌ భ్రాతరస్తథా ।

జామయశ్చ మహాప్రీత్యా సమూషుః ప్రాంగణే మునే ॥

తతస్స హిమవాన్ తాత సుప్రహృష్టః ప్రసన్నధీః ।

సమ్మాన్య సకలాన్ ప్రీత్యా స్నాతుం గంగాం జగామ హ ॥

ఏతస్మిన్నంతరే శంభుస్సలీలో భక్తవత్సలః ।

సునర్తకనటో భూత్వా మేనకా సన్నిధిం యయౌ ॥

ఆ పర్వతరాజు బ్రాహ్మణులకు, వందిమాగధులకు ధనము నిచ్చెను. బ్రాహ్మణులచే మంగళ పాఠములను చదివించెను. గొప్ప ఉత్సవమును చేయించెను (23). ఓ మహర్షీ! ఈ తీరున తమ కుమార్తెచే సంతసించిన తల్లి దండ్రులు, సోదరులు మరియు వారి భార్యలు మహానందముతో వాకిట గూర్చుండిరి (24). ఓ

కుమారా! తరువాత మిక్కిలి ఆనందించి, ప్రసన్నమగు మనస్సును కలిగియున్న ఆ హిమవంతుడు అందరిని ప్రీతి పూర్వకముగా ఆదరించి స్నానము చేయుటకు గంగానదికి వెళ్లెను (25). ఇంతలో భక్తవత్సలుడు, లీలలను చూపువాడు నగు శంభుడు నాట్యము చేసే నటుని రూపమును ధరించి మేనాదేవి వద్దకు వెళ్లెను (26).

శృంగం వామే కరే ధృత్వా దక్షిణే డమరుం తథా ।
పృష్ఠే కంథం రక్తవాసా నృత్య గాన విశారదః ॥
తతస్సునట రూపోఽ సా మేనకాయాం గణే ముదా ।
చక్రే సునృత్యం వివిధం గానం చాతిమనోహరమ్ ॥
శృంగం చ డమరుం తత్ర వాదయామాస సుధ్వనిమ్ ।
మహతీం వివిధాం తత్ర స చకార మనోహరమ్ ॥
తాం ద్రష్టుం నాగరాస్సర్వే పురుషాశ్చ స్త్రియస్తథా ।
ఆ జగ్ము స్సహసా తత్ర బాలా వృద్ధా అపి ధ్రువమ్ ॥

నృత్య గాన పండితుడగు శివుడు ఎర్రని వస్త్రమును ధరించి ఎడమచేతియందు కొమ్ము బూరాను, కుడిచేతియందు డమరుకను, భుజముపై మచ్చల దుప్పటిని ధరించి యుండెను (27). అపుడా మహానటుని రూపములో నున్న శివుడు మేనక మరియు ఇతర స్త్రీల యెదుట ప్రాంగణములో చక్కని నాట్యమును చేసి, అతిమనోహరముగా అనేకములగు పాటలను పాడెను (28). మరియు ఆయన అచట చక్కని ధ్వని గల కొమ్ము బూరాను, డమరును మ్రోగించి వివిధములైన మనోహర మహానాట్యములను చేసెను (29). ఆ నాట్యమును చూచుటకై నగర జనులు అందరు, అనగా పురుషులు, స్త్రీలు, పిల్లలు, పెద్దలు అందరు, వెంటనే అచటకు విచ్చేసిరి (30).

శ్రుత్వా సుగీతం తద్దృష్ట్వా సునృత్యం చ మనోహరమ్ ।
సహసా ముముహుస్సర్వే మేనాపి చ తదా మునే ॥
మూర్ఛాం సంప్రాప్య సా దుర్గా సుదృష్ట్వా హృది శంకరమ్ ।
త్రిశూలాదిక చిహ్నాని బిభ్రతం చాతి సుందరమ్ ॥
విభూతి భూషితం రమ్య మస్థి మాలా సమన్వితమ్ ।
త్రిలో చనోజ్జ్వల ద్వక్త్రం నాగయజ్ఞోపవీతకమ్ ॥
వరం వృణీత్యుక్తవంతం గౌరవర్ణం మహేశ్వరమ్ ।
దీన బంధుం దయాసింధుం సర్వథా సుమనోహరమ్ ॥
హృదయస్థం హరం దృష్ట్వేదృశం సా ప్రణనామ తమ్ ।
వరం వవ్రే మానసం హి పతిర్మే త్వం భవేతి చ ॥

ఓ మహర్షీ! ఆ చక్కని గీతమును, మనోహరమగు నృత్యమును చూచి మేనతో సహా◌ా అందరు మోహమును పొందిరి (31). ఆ దుర్గకూడ మూర్ఛిల్లి హృదయమునందు శంకరుని చూచెను. త్రిశూలము మొదలగు చిహ్నములను ధరించి యున్నవాడు, మిక్కిలి సుందరాకారుడు (32), భస్మచే అలంకరింప

బడినవాడు, సుందరమగు ఎముకల మాలను ధరించిన వాడు, మూడు కన్నులతో గొప్పగా ప్రకాశించు చున్న ముఖము గలవాడు, సర్పములే యజ్ఞోపవీతముగా గలవాడు (33), వరమును కోరుకొనుము అని పలికిన వాడు, పచ్చని రంగు గలవాడు, మహేశ్వరుడు, దీనులకు బంధువు, దయాసముద్రుడు, అన్ని విధములుగా మిక్కిలి మనోహరమైనవాడు (34), హృదయము నందున్నవాడు అగు హరుని చూచి ఆమె ఆతనికి నమస్కరించెను. మరియు ఆమె తన మనస్సులో 'నీవు నాకు భర్తవు కమ్ము' అని వరమును గోరెను (35).

వరం దత్త్వా శివం చాథ తాదృశం ప్రీతితో హృదా ।
అంతర్ధాయ పునస్తత్ర సుననర్త స భిక్షుకః ॥
తతో మేనా సురత్నాని స్వర్ణపాత్ర స్థితాని చ ।
తస్మై దాతుం యయౌ ప్రీత్యా తద్భూతి ప్రీతిమానసః ॥
తాని న స్వీచకారాసౌ భిక్షాం యాచే శివాం చ తామ్ ।
పునస్సు నృత్యం గానం చ కౌతుకాత్కరు ముద్యతః ॥
మేనా తద్వచనం శ్రుత్వా చుకోపాతి సువిస్మితా ।
భిక్షుకం భర్త్స యామాస బహిష్కర్తుమియేష సా ॥

శివుడు ఆమెకు హృదయములో దర్శనమిచ్చి ప్రీతితో మంగళకరమగు అట్టి వరమొసంగి అంతర్ధానమై మరల అచట భిక్షుకుడై నాట్యమును చేసెను (36). అపుడు మేన బంగరు పాత్రలో మంచి రత్నములను పోసి ఆతనికి ఇచ్చుటకై తీసుకొని వెళ్లెను (37). ఆ సంపదకు సంతసించిన మనస్సుగల శివుడు ఆ రత్నములను నిరాకరించి పార్వతిని భిక్షగా నిమ్మని గోరెను. మరియు, ఆయన మరల పాటలు పాడుతూ ఉత్సాహముతో నటనము చేయ మొదలిడెను (38). ఆ మాటను వినిన మేన మిక్కిలి ఆశ్చర్యమును, కోపమును పొంది ఆ భిక్షుకుని నిందించెను. ఆమె అతనిని బయటకు నెట్టింపగోరెను (39).

ఏతస్మిన్నంతరే తత్ర గంగాతో గిరిరాయయౌ ।
దదర్శ పురతో భిక్షుం ప్రాంగణస్థం నరాకృతిమ్ ॥
శ్రుత్వా మేనాముఖాద్వృత్తం తత్సర్వం సుచుకోప సః ।
ఆజ్ఞాం చకారాను చరాన్ బహిష్కర్తుం చ తం నటమ్ ॥
మహాగ్నిమివ దుస్స్పర్శం ప్రజ్వలంతం సుతేజసమ్ ।
న శశాక బహిష్కర్తుం కోఽపి తం మునిసత్తమ ॥
తతస్స భిక్షుకస్తాత నానాలీలా విశారదః ।
దర్శయామాస శైలాయ స్వప్రభావమనంతకమ్ ॥

ఇంతలో గంగానది నుండి హిమవంతుడచటకు వచ్చెను. ఆయనకు నరరూపములో నున్న ఆది భిక్షువు వాకిట గానవచ్చెను (40).మేనాదేవి చెప్పగా జరిగిన వృత్తాంతమునంతనూ విని ఆయన చాలా కోపించి ఆ నటుని బయటకు గెంటుడని సేవకులనాజ్ఞాపించెను (41). ఓ మునిశ్రేష్ఠా! గొప్ప అగ్నివలె స్పృశింప శక్యముగాని విధముగా మహాతేజస్సుతో ప్రజ్వరిల్లుచున్న ఆ శివుని బయటకు నెట్టు

సామర్థ్యము ఎవ్వరికీ లేకపోయెను (42). ఓ కుమారా! అనేక లీలా పండితుడగు ఆ భిక్షుకుడు అపుడు తన అనంత మహిమను హిమవంతునకు చూపించెను (43).

శైలో దదర్శ తం తత్ర విష్ణురూపధరం ద్రుతమ్ ।
కిరీటినం కుండలినం పీతవస్త్రం చతుర్భుజమ్ ॥
యద్యత్పుష్పాదికం దత్తం పూజాకాలే గదా భృతే ।
గాత్రే శిరసి తత్సర్వం భిక్షుకస్య దదర్శ హ ॥
తతో దదర్శ జగతాం స్రష్టారం స చతుర్ముఖమ్ ।
రక్తవర్ణం పఠంతం చ శ్రుతి సూక్తం గిరీశ్వరః ॥
తతస్సూర్య స్వరూపం చ జగచ్చక్షు స్స్వరూపకమ్ ।
దదర్శ గిరిరాజస్స క్షణం కౌతుక కారిణమ్ ॥

అపుడచట హిమవంతునకు వెనువెంటనే కిరీటమును, కుండలములను, పచ్చని వస్త్రమును ధరించియున్న నాల్గు భుజములు గల విష్ణు రూపము దర్శనమిచ్చెను (44). పూజాసమయములో గదాధారియగు విష్ణువునకు ఏయే పుష్పాదులు సమర్పింపబడినవో, అవి అన్నియూ ఆ భిక్షుకుని శరీరమునందు, శిరస్సునందు గానవచ్చెను (45). తరువాత నాలు ముఖములు గలవాడు, ఎర్రని వర్ణము గలవాడు, వేద సూక్తములను పఠించుచున్నవాడు అగు సృష్టికర్తను ఆ హిమవంతుడు గాంచెను (46). తరువాత ఆ పర్వత రాజు జగత్తులకు చూపును అనుగ్రహించు సూర్య భగవానుని క్షణ కాలము గాంచి విస్మయమును పొందెను (47).

తతో దదర్శ తం తాత రుద్రరూపం మహాద్భుతమ్ ।
పార్వతీ సహితం రమ్యం విహసంతం సుతేజసమ్ ॥
తతస్తేజ స్స్వరూపం చ నిరాకారం నిరంజనమ్ ।
నిరుపాధిం నిరీహం చ మహాద్భుత మరూపకమ్ ॥
ఏవం బహూని రూపాణి తస్య తత్ర దదర్శ సః ।
సువిస్మితో బభూవాశు పరమానంద సంయుతః ॥
అథాసౌ భిక్షువర్యో హి తస్మాత్త స్యాశ్చ సూతికృత్ ।
భిక్షాం యయాచే దుర్గాం తాం నాన్యజ్జగ్రాహ కించన ॥

ఓ కుమారా! అపుడు ఆ పర్వతుడు మహాద్భుతము, పార్వతీ సహితము, రమ్యము, నవ్వువుచున్నమోము గలది, గొప్ప తేజస్సు గలదియగు రుద్ర రూపమును గాంచెను (48). ఆ తరువాత తేజోరూపము, నిరాకారము, నిరంజనము, ఉపాధి లేనిది, సంకల్పములు లేనిది, మహాద్భుతము అగు నిర్గుణ స్వరూపమును గాంచెను (49). ఈ తీరున ఆ హిమవంతుడు భిక్షుకుని యందు అనేక రూపములను గాంచి మిక్కిలి ఆశ్చర్యమును, పరమానందమును పొందెను (50). అపుడు జగత్కారణుడగు ఆ ఆది భిక్షువు ఆతని నుండి దుర్గను భిక్షగా నిమ్మని గోరెను. మరియే భిక్షను ఆయన స్వీకరించలేదు (51).

న స్వీచకార శైలేంద్రో మోహిత శ్శివమాయయా ।

భిక్షుః కించిన్న జగ్రాహ తత్రై వాంతర్దధే తతః ॥

తదా బభూవ సుజ్ఞానం మేనాశైలేశ యోరితి ।

ఆవాం శివో వంచయిత్వా స్వస్థానం గతవాన్ ప్రభుః ॥

తయోర్విచింత్య తత్రైవం శివే భక్తిరభూత్పురా ।

మహామోక్షకరీ దివ్యా సర్వానంద ప్రదాయినీ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీఖండే పార్వతీ ప్రత్యాగమన మహోత్సవ వర్ణనం నామ త్రింశోఽ ధ్యాయః ॥

శివమాయచే మోహితుడైన పర్వతరాజు అంగీకరించలేదు. ఆ భిక్షువు ఇతరమును ఁ స్వీకరించకుండగనే అచ్చటనే అంతర్ధానమయ్యెను (52). అపుడు 'మనలను శివప్రభుడు మోసగించి తన స్థానమునకు వెళ్లినాడు' అను జ్ఞానము మేనా హిమవంతులకు కలిగెను (53). ఇట్లు ఆలోచించిన వారిద్దరికి మహామోక్షమును కలిగించునది, దివ్యమైనది, సర్వానందముల నిచ్చునది అగు శివభక్తి ఉదయించెను (54).

శ్రీ శివ మహాపురాణములో రుద్రసంహితయందు పార్వతి మరలి వచ్చుట అను వృత్తాంతమును వర్ణించే ముప్పదియవ అధ్యాయము ముగిసెను (30).

31 – శివమాయ

బ్రహ్మోవాచ ।

తయోర్భక్తిం శివే జ్ఞాత్వా పరమవ్యభిచారిణీమ్ ।
సర్వే శక్రాదయో దేవాశ్చించింతురితి నారద ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

శివుని యందు వారిద్దరికి అనన్యమగు పరాభక్తి గలదని ఇంద్రాది దేవతలందరికీ తెలిసినది. ఓ.నారదా! అపుడు వారు ఇట్లు తలపోసిరి. (1).

దేవా ఊచుః ।

ఏకాంత భక్త్యా శైలశ్చేత్కన్యాం తస్మై ప్రదాస్యతి ।
ధ్రువం నిర్వాణతాం సద్యస్స ప్రాప్స్యతి చ భారతే ॥
అనంత రత్నాధారశ్చేత్పృథ్వీం త్యక్త్వా ప్రయాస్యతి ।
రత్న గర్భాభిధా భూమేర్మి థ్యైవ భవితా ధ్రువమ్ ॥
స్థావరత్వం పరిత్యజ్య దివ్యరూపం విధాయ సః ।
కన్యాం శూలభృతే దత్వా శివలోకం గమిష్యతి ॥
మహాదేవస్య సారూప్యం లప్స్యతే నాత్ర సంశయః ।
తత్ర భుక్త్వా వరాన్ భోగాంస్తతో మోక్షమవాప్స్యతి ॥

దేవతలిట్లు పలికిరి –

హిమవంతుడు అనన్య భక్తితో శివునకు కన్యాదానమును చేసినచో, భారత ఖండమునందు ఆతడు వెనువెంటనే మోక్షమును పొందును (2). అనంత రత్నములకు ఆధారమగు నాడతు భూలోకమును వీడి పయనమైనచో, భూమి యొక్క రత్నగర్భయను బిరుదు మిథ్య యగుట నిశ్చయము (3). ఆతడు కన్యను శూలధారియగు శివునకిచ్చి పర్వతరూపమును విడిచిపెట్టి దివ్యరూపమును ధరించి శివలోకమును పొందగలడు (4). ఆతడు మహాదేవునితో సారూప్యమును పొంది, అచట శ్రేష్ఠమగు భోగముల ననుభవించి

తరువాత మోక్షమును పొందగలడు. దీనిలో సందేహము లేదు (5).

బ్రహ్మోవాచ।

ఇత్యాలోచ్య సురాస్సర్వే కృత్వా చామంత్రణం మిథః ।
ప్రస్థాపయితు మై చ్ఛంస్తే గురుం తత్ర సువిస్మితాః ॥
తతశ్శక్రాదయో దేవాస్సర్వే గురునికేతనమ్ ।
జగ్ముః ప్రీత్యా సవినయా నారద స్వార్థ సాధకాః ॥
గత్వా తత్ర గురుం నత్వా సర్వే దేవాస్సవాసవాః ।
చక్రుర్నివేదనం తస్మై గురవే వృత్త మాదరాత్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవతలందరు ఇట్లు తలపోసి ఒకరితో నొకరు సంప్రదించుకొని చకితులై హిమవంతు(ు)ని వద్దకు బృహస్పతిని పంపవలెనని తలంచిరి (6). అపుడు ఇంద్రుడు మొదలుగా గల దేవతలందరు తమ ప్రయోజనమును సాధింపబూని వినయముతో గూడినవారై ప్రీతితో బృహస్పతి గృహమునకు వెళ్లిరి. ఓ నారదా! (7) ఇంద్రాది దేవతలు అందురు అచటకు వెళ్లి, బృహస్పతికి నమస్కరించి జరుగుతున్న వృత్తాంతమును సాదరముగా ఆయనకు నివేదించిరి (8).

దేవా ఊచుః ।

గురో హిమాలయ గృహం గచ్ఛాస్మత్కార్య సిద్ధయే ।
తత్ర గత్వా ప్రయత్నేన కురు నిందాం చ శూలినః ॥
పినాకినా వినా దుర్గా వరం నాన్యం వరిష్యతి ।
అనిచ్ఛయా సుతాం దత్త్వా ఫలం తూర్ణం లభిష్యతి ॥
కాలే నైవాధునా శైల ఇదానీం భువి తిష్ఠతు ।
అనేకరత్నధారం తం స్థాపయ త్వం క్షితౌ గురో ॥

దేవతలిట్లు పలికిరి -

గురుదేవా! మా కార్యమును సంపాదించుటకై హిమవంతుని వద్దకు వెళ్లుము. అచటకు వెళ్లి ప్రయత్నపూర్వకముగా శూలధారియగు శివుని నిందించుము (9). దుర్గ పినాక ధారియగు శివుని తక్క మరియొకనిని వివాహమాడబోదు. ఆయన ప్రీతి లేకుండగా తన కుమార్తెను ఆయనకు దానము చేసినచో, వెంటనే ఫలము లభించును (10). కాని ప్రస్తుతము హిమవంతుడు భూమియందు మాత్రమే ఉండగలడు. కావున, ఓ గురుదేవా! అట్లు చేసి అనేకరత్నములకు ఆశ్రయమగు హిమవంతుని భూమియందు స్థిరముగా నుండునట్లు నీవు చేయుము (11).

బ్రహ్మోవాచ ।

ఇతి దేవవచశ్శ్రుత్వా ప్రదదౌ కర్ణయోః కరమ్ ।
న స్వీచకార స గురు స్స్మరన్నామ శివేతి చ ॥
అథ స్మృత్వా మహాదేవం బృహస్పతిరుదారధీః ।
ఉవాచ దేవవర్యాంశ్చ ధిక్ కృత్వా చ పునః పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవతల ఈ మాటను విని బృహస్పతి శివుని నామమును స్మరిస్తూ చెవులను మూసుకొనెను. ఆయన వారి కోరికను అంగీకరించలేదు (12). అపుడు విశాల హృదయుడగు బృహస్పతి మహాదేవుని స్మరించి, దేవతలను అనేక పర్యాయములు నిందించి వారితో నిట్లనెను (13).

బృహస్పతిరువాచ ।

సర్వే దేవాస్స్వార్థపరాః పరార్థ ధ్వంసకారకాః ।
కృత్వా శంకరనిందాం హి యాస్యామి నరకం ధ్రువమ్ ॥
కశ్చిన్మధ్యే చ యుష్మాకం గచ్ఛేచ్ఛే లాంతికం సురాః ।
సంపాదయేత్స్వాభిమతం శైలేంద్రం ప్రతిబోధ్య చ ॥
అనిచ్ఛయా సుతాం దత్వా సుఖం తిష్ఠతు భారతే ।
తస్మై భక్త్యా సుతాం దత్త్వా మోక్షం ప్రాప్స్యతి నిశ్చితమ్ ॥
పశ్చాత్సప్తర్షయస్సర్వే బోధయిష్యంతి పర్వతమ్ ।
పినాకినా వినా దుర్గా వరం నాన్యం వరిష్యతి ॥
అథవా గచ్ఛత సురా బ్రహ్మలోకం సవాసవాః ।
వృత్తం కథయత స్వం తత్స వః కార్యం కరిష్యతి ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

దేవతలందరు తమ లాభమును సంపాదించుకొని, ఇతరుల కార్యమును ధ్వంసము చేయుట యందు నిమగ్నులై యున్నారు. శంకరుని నేను నిందించినచో నాకు నరకప్రాప్తి తప్పని సరియగును (14). ఓ దేవతలారా! మీలో ఒకడు హిమవంతుని వద్దకు వెళ్లి, ఆయనకు బోధించి మీ కోర్కెను నెరవేర్చుకొనుడు (15). ఆయన శివునకు భక్తితో కన్యాదానమును చేసి మోక్షమును పొందుట నిశ్చితము. కాని ప్రీతి లేకుండగా కుమార్తెను ఇచ్చినచో భారత ఖండమునందు సుఖముగ నుండగలడు (16). మీలో ఒకరు వెళ్లి వచ్చిన తరువాత సప్తర్షులందరు వెళ్లి ఆ పర్వతునకు ఉపదేశించగలరు. దుర్గాదేవి పినాకధారియగు శివుని తక్క మరియొకనిని వివాహమాడదు (17). ఓ దేవతలారా! అట్లు గానిచో, మీరు ఇంద్రుని దోడ్కొని బ్రహ్మలోకమునకు వెళుడు. మీ వృత్తాంతమును ఆయనకు చెప్పుడు. ఆయన మీ కార్యమును చక్కబెట్టగలడు (18).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా తే సమాలోచ్య జగ్ముర్బ్రహ్మ సభాం సురాః ।
సర్వే నివేదయాం చక్రుర్నత్వా తద్గత మాదరాత్ ॥
దేవానాం తద్వచశ్శ్రుత్వా శివనిందాకరం తదా ।
వేదవక్తా విలప్యాహం తానవోచం సురాన్మునే ॥
నాహం కర్తుం క్షమో వత్సా శ్శివ నిందాం సుదుస్సహామ్ ।
సంపద్వినాశ రూపం చ విపదాం బీజరూపిణీమ్ ॥
సురా గచ్ఛత కైలాసం సంతోషయత శంకరమ్ ।
ప్రస్థాపయత తం శీఘ్రం హిమాలయ గృహం ప్రతి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను

ఆ దేవతలందరు ఆ మాటను విని ఆలోచించుకొని నా సభకు విచ్చేసిరి. వారందరు అచట నున్న నాకు సాదరముగా నమస్కరించి విన్నవించిరి (19). శివనిందను ప్రస్తావించే ఆ దేవతల మాటను విని వేదములను ప్రవర్తిల్ల జేసిన నేను విలపించితిని. ఓ మహర్షీ! అపుడు నేను దేవతలతో నిట్లంటిని (20). వత్సలారా! సంహిప శక్యము కానిది, సంపదలను నశింపజేయునది, ఆపదలకు బీజభూతమైనది అగు శివనిందను నేను చేయజాలను (21). దేవతలారా! కైలాసమునకు పోయి, శంకరుని ప్రసన్నునిగా చేసుకొని,

ఆయనను వెనువెంటనే హిమవంతుని గృహమునకు ప్రయాణము కట్టించుడు (22).

స గచ్ఛేదుప శైలేశ మాత్మనిందాం కరోతు వై ।

పరనిందా వినాశాయ స్వనిందా యశసే మతా॥

శ్రుత్వేతి మద్వచో దేవా మాం ప్రణమ్య ముదా చ తే ।

కైలాసం ప్రయయుశ్శీఘ్రం శైలానామధిపం గిరిమ్ ॥

తత్ర గత్వా శివం దృష్ట్వా ప్రణమ్య నతమస్తకాః ।

సుకృతాంజలయస్సర్వే తుష్టువుస్తం సురా హరమ్ ॥

ఆయన పర్వతరాజు వద్దకు వెళ్లి ఆత్మనిందను చేయుగాక! పరనింద వినాశమును, ఆత్మనింద కీర్తిని కలిగించునని పెద్దలు చెప్పదరు (23). దేవతలు నా ఈ మాటను విని ఆనందముతో నాకు ప్రణమిల్లి పర్వత శ్రేష్ఠమగు కైలాసమునకు వెనువెంటనే పయనమైరి (24). ఆ దేవతలు అచటకు వెళ్లి శివుని చూచిరి. వారందరు తలలు వంచి, చేతులు జోడించి నమస్కరించి శివుని స్తుతించిరి (25).

దేవా ఊచుః ।

దేవ దేవ మహాదేవ కరుణాకర శంకర ।

వయం త్వాం శరణాపన్నాః కృపాం కురు నమోస్తు తే ॥

త్వం భక్తవత్సల స్వామిన్ భక్త కార్య కరస్సదా ।

దీనోద్ధరః కృపాసింధు ర్భక్తాపద్వినిమోచకః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! శంకరా! మేము నిన్ను శరణు జొచ్చితిమి. దయను చూపుము. నీకు నమస్కారమగుగాక! (26) ఓ స్వామీ! నీవు భక్తవత్సలుడవు. ఎల్ల వేళలా భక్తుల కార్యములను సిద్ధింపజేసెదవు. దీనుల నుద్ధరించు దయానిధివి నీవే. నీవు భక్తుల ఆపదలను తొలగించెదవు (27).

బ్రహ్మోవాచ ।

ఇతి స్తుత్వా మహేశానం సర్వే దేవాస్సవాసవాః ।
సర్వం నివేదయాం చక్రుస్తద్వృత్తం తత ఆదరాత్ ॥
తచ్ఛ్రుత్వా దేవవచనం స్వీచకార మహేశ్వరః ।
దేవాన్ సుయాపయా మాస తానాశ్వాస్య విహస్య సః ॥
దేవా ముముదిరే శీఘ్రం సర్వే గత్వా స్వమందిరమ్ ।
సిద్ధం మత్వా స్వకార్యం హి ప్రశంసంత స్సదా శివమ్ ॥
తతస్స భగవాన్ శంభుర్మహేశో భక్తవత్సలః ।
ప్రయయౌ శైల భూపం చ మాయేశో నిర్వికారవాన్ ॥
యదా శైలస్సభామధ్యే సమువాస ముదాన్వితః ।
బంధువర్గైః పరివృతః పార్వతీ సహిత స్స్వయమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇంద్రాది దేవతలందరు మహేశ్వరుని ఇట్లు స్తుతించి, తరువాత జరిగిన వృత్తాంతమునంతనూ సాదరముగా నివేదించిరి (28). దేవతల ఆ మాటలను విని ఆ మహేశ్వరుడు అంగీకరించెను. ఆయన నవ్వి, దేవతలనోదార్చి వారిని పంపివేసెను (29). దేవతలందరు ఆనందించి తమ కార్యము సిద్ధించినదని ఎరింగిన వారై, సదాశివుని కొనియాడుతూ తమ గృహములకు వెళ్లిరి (30). అపుడు భక్తవత్సలుడు, మహేశ్వరుడు, మాయాపతి, వికార రహితుడునగు ఆ శంభు భగవానుడు హిమవంతుని వద్దకు బయలు దేరెను (31). హిమవంతుడు సభామధ్యములో బంధువర్గముతో, స్వయముగా పార్వతితో గూడి ఆనందముగా కొలువు దీరి యుండెను (32).

ఏతస్మిన్నంతరే తత్ర హ్యా జగామ సదాశివః ।
దండీ ఛత్రీ దివ్యవాసా బిభ్రత్తిలకముజ్జ్వలమ్ ॥
కరే స్ఫటికమాలాం చ శాలగ్రామం గలే దధత్ ।
జపన్నామ హరేర్భక్త్యా సాధువేషధరో ద్విజః ॥
తం చ దృష్ట్వా సముత్తస్థౌ సగణోఽపి హిమాలయః ।
ననామ దండవద్భూమౌ భక్త్యా తిథి మపూర్వకమ్ ॥
ననామ పార్వతీ భక్త్యా ప్రాణేశం విప్రరూపిణీమ్ ।
జ్ఞాత్వా తం మనసా దేవీ తుష్టావ పరయా ముదా ॥

ఇంతలో అచటకు సదాశివుడు ఏతెంచెను. ఆయన దండమును, ఛత్రమును పట్టుకొని, దివ్యయమగు వస్త్రములను, ప్రకాశించే తిలకమును ధరించి యుండెను (33). ఆయన చేతిలో స్ఫటికమాలను, మెడలో సాలగ్రామమును ధరించి, హరినామమును భక్తితో జపించు చుండెను. ఆ బ్రాహ్మణుడు సాధువేషమును ధరించి యుండెను (34). ఆయనను చూచి హిమవంతుడు పరివారముతో సహా లేచి నిలబడెను. అపూర్వమగు ఆ అతిథికి భక్తితో సాష్టాంగ నమస్కారము నాచరించెను (35). పార్వతి బ్రాహ్మణ రూపములో నున్న ప్రాణ

ప్రియునకు భక్తితో నమస్కరించెను. ఆ దేవి మనస్సులో ఆయనను గుర్తెరింగి పరమానందముతో స్తుతించెను (36).

ఆశిషం యుయుజే విప్రస్సర్వేషాం ప్రీతిత శ్శివః ।
శివాయా అధికం తాత మనోఖిలక్షితం హృదా ॥
మధు పర్కాదికం సర్వం జగ్రాహ బ్రాహ్మణో ముదా ।
దత్తం శైలాధిరాజేన హిమాంగేన మహాదరాత్ ॥
పప్రచ్ఛ కుశలం చాస్య హిమాద్రిః పర్వతోత్తమః ।
తం ద్విజేంద్రం మహాప్రీత్యా సంపూజ్య విధివన్మునే ॥
పునః పప్రచ్ఛ శైవేశస్తం తతః కో భవానితి ।
ఉవాచ శీఘ్రం విప్రేంద్రో గిరీంద్రం సాదరం వచః ॥

బ్రాహ్మణ వేషధారియగు శివుడు వారందరిని ప్రీతి పూర్వకముగా నాశీర్వదించెను. వత్సా! ఆయన మనస్సులో పార్వతికి, తనకు నచ్చిన ఆశీస్సులను అధికముగా నిచ్చెను (37). ఆ బ్రాహ్మణుడు పర్వతరాజగు హిమవంతునిచే మహాదరముతో నీయబడిన మధుపర్కము మొదలగు అతిథిపూజను పూర్ణముగా స్వీకరించెను (38). ఓ మునీ! పర్వతరాజగు హిమవంతుడు ఆ బ్రాహ్మణోత్తముని మహాప్రీతితో చక్కగా పూజించి కుశలమడిగెను (3 9). తరువాత పర్వతరాజు ఆయనను ' మీరెవరు?' అని ప్రశ్నించెను. ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు వెంటనే సాదరముగా పర్వతరాజుతో నిట్లనెను (40).

విప్రేంద్ర ఉవాచః

బ్రాహ్మణోఽహం గిరిశ్రేష్ఠ వైష్ణవో బుధసత్తమః ।
ఘటికీం వృత్తిమాశ్రిత్య భ్రమామి ధరణీ తలే ॥
మనోయాయీ సర్వగామీ సర్వజ్ఞోఽహం గురోర్బలాత్ ।
పరోపకారీ శుద్ధాత్మ దయాసింధుర్వికారహా ॥
మయా జ్ఞాతం హరాయ త్వం స్వసుతాం దాతుమిచ్ఛసి ।
ఇమాం పద్మ సమాం దివ్యాం వరరూపాం సలక్షణామ్ ॥
నిరాశ్రయాయాసంగాయ కురూపాయాగుణాయ చ ।
శ్మశాన వాసినే వ్యాల గ్రాహిరూపాయ యోగినే ॥

ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడిట్లు పలికెను -

ఓపర్వతరాజా! నేను బ్రాహ్మణుడను, వైష్ణవుడను, మహాపండితుడను. జ్యోతిష వృత్తిని చేపట్టి భూమండలము నందు తిరుగాడు చుందును (41). నేను నాకు నచ్చిన విధముగా తిరిగెదను. అన్ని చోట్లకు వెళ్లుచుందును. గురువు యొక్క అనుగ్రహముచే నాకు సర్వము తెలియును. నేను పరోపకారమును చేయుచుందును. పరిశుద్ధమగు అంతఃకరణము గలవాడను. దయానిధిని. వికారములు లేనివాడను (42). నీవు ఈ పద్మము వంటి దివ్యమైన శ్రేష్ఠరూపము మంచి లక్షణములు గల నీ కుమార్తెను శివునకు ఈయగోరుచున్నావని నాకు

తెలిసినది (43). శివుడు ఆశ్రయము లేనివాడు, సంగవిహీనుడు, కురూపి, గుణహీనుడు, శ్మశానమునందు నివసించువాడు. ఆతని శరీరమును పాములు చుట్టుకొని యుండును. ఆయన యోగి (44).

దిగ్వాససే కుగా త్రాయ వ్యాల భూషణ ధారిణే ।
అజ్ఞాతకుల నామ్నే చ కుశీలాయావిహారిణే ।
విభూతి దిగ్ధదేహాయ సంక్రుద్ధా యావివేకినే ।
అజ్ఞాతవయసేఽ తీవ కుజటా ధారిణే సదా ॥
సర్వాశ్రయాయ భ్రమిణే నాగహారాయ భిక్షవే ।
కుమార్గ నిరతాయాథ వేదాధ్వత్యాగినే హఠాత్ ॥
ఇయం తే బుద్ధి రచల నహి మంగలదా ఖలు ।
విబోధ జ్ఞానినాం శ్రేష్ఠ నారాయణకులో ధ్రువ ॥

దిక్కులే వస్త్రముగా గలవాడు, చెడు రూపము గలవాడు, పాములను ఆభరణములుగా ధరించువాడు, కులనామముల నెరుంగనివాడు, చెడు శీలము గలవాడు, విహారము నెరుంగనివాడు (45), విభూతి లేపనముతో గూడిన దేహము గలవాడు, క్రోధ స్వభావుడు, వివేకము లేనివాడు, వయస్సు నెరుంగని వాడు, సర్వదా చిక్కు బడిన జటలను ధరించువాడు (46), సర్వమును ఆశ్రయించి తిరుగువాడు, పాములు హారముగా గలవాడు, భిక్షుకుడు, చెడు మార్గమునందు ప్రీతి గలవాడు, దురహంకారముచే వేదమార్గమును వీడినవాడు (47) అగు శివునకు పార్వతి నీయవలెననే నీ ఈ బుద్ధి మంగళదాయకము కాదు సుమా! హే పర్వతరాజా! నీవు జ్ఞానులలో శ్రేష్ఠుడవు. నారాయణుని కులమునందు జన్మించిన వాడవు. తెలుసుకొనుము (48).

న తే పాత్రానురూపశ్చ పార్వతీ దాన కర్మణి ।
మహాజన స్స్మేరముఖ శ్రుతమాత్రాద్భ విష్యతి ॥
పశ్య శైలాధిపత్యం చ న తస్మైకోఽస్తి బాంధవః ।
మహారత్నాకరస్త్వం చ తస్మై కించిద్ధనం న హి ॥
బాంధవాన్ మేనకాం కుద్రపతే శీఘ్రం సుతాంస్తథా ।
సర్వాన్ పృచ్ఛ ప్రయత్నేన పండితాన్ పార్వతీం వినా ॥
రోగిణా నౌషధం శశ్వ ద్రోచతే గిరిసత్తమ ।
కు పథ్యం రోచతేఽ తీక్ష్ణం మహాదోషకరం సదా ॥

నీవు పార్వతిని దానము చేయుటకు తగిన పాత్ర ఆయన కాదు. ఈ విషయము(ను విన్నంతనే మహా జనులు నవ్వేదరు (49). ఓ పర్వతరాజా! గమనించుము. ఆయనకు బంధువు ఒక్కడైననూ లేడు. నీవు మహారత్నములకు నిధివి. ఆయన వద్ద ధనము లవమైననూ లేదు (50). ఓ పర్వత రాజా! బంధువులను, మేనకను, కుమారులను, మరియు ఇతరులనందరినీ శ్రద్ధతో అడిగి చూడుము. పండితులను కూడ ప్రశ్నించుము. కాని పార్వతిని ప్రశ్నించవద్దు (51). ఓ పర్వతరాజా! ఏనాడైననూ రోగికి మందు రుచించదు. రోగికి అన్నివేళలా మహాదోషకరమగు చెడు పథ్యము బాగుగా రుచించును (52).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా బ్రాహ్మణః శీఘ్రం స వై భుక్త్వా ముదాన్వితః ।
జగామ స్వాలయం శాంతో నానా లీలాకరశ్శివః ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే
శివమాయా వర్ణనం నామ ఏకత్రింశోఽధ్యాయః ॥

ఆ బ్రాహ్మణుడిట్లు పలికి ఆనందముగా భుజించి శీఘ్రమే నిర్గమించెను. అనేక లీలలను ప్రదర్శించు శివుడు శాంతముగా తన ధామమునకు చేరుకొనెను (53).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతి ఖండలో శివమాయావర్ణనమనే ముప్పది ఒకటవ అధ్యాయము ముగిసినది (31).

32 - సప్తర్షుల రాక

బ్రహ్మోవాచ ।

బ్రాహ్మణస్య వచశ్శ్రుత్వా మేనోవాచ హిమాలయమ్ ।
శోకేనా సాధునయనా హృదయేన విదూయతా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

బ్రాహ్మణుని మాటలను వినిన మేన శోకముచే ఎర్రబడిన కన్నులు గలదై దుఃఖించు చున్న హృదయముతో హిమవంతుని ఉద్దేశించి ఇట్లు పలికెను (1).

మేనోవాచ।

శృణు శైలేంద్ర మద్వాక్యం పరిణామే శుభావహమ్ ।
పృచ్ఛ శైవవరాన్ సర్వాన్ కి ముక్తం బ్రాహ్మణేన హ ॥
నిందానేన కృతా శంభోర్వైష్ణవేన ద్విజన్మనా।
శ్రుత్వా తాం మే మనోఽ తీవ నిర్విణ్ణం హి నగేశ్వర ॥
తస్మై రుద్రాయ శైలేశ న దాస్యామి సుతామహమ్ ।
కురూపశీలినే మే హి సులక్షణయుతాం నిజామ్ ॥
నమన్యసే వచో చేన్మే మరిష్యామి న సంశయః ।
త్యక్ష్యామి చ గృహం సద్యో భక్షయిష్యామి వా విషమ్ ॥

మేన ఇట్లు పలికెను -

ఓ పర్వతరాజా! పరిణామము నందు సుఖమును కలిగించే నా మాటను వినుము. శివభక్తులనందరినీ అడిగి తెలుసుకొనుము. ఈ బ్రాహ్మణుడు చెప్పినది ఏమి? (2) ఈ వైష్ణవ బ్రాహ్మణుడు శివుని నిందించినాడు. ఓ పర్వత రాజా! ఆ నిందను విన్న నా మనస్సు మిక్కిలి నిరాశను పొందియున్నది (3). ఓ శైలరాజా! నేను మంచి లక్షణములతో గూడియున్న నా కుమార్తెను చెడు రూపము, శీలము గల ఆ రుద్రునకు ఈయను (4). నీవు నా మాటను విననిచో నేను నిస్సందేహముగా మరణించెదన విడిచి పెట్టెదను. లేదా, విషమును భుజించెదను (5).

గలే బద్ధ్వాంబికాం రజ్జ్వా యాస్యామి గహనం వనమ్ ।
మహోంబుధే మజ్జయిష్యే తస్మై దాస్యామి నో సుతామ్ ॥
ఇత్యుక్త్వాశు తథా గత్వా మేనా కోపాలయం శుచా ।
త్యక్త్వా హారం రుదంతీ సా చకార శయనం భువి ॥
ఏతస్మిన్నంతరే తాత శంభునా సప్త ఏవ తే ।
సంస్మృతా ఋషయస్సద్యో విరహవ్యాకులాత్మనా ॥
ఋషయశ్చైవ తే సర్వే శంభునా సంస్మృతా యదా ।
తదాఽఽ జగ్ము స్స్వయం సద్యః కల్ప వృక్షా ఇవాపరే ॥

అమ్మాయిని త్రాటితో మెడకు కట్టుకొని దట్టమైన అడవికి పోయెదను. లేదా మహాసముద్రములో ముంచెదను. కాని అమ్మాయిని వానికి ఈయను (6). ఇట్లు పలికి మేన వెంటనే దుఃఖముతో కోప గృహమునకు వెళ్లి ఆభరణములను వీడి ఏడుస్తూ నేలపై పరుండెను (7). ఓ కుమారా! ఇంతలో విరహముచే దు:ఖితమైన మనస్సు గల శంభుడు వెంటనే సప్తర్షులను స్మరించెను (8). శంభుడు స్మరించినంతనే అపర కల్ప వృక్షముల వంటి ఆ ఋషులందరూ మరుక్షణంలో అచటకు స్వయముగా విచ్చేసిరి (9).

అరుంధతీ తథాయాతా సాక్షాత్సిద్ధిరివాపరా ।
తాన్ దృష్ట్వా సూర్య సంకాశాన్ విజహౌ స్వజపం హరః ॥
స్థిత్వాగ్రే ఋషయ శ్రేష్ఠం నత్వా స్తుత్వా శివం మునే ।
మేనిరే చ తదాత్మానం కృతార్థం తే తపస్వినః ॥
తతో విస్మయమాపన్నా నమస్కృత్య స్థితాః పునః ।
ప్రోచుః ప్రాంజలయస్తే వై శివం లోక నమస్కృతమ్ ॥

మరియు అపరసిద్ధివలె నున్న అరుంధతి కూడ వచ్చెను. సూర్యునివలె విరాజిల్లుచున్న వారిని చూచి శివుడు తన జపమును ఆపెను (10). ఓ మహర్షీ! తపశ్శాలురగు ఆ ఋషులు శ్రేష్ఠుడగు శివుని యెదుట నిలబడి ఆయనకు నమస్కరించి స్తుతించి కృతార్థులమైతిమని భావించిరి (11). పిమ్మట ఆశ్చర్య చకితులైన ఆ ఋషులు లోకవందితుడగు శివుని మరల నమస్కరించి చేతులు జోడించి ఇట్లు పలికిరి (12).

ఋషయ ఊచుః ।

సర్వోత్కృష్టం మహారాజ సార్వభౌమ దివౌకసామ్ ।
స్వభాగ్యం వర్ణ్యతేఽస్మాభిః కిం పునస్సకలోత్తమమ్ ॥
తపస్తప్తం త్రిధా పూర్వం వేదాధ్యయన ముత్తమమ్ ।
అగ్నయశ్చ హుతాః పూర్వం తీర్థాని వివిధాని చ ॥
వాఙ్మనః కాయజం కించిత్ పుణ్యం స్మరణ సంభవమ్ ।
తత్సర్వం సంగతం చాద్య స్మరణాను గ్రహాత్తవ ॥
యో వై భజతి నిత్యం త్వాం కృతకృత్యో భవేన్నరః ।
కిం పుణ్యం వర్ణ్యతే తేషాం యేషాం చ స్మరణం తవ ॥

ఋషులిట్లు పలికిరి -

మహారాజా! దేవతాసార్వభౌమా! సర్వోత్తమమగు మా భాగ్యమును మేము ఏమని వర్ణింపగలము ? (13) పూర్వము శరీరవాఙ్మనస్సులచే తపస్సును చేసితిమి. ఉత్తమమగు వేదాధ్యయనమును చేసితిమి. అగ్నిహోత్రమును చేసితిమి. వివిధ తీర్థములను సేవించితిమి (14). శరీరవాఙ్మనస్సులచే చేసిన పుణ్యము, నిన్ను స్మరించుటచే కలిగిన పుణ్యము అంతయూ జతగూడి నీవు మమ్ములను స్మరించుట అను భాగ్యము మాకీ నాడు కలిగినది (15). నిన్ను ప్రతిదినము స్మరించు మానవుడు కృతార్థుడగును. నీచే స్మరింపబడు వారి యొక్క పుణ్యమును ఏమని వర్ణించదగును ? (16)

సర్వోత్కృష్టా వయం జాతాస్స్మరణాత్తే సదాశివ ।

మనోరథ పథం నైవ గచ్ఛసి త్వం కథంచన ॥

వామనస్య ఫలం యద్వజ్ఞ్నాంధస్య దృశౌ యథా ।

వాచాలత్వం చ మూకస్య రంకస్య నిధిదర్శనమ్ ॥

పంగోర్గిరి వరాక్రాంతిర్వంధ్యాయాః ప్రసవస్తథా ।

దర్శనం భవతస్తద్వజ్జాతం నో దుర్లభం ప్రభో ॥

అద్య ప్రభృతి లోకేషు మాన్యాః పూజ్యా మునీశ్వరాః ।

జాతాస్తే దర్శనా దేవ స్వముచ్చైః పదమాశ్రితాః ॥

ఓ సదాశివా! నీవు స్మరించుటచే మేము అందరిలో గొప్పవారమైతిమి. నిన్ను మనస్సులో, స్మరించుట, యైననూ మానవులకు దుర్లభము (17). పొట్టి వానికి పండు అందినట్లు, పుట్టుగుడ్డికి కళ్లు కనబడినట్లు, మూగివానికి మాటలాడుట వచ్చినట్లు, దరిద్రునకు నిధి లభించినట్లు (18), కుంటివాడు గొప్ప పర్వతమును అతిక్రమించినట్లు, గొడ్రాలికి సంతానము కలిగినట్లు, మాకు దుర్లభమగు నీ దర్శనము కలిగినది. హే ప్రభో! (19) ఈనాటి నుండి మేము లోకములో పూజింపబడెదము. గొప్ప మునులచే మాన్యతను పొందెదము. నీ దర్శనము చేత మాకు ఉన్నత పదము లభించినది (20).

అత్ర కిం బహునోక్తేన సర్వథా మాన్యతాం గతాః ।

దర్శనాత్తవ దేవేశ సర్వదేవేశ్వరస్య హి ॥

పూర్ణానాం కిం చ కర్తవ్యమస్తి చేత్పరమా కృపా ।

సదృశం సేవకానాం తు దేయం కార్యం త్వయా శుభమ్ ॥

ఈ విషయములో పెక్కు మాటలేల ? మాకు అన్నివిధములా మాన్యత కలిగినది. దేవతలందరికి ఈశ్వరుడవగు నీ దర్శనముచే పూజ్యత కలిగినది. ఓ దేవ దేవా! (21) పూర్ణులకు కర్తవ్యమేమి ఉండును? నీకు దయ ఉన్నచో సేవకులకు ఈయదగిన శుభకార్యమును మాకు అప్పజెప్పుము (22).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా తేషాం శంభుర్మహేశ్వరః ।

లౌకికాచార మాశ్రిత్య రమ్యం వాక్యముపాదదే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మహేశ్వరుడగు శంభుడు వారి ఈ మాటలను విని లోకాచారము ననుసరిస్తూ అందమగు వాక్యము నిట్లు పలికెను (23).

శివ ఉవాచః

ఋషయశ్చ సదా పూజ్యా భవంతశ్చ విశేషతః ।
యుష్మాకం కారణాద్వి ప్రాః స్మరణం చ మయా కృతమ్ ॥
మమావస్థా భవద్భిశ్చ జ్ఞాయతే హ్యుపకారికా ।
సాధనీయా విశేషేణ లోకానాం సిద్ధిహేతవే ॥
దేవానాం దుఃఖముత్పన్నం తారకాత్తు దురాత్మనః ।
బ్రహ్మణా చ వరో దత్తః కిం కరోమి దురాసదః ॥
మూర్తయోఽష్టౌ హి చ యాః ప్రోక్తా మదీయాః పరమర్షయః ।
తాస్సర్వా ఉపకారాయ న తు స్వార్థాయ తత్ స్ఫుటమ్ ॥

శివుడిట్లు పలికెను -

ఋషులు సర్వదా పూజనీయులు. మీరు మరింత పూజనీయులు. ఓ విప్రులారా! నేను ఒక కారణముచే మిమ్ములను స్మరించితిని (24). నేను లోకములకు సిద్ధిని కలిగించి ఉపకారమును చేయుటకు నడుము కట్టి యుందునని మీరెరుంగుదురు (25). దుర్మార్గుడగు తారకుని వలన దేవతలకు దుఃఖము సంప్రాప్తమైనది. బ్రహ్మ అతిక్లిష్టమగు వరము నిచ్చినాడు. నేనేమి చేయుదును? (26) ఓ మహర్షులారా! నా ఎనిమిది మూర్తులు లోక ప్రసిద్ధములై యున్నవి. అవి లోకముల ఉపకారము కొరకే గాని, నా స్వార్థము కొరకు గాదని స్పష్టమే (27).

తథా చ కర్తు కామోఽహం వివాహం శివయా సహ ।
తయా వై సుతపస్తప్తం దుష్కరం పరమర్షిభిః ॥
తస్యై పరం ఫలం దేయమభీష్టం తద్ధితావహమ్ ।
ఏతాదృశః పణో మే హి భక్తానంద ప్రదస్స్ఫుటమ్ ॥
పార్వతీ వచనాద్భిక్షురూపో యాతో గిరేర్గృహమ్ ।
అహం పాలితవాన్ కాలీం యతో లీలా విశారదః ॥
మాం జ్ఞాత్వా తౌ పరం బ్రహ్మ దంపతీ పరభక్తితః ।
దాతుకామావభూతాం చ స్వసుతాం వేదరీతితః ॥

ఆ కారణముగనే నేను శివాదేవిని వివాహమాడ గోరితిని. ఆమె మహర్షులు కూడ చేయరాని గొప్ప తపస్సును చేసినది (28). ఆమెకు అభీష్టము, హితకరము అగు పరమఫలము నీయవలసి యుండెను. భక్తులకు ఆనందమును కలిగించుట నా ప్రతిజ్ఞయని స్పష్టమే గదా! (29) పార్వతి యొక్క మాటను అనుసరించి నేను భిక్షురూపముతో హిమవంతుని గృహమునకు వెళ్లితిని. లీలా పండితుడనగు నేను ఆ కాళి మాటను నిలబెట్టితిని (30). ఆ దంపతులు నన్ను పరబ్రహ్మయని గుర్తించి పరమభక్తితో తమ కుమార్తెను వేదోక్త విధిగా నాకీయ గోరిరి (31).

దేవ ప్రేరణయాహం వై కృతవానస్మి నిందనమ్ ।

తదా స్వస్య చ తద్భక్తిం విహంతుం వైష్ణవాత్మనా॥

తచ్ఛ్రుత్వా తౌ సునిర్విణ్ణౌ తద్దీనౌ సంబభూవతుః ।

స్వకన్యాం నేచ్ఛతో దాతుం మహ్యం హి మునయోఽధునా ॥

తస్మాద్భవంతో గచ్ఛంతు హిమాచల గృహం ధ్రువమ్ ।

తత్ర గత్వా గిరివరం తత్పత్నీం చ ప్రబోధయ ॥

కథనీయం ప్రయత్నేన వచనం వేద సమ్మితమ్ ।

సర్వథా కరణీయం తద్యథా స్యాత్కార్యముత్తమమ్ ॥

నేను దేవతల ప్రేరణచే శివనిందను చేసితిని. వారి భక్తిని చెడగొట్టుటకై నేను వైష్ణవ రూపమును ధరించి అట్లు చేసితిని (32). వారా నిందను విని మిక్కిలి నిర్వేదమును పొంది భక్తిని గోల్పోయిరి. ఇపుడు వారు నాకు తమ కన్యను ఈయనిచ్ఛగించుటలేదు. ఓ మునులారా! (33) కావున మీరు హిమవంతుని గృహమునకు వెళ్లి ఆ పర్వతరాజునకు, ఆయన భార్యకు హితము నుపదేశించుడు (34). వారికి వేదతుల్యమగు ఉపదేశమును ప్రయత్నపూర్వకముగా చేయుడు. ఈ ఉత్తమ కార్యము తప్పక సఫలమగునట్లు చేయుడు (35).

ఉద్వాహం కర్తు మిచ్ఛామి తత్పుత్ర్యా సహ సత్తమాః ।

స్వీకృతస్త ద్వివాహో మే వరో దత్తశ్చ తాదృశః ॥

అత్ర కిం బహునోక్తే న బోధనీయో హిమాలయః ।

తథా మేనా చ బోద్ధ వ్యా దేవానాం స్యాద్ధితం యథా ॥

భవద్భిః కల్పితో యో వై విధిస్స్యా దధికస్తతః ।

భవతాం చైవ కార్యం తు భవంతః కార్యభాగినః ॥

ఓ మహర్షులారా! వారి పుత్రికను నేను వివాహమాడ గోరుచున్నాను. ఈ వివాహము నాకంగీకారమే. బ్రహ్మ అట్టి వరమును ఇచ్చి యున్నాడు (36). ఈ విషయములో అధిక ప్రసంగముతో పని యేమి గలదు? మీరు మేనా హిమవంతులకు బోధించి దేవతలకు హితమును చేగూర్చుడు (37). మీచే కల్పించబడిన కన్యావరణ విధికంటె అధికమగు వరణమును చేసినట్లగును. ఇది మీ కార్యమే గనుక, దీనిని సిద్ధింపజేయుటలో మీ భాగము ఉండవలెను (38).

బ్రహ్మోవాచ ।

ఇత్యేవం వచనం శ్రుత్వా మునయస్తేఽ మలాశయాః ।
ఆనందం లేభిరే సర్వే ప్రభుణానుగ్రహీకృతాః ॥
వయం ధన్యా అభూవంశ్చ కృతకృత్యాశ్చ సర్వథా ।
వంద్యా జాతాశ్చ సర్వేషాం పూజనీయా విశేషతః ॥
బ్రహ్మణా విష్ణునా యో వై వంద్యస్సర్వార్థ సాధకః ।
సోఽ స్మాన్ ప్రేషయతే ప్రేష్యాన్ కార్యే లోకసుఖావహే ॥
అయం వై జగతాం స్వామీ పితా సా జననీ మతా ।
అయం యుక్తశ్చ సంబంధో వర్ధతాం చంద్రవత్సదా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పవిత్రమగు హృదయము గలవారు, ప్రభుని అనుగ్రహమును పొందినవారు అగు ఆ మునులందరు ఈ మాటలను విని ఆనందమును పొందిరి (39). మేము ధన్యులము, అన్ని విధములా కృతకృత్యులము అయినాము. మేము అందరికీ ప్రత్యేకించి వందనీయులము, పూజింపదగినవారము అయినాము (40). బ్రహ్మ విష్ణువులచే నమస్కరింపబడు వాడు, సర్వకార్యములను సిద్ధింప జేయువాడు అగు శివుడు, లోకములకు సుఖమును కలుగజేయు కార్యమునకు పంపదగినవారము మేము అని తలంచి మమ్ములను పంపుచున్నాడు (41). ఈ శివుడు లోకములకు ప్రభువు, తండ్రి. ఆమె తల్లి. ఈ యోగ్యమగు సంబంధము శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమానమగు గాక! (42)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా హ్యృషయో దివ్యా నమస్కృత్య శివం తదా ।
గతా ఆకాశమార్గేణ యత్రాస్తి హిమవత్పురమ్ ॥
దృష్ట్వా తాం చ పురీం దివ్యామృషయస్తేఽ తివిస్మితాః ।
వర్ణయంతశ్చ స్వం పుణ్య మబ్రువన్ వై పరస్పరమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ దేవర్షులు అపుడు శివునకు నమస్కరించి ఆకాశమార్గముచే హిమవంతుని రాజధానికి వెళ్లిరి (43). ఆ ఋషులు ఆ దివ్య నగరమును చూచి మిక్కిలి ఆశ్చర్యమును పొంది వారిలో వారు తమ భాగ్యమును ఇట్లు వర్ణించిరి. (44).

ఋషయ ఊచుః ।

పుణ్యవంతో వయం ధన్యా దృష్ట్వై తద్ధిమవత్పురమ్ ।
యస్మాదేవం విధే కార్యే శివేనైవ నియోజితాః ॥
అలకాయాశ్చ స్వర్గా చ్చ భోగవత్యా స్తథా పునః ।
విశేషేణామరావత్యా దృశ్యతే పురముత్తమమ్ ॥
సుగృహాణి సురమ్యాణి స్ఫటికైర్వివిధైర్వరైః ।
మణిభిర్వా విచిత్రాణి రచితాన్యంగణాని చ ॥
సూర్య కాంతాశ్చ మణయశ్చంద్ర కాంతాస్త థైవ చ ।
గృహే గృహే విచిత్రాశ్చ వృక్షా స్స్వర్గ సముద్భవాః ॥

ఋషులిట్లు పలికిరి -

మనము ఈ హిమవంతుని రాజధానిని దర్శించుట, శివుడు స్వయముగా ఇట్టి కార్యమునందు మనలను నియోగించుట మన పుణ్యము. మనము ధన్యులము (45). ఈ నగరము అలకానగరము కంటె, స్వర్గము కంటె, భోగవతీ నగరము కంటె, మరియు అమరావతి కంటె ఉత్తమమైనదిగా కన్పట్టుచున్నది (46). గృహములు అందముగ నున్నవి. వాకిళ్లు వివిధములగు శ్రేష్ఠ స్ఫటికములతో, మరియు మణులతో పొదుగబడి రంగులనీను చున్నవి (47). ప్రతిగృహమునందు సూర్యకాంతమణులు, చంద్రకాంతమణులు, మరియు స్వర్గమునందు పెరిగే విచిత్రములగు వృక్షములు గలవు (48).

తోరణానాం తథా లక్ష్మీర్దృశ్యతే చ గృహే గృహే ।
వివిధాని విచిత్రాణి శుకహంసై ర్విమానకైః ॥
వితానాని విచిత్రాణి చైలవత్తో రణై స్సహ ।
జలాశయాన్యనేకాని దీర్ఘికా వివిధా స్స్థితాః ॥
ఉద్యానాని విచిత్రాణి ప్రసూనైః పూజితాన్యథ ।
నరాశ్చ దేవతాస్సర్వే స్త్రియశ్చా ప్సరసస్తథా ॥
కర్మ భూమౌ యాజ్ఞికాశ్చ పౌరాణాస్స్వర్గ కామ్యయా ।
కుర్వంతి తే వృథా సర్వే విహాయ హిమవత్పురమ్ ॥

ప్రతిగృహమునందు తోరణములు శోభిల్లుచుండెను. గృహములు చిలుకలతో, హంసలతో, విమానములతో చిత్ర విచిత్రములగు రంగులతో విరాజిల్లెను (49). రంగు రంగుల వస్త్రముల తోరణములతో గూడి వితానములు (బాల్కనీలు) ప్రకాశించెను. అనేక జలాశయములు, వివిధములగు దిగుడు బావులు గలవు (50). ఉద్యానములు రంగు రంగుల పుష్పములతో ప్రకాశించేను. అచటి పురుషులందరు దేవతలు. స్త్రీలందరు అప్సరసలు (51). కర్మభూమియందు యాజ్ఞికులు, పౌరాణికులు హిమవంతుని రాజధానిని వీడి స్వర్గము కొరకై వ్యర్థముగా యజ్ఞాదుల ననుష్ఠించుచున్నారు (52).

యావన్న దృష్టమేతచ్చ తావత్స్వర్గపరా నరాః ।

దృష్టమేతద్య దా విప్రాః కిం స్వ ర్గేణ ప్రయోజనమ్ ॥

ఇది కంటబడనంత వరకు మాత్రమే మానవులు స్వర్గమును కోరెదరు. ఓ విప్రులారా! దీనిని చూచిన తరువాత స్వర్గముతో ప్రయోజనమేమున్నది? (53)

బ్రహ్మోవాచ ।

ఇత్యేవ మృషి వర్యాస్తే వర్ణయంతః పురం చయత్ ।

గతా హైమాలయం సర్వే గృహం సర్వ సమృద్ధిమత్ ॥

తాన్ దృష్ట్వా సూర్యసంకాశాన్ హిమవాన్ విస్మితోఽ బ్రవీత్ ।

దూరాదాకాశమార్గస్థాన్ మునీన్ సప్త సుతేజసః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ ఋషి శ్రేష్ఠులు ఆ నగరమునిట్లు వర్ణిస్తూ సర్వసంపదలతో విలసిల్లే హిమవంతుని గృహమునకు వారందరు వెళ్లిరి (54). దూరములో ఆకాశమునందు గొప్ప తేజస్సుతో సూర్యుని వలె వెలుగొందే ఆ ఏడ్గురు మునులను చూచి చకితుడైన హిమవంతుడిట్లనెను (55).

హిమవానువాచ ।

సప్తైతే సూర్యసంకాశా స్సమాయాంతి మదంతికే ।

పూజా కార్యా ప్రయత్నేన మునీనాం చ మయాధునా ॥

వయం ధన్యా గృహస్థాశ్చ సర్వేషాం సుఖదాయినః ।

యేషాం గృహే సమాయాంతి మహాత్మానో యదీదృశాః ॥

హిమవంతుడిట్లు పలికెను -

సూర్యుని వలె వెలుగొందు ఈ ఏడ్గురు నా వద్దకు వచ్చుచున్నారు. నేనీ మహర్షులకు ఇప్పుడు శ్రద్ధగా పూజను చేయవలెను (56). ఇట్టి మహాత్ములు ఎవరి ఇంటికి విచ్చేయుదురో, అట్టి గృహస్థులగు మనము ధన్యులము. వీరు అందరికీ సుఖమునిచ్చేదరు (57).

బ్రహ్మోవాచ ।

ఏతస్మిన్నంతరే చైవాకాశాదేత్య భువి స్థితాన్ ।
సమ్ముఖే హిమవాన్ దృష్ట్వా యయౌ మానపురస్సరమ్ ॥
కృతాంజలిర్నతస్కంధస్సప్తర్షీన్ సుప్రణమ్య సః ।
పూజాం చకార తేషాం వై బహుమాన పురస్సరమ్ ॥
హితాస్సప్తర్షయస్తే చ హిమవంతం నగేశ్వరమ్ ।
గృహిత్వోచుః ప్రసన్నాస్యా వచనం మంగలాలయమ్ ॥
యథా గ్రతశ్చ తాన్ కృత్వా ధన్యో మమ గృహాశ్రమః ।
ఇత్యుక్త్వా సన మానీయ దదౌ భక్తి పురస్సరమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇంతలోనే ఆకాశమునుండి భూమిపైకి దిగి ఎదురుగా నిలబడిన ఆ ఋషులను చూచి హిమవంతుడు సన్మాన పూర్వకముగా ఎదురేగెను (58). చేతులు జోడించి తలను వంచి ఆయన సప్తర్షులకు నమస్కరించి వారికి బహుమాన పూర్వకముగా పూజను చేసెను (59). హితమును చేయు ఆ సప్తర్షులు పర్వతరాజగు హిమవంతుని పట్టుకొని ప్రసన్నమగు ముఖముగలవారై మంగళములకు నిలయములగు వచనములను పలికిరి (60). వారిని ముందిడుకొని హిమవంతుడు 'నా గృహస్థాశ్రమము ధన్యమైనది' అని పలికి వారికి భక్తి పురస్సరముగా ఆసనమును సమర్పించెను (61).

ఆసనేషూపవిష్టేషు తదాజ్ఞప్త స్స్వయం స్థితః ।
ఉవాచ హిమవాంస్తత్ర మునీన్ జ్యోతిర్మయాం స్తదా ॥

తేజో మూర్తులగు ఆ మునులు ఆసనములందు కూర్చున్న వారై ఆజ్ఞాపించగా, హిమవంతుడు తాను నిలబడియున్నవాడై ఇట్లు పలికెను (62).

హిమాలయ ఉవాచః

ధన్యో హి కృతకృత్యోఽహం సఫలం జీవితం మమ ।
లోకేషు దర్శనీయోఽహం బహుతీర్థ సమో మతః ॥
యస్మాద్భవంతో మద్గేహమాగతా విష్ణు రూపిణః ।
పూర్ణానాం భవతాం కార్యం కృపణానాం గృహేషు కిమ్ ॥
తథాపి కించిత్కార్యం చ సదృశం సేవకస్య మే ।
కథనీయం సుదయయా సఫలం స్యాజ్జనుర్మమ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే సప్తర్ష్యా
గమన వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥

హిమవంతుడిట్లు పలికెను -

నేను ధన్యుడను. కృతకృత్యుడను. నా జీవితము సఫలమైనది. ప్రజలు నన్ను అనేక తీర్థములతో సమానముగా భావించి దర్శించెదరు (63). ఏలయనగా, విష్ణుస్వరూపులగు మీరు నా గృహమునకు విచ్చేసితిరి. పూర్ణులగు మీకు దీనులగు గృహస్థుల గృహములలో కార్యము ఏమి ఉండును? (64) అయిననూ, దయచేసి సేవకుడునగు నాకు తగిన ఏదో ఒక పనిని చెప్పుడు. నా జన్మ సఫలము కాగలదు (65).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు సప్తర్షుల రాకను వర్ణించే ముప్పది రెండవ అధ్యాయము ముగిసినది (32).

33- సప్తర్షుల ఉపదేశము

ఋషయ ఊచుః ।

జగత్పితా శివః ప్రోక్తో జగన్మాతా శివా మతా ।
తస్మాద్దేయా త్వయా కన్యా శంకరాయ మహాత్మనే ॥
ఏవం కృత్వా హిమగిరే సార్థకం తే భవేజ్జనుః ।
జగద్గురో ర్గురుస్త్వం హి భవిష్యసి న సంశయః ॥

ఋషులిట్లు పలికిరి -

శివుడు జగములకు తండ్రి అనియు, శివాదేవి తల్లి అనియు పెద్దలు చెప్పెదరు. కావున నీవు కన్యను మహాత్ముడగు శంకరునకిమ్ము (1). ఓ హిమగిరీ! ఇట్లు చేసినచో నీ జన్మ సార్థకమగును. నీవు జగద్గురువునకు గురువు కాగలవు. సందేహము లేదు (2).

బ్రహ్మోవాచ ।

ఏవం వచన మాకర్ణ్య సప్తర్షీణాం మునీశ్వర ।
ప్రణమ్య తాన్ కరౌ బద్ధ్వా గిరిరాజోఽ బ్రవీదిదమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! హిమవంతుడు సప్తర్షుల ఈ మాటలను విని వారికి చేతులు జోడించి నమస్కరించి ఇట్లు పలికెను (3).

హిమాలయ ఉవాచః

సప్తర్షయో మహాభాగా భవద్భిర్యదుదీరితమ్ ।
తత్ప్రమాణీకృతం మే హి పురైవ గిరిశేచ్ఛయా ॥
ఇదానీ మేక ఆగత్య విప్రో వైష్ణవధర్మవాన్ ।
శివముద్దిశ్య సుప్రీత్యా విపరీతం వచోఽ బ్రవీత్ ॥
తదారభ్య శివామాతా జ్ఞాన భ్రష్టా బభూవ హ ।
సుతావివాహం రుద్రేణ యోగినా తేన నేచ్ఛతి ॥

హిమవంతుడిట్లు పలికెను -

మహాత్ములారా! సప్తర్షులారా! శివుని ఆజ్ఞచే మీరు చెప్పిన మాట పూర్వమే నా◌ాచేత ప్రమాణముగా స్వీకరింపబడినది (4). ఇప్పుడే ఒక వైష్ణవధర్మానుయాయి అగు బ్రాహ్మణుడు వచ్చి శివుని ఉద్దేశించి విపరీతమగు మాటలను మహా ప్రీతితో పలికినాడు (5). అప్పటి నుండియూ పార్వతి తల్లి జ్ఞాన భ్రష్టురాలై యోగియగు రుద్రునితో పార్వతి యొక్క వివాహమునకు అంగీకరించుట లేదు (6).

కోపాగారమగాత్సా హి సుతప్తా మలినాంబరా ।
కృత్వా మహోహఠం విప్రా బోధ్యమానాపి నాబుధత్ ॥
అహం చ జ్ఞాన విభ్రష్టో జాతోఽ హం సత్యమీర్యతే ।
దాతుం సుతాం మహేశాయ నేచ్ఛామి భిక్షు రూపిణే ॥

ఆమె మిక్కిలి దుఃఖితురాలై మాసిన వస్త్రములను ధరించి కోపగృహములో ప్రవేశించినది. ఓ ఋషులరా! బోధించిననూ ఆమె తెలుసు కొనుటలేదు. ఆమె చాల మొండి పట్టుతో నున్నది (7). నేను కూడ జ్ఞానము కోల్పోతిని. నేను సత్యమునే పలుకుచున్నాను. భిక్షురూపధారియగు మహేశ్వరునకు కుమార్తెను ఇచ్చుట నాకు ఇచ్చగించుట లేదు (8).

బ్రహ్మోవాచ।

ఇత్యుక్త్వా శైలరాజస్తు శివమాయా విమోహితః ।
తూష్ణీం బభూవ తత్రస్థో మునీనాం మధ్యతో మునే ॥
సర్వే సప్తర్షయస్తే హి శివపూయాం ప్రశస్య వై ।
ప్రేషయామాసురథ తాం మేనకాం ప్రత్యరుంధతీమ్ ॥
అథ పత్యుస్సమాదాయ నిదేశం జ్ఞానదా హి సా ।
జగామారుంధతీ తూర్ణం యత్ర మేనా చ పార్వతీ ॥
గత్వా దదర్శ మేనాం తాం శయానాం శోకమూర్ఛితామ్ ।
ఉవాచ మధురం సాధ్వీ సావధాన హితం వచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! శివమాయచే విమోహితుడైన పర్వతరాజు మునుల యెదుట నిలబడి ఇట్లు పలికి మిన్నకుండెను (9). ఆ ఏడ్గురు ఋషులు శివమాయను కొనియాడి, పిదప అరుంధతిని మేనక వద్దకు పంపిరి (10). జ్ఞానమును ఇచ్చే ఆ అరుంధతి భర్త అజ్ఞను గైకొని, వెంటనే పార్వతి మరియు మేన ఉన్నచోటకు వెళ్లెను (11). ఆమె అచటకు వెళ్లి శోకముచే పరాభూతయై పరుండియున్న మేనను చూచెను. అపుడా సాధ్వి మెల్లగా మధురము, హితమునగు వచనము నిట్లు పలికెను (12).

అరుంధత్యువాచ ।

ఉత్తిష్ఠ మేనకే సాధ్వి త్వద్గృహేఽ హమరుంధతీ ।
ఆగతా మునయశ్చాపి సప్తాయాతాః కృపాలవః ॥

అరుంధతి ఇట్లు పలికెను -

ఓ మేనకా! సాధ్వీ! లెమ్ము. నేను అరుంధతిని. దయానిధులగు ఏడ్గురు ఋషులతో గూడి.నేను మీ ఇంటికి వచ్చి యుంటిని.

బ్రహ్మోవాచ ।

అరుంధతీ స్వరం శ్రుత్వా శీఘ్రముత్థాయ మేనకా ।
ఉవాచ శిరసా నత్వా తాం పద్మామివ తేజసా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అరుంధతి యొక్క కంఠస్వరమును విన్నంతనే మేనక వేగమే లేచి నిలబడి, లక్ష్మీదే◌ వి వలె వెలుగొందుచున్న ఆమెకు శిరసా నమస్కరించి ఇట్లు పలికెను (14).

మేనోవాచ।

అహోద్య కిమిదం పుణ్యమస్మాకం పుణ్య జన్మనామ్ ।
వధూర్జగద్విధేః పత్నీ వసిష్ఠ స్యాగతేహ వై ॥
కిమర్థ మాగతా దేవి తన్మే బ్రూహి విశేషతః ।
అహం దాసీ సమా తేహి ససుతా కరుణాం కురు ॥

మేన ఇట్లు పలికెను -

అహో! మేము ఎంత పుణ్యమో చేసుకొని జన్మించితిమి. అందువలననే జగత్తునకు విధివిధానమునందించిన వసిష్ఠుని ధర్మపత్నీ ఇచటకు వచ్చినది (15). ఓ దేవీ! ఇచటకు మీరు వచ్చుటలో గల కారణమేమియో నాకు వివరముగా చెప్పుడు. నేను నీకు దాసివంటి దానను. నీకుమార్తె నంటీ దానను. నాపై దయను చూపుము (16).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా మేనకాం సాధ్వీ బోధయిత్వా చ తాం బహు ।
తథాగతా చ సుప్రీత్యా సాస్తే యత్రర్షయోఽపి తే ॥
అథ శైలేశ్వరం తే చ బోధయా మాసురాదరాత్ ।
స్మృత్వా శివపదద్వంద్వం సర్వే వాక్య విశారదాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు పతివ్రతయగు అరుంధతి మేనయొక్క ఈ మాటలను విని, ఆమెకు పరిపరివిధము◌ులల బోధచేసి, మరల ఆ ఋషులు ఉన్నచోటికి ప్రీతితో తరలి వచ్చెను (17). మరియు మాటలాడుటలో సమర్థులగు ఆ ఋషులందరు శివుని పాద పద్మములను స్మరించి సాదరముగా పర్వతరాజునకు బోధించిరి (18).

ఋషయ ఊచుః ।

శైలేంద్ర శ్రూయతాం వాక్యమస్మాకం శుభకారణమ్ ।
శివాయ పార్వతీం దేహి సంహర్తు శ్శ్వశురో భవ ॥
అయాచితారం సర్వేశం ప్రార్థయామాస యత్నతః ।
తారకస్య వినాశాయ బ్రహ్మా సంబంధ కర్మణి ॥
నోత్సుకో దారసంయోగే శంకరో యోగినాం వరః ।
విధేః ప్రార్థనయా దేవస్తవ కన్యాం గ్రహీష్యతి ॥
దుహితుస్తే తపస్తప్తం ప్రతిజ్ఞానం చకార సః ।
హేతుద్వయేన యోగీంద్రో వివాహం చ కరిష్యతి ॥

ఋషులిట్లు పలికిరి -

ఓ పర్వతరాజా! శుభకరమగు మా మాటలను వినుము. పార్వతిని శివునకు ఇమ్ముము. జగత్తును లయముచేయు రుద్రునకు మామవు కమ్ము (19). తారకుని వినాశము కొరకై బ్రహ్మగారు యాచించుట ఎరుంగని ఆ సర్వేశ్వరుని ఈ వివాహమును చేసుకొమ్మని కష్టపడి ఒప్పించెను (20). యోగివర్యుడగు శంకరునకు వివాహమునందభిరుచి లేదు. కాని ఆ దేవుడు బ్రహ్మగారి ప్రార్థనచే నీ కన్యను వివాహమాడగలడు (21). నీ కుమార్తె తపస్సును చేయగా ఆయన ఆమెకు మాటను ఇచ్చి యున్నాడు. ఈ రెండు కారణములచే యోగివర్యుడగు శివుడు వివాహమును చేసుకొనగలడు (22).

బ్రహ్మోవాచ ।

ఋషీణాం వచనం శ్రుత్వా ప్రహస్య స హిమాలయః ।
ఉవాచ కించిద్భీతస్తు పరం వినయపూర్వకమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఋషుల ఆ మాటను విని ఆ హిమవంతుడు నవ్వి కొద్దిగా భయపడినవాడై గొప్ప వినయమును చూపుచూ ఇట్లు పలికెను (23).

హిమాలయ ఉవాచః

శివస్య రాజసామగ్రీం నహి పశ్యామి కాంచన ।
కంచిదాశ్రయమైశ్వర్యం కం వా స్వజన బాంధవమ్ ॥
నేచ్ఛామ్యతివినిర్లిప్తయోగినే స్వాం సుతామహమ్ ।
యూయం వేదవిధాతుశ్చ పుత్రా వదత నిశ్చితమ్ ॥
వరాయాననురూపాయ పితా కన్యాం దదాతి చేత్ ।
కామాన్మో హాభయాల్లో భాత్స నష్టో నరకం వ్రజేత్ ॥
న హి దాస్యామ్యహం కన్యా మిచ్ఛ యా శూల పాణయే ।
యద్విధానం భవేద్యోగ్య మృషయస్తద్విధీయతామ్ ॥

హిమవంతుడిట్లు పలికెను -

మహారాజునకు ఉండదగిన సామగ్రి ఏదియూ శివుని వద్ద గానరాదు. ఆయనకు ఒక ఆశ్రయము గాని, ఐశ్వర్యము గాని, తన వారు గాని, బంధువులు గాని ఉన్నట్లు కన్పట్టుట లేదు(24). మిక్కిలి నిర్లిప్తుడగు యోగికి నా కుమార్తెను ఇచ్చి వివాహము చేయుట నాకు ఇష్టమగుట లేదు. వేదములను ప్రవర్తిల్ల చేసిన బ్రహ్మ గారి పుత్రులగు మీరు మీ నిశ్చయమును చెప్పుడు (25). కామనలవలన గాని, మోహము వలన గాని, భయము వలన గాని, లోభము వలన గాని కుమార్తెను తగని వరునకు ఇచ్చిన తండ్రి నశించి నరకమును పొందును (26). నేను ఇష్టపడి శూలపాణియగు శివునకు కన్యను ఈయలేకున్నాను. ఓ ఋషులారా! ఈ విషయములో ఎట్లు యోగ్యముగ నుండునో మీరే నిర్ణయించుడు (27).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య హిమా గస్య మునీశ్వర ।
ప్రత్యువాచ వసిష్ఠ స్తం తేషాం వాక్యవిశారదః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! హిమవంతుని ఆ మాటను విని వారిలో వాక్య విశారదుడగు వసిష్ఠుడు ఈ విధముగా బదులిడెను (28).

వసిష్ఠ ఉవాచః

శృణు శైలేశ మద్వాక్యం సర్వథా తే హితావహమ్ ।
ధర్మా విరుద్ధం సత్యం చ పరత్రేహ ముదావహమ్ ॥
వచనం త్రివిధం శైల లౌకికే వైదికేఽపి చ ।
సర్వం జానాతి శాస్త్రజ్ఞో నిర్మల జ్ఞానచక్షుషా ॥
అసత్యమహితం పశ్చాత్సాంప్రతం శ్రుతి సుందరమ్ ।
సుబుద్ధిర్వక్తి శత్రుర్హి హితం నైవ కదాచన ॥
ఆదావ ప్రీతి జనకం పరిణామే సుఖావహమ్ ।
దయాలు ర్ధర్మశీలో హి బోధయత్యేవ బాంధవః ॥

వసిష్ఠుడిట్లు పలికెను -

ఓ పర్వతరాజా! నీకు అన్ని విధములుగా హితమును కలిగించునది, ధర్మమునకు విరుద్ధము కానిది, సత్యము, ఇహపరములలో ఆనందమును కలిగించునది అగు నా మాటను వినుము (29). ఓ పర్వతరాజా ! లోకమునందు, వేదమునందు గూడ వచనము మూడు విధములుగా నున్నది. శాస్త్రము నెరింగిన జ్ఞానులు శుద్ధమగు జ్ఞాననేత్రముచే ఈ సర్వమును ఎరుంగుదురు (30). అసత్యము వర్తమానములో వినుటకు మధురముగ నుండి భవిష్యత్తులో కష్టమును కలిగించును. శత్రువు బుద్ధి మంతుడైనచో హితమును ఎన్నడైననూ పలుకడు (31). దయాళువు, ధర్మ బుద్ధి గలవాడు అగు బాంధవుడు ఆదిలో క్లేశమును కలిగించునది, పరిణామములో సుఖమును కలిగించునది అగు మాటను పలుకును (32).

శ్రుతిమాత్రాత్సుధాతుల్యం సర్వకాల సుఖావహమ్ ।
సత్యసారం హితకరం వచనం శ్రేష్ఠ మీప్సితమ్ ॥
ఏవం చ త్రివిధం శైల నీతి శాస్త్రోదితం వచః ।
కథ్యతాం త్రిషు మధ్యే కిం బ్రువే వాక్యం త్వదీప్సితమ్ ॥
బాహ్య సంపద్విహీనశ్చ శంకరస్త్రి దశేశ్వరః ।
తత్త్వ జ్ఞాన సముద్రేషు సన్నిమగ్నైకమానసః ॥
జ్ఞానా నందస్యేశ్వరస్య బాహ్య వస్తుషు కా స్పృహా ।
గృహీ దదాతి స్వసుతాం రాజ్య సంపత్తి శాలినే ॥

వినుటకు అమృతము వంటిది, సర్వకాలముల యందు సుఖమును కలిగించునది, సత్యయము యొక్క సారముతో గూడినది, హితమును కలిగించునది అగు వచనము శ్రేష్ఠమని పెద్దలు చెప్పెదరు (33). ఓ పర్వత రాజా! నీతి శాస్త్రము ఇట్టి మూడు రకముల వచనములను నిరూపించి యున్నది. వీటి మధ్యలో ఎట్టి వచనమును నేను చెప్పవలయునని నీవు కోరు చున్నావు? (34) దేవదేవుడు అగు శంకరుడు బాహ్యసంపదలు లేని వాడే అయినా, తత్త్వజ్ఞానమనే సముద్రము నందు ఆయన మనస్సు మునకలు వేయు చుండును (35). జ్ఞానఘనుడు, ఆనందఘనుడు అగు శివునకు బాహ్యవస్తువుల యందు కోరిక ఎట్లు ఉండును? గృహస్థుడు తన కుమార్తెను రాజ్యము, సంపదలు గలవానికి ఇచ్చును (36).

కన్యకాం దుఃఖినే దత్త్వా కన్యా ఘాతీ భవేత్పితా ।
కో వేద శంకరో దుఃఖీ కుబేరో యస్య కింకరః ॥
భ్రూభంగలీలయా సృష్టిం స్రష్టుం హర్తుం క్షమో హి సః ।
నిర్గుణః పరమాత్మా చ పరేశః ప్రకృతేః పరః ॥
యస్య చ త్రివిధా మూర్తి ర్విధాతుస్సృష్టి కర్మణి ।
సృష్టి స్థిత్యం త జననీ బ్రహ్మ విష్ణు హరాభిధా ॥
బ్రహ్మా చ బ్రహ్మలోకస్థో విష్ణుః క్షీరోదవాసకృత్ ।
హరః కైలాసనిలయ స్సర్వాశ్చైవ విభూతయః ॥

దుఃఖితునకు తన కుమార్తెను ఇచ్చిన తండ్రి ఆ కన్యను సంహరించినట్లే యగును. కాని శంకరుడు దుఃఖియని ఎవనికి తెలియును? ఆయనకు కుబేరుడు కింకరుడు (37). నిర్గుణుడు, పరమాత్మ, పరమేశ్వరుడు, ప్రకృతికి అతీతుడు అగు ఆయన కనుబొమల కదలికచే మాత్రమే సృష్టి స్థితిలయములను చేయ సమర్థుడు (38). సృష్టి కార్యమును నిర్వహించే శివుని మూడు రకముల మూర్తులు సృష్టి స్థితిలయములను చేయును. ఆ మూర్తులకు బ్రహ్మా విష్ణురుద్రులనీ పేరు (39). బ్రహ్మా లోకమునందుండే బ్రహ్మా, క్షీర సముద్రమునందుండే విష్ణువు, కైలాసమునందు నివసించే రుద్రుడు అను ముగురు శివుని విభూతులు మాత్రమే (40).

ధత్తే చ త్రివిధా మూర్తీః ప్రకృతిశ్శివ సంభవా ।
అంశేన లీలయా సృష్టౌ కలయా బహుధా అపి ॥
ముఖోద్భవా స్వయం వాణీ వాగధిష్ఠాతృ దేవతా ।
వక్షస్స్థలో ద్భవా లక్ష్మీ స్సర్వ సంపత్స్వ రూపిణీ ॥
శివా తేజస్సు దేవానా మావిర్భావం చకార సా ।
నిహత్య దానవాన్ సర్వాన్ దేవేభ్యశ్చ శ్రియం దదౌ ॥
ప్రాప కల్పాంతరే జన్మ జఠరే దక్ష యోషితః ।
నామ్నా సతీ హరం ప్రాప దక్షస్త స్మై దదౌ చ తామ్ ॥
దేహం త త్యాజ యోగేన శ్రుత్వా సా భర్తృనిందనమ్ ।
సాద్య త్వత్త స్తు మేనాయాం జజ్ఞే జఠరతశ్శివా ॥

శివుని నుండి పుట్టిన ప్రకృతి కూడ అనేక రూపములుగా వ్యక్తమైననూ, సృష్టి కార్యమునందు తన లీలచే మూడు విధముల మూర్తులను తన అంశచే ధరించి యున్నది (41). ముఖము నుండి పుట్టినది, వాక్కునకు అధిష్ఠాన దేవత అయినది అగు సరస్వతి ఒక మూర్తి. వక్షస్థలము నుండి పుట్టినది, సర్వ సంపత్స్వరూపురాలు అగు లక్ష్మి రెండవది (42). మూడవది యగు ఉమ దేవతల తేజస్సు నుండి ఆవిర్భవించినది. ఆమె రాక్షసుల నందరినీ సంహరించి దేవతలకు సంపదలను ఒసంగినది (43). ఆమె మరియొక కల్పములో దక్షుని భార్య యొక్క గర్భము నుండి పుట్టి సతీ యను పేరును గాంచి శివుని వివాహమాడెను. దక్షుడు ఆమెను ఆయనకిచ్చి వివాహము చేసెను (44). ఆమె భర్తను నిందించుటను విని, యోగ మహిమచే దేహమును త్యజించెను. ఆమెయే నీ వలన మేనా గర్భము నందు జన్మించి పార్వతీ రూపములో నున్నది (45).

శివా శివస్య పత్నీయం శైల జన్మని జన్మని ।
కల్పే కల్పే బుద్ధి రూపా జ్ఞానినాం జననీ పురా ॥
జాయతే స్మ సదా సిద్ధా సిద్ధిదా సిద్ధి రూపిణీ ।
సత్యా అస్థి చితా భస్మ భక్త్యా ధత్తే హరస్స్వయమ్ ॥
అతస్త్వం స్వేచ్ఛయా కన్యాం దేహి భద్రాం హరాయ చ ।
అథవా సా స్వయం కాంతస్థానే యాస్యత్య దాస్యసి ॥
కృత్వా ప్రతిజ్ఞాం దేవేశ ద్దృష్ట్వా క్లేశమసంఖ్యకమ్ ।
దుహితుస్తే తపస్థ్సాన మాజగామ ద్విజాత్మకః ॥

తామాశ్వాస్య వరం దత్త్వా జగామ నిజమందిరమ్ ।

తత్రార్థనావశాచ్ఛంభుర్యయాచే త్వాం శివాం గిరే ॥

ఓ పర్వతరాజా ! ఈ శివాదేవి జన్మ జన్మల యందు, సర్వకాలములయందు శివుని అర్ధాంగి. ఈ తల్లి సర్వోత్కృష్టురాలు. జ్ఞానులయందు ఈమె బుద్ధి రూపమున నుండును (46). సదా సిద్ధిని ఇచ్చునది, సిద్ధి స్వరూపురాలు, స్వయంసిద్ధ అగు ఈ దేవి ఇచట జన్మించి యున్నది. శివుడు సతీదేవి యొక్క అస్థికలను, చితా భస్మను భక్తితో స్వయముగా ధరించును (47). కావున నీవు మంగళ స్వరూపురాలగు నీ కన్యను సంతోషముతో శివునకు ఇమ్ము. లేనిచో నీవు ఈయనిచో, ఆమెయే తన భర్త ఉండు స్థానమునకు స్వయముగా వెళ్లగలదు (48). నీ కుమార్తె యొక్క తీవ్రమగు తపస్సులోని క్లేశములను చూచి, దేవతలకు ప్రతిజ్ఞను చేసి, దేవదేవుడగు శివుడు బ్రాహ్మణ వేషములో నీ కుమార్తె తపస్సు చేయు స్థలమునకు వచ్చినాడు (49). ఓ పర్వతరాజా! ఆ శంభుడు ఆమెను ఓదార్చి, వరము నిచ్చి, తన నివాసమునకు వెళ్లి, ఆమె కోర్కె మేరకు నిన్ను పార్వతిని ఇమ్మని యాచించినాడు (50).

అంగీకృతం యువాభ్యాం తచ్ఛివ భక్తిరతాత్మనా ।

విపరీతమతిర్జాతా వద కస్మాద్గిరీశ్వర ॥

తద్గత్వా ప్రభుణా దేవైః ప్రార్థితేన త్వదంతికమ్ ।

ప్రస్థాపితా వయం శీఘ్రం హ్యృషయస్సాప్యరుంధతీ ॥

శిక్షయామో వయం త్వాం హి దత్త్వా రుద్రాయ పార్వతీమ్ ।

ఏవం కృతే మహానందో భవిష్యతి గిరే తవ ॥

శివాం శివాయ శైలేంద్ర స్వేచ్ఛయా చేన్న దాస్యసి ।

భవితా తద్వివాహోऽత్ర భవితవ్య బలేన హి ॥

శివ భక్తి యందభిరుచితో గూడిన మనస్సుగల మీరిద్దరు అంగీకరించి యున్నానారు. ఓ పర్వతరాజా! కాని మీకు ఇప్పుడు తద్విరుద్ధమగు మనస్సు కలుగుటకు కారణమేమి? చెప్పుము(51). అపుడు దేవతలు శివుని వద్దకు వెళ్లి ప్రార్థించగా, ఆయన సప్తర్షులగు మమ్ములను, అరుంధతిని వెనువెంటనే నీ వద్దకు పంపించినాడు(52). మేము నీకు ఉపదేశించుచున్నాము. ఇమ్ము. ఓ శైలరాజా! అట్లు చేసినచో నీకు మహానందము కలుగ గలదు (53). పర్వతరాజా! నీవు పార్వతిని ప్రీతి పూర్వకముగా శివునకు ఈయని పక్షములో, వారి వివాహము ఈ కాలములో విధిబలముచేతనే సంపన్నము కాగలదు (54).

వరం దదౌ శివాయై స తపంత్యై తాత శంకరః ।
న హీశ్వర ప్రతిజ్ఞాతం విపరీతాయ కల్పతే ॥
అహో ప్రతిజ్ఞా దుర్లంఘ్యా సాధూనామీశవర్తినామ్ ।
సర్వేషాం జగతాం మధ్యే కిమీశస్య పునర్గిరే ॥
ఏకో మహేంద్రశ్శైలానాం పక్షాంశ్చి చ్ఛేద లీలయా ।
పార్వతీ లీలయా మేరోః శృంగ భంగం చకార చ ॥
ఏకార్థే నహి శైలేశ నాశ్యాస్సర్వా హి సంపదః ।
ఏకం త్యజేత్కులస్యార్థే శ్రుతిరేషా సనాతనీ ॥

వత్సా! శంకరుడు శివాదేవికి తపస్సు చేయుచుండగా వరమునిచ్చెను. ఈశ్వరుని ప్రతిజ్ఞ వమ్ము కాదు గదా! (55) ఈశ్వరభక్తులగు సాధువుల ప్రతిజ్ఞయైననూ ముల్లోకములలో ఉల్లంఘింప శక్యము కానిదిగా నున్నది. ఓ పర్వతరాజా! ఈశ్వరుని ప్రతిజ్ఞ గురించి చెప్పున దేమున్నది? (56) ఇంద్రుడొక్కడే అవలీలగా పర్వతముల రెక్కలను నరికెను. పార్వతి కూడ అవలీలగా మేరువునకు శృంగభంగము చేసెను (57). ఓ పర్వతరాజా! ఒక్క వ్యక్తి కొరకై సంపదల నన్నిటినీ నాశనము చేయరాదు. కులము కొరకై ఒక వ్యక్తిని విడువవలెనని సనాతనమగు వేదము చెప్పు చున్నది (58).

దత్త్వా విప్రాయ స్వసుతా మనరణ్యో నృపేశ్వరః ।
బ్రాహ్మణాద్భయమాపన్నో ররక్ష నిజసంపదమ్ ॥
తమాశు బోధయామాసుర్నీతి శాస్త్ర విదో జనాః ।
బ్రహ్మ శాపాద్విభీతాశ్చ గురవో జ్ఞాతి సత్తమాః ॥
శైలరాజ త్వమప్యేవం సుతాం దత్త్వా శివాయ చ ।
రక్ష సర్వాన్ బంధు వర్గాన్ వంశం కురు సురానపి ॥

అనరణ్య మహారాజు బ్రాహ్మణుని వలన సంప్రాప్తమైన భయము గలవాడై తన కుమార్తెను ఆ బ్రాహ్మణునకు ఇచ్చి తన సంపదను రక్షించుకొనెను (59). నీతి శాస్త్రజ్ఞులగు జనులు, గురువులు, శ్రేష్ఠులగు జ్ఞాతులు బ్రాహ్మణుని శాపము వలన మిక్కిలి భయపడిన వారై ఆ రాజునకు బోధించిరి (60). ఓ శైలరాజా! ఇదే విధముగా నీవు కూడా నీ కుమార్తెను శివునకు ఇచ్చి బంధువులనందరినీ రక్షించుకొనుము. మరియు దేవతలను వశము చేసుకొనుము (61).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వసిష్ఠస్య వచనం స ప్రహస్య చ ।
పప్రచ్ఛ నృపవార్తాం చ హృదయేన విదూయతా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను-

వసిష్ఠుని ఈ మాటను విని ఆయన నవ్వి దుఃఖముతో నిండిన హృదయముతో అనరణ్యుని వృత్తాంతమును గూర్చి ప్రశ్నించెను (62).

హిమాలయ ఉవాచః

కస్య వంశో ద్భవో బ్రహ్మన్ననరణ్యో నృపశ్చ సః ।
సుతాం దత్త్వా స చ కథం రరక్షాఖిల సంపదః ॥

హిమవంతుడిట్లు పలికెను -

హే బ్రహ్మన్ ! ఆ అనరణ్య మహారాజు జన్మించిన వంశమేది? ఆయన కుమార్తెను ఇచ్చి సంపదలనన్నిటినీ రక్షించుకున్న తీరు ఎట్టిది? (63)

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా వసిష్ఠస్తు శైలవాక్యం ప్రసన్నధీః ।
ప్రోవాచ గిరయే తస్మై నృపవార్తాం సుఖావహామ్ ॥
ఇతి శ్రీ శివ మహా పురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే గిరి సాంత్వనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ప్రసన్నమగు మనస్సు గల వసిష్ఠుడు పర్వతుని ఆ మాటను విని సుఖదాయకము అగు అనరణ్య చరితమును ఆ పర్వతరాజునకు చెప్పెను (64).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో హిమవంతునకు సప్తర్షుల ఉపదేశమును వర్ణించే ముప్పది మూడవ అధ్యాయము ముగిసినది (33).

34 – అనరణ్యుడు

వసిష్ఠ ఉవాచః

మనోర్వంశోద్భవో రాజా సోఽనరణ్యో నృపేశ్వరః ।
ఇంద్రసావర్ణి సంజ్ఞస్య చతుర్దశమితస్య హి ॥
అనరణ్యో నృపశ్రేష్ఠ స్సప్తద్వీపమహీ పతిః ।
శంభు భక్తో విశేషేణ మంగళారణ్యా జో బలీ ॥
భృగుం పురోధసం కృత్వా శతం యజ్ఞాంశ్చకార సః ।
న స్వీచకార శక్రత్వం దీయమానం సురై రపి ॥
బభూవుశ్శత పుత్రాశ్చ రాజ్ఞ స్తస్య హిమాలయ ।
కన్యైకా సుందరీ నామ్నా పద్మా పద్మాలయాసమా ॥

వసిష్ఠుడిట్లు పలికెను –

ఇంద్ర సావర్ణి అను పేరు గల పదునాల్గవ మనువు యొక్క వంశములో అనరణ్యుడను చక్రవర్తి జన్మించెను (1). అనరణ్య మహారాజు ఏడు ద్వీపములతో గూడిన భూమండలమునకు ప్రభువు. మంగళారణ్యము నందు జన్మించిన బలశాలియగు ఆ మహారాజు ప్రత్యేకించి శివభక్తుడు (2). ఆయన భృగువును పురోహితునిగా చేసుకొని వంద యజ్ఞములను చేసెను. కాని దేవతలు ఇచ్చిననూ ఆయన ఇంద్ర పదవిని స్వీకరించలేదు (3). ఓ హిమాలయా! ఆ మహారాజునకు వందమంది కుమారులు ఉండిరి. మరియు పద్మయను పేరు గల లక్ష్మీ సమానురాలైన ఒక సుందరియగు కన్య ఉండెను (4).

యస్స్నే హః పుత్రశతకే కన్యాయాం చ తతోఽ ధికః ।
నృపస్య తస్య తస్యాం హి బభూవ నగసత్తమ ॥
ప్రాణాధి కాః ప్రియతమా మహిష్యస్సర్వయోషితః ।
నృపస్య పత్న్యః పంచాసన్ సర్వ సౌభాగ్య సంయుతాః ॥
సా కన్యా యౌవనస్థా చ బభూవ స్వపితుర్గృహే ।
పత్రం ప్రస్థాపయామాస సువరానయనాయ సః ॥
ఏకదా పిప్పలాదర్షి ర్గంతుం స్వాశ్రమముత్సుకః ।
తపస్స్థానే నిర్జనే చ గంధర్వం స దదర్శ హ ॥

ఆ మహారాజునకు వందమంది పుత్రులపై ఎంత ప్రేమ గలదో, అంతకంటే అధిక ప్రేమ ఆ కన్య యందు ఉండెడిది. ఓ పర్వతరాజా! (5) ఆ మహారాజునకు ప్రాణములకంటె అధికముగా ప్రియమైనవారు, సర్వసౌభాగ్యములతో గూడినవారు అగు అయిదుగురు భార్యలు ఉండిరి (6). ఆ కన్య తన తండ్రి ఇంటిలో పెరిగి యౌవనములో అడుగిడెను. ఆ రాజు మంచి వరులను రప్పించుటకై పత్రములను పంపించెను (7). ఒకనాడు పిప్పలాదమహర్షి తన ఆశ్రమమునకు వెళ్లు తొందరలో నుండి నిర్జనమగు తపోవనములో ఒక గంధర్వుని చూచెను (8).

స్త్రీయుతం మగ్నచిత్తం చ శృంగారే రససాగరే ।
విహరంతం మహా ప్రేమ్ణా కామశాస్త్ర విశారదమ్ ॥
దృష్ట్వా తం ముని శార్దూలస్సకామస్సంబభూవ సః ।
తపస్స్వ దత్త చిత్తశ్చా చింతయద్దారసంగ్రహమ్ ॥
ఏవం వృత్తస్య తస్యైవ పిప్పలాదస్య సన్మునేః ।
కియత్ కాలో గతస్తత్ర కామోన్మ థితచేతసః ॥
ఏకదా పుష్ప భద్రాయాం స్నాతుం గచ్ఛన్ము నీశ్వరః ।
దదర్శ పద్మాం యువతీం పద్మామివ మనో రమామ్ ॥

స్త్రీలతో గూడి శృంగారరస సముద్రములో మునిగిన మనస్సు గలవాడై మహాప్రేమతో విహరించుచున్న కామశాస్త్ర కోవిదుడగు (9) ఆ గంధర్వుని చూచి ఆ మహర్షి కామము గలవాడాయెను. ఆయన మనస్సును తపస్సునందు లగ్నము చేయజాలక వివాహమాడవలెనని తలపోసెను (10). ఈ తీరున కామముచే పీడింపబడిన మనస్సుగల ఆ పిప్పలాద మహర్షి కొంతకాలమును గడిపెను (11). ఒకనాడు ఆ మునీశ్వరుడు పుష్పభద్రా నదియందు స్నానము చేయుటకు వెళ్లుచూ, లక్ష్మివలే మనోరమ, యౌవనవతి యగు పద్మను చూచెను (12).

కేయం కన్యేతి పప్రచ్ఛ సమీపస్థాన్ జనాన్ మునిః ।
జనా నివేదయాం చక్రుర్నత్వా శాపనియంత్రితాః ॥

ఆ మహర్షి సమీపములో నున్న జనులను 'ఈ కన్య ఎవరు?' అని ప్రశ్నించెను. శాపభీతులగు జనులు నమస్కరించి ఇట్లు నివేదించిరి (13).

జనా ఊచుః ।

అనరణ్య సుతేయం వై పద్మా నామ రమాపరా ।
వరారోహా ప్రార్థ్య మానా నృపశ్రేష్టై ర్గుణాలయా ॥

జనులిట్లు పలికిరి -

అపర లక్ష్మీదేవి యనదగిన ఈ సుందరి అనరణ్యుని కుమార్తె. ఈమె పేరు పద్మ. సద్గుణములకు నిలయమగు ఈమెను వివాహమాడ వలెనని శ్రేష్ఠులగు రాజకుమారులు గోరుచున్నారు (14).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రు త్వా స మునిర్వాక్యం జనానాం తథ్య వాదినామ్ ।
చుక్షోభాతీవ మనసి తల్లి ప్సురభవచ్చ సః ॥
మునిస్స్నా త్వాభీష్టదేవం సంపూజ్య విధివచ్ఛివమ్ ।
జగామ కామీ భిక్షార్థ మనరణ్య సభాం గిరే ॥
రాజా శీఘ్రం మునిం దృష్ట్వా ప్రణనామ భయాకులః ।
మధుపర్కాదికం దత్త్వా పూజయామాస భక్తితః ॥

కామాత్పర్వం గృహీత్వా చ యయాచే కన్యకాం మునిః ।
మౌనీ బభూవ నృపతిః కించిన్నిర్వక్తు మక్షమః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -.

సత్యమును పలికే జనుల ఆ మాటలను విని ఆ మహర్షి మనస్సునందు చాల క్షోభను పొంది, ఆమెను పొందగోరినాడు (15). ఓ శైలరాజా! కామియగు ఆ మహర్షి స్నానముచేసి ఇష్టదైవమగు శివుని యథావిధిగా పూజించి భిక్ష కొరకై అనరణ్యుని సభకు వెళ్లెను (16). రాజు మునిని చూచి భయముతో కంగారుపడి వెంటనే నమస్కరించెను. మరియు మధుపర్కాదులనిచ్చి భక్తితో పూజించెను (17). ఆ మహర్షి సత్కార ద్రవ్యములలో తనకు నచ్చిన వాటిని స్వీకరించి కన్యను తనకిమ్మని కోరెను. రాజు ఏమియూ చెప్పజాలక మౌనముగా నుండి పోయెను (18).

మునిర్యయాచే కన్యాం స తాం దేహీతి నృపేశ్వరమ్ ।
అన్యథా భస్మసాత్సర్వం కరిష్యామి క్షణేన చ ॥
సర్వే బభూవురాచ్ఛన్నా గణాస్తత్తే జసా మునేః ।
రురోద రాజా సగణో దృష్ట్వా విప్రం జరాతురమ్ ॥
మహిష్యో రురుదుస్సర్వా ఇతి కర్తవ్యతాక్షమాః ।
మూర్ఛా మాప మహారాజ్ఞీ కన్యామాతా శుచాకులా॥
బభూవుస్తనయాస్సర్వే శోకాకులిత మానసాః ।
సర్వం శోకాకులం జాతం నృపసంబంధి శైలప ॥

'ఆ కన్యను నాకిమ్ము. లేనిచో, క్షణకాలములో సర్వమును భస్మము చేసెదను' అని ఆ ముని మహారాజును కోరెను (19). ఓ మహర్షీ! రాజపరివారమంతయూ ఆ మునియొక్క తేజస్సుచే దిగ్భ్రాంతులైరి. రాజు ఆ ముదుసలి బ్రాహ్మణుని చూచి బంధువులతో సహా రోదిల్లెను (20). ఆతని భార్యలందరు ఏమి చేయుటకు తోచక ఏడ్చిరి. కన్యయొక్క తల్లియగు మహారాణి దుఃఖపీడితురాలై మూర్ఛిల్లెను (21). కుమారులందరు శోకావిష్టమగు మనస్సు గల వారైరి. ఓ పర్వతరాజా! రాజ సంబంధి జనులందరూ శోకమును పట్టజాలకపోయిరి (22).

ఏతస్మిన్నంతరే ప్రాజ్ఞో ద్విజో గురురనుత్తమః ।
పురోహితశ్చ మతిమాన్ ఆగతో నృపసన్నిధిమ్ ॥
రాజా ప్రణమ్య సంపూజ్య రురోద చ తయోః పురః ॥
సర్వం నివేదయాం చక్రే పప్రచ్ఛోచితమాశు తత్ ॥
అథ రాజ్ఞో గురుర్విప్రః పండితశ్చ పురోహితః ।
అపి ద్వౌ శాస్త్ర నీతిజ్ఞౌ బోధయా మాసతుర్నృపమ్ ॥
శోకాకులాశ్చ మహిషీర్నృప బాలాంశ్చ కన్యకామ్ ।
ఉత్తమాం నీతి మాదృత్య సర్వేషాం హితకారిణీమ్ ॥



ఇంతలో ప్రాజ్ఞుడు, గొప్ప బ్రాహ్మణుడు అగు గురువు, బుద్ధిమంతుడగు పురోహితుడు రాజ సన్నిధికి విచ్చేసిరి (23). రాజు వారిద్దరికీ నమస్కరించి పూజించి వారి యెదుట భోరుమనెను. వారు ప్రశ్నించగా ఆతడు ఉచితరీతిని వృత్తాంతమునంతనూ నివేదించెను (24). అపుడు వేదవేత్తయగు గురువు, పండితుడగు పురోహితుడు కలిసి నీతి శాస్త్రజ్ఞులు గనుక, రాజునకు ఇట్లు బోధించిరి (25). శోకముచే వ్యాకులమైన మనస్సుగల రాజపత్నులకు, రాజకుమారులకు, రాజకన్యకు వారిద్దరు అందరికీ హితమును కలిగించే ఉత్తమనీతిని సాదరముగా విన్నవించిరి (26).

గురుపురో ధసావూచతుః ।

శృణు రాజన్మ హాప్రాజ్ఞ వచో నౌ సద్ధితావహమ్ ।
మా శుచస్సపరీవారశ్శాస్త్రే కురు మతిం సతీమ్ ॥
అద్య వాబ్ద దినాంతే వా దాతవ్యా కన్యకా నృప ।
పాత్రాయ విప్రాయాన్యస్మై కస్మైచిద్వా విశేషతః ॥
సత్పాత్రం బ్రాహ్మణా దన్యన్న పశ్యావో జగత్త్రయే ।
సుతాం దత్త్వా చ మునయే రక్ష స్వాం సర్వసంపదమ్ ॥
రాజన్నేక నిమిత్తేన సర్వ సంపద్వినశ్యతి ।
సర్వం రక్షతి తం త్యక్త్వా వినా తం శరణాగతమ్ ॥

గురువు, రాజ పురోహితుడు ఇట్లు పలికిరి -

మహాప్రాజ్ఞా! రాజా! మంచి హితమును కలిగించు మా ఇద్దరి మాటను వినుము. బంధువర్గముతో గూడి దుఃఖించకుము. శాస్త్రమునందు సద్బుద్ధిని కలిగియుండుము. (27). రాజా! ఈ నాడుగాని, సంవత్సరము తరువాత గాని అమ్మాయిని యోగ్యుడగు బ్రాహ్మణునకు గాని, లేదా ఎవరికో ఒకనికి గాని ఈయవలసినదే గదా! (28) ముల్లోకములలో బ్రాహ్మణునికంటె యోగ్యమగు పాత్ర మాకు గానరాలేదు. కావున కుమార్తెను మహర్షికి ఇచ్చి నీ సంపదలన్నిటినీ రక్షించు కొనుము (29). రాజా! ఒక్కరి కొరకై సర్వము నశించే సందర్భములో వానిని విడిచి సర్వమును రక్షించవలెను. ఈ నీతి శరణాగతుని విషయములో వర్తించదు (30).

వసిష్ఠ ఉవాచ ।

రాజా ప్రాజ్ఞ వచశ్శ్రుత్వా విలప్య చ ముహుర్ముహుః ।
కన్యాం సాలంకృతాం కృత్వా మునీంద్రాయ దదౌ కిల॥
కాంతాం గృహీత్వా స మునిర్వివాహ్య విధివద్గిరే ।
పద్మాం పద్మోపమాం తాం వై ఘుదితస్స్వాలయం యయౌ ॥
రాజా సర్వాన్ పరిత్యజ్య దత్త్వా వృద్ధాయ చాత్మజామ్ ।
గ్లానిం చిత్తే సమాధాయ జగామ తపసే వనమ్ ॥
తద్భార్యాపి వనం యాతే ప్రాణనాథే తదా గిరే ।
భర్తుశ్చ దుహితు శ్శోకాత్ప్రాణాం స్తత్యాజ సుందరీ ॥

వసిష్ఠుడిట్లు పలికెను -

రాజు ఆ బుద్ధిమంతుల మాటలను విని అనేక పర్యాయములు రోదించి, కన్యను అలంకరించి, ఆ మహర్షికి అప్పజెప్పెను. (31). ఓ శైలరాజా! ఆ ముని కన్యను స్వీకరించెను. ఆతడు లక్ష్మివంటి ఆ పద్మను ఆనందముతో పరిణయమాడి యథావిధిగా తన గృహమునకు దోడ్కొని వెళ్లెను (32). రాజు వృద్ధునకు కుమార్తె నిచ్చుటచే అందరినీ వీడి మనస్సులో దుఃఖము గలవాడై తపస్సు కొరకు అడవికి పోయెను (33). ఆయన భార్య తన ప్రాణనాథుడు అడవికి పోగానే భర్తయొక్క వియోగమును, కుమార్తె యొక్క దుఃఖమును సహింప లేకపోయెను. ఓ పర్వతరాజా! ఆ సుందరి ప్రాణములను విడిచి పెట్టెను (34).

పూజ్యాః పుత్రాశ్చ భృత్యాశ్చ మూర్ఛామాపుర్నృపం వినా ।
శుశుచుశ్శ్వాస సంయుక్తం జ్ఞాత్వా సర్వే పరే జనాః ॥
అనరణ్యో వనం గత్వా తపస్తప్త్వాతి శంకరమ్ ।
సమారాధ్య యయౌ భక్త్యా శివలోక మనామయమ్ ॥
నృపస్య కీర్తి మాన్నామ్నా జ్యేష్ఠపుత్రోఽథ ధార్మికః ।
పుత్ర వత్పాలయామాస ప్రజా రాజ్యం చకార హ ॥
ఇతి తే కథితం శైలానరణ్య చరితం శుభమ్ ।
కన్యాం దత్త్వా యథాఽ రక్ష ద్వంశం చాప్య ఖిలం ధనమ్ ॥
శైలరాజ త్వమప్యేవం సుతాం దత్త్వా శివాయ చ ।
రక్ష సర్వకులం సర్వాన్ వశాన్ కురు సురానపి ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే అనరణ్య చరిత వర్ణనం నామ చతుస్త్రింశోఽ ధ్యాయః ॥

రాజు లేకుండుటచే పూజ్యులగు అమాత్యాదులు, రాజ పుత్రులు మరియు సేవకులు కూడా మూర్ఛను పొందిరి. ఈ వార్తను ఎరింగిన ఇతర జనులందరు నిట్టూర్పులను విడిచి దుఃఖించిరి (35). అనరణ్యుడు అడవికి వెళ్లి శంకరుని ఉద్దేశించి గొప్ప తపస్సును చేసి భక్తితో శివుని ఆరాధించి దుఃఖ రహితమగు శివలోకమును పొందెను (36). తరువాత ఆ రాజు యొక్క జ్యేష్ఠ పుత్రుడగు కీర్తిమంతుడు ధర్మబద్ధుడై ప్రజలను పుత్రుల వలె పాలించి రాజ్యము నేలెను (37). ఓ పర్వత రాజా! అనరణ్యుడు కన్యను ఇచ్చి సర్వసంపదలను, వంశమును రక్షించుకున్న ఈ శుభవృత్తాంతమును నీకు వివరించితిని (38). ఓ శైలరాజా! నీవు కూడా ఇదే తీరున కుమార్తెను శివునకు ఇచ్చి, కులమునంతనూ రక్షించుకొనుము. మరియు, దేవతల నందరినీ నీకు వశులగునట్లు చేసుకొనుము (39).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండములో అనరణ్య చరిత వర్ణనమనే ముప్పది నాల్గవ అధ్యాయము ముగిసినది (34).

35 – పద్మా పిప్పలాదుల చరిత్ర

నారద ఉవాచః

అనరణ్యస్య చరితం సుతాదాన సమన్వితమ్ ।
శ్రుత్వా గిరి వరస్తాత కిం చకార చ తద్వద ॥

నారదుడిట్లు పలికెను –

కుమార్తెను మహర్షికి ఇచ్చిన అనరణ్యుని చరిత్రను విని హిమవంతుడేమి చేసెనో చెప్పుము (1).

బ్రహ్మోవాచ ।

అనరణ్యస్య చరితం కన్యాదాన సమన్వితమ్ ।
శ్రుత్వా పప్రచ్ఛ శైలేశో వసిష్ఠం సాంజలిః పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

కుమార్తెను మహర్షికి ఇచ్చి వివాహము చేసిన అనరణ్యుని వృత్తాంతమును విని పర్వతరాజగు హిమవంతుడు చేతులు జోడించి మరల వసిష్ఠునితో నిట్లు పలికెను (2).

శైలేశ ఉవాచః

వసిష్ఠ ముని శార్దూల బ్రహ్మపుత్ర కృపానిధే ।
అనరణ్య చరిత్రం తే కథితం పరమాద్భుతమ్ ॥
అనరణ్య సుతా యస్మాత్ పిప్పలాదం మునిం పతిమ్ ।
సంప్రాప్య కిమకార్షీత్సా తచ్చరిత్రం ముదావహమ్ ॥

హిమవంతుడిట్లనెను –

వసిష్ఠ మహర్షీ ! నీవు బ్రహ్మపుత్రుడవు. దయానిధివి. పరమాశ్చర్యకరమగు అనరణ్యుని వృత్తాంతమును చెప్పి యుంటివి (3). అనరణ్యుని కుమార్తె పిప్పలాద మహర్షిని వివాహమాడి తరువాత ఏమి చేసెను? ఆనందమును కలిగించే ఆమె చరిత్రను చెప్పుడు (4).

వసిష్ఠ ఉవాచః

పిప్పలాదో మునివరో వయసా జర్జరోఽ ధికః ।
గత్వా నిజాశ్రమం నార్యాఽ నరణ్య సుతయా తయా ॥
ఉవాస తత్ర సుప్రీత్యా తపస్వీ నాతి లంపటః ।
తత్రారణ్యే గిరివర స నిత్యం నిజధర్మకృత్ ॥
అథానరణ్య కన్యా సా సిషేవే భక్తితో మునిమ్ ।
కర్మణా మనసా వాచా లక్ష్మీర్నారాయణం యథా ॥



ఏకదా స్వర్ణదీం స్నాతుం గచ్ఛంతీం సుస్మితాం చ తామ్ ।
దదర్శ పథి ధర్మశ్చ మాయయా నృపరూపధృక్ ॥

వసిష్ఠుడిట్లు పలికెను -

మిక్కిలి ముదుసలి యగు పిప్పలాద మహర్షి అనరణ్యుని కుమార్తె యగు తన భార్యతో గూడి తన ఆశ్రమమునకు వెళ్లి (5), అచట ఆనందముగా నివసించెను. ఆ తపశ్శాలికి సంసారము నందు లంపటము అధికముగా లేకుండెను. ఓ గిరిరాజా! ఆతడు ఆ అరణ్యములో తన నిత్య ధర్మముననుష్ఠించు చుండెను (6). అపుడా అనరణ్యుని కుమార్తె మనో వాక్కాయ కర్మలతో లక్ష్మీ దేవి నారాయణుని వలె ఆ మహర్షిని భక్తితో సేవించెను. (7). ఒకనాడామె ఆనందముతో గంగానదీ స్నానమునకు పోవుచుండగా రాజవేషధారియగు ధర్ముడు ఆమెను మార్గమధ్యములో చూచెను (8).

చారురత్న రథస్థశ్చ నానాలంకార భూషితః ।
నవీన యౌవన శ్రీమాన్ కామదేవసమ ప్రభః ॥
దృష్ట్వా తాం సుందరీం పద్మాముివాచ స వృషో విభుః ।
విజ్ఞాతుం భావమంతస్థం తస్యాశ్చ ముని యోషితః ॥

సుందరమైన రత్నములు పొదిగిన రథమునందున్నవాడు, అనేకములగు భూషణములచే అలంకరింపబడి శోభిల్లుచున్నవాడు, నూతన యౌవనములో నున్నవాడు, మన్మథునితో సమమగు కాంతి గల వాడు (9) అగు ఆ ధర్మ ప్రభుడు ఆ సుందరి యగు ముని భార్యను పద్మయను పేరు గల దానిని చూచి ఆమె అంతరంగములోని భావము నెరుంగుటకై ఇట్లు పలికెను (10).

ధర్మ ఉవాచః

అయి సుందరి లక్ష్మీర్వై రాజ యోగ్యే సునోహరే ।
అతివ యౌవనస్థే చ కామిని స్థిరయౌవనే ॥
జరాతురస్య వృద్ధస్య పిప్పలాదస్య వై మునేః ।
సత్యం వదామి తన్వంగి సమీపే నైవ రాజసే ॥
విప్రం తపస్సు నిరతం నిర్ఘృణం మరణోన్ముఖమ్ ।
త్యక్త్వా మాం పశ్య రాజేంద్రం రతి శూరం స్మరా తురమ్ ॥
ప్రాప్నోతి సుందరీ పుణ్యా త్సౌందర్యం పూర్వ జన్మనః ।
సఫలం తద్భవేత్సర్వం రసికాలింగనేన చ ॥

ధర్ముడిట్లు పలికెను -

ఓ సుందరీ! నీ సౌందర్యము మనోహరము, రాజులకు తగినది. నీ యౌవనము నూతన ప్రాయములో స్థిరమై యున్నది. ఓ సుందరీ! (11) ముసలి దనముచే వంగియున్న పిప్పలాద మహర్షి యొక్క ప్రక్కన నీవు ప్రకాశించుట లేదు సుమా! ఓ కృశాంగీ! నేను సత్యమునే పలుకు చున్నాను (12). సర్వదా తపస్సుల యందు నిమగ్నమై ఉండువాడు, జాలి లేనివాడు, మరణించుటకు సిద్ధముగ

నున్నవాడు అగు ఆ విప్రుని వీడి నన్ను చూడుము. నేను రాజశ్రేష్ఠుడను. కామకేళి యందు శూరుడను. మన్మథ పీడితుడను (13). స్త్రీకి పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యము యొక్క ఫలమే ఈ జన్మలో సౌందర్య రూపములో లభించును. ఆ సౌందర్యమంతయూ రసికుని కౌగిలించు కున్నచో సార్థక మగును (14).

సహస్ర సుందరీకాంతం కామశాస్త్ర విశారదమ్ ।
కింకరం కురు మాం కాంతే సంపరిత్యజ్య తం పతిమ్ ॥
నిర్జనే కాననే రమ్యే శైలే శైలే నదీ తటే ।
విహరస్వ మయా సార్ధం జన్మేదం సఫలం కురు ॥

ఓ సుందరీ! వేయి స్త్రీలకు భర్తను నేను. కామ శాస్త్రమునందు దిట్టను. ఆ భర్తను వీడి నన్ను నీ సేవకునిగా చేసుకొనుము (15). నిర్జనమగు అరణ్యములో, సుందరములగు పర్వతములలో, నదీ తీరముల యందు నాతో గూడి విహరించుము. ఈ జన్మను సఫలము చేసుకొనుము (16).

వసిష్ఠ ఉవాచ ।

ఇత్యేవ ముక్తవంతం సా స్వరథాదవరుహ్య చ ।
గ్రహీతుముత్సుకం హస్తే తమువాచ పతివ్రతా ॥

వసిష్ఠుడిట్లు పలికెను –

ఇట్లు పలికి తన రథమునుండి క్రిందకు దిగి ఆమెను చేతితో పట్టు కొనుటకు తొందర పడుచున్న ఆ ధర్మునితో ఆ పతివ్రత ఇట్లనెను (17).

పద్మో వాచ ।

గచ్ఛ దూరం గచ్ఛ దూరం పాపిష్ఠస్త్వం నరాధిప ।
మాం చేత్పశ్యసి కామేన సద్యో నష్టో భవిష్యసి ॥
పిప్పలాదం మునిశ్రేష్ఠం తపసా పూతవిగ్రహమ్ ।
త్యక్త్వా కథం భజేయం త్వాం స్త్రీ జితం రతిలంపటమ్ ॥

పద్మ ఇట్లు పలికెను –

దూరముగా పొమ్ము. మానవాధమా! దూరముగా పొమ్ము. నీవు పాపాత్ముడవు. నన్ను కామ దృష్టితో చూచినచో నీవు వెంటనే నశించెదవు (18). మునిశ్రేష్ఠుడు, తపస్సుచే పవిత్రమైన దేహము గలవాడు అగు పిప్పలాద మహర్షిని విడిచి పెట్టి, స్త్రీలచే జయింపబడి మన్మథ కేళి యను లంపటమునందు తగుల్కొని యున్న నిన్ను నేను ఎట్లు సేవించెదను? (19)

స్త్రీ జితస్పర్శమాత్రేణ సర్వం పుణ్యం ప్రణశ్యతి ।
స్త్రీ జితః పరపాపీ చ తద్దర్శన మఘావహమ్ ॥
సత్క్రి యో హ్యశుచిర్నిత్యం స పుమాన్ యస్స్త్రియా జితః ।
నిందంతి పితరో దేవా మానవా స్సకలాశ్చ తమ్ ॥
తస్య కిం జ్ఞానసుతపో జపహోమ ప్రపూజనైః ।
విద్యయా దానతః కిం వా స్త్రీ ఖిర్యస్య మనో హ్యతమ్ ॥
మాతరం మాం స్త్రియో భావం కృత్వా యేన బ్రవీషి హ ।
భవిష్యతి క్షయస్తేన కాలేన మమ శాపతః ॥

స్త్రీ లోలుని స్పృశించినంత మాత్రాన పుణ్యమంతయూ నశించును. స్త్రీలోలుడు పరమపాపి. వానిని చూచినచో, పాపము చుట్టు కొనును (20). స్త్రీ లోలుడైన పురుషుడు మంచి కర్మలను చేసిననూ సర్వదా అపవిత్రుడే యగును. ఆతనిని పితృదేవతలు, దేవతలు, మరియు సర్వమానవులు నిందించెదరు (21). ఎవని మనస్సు స్త్రీ లయందు లగ్నమై యుండునో, వానికి జ్ఞానముతో గాని, గొప్ప తపస్సుతో గాని, జపహోమ పూజాదులతో గాని, విద్యతో గాని, దానముతో గాని పని యేమున్నది? (22) నీకు తల్లిని అగు నా యందు నీవు స్త్రీ భావమును కలిగి మాటలాడి నావు. నేను నిన్ను శపించుచున్నాను. నీవు కాలక్రమములో క్షయమును పొందగలవు (23).

వసిష్ఠ ఉవాచ ।

శ్రుత్వా ధర్మస్సతీశాపం నృపమూర్తిం విహాయ చ ।
ధృత్వా స్వమూర్తిం దేవేశః కంపమాన ఉవాచ హ ॥

వసిష్ఠుడిట్లు పలికెను –

ధర్ముడు ఆ పతివ్రత యొక్క శాపమును విని రాజవేషమును విడిచి పెట్టెను. ఆ దేవదేవుడు నిజరూపమును ధరించి వణికిపోవుచూ ఇట్లనెను (24).

ధర్మ ఉవాచః

మాతర్జానీహి మాం ధర్మం జ్ఞానినాం చ గురోర్గురుమ్ ।
పరస్త్రీ మాతృ బుద్ధిం చ కుర్వంతం సతతం సతి ॥
అహం తవాంతరం జ్ఞాతుమాగతస్తవ సన్నిధిమ్ ।
తవాహం చ మనో జానే తథాపి విధినోదితః ॥
కృతం మే దమనం సాధ్వి న విరుద్ధం యథోచితమ్ ।
శాస్తి స్వముత్పథ స్థానమీశ్వరేణ వినిర్మితా ॥
స్వయం ప్రదాతా సర్వేభ్యస్సుఖదుః ఖవరాన్ క్షమః ।
సంపదం విపదం యో హి నమస్తస్మై శివాయ హి ॥

ధర్ముడిట్లు పలికెను –

నేను ధర్ముడనని తెలుసుకొనుము. ఓ తల్లీ! నేను జ్ఞానులకు, గురువునకు కూడ గురుగురువును. ఓ పతివ్రతా! నేను సర్వదా పరస్త్రీని తల్లి అను బుద్ధితో దర్శించెదను (25). నేను నీ మనస్సు నెరుంగుదును. అయిననూ, విధిప్రేరితుడనై నీలోని లోపమును కని పెట్టుటకు నీ వద్దకు వచ్చినాను (26). ఓ సాధ్వీ! నీవు నాకు తగిన శాస్తిని చేసితివి. నీవు శపించుటలో తప్పు లేదు. తప్పు మార్గములో వెళ్లు వారికి ఈశ్వరుడు తగు శాస్తిని ఏర్పాటు చేయును (27). సర్వప్రాణులకు సుఖదుఃఖములను, వరములను స్వయముగానిచ్చువాడు, సంపదలను ఆపదలను కలిగించుటలో సమర్థుడు అగు ఆ శివుని కొరకు నమస్కారమగుగాక! (28)

శత్రుం మిత్రం సంవిధాతుం ప్రీతిం చ కలహం క్షమః ।

స్రష్టుం నష్టుం చ యస్సృష్టిం నమస్తస్మై శివాయ హి॥

యేన శుక్లీకృతం క్షీరం జలే శైత్యం కృతం పురా ।

దాహీకృతో హుతాశశ్చ నమస్తస్మై శివాయ హి ॥

ప్రకృతిర్నిర్మితా యేన తత్సృతి మహదాదితః ॥

బ్రహ్మవిష్ణు మహేశాద్యా నమస్తస్మై శివాయ హి॥

శత్రుత్వమును నెరపుటకు, మైత్రిని చేయుటకు, ప్రీతిని చూపుటకు, కలహమును చేయుటకు, సృష్టిని చేయుటకు, సృష్టిని ఉపసంహరించుటకు ఎవడు సమర్థుడో, అట్టి శివుని కొరకు నమస్కారము (29). ఎవడు పాలను తెల్లగా చేసినాడో, సృష్ట్యాదియందు నీటిలో చల్లదనమును నింపినాడో, అగ్నిని వేడిగా నిర్మించినాడో, అట్టి శివుని కొరకు నమస్కారము (30). ఎంతయూ ఆలోచించి మహదాది క్రమములో ప్రకృతి నుండి ఎవడైతే సృష్టిని చేసి, బ్రహ్మ విష్ణు రుద్రాదులను కూడా సృష్టించినాడో, అట్టి శివునకు నమస్కారమగుగాక! (31)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా పురతస్త స్యాస్తస్థౌ ధర్మో జగద్గురుః ।

కించిన్నో వాచ చకితస్తత్పాతి వ్రత్య తోషితః ॥

పద్మాపి నృపకన్యా సా పిప్పలాదప్రియా తదా।

సాధ్వీ తం ధర్మమా జ్ఞాయ విస్మితో వాచ పర్వత ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

జగద్గురువగు ధర్ముడు ఇట్లు పలికి ఆమె ఎదుట నిలబడెను. ఆమె యొక్కక పాతివ్రత్యమునకు సంతోషమును, విస్మయమును పొందిన ధర్ముడు ఏమియూ మాటలాడకుండెను (32). ఓ శైలరాజా! అపుడు రాజకుమార్తె, పిప్పలాదుని పత్ని, మహాసాధ్వియగు పద్మకూడ ఆతడు ధర్ముడని ఎరింగి విస్మయమును పొంది ఇట్లు పలికెను (33).

పద్మోవాచ ।

త్వమేవ ధర్మ సర్వేషాం సాక్షీ నిఖిలకర్మణామ్ ।
కథం మనో మే విజ్ఞాతుం విడంబయసి మాం విభో ॥
యత్త త్సర్వం కృతం బ్రహ్మన్ నాపరాధో బభూవ మే ॥
త్వం చ శప్తో మయాన్ జ్ఞానాత్ స్త్రీ స్వభావాద్వృథా వృష ॥
కా వ్యవస్థా భవేత్త స్య చింతయామీతి సాంప్రతమ్ ।
చిత్తే స్ఫురతు సా బుద్ధిర్యయా శం సంలభామి వై ॥
ఆకాశోఽ సౌ దిశస్సర్వా యది నశ్యంతు వాయవః ।
తథాపి సాధ్వీశాపస్తు న నశ్యతి కదాచన ॥

పద్మ ఇట్లు పలికెను -

ఓ ధర్మా! సర్వప్రాణుల సర్వకర్మలకు సాక్షివి అగు నీవు నా మనస్సును తెలుసుకొనుటకు ప్రయత్నించుట ఎట్లు పొసగును? ఓ ప్రభూ! నీవు నన్ను మోసగించుచున్నావు (34). ఓ ధర్మా! వేదరూపా! జరిగిన సర్వములో నా అపరాధము లేదు. నేను శపించితిని (35). ఆ శాపమునకు ఇప్పుడు ఎట్టి వ్యవస్థను చేయవలెను? అని నేను ఆలోచించుచున్నాను. నా మనస్సులో చక్కని మార్గము స్ఫురించినచో, నాకు శాంతి లభించును (36). ఈ ఆకాశము, సర్వ దిక్కులు, వాయువు నశించిననూ పతివ్రత యొక్క శాపము ఎన్నటికీ వ్యర్థము కాదు (37).

సత్యే పూర్ణశ్చతుష్పాదః పౌర్ణమాస్యాం యథా శశీ ।
విరాజసే దేవరాజ సర్వకాలం దివానిశమ్ ॥
త్వం చ న భవసి చేత్ సృష్టినాశో భవేత్తదా ।
ఇతి కర్తవ్యతామూఢా వృథా చ వదామ్యహమ్ ॥
పాదక్షయశ్చ భవితా త్రేతాయాం చ సురోత్తమ ।
పాదోఽవ పరో ద్వాపరే చ తృతీయోఽ పి కలౌవిభో॥
కలిశేషేఽ ఖిలాశ్ఛిన్నా భవిష్యంతి తవాంఘ్రయః ।
పునస్సత్యే సమాయాతే పరిపూర్ణో భవిష్యసి ॥

ఓ దేవరాజా! నీవు సత్యయుగములో పూర్ణిమనాటి చంద్రునివలె నాల్గు పాదములతో రాత్రింబగళ్లు అన్ని కాలములయందు విరాజిల్లెదవు (38). నీవు నశించినచో సృష్టియే నశించిపోవును. ఏమి చేయవలెనో నాకు తెలియకున్నది. వ్యర్థముగా శపించినాను. అయిననూ, ఉపాయమును చెప్పుచున్నాను (39). ఓ దేవోత్తమా! త్రేతాయుగములో నీకు ఒక పాదము, ద్వాపరములో రెండు పాదములు, కలియుగములో మూడు పాదములు కూడ క్షయమును పొందును. హేవిభో! (40) కలియొక్క అంతిమభాగములో నీ పాదములన్నియూ ఛిన్నము కాగలవు. మరల సత్యయుగము రాగానే పరిపూర్ణుడవై వెలుగొంద గలవు (41).

సత్యే సర్వవ్యాపకస్త్వం తదన్యేషు చ కుత్రచిత్ ।

యుగవ్యవస్థయా స త్వం భవిష్యసి తథా తథా॥

ఇత్యేవం వచనం సత్యం మమాస్తు సుఖదం తవ ।

యామ్యహం పతిసేవాయై గచ్ఛ త్వం స్వగృహం విభో ॥

సత్య యుగములో నీవు సర్వవ్యాపకుడవై ఉండెదవు. ఇతరయుగములలో నీ వ్యాప్తి కొ౦న్ని స్థలములకు మాత్రమే పరిమితమగును. నీవు యుగ వ్యవస్థను అనుసరించి వృద్ధి "సములను పొందగలవు (42). ఈ నా మాటలు నీకు సుఖమును కలిగించుగాక! నేను సత్యమును పలికినాను. హే విభో! నేను పతిసేవకొరకు వెళ్లుచున్నాను. నీ గృహమునకు నీవు చేరుకొనుము (43).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్యా స్సంతుష్టోఽ భూద్వృషస్స వై ।

తదేవం వాదినీం సాధ్వీమువాచ విధినందన ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ నారదా! ఆ ధర్ముడు ఆమె యొక్క ఆ మాటను విని సంతుష్టుడాయెను. మరియు ఆతడు ఆ పతివ్రతతో నిట్లనెను (44).

ధర్మ ఉవాచ ।

ధన్యాసి పతి భక్తాసి స్వస్తి తేఽస్తు పతివ్రతే ।

వరం గృహాణ త్యక్త్వా మీ త్వత్పరి త్రాణకారణాత్ ॥

యువా భవతు తే భర్తా రతి శూరశ్చ ధార్మికః ।

రూపవాన్ గుణవాన్ వాగ్మీ సంతతస్థిర యౌవనః ॥

చిరంజీవీ స భవతు మార్కండే యాత్పరశ్శుభే ।

కుబేరాద్ధనవాంశ్చైవ శక్రా ద్దైశ్వర్య వానపి ॥

శివభక్తో హరిసమస్సిద్ధస్తు కపిలాత్పరః ।

బుద్ధ్యా బృహస్పతి సమస్సమత్వేన విధేస్సమః ॥

ధర్ముడిట్లు పలికెను -

ఓ పతివ్రతా! నీవు ధన్యురాలవు. పతియందు భక్తిగల నీకు మంగళమగుగాక! వరమును కోరుకొనుము. నీ భర్త నిన్ను రక్షించవలెను గదా! (45) కావున నీ భర్త యువకుడు, కామకేళియందు సమర్థుడు, ధార్మికుడు, రూపవంతుడు, గుణవంతుడు, వాగ్మి, సంతతము స్థిరము అగు యౌవనము గలవాడు అగుగాక! (46) ఓ మంగళ స్వరూపులారా! నీ భర్త మార్కండేయుని కంటె అధిక చిరంజీవి, కుబేరుని కంటే అధిక ధనవంతుడు, ఇంద్రునికంటె అధికైశ్వర్యము గలవాడు (47), మరియు విష్ణువుతో సమమగు శివభక్తి గలవాడు, కపిలుని కంటే గొప్ప సిద్ధుడు, బృహస్పతితో సమమగు బుద్ధిశాలి, బ్రహ్మతో సమమగు సమత్వ భావన గలవాడు అగుగాక! (48)

స్వామి సౌభాగ్య సంయుక్తా భవ త్వం జీవనావధి ।
తథా చ సుభగే దేవి త్వం భవ స్థిరయౌవనా ॥
మాతా త్వం దశపుత్రాణాం గుణినాం చిరజీవినామ్ ।
స్వభర్తురధికానాం చ భవిష్యసి న సంశయః ॥
గృహా భవంతు తే సాధ్వి సర్వ సంపత్సమన్వితాః ।
ప్రకాశమంత స్సతతం కుబేర భవనాధికాః ॥

ఓ సుందరీ! నీవు జీవించినంత కాలము భర్తృ సౌభాగ్యముతో నలరారుము. ఓ దేవీ! మరియు నీ యౌవనము స్థిరముగా నుండగలదు (49). నీ భర్తకంటే అధిక గుణవంతులు చిరంజీవులు అగు పదిమంది పుత్రులకు నీవు తల్లివి కాగలవు. సందేహము లేదు (50). ఓ సాధ్వీ! నీ గృహము సర్వ సంపదలతో గూడి కుబేరుని భవనము కంటే అధికముగా సర్వకాలములయందు విలసిల్లును గాక! (51)

వసిష్ఠ ఉవాచ ।

ఇత్యేవముక్త్వా సంతస్థౌ ధర్మస్స గిరిసత్తమ ।
సా తం ప్రదక్షిణీ కృత్య ప్రణమ్య స్వగృహం యయౌ।
ధర్మస్తథాశిషో దత్త్వా జగామ నిజమందిరమ్ ।
ప్రశశంస చ తాం ప్రీత్యా పద్మాం సంసది సంసది ॥
సా రేమే స్వామినా సార్ధం యూనా రహసి సంతతమ్ ।
పశ్చాద్బభూవు స్సత్పు త్రాస్తద్భర్తు రధికా గుణైః ॥
బభూవ సకలా సంపద్దంపత్యో స్సుఖవర్ధినీ ।
సర్వానందవృద్ధికరీ పరత్రేహ చ శర్మణే ॥

వసిష్ఠుడిట్లు పలికెను -

ఓ పర్వతరాజా! ఇట్లు పలికి ఆ ధర్ముడు నిలబడి యుండెను. ఆమె ఆతనికి ప్రదక్షిణము చేసి నమస్కరించి తన గృహమునకు వెళ్లెను (5 2). ధర్ముడు ఆమెకు ఆ విధముగా ఆశీర్వచనములను పలికి తన గృహమునకు వెళ్లెను. మరియు ఆతడు ప్రతిసభయందు ఆమెను ప్రీతితో కొనియాడెను (53). ఆమె యువకుడగు తన భర్తతో కలిసి నిరంతరముగా ఏకాంతమునందు రమించెను. తరువాత ఆమెకు తన భర్తకంటే అధిక గుణవంతులగు పుత్రులు కలిగిరి (54). సర్వానందములను వృద్ధిపొందించి ఇహపరములయందు సుఖశాంతులను కలిగించు సంపదలన్నియు ఆ దంపతులకు లభించెను (55).

శైలేంద్ర కథితం సర్వమితిహాసం పురాతనమ్ ।
దంపత్యోశ్చ తయోః ప్రీత్యా శ్రుతం తే పరమా దరాత్ ॥
బుద్ధ్వా తత్త్వం సుతాం దేహి పార్వతీ మీశ్వరాయ చ ।
కురోషం త్యజ శైలేంద్ర మేనయా స్వప్రియా సహ ॥
సప్తాహే సమతీతే తు దుర్లభేఽతి శుభే క్షణే ।
లగ్నాధిపే చ లగ్నస్థే చంద్రే స్వతనయాన్వితే ॥
ముదితే రోహిణీయుక్తే విశుద్ధే చంద్రతారకే ।
మార్గమాసే చంద్రవారే సర్వదోషవివర్జితే ॥

ఓ శైలరాజా! నీకీ పురాతనమగు ఇతిహాసమును సంపూర్ణముగా చెప్పితిని. నీవు ఆ దంపతుల చరితమును ప్రీతితో మహాదరముతో వింటివి (56). నీవు సత్యము నెరింగి నీ కుమార్తెయగు పార్వతిని శివునకు ఇమ్ము. ఓ పర్వతరాజా! నీవు, నీ భార్యయగు మేన చెడుదియగు రోషమును విడిచిపెట్టుడు (57). ఏడు రోజుల తరువాత, లభింప శక్యము కానిది, మిక్కిలి శుభమైనది అగు ముహూర్తములో లగ్నాధిపుడగు చంద్రుడు తన కుమారునితో గూడి లగ్నమునందుండి (58) ఆనందముతో రోహిణితో కలిసియుండగా, చంద్రుడు నక్షత్రములు స్వచ్ఛముగా ప్రకాశించుచుండగా, ఏ దోషములైననూ లేని మార్గశీర్షమాసములో సోమవారమునాడు వివాహమును చేయుము (59).

సర్వ సద్గ్రహ సంస్పృష్టేఽ సద్గ్రహ దృష్టి వర్జితే ।
సదపత్య ప్రదే జీవే పతి సౌభాగ్యదాయిని ॥
జగదంబాం జగత్పిత్రే మూల ప్రకృతిమీశ్వరీమ్ ।
కన్యాం ప్రదాయ గిరిజాం కృతీ త్వం భవ పర్వత ॥

మంచి గ్రహములన్నింటితో కూడియున్నది, చెడు గ్రహముల దృష్టి లేనిది, మంచి సంతాన యోగము కలది, భర్త జీవించి యుండు సౌభాగ్యమును ఇచ్చునది అగు ముహూర్తమునందు (60) జగన్మాత, మూల ప్రకృతి, ఈశ్వరి, కన్య అగు పార్వతిని జగత్పితకు ఇచ్చి వివాహమును చేయుము. ఓ పర్వతరాజా! ఇట్లు చేసి నీవు కృతార్థుడవు కమ్ము (61).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా మునిశార్దూలో వసిష్ఠో జ్ఞాని సత్తమః ।
విరరామ శివం స్మృత్వా నానా లీలాకరం ప్రభుమ్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీఖండే పద్మా
పిప్పలాద చరిత వర్ణనం నామ పంచత్రింశోఽ ధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

మునిశ్రేష్ఠుడు, జ్ఞానులలో ఉత్తముడు అగు వసిష్ఠుడు ఇట్లు పలికి, అనేక లీలలను ప్రదర్శించే శివప్రభుని స్మరించి విరమించెను (62).

36 – సప్తర్షుల ఉపదేశము

బ్రహ్మోవాచ ।

వసిష్ఠస్య వచశ్శ్రుత్వా సగణోఽపి హిమాలయః ।
విస్మితో భార్యయా శైలానువాచ స గిరీశ్వరః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

వసిష్ఠుని మాటను విని బంధువులతో భార్యతో గూడియున్న పర్వతరాజగు ఆ హిమవంతుడు ఇతర పర్వతములతో నిట్లనెను (1).

హిమాలయ ఉవాచ ।

హే మేరో గిరిరాట్ సహ్య గంధమాదన మందర ।
మైనాక వింధ్య శైలేంద్రా స్సర్వే శృణుత మద్వచః ॥
వసిష్ఠో హి వదత్యేవం కిం మే కార్యం విచార్యతే ।
యథా తథా చ శంసధ్వం నిర్ణీయ మనసా ఖిలమ్ ॥

హిమవంతుడిట్లనెను –

పర్వతరాజగు ఓ మేరు పర్వతమా! సహ్య గంధమాదన మందర మైనాక వింధ్య పర్వత శ్రేష్ఠులారా! నామాటను మీరందరు వినుడు (2). వశిష్ఠుడు ఇట్లు చెప్పుచున్నాడు. నా కర్తవ్యమేమిటి? అను విషయమును మీరు విచారించి సర్వమును మనస్సులో నిర్ణయించి నాకు చెప్పుడు (3).

శైలా ఊచుః ।

అధునా కిం విమర్శేన కృతం కార్యం తథైవ హి ।
ఉత్పన్నేయం మహాభాగ దేవకార్యార్థమేవ హి ॥
ప్రదాతవ్యా శివాయేతి శివస్యార్ధేవతారిణీ ।
అనయారాధితో రుద్రో రుద్రేణ యది భాషితా ॥

పర్వతములిట్లు పలికినవి –

ఇపుడు విమర్శించి ప్రయోజనమేమి? కర్తవ్యమును అనుష్ఠించవలెను. మహాత్మా! ఈమె దేవకార్యము కొరకు మాత్రమే జన్మించినది.(4). ఈమె రుద్రుని ఆరాధించినది. రుద్రుడు ఈమెతో సంభాషించినాడు. ఈమె శివుని కొరకే అవతరించినది గనుక, శివునకు ఇచ్చి వివాహమును చేయవలెను (5).

బ్రహ్మోవాచ ।

ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం మేర్వాదీనాం హిమాచలః ।
సుప్రసన్నతరోఽభూద్వై జహాస గిరిజా హృది ॥
అరుంధతీ చ తాం మేనాం బోధయామాస కారణాత్ ।
నానావాక్య సమూహేనేతి హాసైర్వివిధైరపి ॥

అథ సా మేనకా శైలపత్నీ బుద్ధ్వా ప్రసన్నధీః ।
మునీనరుంధతీం శైలం భోజయిత్వా బుభోజ చ ॥
అథ శైలవరో జ్ఞానీ సుసంసేవ్య మునీంశ్చ తామ్ ।
ఉవాచ సాంజలిః ప్రీత్యా ప్రసన్నాత్మా గత భ్రమః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

మేరువు ఇత్యాది పర్వతముల ఈ మాటను విని హిమవంతుడు మిక్కిలి ప్రసన్నుడాయెను. పార్వతి తన మనస్సులో నవ్వుకొనెను (6). అరుంధతి మేనకకు అనేక యుక్తులను, వివిధములగు ఇతిహాసములను చెప్పి ఆమెను ఒప్పించెను (7). అపుడు హిమవంతుని పత్నియగు మేనక తెలుసుకొని ప్రసన్నమగు మనస్సుగలదై మునులకు అరుంధతికి భోజనము పెట్టి తాను భుజించెను (8). అపుడు జ్ఞానియగు హిమవంతుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై, తొలగిన భ్రమలు గలవాడై మునులను, అరుంధతిని చక్కగా సెవించి చేతులు జోడించి ప్రీతిపూర్వకముగా నిట్లనెను (9).

హిమాచల ఉవాచః

సప్తర్షయో మహాభాగా వచశ్శృణుత మామకమ్ ।
విస్మయో మే గతస్సర్వ శ్శివయోశ్చరితం శ్రుతమ్ ॥
మదీయం చ శరీరం వై పత్నీ మేనా సుతాస్సుతా ।
బుద్ధిస్సిద్ధిశ్చ చాన్యద్వై శివస్యైవ న చాన్యథా ॥

హిమవంతుడిట్లు పలికెను –

సప్తర్షులారా! మహాత్ములారా! నా మాటను వినుడు. నాకు గల గర్వమంతయూ◌ా తొలగినది. ఉమాపరమేశ్వరుల చరితమును వింటిని (10). నా శరీరము, భార్యయగు మేన, కుమారులు, కుమార్తె, సాధనసంపత్తి, సిద్ధి, మరియు ఇతరము శివునకు చెందినదే గాని, మరియొకటి గాదు (11).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా స తదా పుత్రీం దృష్ట్వా తత్సాదరం చ తామ్ ।
భూషయిత్వా తదంగాని ఋష్యుత్సంగే న్యవేశయత్ ॥
ఉవాచ చ పునః ప్రీత్యా శైలరాజో ఋషింస్తదా ।
అయం భాగో మయా తస్మై దాతవ్య ఇతి నిశ్చితమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

హిమవంతుడు ఇట్లు పలికి తన కుమార్తెను ప్రేమతో వీక్షించి ఆమెను అలంకరింపజేసి మహర్షి యొక్క ఒడిలో కూర్చుండబెట్టెను (12). ఆ పర్వతరాజు మరల ఆ ఋషులతో నిట్లనెను: ఈ భాగమును నేను శివునకు ఇచ్చు చున్నాను. ఇది నిశ్చితము (13).

ఋషయ ఊచుః ।

శంకరో భిక్షుకస్తేఽథ స్వయం దాతా భవాన్ గిరే ।
భైక్ష్యం చ పార్వతీ దేవీ కిమతః పర ఉత్తమమ్ ॥
హిమవన్ శిఖరాణాం తే యద్వైతోస్సదృశీ గతిః ।
ధన్యస్త్వం సర్వశైలానా మధిపస్సర్వతో వరః ॥

ఋషులిట్లు పలికిరి -

ఓ పర్వతరాజా! యాచించువాడు శంకరుడు. దాత స్వయముగా నీవే. యాచింపబడునది పార్వతీ దేవి. ఇంతకంటే శ్రేష్ఠమగు సన్నివేశము మరి యేమి గలదు? (14) ఓ హిమవంతుడా! నీ ప్రవర్తన నీ శిఖరముల వలె ఉన్నతమై యున్నది. పర్వతములన్నింటికి అధిపతివగు నీవు అందరికంటె శ్రేష్ఠుడవు. నీవు ధన్యుడవు (15).

బ్రహ్మోవాచ ।

ఏవముక్త్వా తు కన్యాయై మునయో విమలాశయాః ।
ఆశిషం దత్తవంతస్తే శివాయ సుఖదా భవ ॥
స్పృష్ట్వా కరేణ తాం తత్ర కల్యాణం తే భవిష్యతి ।
శుక్లపక్షే యథా చంద్రో వర్ధంతాం త్వద్గుణాస్తథా ॥
ఇత్యుక్త్వా మునయస్సర్వే దత్త్వా తే గిరయే ముదా ।
పుష్పాణి ఫలయుక్తాని ప్రత్యయం చక్రిరే తదా ॥
అరుంధతీ తదా తత్ర మేనాం సా సుముఖీ ముదా ।
గుణైశ్చ లో భయామాస శివస్య పరమా సతీ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

పవిత్ర హృదయముగల ఆ మహర్షులు ఇట్లు పలికి, 'శివునకు సుఖమును ఇమ్ము' అని పార్వతిని ఆశీర్వదించిరి (16). 'నీకు మంగళము కలుగు గాక! శుక్ల పక్ష చంద్రుని వలె నీ గుణములు వృద్ధి పొందును గాక!' అని వారు పార్వతిని చేతితో స్పృశించి ఆశీర్వదించిరి (17). ఆ మహర్షులందు ఇట్లు పలికి హిమవంతునకు పుష్పములను, ఫలములను ఆనందముతో సమర్పించి విశ్వాసమును కలిగించిరి (18). గొప్ప శివభక్తురాలు, సాధ్వి, సుందరి అగు అరుంధతి ఆ సమయములో అచట మేనను. తన గుణసంపదచే తన వశము చేసుకొనెను (19).

హరిద్రా కుంకుమైః శైలశ్మ శ్రూణి ప్రత్యమార్జయత్ ।
లౌకికాచారమాధాయ మంగలాయనముత్తమమ్ ॥
తతశ్చ తే చతుర్థేఽహ్ని సంధార్య లగ్న ముత్తమమ్ ।
పరస్పరం చ సంతుష్య సంజగ్ముశ్శివ సన్నిధిమ్

తత్ర గత్వా శివం నత్వా స్తుత్వా వివిధసూక్తిభిః ।
ఊచుస్సర్వే వసిష్ఠాద్యా మునయః పరమేశ్వరమ్ ॥

ఆమె మంగళములకు నిలయము ఉత్తమము అగు లోకాచారము ననుసరించి హిమవంతుని మీసములకు పసుపు కుంకుమల లేపమును చేసెను (20), తరువాత వారు నాల్గవ దినమున ఉత్తమ లగ్నమును నిర్ణయించి పరస్పరము సన్మానించుకొని శివుని సన్నిధికి వెళ్లిరి (21). వసిష్ఠాది ఋషులందరు కైలాసమునకు వెళ్లి శివునకు నమస్కరించి అనేక సూక్తులచే స్తుతించి పరమేశ్వరునితో నిట్లనిరి (22).

ఋషయ ఊచుః ।

దేవదేవ మహాదేవ పరమేశ మహాప్రభో ।
శృణ్వస్మద్వచనం ప్రీత్యా యత్ కృతం సేవకైస్తవ ॥
బోధితో గిరిరాజశ్చ మేనా వివిధసూక్తి భిః ।
సేతిహాసం మహేశాన ప్రబుద్ధోఽసౌ న సంశయః ॥
వాక్యదత్తా గిరీంద్రేణ పార్వతీ తే హి నాన్యథా ।
ఉద్వాహాయ ప్రగచ్ఛ త్వం గణైర్దేవైశ్చ సంయుతః ॥
గచ్ఛ శీఘ్రం మహాదేవ హిమాచల గృహం ప్రభో ।
వివాహాయ యథా రీతిః పార్వతీ మాత్మజన్మనే ॥

ఋషులు ఇట్లనిరి –

దేవదేవా! మహాదేవా! పరమేశ్వరా! మహాప్రభూ! నీ సేవకులమగు మేము చేసిన కార్యము◌ను గురించి చెప్పెదము. మా మాటలను ప్రీతితో వినుము (23). ఓ మహేశ్వరా! మేనా హిమవంతులకు అనేకములగు మంచి మాటలను, ఇతిహాస దృష్టాంతములను బోధించి సత్యమును తెలుసుకొనునట్లు చేసితిమి. సందేహము లేదు (24). పర్వతరాజు పార్వతిని నీకు ఇచ్చినట్లు మాటను ఇచ్చినాడు. దీనికి విరోధము లేదు. నీవు దేవతలతో, గణములతో గూడి వివాహము కొరకు తరలి వెళ్లుము (25). ఓ మహాదేవా! ప్రభూ! నీవు పార్వతిని వివాహమాడి పుత్రసంతానమును పొందవలసి యున్నది. కావున శీఘ్రముగా హిమవంతుని గృహమునకు బయలుదేరుము (26).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా వచనం తేషాం లౌకికాచారతత్పరః ।
ప్రహృష్టాత్మా మహేశానః ప్రహస్యేదమువాచ సః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

లోకాచారములయందు శ్రద్ధగల మహేశ్వరుడు మిక్కిలి సంతసించిన మనస్సు గలవాడై వారి ఆ మాటలను విని నవ్వి ఇట్లు పలికెను (27).

మహేశ ఉవాచ ।

వివాహో హి మహాభాగా న దృష్టో న శ్రుతో మయా ।
యథా పురా భవద్భి స్తద్విధః ప్రోచ్యో విశేషతః ॥

మహేశ్వరుడిట్లు పలికెను -

మహాత్ములారా! నేను వివాహమును గురించి వినలేదు, చూడలేదు. మీరు పూర్వ◌ ్వము వివాహ విధానమును నిర్వచించి యున్నారు. ఆ వివరములను నాకు చెప్పుడు (28).

బ్రహ్మోవాచ ।

తదాకర్ణ్య మహేశస్య లౌకికం వచనం శుభమ్ ।
ప్రత్యూచుః ప్రహసంతస్తే దేవదేవం సదాశివమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను —

మహేశుని శుభకరమగు ఆ లౌకిక వచనము విని వారు నవ్వి ఆ దేవదేవుడగు సదాశివునకు ఇట్లు బదులిడిరి (29).

ఋషయ ఊచుః ।

విష్ణుమాహూయ వై శీఘ్రం ససమాజం విశేషతః ।
బ్రహ్మాణం ససుతం ప్రీత్యా తథా దేవం శతక్రతుమ్ ॥
తథా ఋషి గణాన్ సర్వాన్ యక్ష గంధర్వ కిన్నరాన్ ।
సిద్ధాన్ విద్యాధరాం శ్చైవ తథా సైవాప్సరోగణాన్ ॥
ఏతాంశ్చాన్యాన్ ప్రభో సర్వానానయస్వేహ సాదరమ్ ।
సర్వం సంసాధయిష్యంతి త్వత్కార్యం తే న సంశయః ॥

ఋషులిట్లు పలికిరి -

పరివారముతో గూడిన విష్ణువును వెంటనే ప్రత్యేకముగా ఆహ్వానించుడు. మరియు కుమారులతో గూడిన బ్రహ్మను, ఇంద్రదేవుని ప్రీతి పూర్వకముగా ఆహ్వానించుడు (30). మరియు సర్వ ఋషిగణములను, యక్ష గంధర్వ కిన్నర సిద్ధ విద్యాధరులను, అప్సరసల గణములను పిలిపించుడు (31). ఓ ప్రభూ! వీరిని ఇతరులను అందరిని ఇచటకు సాదరముగా పిలిపించుడు. వారు నీ కార్యమును అంతనూ చక్కబెట్టగలరు. సందేహము వలదు (32).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా సప్త ఋషయస్తదాజ్ఞాం ప్రాప్య తే ముదా ।
స్వధామ ప్రయయుస్సర్వే సంసంత శ్శాంకరీం గతిమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీఖండే
సప్తర్షివచనం నామ షట్ త్రింశోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ సప్తర్షులు ఇట్లు పలికి శివుని యాజ్ఞను బడసి, వారందరు శంకరుని మహిమను కొనియాడుతూ ఆనందముతో తమ ధామకు వెళ్లిరి (33).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు పార్వతీ ఖండలో సప్తర్షుల ఉపదేశము అనే ముప్పది యారవ అధ్యాయము ముగిసినది (36).

37 – పెళ్ళి హడావుడి

నారద ఉవాచ ।

తాత ప్రాజ్ఞ వదేదానీం సప్తర్షిషు గతేషు చ ।
కిమకార్షీ ద్గిమగిరిస్తన్మే కృత్వా కృపాం ప్రభో ॥

నారదుడిట్లు పలికెను –

తండ్రీ! నీవు ప్రాజ్ఞుడవు. హే ప్రభో! నాయందు దయ ఉంచి, సప్తర్షులు వెళ్లిన తరువాత హిమవంతుడు ఏమి చేసెను? అను వృత్తాంతమును నాకు చెప్పుము (1).

బ్రహ్మోవాచ ।

గతేషు తేషు మునిషు సప్తస్వపి మునీశ్వర ।
సారుంధతీషు హిమవాన్ యదకార్షీ ద్వదామి తే ॥
తత ఆ మంత్ర్య స్వభ్రాతౄన్ మేర్వాదీన్ ససుతప్రియః ।
మహామనాస్స ముముదే హిమవాన్ పర్వతేశ్వరః ॥
తదాజ్ఞప్తస్తతః ప్రీత్యా హిమవాన్ లగ్న పత్రికామ్ ।
లేఖయామాస సుప్రీత్యా గర్గేణ స్వపురోధసా॥
అథ ప్రస్థాపయామాస తాం శివాయ స పత్రికామ్ ।
నానావిధాస్తు సామగ్ర్యస్స్వజ నైర్ముదితాత్మభిః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అరుంధతితో గూడి సప్తర్షులు వెళ్లిన తరువాత హిమవంతుడు ఏమి చేసినాడు అను విషయమును నీకు చెప్పెదను. ఓ మహర్షీ! (2) మహాత్ముడు, పర్వతేశ్వరుడు అగు హిమవంతుడు తరువాత మేరువు మొదలగు తన సోదరులను, కుమారులను, బంధువులను ఆహ్వానించి ఆనందించెను (3). మహర్షుల ఆజ్ఞ ప్రకారము హిమవంతుడు తమ పురోహితుడగు గర్గుని చేత ప్రీతి పూర్వకముగా లగ్నపత్రికను వ్రాయించెను (4). తరువాత ఆయన ఆ పత్రికను, అనేక విధములగు వస్తువులను, ఆనందముతో నిండిన హృదయములు గల బంధువులచేత శివునికి పంపించెను (5).

తే జనాస్తత్ర గత్వా చ కైలాసే శివసన్నిధిమ్ ।
దదు శ్శివాయ తత్పత్రం తిలకం సం విధాయ చ ॥
సమ్మానితా విశేషేణ ప్రభుణా చ యథోచితమ్ ।
సర్వే తే ప్రీతమనస ఆ జగ్ముశ్శైల సన్నిధిమ్ ॥
సమ్మానితాన్ విశేషణ మహేశేనాగతాన్ జనాన్ ।
దృష్ట్వా సుహర్షితాన్ శైలో ముమోదీతీవ చేతసి ॥

తతో నిమంత్రణం చక్రే స్వబంధూనాం ప్రమోదితః ।
నానాదేశ స్థితానాం చ నిఖిలానాం సుఖాస్పదమ్ ॥

ఆ జనులు కైలాసములో శివుని సన్నిధికి చేరి ఆ పత్రమునకు తిలకముసద్ది శివునకు సమర్పించిరి (6). వారందరికి .ఆ ప్రభుడు యథాయోగ్యముగా ప్రత్యేక సన్మానమును చేయగా, వారు ఆనందముతో నిండిన మనస్సు గలవారై పర్వతుని సన్నిధికి మరలి వచ్చిరి (7). మహేశ్వరునిచే ప్రత్యేకముగా సన్మానింపబడి మిక్కిలి ఆనందముతో తిరిగి వచ్చిన ఆ జనులను చూచి పర్వతరాజు మనస్సులో చాల సంతోషించెను (8). అపుడాయన ఆనందముతో అనేక. దేశములందున్న తన బంధువులందరికీ ప్రీతికరమగు ఆహ్వానములను పంపెను (9).

తతస్స కారయామాస స్వర్ణ సంగ్రహమాదరాత్ ।
నానా విధాశ్చ సామగ్రీర్వివాహకరణోచితాః ॥
తండులానాం బహూన్ శైలాన్ పృథుకానాం తథైవ చ ।
గుడానాం శర్కరాణాం చ లవణానాం తథైవ చ ॥
క్షీరాణాం చ ఘృతానాం చ దధ్నాం వాపీశ్చకార సః ।
యవాది ధాన్యపిష్టానాం లడ్డుకానాం తథైవ చ ॥
శష్కులీనాం స్వస్తికానాం శర్కరాణాం తథైవ చ ।
అమృతేక్షు రసానాం చ తత్ర వాపీశ్చకార సః ॥

తరువాత ఆయన వివాహమునకు కావలసిన వివిధ సామగ్రులను, బంగారమును శ్రద్ధతో ప్రో[illegible]గుచేయదొచ్చెను (10). బియ్యము, అటుకులు, బెల్లము, పంచదార, మరియు లవణము పర్వత శిఖరములవలె గుట్టలుగా పోయబడి యుండెను (11). పాలు, నేయి మరియు పెరుగును దిగుడు బావుల వంటి పాత్రలలో నింపియుంచిరి. యవలు మొదలగు ధాన్యములు, వాటి పిండి, మిఠాయి (12), చేగోడీలు, స్వస్తికలు, ఇతర మధుర పదార్థములు గుట్టలుగా పోయబడెను, మరియు అమృతమువంటి చెరుకు రసము నూతుల రూపములో లభింపచేయబడెను.(13).

బిభ్యాశ్శైయం గవానాం చ హ్యైసవానాం తథైవ చ ।
నానా పక్వాన్న సంఘాంశ్చ మహాస్వాదురసాంస్తథా ॥
నానా వ్యంజనవస్తూని గణదేవహితాని చ ।
అమూల్యా నానా వస్త్రాణి వహ్నిశౌచాని యాని చ ॥
మణిరత్న ప్రకారాణి సువర్ణరజతాని చ ।
ద్రవ్యాణ్యే తాని చాన్యాని సంగృహ్య విధిపూర్వకమ్ ॥
మంగలం కర్తు మారే ఖే గిరిర్మంగల కృద్దినే ।
సంస్కారం కారయామాసుః పార్వత్యాః పర్వతస్త్రియః ॥

తాజా నెయ్యి, ఆసవములు సమృద్ధిగా సరఫరా చేయబడెను. గొప్ప రుచి గల వివిధరకముల అన్నము సమృద్ధముగా లభించుచుండెను (14). శివగణములకు, దేవతలకు అభీష్టములగు అనేకరకముల పచ్చళ్లు సిద్ధమయ్యెను. గొప్ప విలువైన అనేక వస్త్రములు సిద్ధముగా నుంచబడెను. అగ్నియందు శుద్ధి చేయబడిన వెండి బంగారములు భద్రపరుప బడెను (15). ఆయన వివిధ మణులను, రత్నములను, బంగారమును, వెండిని, ఇతర ద్రవ్యములను యథావిధిగా సంపాదించి సిద్ధము చేసెను (16). మంగళ కార్యములను చేయవలసిన రోజున ఆయన ఆ కార్యములను మొదలు పెట్టించెను. పర్వతుని అంతః పురస్త్రీ లు పార్వతికి స్నానాది సంస్కారములను చేయించిరి (17).

తా మంగలం ముదా చక్రుర్భూషితా భూషణైస్స్వయమ్ ।
పురద్విజస్త్రి యో హృష్టా లోకాచారం ప్రచక్రిరే ॥
సోత్సవం వివిధం తత్ర సుమంగల పురస్సరమ్ ।
హిమాలయోఽ పి హృష్టాత్మా కృత్వాచారం సుమంగలమ్ ॥
సర్వభావేన సుప్రీతో బంధువర్గా గమోత్సుకః ।
ఏతస్మిన్నంతరే తస్య బాంధవాశ్చ నిమంత్రితాః ॥
ఆ జగ్ము స్స్త్రియో హృష్టా స్స సుతాస్సపరిచ్ఛదాః ।
తదైవ శృణు దేవర్షే గిర్యా గమన మాదృతః ॥
వర్ణయామి సమాసేన శివప్రీతి వివృద్ధయే ।
దేవాలయ గిరి ర్యో హి దివ్యరూపధరో మహాన్ ॥

ఆ నగరములోని బ్రాహ్మణ స్త్రీలు తాము అలంకరించుకొని లోకాచారము ననుసరించి ఆనందముతో మంగళ కర్మల ననుష్ఠించిరి (18). హిమవంతుడు ఆనందముతో నిండిన మనస్సు గలవాడై మంగళకర్మలను, ఉత్సవమును ఆచారముననుసరించి చేయించెను (19). అదే సమయములో బంధువులకు ఆహ్వానమును పంపి, వారి రాక కొరకు ఉత్సాహముతో ప్రీతితో వేచియుండెను (20). బంధువులు, స్త్రీలు, పిల్లలు, పరిచారకులతో సహా విచ్చేసిరి. ఓ దేవర్షి! ఇతర పర్వతరాజులు వేంచేసిన తీరును శ్రద్ధతో వినుము (21). శివుని ప్రీతిని పెంపొందించుట కొరకై దేవతలకు నిలయమగు మేరువు దివ్యరూపమును ధరించి విచ్చేసిన తీరును సంగ్రహముగా వర్ణించెదను (22).

నానారత్న పరిభ్రాజత్సమాజ స్సపరిచ్ఛదః ।
నానామణి మహారత్న సారమాదాయ యత్నతః ॥
సువేషాలం కృత ■మాన్ జగామ స హిమాలయమ్ ।
మందర స్సర్వ శోభాఢ్య స్సనారీతనయో గిరిః ॥
సూపాయనాని సంగృహ్య జగామ వివిధాని చ ।
అస్తాచలోఽపి దివ్యాత్మా సోపాయన ఉదారధీః ॥
బహు శోభా సమాయుక్త ఆ జగామ ముదాన్వితః ।
ఉదయాచల ఆదాయ సద్రత్నాని మణీనపి ॥

అనేక రత్నాభరణములతో ప్రకాశించే బంధువర్గము గల వాడై, విలువైన వస్త్రములను ధరించి, అనేకమణులను సారభూతములగు మహారత్నములను శ్రద్ధతో సంపాదించి వాటిని తీసుకుని(23), ఆ మేరుపర్వతుడు చక్కని వేషముతో అలంకరించుకుని ప్రకాశించువాడై హిమవంతుని రాజధానికి వెళ్లెను. భార్యతో కుమారులతో గూడి మందర పర్వతుడు అనేక శోభలతో నిండినవాడై (24), వివిధములగు బహుమతులను సంగ్రహించుకొని వెళ్లెను. దేవతా స్వరూపుడు, విశాల హృదయుడు, వివిధశోభలతో కూడినవాడు అగు అస్తాచలుడు కూడా బహుమానములను తీసుకొని (25) ఆనందముతో విచ్చేసెను. ఉదయాచలుడు గొప్ప రత్నములను, మణులను కూడ తీసుకొని విచ్చేసెను (26).

అత్యుత్కృష్ట పరీవార ఆజగామ మహాసుఖీ ।
మలయో గిరిరాజో హి సపరివార ఆదృతః ॥
సుదివ్యరచనాయుక్త ఆయయౌ బహుసద్బలః ।
సద్యో దర్దురనామా చ ముదితస్సకలజాకః ॥
బహుశో భాన్వితస్తాత యయౌ హిమగిరేర్గృహమ్ ।
నిషధోఽపి ప్రహృష్టాత్మా సపరిచ్ఛద ఆయయౌ ॥
స సుతస్త్రీ గణః ప్రీత్యా యయౌ హిమగిరేర్గృహమ్ ।
ఆజగామ మహా భాగ్యో భూధరో గంధమాదనః ॥

పెద్ద పరివారము గలవాడు, మహా సుఖము గలవాడు అగు మలయ పర్వతుడు ఆదరముతో విచ్చేసెను (27). గొప్ప విన్యాసము గలవాడు, మహాబలశాలి అగు దరురుడు భార్యతో గూడి ఆనందముతో శీఘ్రముగా విచ్చేసెను (28). ఓ కుమారా! గొప్ప శోభగలవాడు, హర్షముతో నిండిన మనస్సు గలవాడు అగు నిషదుడు కూడా నూతన వస్త్రములను ధరించి హిమవంతుని ఇంటికి వచ్చెను (29). మహాభాగ్యవంతుడగు గంధమాదన పర్వతుడు భార్యలతో, కుమారులతో గూడి ప్రీతితో హిమవంతుని గృహమునకు విచ్చేసెను (30).

కరవీరస్త థైవాపి మహావిభవ సంయుతః ।
మహేంద్రః పర్వత శ్రేష్ఠ ఆ జగామ హిమాలయమ్ ॥
సగణస్స సుతస్త్రీ కో బహు శోభా సమన్వితః ।
పారియాత్రో హి హృష్టాత్మా మణిరత్నాకరస్సయుత్ ॥
సగణస్సపరివార ఆయయౌ హిమభూధరమ్ ।
క్రౌంచః పర్వతరాజో హి మహాబలపరిచ్ఛదః ।
ఆ జగామ గిరి శ్రేష్ఠ స్సముపాయన ఆదృతః ॥
పురుషోత్తమ శైలోఽ పి సపరిచ్ఛద ఆదృతః ।
మహోపాయన మాదాయాజగామ హిమభూధరమ్ ॥

గొప్ప సంపదతో గూడియున్న కరవీరుడు, మరియు పర్వత శ్రేష్ఠుడగు మహేంద్రుడు హిమవంతుని గృహమునకు విచ్చేసిరి (31). గొప్ప శోభతో ప్రకాశించే పారియాత్రుడు భార్యలు, కుమారులు, బంధువులతో గూడి హర్షముతో నిండిన మనస్సు గలవాడై విచ్చేసెను. మణులకు, రత్నములకు నిధియగు ఆతడు వాటిని దోడ్కొని వచ్చెను (32). పర్వత శ్రేష్ఠుడగు క్రౌంచుడు పెద్ద సైన్యమును, పరివారమును, గణములను దోడ్కొని, బహుమానములను తీసుకొని సాదరముగా హిమవంతుని గృహమునకు విచ్చేసెను (33). పురుషోత్తమ పర్వతుడు కూడ పరివారముతో గూడి గొప్ప బహుమతులను తీసుకొని సాదరముగా హిమవంతుని గృహమునకు విచ్చేసెను (34).

నీలస్స లీలస్సుత స్సస్త్రీ కో ద్రవ్యసంయుతః ।
ఆ జగామ హిమా గస్య గృహమానంద సంయుతః ॥
త్రికూట శ్చిత్ర కూటోఽపి వేంకట శ్శృగిరిస్తథా ।
గోకాముఖో నారదశ్చ హిమగేహము పాగమత్ ॥
వింధ్యశ్చ పర్వత శ్రేష్ఠో నానా సంపత్సమన్వితః ।
ఆ జగామ ప్రహృష్టాత్మా సదార తనయశ్శుభః ॥
కాలంజరో మహాశైలో బహుహర్ష సమన్వితః ।
బహుభస్సగణః ప్రీత్యా జగామ హిమభూధరమ్ ॥

లీలలతో, ఆనందముతో గూడియున్న నీలుడు భార్యలను, కుమారులను దోడ్కొని ధనమును తీసుకొని హిమవంతుని గృహమునకు విచ్చేసెను (35). త్రికూటుడు, చిత్రకూటుడు, వేంకటుడు, శ్రీపర్వతుడు, గోకాముఖుడు మరియు నారదుడు హిమవంతుని గృహమునకు విచ్చేసిరి (36). అనేక సంపదలతో గూడినవాడు, పర్వత శ్రేషుడు, శుభకరుడునగు వింధ్యుడు ఆనందముతో నిండిన మనస్సు గలవాడై భార్యతో, కుమారులతో గూడి విచ్చేసెను (37). మహాపర్వతుడు, అనేక కాంతులు గలవాడు అగు కాలంజరుడు మహానందముతో గూడినవాడై, గణములను దోడ్కొని ప్రీతితో హిమవంతుని గృహమునకు విచ్చేసెను (38).

కైలాసస్తు మహాశైలో మహాహర్ష సమన్వితః ।
ఆజగామ కృపాం కృత్వా సర్వోపరి లసత్ప్రభుః ॥
అన్యేఽపి భూ భృతో యే హి ద్వీపేష్వన్యేష్వపి ద్విజ ।
ఇహాపి యేఽచలాస్సర్వే ఆయయుస్తే హిమాలయమ్ ॥
నిమంత్రితా నగాస్తత్ర తేన పూర్వం ముదా మునే ।
ఆయయుర్నిఖిలాః ప్రీత్యా వివాహ శ్శివయోరితి ॥
తదా సర్వే సమాయాతాశ్శోణా భద్రాదయః ఖలు ।
బహుశోభా మహా ప్రీత్యా వివాహశ్శివయోరితి ॥

మహాశైలుడు, సర్వపర్వతములకు పై స్థాయిలో ప్రకాశించు ప్రభుడునగు కైలాసుడు మహహర్షముతో కూడినవాడై దయను చేసి విచ్చేసెను (39). ఓ విప్రా! ఈ ద్వీపములోనే గాక ఇతరద్వీపములలో నున్న పర్వతములు అన్నియూ కూడా హిమవంతుని నగరమునకు విచ్చేసెను (40). ఓ మహర్షీ! హిమవంతుడు పూర్వమే వారిని ఆనందముతో ఆహ్వానించి యుండెను. పార్వతీ పరమేశ్వరుల వివాహము గనుక వారందరు ప్రేమతో విచ్చేసిరి (41). అపుడు శోణా, భద్రా మొదలగు గొప్ప శోభగల నదులన్నియూ పార్వతీపరమేశ్వరుల వివాహము గనుక మహానందముతో విచ్చేసిరి (42).

నద్య స్సర్వాస్సమాయాతా నానాలంకారసంయుతాః ।
దివ్యరూపధరాః ప్రీత్యా వివాహ శ్శివయోరితి ॥
గోదావరీ చ యమునా బ్రహ్మ శ్రీర్వేణికా తథా ।
ఆయయౌ హిమశైలం వై వివాహశ్శివయోరితి ॥
గంగా తు సుమహా ప్రీత్యా నానాలంకార సంయుతా ।
దివ్యరూపా యయౌ ప్రీత్యా వివాహశ్శివయోరితి ॥
నర్మదా తు మహామోదా రుద్రకన్యా సరిద్వరా ।
మహాప్రీత్యా జగామాశు వివాహ శ్శివయోరితి ॥

నదులన్నియూ దివ్యరూపములను ధరించి అనేకములగు అలంకారములను పెట్టుకొని పార్వతీ శివుల వివాహమును కారణముచే ప్రీతితో విచ్చేసిరి (43). గోదావరి, యమునా, సరస్వతి, మరియు వేణి అను నదులు పార్వతీ పరమేశ్వరుల వివాహమును దర్శించుటకై హిమవత్పర్వతమునకు విచ్చేసిరి (44). గంగానది పార్వతీ పరమేశ్వరుల వివాహమును దర్శించుట కొరకై దివ్యరూపమును ధరించి అనేకములగు భూషణములతో అలంకరించుకొని మహానందముతో విచ్చేసెను (45). రుద్రుని కుమార్తె, గొప్ప నదియగు నర్మద పార్వతీ పరమేశ్వరుల వివాహమను కారణముచే మహానందముతో శీఘ్రముగా విచ్చేసెను (46).

ఆగతైస్తై స్తతస్సర్వై స్సర్వతో హిమభూధరమ్ ।

సంకులాసీత్పురీ దివ్యా సర్వ శోభా సమన్వితా ॥

మహోత్సవా లసత్కేతు ధ్వజా తోరణకాధికా ।

వితాన వినివృత్తార్కా తథా నానాలసత్ప్రభా ॥

హిమాలయోఽ పి సుప్రీత్యా దరేణ వివిధేన చ ।

తేషాం చకార సన్మానం తాసాం చైవ యథాయథమ్ ॥

సర్వాన్నివాసయామాస సుస్థానేషు పృథక్ పృథక్ ।

సామగ్రీభిరనే కాభిస్తోషయామాస కృత్స్న శః ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే లగ్నపత్ర సంప్రేషణ సామగ్రీ సంగ్రహ శైలా గమన వర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥

అన్ని వైపులనుండి విచ్చేసిన వారందరితో హిమవంతుని దివ్య నగరము అంతటా నిండియుండెను. ఆ నగరము సర్వవిధముల శోభలతో నలరారెను (47). అచట మహోత్సవము ప్రవర్తిల్లెను. జెండాలు, ధ్వజములు, తోరణములు అధికముగా నుండెను. చాందినీల విస్తారముచే సూర్యకాంతి చొరకుండెను. అయిననూ, అనేక కాంతులతో ప్రకాశించెను (48). హిమవంతుడు మిక్కిలి ప్రీతితో ఆ పర్వతములకు, నదులకు యథోచితముగా సాదరముగా సన్మానమును చేసెను (49). వారి నందరిని వేర్వేరు గృహములలో నివసింపజేసి సమస్త సామగ్రుల నేర్పాటుచేసి వారిని సంతోష పెట్టెను (50).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు పార్వతీ ఖండలో పెళ్లి ఏర్పాట్లను వర్ణించే ముప్పది ఏడవ సర్గ ముగిసినది (37).

38 – వివాహ మండపము

బ్రహ్మోవాచ ।

అథ శైలేశ్వరః ప్రీతో హిమవాన్మునిసత్తమ ।
స్వపురం రచయామాస విచిత్రం పరమోత్సవమ్ ॥
సిక్తమార్గం సంస్కృతం చ శోభితం పరమర్ద్ధిభిః ।
ద్వారి ద్వారి చ రంభాది మంగల ద్రవ్య సంయుతమ్ ॥
ప్రాంగణం రచయామాస రంభాస్తంభ సమన్వితమ్ ।
పట్టసూత్రైస్సంనిబద్ధ రసాల పల్లవాన్వితమ్ ॥
మాలతీ మాల్య సంయుక్తం లసత్తోరణ సుప్రభమ్ ।
శోభితం మంగల ద్రవ్యైశ్చతుర్దిక్షు స్థితైశ్శుభైః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మునిశ్రేష్ఠా! తరువాత పర్వతరాజగు హిమవంతుడు ఆనందముతో నగరము నంతనూ రంగు రంగుల శోభ కల్గునట్లు అలంకరింపజేసెను. అచట గొప్ప ఉత్సవము ఆరంభమయ్యేను (1). మార్గములను నీటితో కడిగి శుద్ధి చేసి విలువైన అలంకారములతో శోభిల్లునట్లు చేసిరి. ద్వారములన్నింటి యందు అరటిస్తంభములు మొదలగు మంగళ ద్రవ్యములు అలంకరింపబడెను (2). వాకిటియందు అరటిస్తంభములను పాతి పట్టు దారములతో మామిడి చిగురుల తోరణములు కట్టబడెను (3). సింహద్వారములు మల్లెల మాలలతో శోభిల్లెను. నాల్గు దిక్కుల యందు ఉంచబడిన మంగళ ద్రవ్యములతో ఆ నగరము విరాజిల్లెను (4).

తత్రైవ సర్వం పరయా ముదాన్వితః చక్రే గిరీంద్రస్స్వ సుతార్థమేవ ।
గరం పురస్కృత్య మహాప్రభావం ప్రస్తావ యోగ్యం చ సుమంగలం హి ॥
ఆహూయ విశ్వకర్మాణం కారయామాస సాదరమ్ ।
మండపం చ సువిస్తీర్ణం వేదికాది మనోహరమ్ ॥
అయుతేన సురర్షే తద్యోజనానాం చ విస్తృతమ్ ।
అనేక లక్షణోపేతం నానాశ్చర్య సమన్వితమ్ ॥

గొప్ప ఆనందముతో కూడిన పర్వతరాజు గర్గుని ముందిడు కొని తన కుమార్తె వివాహము కొరకై గొప్ప ప్రభావశాలి, వర్ణింపయోగ్యమైనది, మంగళకరమైనది అగు వ్యవస్థను సమగ్రముగా చేసెను (5). విశ్వకర్మను సాదరముగా పిలిపించి మిక్కిలి విస్తీర్ణము, అతిమనోహరము అగు వివాహమండపమును నిర్మింపజేసెను (6). ఓ దేవర్షి! అనేక శుభలక్షణములతో గూడి మహాశ్చర్యమును కలిగించే ఆ మండపము పదివేల యోజనముల విస్తీర్ణమును కలిగియుండెను (7).

స్థావరం జంగమం సర్వం సదృశం తైర్మనోహరమ్ ।
సర్వతోఽ ద్భుత సర్వస్వం నానావస్తు చమత్కృతమ్ ॥
జంగమం విజితం తత్ర స్థావరేణ విశేషతః ।
జంగమేన చ తత్రాసీజ్జితం స్థావరమేవ హి ॥
పయసా చ జితా తత్ర స్థల భూమిర్న చాన్యథా ।
జలం కిం హి స్థలం కిం హి న విదుః కేఽపి కోవిదాః ॥
క్వచిత్ సింహాః కృత్రిమాశ్చ క్వచిత్సారసపంక్తయః ।
క్వచిచ్ఛిఖండినస్తత్ర కృత్రిమాశ్చ మనోహరాః ॥

ఆ నగరములోని చరాచర ప్రాణులన్నియూ సమానమగు సౌందర్యముతో మనస్సును హరించు చుండెను. సర్వత్రా అద్భుతములతో నిండియున్న ఆ నగరము అనేక చమత్కారకములగు వస్తువులతో నలరారెను (8). అచట స్థావరములు జంగమములను సౌందర్యములో జయించినవా? లేక జంగమములే స్థావరములను జయించినవా? చెప్పవలను పడదు (9). ఆ మండపమునందు జలము స్థలమును జయించినది. కుశలురగు వ్యక్తులైననూ జలస్థల భేదమును నిర్ణయించలేక పోయిరి (10). కొన్నిచోట్ల కృత్రిమ సింహములు, మరికొన్ని చోట్ల కృత్రిమ జల పక్షుల వరుసలు, ఇంకొన్ని చోట్ల కృత్రిమములగు నెమళ్లు అలంకరింపబడి మనోహరముగా నుండెను (11).

క్వచిత్ స్త్రియః కృత్రిమాశ్చ నృత్యంతః పురుషైస్సహా ।
మోహయంత్యో జనాన్ సర్వాన్ పశ్యంతః కృత్రిమాస్తథా ॥
తథా తేనైవ విధినా ద్వారపాలా మనోహరాః ।
హస్తైర్ధనూంషి చోద్ధృత్య స్థావరా జంగమోపమాః ॥
ద్వారి స్థితా మహాలక్ష్మీః కృత్రిమా రచితాద్భుతా ।
సర్వలక్షణ సంయుక్తా గతా సాక్షాత్పయోర్ణవాత్ ॥
గజాశ్చాలంకృతా హ్యాసన్ కృత్రిమ అకృతోపమాః ।
తథాఽశ్వాః సాదిభిశ్చైవ గజాశ్చ గజసాదిభిః ॥

కొన్నిచోట్ల కృత్రిమ స్త్రీలు కృత్రిమ పురుషులతో కలిసి నృత్యము చేయుచుం◌ండగా ఎందరో కృత్రిమ ప్రేక్షకులు పరవశులై తిలకించుచుండిరి(12). మరియు సుందరాకారులగు ద్వారపాలకులు చేతులతో ధనస్సులను ఎక్కు పెట్టి యుండిరి. అవి బొమ్మలే యైననూ ప్రాణము గలవి యన్నట్లుండెను (13). అద్భుతమగు మహాలక్ష్మీ విగ్రహము ద్వారమునందు నిర్మింపబడెను. సర్వలక్షణములతో విలసిల్లు ఆ విగ్రహము క్షీరసముద్రము నుండి ఆవిర్భవించిన లక్ష్మీదేవియా అన్నట్లుండెను (14). అలంకరింపబడిన కృత్రిమ గజములు యధార్థమగు ఏనుగులను పోలియుండెను. గుర్రములు రౌతులతో, గజములు మావటీండ్రతో కూడి యుండెను

రథా రథిబిరా కృష్టా మహైశ్వర్య సమన్వితాః ।
వాహనాని తథాన్యాని పత్తయః కృత్రిమాస్తథా ॥
ఏవం విమోహనార్థం తు కృతం వై విశ్వకర్మణా ।
దేవానాం చ మునీనాం చ తేన ప్రీతాత్మనా మునే ॥
మహాద్వారి స్థితో నందీ కృత్రిమశ్చ కృతో మునే ।
శుద్ధస్ఫటిక సంకాశో యథా నందీ తథైవ సః ॥
తస్యోపరి మహాదివ్యం పుష్పకం రత్నభూషితమ్ ।
రాజితం పల్లవై శ్శుభ్రై శ్చామరైశ్చ సుశోభితమ్ ॥

కృత్రిమమగు రథములను కృత్రిమసారథులు తోలుచుండిరి. ఇతర వాహనములు కూడ అటులనే అమర్చబడినవి. మరియు కృత్రిమమగు సైనిక దళములు కూడా ఉండెను. ఈ దృశ్యములన్నియూ మహైశ్వర్యమును కలిగించుచుండెను (16). ఓ మునీ! దేవతలను, మునులను మోహింపజేయుటకై విశ్వకర్మ ఉత్సాహముతో ఇట్టి దృశ్యములను నిర్మించెను (17). ఓ మహర్షీ! మహాద్వారమునందు ఒక కృత్రిమ నంది నిలబడియుండెను. స్వచ్ఛమగు స్ఫటికము వలె వెలుగొందు ఆ బొమ్మ యథార్థమగు నందివలెనే యుండెను (18). ఆ ద్వారమునకు పైన రత్నములతో, స్వచ్ఛమగు చిగుళ్లతో, మరియు పుష్పములతో అలంకరింపబడిన గొప్ప దివ్యమైన రత్నములతో ప్రకాశించే కృత్రిమ పుష్పక విమానము దేవతలతో గూడి మిక్కిలి శోభిల్లెను (19).

వామ పార్శ్వే గజౌ ద్వౌ చ శుద్ధ కాశ్మీర సన్నిభౌ ।
చతుర్దంతౌ షష్టివర్షౌ భేదమానౌ మహాప్రభౌ॥
తథైవార్కనిభౌ తేన కృతౌ చాశ్వౌ మహాప్రభౌ ।
చామరాలంకృతౌ దివ్యౌ దివ్యాలంకార భూషితౌ॥
దంశితా వరరత్నాఢ్యా లోకపాలాస్తథైవ చ ।
సర్వే దేవా యథార్థం వై కృతా వై విశ్వకర్మణా ॥
తథా హి ఋషయ స్సర్వే భృగ్వాద్యాశ్చ తపోధనాః ।
అన్యే హ్యుపసురాస్తద్వత్సిద్ధాశ్చాన్యేఽపి వై కృతాః ॥

ఎడమవైపున శుద్ధ కాషాయ వర్ణము గల రెండు ఏనుగులు నిర్మింపబడెను. నాల్గు దంతములతో గొప్పగా ప్రకాశించు ఆ ఏనుగులు అరువది సంవత్సరములు వయసు గలవా యన్నట్లు భాసించెను. అవి పరస్పరము స్పృశించుచున్నట్లు భాసించెను (20). మరియు విశ్వకర్మ సూర్యునివలె ప్రకాశించు రెండు గుర్రములను నిర్మించెను. చామరములచే, మరియు దివ్యాభరణములచే అలంకరింపబడిన ఆ దివ్యాశ్వములు గొప్పగా ప్రకాశించెను (21). విశ్వకర్మ కవచములతో, శ్రేష్ఠ రత్నములతో ఒప్పారు లోకపాలురను, దేవతలనందరినీ వాస్తవమేనా యన్నట్లు నిర్మించెను (22). మరియు భృగువు మొదలగు తపోనిష్ఠులగు ఋషులనందరినీ, ఇతరులగు ఉపదేవతలను, సిద్ధులను బొమ్మలరూపములో ప్రదర్శించెను (23).

విష్ణుశ్చ పార్ష దైస్సర్వైర్గరుడా ఖ్యై స్సమన్వితః ।
కృత్రిమో నిర్మితస్తద్వత్పరమాశ్చర్యరూపవాన్ ॥
తథైవాహం సుతైర్వే దైస్సిద్ధైశ్చ పరివారితః ।
కృత్రిమో నిర్మితస్తద్వ త్పఠన్ సూక్తాని నారద ॥
ఐరావత గజారూఢ శ్శక్ర స్స్వదల సంయుతః ।
కృత్రిమో నిర్మితస్త ద్వత్పరి పూర్ణేందు సన్నిభః ॥
కిం బహూక్తేన దేవర్షే సర్వో వై విశ్వకర్మణా ।
హిమాగప్రేరితేనాశు క్లుప్త స్సురసమాజకః ॥

గరుడులను పేరుగల గణములందరితో గూడియున్న కృత్రిమ విష్ణువు నిర్మింపబడి యుండెను. ఆ బొమ్మ మహాశ్చర్యమును కలిగించెను (24). అదే విధముగా వేదములచే, ప్రజాపతులచే, మరియు సిద్ధులచే చుట్టువారబడి సూక్తములను పఠించుచున్న నాయొక్క కృత్రిమ శిల్పము కూడా అచట నిర్మింపబడి యుండెను. ఓ నారదా! అదే విధముగా, ఐరావత గజమునధిష్ఠించి పూర్ణచంద్రుని బోలియున్న కృత్రిమ ఇంద్రుడు తన సైన్యముతో గూడి యున్నట్లు నిర్మించబడెను (25) ఓ దేవర్షి! ఇన్ని మాటలేల? హిమవంతునిచే ప్రేరితుడైన విశ్వకర్మ దేవ సమాజమునంతనూ అచట అనతికాలములో నిర్మించెను (27).

ఏవం భూతః కృతస్తేన మండపో దివ్య రూపవాన్ ।
అనేకాశ్చర్య సంభూతో మహాన్ దేవవిమోహనః ॥
అథాజ్ఞప్తో గిరీశేన విశ్వకర్మా మహామతిః ।
నివాసార్థం సురాదీనాం తత్తల్లోకాన్ హి యత్నతః ॥
త త్రైవ చ మహామంచా సుప్రభాః పరమాద్భుతాః ।
రచితాస్సుఖదా దివ్యాస్తేషాం వై విశ్వకర్మణా॥
తథాపి సత్యలోకం వై విరేచే క్షణతోఽ ద్భుతమ్ ।
దీప్త్యా పరమయా యుక్తం నివాసార్థం స్వయం భువః ॥

దివ్యమగు రూపము గలది, అనేకములగు అచ్చెరువులతో గూడియున్నది, చాల పెద్దది, దేవతలను కూడ మోహింప జేయునది అగు ఇట్టి మండపమును విశ్వకర్మ నిర్మించెను (28). తరువాత హిమవంతుని ఆజ్ఞచే మహాబుద్ధిశాలియగు విశ్వకర్మ, దేవతలు మొదలగు వారి నివాసము కొరకై ప్రయత్నపూర్వకముగా ఆయా లోకములను నిర్మించెను (29). ఆ మండపము వద్ద గొప్పగా వెలుగొందే, పరమాద్భుతములైన సుఖకరములైన, దివ్యములగు పెద్ద ఆసనములను వారికొరకు విశ్వకర్మ నిర్మించెను (30). మరియు నాతడు అద్భుతము, గొప్ప ప్రకాశముతో కూడినది అగు కృత్రిమ సత్యలోకమును స్వయంభువునగు నా నివాసము కొరకు క్షణములో నిర్మించెను (31).

తథైవ విష్ణోస్స్వపరం వైకుంఠాఖ్యం మహోజ్జ్వలమ్ ।
విరేచే క్షణతో దివ్యం నానాశ్చర్య సమన్వితమ్ ॥
అమరేశ గృహం దివ్యం తథైవాద్భుతముత్తమమ్ ।
విరేచే విశ్వకర్మా సా సర్వైశ్వర్య సమన్వితమ్ ॥
గృహాణి లోకపాలానాం విరేచే సుందరాణి చ ।
తద్వత్స ప్రీతితో దివ్యా న్యద్భుతాని మహాంతి చ ॥
అన్యేషా మమరాణాం చ సర్వేషాం క్రమశస్తథా ।
సదనాని విచిత్రాణి రచితాని చ తేన వై ॥

అదే విధముగా విష్ణువుకొరకై మహా ప్రకాశము గలది, దివ్యమైనది, అనేకములగు ఆశ్చర్యములతో గూడినది అగు అపర వైకుంఠము నాతడు క్షణములో నిర్మించెను (32). మరియు ఆ విశ్వకర్మ అద్భుతము, ఉత్తమము, దివ్యము, సర్వసంపదలతో విలసిల్లునది అగు గృహమును ఇంద్రుని కొరకు నిర్మించెను (33). అదే విధముగా ఆతడు లోకపాలుర కొరకు సుందరమైనవి, దివ్యమైనవి, అద్భుతమైనవి, పెద్దవి అగు గృహములను సంతోషముతో నిర్మించెను (34). అతడు ఇతర దేవతలందరికీ కూడా విచిత్రములగు గృహములను వరుసగా నిర్మించెను (35).

విశ్వకర్మా మహాబుద్ధిః ప్రాప్తి శంభు మహావరః ।
విరేచే క్షణతస్సర్వం శివతుష్ట్యర్థమేవ చ ॥
తథైవ చిత్రం పరమం మహోజ్జ్వలం మహాప్రభం దేవవరైస్సుపూజితమ్ ।
గిరీశ చిహ్నాం శివలోక సంస్థితం సుశో భితం శంభు గృహం చకార ॥
ఏవం భూతా కృతా తేన రచనా విశ్వకర్మణా ।
విచిత్రా శివతుష్ట్యర్థం పరాశ్చర్యా మహోజ్జ్వలా ॥

శివుని నుండి గొప్ప వరములను పొందినవాడు, మహాబుద్ధిశాలి అగు విశ్వకర్మ శివునకు పూర్తిగా సంతోషమును కలిగించుట కొరకై క్షణములో గృహమును నిర్మించెను (36). చిత్రమైనది, గొప్పగా ప్రకాశించునది, దేవతలచే పూజింపబడునది, శివుని చిహ్నములు గలది, శివలోక హర్మ్యమును పోలియున్నది, మిక్కిలి సుందరమైనది అగు గృహమును ఆతడు శివుని కొరకు నిర్మించెను (37). ఈ విధముగా విశ్వకర్మ శివుని ప్రీతికొరకై విచిత్రము, అత్యాశ్చర్యకరము, గొప్ప ప్రకాశము గలది అగు రచనను ప్రదర్శించెను (38).

ఏవం కృత్వాఖిలం చేదం వ్యవహారం చ లౌకికమ్ ।

పర్యైక్షిష్ట ముదా శంభ్వాగమనం స హిమాచలః ॥

ఇతి ప్రోక్త మశేషణ వృత్తాంతం ప్రముదావహమ్ ।

హిమాలయస్య దేవర్షే కిం భూయశ్శ్రోతుమిచ్ఛసి ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే మండపాది రచనా వర్ణనం నామ అష్ట త్రింశోఽధ్యాయః ॥

ఈ విధమగు లౌకిక వ్యవహారమునంతనూ పూర్తి చేసుకొని, ఆ హిమవంతుడు ఆనందముతో శంభుని రాకను నిరీక్షించు చుండెను (39). ఓ దేవర్షి! ఈ తీరున నీకు హిమవంతుని ఆనందదాయకమగు చరిత్రనంతనూ చెప్పియుంటిని. ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? (46)

శ్రీ శివ మహాపురాణములో రుద్రసంహిత యందలి పార్వతీఖండములో ముప్పది ఎనిమిదవ అధ్యాయము వివాహమండప వర్ణనమను పేరు గలది ముగిసినది (38).

39 - శివుని యాత్ర

నారద ఉవాచ ।

విధే తాత మహాప్రాజ్ఞ విష్ణుశిష్య నమోస్తు తే ।
అద్భుతేయం కథా శ్రావి త్వత్తోఽస్మాభిః కృపానిధే ॥
ఇదానీం శ్రోతుమిచ్ఛామి చరితం శశిమౌలినః ।
వైవాహికం సుమాంగల్యం సర్వా ఘౌఘవినాశనమ్ ॥
కిం చకార మహాదేవః ప్రాప్య మంగల పత్రికామ్ ।
తాం శ్రావయ కథాం దివ్యాం శంకరస్య పరాత్మనః ॥

నారదుడిట్లు పలికెను -

ఓ విధీ! తండ్రీ! మహాప్రాజ్ఞా! విష్ణుశిష్యా! నీకు నమస్కారము. ఓ దయానిధీ! నీవు నాకీ అద్భుతమగు గాథను వినిపించితివి (1). ఇపుడు చంద్రశేఖరుని సుమంగళమగు, సమస్త పాపరాశులను నశింపజేసే వివాహవృత్తాంతమును వినగోరుచున్నాను. (2). మంగళపత్రికను పొందిన తరువాత మహాదేవుడేమి చేసెను? శంకర పరమాత్ముని ఆ దివ్యగాథను వినిపింపుము (3).

బ్రహ్మోవాచ ।

శృణు వత్స మహాప్రాజ్ఞ శాంకరం పరమం యశః ।
యచ్చకార మహాదేవః ప్రాప్య మంగల పత్రికామ్ ॥
అథ శంభుర్గృహీత్వా తాం ముదా మంగల పత్రికామ్ ।
వి జహాస ప్రహృష్టాత్మా మానం తేషాం వ్యధాద్విభుః ॥
వాచయిత్వా చ తాం సమ్యక్ స్వీచకార విధానతః ।
తజ్జనా న్యాపయామాస బహు సమ్మాన్య చాదృతః ॥
ఉవాచ ముని వర్గాంస్తాన్ కార్యం సమ్యక్ కృతం శుభమ్ ।
ఆగంతవ్యం వివాహే మే వివాహ స్వీకృతో మయా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వత్సా! మహాప్రాజ్ఞా! శంకరుని పరమకీర్తిని వినుము. మహాదేవుడు మంగళ పత్రికను స్వీకరించి తరువాత ఏమి చేసెను? అను విషయమును వినుము (4). శంభుడు ఆ మంగళ పత్రికను ఆనందముతో స్వీకరించి, సంతసించిన అంతరంగము గలవాడై చిరునవ్వు నవ్వెను. వారికి ఆ ప్రభుడు సత్కారమును చేసెను (5). ఆ పత్రికను యథావిధిగా చదివించి ఆయన స్వీకరించెను. వారిని చాలా సత్కరించి పంపించెను (6). అపుడాయన సప్తర్షులతో, 'శుభకార్యమును చక్కగా నిర్వహించితిరి. ఈ వివాహము నాకు అంగీకారమే. నా వివాహమునకు రండు' అని చెప్పెను (7).

ఇత్యాకర్ణ్య వచశ్శంభోః ప్రహృష్టాస్తే ప్రణమ్య తమ్ ।

పరిక్రమ్య యయుర్ధామ శం సంతస్స్వం విధిం పరమ్ ॥

అథ దేవేశ్వరశ్శంభు స్సస్మార త్వాం మునే ద్రుతమ్ ।

లౌకికాచార మాశ్రిత్య మహాలీలాకరః ప్రభుః ॥

త్వమాగతః పరప్రీత్యా ప్రశంసంస్స్వం విధిం పరమ్ ।

ప్రణమంశ్చ నతస్కంధో వినీతాత్మా కృతాంజలిః ॥

అస్తౌస్సు జయశబ్దాన్హి సముచ్చార్య ముహుర్ముహుః ।

నిదేశం ప్రార్థయం స్తస్య ప్రశంసంస్స్వం విధిం మునే ॥

శంభుని ఆ మాటను విని వారు మిక్కిలి సంతసించిన వారై ఆయనకు నమస్కరించి ప్రదక్షిణము చేసి తమ గొప్ప భాగ్యమును కొనియాడుచూ తమ స్థానమునకు వెళ్లిరి (8). ఓ మహర్షీ! అపుడు గొప్ప లీలలను ప్రదర్శించు దేవదేవుడగు ఆ శంభు ప్రభుడు వెంటనే నిన్ను స్మరించెను (9). నీవు మహానందముతో నీ పరమ భాగ్యమును కొనియాడుతూ విచ్చేసి, చేతులు జోడించి వినయము నిండిన మనస్సుతో తలవంచి నమస్కరించితివి (10). ఓ మహర్షీ! నీవు అనేక పర్యాయములు జయశబ్దములను పలికి స్తుతించితివి. నీవు శంభుని ఆదేశమును ప్రార్థించి నీ భాగ్యమును కొనియాడుకొంటివి (11).

తతశ్శంభుః ప్రహృష్టాత్మా దర్శయన్ లౌకికీం గతిమ్ ।

ఉవాచ మునివర్య త్వాం ప్రీణయన్ శుభయా గిరా ।

ఓ మునిశ్రేష్ఠా! తరువాత శంభుడు హర్షముతో నిండిన మనస్సు గలవాడై లోకాచారమును ప్రదర్శించువాడై శుభవచనములతో ఆనందమును కలిగిస్తూ నీతో నిట్లనెను (12).

శివ ఉవాచః

ప్రీత్యా శృణు మునిశ్రేష్ఠ హ్యస్మత్తోఽద్య వదామి తే ।

బ్రువే తత్త్వాం ప్రియో మే యద్భక్తరాజ శిరోమణిః ॥

కృతం మహత్తపో దేవ్యా పార్వత్యా తవ శాసనాత్ ।

తస్యై వరో మయా దత్తః పతిత్వే తోషితేన వై ॥

కరిష్యేఽహం వివాహం చ తస్యా వశ్యో హి భక్తితః ।

సప్తర్షిభిస్సాధితం చ తల్లగ్నం శోధితం చ తైః ॥

అద్యతస్సప్తమే చాహ్ని తద్భవిష్యతి నారద ।

మహోత్సవం కరిష్యామి లౌకికీం గతి మాశ్రితః ॥

శివుడిట్లు పలికెను-

ఓ మునిశ్రేష్ఠా! నేను నీకు చెప్పెదను. నీవిపుడు ప్రీతితో వినుము. నీవు గొప్ప భక్తులలో అగ్రగణ్యుడవు, నాకు ప్రియుడవు. కావుననే, నీకు చెప్పుచున్నాను (13). పార్వతీదేవి నీ ఆదేశముచే గొప్ప తపస్సును చేసినది. నేను సంతోషించి ఆమెను వివాహమాడెదనని వరము నిచ్చితిని (14). భక్తికి వశుడనయ్యే నేను

ఆమెను వివాహమాడెదను. ఈ కార్యమును సప్తర్షులు సాధించినారు. వారు వివాహ లగ్నమును కూడా నిర్ణయించినారు (15). ఓ నారదా! ఈ నాటి నుండి ఏడవనాడు వివాహము సంపన్నము కాగలదు. నేను లోకాచారము ననుసరించి గొప్ప ఉత్సవమును చేయగలను (16).

బ్రహ్మోవాచ ।

ఇతి శ్రుత్వా వచస్తస్య శంకరస్య పరాత్మనః ।
ప్రసన్నధీః ప్రభుం నత్వా తాత త్వం వాక్యమబ్రవీః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ కుమారా! శంకర పరమాత్మ యొక్క ఆ మాటను విని, ప్రసన్నమగు మనస్సు గల నీవు ఆ ప్రభునకు నమస్కరించి ఇట్లు పలికితివి (17).

నారద ఉవాచ ।

భవతస్తు వ్రతమిదం భక్తవశ్యో భవాన్మతః ।
సమ్యక్కృతం చ భవతా పార్వతీమానసేప్సితమ్ ॥
కార్యం మత్సదృశం కించిత్ కథనీయం త్వయా విభో ।
మత్వా స్వసేవకం మాం హి కృపాం కురు నమోఽస్తు తే ॥

నారదుడిట్లు పలికెను -

ఇది నీ వ్రతము. నీవు భక్తులకు అధీనుడవని చెప్పెదరు. పార్వతి యొక్క మనస్సులోని కోరికను తీర్చి నీవు మంచి పనిని చేసితివి (18). హే విభో! నీవు నన్ను నీ సేవకునిగా తలంచి, నాకు తగిన కార్యమునందు నియోగించుము. నాయందు దయను చూపుము. నీకు నమస్కారమగును గాక!(19)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తస్తు త్వయా శంభుశ్శంకరో భక్తవత్సలః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా సాదరం త్వాం మునీశ్వర ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! నీవు ఇట్లు పలుకగా, భక్తవత్సలుడగు శివశంకరుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై సాదరముగా నీతో నిట్లనెను (20).

శివ ఉవాచ ।

విష్ణు ప్రభృతి దేవాంశ్చ మునీన్ సిద్ధానపి ధ్రువమ్ ।
త్వం నిమంత్రయ మద్వాణ్యా మునేఽ న్యానపి సర్వతః ॥
సర్వ ఆయాంతు సోత్సాహా స్సర్వశోభా సమన్వితాః ।
సస్త్రీ సుతగణాః ప్రీత్యా మమ శాసన గౌరవాత్ ॥
నాగమిష్యంతి యే త్వత్ర మద్వి వాహోత్సవే మునే ।
తే స్వకీయా న మంతవ్యా మయా దేవాదయః ఖలు ॥

శివుడిట్లు పలికెను -

ఓ మునీ! విష్ణువు మొదలగు దేవతలను, మునులను, సిద్ధులను మరియు ఇతరులనందరినీ కూడా నా మాటగా తప్పని సరిగా నీవు ఆహ్వానించుము (2 1). అందరు నా శాసనమునందలి ఆదరముతో ఉత్సాహవంతులై సర్వశోభలను కలిగి యున్న వారై భార్యాపుత్రులతో పరివారముతో గూడా ప్రీతితో వచ్చెదరు గాక! (22) ఓ మునీ! దేవతలు మొదలగు వారు ఎవరైతే ఈ వివాహమహోత్సవమునకు హాజరు కారో, వారిని నేను నా వారు అని భావించలేను (23).

బ్రహ్మోవాచ ।

ఇతీ శాజ్ఞాం తతో ధృత్వా భవాన్ శంకరవల్లభః ।
సర్వాన్ని మంత్ర యామాస తం తం గత్వా ద్రుతం మునే ॥
శంభూపకంఠ మాగత్య ద్రుతం మునివరో భవాన్ ।
తద్దూ త్యాత్తత్ర సంతస్థౌ తదాజ్ఞాం ప్రాప్య నారద ॥
శివోఽపి తస్థౌ సోత్కంఠ స్తదాగమనలాలసః ।
స్వగణై స్సోత్సవైస్సర్వైర్నృత్య ద్భిస్సర్వతో దిశమ్ ॥
ఏతస్మిన్నేవ కాలే తు రచయిత్వా స్వవేషకమ్ ।
ఆజగామాచ్యుతశ్శీఘ్రం కైలాసం సపరిచ్ఛదః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! శివునకు ప్రియుడవగు నీవు శివుని ఆ యాజ్ఞను స్వీకరించి అందరి వద్దకు వ్యయక్తిగతముగా వెళ్లి శీఘ్రమే ఆహ్వానించితివి (24). నారదా! నీవు శివుని దూతవై ఆయన ఆజ్ఞను నిర్వర్తించి వెనువెంటనే శివుని వద్దకు వచ్చి నిలబడితివి (25). శివుడు కూడా ముహూర్తము యొక్క రాకను ఉత్కంఠతో ఎదురుచూచుండెను. శివగణములన్నియూ అన్ని దిక్కులయందు నాట్యము చేయుచూ ఉత్సవమును చేసుకొనెను (26). అదే కాలములో విష్ణువు తన వేషమును ధరించి గణములతో గూడి శీఘ్రముగా కైలాసమునకు వచ్చెను (27).

శివం ప్రణమ్య సద్భక్త్యా సదారస్సదలో ముదా ।
తదాజ్ఞాం ప్రాప్య సంతస్థౌ సుస్థానే ప్రీతమానసః ॥
తథాహం స్వగణైరాశు కైలాసమగమం ముదా ।
ప్రభుం ప్రణమ్యా తిష్ఠం వై సానందస్స్వ గణాన్వితః ॥
ఇంద్రాదయో లోకపాలా ఆయయుస్సపరిచ్ఛదాః ।
తథైవాలంకృతాస్సర్వే సోత్సవాస్సకలత్రకాః ॥
తథైవ మునయో నాగాస్సిద్ధా ఉపసురాస్తథా ।
ఆయయుశ్చాపరేఽపీహ సోత్సవాస్సునిమంత్రితాః ॥

ఆయన భార్యతో గణములతో గూడి శివునకు ఆనందముతో పూర్ణ భక్తితో నమస్కరించి, ఆయన ఆజ్ఞను పొంది, చక్కని స్థానమునందు హర్షము నిండిన మనస్సు గలవాడై నివసించెను (28). అదే విధముగా నేను కూడా నా గణములతో గూడి ఆనందముతో వెంటనే కైలాసమునకు వెళ్లి గణములతో సహా శివునకు నమస్కరించి ఆనందముగా మకాము చేసితిని (29) ఇంద్రుడు మొదలగు లోకపాలు రందరు చక్కగా అలంకరించు కొని తమ భార్యలతో, పరివారముతో గూడి ఉత్సాహముతో విచ్చేసిరి (30). అదే విధముగా ఆహ్వానించబడిన మునులు, నాగులు, సిద్ధులు, ఉపదేవతలు, మరియు ఇతరులందరు ఉత్సాహముతో కైలాసమునకు విచ్చేసిరి (31).

మహేశ్వరస్తదా తత్రాగతానాం చ పృథక్ పృథక్ ।
సర్వేషా మమరాదీనాం సత్కారం వ్యదధాన్ముదా ॥
అథోత్సవో మహానాసీత్ కైలాసే పరమోఽద్భుతః ।
నృత్యాదికం తదా చక్రుర్యథా యోగ్యం సురస్త్రియః ॥
ఏతస్మిన్ సమయే దేవవిష్ణ్వాద్యా యే సమాగతాః ।
యాత్రాం కారయితుం శంభోస్తత్రోషుస్తేఽ ఖిలా మునే ॥
శివాజ్ఞ ప్తాస్తదా సర్వే మదీయమితి యంత్రితాః ।
శివకార్యమిదం సర్వం చక్రిరే శివసేవనమ్ ॥

అపుడు మహేశ్వరుడు అచటకు వచ్చిన దేవతలు మొదలగు వారందరికీ వ్యక్తి గతముగా సత్కారమును ఆనందముతో చేసెను (32). తరువాత కైలాసములో అత్యద్భుతమగు మహోత్సవము జరిగెను. అపుడు దేవతా స్త్రీలు యథోచితముగా నాట్యము మొదలగు వాటిని చేసిరి (33), ఓ మునీ! ఆ సమయములో అచటకు విచ్చేసిన విష్ణువు మొదలగు దేవతలు అందరు శంభుని వివాహయాత్రను సంపన్నము చేయుటకై అచటనే నివసించి యుండిరి (34). అపుడు శివునిచే ఆజ్ఞాపించబడిన వారందరు శివకార్యము నంతనూ స్వీయకార్యముగా భావించి శివుని సేవించిరి (35).

మాతరస్సప్త తాస్తత్ర శివభూషావిధిం పరమ్ ।
చక్రిరే చ ముదా యుక్తా యథా యోగ్యం తథా పునః ॥
తస్య స్వాభావికో వేషా భూషావిధిరభూత్తదా ।
తస్యేచ్ఛయా మునిశ్రేష్ఠ పరమేశస్య సుప్రభోః ॥
చంద్రశ్చ ముకుట స్థానే సాన్నిధ్య మకరోత్తదా ।
లో చనం సుందరం హ్యాసీత్తృతీయం తిలకం శుభమ్ ॥
కర్ణా భరణ రూపౌ చ యౌ హి సర్పౌ ప్రకీర్తితౌ ।
కుండలేఽ భవతాం తస్య నానారత్నాన్వితే మునే ॥

కైలాసమునందు సప్తమాతృకలు శివునికి చక్కని యథోచితమైన అలంకార విధిని ఆనందముతో చేసిరి (36). ఓ మహర్షీ! పరమేశ్వరుడగు ఆ శివప్రభుని ఇచ్ఛచే ఆయన యొక్క సహజవేషము అలంకార విధిగా మారిపోయెను (37). చంద్రుడు కిరీటముగా రూపు దిద్దుకొనెను. సుందరమగు మూడవ కన్ను శుభతిలకముగా మారి పోయెను (38). ఓ మునీ! రెండు సర్పములు అనేక రత్నములతో గూడిన కర్ణకుండలములుగా రూపు దాల్చెను (39).

అన్యాంగ సంస్థితాస్సర్పాస్తదంగా భరణాని చ ।
ఐ భూవురతి రమ్యాణి నానారత్న మయాని చ ॥
విభూతి రంగరా గోఽ భూ చ్చందనాది సముద్భవః ।
తద్దుకూల మభూద్దివ్యం గజచర్మాది సుందరమ్ ॥
ఈ దృశం సుందరం రూపం జాతం వర్ణాతి దుష్కరమ్ ।
ఈశ్వరోఽపి స్వయం సాక్షాదైశ్వర్యం లబ్ధవాన్ స్వతః ॥
తతశ్చ సర్వే సురయక్ష దానవా నాగాః పతంగా ప్సరసో మహర్షయః ।
సమేత్య సర్వే శివసన్నిధిం తదా మహోత్సవాః ప్రోచురహో ముదాన్వితాః
॥

ఇతరావయవముల యందుండే సర్పములు ఆయా అంగములకు మిక్కిలి రమ్యములు, అనేక రత్నములు పొదగబడినవి అగు ఆభరణములుగా రూపు దిద్దుకొనెను (40). విభూతి గంధాదులతో గూడిన అంగవిలేపనమాయెను, గజచర్మము దివ్యము, సుందరము అగు పట్టు వస్త్రమాయెను (41). ఆయన ఇట్టివర్ణింప శక్యము గాని సుందర రూపమును పొందెను. ఈశ్వరుడే స్వయముగా ఐశ్వర్యమును పొందెను (42). అపుడు దేవతలు, రాక్షసులు, యక్షులు, నాగులు, పతంగములు, 'అప్సరసలు, మహర్షులు అందరు మహోత్సాహముతో శివుని సన్నిధికి వచ్చి, ఆనంద భరితులై ఆశ్చర్యముతో గూడిన వారై ఇట్లనిరి (43).

సర్వ ఊచుః ।

గచ్ఛ గచ్ఛ మహాదేవ వివాహార్థం మహేశ్వర ।
గిరిజాయా మహాదేవ్యాస్సహాస్మాభిః కృపాం కురు ॥
తతో విష్ణురువాచేదం ప్రస్తావసదృశం వచః ।
ప్రణమ్య శంకరం భక్త్యా విజ్ఞాన ప్రీతమానసః ॥

అందరు ఇట్లు పలికిరి –

మహాదేవా! మహేశ్వరా! పార్వతీ మహాదేవిని వివాహమాడుట కొరకై మా◌ాతో గూడి శీఘ్రమే బయలు దేరుము. దయను చూపుము (44). అపుడు జ్ఞానముచే సంతుష్టమైన మనస్సు గల విష్ణువు భక్తితో శంకరునకు నమస్కరించి సందర్భమునకు అనురూపమగు మాటలను ఇట్లు పలికెను (45).

విష్ణురువాచ ।

దేవ దేవ మహాదేవ శరణాగతవత్సల ।
కార్యకర్తా స్వభక్తానాం విజ్ఞప్తిం శృణు మే ప్రభో ॥
గృహ్యోక్త విధినా శంభో స్వవివాహస్య శంకర ।
గిరీశసుతయా దేవ్యా కర్మ కర్తు మిహార్హసి ॥
త్వయా చ క్రియమాణే తు వివాహస్య విధౌ హర ।
స ఏవ హి తథా లోకే సర్వస్సుఖ్యాతి మాప్నుయత్ ॥
మండప స్థాపనం నాందీ ముఖం తత్కుల ధర్మతః ।
కారయ ప్రీతితో నాథ లోకే స్వం ఖ్యాపయన్ యశః ॥

విష్ణువు ఇట్లు పలికెను –

దేవ దేవా! మహాదేవా! శరణు జొచ్చిన వారిపై నీకు ప్రీతి మెండు. నీవు నీ భక్తు◌ాల కార్యములను చక్క బెట్టెదవు. ఓ ప్రభూ! నా విన్నపమును వినుము (46). శంభో! శంకరా! నీవు పార్వతీ దేవిని గృహ్యసూత్రములలో చెప్పబడిన విధానములో వివాహమాడ దగుదువు (47). హే హరా! నీవు వివాహవిధిని పాటించినచో, లోకము నందు ఆ విధి అంతటా ఖ్యాతిని పొందగలదు (48). ఓ నాథా! వారి కులధర్మమునను సరించి మండప స్థాపనమును, నాందీముఖమును ప్రీతి పూర్వకముగా అనుష్ఠించి, లోకములో నీ కీర్తిని విస్తరింపజేయుము (49).

బ్రహ్మోవాచ ।

ఏవముక్తస్తదా శంభుర్విష్ణునా పరమేశ్వరః ।
లౌకికాచారనిరతో విధినా తచ్చకార సః ॥
అహం హ్యాధి కృతస్తేన సర్వమభ్యుదయోచితమ్ ।
అకుర్వం మునిభిః ప్రీత్యా తత్ర తత్కర్మ చాదరాత్ ॥
కశ్యపోఽ త్రిర్వ శిష్ఠశ్చ గౌతమో భాగురిర్గురుః ।
కణ్వో బృహస్పతి శ్శక్తిర్జమదగ్నిః పరాశరః ॥
మార్కండేయ శ్శిలాపాకోఽ రుణపాలోఽ కృత శ్రమః ।
అగస్త్యశ్చ్యవనో గర్గశ్శిలాదోఽ థ మహామునే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను-

విష్ణువు ఇట్లు పలుకగా, లోకాచారమునందు శ్రద్ధ గల శంభుపరమేశ్వరుడు ఆ కర్మలను యథావిధిగా చేసెను (50). ఆయనచే నియోగింపబడిన నేను మునులతో గూడి అచట అభ్యుదయమునకు తగిన ఆ కర్మలను అన్నింటినీ ప్రీతితో ఆదరముతో చేసితిని (51). ఓ మహర్షీ! కశ్యపుడు, అత్రి, వశిష్ఠుడు, గౌతముడు, భాగురి, గురుడు, కణ్వుడు, బృహస్పతి, శక్తి, జమదగ్ని, పరాశరుడు (52), మార్కండేయుడు, శిలాపాకుడు, అరుణపాలుడు, అకృతశ్రముడు, అగస్త్యుడు, చ్యవనుడు, గర్గుడు, మరియు శిలాదుడు అచటకు విచ్చేసిరి (53).

దధీచిరుపమన్యుశ్చ భరద్వాజోఽ కృతవ్రణః ।
పిప్పలాదోఽథ కుశికః కౌత్సో వ్యాసస్సశిష్యకః ॥
ఏతే చాన్యే చ బహవ ఆగతాశ్శివ సన్నిధిమ్ ।
మయా సునో దితాస్తత్ర చక్రుస్తే విధివత్క్రి యామ్ ॥
వేదోక్త విధినా సర్వే వేద వేదాంగ పారగాః ।
రక్షాం చక్రు ర్మహేశస్య కృత్వా కౌతుక మంగలమ్ ॥
ఋగ్యజుస్సామ సూక్తైస్తు తథా నానా విధైః పరైః ।
మంగలాని చ భూరీణి చక్రుః ప్రీత్యర్ష యోఽ ఖిలాః ॥

దధీచి, ఉపమన్యువు, భరద్వాజుడు, అకృతవ్రణుడు, పిప్పలాదుడు, కుశికుడు, కౌత్సుడు, వ్యాసుడు, ఆతని శిష్యులు (54) మరియు ఎందరో ఇతరులు శివుని సన్నిధికి వచ్చి యుండిరి. వారందరు నా ప్రేరణచే అచట వైవాహిక కర్మను యథావిధిగా నిర్వర్తించిరి (55). వేదవేదాంగవేత్తలగు వారందరు మహేశునకు వేదోక్త విధానముచే పవిత్ర వివాహ కర్మకు మంగళమును కలిగించే రక్షాబంధనమును నిర్వర్తించిరి (56). ఆ ఋషులందరు ఋగ్యజుస్సామ వేదముల యందలి సూక్తములను, ఇతరములైన వివిధ ఆశీర్వచనములను పఠించి ప్రేమతో విస్తృతమగు మంగాళా శాసనములను చేసిరి (57).

గ్రహాణాం పూజనం ప్రీత్యా చక్రుస్తే శంభునా మయా ।

మండపస్థ సురాణాం చ సర్వేషాం విఘ్న శాంతయే ॥

తతశ్శివస్సు సంతుష్టః కృత్వా సర్వం యథోచితమ్ ।

లౌకికం వైదికం కర్మ ననామ చ ముదా ద్విజాన్ ॥

అథ సర్వేశ్వరో విప్రాన్ దేవాన్ కృత్వా పురస్సరాన్ ।

నిస్ససార ముదా తస్మాత్కైలాసాత్పర్వతోత్తమాత్ ॥

బహిః కైలాస కుధరాచ్ఛంభుస్తస్థౌ ముదాన్వితః ।

దేవైస్సహ ద్విజైశ్చైవ నానా లీలాకరకః ప్రభుః ॥

వారు శంభునిచే గ్రహపూజను ఆనందముతో చేయించిరి. మరియు విఘ్న నివారణ కొరకు మండపమును స్థాపించి దాని యందు దేవతల నందరినీ ఆరాధించిరి (58). అపుడు శివుడు లౌకిక వైదిక కర్మలనన్నిటినీ యథా యోగ్యముగా చేసి ఆ బ్రాహ్మణులకు ఆనందముతో నమస్కరించెను (59). అపుడు సర్వేశ్వరుడగు శివుడు బ్రాహ్మణులను, దేవతలను ముందిడు కొని, పర్వతరాజమగు ఆ కైలాసము నుండి ఆనందముతో బయలు దేరెను (60). అనేక లీలలను నెరపు ఆ శంభు ప్రభుడు ఆనందముతో నిండినవాడై దేవతలతో మరియు ఋషులతో గూడి కైలాస పర్వతమునకు బయట నిలచెను (61).

తదోత్సవో మహానాసీత్తత్ర దేవాదిభిః కృతః ।

సంతుష్ట్యర్థం మహేశస్య గాన వాద్య సునృత్యకః ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

శివయాత్రా వర్ణనం నామ ఏకోన చత్వారింశోఽధ్యాయః ॥

అపుడు దేవతలు అచట మహేశుని సంతోషము కొరకు గాన వాద్య నృత్యములతో నలరారే ఉత్సవమును జరిపిరి (62).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో శివ యాత్రా వర్ణనమనే ముప్పది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (39).

40 - శివుని యాత్ర

బ్రహ్మోవాచ ।

అథ శంభుస్సమాహూయ నంద్యా దీన్ సకలాన్ గణాన్ ।
ఆజ్ఞాప యామాస ముదా గంతుం స్వేన చ తత్ర వై ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు శంభుడు నంది మొదలగు గణములనందరిని పిలిచి తనతో బాటు ఆనందముతో వివాహమునకు రమ్మని ఆజ్ఞాపించెను (1).

శివ ఉవాచ ।

అపి యూయం సహ మయా సంగచ్ఛధ్వం గిరేః పురమ్ ।
కియద్గణానిహాస్థాప్య మహోత్సవపురస్సరమ్ ॥

కొద్ది గణముల నిచట ఉంచి మీరు కూడా నాతో బాటు మహోత్సవమును͏ జరుపు కుంటూ హిమవంతుని నగరమునకు పయనించుడు (2).

బ్రహ్మోవాచ ।

అథ తే సమనుజ్ఞప్తా గణేశా నిర్యయుర్ముదా ।
స్వం స్వం బలము పాదాయ తాన్ కథంటిద్వదామ్యహమ్ ॥
అభ్యగా చ్ఛంఖకర్ణశ్చ గణకోట్యా గణేశ్వరః ।
శివేన సార్ధం సంగంతుం హిమాచల పురం ప్రతి ॥
దశకోట్యా కేకరాక్షో గణానాం సమహోత్సవః ।
అష్టకోట్యా చ వికృతో గణానాం గణనాయకః ॥
చతుష్కోట్యా విశాఖశ్చ గణానాం గణనాయకః ।
పారిజాతశ్చ నవభిః కోటిభిర్గణ పుంగవః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు శివునిచే ఆజ్ఞాపించబడిన గణనాయకులు ఆనందముతో తమ తమ సైన్యములను͏ తీసుకొని బయలుదేరిరి. నేనా వివరములను కొంత శ్రమపడి వర్ణించెదను (3). శంఖకర్ణుడను గణాధ్యక్షుడు కోటి గణములతో కూడి హిమవంతుని నగరమునకు శివునితో బాటు బయలు దేరెను (4). గొప్ప ఉత్సవమును చేయుచూ కేకరాక్షుడు పదికోట్లతో (5), విశాఖుడను గణనాయకుడు నాల్గు కోట్ల గణములతో, గణాధ్యక్షుడగు పారిజాతుడు తొమ్మిది కోట్ల గణములతో బయల్వెడలిరి (6).

షష్టిస్సర్వాంతక శ్రీమాన్ తథైవ వికృతానన నః ।
గణానాం దుందు భోష్టా భిః కోటిభిర్గణ నాయకః ॥
పంచభిశ్చ కపాలా ఖ్యో గణేశః కోటిభిస్తథా ।
షడ్భి స్కందారకో వీరో గణానాం కోటీ భిర్మునే ॥
కోటి కోటి భిరేవేహ కందుకః కుండకస్తథా ।
విష్టంభో గణపోఽష్టా భిర్గణానాం కోటిభిస్తథా ॥
సహస్ర కోట్యా గణపః పిప్పలో ముదితో యయౌ ।
తథా సంనాదకో వీరో గణేశో మునిసత్తమ ॥

శ్రీమంతుడగు సర్వాంతకుడు అరవై, వికృతాననుడు అరవై, దుందుభుడను గణాధ్యక్షుడు ఎనిమిది కోట్ల గణములతో బయలు దేరిరి (7). ఓ మహర్షీ! కపాలుడను గణాధ్యక్షుడు అయిదు కోట్లు, వీరుడగు సందారకుడు ఒక కోటి, కందుక కుండకులు ఒక్కొక్క కోటి విష్టంభుడను గణాధిపతి ఎనిమిది కోట్లు (8, 9), పిప్పలుడను గణాధ్యక్షుడు వేయి కోట్లు గణములతో ఆనందముతో బయలు దేరిరి. ఓ మహర్షీ! వీరుడైన సంనాదకుడను గణాధ్యక్షుడు కూడ వెళ్లెను (10).

ఆ వేశనస్త థాష్టాభిః కోటిభిర్గణనాయకః ।
మహాకేశస్సహస్రేణ కోటీనాం గణపో యయౌ ॥
కుండో ద్వాదశ కోట్యా హి తథా పర్వతకో మునే ।
అష్టాభిః కోటిభిర్వీరస్సమగాచ్చంద్ర తాపనః ॥
కాలశ్చ కాలకశ్చైవ మహాకాల శ్శతేన వై ।
కోటీనాం గణనాథో హి త థైవాగ్ని కనామకః ॥
కోట్యాగ్నిముఖ ఏవాగాద్ గణానాం గణనాయకః ।
ఆదిత్య మూర్ధా కోట్యా చ తథా చైవ ఘనావహః ॥

ఓ మహర్షీ! ఆవేశనుడనే గణనాయకుడు ఎనిమిది, మహాకేశుడనే గణపతి వేయి (11), కుండుడు పన్నెండు, పర్వతకుడు పన్నెండు, వీరుడగు చంద్రతాపనుడు ఎనిమిది, కాల, కాలక, మహాకాల, అగ్నికులను గణానాయకులు కోటి చొప్పున (12,13), అగ్నిముఖుడను గణనాకుడు కోటి, ఆదిత్య మూర్ధుడు, మరియు ఘనావహుడు కోటి గణములతో నడిచిరి (14).

సన్నాహశ్శతకోట్యా హి కుముదా గణపస్తథా ।
అమోఘః కోకిలశ్చైవ శత కోట్యా గణాధిపః ॥
సుమంత్రః కోటి కోట్యా చ గణానాం గణనాయకః ।
కాకపాదోదరః కోట్యా షష్ట్యా సంతానకస్తథా ॥
మహా బలశ్చ నవభిర్మధు పింగశ్చ కోకిలః ।
నీలో నవత్యా కోటీనాం పూర్ణ భద్రస్తథైవ చ ॥

సప్త కోట్యా చతుర్వక్త్రః కరణో వింశ కోటిభిః ।
య యౌ నవతి కోట్యా తు గణేశానోఽ హిరోమకః ॥

సన్నాహుడు, కుముదుడు, అమోఘుడు, మరియు కోకిలుడను గణనాయకులు వందకోట్ల చొప్పున గణములతో బయలు దేరిరి(15). సుమంత్రుడను గణనాయకుడు ఒక కోటి, కాకపాదోదరుడు, సంతానకుడు అరవై కోట్ల చొప్పున (16), మహా బలుడు తొమ్మిది, మధుపింగుడు తొమ్మిది, నీలుడు తొంభై, పూర్ణ భద్రుడు తొంభై (17), చతుర్వక్త్రుడు ఏడు, కరణుడు ఇరవై, అహిరోమకుడు తొంభై కోట్ల గణములతో బయలు దేరిరి (18).

యజ్వాశశ్శతమన్యుశ్చ మేఘమన్యుశ్చ నారద ।
తావత్కోట్యా యయుస్సర్వే గణేశా హి పృథక్ పృథక్ ॥
కాషాంగుష్ఠ శ్చతుష్షష్ట్యా కోటీనాం గణనాయకః ।
విరూపాక్షస్సు కేశశ్చ వృషా భశ్చ సనాతనః ॥
తాలకే తుష్షడా స్య శ్చ చంచ్వాస్యశ్చ సనాతనః ।
సంవర్తకస్తథా చైత్రో లకు లీశస్స్వయం ప్రభుః ॥
లో కాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాంతకో మునే ।
దేవో భృంగిరిటి శ్రీమాన్ దేవ దేవ ప్రియస్తథా ॥

ఓ నారదా! యజ్వాశుడు, శతమన్యుడు, మేఘమన్యుడు అను గణనాయకులు కోటి కోటి చొప్పున (19), కాషాంగుష్ఠుడనే గణనాయకుడు అరవై నాలుగు కోట్లు గణములతో బయలు దేరిరి. విరూపాక్షుడు, సుకేశుడు, వృషాభుడు, సనాతనుడు (20), తాలకేతుడు, షడాస్యుడు, చంచ్వాస్యుడు సంవర్తకుడు, చైత్రుడు, లకులీశుడను గణపతి (21), ప్రకాశించే దేహము గల లో కాంతకుడు, దైత్యాంతకుడు, శోభా సంపన్నుడు దేవ దేవునకు ప్రియుడు అగు భృంగిరిటి దేవుడు బయలు దేరిరి (22).

అశనిర్భానుకశ్చైవ చతుష్షష్ట్యా సహస్రశః ।
యయుశ్శివ వివాహార్థం శివేన సహసోత్సవాః ॥
భూతకోటి సహస్రేణ ప్రమథైః కోటి భిస్త్రి భిః ।
వీర భద్రశ్చతుష్షష్ట్యా రోమజానాం త్రికోటిభిః ॥
కోటి కోటి సహస్రాణాం శతై ర్వింశతిభిర్వృతాః ।
తత్ర జగ్ముశ్చ నంద్యాద్యా గణపాశ్శంకరోత్సవే ॥
క్షేత్ర పాలో భైరవశ్చ కోటి కోటి గణైర్యుతః ।
ఉద్వాహశ్శంకర స్యేత్యా యయౌ ప్రీత్యా మహోత్సవే ॥

అశని, భానుకుడు అరవై నాల్గు వేల గణములతో గూడి శివుని వివాహము కొరకై ఉత్సాహముతో శివుని వెంట నడిచిరి (23). వీర భద్రుడు వేయి కోట్ల ప్రమథ గణములతో, మరియు రోమముల నుండి జన్మించిన అరవై ఏడు కోట్ల గణములతో నడచెను (24). నంది మొదలగు గణాధ్యక్షులు శంకరుని వివాహమహోత్సవము నందు పదకొండు వందల ఇరవై కోట్ల గణములతో

విచ్చేసిరి (25). క్షేత్రపాలుడగు భైరవుడు శంకరుని వివాహమహోత్సవమునకు కోటి గణములతో గూడి ఆనందముతో విచ్చేసెను (26).

ఏతే చాన్యే చ గణపా అసంఖ్యాతా మహాబలాః ।
తత్ర జగ్ముర్మహాప్రీత్యా సోత్సాహా శ్శంకరోత్సవే ॥
సర్వే సహస్ర హస్తాశ్చ జటాముకుట ధారిణః ।
చంద్ర రేఖావతంసాశ్చ నీలకంఠా స్త్రిలోచనాః ॥
రుద్రాక్షా భరణాస్సర్వే తథా సద్భస్మ ధారిణః ।
హారకుండల కేయూర ముకుటాద్యై రలంకృతాః ॥
బ్రహ్మ విష్ణ్వింద్ర సంకాశా అణి మాది గుణైర్యుతాః ।
సూర్య కోటి ప్రతీకాశాస్తత్ర రేజుర్గణేశ్వరాః ॥

వీరు మాత్రమే గాక మహాబలశాలురగు గణాధ్యక్షులు లెక్కలేనంత మంది శంకరుని వివాహమునకు ఆనందముతో ఉత్సాహముతో హిమవంతుని రాజధానికి వెళ్లిరి (27). వారందరు వేయి భుజములు గలవారు, జటలను కిరీటములను ధరించిన వారు, చంద్రకలను శిరస్సుపై ఆభరణముగా ధరించిన వారు, నీల వర్ణముతో గూడిన కంఠము గలవారు, మూడు కన్నులు గలవారు అయి ఉండిరి (28). మరియు వారందరు రుద్రాక్షమాల ఆ భరణముగా గలవారు, చక్కని భస్మను ధరించిన వారు, హారములు కుండలములు కేయూరములు కిరీటములు మొదలగు ఆభరణములచే అలంకరింపబడిన వారు (29), బ్రహ్మ, విష్ణువు, ఇంద్రులను పోలియున్నవారు, అణిమాది సిద్ధులు గలవారుగ నుండిరి. అచట గణాధ్యక్షులు కోటి సూర్యుల కాంతులతో ప్రకాశించిరి (30).

పృథి వీచారిణః కేచిత్ కేచిత్పాతాల చారిణః ।
కేచిద్వ్యో మచరాః కేచిత్సప్త స్వర్గ చరా మునే ॥
కిం బహూక్తేన దేవర్షే సర్వ లోక నివాసినః ।
ఆయ యుస్స్వ గణాశ్శంభోః ప్రీత్యా వై శంకరోత్సవే ॥
ఇత్థం దేవైర్గణై శ్చా న్యై స్సహితశ్శంకరః ప్రభుః ।
య యౌ హిమగిరి పురం వివాహార్థం నిజస్య వై ॥
యదా జగామ సర్వేశో వివాహార్థం సురాదిభిః ।
తదా తత్ర హ్యా భూద్వృత్తం తచ్ఛృణు త్వం మునీశ్వర ॥

ఓ మునీ! వారిలో కొందరు భూమి యందు, మరికొందరు పాతాళమునందు, కొందరు ఆకాశమునందు, ఇంకొందరు ఏడు స్వర్గముల యందు నివసించెదరు (31). ఓ దేవర్షీ! పెక్కు మాటలేల? సర్వ లోకములలో నుండే శంభుని గణములు శంకరుని వివాహమునకు ఆనందముతో విచ్చేసిరి (32). ఈ విధముగా దేవతలతో గణములతో మరియు ఇతరులతో కూడిన శంకర ప్రభుడు తన వివాహము కొరకై హిమవంతుని రాజధానికి వెళ్లెను (33). ఓ మహర్షీ! సర్వేశ్వరుడగు శివుడు దేవతలు మొదలగు వారితో కలిసి వివాహము కొరకై వెళ్ళిన సమయములో అచట ఒక వృత్తాంతము జరిగినది. దానిని నీవు వినుము (34).

రుద్రస్య భగినీ భూత్వా చండీ సూత్సవ సంయుతా ।

తత్రా జగామ సుప్రీత్యా పరేషాం సు భయావహా ॥

ప్రేతాసన సమారూఢా సర్పా భరణ భూషితా ।

పూర్ణం కలశమాదాయ హైమం మూర్ధ్ని మహాప్రభమ్ ॥

స్వపరివార సంయుక్తా దీప్తాస్యా దీప్త లోచనా ।

కుతూహలం ప్రకుర్వంతీ జాత హర్షా మహాబలా ॥

తత్ర భూతగణా దివ్యా విరూపాః కోటిశో మునే ।

విరాజంతే స్మ బహుశస్తథా నానావిధాస్త దా ॥

చండి రుద్రుని సోదరియై మహోత్సాహముతో, ఆనందముతో ఇతరులకు చాల భయమును ః కలిగిస్తూ అచటకు వచ్చెను (35). ప్రేతాసనమును అధిష్ఠించి యున్నదై, సర్పములను ఆభరణములుగా అలంకరించు కున్నదై, శిరస్సుపై గొప్ప కాంతులను వెదజల్లే బంగరు పూర్ణ కలశమును ధరించి (36), తన సహచరులతో కూడి యున్నదై, ఎర్రని ముఖము ఎర్రని నేత్రములు గలదియై, గొప్ప హర్షముతో సర్వులకు ఉత్కంఠను రేకెత్తించు చున్నదై, మహాబలవతి యగు చండి వచ్చెను (37). ఓ మునీ! అచట దివ్యములగు భూత గణములు అనేక రూపముల వారు కోట్లాది సంఖ్యలో విరాజిల్లిరి (38).

తైస్సమేతాగ్రతశ్చండీ జగామ వికృతాననా ।

కుతూహలాన్వితా ప్రీతా ప్రీత్యుపద్రవవారిణీ ॥

చండ్యా సర్వే రుద్ర గణాః పృష్ఠతశ్చ కృతాస్తదా ।

కోట్యేకాదశ సంఖ్యాకా రౌద్రా రుద్రప్రియాశ్చ తే ॥

తదా డమరునిర్ఘోషై ర్వ్యా ప్త మాసీ జ్జగత్త్రయమ్ ।

భేరీఝుంకార శబ్దేన శంఖానాం నినదేన చ ॥

తథా దుందుభి నిర్ఘోషై శ్శబ్దః కోలాహలోఽ భవత్ ।

కుర్వన్ జగన్మంగలం చ నాశయేన్మంగలేతరత్ ॥

వికృతమగు ముఖము గల చండి వారిని ఎదుట నుంచుకొని కుతూహలముతో, ఆనందముతో ఉపద్రవమును సృష్టించు చున్నదై నడచెను (39), రుద్రునకు ప్రియమైన భయంకరాకారులగు పదకొండు కోట్ల రుద్ర గణములు అపుడామెను అనుసరించినవి (40). అపుడు ముల్లోకములు డమరు ధ్వనులతో, భేరీఝుంకారములతో, శంఖనాదములతో నిండి పోయెను (41). మరియు కోలాహలముగ నున్న దుందుభిధ్వని జగత్తులోని అమంగళములను నశింప జేసి జగత్తును మంగళమయము చేసెను (42).

గణానాం పృష్ఠతో భూత్వా సర్వే దేవాస్సముత్సుకాః ।

అన్వయుస్సర్వసిద్ధాశ్చ లోకపాలాదికా మునే ॥

మధ్యే వ్రజన్ రమేశోఽథ గరుడాసనమాశ్రితః ।

శుశుభే ధ్రియమాణేన ఛత్రేణ మహతా మునే ॥

చామరై ర్వీజ్యమానోఽసౌ స్వగణైః పరివారితః ।

పార్ష దైర్విలసద్భిశ్చ స్వభూషావిధి భూషితః ॥

తథాహమప్యశోభం వై వ్రజన్మార్గే విరాజితః ।

వేదై ర్మూర్తిధరైశ్శాస్త్రైః పురాణై రాగమైస్తథా ॥

ఓ మునీ! గణముల వెనుక దేవతలు, సిద్ధులు, లోకపాలురు మొదలగు వారందరు ఉత్సాహముతో నడిచిరి (43). ఓ మునీ! వారి మధ్యలో గరుడాసనముపై గూర్చుండి లక్ష్మీపతి వెళ్లు చుండెను. ఆయనకు ఛత్రము ధరింపబడెను. ఆయన గొప్పగా ప్రకాశించెను (44). విష్ణు పార్షదులు ఆయనను చుట్టు వారి ప్రకాశించిరి. కొందరు ఆయనకు వింజామరలను వీచు చుండిరి. ఆయన తన అలంకారముల నన్నింటినీ ధరించి యుండెను (45). అదే విధముగా నేను కూడ మార్గములో వెళ్లుచూ శోభిల్లితిని. మూర్తిని దాల్చిన వేదశాస్త్రములతో, పురాణాగమములతో నేను ప్రకాశించితిని (46).

సనకాది మహాసిద్ధై స్స ప్రజాపతి ఋస్సుతైః ।

పరివారైస్సంయుతో హి శివసేవనతత్పరః ॥

స్వసైన్య మధ్యగశ్శక్ర ఐరావతగజస్థితః ।

నానావిభూషితోఽత్యంతం వ్రజన్ రేజే సురేశ్వరః ॥

తదా తు వ్రజమానాస్తే ఋషయో బహవశ్చ తే ।

విరేజు రతిసోత్కంఠాశ్శివస్యోద్వాహనం ప్రతి ॥

శాకిన్యో యాతుధానాశ్చ వేతాల బ్రహ్మరాక్షసాః ।

భూత ప్రేతపిశాచాశ్చ తథాన్యే ప్రమథాదయః ॥

సనకుడు మొదలగు మహాసిద్ధులు, ప్రజాపతులు, పుత్రులు, పరిచారకులు చుట్టు వారి యుండగా, నేను శివుని సేవించుట యందు తత్పరుడనైతిని (47). ఐరావత గజముపై ఆసీనుడై, అనేక విభూషణములను అలంకరించుకొని యున్న సురపతి యగు ఇంద్రుడు తన సైన్యము మధ్యలో నుండి వెళ్లుచూ ప్రకాశించెను (48). శివుని వివాహమునకై మిక్కిలి ఉత్కంఠతో ప్రయాణము కట్టిన అనేకులగు ఋషులు అపుడా యాత్రలో ప్రకాశించు చుండిరి (49). శాకినులు, రాక్షసులు, భేతాళులు, బ్రహ్మరాక్షసులు, భూతములు, ప్రేతములు, పిశాచములు, మరియు ప్రమథ గణములు మొదలగు ఇతరులు వెళ్లిరి (50).

తుంబురుర్నారదో హా హా హూహూశ్చేత్యాదయో వరాః ।
గంధర్వాః కిన్నరా జగ్ము ర్వాద్యానా ధ్మాయ హర్షితాః ॥
జగతో మాతరస్సర్వా దేవకన్యాశ్చ సర్వశః ।
గాయత్రీ చైవ సావిత్రీ లక్ష్మీ రన్యాస్సురస్త్రియః ॥
ఏతాశ్చాన్యాశ్చ దేవానాం పత్నయో భవమాతరః ।
ఉద్వాహ శ్శంకరస్యేతి జగ్ము స్సర్వా ముదాన్వితాః ॥
శుద్ధ స్ఫటిక సంకాశో వృషభ స్సర్వసుందరః ।
యో ధర్మ ఉచ్యతే వే దైశ్శాస్త్రై స్సిద్ధ మహర్షిభిః ॥
తమారూఢో మహాదేవో వృషభం ధర్మ వత్సలః ।
శుశుభేఽతే తీవ దేవర్షి సేవిత స్సకలైర్వ్రజన్ ॥

తుంబురుడు, నారదుడు, హాహా, హూహూ మొదలగు గంధర్వ శ్రేష్ఠులు, కిన్నరులు వాద్యములను మ్రోయించుచూ ఆనందముతో ముందునకు సాగిరి (51). సవిత్రుమండలాధిష్ఠాన దైవమగు గాయత్రి, లక్ష్మి అను జగన్మాతలు, దేవకన్యలు, ఇతర దేవతా స్త్రీలు వచ్చిరి (52). జగత్తునకు తల్లులైన ఇతర దేవభార్యలు శంకరుని వివాహమును కారణముచే ఆనందముతో అందరు విచ్చేసిరి (33). శుద్ధస్ఫటికమువలె తెల్లనిది, సర్వాంగ సుందరమైనది, వేదశాస్త్రములచే సిద్ధులచే మహర్షులచే ధర్మ మూర్తి యని కొనియా డబడినది అగు వృషభమును (54) ధర్మ ప్రేమియగు మహాదేవుడు అధిష్ఠించెను. దేవతలచే, ఋషులచే, ఇతరులందరిచే సేవింపబడుతూ పయనించుచున్న శంకరుడు మిక్కిలి ప్రకాశించెను (55).

ఏభిస్సమేతైస్స కలైర్మహర్షిభిర్బ భౌ మహేశో బహుశోఽత్య లంకృతః ।
హిమాలయాహ్వస్య ధరస్య సంప్రజన్ పాణి గ్రహార్థం సదనం శివాయాః ॥
ఇత్యుక్తం శంభు చరితం గమనం పరమోత్సవమ్ ।
హిమాలయ పురోద్భూతం సద్వృత్తం శృణు నారద ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే
యాత్రావర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥

పూర్ణముగా అలంకరింపబడిన మహేశ్వరుడు పార్వతీ దేవితో వివాహము కొరకై హిమవంతుని గృహమునకు వెళ్లుచున్న వాడై ఈ ఋషులందరితో గూడి ప్రకాశించెను (56). శివుని పరమోత్సవ యాత్రను ఇంత వరకు వర్ణించి యుంటిని. ఓ నారదా! హిమాలయ నగరములో జరిగిన చక్కని వృత్తాంతమును వినుము (57).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో శివ యాత్రా వర్ణన మనే నలుబదియవ అధ్యాయము ముగిసినది (40).

41 – వివాహ మండపము

బ్రహ్మోవాచ ।

తతస్సంమన్త్ర్య చ మిథః ప్రాప్యాజ్ఞాం శాంకరీం హరిః ।
మునే త్వాం ప్రేషయామాస ప్రథమం కుధరాలయమ్ ॥
అథ ప్రణమ్య సర్వేశం గతస్త్వం నారదా గ్రతః ।
హరిణా నోదితః ప్రీత్యా హిమాచల గృహం ప్రతి ॥
త్వం మునేఽ పశ్య ఆత్మానం గత్వా తద్రీయాన్వితమ్ ।
కృత్రిమం రచితం తత్ర విస్మితో విశ్వకర్మణా ॥
శ్రాంతస్స్వ మాత్మనా తేన కృత్రిమేణ మహామునే ।
అవలో కపర స్సోఽ భూచ్చరితం విశ్వకర్మణః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ మునీ! అపుడు విష్ణువు ఇతరులతో సంప్రదించి శంకరుని ఆజ్ఞను పొంది ముందుగా నిన్ను హిమవంతుని గృహమునకు పంపెను (1). ఓ నారదా! హరిచే ప్రేరితుడవైన నీవు సర్వేశ్వరునకు నమస్కరించి ముందుగా హిమవంతుని గృహమునకు ఆనందముతో వెళ్లితివి (2). ఓ మునీ! నీవచటకు వెళ్లి విశ్వకర్మచే రచింపబడిన నీ కృత్రిమ మూర్తిని గాంచి సిగ్గును, ఆశ్చర్యమును పొందితివి (3). మహర్షీ! అలసి యున్న నీవు విశ్వకర్మచే నిర్మింపబడిన నీ యొక్క కృత్రిమ మూర్తిని చూస్తూ నిలబడి యుంటివి (4).

ప్రవిష్టో మండపం తస్య హిమాద్రే రత్న చిత్రితమ్ ।
సువర్ణ కలశైర్జుష్టం రంభాది బహుశోభితమ్ ॥
సహస్ర స్తంభ సంయుక్తం విచిత్రం పరమాద్భుతమ్ ।
వేదికాం చ తథా దృష్ట్వా విస్మయం త్వం మునే హ్యయాః ॥
తదావోచశ్చ స మునే నారద త్వం నగేశ్వరమ్ ।
విస్మితోఽ తీవ మనసి నష్ట జ్ఞానో విమూఢధీః ॥
ఆగతాస్తే కిమధునా దేవ విష్ణు పురోగమాః ।
తథా మహర్షయస్సర్వే సిద్ధా ఉపసురాః తథా ॥
మహాదేవో వృషారూఢో గణైశ్చ పరివారితః ।
ఆగతః కిం వివాహార్థం వద తథ్యం నగేశ్వర ॥
ఇత్యేవం వచనం శ్రుత్వా తవ విస్మిత చేతసః ।
ఉవాచ త్వాం మునే తథ్యం వాక్యం స హిమవాన్ గిరిః ॥

ఓ మునీ! నీవు ఆ హిమవంతుని యొక్క, రత్నములతో పొదుగుబడినది, బంగరు కలశములతో కూడి యున్నది, అరటి చెట్లు మొదలగు అలంకారములతో మిక్కిలి శోభిల్లునది (5), వేయి స్తంభములు గలది, అనేక రంగులు గలది, పరమాశ్చర్య కరమైనది అగు వివాహ మండపమును ప్రవేశించి వేదికను చూచి

విస్మయమును పొందితివి (6). ఓ నారదమునీ! అట్టి నీవు మనస్సులో గొప్ప విస్మయమును పొంది, జ్ఞానము తొలగుటచే విమోహితమైన బుద్ధి గలవాడవై ఆ పర్వతరాజుతో ఇట్లంటివి (7). విష్ణువు మొదలగు దేవతలు వచ్చి యున్నారా యేమి? మరియు మహర్షులు, సిద్ధులు, ఉపసురులు అందరు విచ్చేసినారా? (8) మహాదేవుడు వృషభము నధిష్ఠించి గణములచే పరివేష్టింప బడిన వాడై వివాహము కొరకు వచ్చియున్నాడా యేమి? ఓ పర్వత రాజా! సత్యమును పలుకుము (9). ఓ మునీ! విస్మయముతో నిండిన మనస్సు గల నీ ఈ మాటను విని ఆ హిమవంతుడు నీతో సత్యవాక్యము నిట్లు పలికెను (10).

హిమవానువాచ ।

హే నారద మహా ప్రాజ్ఞాగతో నైవాధునా శివః ।
వివాహార్థం చ పార్వత్యా స్వగణ స్సవరాతకః ॥
విశ్వకర్మ కృతం చిత్రం విద్ధి నారద సద్ధియా ।
విస్మయం త్యజ దేవర్షే స్వస్థ భవ శివం స్మర ॥
భుక్త్వా విశ్రమ్య సుప్రీతః కృపాం కృత్వా మమోపరి ।
మైనాకాది ధరైస్సార్ధం గచ్ఛ త్వం శంకరాంతికమ్ ॥
ఏభిస్సమేతో గిరిభిర్మహామతే సంప్రార్థ్య శీఘ్రం శివమత్ర చానయ ।
దేవై స్సమేతం చ మహర్షి సంఘైః సురాసురైరర్చితపాదపల్ల వమ్ ॥

హిమవంతుడిట్లు పలికెను -

ఓ నారదా! మహాప్రాజ్ఞా ! శివుడు పార్వతిని వివాహమాడుటకై గణములతో కూడి శివరయాత్రా సమేతుడై ఇంతవరకు రాలేదు (11). ఓ నారదా! ఇది విశ్వకర్మ సద్బుద్ధితో చేసిన విచిత్రమని యెరుంగుము. ఓ దేవర్షి! విస్మయమును వీడుము. స్వస్థుడవై శివుని స్మరించుము (12). నీవు భోజనము చేసి, విశ్రమించి, నాపై దయ యుంచి, మైనాకుడు మొదలగు పర్వతములతో గూడి ఆనందముతో శంకరుని వద్దకు వెళ్లుము (13). ఓ మహామతీ! ఈ పర్వతములతో గూడి నీవు శీఘ్రమే శివుని వద్దకు వెళ్లి ప్రార్థించుము. దేవతలతో కూడి యున్నవాడు, మహర్షుల సంఘములచే, మరియు దేవతలచే రాక్షసులచే పూజింపబడే చిగుళ్ల వంటి పాదములు గలవాడు అగు శివుని ఇచటకు తీసుకొని రమ్ము (14).

బ్రహ్మోవాచ ।

త థేతి చోక్త్వా గమ ఆశు హి త్వం సదైవ తైశ్శైల సుతాదిభిశ్చ ॥
తత్రత్యకృత్యం సువిధాయ భుక్త్వా మహామనాస్త్వం శివసన్నిధానమ్ ॥
తత్ర దృష్టో మహాదేవో దేవాది పరివారితః ।
నమస్కృతస్త్వయా దీప్త శ్శైలైస్తై ర్భక్తి తశ్చ వై ॥
తదా మయా విష్ణునా చ సర్వే దేవా సువాసవాః ।
ప ప్రచ్ఛుస్త్వాం మునే సర్వే రుద్రస్యాను చరాస్తథా ॥

విస్మితాః పర్వతాన్ దృష్ట్వా సందేహాకుల మానసాః ।
మైనాక సహ్యమేర్వా ద్యాన్నా నాలంకార సంయుతాన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

సరే యని పలికి నీవు వెంటనే ఆ పర్వత రాజకుమారులతో, మరియు ఇతరులతో గూడి మరలి వచ్చితివి. విశాల హృదయుడవగు నీవు అచటి కార్యమును చక్క బెట్టి, భోజనము చేసి శీఘ్రమే శివుని సన్నిధికి వచ్చితివి (15). అచట దేవతలు మొదలగు వారిచే చుట్టు వారబడి యున్న మహాదేవుని చూచి నీవు, ఆ పర్వతులు భక్తితో ఆయనకు నమస్కరించిరి (16). ఓ మునీ! అపుడు నేను, విష్ణువు, ఇంద్రుడు, సర్వ దేవతలు, మరియు రుద్రుని అనుచరులు అందరు నిన్ను ప్రశ్నించితిమి (17). అనేకములగు ఆభరణములను ధరించి యున్న మైనాక సహ్య మేరు ఇత్యాది పర్వతులను చూచిన వెంటనే అందరి మనస్సులు సందేహముచే వ్యాకులమైనవి. వారికి విస్మయము కలిగినది (18).

దేవా ఊచుః ।

హే నారద మహాప్రాజ్ఞ విస్మితస్త్వం హి దృశ్యసే ।
సత్కృతోఽసి హిమాగేన కిం న వా వద విస్తరాత్ ॥
ఏతే కస్మాత్సమాయాతాః పర్వతా ఇహ సత్తమాః ।
మైనాక సహ్య మేర్వాద్యాస్సు ప్రతాపాస్స్వలంకృతాః ॥
కన్యాం దాస్యతి శైలోఽసౌ స భవే వా న నారద ।
హిమాలయ గృహే తాత కిం భవత్యద్య తద్వద ॥
ఇతి సందిగ్ధ మనసామస్మాకం చ దివౌకసామ్ ।
వద త్వం పృచ్ఛ మానానాం సందేహం హర సువ్రత ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ నారదా! మహాప్రాజ్ఞా! నీవు విస్మయమును పొందిన వాడువలె కన్పట్టు చున్నావు. హిమవంతుడు నిన్ను సత్కరించినాడా? లేదా? విస్తరముగా చెప్పుము (19). గొప్ప ప్రతాపము గల వారు, చక్కగా అలంకరించు కున్నవారు అగు ఈ మైనాక సహ్యమేర్వాది పర్వతోత్తములు ఇచటకు ఏల విచ్చేసిరి? (20) ఓ నారదా! ఈ హిమవంతుడు శివునకు కన్యను ఇచ్చువాడా? కాదా? తండ్రీ! ఇపుడు హిమవంతుని గృహములో ఏమి జరుగుచున్నది? ఆ విషయమును చెప్పుము (21). దేవతల మగు మాకు మనస్సులో సందేహము కలుగుచున్నది. హే మహావ్రతా! మా ప్రశ్నలకు సమాధానముల నిచ్చి సందేహములను తీర్చుము (22).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం విష్ణ్వాదీనాం దివౌకసామ్ ।
అవోచస్తాన్మునే త్వం హి విస్మితస్త్వష్టృ మాయయా ॥
ఏకాంత మాశ్రిత్య హి మాం హి విష్ణుమ భాషథా వాక్యమిదం మునే త్వమ్ ।
శచీపతిం సర్వసురేశ్వరం వై పక్షచ్ఛిదం పూర్వరిపుం ధరాణామ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! విశ్వ కర్మ యొక్క మాయచే విస్మితుడవైన నీవు విష్ణువు మొదలగు ఆ దేవతల ఈ మాటను విని వారికి బదులు చెప్పి యుంటివి (23). ఓ మునీ! నీవు నన్ను, విష్ణువును, సర్వదేవతలకు ప్రభువు, శచీపతి, పర్వతముల రెక్కలను పూర్వము దునుమాడి శత్రుత్వమును నెరపిన ఇంద్రుని ఏకాంతమునందు పిలిచి ఇట్లు చెప్పి యుంటివి (24).

నారద ఉవాచ ।

త్వష్ట్రా కృతం తద్వికృతం విచిత్రం విమోహనం సర్వ దివౌకసాం హి ।
యేనైవ సర్వాన్ స విమోహితుం సురాన్ సమిచ్ఛతి ప్రేమత ఏవ యుక్త్యా ॥
పురా కృతం తస్య విమోహనం త్వయా సువిస్మృతం తత్ సకలం శచీపతే ।
తస్మాదసౌ త్వాం విజిగీషు రేవ గృహే ధ్రువం తస్య గిరేర్మహాత్మనః ॥
అహం విమోహితస్తేన ప్రతిరూపేణ భాస్వతా ।
తథా విష్ణుః కృతస్తేన బ్రహ్మా శక్రోఽపి తాదృశః ॥

నారదుడిట్లు పలికెను -

వికృతము, విచిత్రము, దేవతలనందరినీ మోహింపజేయునది అగు మాయను విశ్వకర్మ నిర్మించినాడు. ఆతడు ప్రేమతో గూడిన యుక్తితో దేవతలనందరినీ మోహింపజేయ గోరు చున్నాడు (25). ఓ శచీపతీ! పూర్వము నీ వాతనిని మోహింప జేసితివి. ఆ వృత్తాంతము నంతనూ నీవు మరచితివి. అందువలననే ఆతడు మహాత్ముడగు హిమవంతుని ఇంటిలో నిన్ను జయింపగోరు చున్నాడనుటలో సందేహము లేదు (26). ప్రకాశముతో కూడి యున్న నా కృత్రిమ రూపము నన్ను మోహ పెట్టినది. ఆతడు విష్ణు, బ్రహ్మ, ఇంద్రుల రూపములనదే విధముగా నిర్మించినాడు (27).

కిం బహూక్తేన దేవేశ సర్వ దేవగణాః కృతాః ।
కృత్రిమాశ్రిత్ర రూపేణ న కించి దవశేషితమ్ ॥
విమోహనార్థం సర్వేషాం దేవానాం చ విశేషతః ।
కృతా మాయా చిత్ర మయీ పరిహాసవికారిణీ ॥

ఇన్ని మాట లేల? ఓ దేవ దేవా! దేవ గణములందరి యొక్క కృత్రిమ రూపములు నిర్మింపబడి యున్నవి. ఎవ్వరూ మిగుల లేదు (28). దేవతలందరినీ ప్రత్యేకించి మోహింప జేయుటకై కృత్రిమ చిత్రముల రూపములో పరిహాసమును చేసే వికృతమైన మాయ నిర్మించబడినది (29).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా వచనం తస్య దేవేంద్రో వాక్యమబ్రవీత్ ।
విష్ణుం ప్రతి తదా శీఘ్రం భయాకుల తనుర్హరిమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆతని ఆ మాటను విని భయముచే కంపించే శరీరము గల దేవేంద్రుడు వెంటనే పాపములను పోగొట్టే విష్ణువుతో నిట్లనెను (30).

దేవేంద్ర ఉవాచః

దేవ దేవ రమానాథ త్వష్టా మాం నిహ నిష్యతి ।
పుత్రశోకేన త ప్తోఽ సౌ వ్యా జేనానేన నాన్యథా ॥

దేవేంద్రుడిట్లు పలికెను -

దేవ దేవా! లక్ష్మీ పతీ! పుత్రశోకముతో పీడింపబడే ఈ విశ్వకర్మ ఈ మిషతో నన్ను నిశ్చయముగా చంపివేయును (31).

బ్రహ్మోవాచ ।

తస్య తద్వచనం శ్రుత్వా దేవదేవో జనార్దనః ।
ఉవాచ ప్రహసన్ వాక్యం శక్రమాశ్వాసయం స్తదా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇంద్రుని ఆ మాటను విని దేవదేవుడగు జనార్దనుడు నవ్వుతూ, ఆతనిని ఓదారుస్తూ, అపుడు ఇట్లు పలికెను (32).

విష్ణురువాచ ।

నివాతకవచైః పూర్వం మోహితోఽ సి శచీపతే ।
మహావిద్యా బలేనైవ దానవైః పూర్వ వైరిభిః ॥
పర్వతో హిమవానేష తథాన్యేఽ ఖిల పర్వతాః ।
విపక్షా హి కృతాస్సర్వే మమ వాక్యాచ్చ వాసవ ॥
తేనుస్మృత్వా తు వై దృష్ట్వా మాయయా గిరయో హ్యమీ ।
జేతుమిచ్ఛంతు యే మూఢా న భేతవ్యమరావతి ॥
ఈశ్వరో నో హి సర్వేషాం శంకరో భక్తవత్సలః ।
సర్వథా కుశలం శక్ర కరిష్యతి న సంశయః ॥

విష్ణువు ఇట్లు పలికెను –

ఓ శచీపతీ! నీకు పూర్వ శత్రువులగు నివాతకవచులను రాక్షసులు మహావిద్య యొక్క బలము చేతనే పూర్వము నిన్ను మోహింప జేసిరి (33). ఇంద్రా! నీవు నా ఆదేశముచే ఈ హిమవత్పర్వతునితో మాత్రమే గాక, ఇతర పర్వతములన్నింటితో విరోధమును నెరపి యుంటివి (34). ఈ పర్వతములు ఆ వృత్తాంతమును స్మరించి మూఢులై మనలను మాయచే జయింపనిచ్ఛగించి యుండవచ్చును. కాని నీవు లేశమైననూ భయపడవలదు (35). ఇంద్రా! మనందరికీ ప్రభువు, భక్తవత్సలుడు అగు శంకరుడు నిస్సందేహముగా అన్ని విధములుగా క్షేమమును కలిగించగలడు (36).

బ్రహ్మో వాచ ।

ఏవం సం వదమానం తం శక్రం వికృతమానసమ్ ।
హరిణోక్తశ్చ గిరిశో లౌకికీం గతి మాశ్రి తః ॥
హే హరే హ సురేశాన కిం బ్రూథోఽ ద్య పరస్పరమ్ ।
ఇత్యుక్త్వా తౌ మహేశానో మునే త్వాం ప్రత్యువాచ సః ॥
కిం ను వక్తి మహాశైలో యథార్థం వద నారద ।
వృత్తాంతం సకలం బ్రూహి న గోప్యం కర్తు మర్హసి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

వికారమును పొందిన మనస్సు గల ఇంద్రుడు, విష్ణువు ఇట్లు మాటలాడు కొనుచుం◌ండగా, శివుడు లోకపు పోకడననుసరిస్తూ, వారితో నిట్లనెను (37). హే హరీ! ఓ ఇంద్రా! మీరిద్దరు ఒకరితోనొకరు ఏమి మాటలాడు కొను చున్నారు? మహేశ్వరుడిట్లు వారితో పలికి, తరువాత నీతో ఇట్లనెను (38). ఓ నారదా! పర్వతరాజు ఏమనుచున్నాడు? సత్యమును చెప్పుము. వృత్తాంతమునంతనూ చెప్పుము. ఏమియూ దాచిపెట్టవద్దు (39).

దదాతి వా నైవ దదాతి శైలః సుతాం స్వకీయాం వద తచ్చ శీఘ్రమ్ ।
కిం తే దృష్టం కిం కృతం తత్ర గత్వా ప్రీత్యా సర్వం తద్వదాశ్వద్య తాత ॥

హిమవంతుడు తన కుమార్తెను ఇచ్చునా? ఈయడా? ఆ విషయమును వెంటనే చెప్పుము. నీవచటకు వెళ్లి ఏమి చూసితివి? ఏమి చేసితివి? వత్సా! ఇపుడా విషయమునంతనూ వెంటనే చెప్పుము (40).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త శ్శంభునా తత్ర మునే త్వం దేవదర్శనః ।
సర్వం రహస్యవోచో వై యద్దృష్టం తత్ర మండపే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! శంభుడిట్లు పలుకగా, మహా జ్ఞానివగు నీవు అచట మండపము నందు చూచిన దంతయూ రహస్యముగా చెప్పియుంటివి (41).

నారద ఉవాచ ।

దేవ దేవ మహాదేవ శృణు మద్వచనం శుభమ్ ।
నాస్తి విఘ్నభయం నాథ వివాహే కించిదేవ హి ॥
అవశ్యమేవ శైలేశస్తుభ్యం దాస్యతి కన్యకామ్ ।
త్వామానయితు మాయాతా ఇమే శైలా న సంశయః ॥
కిం తు హ్యమర మోహార్థం మాయా విరచితాద్భుతా ।
కుతూహలార్థం సర్వజ్ఞ న కశ్చిద్విఘ్నసంభవః ॥
విచిత్రం మండపం గేహేఽ కార్షీత్తస్య తదాజ్ఞయా ।
విశ్వకర్మా మహామాయీ నానాశ్చర్య మయం విభో ॥

నారదుడిట్లు పలికెను -

దేవ దేవా! మహాదేవా! నా శుభవచనమును వినుము. ఓ నాథా! వివాహము నందు విఘ్నము కలుగుననే భయము ఏమియూ లేదు (42). హిమవంతుడు కన్యకను నీకిచ్చుట నిశ్చయము. ఈ పర్వతులు నిన్ను తోడ్కొని వెళ్లుటకై వచ్చి యున్నారు. సంశయము లేదు (43). ఓ సర్వజ్ఞా! కాని దేవతలను మోహింపజేసి కుతూహలమును కలిగించుట కొరకె అద్భుతమగు మాయ రచింపబడినది. విఘ్నము కలిగే ప్రసక్తియే లేదు (44). హే విభూ! హిమవంతుని ఆజ్ఞచే ఆతని గృహమునందు మహామాయావి యగు విశ్వకర్మ అనేకములగు అద్భుతములతో నిండియున్న విచిత్ర మగు మండపమును నిర్మించెను (45).

సర్వ దేవ సమాజశ్చ కృతస్తత్ర విమోహనః ।
తం దృష్ట్వా విస్మయం ప్రాప్తోహం తన్మాయా విమోహితః ॥

దేవ సమాజమంతయూ అచట మోహమును కలిగించు రీతిలో నిర్మింపబడినది. నేను దానిని చూచి ఆమాయచే విమోహితుడనై విస్మయమును పొందితిని (46).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా తద్వచస్తాత లోకాచారకరః ప్రభుః ।
హర్యాదీన్ ప్రహసన్ శంభురువాచ సకలాన్ సురాన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వత్సా! లోకాచారములను ప్రవర్తిల్ల జేయు శంభు ప్రభుడు ఆ మాటను విని నవ్వి విష్ణువు మొదలగు దేవతలందరితో నిట్లనెను (47).

ఈశ్వర ఉవాచః

కన్యాం దాస్యతి చేన్మహ్యం పర్వతో హి హిమాచలః ।
మాయయా మమ కిం కార్యం వద విష్ణో యథాతథమ్ ॥
హే బ్రహ్మన్ శక్ర మునయస్సురా బ్రూత యథార్థతః ।
మాయయా మమ కిం కార్యం కన్యాం దాస్యతి చేద్గిరిః ॥
కేనాప్యు పాయేన ఫలం హి సాధ్యం ఇత్యుచ్యతే పండితైర్న్యాయ విద్భిః ॥
తస్మాత్సర్వైర్గమ్యతాం శీఘ్రమేవ కార్యార్థి భిర్విష్ణు పురోగమైశ్చ ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

హిమవంతుడు నాకు కన్యను ఇచ్చే పక్షంలో మాయతో నాకు పని యేమి? ఓ విష్ణూ! నీవు ఉన్నది ఉన్నట్లుగా చెప్పుము (48). ఓ బ్రహ్మో! ఇంద్రా! మునులారా! దేవతలారా! సత్యమును పలుకుడు. పర్వతరాజు కన్యను ఇచ్చే పక్షంలో నాకు మాయతో పని యేమి? (49) ఉపాయమేదైనా ఫలమును సాధించవలెనని నీతివేత్తలగు పండితులు చెప్పెదరు. కావున మీరందరు విష్ణువును ముందిడు కొని వివాహకార్యము కొరకు శీఘ్రమే ముందుకు సాగుడు (50).

బ్రహ్మోవాచ ।

ఏవం సంవదమానోఽ సౌ దేవైశ్శంభురభూత్తదా ।
కృతస్స్మరేణైవ వశీ వశం వా ప్రాకృతో నరః ॥
అథ శంభ్వాజ్ఞయా సర్వే విష్ణ్వాద్యా నిర్జరాస్తదా ।
ఋషయశ్చ మహాత్మానో యయుర్మోహ భ్రమాపహమ్ ॥
పురస్కృత్య మునే త్వాం చ పర్వతాంస్తాన్ సవిస్మయాః ।
హిమాద్రేశ్చ తదా జగ్ము ర్మందిరం పరమాద్భుతమ్ ॥
అథ విష్ణ్వాది సంయుక్తో ముదితైస్స్వబలైర్యుతః ।
ఆజగామోప హైమాగపురం ప్రముదితో హరః ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే
మండపరచనా వర్ణనం నామ ఏక చత్వారింశోఽ ధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఈ విధముగా దేవతలతో సంభాషించు చున్న ఆ శంభుడు అపుడు ప్రాకృతమానవుడు వలె మన్మథునకు వశుడైనట్లుండెను (51). అపుడు శంభుని ఆజ్ఞచే విష్ణువు మొదలగు దేవతలు, ఋషులు, మరియు సిద్ధులు మోహజనితమగు భ్రమను విడనాడిరి (52). ఓ మునీ! నిన్ను, ఆ పర్వతులను ముందిడు కొని విస్మయావిష్టులైన ఆ దేవతలు మొదలగు వారు పరమాశ్చర్యకరమగు హిమవంతుని మందిరమునకు అపుడు వెళ్లిరి (53). తరువాత విష్ణువు మొదలగు వారితో, మరియు ఆనందముతో కూడి యున్న తన గణములతో కూడి ప్రహర్షితుడైన శివుడు హిమవన్నగర సమీపమునకు వచ్చెను (54).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో వివాహమండప వర్ణనమనే నలభై ఒకటవ అధ్యాయము ముగిసినది (41).

42 – పెళ్లి వారికి ఎదురేగుట

బ్రహ్మోవాచ ।

అథాకర్ణ్య గిరీశశ్చ నిజపుర్యుపకంఠతః ।
ప్రాప్తమీశం సర్వగం వై ముముదేఽ తి హిమాలయః ॥
అథ సంభృత సంభారస్సంభాషాం కర్తు మీశ్వరమ్ ।
శైలాన్ ప్రస్థాపయామాస బ్రాహ్మణానపి సర్వశః ॥
స్వయం జగామ సద్భక్త్యా ప్రాణేష్టం ద్రష్టుమీశ్వరమ్ ।
భక్త్యుద్రుతమనాశ్శైలః ప్రశంసన్ స్వవిధిం ముదా ॥
దేవసేనాం తదా దృష్ట్వా హిమవాన్ విస్మయం గతః ।
జగామ సమ్ముఖస్తత్ర ధన్యోఽహమితి చింతయన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

సర్వ వ్యాపి యగు ఈశ్వరుడు తన నగరము యొక్క శివార్లకు వచ్చి యున్నాడని విని పర్వత రాజగు హిమవంతుడు మిక్కిలి ఆనందించెను (1). అపుడాతడు ఈశ్వరునితో మాటలాడుటకై పర్వతములను, మరియు బ్రాహ్మణులను సంభారములనిచ్చి పంపించెను (2). హిమవంతుడు భక్తితో నిండిన మనస్సు గలవాడై ప్రాణ ప్రియుడగు ఈశ్వరుని దర్శించుట కొరకై తన భాగ్యమును ప్రశంసిస్తూ గొప్ప భక్తితో స్వయముగా ఎదురేగెను (3). అపుడు హిమవంతుడు దేవ సేనను చూచి విస్మయమును పొందెను. 'నేను దన్యుడను' అని తలపోయుచూ ఆతడచట ఎదురేగెను (4).

దేవా హి తద్బలం దృష్ట్వా విస్మయం పరమం గతాః ।
ఆనందం పరమం ప్రాపుర్దేవాశ్చ గిరయస్తథా ॥
పర్వతానాం మహాసేనా దేవానాం చ తథా మునే ।
మిలిత్వా విరరాజేవ పూర్వ పశ్చిమ సాగరౌ ॥
పరస్పరం మిలిత్వా తే దేవాశ్చ పర్వతాస్తథా ।
కృతకృత్యం తథాత్మానం మేనిరే పరయా ముదా ॥
అథేశ్వరం పురో దృష్ట్వా ప్రణనామ హిమాలయః ।
సర్వే ప్రణేముర్గిరయో బ్రాహ్మణాశ్చ సదాశివమ్ ॥

దేవతలు హిమవంతుని పరివారమును చూచి మిక్కిలి విస్మయమును పొందిరి. దేవతలు మరియు పర్వతులు పరమానందమును పొందిరి (5). ఓ మునీ! పర్వతుల మహాసేన దేవతల పెద్ద సేనతో కలిసి తూర్పు పడమర సముద్రముల కలయిక వలె భాసిల్లెను (6). ఆ దేవతలు, పర్వతులు ఒకరితో మరియొకరు కలసి పరమానందమును పొంది కృతార్థులమైతి మని భావించిరి (7). అపుడు హిమవంతుడు ముందుగా శివుని చూచి ప్రణమిల్లెను. పర్వతములు, బ్రాహ్మణులు అందరు సదాశివునకు నమస్కరించిరి (8).

వృషభస్థం ప్రసన్నాస్యం నానాభరణ భూషితమ్ ।
దివ్యావయవ లావణ్య ప్రకాశిత దిగంతరమ్ ॥
సుసూక్ష్మాహత సత్పట్ట వస్త్ర శోభిత విగ్రహమ్ ।
సద్రత్న విలసన్మౌలిం విహసంతం శుచి ప్రభమ్ ॥
భూషా భూతాహి యుక్తాంగ మద్భుతావయవ ప్రభమ్ ।
దివ్య ద్యుతిం సురేశైశ్చ సేవితం కరచామరైః ॥
వామస్థితాచ్యుతం దక్ష భాగస్థిత విభుం ప్రభుమ్ ।
పృష్ఠస్థిత హరిం పృష్ఠపార్శ్వ స్థిత సురాదికమ్ ॥

వృషభము నధిష్ఠించి యున్నవాడు, ప్రసన్నమగు ముఖము గలవాడు, అనేకములగు ఆభరణములతో అలంకరింపబడిన వాడు, దివ్యమగు అవయవముల కాంతిచే ప్రకాశింప చేయబడిన దిక్కులు గలవాడు (9), అతి సూక్ష్మమగు దారములతో నేసిన మంచి పట్టు వస్త్రముతో శోభిల్లు దేహము గలవాడు, మంచి రత్నములతో ప్రకాశించే శిరస్సు గలవాడు, స్వచ్ఛమగు కాంతులతో నవ్వు చున్నవాడు (10), ఆభరణములుగా మారి పోయిన పాములతో నిండిన దేహము గలవాడు, అద్భుతమగు అవయవ కాంతులు గలవాడు, దివ్యమగు కాంతి గలవాడు, లోకపాలకులచే వింజామరలను చేతబట్టి సేవింపబడువాడు (11), ఎడమ వైపున అచ్యుతుడు .గలవాడు, కుడివైపున బ్రహ్మ గలవాడు, వెనుక ఇంద్రుడు గలవాడు, ప్రక్కన వెనుక దేవతలు మొదలగు వారితో కూడి యుండువాడు అగు శివ ప్రభుని చూచిరి (12).

నానావిధ సురాద్యైశ్చ సంస్తుతం లో కశంకరమ్ ।
స్వహేత్వాత్తతనుం బ్రహ్మ సర్వేశం వరదాయకమ్ ॥
సగుణం నిర్గుణం చాపి భక్తా ధీనం కృపాకరమ్ ।
ప్రకృతేః పురుషస్యాపి పరం సచ్చిత్సుఖాత్మకమ్ ॥
ప్రభోర్దక్షిణ భాగే తు దదర్శ హరిమచ్యుతమ్ ।
వినతా తనయారూఢం నానా భూషణ భూషితమ్ ॥
ప్రభోశ్చ వామ భాగే తు మునే మాం సందదర్శ హ ।
చతుర్ముఖం మహాశో భం స్వపరీవార సంయుతమ్ ॥

దేవతలు మొదలగు వారందరిచే స్తుతింపబడువాడు, లోకములకు మంగళముల నిచ్చువాడు, స్వేచ్ఛచే స్వీకరింపబడిన దేహము గలవాడు, పరబ్రహ్మ స్వరూపుడు, సర్వేశ్వరుడు, వరములనిచ్చువాడు (13), సగుణుడు, మరియు నిర్గుణుడు, భక్తుల అధీనములో నుండువాడు, దయను చూపువాడు, ప్రకృతి పురుషులిద్దరికీ అతీతుడు, సచ్చిదానందఘనుడు అగు శివుని చూచిరి (14). హిమవంతుడు ఆ ప్రభువు యొక్క కుడివైపున గరుడుని అధిష్ఠించిన వాడు, అనేక భూషణములచే అలంకరించుకున్నవాడు, పాపములను హరించువాడు అగు అచ్యుతుని చూచెను (15). ఓ మునీ! ఆ ప్రభుని ఎడమవైపున నాల్గు మోములు గలవాడు, తన పరివారముతో గూడి అధికముగా శోభిల్లువాడునగు నన్ను చూచెను (16).

ఏతౌ సురేశ్వరౌ దృష్ట్వా శివస్యాతి ప్రియౌ సదా ।
ప్రణనామ గిరీశశ్చ సపరీవార ఆదరాత్ ॥
తథా శివస్య పృష్ఠే చ పార్శ్వయోస్సు విరాజితాన్ ।
దేవా దీన్ ప్రణనామాసౌ దృష్ట్వా గిరివరేశ్వరః ॥
శివాజ్ఞయా పురో భూత్వా జగామ స్వపురం గిరిః ।
శేషహర్యాత్మ భూశ్శీఘ్రం మునిభిర్నిర్జరాదిభిః ॥
సర్వే ముని సురాద్యాశ్చ గచ్ఛంతః ప్రభుణా సహా ।
గిరేః పురం సముదితా శ్శ శంసుర్బహు నారద ॥

శివునకు సదా మిక్కిలి ప్రియులైన ఈ దేవతోత్తములనిద్దరినీ చూచి హిమవంతుడు ఁ పరివారముతో గూడి సాదరముగా వారికి ప్రణమిల్లెను (17). పర్వత రాజగు హిమవంతుడు శివునకు ఇరువైపుల, ప్రక్కల యందు విరాజిల్లుతున్న దేవతలు మొదలగు వారిని చూచి ప్రణమిల్లెను (18). హిమవంతుడు శివుని ఆజ్ఞచే ముందు నడుస్తూ తన నగరమునకు దారితీసెను. విష్ణువు, బ్రహ్మ వెంటనే మునులతో దేవతలతో గూడి వెనుక నడిచిరి (19). ఓ నారదా! మునులు, దేవతలు, ఇతరులు సర్వులు శివునితో బాటు వెళ్లు చున్నవారై, హిమవంతుని నగరమును పెక్కు భంగుల కొనియాడ జొచ్చిరి (20).

రచితే శిఖరే రమ్యే సంస్థాప్య దేవతా దికమ్ ।
జగామ హిమవాంస్తత్ర యత్రాస్తి విధివేదికా ॥
కారయిత్వా విశేషేణ చతుష్కం తోరణైర్యుతమ్ ।
స్నానదానాదికం కృత్వా పరీక్షా మకరోత్తదా ॥
స్వపుత్రాన్ ప్రేషయామాస శివస్య నికటే తథా ।
హిమో విష్ణ్వాది సంపూర్ణ వర్గయుక్త స్య శైలరాట్ ॥
కర్తుమైచ్ఛ ద్వరాచారం మహోత్సవ పురస్సరమ్ ।
మహాహర్ష యుతస్సర్వ బంధు యుగ్ఘిమ శైలరాట్ ॥

హిమవంతుడు దేవతలను, ఇతరులను తీర్చిదిద్దిన సుందరమగు శిఖరముపై నిలపి, వివాహ వేదిక ఉన్న స్థలమునకు వెళ్లెను (21). నాల్గు స్తంభములతో తోరణములతో కూడి యున్న ఆ వేదికను పరీక్షించెను (22), మరియు పర్వత శ్రేష్ఠుడగు హిమవంతుడు తన పుత్రులను విష్ణువు మొదలగు వారిందరితో కూడియున్న శివుని సమీపమునకు పంపెను (23). మహానందముతో కూడియున్న వాడు, బంధువులందరితో కలసి యున్నవాడు అగు పర్వతరాజు వరుని ఆహ్వానించే కార్యమును మహోత్సవముగా చేయదలంచెను (24).

అథ తే గిరిపుత్రాశ్చ తత్ర గత్వా ప్రణమ్య తమ్ ।

సస్వవర్గం ప్రార్థనాం తామూచుశ్శై లేశ్వరస్య వై ॥

తతస్తే స్వాలయం జగ్ముశ్శైల పుత్రాస్తదాజ్ఞయా ।

శైలరాజాయ సంచఖ్యుస్తే చాయాంతీతి హర్షితాః ॥

అథ దేవాః ప్రార్థనాం తాం గిరేశ్శ్రుత్వాతిహర్షితాః ।

మునే విష్ణ్వాదయస్సర్వే సేశ్వరా ముముదుర్భృశమ్ ॥

కృత్వా సువేషం సర్వేపి నిర్జరా మునయో గణాః ।

గమనం చక్రురన్యేఽపి ప్రభుణా గిరిరాడ్గృహమ్ ॥

అపుడా హిమవంతుని పుత్రులు అచటకు వెళ్లి తన వారితో కూడి యున్న శివునకు ప్రణమిల్లి హిమవంతుని ఆ ప్రార్థనను గురించి చెప్పిరి (25). అపుడా హిమవంతుని పుత్రులు శివుని ఆజ్ఞను బొంది తమ గృహమునకు వెళ్లి శివుడు, ఇతరులు వచ్చు చున్నారని ఆనందముతో పర్వత రాజగు హిమవంతునకు చెప్పిరి (26). ఓ మహర్షీ! విష్ణువు మొదలగు దేవతలు, మరియు శివుడు హిమవంతుని ఆ ప్రార్థనను విని మిక్కిలి ఆనందించిరి (2.7). దేవతలు, మునులు, గణములు అందరు చక్కని వేషములను ధరించి శివునితో కలిసి హిమవంతుని గృహమునకు వెళ్లిరి (28). .

తస్మిన్నవసరే మేనా ద్రష్టుకామా భవచ్ఛివమ్ ।

ప్రభోరాహ్వాయయామాస మునే త్వాం మునిసత్తమమ్ ॥

అగమస్త్వం మునే తత్ర ప్రభుణా ప్రేరితస్తదా ।

మనసా శివహృద్ధేతుం పూర్ణం కర్తుం తమిచ్ఛతా ॥

త్వాం ప్రణమ్య మునే మేనా ప్రాహ విస్మితమానసా ।

ద్రష్టుకామా ప్రభో రూపం శంకరస్య మదాపహమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే దేవగిరి మేలన వర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥

ఆ సమయములో మేన శివుని చూడ గోరెను. ఓ మునీ! ఆమె హిమవంతుని సేవకుని చే మహర్షి శ్రే◌ోష్ఠుడవగు నిన్ను పిలిపించెను (29). ఓ మునీ! శివుడు వెళ్లుమని నిన్ను ప్రేరేపించెను. శివుని హృదయములోని ఆకాంక్షను పూర్ణము చేయగోరి నీవు వెళ్లితివి (30). శంకర ప్రభుని గర్వాపహారకమగు రూపమును చూడగోరినది, విస్మయమును పొందిన మనస్సు గలది అగు మేన నీకు నమస్కరించి ఇట్లు పలికెను (31).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో దేవగిరుల కలయిక అనే నలుబది రెండవ అధ్యాయము ముగిసినది (42).

43- శివుని అద్భుత లీల

మేనో వాచ ।

నిరీక్షిష్యామి ప్రథమం మునే తం గిరిజాపతిమ్ ।
కీదృశం శివరూపం హి యదర్థే తప ఉత్తమమ్ ॥

మేన ఇట్లు పలికెను -

ఓ మునీ! ఎవని కొరకై పార్వతి ఉత్తమమగు తపస్సును చేసినదో, అట్టి గిరిజాపతి యగు శివుని రూపము ఎట్లుండునో మున్ముందుగా చూడ గోరు చున్నాను (1).

బ్రహ్మోవాచ ।

ఇత్యజ్ఞానపరా సా చ దర్శనార్థం శివస్య చ ।
త్వయా మునే సమం సద్యశ్చంద్రశాలాం సమాగతా ॥
శివోఽపి చ తదా తస్యాం జ్ఞాత్వాహంకారమాత్మనః ।
ప్రాహ విష్ణుం చ మాం తాత లీలాం కృత్వాద్భుతాం ప్రభుః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! మూర్ఖురాలగు ఆమె నీతో బాటు శివుని చూచుట కొరకై వెంటనే ప్రాసాదము యొక్క పై భాగమునకు వచ్చెను (2). ఆమె యందు గల అహంకారము నెరింగి శివ ప్రభుడు అద్భుత లీలను ప్రదర్శించ గోరి విష్ణువును, నన్ను ఉద్దేశించి ఇట్లు పలికెను (3).

శివ ఉవాచ ।

మదాజ్ఞయా యువాం తాతౌ సదేవౌ చ పృథక్ పృథక్ ।
గచ్ఛతం హి గిరిద్వారం వయం పశ్చాద్వ్రజేమ హి ॥

శివుడిట్లు పలికెను -

కుమారులారా! మీరిద్దరు దేవతలతో గూడి వేర్వేరుగా హిమవంతుని గృహద్వారము వద్దకు వెళ్లుడు. మేము తరువాత వచ్చెదము.

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య హరిస్సర్వానాహూయోవాచ తన్మయాః ।
సురాస్సర్వే తథైవాశు గమనం చక్రురుత్సుకాః ॥
స్థితాం శిరోగృహే మేనాం మునే విశ్వేశ్వరస్త్వయా ।
తథైవ దర్శయామాస హృది భ్రంశో యథా భవేత్ ॥
ఏతస్మిన్ సమయే మేనా సేనాం చ పరమాం శుభామ్ ।
నిరీక్షంతీ మునే దృష్ట్వా సామాన్యం హర్షితాఽభవత్ ॥



ప్రథమం చైవ గంధర్వా స్సుందరాస్సుభగాస్తదా ।
ఆయాతాశ్శుభవస్త్రాఢ్యా నానాలంకార భూషితాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఈ మాటను విని విష్ణువు అందరినీ పిలిచి వివరించెను. అప్పుడు తన్మయులై యున్న దేవతలందరు అదే తీరున ఉత్సాహముతో శీఘ్రముగా ముందుకు సాగిరి (5). ఓ మునీ! ప్రాసాదము యొక్క అగ్రభాగమున నీతో కలిసి ఉన్న మేనకు గుండె జారిపోవు విధముగా విశ్వేశ్వరుడు తన రూపమును ప్రదర్శించెను (6). ఓ మునీ! ఈ సమయములో మేనకాదేవి శుభకరమగు ఆ సేనను చూచి సామాన్యముగా హర్షమును పొందెను (7). సుందరులు, సౌభాగ్యవంతులు అగు గంధర్వులు శుభవస్త్రములతో ప్రకాశిస్తూ అనేకములగు భూషణములనలంకరించు కొని మున్ముందుగా వచ్చిరి (8).

నానావాహన సంయుక్తా నానావాద్య పరాయణాః ।
పతాకాభిర్విచిత్రాభిరప్సరోగణ సంయుతాః ॥
అథ దృష్ట్వా వసుం తత్ర తత్పతిం పరమ ప్రభుమ్ ।
మేనా ప్రహర్షితా హ్యాసీచ్ఛివోఽయమితి చాబ్రవీత్ ॥
శివస్య గణకా ఏతే న శివోఽ యం శివాపతిః ।
ఇత్యేవం త్వం తతస్తాం వై అవోచ ఋషిసత్తమ ॥
ఏవం శ్రుత్వా తదా మేనా విచారే తత్పరాఽ భవత్ ।
ఇతశ్చా భ్యధికో యో వై స చ కీదృగ్భవిష్యతి ॥

వారు అనేక వాహనములలో ముందుకు సాగుతూ, అనేక వాద్యములను మ్రోయించు చుండిరి. వారి వాహనములపై రంగుల రంగుల జెండాలు ఉండెను. వారితో బాటు అప్సరసల గణములు కూడ ఉండెను (9). అపుడు వారికి పరమ ప్రభుడగు వసువును చూచి మేన ఆనందించినదై 'ఈతడే శివుడు' అని పలికెను (10). ఓ మహర్షీ! నీవు అపుడు ఆమెతో 'వీరు శివుని సేవకులు. ఈతడు పార్వతీ పతియగు శివుడు కాడు' అని చెప్పి యుంటివి (11). ఆ మాటను విని మేన అపుడు 'ఇంత కంటే గొప్పవాడగు శివుడు ఎట్లుండునో?' అని ఆలోచించ మొదలిడెను (12).

ఏతస్మిన్నంతరే యక్షా మణి గ్రీవాదయశ్చ యే ।
తేషాం సేనా తయా దృష్టా శోభాది ద్విగుణీకృతా ॥
తత్పతిం చ మణి గ్రీవం దృష్ట్వా శోభాన్వితం హి సా ।
అయం రుద్రశ్శివస్వామీ మేనా ప్రాహేతి హర్షితా ॥
నాయం రుద్ర శ్శివ స్వామీ సేవకోఽ యం శివస్య వై ।
ఇత్యవో చోఽగ పత్న్యై త్వం తావద్వహ్నిస్స ఆగతః ॥
తతోఽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సా బ్రవీత్ ।
రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥

ఇంతలో మణి గ్రీవుడు మొదలగు యక్షులు కానవచ్చిరి. వారి సేన గంధర్వుల సేన కంటే రెట్టింపు శోభతో ఆమెకు కానవచ్చెను (13). వారి ప్రభువైన మణి గ్రీవుని ప్రకాశమును చూచి ఆమె 'శివస్వామి ఈయనయే' అని మిక్కిలి ఆనందముతో పలికెను (14). 'ఈయన శివస్వామి కాదు. ఈతడు శివుని సేవకుడు' అని నీవు హిమవంతుని భార్యతో చెప్పితివి. ఇంతలో అగ్ని ముందుకు వచ్చెను (15). మణి కంఠుని కంటే కూడా రెట్టింపు శోభ గల ఆతనిని చూచి 'పార్వతీ పతి యగు రుద్రుడీతడే' అని ఆమె పలికెను. అపుడు నీవు కాదని చెప్పితివి (16)

తావద్యమస్సమాయాతస్త తోऽపి ద్విగుణ ప్రభః ।
తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోऽయ మితి హర్షితా ॥
నేతి త్వమబ్రవీస్తాంవై తావన్నిర్ ఋతి రాగతః ।
బిభ్రాణో ద్విగుణాం శోభాం శుభః పుణ్య జన ప్రభుః ॥
తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోऽ యమితి హర్షితా ।
నేతి త్వమ బ్రవీస్తాం వై తావద్వరుణ ఆగతః ॥
తతోऽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సా బ్రవీత్ ।
రుద్రోऽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥

ఇంతలో అంతకంటె రెట్టింపు శోభ గల యముడు వచ్చెను. వానిని చూచి ఆ మేన ఆనందముతో 'ఈతడే రుద్రుడు' అని పలికెను (17). కాదని నీవు చెప్పితివి. ఇంతలో అంతకు రెట్టింపు శోభ గలవాడు, పుణ్యాత్ములకు ప్రభువు, శుభకారకుడు అగు నిరఋతి వచ్చెను (18). ఆయనను చూచి ఈతడే రుద్రుడని మేన ఆనందముతో పలికెను. కాదని నీవామెతో చెప్పితివి. ఇంతలో వరుణుడు వచ్చెను (19). నిరఋతికంటెనూ రెట్టింపు శో భగల ఆతనిని చూచి ఆమె 'పార్వతీ పతి యగు రుద్రుడు ఈతడే' అని పలికెను. అపుడు కాదని నీవు చెప్పితివి (20).

తావద్వాయుస్స మాయాతస్తతోऽపి ద్విగుణ ప్రభః ।
తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోऽయమితి హర్షితా ॥
నేతి త్వమబ్రవీస్తాం వై తావద్ధనద ఆగతః ।
తతోऽపి ద్విగుణాం శోభాం బిభ్రాణో గుహ్యకాధిపః ॥
తం దృష్ట్వా ప్రాహ సా మేనా రుద్రోऽయమితి హర్షితా ।
నేతి త్వమబ్రవీస్తాం వై తావదీశాన ఆగతః ॥
తతోऽపి ద్విగుణాం శోభాం దృష్ట్వా తస్య చ సాऽబ్రవీత్ ।
రుద్రోऽయం గిరిజా స్వామీ తదా నేతి త్వమ బ్రవీః ॥

ఇంతలో వరుణుని కంటె రెట్టింపు శోభ గల వాయువు వచ్చెను. వానిని చూచి ఆ మేన ఆనందముతో "ఈతడే రుద్రుడు' అని పలికెను (21). కాదని నీవామెతో చెప్పితివి. ఇంతలో వాయువు కంటే రెట్టింపు శోభ గలవాడు, యక్షులకు ప్రభువు అగు కుబేరుడు వచ్చెను (22). ఆతనిని చూచి ఆ మేన హర్షముతో ఈతడే రుద్రుడని పలికెను. కాదని నీవామెతో చెప్పితివి. ఇంతలో ఈశానుడు విచ్చేసెను (23). ఆతని యొక్క శోభ కుబేరుని శోభకు రెట్టింపు ఉండుట ను గాంచి, ఆమె 'పార్వతీ పతి యగు రుద్రుడీతడే' అని పలికెను. అపుడు కాదని నీవు చెప్పితివి (24).

తావదింద్రస్సమాయాతస్తతోఽపి ద్విగుణ ప్రభః ।
సర్వామరవరో నానాదివ్య భక్తి దశేశ్వరః ॥
తం దృష్ట్వా శంకర స్సోఽయమితి సా ప్రాహ మేనకా ।
శక్రస్సురపతిశ్చాయం నేతి త్వం తదాబ్రవీః ॥
తావచ్చంద్రస్సమాయాతశ్శోభాం తద్ద్విగుణాం దధత్ ।
దృష్ట్వా తం ప్రాహ రుద్రోఽయం తాం తు నేతి త్వమబ్రవీః ॥
ఆవత్సూర్య స్సమాయాత శ్శోభాం తద్ద్విగుణాం దధత్ ।
దృష్ట్వా తం ప్రాహ సా సోఽ యం తాం తు నేతి త్వమబ్రవీః ॥

ఇంతలో అంతకు రెట్టింపు కాంతి గలవాడు, దేవతలందరిలో శ్రేష్ఠుడు, అనేక దివ్య ప్రభలు గలవాడు, దేవతలకు ప్రభువు అగు ఇంద్రుడు వచ్చెను (25), ఆమేనక ఆతనిని చూచి ఈతడే శంకరుడని పలికెను. అపుడు నీవు 'ఇతడు దేవతలకు అధిపతియగు ఇంద్రుడు; రుద్రుడు కాడు' అని చెప్పితివి (26). ఇంతలో అంతకు రెట్టింపు శోభను కలిగియున్న చంద్రుడు వచ్చెను. ఆమె ఆతనిని చూచి ఈతడు రుద్రుడని పలుకుగా, నీవామెతో కాదని చెప్పితివి (27). అంతకు రెట్టింపు శోభ గల సూర్యుడు ఇంతలో ముందుకు వచ్చెను. ఆతనిని చూచి ఆమె శివుడీతడే అని పలుకగా, నీవామెతో కాదని చెప్పితివి (28).

తావత్స మాగతాస్తత్ర భృగ్వాద్యాశ్చ మునీశ్వరాః ।
తేజసో రాశయస్సర్వే స్వశిష్య గణసంయుతాః ॥
తన్మధ్యే చైవ వాగీశం దృష్ట్వా సా ప్రాహ మేనకా ।
రుద్రోఽయం గిరిజాస్వామీ తదా నేతి త్వమబ్రవీః ॥
తావద్బ్రహ్మా సమాయాతస్తేజసాం రాశిరుత్తమః ।
సర్షి వర్యసుతస్సాక్షాద్ధర్మపుంజ ఇవ స్తుతః ॥
దృష్ట్వా సా తం తదా మేనా మహాహర్షవతీ మునే ।
సోఽయం శివాపతిః ప్రాహ తాం తు నేతి త్వమ బ్రవీః ॥

ఇంతలో అచటికి తేజోరాశులగు భృగువు మొదలైన మునిశ్రేష్ఠులు తమ శిష్యగణములతో గూడి విచ్చేసిరి (29). వారి మధ్యలో నున్న బృహస్పతిని చూచి ఆ మేనక "పార్వతీ పతి యగు రుద్రుడితడే' అని పలుకగా, కాదని నీవు చెప్పితివి (30). ఇంతలో అచటకు గొప్ప తేజోరాశి, ఋషి శ్రేష్ఠులచే కుమారులచే స్తుతింపబడు వాడు, సాక్షాత్తుగా మూర్తీభవించిన ధర్మము వలె నున్న బ్రహ్మ విచ్చేసెను (31). ఓ మునీ! ఆయనను చూచి అపుడు మేన మహానందమును పొంది 'గిరిజాపతి యగు శివుడితడే' అని పలుకగా, నీవామెతో కాదని చెప్పితివి (32).

ఏతస్మిన్నంతరే తత్ర విష్ణు ర్దేవస్సమాగతః ।

సర్వశోభాన్విత శ్శ్రీమాన్ మేఘశ్యామశ్చతుర్భుజః ॥

కోటి కందర్పలావణ్యః పీతాంబరధరస్స్వరాట్ ।

రాజీవలోచనశ్శాంతః పక్షీంద్రవరవాహనః ॥

శంఖాది లక్షణైర్యుక్తో ముకుటాది విభూషితః ।

శ్రీవత్స వక్షా లక్ష్మీశో హ్య ప్రమేయ ప్రభాన్వితః ॥

తం దృష్ట్వా చకితా క్ష్యా సీన్మహా హర్షేణ సాబ్రవీత్ ।

సోయం శివాపతిస్సాక్షాచ్ఛివో వై నాత్ర సంశయః ॥

ఇంతలో అచటకు సర్వశోభలతో కూడిన వాడు, మేఘమువలె నీలవర్ణము గలవాడు, నాల్గు చేతుల వాడు (33), కోటి మన్మథుల లావణ్యము గలవాడు, సత్త్వ గుణ ప్రధానుడు, గరుడుడు వాహనముగా గలవాడు (34), శంఖము మొదలగు చిహ్నముతో కూడిన వాడు, లక్ష్మీపతి, ఇంద్రియ గోచరము గాని ప్రకాశము గలవాడు నగు శ్రీవిష్ణుదేవుడు విచ్చేసెను (35). ఆయనను చూచి విస్మయము నిండిన కన్నులతో ఆ మేన మహానందమును పొంది 'పార్వతీపతి యగు శివుడు నిశ్చయముగా నీతడే, సందియము లేదు' అని పలికెను (36). .

అథ త్వం మేనకా వాక్యమాక ర్ణ్యోవాచ ఊతికృత్ ।

నాయం శివాపతి రయం కిం త్వయం కేశవో హరిః ॥

శంకరాఖిల కార్యస్య హ్యధికారీ చ తత్ప్రియః ।

అతోఽధికో వరో జ్ఞేయస్స శివః పార్వతీ పతిః ॥

తచ్ఛోభాం వర్ణితుం మేనే మయా నైవ హి శక్యతే ।

స ఏవాఖిల బ్రహ్మాండ పతిస్సర్వేశ్వరస్స్వరాట్ ॥

ఇత్యా కర్ణ్య వచస్తస్య మేనా మేనే చ తాం శుభామ్ ।

మహాధనాం భాగ్యవతీం కులత్రయ సుఖావహామ్ ॥

ఉవాచ చ ప్రసన్నాస్యా ప్రీతి యుక్తేన చేతసా ।

స్వభాగ్యమధికం చాపి వర్ణయంతీ ముహుర్ముహుః ॥

అపుడు మేనక యొక్క ఆ మాటను విని ఆమెను ఒక ఆట ఆడించదలచిన నీవు ఇట్లు పలికితివి : పార్వతీ పతి ఈతడు కాడు. ఈతడు కేశవుడు, హరి (37). ఈయన శంకరుని సర్వకార్యములకు అధికారి, శంకరునకు ప్రియుడు. కావున పార్వతీ పతి యగు శివుడు ఈయనకంటే అధికుడు, శ్రేష్ఠుడు అని ఎరుంగుము (38). ఆయన యొక్క శోభను వర్ణించుటకు నాకు శక్తి లేదు. ఓ మేనా! ఆయనయే బ్రహ్మాండములన్నింటికి ప్రభువు, సర్వేశ్వరుడు, స్వరాట్ (39). నారదుని ఈ మాటను విని మేనా దేవి పార్వతిని గురించి శుభకరురాలు, మహాభాగ్యవతి, గొప్ప సంపద గలది, మూడు కులములకు సుఖమును కలిగించునది అగునని తలపోసెను (40). ప్రసన్నమగు ముఖము గలదై ఆమె ఆనందముతో నిండిన మనస్సుతో తన భాగ్యము అధిక మని అనేక పర్యాయములు వర్ణిస్తూ ఇట్లు పలికెను (41).

మేనో వాచ।

ధన్యాహం సర్వథా జాతా పార్వత్యా జన్మనాధునా ।

ధన్యో గిరీశ్వరోఽ ప్యద్య సర్వం ధన్యతమం మమ ॥

యే యే దృష్టా మయా దేవా నాయకాస్సు ప్రభాన్వితాః ।

ఏతేషాం యః పతిస్సోఽ త్ర పతిరస్యా భవిష్యతి ॥

అస్యాః కిం వర్ణ్యతే భాగ్య మపి వర్ష శతైరపి ।

వర్ణితుం శక్యతే నైవ తత్సుఖ ప్రాప్తి దర్శనాత్ ॥

మేన ఇట్లు పలికెను –

పార్వతి పుట్టుటచే నేనీనాడు అన్ని విధములా ధన్యురాలనైతిని. ఈనాడు పర్వత రాజు కూడ ధన్యుడైనాడు. నా సర్వము మిక్కిలి ధన్యమైనది (42). నేను గొప్ప కాంతి గల దేవనాయకుల నెవరెవరిని చూచితినో, వారందరికీ ప్రభువగు శివుడు ఈమెకు భర్త కాగలడు (43). ఆ ప్రభువును ఈమె పొందుటను చూడగలిగిన భాగ్యమును గాని, ఈమె యొక్క భాగ్యమును గాని వర్ణించుటకు వంద సంవత్సరము లైననూ చాలదు (44).

బ్రహ్మోవాచ ।

ఇత్యవాదీచ్చ సా మేనా ప్రేమనిర్భరమానసా ।

తావత్సమాగతో రుద్రోఽ ద్భుతో తికారకః ప్రభుః ॥

అద్భుతాత్మగణాస్తాత మేనా గర్వాపహారకాః ।

ఆత్మానం దర్శయన్ మాయానిర్లిప్తం నిర్వికారకమ్ ॥

తమాగతమభిప్రేత్య నారద త్వం మునే తదా ।

మేనామవోచస్సు ప్రీత్యా దర్శయంస్తం శివాపతిమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ప్రేమతో నిండిన మనస్సు గల ఆ మేన ఇట్లు పలుకుచుండగనే, అద్భుతమగు లీలలను ప్రకటించే రుద్ర ప్రభుడు విచ్చే నెను (45). వత్సా! ఆయన యొక్క అద్భుతములగు గణములు మేన యొక్క గర్వము నడంచగలవి. ఆయన మాయాలేపము లేనిది, వికారములు లేనిది యగు తన స్వరూపమును ప్రదర్శించెను (46). ఓ నారదమునీ! ఆయన వచ్చుటను గాంచిన నీవు అపుడు మిక్కిలి ప్రీతితో మేనకు ఆ పార్వతీ పతిని చూపించి ఇట్లు పలికితివి (47).

నారద ఉవాచ ।

అయం స శంకరస్సాక్షాద్దృశ్యతాం సుందరి త్వయా ।

యదర్థే శివయా తప్తం తపోఽతి విపినే మహత్ ॥

నారదుడిట్లు పలికెను –

ఓ సుందరీ! ఎవని కొరకై పార్వతి అడవిలో అతి తీవ్రమగు తపస్సును చేసినదో, ఆ శంకరుడీతడే. నీవు ప్రత్యక్షముగా చూడుము (48).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తా హర్షితా మేనా తం దదర్శ ముదా ప్రభుమ్ ।
అద్భుతాకృతిమీశాన మద్భుతానుగమద్భుతమ్ ॥
తావదేవ సమాయాతా రుద్రసేనా మహాద్భుతా ।
భూత ప్రేతాది సంయుక్తా నానా గణ సమన్వితా ॥
వాత్యా రూపధరాః కేచి త్పతాకా మర్మరస్వనాః ।
వక్రతుండాస్తత్ర కేచి ద్విరూపాశ్చాపరే తథా ॥
కరాలాశ్శ్మశ్రులాః కేచిత్కేచిత్ ఖంజా హ్యలోచనాః ।
దండ పాశధరాః కేచిత్కే చిన్ముద్గరపాణయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

నీవు ఇట్లు పలుకగా ఆ మేన ఆనందముతో, అద్భుతమగు ఆకారము గలవాడు, అద్భు ఁతులగు అనుచరులు గలవాడు, ఆశ్చర్యకరుడు అగు ఆ ప్రభుని దర్శించెను (49). అంతలో మహాద్భుతము, భూతప్రేతాదులతో కూడినది, అనేక గణములతో కూడు కున్నది అగు రుద్రసేన వచ్చెను (50). కొందరు తుఫాను వలె మహాశబ్దమును చేయుచుండిరి. మరికొందరు జెండాల రెపరెపల వంటి శబ్దమును చేయుచుండిరి. వారిలో కొందరు ఏనుగు తుండము కలిగి యుండిరి. మరి కొందరు వికృతరూపమును దాల్చి యుండిరి (51). కొందరు భయంకరాకారులు, మరి కొందరు కుంటివారు, మరికొందరు గ్రుడ్డివారు. కొందరు దండమును, పాశమును, మరి కొందరు రోకలిని ధరించి యుండిరి (52).

విరుద్ధవాహనాః కేచి చ్ఛృంగనాద వినాదినః ।
డమరోర్వాదినః కేచి త్కేచి ద్గోముఖవా దినః ॥
అముఖా విముఖాః కేచిత్కేచిద్బహుముఖా గణాః ।
అకరా వికరాః కేచిత్కేచిద్బహుకరా గణాః ॥
అనే త్రా బహునే త్రాశ్చ విశిరాః కుశిరాస్తథా ।
అకర్ణా బహుకర్ణాశ్చ నానావేషధరా గణాః ॥
ఇత్యాది వికృతాకారా అనేకే ప్రబలా గణాః ।
అసంఖ్యాతాస్తథా తాత మహావీరా భయం కరాః ॥

కొందరి వాహనములు వెనుకకు నడుచుచున్నవి. కొందరు కొమ్ము బూరాలను ఊదుచుండిరి. కొందరు డమరుకములను, మరికొందరు గోముఖములను వాయించుచుండిరి (53). కొందరికి నోళ్లు లేవు. మరికొందరు గణములకు అనేక నోళ్లు గలవు. ఇంకొందరి నోళ్లు వికృతముగా నుండెను. కొందరికి చేతులు లేవు. కొందరి చేతులు వికృతముగ నుండెను. మరికొందరు గణములకు అనేకములగు చేతులు ఉండెను (54). కొందరికి కళ్లు లేవు. కొందరికి అనేకములగు కళ్లు ఉండెను. కొందరికి తలలు లేవు. మరికొందరి తలలు వికృతముగ నుండెను. కొందరికి చెవులు లేవు. మరికొందరికి చాల చెవులు గలవు. ఆ గణములు వివిధ వేషములను ధరించిరి (55). ఓ కుమారా! వికృతమగు ఇట్టి ఆకారములు గలవారు, బలశాలురు, మహావీరులు, భయమును గొల్పువారు అగు ఆ గణములు లెక్క లేనంత మంది ఉండిరి (56).

అంగుల్యా దర్శయం స్త్వం తాం మునే రుద్రగణాంస్తతః ।

హరస్య సేవకాన్ పశ్య హరం చాపి వరాననే ॥

అసంఖ్యాతాన్ గణాన్ దృష్ట్వా భూత ప్రేతాదికాన్మునే ।

తత్క్షణాదభవత్సా వై మేనకా త్రాససంకులా ॥

తన్మధ్యే శంకరం చైవ నిర్గుణం గుణవత్తరమ్ ।

వృషభం పంచవక్త్రం త్రినేత్రం భూతి భూషితమ్ ॥

కపర్దినం చంద్రమౌలిం దశహస్తం కపాలినమ్ ।

వ్యాఘ్రచర్మోత్తరీయం చ పినాకవరపాణినమ్ ॥

శూలయుక్తం విరూపాక్షం వికృతాకారమాకులమ్ ।

గజచర్మ వసానం హి వీక్ష్య త్రేసే శివాప్రసూః ॥

ఓ మునీ! నీవు ఆమెతో 'ఓ సుందరీ! శివుని సేవకులను చూడుము, శివుని కూడ చూడుము' అని పలికి ఆమెకు రుద్ర గణములను వ్రేలితో చూపించితివి (57). ఓ మునీ! భూత ప్రేతాది గణములను లెక్కలేనంత మందిని చూచి ఆ మేనక తతక్షణమే భయముచే కంగారు పడెను (58). వారి మధ్యలో నిర్గుణుడు, సకల గుణాభిరాముడు, వృషభమునధిష్ఠించిన వాడు, అయిదు మోములు గలవాడు, ముక్కంటి, భస్మను అలంకరించుకున్నవాడు (59), జటా జూటధారి, చంద్రుని శిరస్సుపై ధరించినవాడు, పది చేతులవాడు, కపాలమును చేత బట్టిన వాడు, వ్యాఘ్ర చర్మమే ఉత్తరీయముగా గలవాడు, చేతి యందు పినాకమనే శ్రేష్ఠమగు ధనస్సు గలవాడు (60), శూలమును ధరించిన వాడు, వికృతమగు ఆకారముతో గజిబిజిగా నుండువాడు, గజ చర్మమును వస్త్రముగా ధరించిన వాడు అగు శంకరుని చూచి పార్వతి యొక్క తల్లి భయపడెను (61).

చకితాం కంపసంయుక్తాం విహ్వలాం విభ్రమద్ధియమ్ ।
శివఽయమతి చాంగుల్యా దర్శయంస్తాం త్వమబ్రవీః ॥
త్వదీయం తద్వచశ్శ్రుత్వా వాతాహతలతా ఇవ ।
సా పపాత ద్రుతం భూమౌ మేనా దుఃఖభరా సతీ ॥
కిమిదం వికృతం దృష్ట్వా వంచితాహం దురాగ్రహే ।
ఇత్యుక్త్వా మూర్ఛితా తత్ర మేనకా సాఽ భవత్ క్షణాత్ ॥
అథ ప్రయత్నైర్వివిధైః స్సఖీభిరుపసేవితా ।
లేభే సంజ్ఞాం శనైర్మేనా గిరీశ్వర ప్రియా తదా ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివాద్భుత
లీలా వర్ణనం నామ త్రిచత్వారింశోఽ ధ్యాయః ॥

ఆశ్చర్యముతో భయముతో వణకుతున్నది, భ్రమించిన బుద్ధి గలది అగు ఆమెకు 'ఈయనయే శివుడు' అని నీవు వ్రేలితో చూపుతూ పలికితివి (62). నీ ఆ మాటను విని దుఃఖమును సహింపజాలక ఆ మేన గాలి చే పెకలించబడిన తీగవలె వెంటనే నేలపై బడెను (63). "ఓసి మొండి పట్టుదల గల పార్వతీ! ఏమి ఈ వికృతరూపము! నేను మోసపోతిని' అని పలికి ఆమేనక అచట క్షణములో మూర్ఛను పొందెను (64). అపుడు సఖురాండ్రు ఆమెకు వివిధములగు ఉపచారములను చేయగా, ఆ హిమవత్పత్నియగు మేన మెల్లగా తెలివిని పొందెను (65).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో శివుని అద్భుత లీలలను వర్ణించు నలుబది మూడవ అధ్యాయము ముగిసినది (43).

44 – మేన యొక్క మంకు పట్టు

బ్రహ్మోవాచ ।

సంజ్ఞాం లబ్ధ్వా తతస్సా చ మేనా శైల ప్రియా సతీ ।
విలలాపాతి సంక్షుబ్ధా తిరస్కారమథాకరోత్ ॥
తత్ర తావత్స్వ పుత్రాంశ్చ నినింద ఖలితా ముహుః ।
ప్రథమం సా తతః పుత్రీం కథయా మాస దుర్వచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

తరువాత హిమవంతుని ప్రియురాలు, సాధ్వియగు మేన సంజ్ఞను పొంది మిక్కిలి సంక్షోభమును పొందినదై రోదించి ఆ వివాహమును తిరస్కరించెను (1). ఆమె మిక్కిలి దుఃఖమును పొందినదై ముందుగా తన కుమారులను అనేక పర్యాయములు నిందించి, తరువాత తన కుమార్తెతో పరుష వచనములను పలికెను (2).

మేనోవాచ ।

మునే పురా త్వయా ప్రోక్తం వరిష్యతి శివా శివమ్ ।
పశ్చాద్ధి మవతః కృత్యం పూజార్థం వినివేశితమ్ ॥
తతో దృష్టం ఫలం సత్యం విపరీతమనర్థకమ్ ।
మునేఽధమాహం దుర్బుద్ధే సర్వథా వంచితా త్వయా ॥
పునస్తయా తపస్తప్తం దుష్కరం మునిభిశ్చ యత్ ।
తస్య లబ్ధం ఫలం హ్యేత త్పశ్యతాం దుఃఖదాయకమ్ ॥
కిం కరోమి క్వ గచ్ఛామి కో మే దుఃఖం వ్యపోహతామ్ ।
కులాదికం వినష్టం మే విహతం జీవితం మమ ॥

మేన ఇట్లు పలికెను –

ఓ మునీ! శివాదేవి శివుని వరించగలదు అని పూర్వము నీవు చెప్పితివి. తరువాత హిమవంతునకు కర్తవ్యమును బోధించి, ఆయనను పూజ కొరకు కూర్చుండ బెట్టితివి (3). దాని వలన విపరీతము, అనర్థకరము అగు ఫలము లభించినది. ఇది వాస్తవము. ఓ మునీ! దుష్ట బుద్ధీ! అభాగ్యురాలనగు నేను నీచే అన్ని విధములుగా మోసగింప బడితిని (4). తరువాత ఆమె మునులకు కూడా చేయ శక్యము కాని తపస్సును చేసినది. దానికి ఈ దుఃఖమును కలిగించు ఫలము లభించినది. చూడుము (5). నేనేమి చేయుదును? ఎచటకు వెళ్లేదను? నా దుఃఖమును ఎవరు పోగొట్టెదరు? నా కులము, జీవితము, సర్వము నాశమును పొందినవి (6).

క్వ గతా ఋషయో దివ్యాః శ్మశ్రూణి త్రోటయామ్యహమ్ ।

తపస్వినీ చ యా పత్నీ సా ధూర్తా స్వయమాగతా ॥

కేషాం చైవాపరాధేన సర్వం నష్టం మమాధునా ।

ఇత్యుక్త్వా వీక్ష్య చ సుతాముచాచ వచనం కటు ॥

కిం కృతం తే సుతే దుష్టే కర్మ దుఃఖకరం మమ ।

హేమ దత్త్వా త్వయానీతః కాచో వై దుష్టయా స్వయమ్ ॥

హిత్వా తు చందనం భూయో లేపితః కర్దమస్త్వయా ।

హంసముడ్డీయ కాకో వై గృహీతో హస్తపంజరే ॥

ఆ దివ్యర్షులు ఎక్కడకు వెళ్లిరి? నేను వారి గడ్డములను ఊడపెరికెదను. తపస్సు చేసుకొనే ఆ వసిష్ఠపత్ని దుష్టురాలు గనుకనే స్వయముగా వచ్చి వివాహమును నిశ్చయించినది (7). కొందరి అపరాధము చేత నేనీనాడు సర్వమును పోగొట్టు కొంటిని. ఇట్లు పలికి ఆమె కుమార్తెను చూచి పరుషవాక్యములను పలికెను (8). ఓ అమ్మాయీ! దుష్టురాలా! నీవు నాకు దుఃఖమును కలిగించు పనిని ఏల చేసితివి? నీవు స్వయముగా బంగారము నిచ్చి ఇత్తడిని తెచ్చితివి (9). నీవు చందనమును పారద్రోసి బురదను పూసుకుంటివి. హంసను విడిచి పెట్టి చేతి యందలి పంజరములో కాకిని భద్రము చేసితివి (10).

హిత్వా బ్రహ్మ జలం దూరే పీతం కూపోదకం త్వయా ।

సూర్యం హిత్వా తు ఖద్యోతో గృహీతో యత్నతస్త్వయా ॥

తండులాంశ్చ తథా హిత్వా కృతం వై తుషభక్షణమ్ ।

ప్రక్షిప్యాజ్యం తథా తైలం కారండం భుక్త మాదరాత్ ॥

సింహసేవాం తథా ముక్త్వా శృగాలస్సేవితస్త్వయా ।

బ్రహ్మ విద్యాం తథా ముక్త్వా కుగాథా చ శ్రుతా త్వయా ॥

గృహే యజ్ఞ విభూతిం హి దూరీకృత్య సుమంగలామ్ ।

గృహీతం చ చితా భస్మ త్వయా పుత్రి హ్యమంగలమ్ ॥

గంగాజలమును పారబోసి నీవు నూతి నీటిని త్రాగితివి. నీవు సూర్యుని విడిచి ప్రయత్న పూర్వకముగా మిణుగురు పురుగును పట్టుకున్నావు (11). నీవు బియ్యమును విడిచి ఊకను భక్షించితివి. నేతిని పారబోసి ఆముదమును భుజించితివి (12). సింహసేవను వీడి నీవు నక్కను సేవించితివి. నీవు బ్రహ్మ విద్యను విడిచి పెట్టి చెడు గాథను వింటివి (13). ఇంటిలోని పరమమంగళకరమగు యజ్ఞ విభూతిని దూరము చేసి, ఓ అమ్మాయీ! నీవు అమంగళకరమగు చితా భస్మను స్వీకరించితివి (14).

సర్వాన్ దేవ వరాం స్త్యక్త్వా విష్ణ్వా దీన్ పరమేశ్వరాన్ ।
కృతం త్వయా కుబుద్ధ్యా వై శివార్థం తప ఈ దృశమ్ ॥
ధిక్త్వాం చ తవ బుద్ధిం చ ధిగ్రూపం చరితం తవ ।
ధిక్త్వోపదేశకర్తారం ధిక్సఖ్యావతి తే తథా ॥
ఆవాం చ ధికథా పుత్రి యౌ తే జన్మ ప్రవర్తకౌ ।
ధిక్తే నారద బుద్ధిం చ సప్తర్షీం శ్చ సుబుద్ధిదాన్ ॥
ధిక్కులం ధిక్క్రియాదాక్ష్యం సర్వం ధిగ్యత్కృతం త్వయా ।
గృహం తు ధుక్షితం హ్యేతన్మరణం తు మమైవ హి ॥

పరమ ప్రభువులగు విష్ణువు మొదలగు దేవోత్తములను విడిచి పెట్టి దుర్బుద్ధివగు నీవు ఇట్టి తపస్సును శివుని కొరకు చేసితివి (15). నీకు, నీ బుద్ధికి, రూపమునకు, నీ ప్రవృత్తికి, నీకు ఉపదేశము చేసిన వానికి, నీ ఆ ఇద్దరు సఖురాండ్రకు నింద యగు గాక! (16). ఓ అమ్మాయీ! నీకు జన్మ నిచ్చిన మేమిద్దరము నిందారులము. ఓ నారదా! నీ బుద్ధికి, మంచి బుద్ధిని కలిగించు సప్తర్షులకు (17), కులమునకు, కర్మలను చేసే సామర్థ్యమునకు నిందయగు గాక! నీవు సర్వమును నిందార్హము చేసితివి. ఈ ఇంటిని నీవు నాశనము చేసితివి. నాకు మరణమే గతి (18).

పర్వతానామయం రాజా నాయాతు నికటే మమ ।
సప్తర్షయస్స్వయం నైవ దర్శయంతు ముఖం మమ ॥
సాధితం కిం చ సర్వైస్తు మిలిత్వా ఘాతితం కులమ్ ।
వంధ్యాహం న కథం జాతా గర్భో న గలితః కథమ్ ॥
అథో న హ మృతా చాహం పుత్రికా న మృతా కథమ్ ।
రక్షసాద్య కథం నో వా భక్షితా గగనే పునః ॥
ఛేదయామి శిరస్తే ఒద్య కిం కరోమి కలేవరైః ।
త్యక్త్వా త్వాం చ కుతో యాయాం హా హా మే జీవితం హతమ్ ॥

ఈ పర్వతరాజు నా దరిదాపులకు రాకుండుగాక! సప్తర్షులు వారి ముఖము నాకు చూపకుందురు గాక! (19) అందరు కలిసి ఏమి సాధించిరి? నా కులము నాశనమైనది. నేను గొడ్రాలుగా ఏల పుట్టలేదో? నా గర్భము ఏల భగ్నము కాలేదో? (20) నేను ఏల మరణించలేదో? లేక, నా పుత్రిక ఏల మరణించలేదో? రాక్షసుడు ఈనాడు నా కుమార్తెను గగన వీధికి తీసుకు వెళ్లి ఏల భక్షించడో? (21) నీ శిరస్సును నేనీనాడు నరికి వేసెదను, ఈ దేహములతో పని ఏమి గలదు? నిన్ను విడిచి నేనేచటకు పోగలను? అయ్యో! నా జీవితము నాశనమైనది (22).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా పతితా సా చ మేనా భూమౌ విమూర్ఛితా ।
వ్యాకులా శోకరోషాద్యైర్న గతా భర్తృసన్నిధౌ ॥
హాహాకారో మహానాసీత్తస్మిన్ కాలే మునీశ్వర ।
సర్వే సమాగతాస్తత్ర క్రమాత్తత్సన్నిధౌ సురాః ॥
పురా దేవమునే చాహ మాగతస్తు స్వయం తదా ।
మాం దృష్ట్వా త్వం వచస్తాం వై ప్రావోచ ఋషి సత్తమ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మిక్కిలి దుఃఖితురాలగు ఆ మేన ఇట్లు పలికి మూర్ఛిల్లి భూమిపై పడెను. శోకము, రోషము మొదలగు కారణములచే ఆమె తన భర్త వద్దకు వెళ్లలేదు (23). ఓ మహర్షీ! ఆ సమయములో పెద్దహాహాకారమును చేసిరి. క్రమముగా దేవతలందరు ఆమె ఉన్నచోటికి విచ్చేసిరి (24). ఓ దేవర్షి! నేను కూడ అపుడు అచటకు స్వయముగా విచ్చేసితిని. నన్ను చూసి నీవు ఈ మాటలను ఆమెతో పలికితివి (25).

నారద ఉవాచ ।

యథార్థం సుందరం రూపం నాజ్ఞాతం తే శివస్య వై ।
లీలయేదం ధృతం రూపం న యథార్థం శివేన చ ॥
తస్మాత్క్రోధం పరిత్యజ్య స్వస్థా భవ పతివ్రతే ।
కార్యం కురు హఠం త్యక్త్వా శివాం దేహి శివాయ చ ॥

నారదుడిట్లు పలికెను -

శివుని యథార్థమగు సుందరరూపము నీకు తెలియనిది కాదు. ఆయన ఈ రూపమును లీలచే ధరించినాడు. ఇది వాస్తవరూపము కాదు (26). ఓ పతివ్రతా! కావున నీవు కోపమును విడిచి స్వస్థురాలవు కమ్ము. మొండి పట్టు దలను వీడి కార్యమును నడిపించుము. పార్వతిని శివునకు ఇమ్ము (27).

బ్రహ్మోవాచ ।

తదాకర్ణ్య వచస్తే సా మేనా త్వాం వాక్యమ బ్రవీత్ ।
ఉత్తిష్ఠేతో గచ్ఛ దూరం దుష్టా ధమవరో భవాన్ ॥
ఇత్యుక్తే తు తయా దేవా ఇంద్రాద్యాస్సకలాః క్రమాత్ ।
సమాగత్య చ దిక్పాలా వచనం చేదమ బ్రువన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

నీ ఆ మాటను విని ఆ మేన నీతో 'లెమ్ము, ఇచటి నుండి దూరముగా పొమ్ము; నీ(?)వు దుష్టుడవు, అధమాధముడవు' అని పలికెను (28). ఆమె ఇట్లు పలుకగా ఇంద్రాది సకల దేవతలు, దిక్పాలకులు వరుసగా వచ్చి ఇట్లు పలికిరి (29).

దేవా ఊచుః ।

హే మేనే పితృకన్యే హి శృణ్వస్మద్వచనం ముదా ।
అయం వైపరమస్సాక్షాచ్ఛివః పరసుఖావహః ॥
కృపయా చ భవత్పు త్ర్యాస్తపో దృష్ట్వాతి దుస్సహమ్ ।
దర్శనం దత్తవాన్ శంభుర్వరం సద్భక్త వత్సలః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ మేనా! నీవు పితరుల కుమార్తెవు. మా మాటను ప్రీతితో వినుము. ఈయన సాక్షాత్తుగా పరమానందము నొసగు పరమ శివుడు (30). నీ కుమార్తె మిక్కిలి దుస్సహమగు తపస్సును చేయగా, మంచి భక్తుల యందు ప్రేమ గల శంభుడు దయతో దర్శనమును, వరమును ఇచ్చి యున్నాడు (31).

బ్రహ్మోవాచ ।

అథోవాచ సురాన్మేనా విలప్యాతి ముహుర్ముహుః ।
న దేయా తు మయా కన్యా గిరిశాయోగ్రరూపిణే ॥
కిమర్థం తు భవంతశ్చ సర్వే దేవాః ప్రపంచితాః ।
రూపమస్యాః పరం నామ వ్యర్థీ కుర్తుం సముద్యతాః ॥
ఇత్యుక్తే చ తయా తత్ర ఋషయస్సప్త ఏవ హి ।
ఊచుస్తే వచ ఆగత్య వసిష్ఠాద్యా మునీశ్వర ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు మేన చాల సేపు దుఃఖించి, 'భయం కరాకారుడగు కైలాసపతికి నేను కన్యను ఈయను' అని పలికెను (32). ఓ దేవతలారా ! మీరందరు యోజన చేసి ఈ పార్వతి యొక్క పరమ సౌందర్యమును వ్యర్థము చేయుటకు ఏల పూను కొంటిరి? (33) ఓ మహర్షీ! ఆమె ఇట్లు పలుకగా, వసిష్ఠుడు మొదలగు సప్తర్షులు ముందుకు వచ్చి ఇట్లు పలికిరి (34).

సప్తర్షయ ఊచుః ।

కార్యం సాధయితుం ప్రాప్తాః పితృకన్యే గిరి ప్రియే ।
విరుద్ధం చాత్ర ఉక్తా ర్థే కథం మన్యామహే వయమ్ ॥

సప్తర్షులిట్లు పలికిరి -

హిమవత్పత్నీ! నీవు పితృ దేవతల కుమార్తెవు. నీ కార్యమును సాధించుటకై మేము వచ్చితిమి. మేము చెప్పిన వచనములలో విరోధము మాకు తోచుట లేదు (35).

అయం వై పరమో లా భో దర్శనం శంకరస్య యత్ ।

దానపాత్రం స తే భూత్వాఽఽ గతస్తవ చ మందిరమ్ ॥

శంకరుని దర్శనము సర్వోత్కృష్టమైన లాభము. ఆయన నీ దానమును స్వీకరించుటకై నీ గృహమునకు వచ్చి యున్నాడు (36).

బ్రహ్మోవాచ।

ఇత్యుక్తా తై స్తతో మేనా మునివాక్యం మృషాకరోత్ ।

ప్రత్యువాచ చ రుష్టా సా తాన్నృషీన్ జ్ఞానదుర్బలా ॥

వారిట్లు పలుకగా జ్ఞానవిహీనురాలగు మేన మునుల వాక్యమును వమ్ము చేసి కోపముతో ఆ ఋషులకు ఇట్లు బదులిడెను (37).

మేనోవాచ ।

శస్త్రాద్యైర్ఘాతయిష్యేఽహం న దాస్యే శంకరాయ తామ్ ।

దూరం గచ్ఛత సర్వే హి నాగంతవ్యం మదంతికే ॥

మేన ఇట్లు పలికెను -

నే నామెను కత్తితో నరికి వేయుటకైననూ సిద్ధమే గాని, ఆమెను శంకరునకు ఈయను. మీరందరు దూరముగా పొండు. నా సమీపమునకు రావద్దు (38).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా విరరామాశు సా విలప్యాతివిహ్వలా ।

హాహాకారో మహానాసీత్తత్ర తద్వృత్తతో మునే ॥

తతో హిమాలయస్తత్రాజగామాతి సమాకులః ।

తాం చ బోధయితుం ప్రీత్యా ప్రాహ తత్త్వం చ దర్శయన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మిక్కిలి దుఃఖితురాలగు ఆమె ఏడుస్తూ ఇట్లు పలికి మిన్నకుండెను. ఓ మునీ! ఆమె ప్రవర్తనను చూచి అచట ఉన్న వారందరు హాహాకారమును బిగ్గరగా చేసిరి (39). అపుడచటకు కంగారు పడుతూ హిమవంతుడు వచ్చెను. ఆతడు ఆమెకు సత్యమును ప్రేమతో బోధించి సర్ది చెప్పుటకు యత్నించెను (40).

హిమాలయ ఉవాచ।

శృణు మేనే వచో మేఽద్య వికలాసి కథం ప్రియే।
కే కే సమాగతా గేహం కథం చైతాన్ వినిందసి॥
శంకరం త్వం చ జానాసి రూపం దృష్ట్వాసి విహ్వలా।
వికటం తస్య శంభోస్తు నానారూపాభిధస్య హి॥
సశంకరో మయా జ్ఞాతస్సర్వేషాం ప్రతిపాలకః।
పూజ్యానాం పూజ్య ఏవా సౌ కర్తను గ్రహనిగ్రహాన్॥
హఠం న కురు ముంచ త్వం దుఃఖం ప్రాణప్రియేఽనఘే।
ఉత్తిష్ఠారం తథా కార్యం కర్తుమర్హసి సువ్రతే॥

హిమవంతుడిట్లు పలికెను -

ఓ మేనా! ప్రియురాలా! ఇప్పుడు నా మాటను వినుము. నీవు దుఃఖించుచుంటివేల? ఎవరెవరు ఇంటికి వచ్చిరి? వారిని నీవెట్లు నిందించుచుంటివి? (41). శంకరుడు నీకు తెలిసిన వాడే. అనేక నామములను రూపములను ధరించు ఆ శంభుని భయంకర రూపమును చూచి నీవు కంగారు పడితివి (42). ఆ శంకరుని నేను ఎరుంగుదును. అందరినీ రక్షించువాడు ఆయనయే. ఆయన పూజ్యులలో కెల్లా పూజ్యుడు. అను గ్రహ నిగ్రహములను చేయువాడు ఆయనయే (43). ఓ ప్రాణ ప్రియురాలా! మొండి పట్టు పట్టకుము. దుఃఖమును వీడుము. ఓ పూజ్యురాలా! వెంటనే లెమ్ము. గొప్ప వ్రతము గలదానా! నీ కర్తవ్య కర్మను నీవు చేయదగుదువు (44).

యద్వై ద్వారగతశ్శంభుః పురా వికటరూపధృక్।
నానాలీలాం చ కృతవాన్ చేతయామి చ తా మిమామ్॥
తన్మాహాత్మ్యం పరం దృష్ట్వా కన్యాం దాతుం త్వయా మయా।
అంగీకృతం తదా దేవి త త్ప్రమాణం కురు ప్రియే॥

ఇంతకు ముందు శంభుడు వికృతరూపమును ధరించి ద్వారము వద్దకు వచ్చి అనేక లీలలను చేసినాడు. ఆ లీలను నీకిపుడు నేను గుర్తు చేయుచున్నాను (45). ఓ దేవీ! మనము అపుడు ఆయన యొక్క మహామహిమను చూచి, ఇద్దరము కన్యను ఇచ్చుటకు అంగీకరించి యుంటిమి. ఓ ప్రియురాలా! ఆ అంగీకారమును ప్రమాణముగా చేసుకొనుము (46).

బ్రహ్మోవాచ।

ఇత్యుక్త్వా సోఽద్రి నాథో హి విరరామ తతో మునే।
తదా కర్ణ్య శివామాతా మేనోవాచ హిమాలయమ్॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! ఇట్లు పలికి ఆ పర్వతేశ్వరుడు విరమించెను. పార్వతి తల్లియగు మేన ఆ మాటను విని హిమవంతునితో నిట్లనెను (47).

మనోవాచ ।

మద్వచశ్శ్రూయతాం నాథ తథా కర్తుం త్వమర్హసి ।
గృహీత్వా తనుజాం చైనాం బద్ధ్వా కంఠే తు పార్వతీమ్ ॥
అధః పాతయ నిశ్శంకం దాస్యే తాం న హరాయ హి ।
తథైనా మథవా నాథ గత్వా వై సాగరే సుతామ్ ॥
నిమజ్జయ దయాం త్యక్త్వా తతోఽద్రీశ సుఖీ భవ ।
యది దాస్యసి పుత్రీం త్వం రుద్రాయ వికటాత్మనే ॥
తర్హి త్యక్ష్యామ్యహం స్వామిన్నిశ్చయేన కలే బరమ్ ॥

మేన ఇట్లు పలికెను –

ఓ నాథా! నా మాటను విని నేను చెప్పినట్లు చేయుము. ఈ నీ కుమార్తె యగు పార్వతిని తీసుకు వెళ్లి కంఠము నందు బంధించి (48), శంకలేని వాడవై క్రిందకు త్రోసివేయుము. నేను ఆమెను శివునకు ఈయను. లేదా, ఓ నాథా! ఈమెను సముద్రములో ముంచి వేయుము. ఓ పర్వతరాజా! అపుడు నీకు సుఖము కలుగును. ఓ స్వామీ! నీవు నీ పుత్రికను వికట రూపుడగు రుద్రునకిచ్చినచో నేను నిశ్చయముగా దేహత్యాగము చేసెదను (49, 50).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తే చ తదా తత్ర వచనే మేనయా హఠాత్ ।
ఉవాచ వచనం రమ్యం పార్వతీ స్వయమాగతా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అపుడచట మేన మొండి పట్టుదలతో ఇట్లు పలుకగా, పార్వతి స్వయముగా వచ్చి రమ్యముగా నిట్లు పలికెను (51).

పార్వత్యువాచ ।

మాతస్తే విపరీతా హి బుద్ధిర్జాతాఽశుభావహా ।
ధర్మావలంబనాత్త్వం హి కథం ధర్మం జహాసి వై ॥
అయం రుద్రః పరస్సాక్షాత్సర్వ ప్రభవ ఈశ్వరః ।
శంభుస్సురూపస్సుఖదస్సర్వ శ్రుతిషు వర్ణితః ॥

పార్వతి ఇట్లు పలికెను –

తల్లీ! నీకు అశుభములను కలిగించే విపరీత బుద్ధి పుట్టినది. ధర్మమును అవలంబించిన నీవు ఇపుడు ధర్మము నేల వీడు చున్నావు? (52) ఈ రుద్రుడే పరమాత్మ యనియు, సర్వకారణుడగు ఈశ్వరుడేననియు, సుఖమును ఇచ్చువాడనియు, అందమైన రూపము గలవాడనియు వేదములన్నియు వర్ణించుచున్నవి (53).

మహేశశ్శంకరశ్చాయం సర్వదేవ ప్రభు స్స్వరాట్ ।

నానారూపాభిధో మాత ర్హరి బ్రహ్మాది సేవితః ॥

అధిష్ఠానం చ సర్వేషాం కర్తా హర్తా చ స ప్రభుః ।

నిర్వికారీ త్రిదేవేశో హ్యవినాశీ సనాతనః ॥

యదర్థే దేవతాస్సర్వా ఆయాతా కింకరీకృతాః ।

ద్వారి తే సోత్సవాశ్చాద్య కిమతోఽన్యత్పరం సుఖమ్ ॥

ఉత్తిష్ఠాతః ప్రయత్నేన జీవితం సఫలం కురు ।

దేహి మాం త్వం శివాయాస్మై స్వాశ్రమం కురు సార్థకమ్ ॥

అమ్మా! ఈ శంకరుడు మహేశ్వరుడు, సర్వదేవతలకు ప్రభువు, జగన్నాథుడు, అనేక రూపములను ధరించు వాడు, విష్ణు బ్రహ్మాదులచే సేవింపబడువాడు (54), సర్వప్రాణులకు అధిష్ఠానము, జగత్తును సృష్టించి సంహరించు ప్రభుడు, వికారములు లేని వాడు, బ్రహ్మ విష్ణు రుద్రులను త్రిమూర్తులకు ప్రభువు, వినాశము లేనివాడు, సనాతనుడు (55). ఆయన కొరకై దేవతలందరు విచ్చేసి కింకరుల వలె ఈనాడు నీ ద్వారము వద్ద ఉత్సవమును చేయుచున్నారు. ఇంతకంటే గొప్ప సుఖమేమి గలదు? (56) కావున నీవు జాగ్రత్తగా లెమ్ము. నీ జీవితమును సార్థకము చేసుకొనుము. నన్ను శివునకు ఇచ్చి నీ గృహస్థాశ్రమమును సఫలము చేసుకొనుము (57).

దేహి మాం పరమేశాయ శంకరాయ జనన్యహో ।

స్వీకురు త్వమిమం మాతర్వినయం మే బ్రవీమి తే ॥

చేన్న దాస్యసి తస్మై మాం న వృణేఽన్యమహం వరమ్ ।

భాగం లభేత్కథం సైంహం శృగాలః పరవంచకః ॥

మనసా వచసా మాతః కర్మణా చ హరస్స్వయమ్ ।

మయా వృతో వృతశ్చైవ యదిచ్ఛసి తథా కురు ॥

అమ్మా! నన్ను పరమేశ్వరుడగు శంకరునకు ఇమ్ము. తల్లీ! నేను వినయముతో చెప్పు ఈ మాటను నీవు అంగీకరించుము (58). నీవు నన్ను శివునకు ఈయక పోయినచో నేను మరియొక వరుని వివాహమాడను. ఇతరులను వంచించి జీవించు నక్క సింహమునకు ఉద్దేశించిన భాగమును ఎట్లు పొందగల్గును? (59) తల్లీ! నేను మనోవాక్కాయ కర్మలచే శివుని వరించితిని. ఇది నిశ్చితము. నీకు నచ్చిన తీరున నీవాచరింపుము (60).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య శివావాక్యం మేనా శైలేశ్వర ప్రియా ।
సువిలప్య మహా క్రుద్ధా గృహీత్వా తత్క లేబరమ్ ॥
ముష్టిభిః కూర్పరైశ్చైవ దంతాన్ ధర్షయతీ చ సా ।
తాడయామాస తాం పుత్రాం విహ్వలాతిరుషాన్వితా ॥
యే తత్ర ఋషయస్తాత త్వదాద్యా శ్చాపరే మునే ।
తద్ధ స్తాత్తాం పరిచ్ఛిద్య నిన్యుర్దూ రతరం తతః ॥
తాన్ వై తథావిధాన్ దృష్ట్వా భ ర్త్సయిత్వా పునః పునః ।
ఉవాచ శ్రావయంతీ సా దుర్వచో నిఖిలాన్ పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హిమవత్పత్ని యగు మేన పార్వతి యొక్క ఆ మాటను విని మిక్కిలి కోపించి బిగ్గరగా ఏడ్చి ఆమె శరీరమును పట్టుకొని (61), పళ్లను పట పట కొరుకుచూ, మిక్కిలి దుఃఖముతో మహాక్రోధముతో తన కుమార్తె యగు పార్వతిని పిడికిళ్లతో, మరియు మోచేతులతో కొట్టెను (62). ఓ మునీ! కుమారా! అక్కడ ఉన్న ఋషులు, నీవు, మరియు ఇతరులు ఆ పార్వతిని ఆమె చేతి నుండి విడిపించి అచటి నుండి దూరముగా తీసుకొని పోయిరి (63). అపుడామె వారిని అనేక విధములుగా కోపించి వారికి మరల నిందావచనములను వినిపించు చున్నదై ఇట్లు పలికెను (64).

మేనోవాచ ।

కిం మేనా హి కరిష్యేఽహం దుష్టా గ్రహవతీం శివామ్ ।
దాస్యామ్యస్మై గరం తీవ్రం కూపే క్షేప్స్యామి వా ధ్రువమ్ ॥
ఛేత్స్యామి కాలీ మథవా శస్త్రాస్త్రైర్బూరి ఖండశః ।
నిమజ్జయిష్యే సింధౌ వా స్వసుతాం పార్వతీం ఖలు ॥
అథవా స్వశరీరం హి త్యక్ష్యామ్యాశ్వన్యథా ధ్రువమ్ ।
న దాస్యే శంభవే కన్యాం దుర్గాం వికట రూపిణే ॥
వరోఽయం కీదృశో భీమోఽ నయా లబ్ధశ్చ దుష్టయా ।
కారితశ్చోపహాసో మే గిరేశ్చాపి కులస్య హి ॥

మేన ఇట్లు పలికెను -

నేను మేనను. దుష్టమగు పట్టుదల గల ఈ పార్వతిని ఏమి చేయుదునో చెప్పనా? ఈమెకు తీవ్రమగు విషమునిచ్చెదను. లేదా, నూతిలో తోసివేసెదను. సందేహము లేదు (65). లేదా, ఈ కాళిని శస్త్రములతో ముక్కలు ముక్కలుగా నరికి వేసెదను. లేదా, నా కుమార్తె యగు ఈ పార్వతిని సముద్రములో ముంచి వేసెదను (66). లేదా, నేనే రేపటి లోపులో నిశ్చితముగా దేహత్యాగము చేసెదను. నా కుమార్తె యగు దుర్గను వికృతాకారుడగు శంభునకు ఈయను (67). ఈ దుష్టురాలు భయంకరాకారుడగు ఎటువంటి వరుని సంపాదించినది? ఈమె నన్ను, హిమవంతుని, మరియు మా కులమును అపహాస్యము పాలు చేసినది (68).

న మాతా న పితా భ్రాతా న బంధుర్గోత్రజోఽపి హి ।

నో సురూపం న చాతుర్యం న గృహం వాస్య కించన ॥

న వస్త్రం నాప్యలంకారా స్సహాయాః కేఽపి తస్య న ।

వాహనం న శుభం హ్యస్య న వయో న ధనం తథా ॥

న పావిత్ర్యం న విద్యా చ కీదృశః కాయ ఆర్తిదః ।

కిం విలోక్య మయా పుత్రీ దేయాస్మై స్యాత్సుమంగలా ॥

ఈతనికి తల్లి లేదు, తండ్రి లేడు, సోదరుడు లేడు, బంధువు లేడు, స్వగోత్రీకుడైననూ లేడు, అందమగు రూపము లేదు, సామర్థ్యము లేదు, ఇల్లు లేదు, ఏమీ లేదు (69). వస్త్రము లేదు, భూషణములు లేవు, పరిచారకులెవ్వరూ లేరు. ఈయనకు వాహనము లేదు, శుభకర్మలు లేవు, వయస్సు లేదు, ధనము లేదు (70). పవిత్రత లేదు, విద్యలేదు. దుఃఖమును కలిగించే ఆయన దేహము ఎట్లున్న దియో? సుమంగళయగు నా కుమార్తెను ఏమి చూసి ఈయనకు ఈయదగును? (71)

బ్రహ్మోవాచ ।

ఇత్యాది సువిలప్యా థ బహుశో మేనకా తదా ।

రురో దోచ్చైర్మునే సా హి దుఃఖశోకపరిప్లుతా ॥

అథాహం ద్రుతమాగత్యాకథయం మేనకాం చ తామ్ ।

శివ తత్త్వం చ పరమం కుజ్ఞాన హరముత్తమమ్ ॥

శ్రోతవ్యం ప్రీతితో మేనే మదీయం వచనం శుభమ్ ।

యస్య శ్రవణతః ప్రీత్యా కుబుద్ధిస్తే వినశ్యతి ॥

శంకరో జగతః కర్తా భర్తా హర్తా తథైవ చ ।

న త్వం జానాసి తద్రూపం కథం దుఃఖం సమీహసే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు మేనక ఈ తీరున పరిపరి విధముల దుఃఖించి బిగ్గరగా రోదించెను. ఓ మునీ! అమె మనస్సు దుఃఖముతో నిండియుండెను (72). అపుడు నేను వెంటనే అచటకు వచ్చి దుష్ట జ్ఞానమును హరించి వేయు ఉత్తమమైన పరమ శివతత్త్వమును ఆ మేనకకు బోధించితిని (73). ఓ మేనా! నా శుభకరములగు పలుకులను ప్రీతితో వినుము. నా మాటను శ్రద్ధగా విన్నచో, నీ చెడు బుద్ధి నశించును (74). జగత్తును సృష్టించి, పోషించి, లయము చేయునది శంకరుడే. నీవు ఆయన రూపమును ఎరుంగవు. ఆయన దుఃఖమునకు నిలయుడని నీవు ఎట్లు ఊహించుచున్నావు? (75)

అనేక రూపనామా చ నానా లీలాకరః ప్రభుః ।
సర్వస్వామీ స్వతంత్రశ్చ మాయాధీశోఽ వికల్పకః ॥
ఇతి విజ్ఞాయ మేనే త్వం శివాం దేహి శివాయ వై ।
కుహఠం త్యజ కుజ్ఞానం సర్వకార్యవినాశనమ్ ॥
ఇత్యుక్త్వా సా మయా మేనా విలపంతీ ముహుర్ముహుః ।
లజ్జాం కించిచ్ఛనై స్త్యక్త్వా మునే మాం వాక్యమబ్రవీత్ ॥ 18

ఆ ప్రభుడు అనేక నామ రూపములతో వివిధ లీలలను చూపుచుండును. ఆ సర్వేశ్వరుడు స్వతంత్రుడు, మాయకు ప్రభువు, అద్వితీయుడు (76). ఓ మేనా! నీవీ సత్యము నెరింగి పార్వతిని శివునకు ఇమ్ము. చెడు పట్టు దలను, సర్వకార్యములను పాడు జేయు చెడు జ్ఞానమును విడిచి పెట్టుము (77). ఓ మునీ! ఈ నా మాటను విని ఆ మేన పరిపరి విధముల విలపించుచూ సిగ్గును కొద్దిగా మెల్లగా విడిచి నాతో ఇట్లు పలికెను (78).

మేనోవాచ।

కిమర్థం తు భవాన్ బ్రహ్మన్ రూపమస్యా మహావరమ్ ।
వ్యర్థీ కరోతి కిమియం హన్యతాం న స్వయం శివా ॥
న వక్తవ్యం చ భవతా శివాయ ప్రతిదీయతామ్ ।
న దాస్యేఽహం శివాయైనాం స్వ సుతాం ప్రాణవల్లభామ్ ॥

మేన ఇట్లు పలికెను -

ఓ బ్రహ్మా! నీవు ఈమె యొక్క గొప్ప రూపమును ఏల వ్యర్థము చేయ నిచ్ఛ(?)గించుచున్నావు? ఈమెను నీవే స్వయముగా సంహరించరాదా? (79). శివునకు ఇమ్మని నీవు నాకు చెప్పకుము. నాకు ప్రాణ ప్రియురాలగు ఈ నా కుమార్తెను నేను శివునకు ఈయను (80).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తే తు తదా సిద్ధాస్సనకాద్యా మహామునే ।
సమాగత్య మహాప్రీత్యా వచనం హీదమబ్రువన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆమె ఇట్లు చెప్పగా, అపుడు సనకాది సిద్ధులు ముందుకు వచ్చి మహాప్రేమతో ఇట్లు పలికిరి (81).

సిద్ధా ఊచుః ।

అయం వై పరమస్సాక్షాచ్ఛివః పరసుఖావహః ।
కృపయా చ భవత్పుత్ర్యై దర్శనం దత్తవాన్ ప్రభుః ॥

సిద్ధులిట్లు పలికిరి -

బ్రహ్మానందమును ఇచ్చువాడు, జగన్నాథుడు అగు ఈ పరమశివుడు దయతో నీ కుమార్తెకు సాక్షాత్కరించి దర్శన మిచ్చినాడు (82).

బ్రహ్మోవాచ ।

అథోవాచ తు తాన్మేనా విలప్య చ ముహుర్ముహుః ।
న దేయా తు మయా సమ్యగ్గిరిశాయోగ్ర రూపిణే ॥
కి మర్థం తు భవంతశ్చ సర్వే సిద్ధాః ప్రపంచినః ।
రూపమస్యాః పరం నామ వ్యర్థీకర్తుం సముద్యతాః ॥
ఇత్యుక్తే చ తయా తత్ర మునేఽహం చకితోఽభవమ్ ।
సర్వే విస్మయమాన్నా దేవసిద్ధర్షి మానవాః ॥
ఏతస్మిన్ సమయే తస్యా హఠం శ్రుత్వా దృఢం మహత్ ।
ద్రుతం శివప్రియో విష్ణు స్సమాగత్యా బ్రవీదిదమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు మేన పరిపరి విధముల విలపించి వారితో నిట్లనెను: ఉగ్రరూపుడగు కైలాస పతికి నేను కుమార్తెను ఈయను (83). సిద్ధులైన మీరందరు ప్రపంచ వ్యవహారములో ప్రవేశించి ఒక్కటిగా జతగూడి ఈమె యొక్క సుందరరూపమును వ్యర్థము చేయుటకు నడుము కట్టినారు. కారణమేమి? (84) ఓ మునీ! అచట ఆమె ఇట్లు పలుకగా, నేను, దేవతలు, సిద్ధులు, ఋషులు, మానవులు అందరు ఆశ్చర్యమగ్నుల మైతిమి (85). ఇంతలో, ఆమె గట్టి మొండి పట్టుదలను గూర్చి వినిన శివ ప్రియుడగు విష్ణువు వెంటనే వచ్చి ఇట్లు పలికెను (86).

విష్ణురువాచ ।

పితౄణాం చ ప్రియా పుత్రీ మానసీ గుణసంయుతా ।
పత్నీ హిమవతస్సాక్షా ద్బ్రహ్మణః కులముత్తమమ్ ॥
సహాయాస్తాదృశా లోకే ధన్యా హ్యసి వదామి కిమ్ ।
ధర్మస్యాధార భూతాసి కథం ధర్మం జహాసి హి ॥
దేవైశ్చ ఋషిభిశ్చైవ బ్రహ్మణా వా మయా తథా ।
విరుద్ధం కథ్యతే కిం ను త్వయైవ సువిచార్య తామ్ ॥
శివం త్వం న చ జానాసి నిర్గుణస్సగుణస్స హి ।
విరూపస్స సురూపో హి సర్వ సేవ్యస్సతాం గతిః ॥
తేనైవ నిర్మితా దేవీ మూల ప్రకృతిరీశ్వరీ ।
తత్పార్శ్వే చ తదా తేన నిర్మితః పురుషోత్తమః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

నీవు పితృదేవతల అనుంగు మానస పుత్రివి. సద్గుణవతివి. హిమవంతుని భార్యవు. మీ కులము సా◌ాక్షాత్తు బ్రహ్మగారి నుండి ప్రవర్తిల్లుటచే ఉత్తమమైనది (87). నీకు అటువంటి వారు పరిచారకులు. నీవీ లోకములో ధన్యురాలవు. నేనేమి చెప్పగలను? నీవు ధర్మమునకు ఆధారమై యున్నావు. నీవు ధర్మమును ఎట్లు విడిచి పెట్టుచున్నావు? (88) దేవతలు గాని, ఋషులు గాని, బ్రహ్మగాని, నేను గానీ

విరుద్ధముగా పలుకుచున్నామా? నీవే ఆలోచించుకొనుము (89). నీవు శివుని యెరుంగవు. ఆయన సగుణుడు, నిర్గుణుడు కూడా. సుందరాకారుడు, వికృతాకారుడు కూడా. ఆయన అందరికీ ఆరాధ్యుడు. సత్పురుషులు పొందే గతి ఆయనయే (90). మూల ప్రకృతి యగు ఈశ్వరీ దేవిని ఆయనయే సృష్టించినాడు. తరువాత ఆయన ఆమె ప్రక్కన ఉండునట్లు పురుషోత్తముని సృష్టించినాడు (91).

తాభ్యాం చాహం తథా బ్రహ్మా తతశ్చ గుణరూపతః ।
అవతీర్య స్వయం రుద్రో లోకానాం హితకారకః ॥
తతో వేదాస్తథా దేవా యత్కించి ద్దృశ్యతే జగత్ ।
స్థావరం జంగమం చైవ తత్సర్వం శంకరాదభూత్ ॥
తద్రూపం వర్ణితం కేన జ్ఞాయతే కేన వా పునః ।
మయా చ బ్రహ్మణా యస్య హ్యతో లబ్ధశ్చ నైవ హి ॥
ఆ బ్రహ్మ స్తంబ పర్యంతం యత్కించి ద్దృశ్యతే జగత్ ।
తత్సర్వం చ శివం విద్ధి నాత్ర కార్యా విచారణా ॥

వారి నుండియే నేను, బ్రహ్మ జన్మించితిమి. తరువాత లోకములకు హితమును చేయు రుద్రుడు తాను స్వయముగా గుణములను రూపమును స్వీకరించి అవతరించినాడు (92). ఆ తరువాత శంకరుని నుండి వేదములు, దేవతలు, కనబడే ఈ సమస్త జగత్తు, చరాచర ప్రాణులు, ఈ సర్వము ఉద్భవించినవి (93). ఆయన రూపమును ఎవరు వర్ణించగలరు? వర్ణన యేల? ఎరింగిన వారెవ్వరు? నాకు గాని, బ్రహ్మకు గాని ఆయన యథార్థ స్వరూపము తెలియనే లేదు (94). బ్రహ్మ గారి నుండి గడ్డిపోచ వరకు ఈ జగత్తు అంతయూ శివ స్వరూపమేనని తెలుసుకొనుము. ఈ విషయములో నీవు సందేహించకుము (95).

స ఏవేదృక్ స్వరూపేణావతీర్ణో నిజలీలయా ।
శివాతపః ప్రభావాద్ధి తవ ద్వారి సమాగతః ॥
తస్మాత్త్వం హిమవత్పత్ని దుఃఖం ముంచ శివం భజ ।
భవిష్యతి మహానందః క్లేశో యాస్యతి సంక్షయమ్ ॥

ఆయన తన లీలచే ఇట్టి స్వరూపముతో అవతరించినాడు. పార్వతి చేసిన తపస్సు యొక్క మహిమచే నీ గుమ్మము వద్దకు వచ్చియున్నాడు (96). ఓ హిమవంతుని పత్నీ! కావున నీవు దుఃఖమును వీడి శివుని భజించుము. నీకు మహానందము కలుగ గలదు. నీ దుఃఖము పూర్తిగా నశించగలదు (97).

బ్రహ్మోవాచ ।

ఏవం ప్రబోధితాయాస్తు మేనకాయా అభూన్మునే ।
తస్యాస్తు కోమలం కించిన్మనో విష్ణు ప్రబోధితమ్ ॥
పరం హఠం న తత్యాజ కన్యాం దాతుం హరాయ న ।
స్వీచకార తదా మేనా శివమాయా విమోహితా ॥
ఉవాచ చ హరిం మేనా కించిద్బుద్ధా గిరిప్రియా ।
శ్రుత్వా విష్ణు వచో రమ్యం గిరిజా జననీ హి సా ॥
యది రమ్యతను స్స స్యా త్తదా దేయా మయా సుతా ।
నాన్యథా కోటిశో యత్నై ర్వచ్మి సత్యం దృఢం వచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ ! ఇట్లు విష్ణువు బోధ చేయగా ఆ మేనక యొక్క మనస్సు కొద్దిగా మెత్తపడెను (98). కాని ఆమె తన మొండి తనమును వీడలేదు. శివుని మాయచే విమోహితురాలైన ఆ మేన ఆ సమయములో పార్వతిని శివునకు ఇచ్చుటకు అంగీకరించలేదు (99). హిమవత్పత్ని, పార్వతి తల్లి యగు ఆ మేన విష్ణువు యొక్క మధురమగు బోధను విని కొంత జ్ఞానమును పొందినదై విష్ణువుతో నిట్లనెను (100). ఆతడు సుందరాకారుడైనచో నేను కుమార్తెను ఇచ్చెదను. అట్లు కానిచో కోటి యత్నములు చేసిననూ నేను ఈయను. నేను సత్యము, దృఢము అగు వచనమును పలుకు చున్నాను (101).

బ్రహ్మో వాచ ।

ఇత్యుక్త్వా వచనం మేనా తూష్ణీ మాస దృఢవ్రతా ।
శివేచ్ఛా ప్రేరితా ధన్యా తథా యాఖిల మోహినీ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే మేనా ప్రబోధవర్ణనం నామ
చతుశ్చత్వారింశోఽ ధ్యాయః (44).

బ్రహ్మ ఇట్లు పలికెను-

దృఢదీక్ష గల మేన శివుని ఇచ్ఛచే ప్రేరితురాలై ఇట్లు పలికి మిన్నకుండి ధన్యురాలయ్యెను. సర్వప్రాణులను ఆ శివేచ్ఛయే మోహింపజేయును (102).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో మేనా ప్రబోధమనే నలుబది నాల్గవ అధ్యాయము ముగిసినది (44).

45 – శివుని సుందర రూపము

బ్రహ్మోవాచ।

ఏతస్మిన్నంతరే త్వం హి విష్ణునా ప్రేరితో ద్రుతమ్ ।
అనుకూలయితుం శంభుమయాస్తత్సన్నికటే మునే ॥
తత్ర గత్వా స వై రుద్రో భవతా సుప్రబోధితః ।
స్తోత్రైర్నానావిధైస్స్తుత్వా దేవకార్య చికీర్షయా ॥
శ్రుత్వా త్వద్వచనం ప్రీత్యా శంభునా ధృతమద్భుతమ్ ।
స్వరూప ముత్తమం దివ్యం కృపాలుత్వం చ దర్శితమ్ ॥
తద్ దృష్ట్వా సుందరం శంభుం స్వరూపే మన్మథాధికమ్ ।
అత్యహృష్యో మునే త్వం హి లావణ్య పరమాయనమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! ఇంతలో నీవు విష్ణువుచే ప్రేరితుడవై వెంటనే శంభునకు నచ్చ జెప్పుటకై ఆయన వద్దకు వెళ్లితివి (1). నీవు దేవకార్యమును చేయగోరి అచటకు వెళ్లి రుద్రుని అనేక విధములగు స్తోత్రములచే స్తుతించి ఆయనకు నచ్చ జెప్పితివి (2). శంభుడు నీ మాటను ప్రీతితో విని తన దయాగుణమును ప్రదర్శించువాడై అద్భుతము, ఉత్తమము, దివ్యము అగు రూపమును ధరించెను (3). ఓ మునీ ! సుందరము, రూపములో మన్మథుని మించి యున్నది, లావణ్యమునకు పరమనిధానము అగు శంభుని ఆ రూపమును చూచి నీవు చాల ఆనందించితివి (4).

స్తోత్రైర్నానావిధైస్స్తుత్వా పరమానందసంయుతః ।
అగచ్ఛంస్త్వం మునే తత్ర యత్ర మేనా స్థితాఖిలైః ॥
తత్రా గత్య సుప్రసన్నో మునేఽ తి ప్రేమసంకులః ।
హర్షయంస్తాం శైల పత్నీం మేనాం త్వం వాక్యమబ్రవీః ॥

ఓ మునీ! పరమానందమును పొందియున్న నీవు అనేక విధములగు స్తోత్రములచే స్తుతించి మేన ఇతరులందరితో కూడియున్న చోటికి వెళ్లితివి (5). ఓ మునీ! మిక్కిలి ప్రసన్నుడు, అధిక ప్రేమతో నిండియున్న వాడు నగు నీవు అచటకు వచ్చి హిమవంతుని పత్నియగు ఆ మేనను ఆనందింప జేయుచూ ఇట్లు పలికితివి (6).

నారద ఉవాచ ।

మేనే పశ్య విశాలాక్షి శివరూప మనుత్తమమ్ ।
కృతా శివేన తేనైవ సుకృపా కరుణాత్మనా ॥

నారదుడిట్లు పలికెను-

ఓ మేనా! విశాలమగు కన్నుల దానా! సర్వోత్తమమగు శివుని రూపమును చూడుము. కరుణా మూర్తి యగు ఆ శివుడు దయను చూపించినాడు (7).

బ్రహ్మోవాచ ।

శ్రుత్వా సా తద్వచో మేనా విస్మితా శైల కామినీ ।
దదర్శ శివరూపం తత్పర మానందదాయకమ్ ॥
కోటి సూర్య ప్రతీకాశం సర్వా వయవ సుందరమ్ ।
విచిత్రవసనం చాత్ర నానా భూషణ భూషితమ్ ॥
సుప్రసన్నం సుహాసం చ సులావణ్యం మనోహరమ్ ।
గౌరాభం ద్యుతిసంయుక్తం చంద్ర రేఖా విభూషితమ్ ॥
సర్వైర్దేవగణైః ప్రీత్యా విష్ణ్వాద్యైస్సేవితం తథా ।
సూర్యేణ ఛత్రితం మూర్ధ్ని చంద్రేణ చ విశోభితమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మాటను విని హిమవంతుని పత్నియగు మేన ఆశ్చర్యపడి, పరమానందమును కలుగ జేయునది (8), కోటి సూర్యుల కాంతి గలది, అన్ని అవయముల యందు సుందరమైనది, రంగు రంగుల వస్త్రములు గలది, అనేక భూషణములచే అలంకరింపబడినది (9), మిక్కిలి ప్రసన్నమైనది, చక్కని చిరునవ్వు గలది, గొప్ప లావణ్యము గలది, మనస్సును హరించునది, తెల్లని కాంతులను వెదజల్లునది, చంద్రవంకతో అలంకరింపబడినది (10), విష్ణువు మొదలగు దేవగణములందరిచే సేవింపబడినది, శిరస్సుపై సూర్యుడు ఛత్రముగా కలది, చంద్రునితో ప్రకాశించునది అగు శివుని రూపమును చూచెను (11).

సర్వథా రమణీయం చ భూషితస్య విభూషణైః ।
వాహనస్య మహాశోభా వర్ణితుం నైవ శక్యతే ॥
గంగా చ యమునా చైవ విధత్తస్మ్న సుచామరే ।
సిద్ధయోఽష్టౌ హే పురస్తస్య కుర్వంతి స్మ సునర్తనమ్ ॥
మయా చైవ తదా విష్ణు రింద్రా ద్యా హ్యమరాస్తథా ।
స్వం స్వం వేషం సుసం భూష్య గిరిశేనాచరన్ యుతాః ॥
తథా జయేతి భాషంతో నానా రూపా గణాస్తదా ।
స్వలం కృతా మహామోదా గిరీశపురతోఽ చరన్ ॥

అభరణములతో అలంకరింపబడిన శివుడు అన్ని విధములుగా సుందరుడై యుండెను. ఆయన వాహనము యొక్క గొప్ప శోభను వర్ణింప శక్యము కాదు (12). గంగా యమునలు అందమగువింజామరలను పట్టిరి. అష్టసిద్ధులు ఆయన యెదుట అందముగా నాట్యమాడినవి (13). నేను, విష్ణువు మరియు దేవతలు తమ తమ వేషములను చక్కగా అలంకరించుకొని కైలాస పతితో కలసి నడచితిమి (14). అపుడు అనేక రూపములు గలవారు, చక్కగా అలంకరించు కున్నవారు, మహానందముతో గూడిన వారు అగు గణములు జయధ్వానములను చేయుచూ శివుని యెదుట నడచిరి (15).

సిద్ధాశ్చోపసురాస్సర్వే మునయశ్చ మహాసుఖాః ।

యయుశ్శివేన సుప్రీతాస్సకలాశ్చాపరే తథా ॥

ఏవం దేవాదయస్సర్వే కుతూహలసమన్వితాః ।

పరం బ్రహ్మ గృణంతస్తే స్వపత్నీ భిరలంకృతాః ॥

విశ్వావసుముఖాస్తత్ర హ్యప్సరోగణసంయుతాః ।

గాయంతోఽ ప్య గ్రతస్తస్య పరమం శాంకరం యశః ॥

ఇష్టం మహోత్సవస్తత్ర బభూవ మునిసత్తమ ।

నానావిధో మహేశే హి శైలద్వారి చ గచ్ఛతి ॥

సిద్ధులు, ఉపదేవతలు, మునులు మరియు ఇతరులు అందరు మహానందముతో శివునితో బాటు నడిచిరి (16). ఈ విధముగా దేవతలందరు కుతూహలముతో కూడిన వారై అలంకరించుకొని తమ భార్యలతో గూడి పరబ్రహ్మ యగు శివుని సేవించిరి (17). అచట విశ్వావసువు మొదలగువారు అప్సరసలతో గూడి శంకరుని ఎదుట ఆయన యొక్క ఉత్తమ కీర్తిని గానము చేయుచున్న వారై నడచిరి (18). ఓ మహర్షీ! ఇట్లు అచట మహేశ్వరుడు హిమవంతుని గృహద్వారము వద్దకు వెళ్లు చుండగా నానా విధములుగా మహోత్సవము సంపన్న మాయెను.(19).

తస్మింశ్చ సమయే తత్ర సుషమా యా పరాత్మనః ।

వర్ణితుం తాం విశేషేణ కశ్శక్నోతి మునీశ్వర ॥

తథావిధం చ తం దృష్ట్వా మేనా చిత్ర గతా ఇవ ।

క్షణమాసీత్తతః ప్రీత్యా ప్రోవాచ వచనం మునే ॥

ఓ మహర్షీ! ఆ సమయమునందలి పరమాత్మ యొక్క మహా సౌందర్యమును ప్రత్యేకించి ఎవడు వర్ణించ గల్గును? (20) ఓ మహర్షీ! అట్టి ఆ శివుని చూచి మేన క్షణ కాలము చిత్తరువు నందలి మనిషి వలె చిత్తరపోయెను. తరువాత ఆమె ఆనందముతో నిట్లనెను (21).

మేనోవాచ ।

ధన్యా పుత్రీ మదీయా చ యయా తప్తం మహత్తపః ।

య త్తు భావాన్మహే శాన త్వం ప్రాప్త ఇహ మద్గృహే ॥

మయా కృతా పురా యా వై శివనిందా దురత్యయా ।

తాంక్షమస్వ శివాస్వామిన్ సుప్రసన్నో భవాధునా ॥

మేన ఇట్లు పలికెను –

నా కుమార్తె ధన్యురాలు. ఆమె గొప్ప తపస్సును చేసినది. ఓ మహేశ్వరా! ఆమె తపస్సు(ః)స్సు యొక్క ప్రభావము వలననే నీవీ నాడు నా ఇంటికి వచ్చితివి (22). ఓ పార్వతీ పతీ! నేనింతకు ముందు తప్పించుకొన శక్యము గాని శివనిందను చేసియుంటిని. ఇపుడు నాపై ప్రసన్నుడవు కమ్ము (23).

బ్రహ్మోవాచ ।

ఇత్థం సంభాష్య సా మేనా సంస్తూయేందులలాటకమ్ ।
సాంజలిః ప్రణతా శైలప్రియా లజ్జాపరాఽ భవత్ ॥
తావత్ స్త్రియస్సమాజగ్ముర్హిత్వా కామాననేకశః ।
బహ్వ్యస్తాః పురవాసిన్య శ్శివదర్శనలాలసాః ॥
మజ్జనం కుర్వతీ కాచిత్త చ్చూర్ణ సహితా యయౌ ।
ద్రష్టుం కుతూహలాఢ్యా చ శంకరం గిరిజావరమ్ ॥
కాచిత్తు స్వామినస్సేవాం సఖీయుక్తా విహాయ చ ।
సుచామరకరా ప్రీత్యా గాచ్ఛంభోర్దర్శనాయ వై ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మేన ఇట్లు పలికి చంద్ర శేఖరుని బాగుగా స్తుతించి చేతులు జోడించి నమస్కరించెను. అపుడా హిమవత్పత్ని మిక్కిలి సిగ్గుపడెను (24). ఇంతలో నగరమునందు నివసించు ఎందరో స్త్రీలు శివుని చూడగోరి వివిధ కార్యములను విడిచి పెట్టి బయటకు వచ్చిరి (25). ఒకామె పార్వతీ వరుడగు శంకరుని చూడవలెననే కుతూహలమును పట్ట జాలక స్నానము చేయుచూ ఆ చూర్ణముతో సహా బయటకు వచ్చెను (26). ఒకామె భర్త యొక్క సేవను విడనాడి చెలికత్తెతో గూడి చేతిలో అందమగు చామరము ఉండగనే శంభుని దర్శించవలెననే ప్రీతితో వెళ్లెను (27).

కాచిత్తు బాలకం హిత్వా పిబంతం స్తన్యమాదరాత్ ।
అతృప్తం శంకరం ద్రష్టుం యయౌ దర్శనలాలసా ॥
రశనాం బధ్నతీ కాచిత్తయైవ సహితా యయౌ ।
వసనం విపరీతం వై ధృత్వా కాచిద్యయౌ తతః ॥
భోజనార్థం స్థితం కాంతం హిత్వా కాచిద్యయౌ ప్రియా ।
ద్రష్టుం శివావరం ప్రీత్యా సతృష్ణా సకుతూహలా ॥
కాచిద్ధస్తే శలాకాం చ ధృత్వాంజనకరా ప్రియా ।
అంజిత్వైకాక్షి సన్ ద్రష్టుం యయౌ శైల సుతావరమ్ ॥

ఒకామె స్తన్యమును శ్రద్ధతో త్రాగు చున్న బాలకుని వాడు తృప్తి చెందకుండగనే విడిచి పెట్టి శివుని దర్శించవలెననే ఉత్కంఠతో వెళ్లెను (28). ఒకామె బంగరు మొలత్రాటిని కట్టు కొన బోయి అది చేతి యందుండగనే వెళ్లెను. ఒకామె చీరను తల క్రిందలుగా ధరించి వెళ్లెను (29). ఒకామె పార్వతీవరుని చూడవలెననే తృష్ణతో, కుతూహలముతో, ప్రీతితో భోజనమునకు కూర్చున్న భర్తను విడిచి వెళ్లెను (30). ఒకామె చేతియందు కాటుక భరిణెను పట్టుకొని ఒక కన్నుకు మాత్రమే కాటుక నిడి ఇంతలో పార్వతీ వరుని చూచుటకై అదే భంగిమలో వెళ్లెను (31).

కాచిత్తు కామినీ పాదౌ రంజయంతీ హ్యలక్తకైః ।

శ్రుత్వా ఘోషం చ తద్ధిత్వా దర్శనార్థముపాగతా ॥

ఇత్యాది వివిధం కార్యం హిత్వా వాసం స్త్రియో యయుః ।

దృష్ట్వా తు శాంకరం రూపం మోహం ప్రాప్తాస్తదాఽ భవన్ ॥

తతస్తాః ప్రేమ సంవిగ్నా శ్శివదర్శనహర్షితాః ।

నిధాయ హృది తన్మూర్తిం వచనం చేదమబ్రువన్ ॥

ఒక సుందరి పాదములను లత్తుకరంగుతో దిద్దు కొనుచూ ఊరేగింపు శబ్దమును విని ఆ పనిని విడిచి పెట్టి శివుని చూచుటకు వెళ్లెను (32). స్త్రీలు ఇత్యాది వివిధ కార్యములను విడిచి పెట్టి చేతిలోని వస్త్రమును క్రింద బారవైచి' వెళ్లిరి. వారపుడు శంకరుని రూపమును చూచి మోహమును పొందిరి (33). అపుడు వారు శివుని చూచి ఆనందించి ప్రేమతో నిండిన హృదయము గలవారై ఆ శివుని రూపమును హృదయమునందిడు కొని ఈ మాటలను పలికిరి (34).

పురవాసిన్య ఊచుః ।

నేత్రాణి సఫలాన్యాసన్ హిమవత్పురవాసినామ్ ।

యో యోఽ పశ్య దదో రూపం తస్య వై సార్థకం జనుః ॥

తస్యైవ సఫలం జన్మ తస్యైవ సఫలాః క్రియాః ।

యేన దృష్ట శ్శివస్సాక్షా త్సర్వ పాప ప్రణాశకః ॥

పార్వత్యా సాధితం సర్వం శివా ర్థే యత్తపః కృతమ్ ।

ధన్యేయం కృతకృత్యేయం శివా ప్రాప్య శివం పతిమ్ ॥

యదిదం యుగలం బ్రహ్మా న యుం జ్యాచ్ఛివ యోర్ముదా ।

తదా చ సకలోఽప్యస్య శ్రమో నిష్ఫలతామియాత్ ॥

పురస్త్రీలు ఇట్లు పలికిరి-

హిమవంతుని నగరమునందు నివసించు పౌరుల కన్నులు సార్థకమాయెను. ఎవరెవరైతే ఈ రూపమును చూచిరో, వారి వారి జన్మలు సార్థకమాయెను (35). సర్వ పాపములను పోగొట్టు శివుని ఎవరైతే ప్రత్యక్షముగా దర్శించెదరో వారి జన్మ మాత్రమే సఫలము. వారి కర్మలు మాత్రమే సఫలము లగును (36). శివుని కొరకు తపస్సును చేసి పార్వతి సర్వమును సాధించినది. ఈమె ధన్యురాలు. శివుని భర్తగా పొందిన ఈ పార్వతి కృతకృత్యురాలు (37) సృష్టి కర్త ఆనందముతో ఈ పార్వతీ పరమేశ్వరుల జంటను కలుపక పోయినచో, అపుడాతని శ్రమ అంతయూ నిష్ఫలమై యుండెడిది (38).

సమ్యక్ కృతం తథా చాత్ర యోజితం యుగ్మముత్తమమ్ ।
సర్వేషాం సార్థతా జాతా సర్వకార్యసముద్భవా ॥
వినా తు తపసా శంభోర్దర్శనం దుర్లభం నృణామ్ ।
దర్శనాచ్ఛంకరస్యైవ సర్వే యాతాః కృతార్థతామ్ ॥
లక్ష్మీర్నారాయణం లేభే యథా వై స్వామినం పురా ।
తథాసా పార్వతీ దేవీ హరం ప్రాప్య సుభూషితా ॥
బ్రహ్మాణం చ యథా లేభే స్వామినం వై సరస్వతీ ।
తథాసా పార్వతీ దేవీ హరం ప్రాప్య సుభూషితా ॥

ఈ ఉత్తమమగు జంటను కలిపి బ్రహ్మ మంచి పని చేసినాడు. అందరు చేసిన కర్మలన్నియూ ఈ కలయికచే సార్థకమైనవి (39). మానవులకు తపస్సు చేయనిదే శివుని దర్శనము లభించదు. మానవులందరు శివుని దర్శనము చేత మాత్రమే కృతార్థులగుదురు (40). పూర్వము లక్ష్మి నారాయణుని భర్తగా పొందిన తీరున, సరస్వతి బ్రహ్మను భర్తగా పొందిన తీరున ఈ పార్వతీ దేవి శివుని భర్తగా పొంది మిక్కిలి ప్రకాశించుచున్నది (41, 42).

వయం ధన్యాః స్త్రియ స్సర్వాః పురుషాస్సకలా వరాః ।
యేయే పశ్యంతి సర్వేశం శంకరం గిరిజా పతిమ్ ॥

మనము స్త్రీలమందరము ధన్యులము. పురుషులందరు ధన్యులు. ఎవరెవరైతే సర్వేశ్వరుడు, గిరిజాపతి యగు శంకరుని దర్శించెదరో వారందరు ధన్యులు (43).

బ్రహ్మోవాచ ।

ఇత్థముక్త్వా తు వచనం చందనైశ్చాక్షతైరపి ।
శివం సమర్చ యామాసు ర్లాజాన్ వవృషురాదరాత్ ॥
తస్థుస్తత్ర స్త్రియస్సర్వా మేనయా సహ సోత్సుకాః ।
వర్ణయంతోఽధికం భాగ్యం మేనాయాశ్చ గిరేరపి ॥
కథాస్తథావిధాశ్శృణ్వన్ తద్వామావర్ణితాశ్శుభాః ।
ప్రహృష్టోఽభూత్ ప్రభుస్సర్వైర్మునే విష్ణ్వాదిభిస్తదా ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే
శివసుందర స్వరూప వర్ణనం నామ పంచ చత్వారింశోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు పలికి వారు గంధముతో, మరియు అక్షతలతో శివుని పూజించి సాదరముగా పేలాలను వర్షించిరి (44). ఆ స్త్రీలందరు మేనతో గూడి ఉత్సుకతతో అచట నిలబడిరి. వారు మేనా హిమవంతుల మహాభాగ్యమును వర్ణించుచుండిరి (45). ఆ స్త్రీ లచే వర్ణించబడిన అటువంటి శుభగాథలను శివుడు వినుచుండెను. ఓ మహర్షీ! శంభుడు విష్ణువు మొదలగు వారందరితో గూడి అప్పుడు చాల ఆనందించెను (46).

46 – శివుడు పెళ్లి కొడుకు

బ్రహ్మోవాచ ।

అథ శంభుః ప్రసన్నాత్మా సదూతం స్వగణైస్సురైః ।
సర్వైరన్యైర్గిరేర్ధామ జగామ సకుతూహలమ్ ॥
మేనాపి స్త్రీ గణైస్సైశ్చ హిమాచలవరప్రియా ।
తత ఉత్థాయ స్వగృహాభ్యంతరం హ జగామ సా ॥
నీరాజనార్థం శంభోశ్చ దీపపాత్రకరా సతీ ।
సర్వర్షిస్త్రీ గణై స్సాకమగచ్ఛ ద్వారమాదరాత్ ॥
తత్రాగతం మహేశానం శంకరం గిరిజావరమ్ ।
దదర్శ ప్రీతితో మేనా సేవితం సకలైస్సురైః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అపుడు ప్రసన్నమగు మనస్సు గల శివుడు దూతలతో, తన గణములతో, దేవతలతో, మరియు మిగిలిన వారందరితో గూడి కుతూహలము గలవాడై హిమవంతుని గృహమునకు వెళ్లెను (1). హిమవంతుని ప్రాణ ప్రియురాలగు ఆ మేన కూడ అప్పుడు లేచి ఆ స్త్రీ గణములతో కూడి తన ఇంటి లోపలికి వెళ్లెను (2). ఆమె చేతి యందు దీపపాత్రను ధరించి శంభునకు నీరాజనమిచ్చుట కొరకై స్త్రీ గణములందరితో బాటు సోదరముగా ద్వారము వద్దకు వచ్చెను (3). అచటకు విచ్చేసి నట్టియు, మహేశ్వరుడైనట్టియు, పార్వతీపతియైనట్టియు, దేవతలందరిచే సేవింపబడునట్టి శంకరుని మేన ప్రీతితో చూచెను (4).

చారు చంపకవర్ణాభం హ్యేకవక్త్రం త్రిలోచనమ్ ।
ఈషద్ధాస్య ప్రసన్నాస్యం రత్నస్వర్ణాది భూషితమ్ ॥
మాలతీ మాలయా యుక్తం సద్రత్న ముకుటోజ్జ్వలమ్ ।
సత్కంఠాభరణం చారు వలయాంగద భూషితమ్ ॥
వహ్నిశౌచేనాతులేన త్యతి సూక్ష్మేణ చారుణా ।
అమూల్య వస్త్ర యుగ్మేన విచిత్రేణాతిరాజితమ్ ॥
చందనాగరు కస్తూరీ చారు కుంకుమ భూషితమ్ ।
రత్న దర్పణ హస్తం చ కజ్జలో జ్జ్వలలోచనమ్ ॥

సుందరమగు సంపెంగల కాంతి వంటి కాంతితో ప్రకాశించువాడు, ఒక ముఖము గలవాడు, మూడు కన్నులు గలవాడు, చిరునవ్వుతో గూడి ప్రసన్నముగ నున్న ముఖము గలవాడు, రత్నములతో, బంగరు ఆభరణములతో అలంకరింపబడిన వాడు (5), మల్లెల మాలను ధరించినవాడు, గొప్ప రత్నములు పొదిగిన కిరీటముతో విరాజిల్లువాడు, మంచి కంఠ హారమును ధరించిన వాడు, సుందరమగు కంకణములతో అంగదములతో అలంకరింపబడినవాడు (6),

అగ్నివలె ప్రకాశించు సాటిలేని సన్నని నూలుతో వడకిన సుందరమగు అమూల్యమైన రంగు రంగుల వస్త్రముల జంటతో ప్రకాశించువాడు (7) చందనము, అగరు, కస్తూరి, మంచి కుంకుమలతో అలంకరింపబడిన వాడు, రత్నపుటద్దము చేతి యందు గలవాడు, కాటుకతో ఒప్పారు కన్నులు గలవాడు అగు శివుని చూచెను (8).

సర్వస్వప్రభయాచ్ఛన్న మతీవ సుమనోహరమ్ ।
అతీవ తరుణం రమ్యం భూషితాంగైశ్చ భూషితమ్ ॥
కామినీ కాంతమవ్యగ్రం కోటి చంద్రాననాంబుజమ్ ।
కోటిస్మరాధిక తనుచ్ఛవిం సర్వాంగ సుందరమ్ ॥
ఈ దృగ్విధం సుదేవం తం స్థితం స్వపురతః ప్రభుమ్ ।
దృష్ట్వా జామాతరం మేనా జహౌ శోకం ముదాన్వితా ॥
ప్రశశంస స్వభాగ్యం సా గిరిజాం భూధరం కులమ్ ।
మేనే కృతార్థామాత్మానం జహర్ష చ పునః పునః ॥

తన కాంతిచే సర్వమును కప్పి వేసిన వాడు, మిక్కిలి మనోహరాకారుడు, యువకుడు, సుందరుడు, అలంకరింపబడిన అవయవములతో నొప్పారువాడు (9), స్త్రీలను మోహింపజేయువాడు, తొందరపాటు లేనివాడు, కోటి చంద్రుల కాంతి గల పద్మమువంటి ముఖము గలవాడు, కోటి మన్మథుల కంటే అధికమగు శరీర కాంతి గలవాడు, సర్వాంగ సుందరుడు (10), గొప్ప దైవము, మహాప్రభుడు అగు అటు వంటి శివుడు అల్లుని స్థానములో తన యెదుట నిలబడియుండగా గాంచి మేన శోకమును వీడి ఆనందించెను (11). ఆ మేన తన భాగ్యమును, పార్వతి సౌభాగ్యమును, హిమవంతుని, మరియు తన కులమును కొనియాడెను. ఆమె తాను కృతార్థురాలైనట్లు భావించి గొప్ప ఆనందమును పొందెను (12).

నీరాజనం చకారాసౌ ప్రఫుల్ల వదనా సతీ ।
అవలోకపరా తత్ర మేనా జామాతరం ముదా ॥

వికసించిన ముఖము గల ఆ మేనల్లుని ఆనందముతో పరికిస్తూ అచట ఆయనకు నీరాజనము నిచ్చెను (13).

గిరిజోక్త మనుస్మృత్య మేనా విస్మయమాగతా ।
మనసైవ హృష్య వా చేదం హర్ష ఫుల్లాననాంబుజా ॥
యద్వై పురోక్తం చ తయా పార్వత్యా మమ తత్ర చ ।
తతోఽ ధికం ప్రపశ్యామి సౌందర్యం పరమేశితుః ॥
మహేశస్య సులావణ్య మనిర్వాచ్యం చ సంప్రతి ।
ఏవం విస్మయమాపన్నా మేనా స్వగృహమాయయౌ ॥
ప్రశశంసుర్యువతయో ధన్యా ధన్యా గిరేస్సుతా ।
దుర్గా భగవతీ త్యేవ మూచుః కాశ్చన కన్యకాః ॥

పార్వతి పలుకులను స్మరించుకొని విస్మయమును పొందిన మేన ఆనందముతో వికసించిన పద్మము వంటి ముఖము గలదై మనసులో ఇట్లు తలపోసెను (14). పార్వతి పూర్వము అచట నాతో చెప్పిన సౌందర్యము కంటె అధికమగు సౌందర్యము మహేశ్వరుని యందు కనబడుచున్నది (15). ఇప్పటి మహేశ్వరుని సొగసును వర్ణించుట సంభవము కాదు. మేన ఈ తీరున విస్మయమును పొంది తన గృహమునకు వెళ్లెను (16). పార్వతి ధన్యురాలు, ధన్యురాలని స్త్రీలు కొనియాడిరి. దుర్గ, భగవతి ఈమె అని కొందరు కన్యకలు పలికిరి (17).

న దృష్టో వర ఇత్యేవ మస్మాభిర్ధ్యానగోచరః ।
ధన్యా హి గిరిజా దేవీమూచుః కాశ్చన కన్యకాః ॥
జగుర్గంధర్వ ప్రవరా ననృతుశ్చాప్సరోగణాః ।
దృష్ట్వా శంకరరూపం చ ప్రహృష్టాస్సర్వదేవతాః ॥
నానా ప్రకారవాద్యాని వాదకా మధురాక్షరమ్ ।
నానా ప్రకారశిల్పేన వాదయామాసురాదరాత్ ॥
హిమాచలోఽపి ముదితో ద్వారాచారమథాకరోత్ ।
మేనాపి సర్వనారీభిర్మహోత్సవ పురస్సరమ్ ॥

'ఇటువంటి వరుడు మాకెన్నడునూ కానరాలేదు. మేము ధ్యానములోనైననూ ఇట్టి వరుని చూడలేదు. పార్వతి ధన్యురాలు' అని కొందరు కన్యలు మేనాదేవితో చెప్పిరి (18). గంధర్వ శ్రేష్ఠులు గానము చేయగా, అప్సరసల గణములు నర్తించెను. శంకరుని రూపమును చూసి దేవతలందరు మిక్కిలి ఆనందించిరి (19). వాద్యగాండ్రు వివిధవాద్యములను వివిధ రకముల నైపుణ్యముతో మధురముగా శ్రద్ధతో మ్రోగించిరి (20). ఆనందముతో నిండిన హిమవంతుడు మరియు మేన స్త్రీలందరితో గూడి మహోత్సాహముతో ద్వారము వద్ద జరిగే ఆచారమునునుష్ఠించిరి (21).

పరిపృచ్ఛాం చకారాసౌ ముదితా స్వగృహం యయౌ ।
శివో నివేదితం స్థానం జగామ గణ నిర్జరైః ॥
ఏతస్మిన్నంతరే దుర్గాం శైలాంతః పురచారికాః ।
బహిర్జగ్ముస్సమాదాయ పూజితుం కులదేవతామ్ ॥
తత్ర తాం దదృశుర్దేవా నిమేషరహితా ముదా ।
సునీలాంజన వర్ణాభాం స్వాంగైశ్చ ప్రతి భూషితామ్ ॥
త్రినే త్రాదృతనేత్రాం తామన్యవారితలోచనామ్ ।
ఈషద్ధాస్య ప్రసన్నాస్యాం సకటాక్షాం మనోహరామ్ ॥

మేన పార్వతీ పరమేశ్వరుల పేర్లను అడిగి చెప్పించెను. ఆమె ఆనందముతో తన గృహమునకు వెళ్లెను. శివుడు గణములతో దేవతలతో గూడి తనకు వినయముగా నిర్దేశింపబడిన స్థానమునకు వెళ్ళెను (22). ఇంతలో 'హిమవంతుని అంతః పుర పరిచారికలు కులదేవతను ఆరాధించుటకై దుర్గను

తీసుకుని నగర బహిః స్థానమునకు వెళ్లిరి (23). ఆ సమయములో నల్లని కాటుక రంగు కలిగినది, తన అవయవములే. అలంకారముగా గలది, ముక్కంటిని ప్రేమతో చూచు నేత్రములు గలది, కన్నులతో ఇతరులను చూడనిది, చిరునవ్వుతో ప్రసన్నమగు ముఖముగలది, మనోహరములగు నేత్రములు గలది అగు ఆ దేవిని దేవతలు ఆనందముతో రెప్ప వాల్చకుండగా చూచిరి (24, 25).

సుచారు కబరీభారాం చారు పత్రకశోభితామ్ ।
కస్తూరీ బిందుభిస్సార్ధం సిందూర బిందుశోభితామ్ ॥
రత్నేంద సారహారేణ వక్షసా సువిరాజితామ్ ।
రత్న కేయూరవలయాం రత్నకంకణమండితామ్ ॥
సద్రత్నకుండలాభ్యాం చ చారుగండస్థలోజ్జ్వలామ్ ।
మణిరత్న ప్రభాముష్టి దంతరాజివిరాజితామ్ ॥
మధు బింబాధరోష్ఠాం చ రత్నయావక సంయుతామ్ ।
రత్న దర్పణహస్తాం చ క్రీడా పద్మవిభూషితామ్ ॥

అందమగు కేశపాశము గలది, చెక్కిళ్లపై సుందరమగు పత్ర రచన గలది, కస్తూరి బిం◌ిందువులతో గూడిన కుంకుమ బొట్టుతో ప్రకాశించునది (26), సర్వ శ్రేష్ఠరత్నములు పొదిగిన హారముతో శోభిల్లు వక్షస్థలము గలది, రత్నములు పొదిగిన అంగదములను, కంకణములను ధరించి శోభిల్లునది (27), చక్కని రత్న కుండలముల కాంతులతో ప్రకాశించు అందమగు చెక్కిళ్లు గలది, మణుల కాంతులను, రత్నముల ప్రభలను అపహరించే దంత పంక్తితో ప్రకాశించునది(28), దొండపండు వంటి అధరోష్ఠము గలది, పాదముల యందు రత్ననూపురములను మరియు లత్తుక రంగును కలిగియున్నది, చేతి యందు రత్న పుటద్దమును, లీలా పద్మమును ధరించి ప్రకాశించునది అగు పార్వతిని వారు చూచిరి (29).

చందనాగురు కస్తూరీ కుంకుమేనాతి చర్చితామ్ ।

క్వణన్మంజీరపాదాం చ రక్తాంఘ్రితలరాజితామ్ ॥

ప్రణేముశ్శిరసా దేవీం భక్తి యుక్తా స్సమేనకామ్ ।

సర్వే సురాదయో దృష్ట్వా జగదాద్యాం జగత్ప్రసూమ్ ॥

త్రినేత్రో నేత్రకోణేన తాం దదర్శ ముదాన్వితః ।

శివస్సత్యాకృతిం దృష్ట్వా విజహౌ విరహజ్వరమ్ ॥

శివస్సర్వం విసస్మార శివాసన్న్యస్తలోచనః ।

పులకాంచిత సర్వాంగో హర్షాద్గౌరీ విలోచనః ॥

ఆమె చందనము, అగరు, కస్తూరి, కుంకుమలను లేపనము చేసుకున్నది. ఆమె పాదములు ఎర్రగా ప్రకాశించుచుండెను. మంజీరములు మధురముగా ధ్వనించు చుండెను (30). జగత్కారణము, జగత్తునకు తల్లి అగు పార్వతీ దేవిని మేనకతో సహా చూచి దేవతలు మొదలగు వారందరు భక్తితో కూడినవారై శిరస్సులను వంచి నమస్కరించిరి (31). ముక్కంటి ఆనందముతో ఆమెను ఓరకంట చూచెను. ఆ సతీదేవి యొక్క ఆకృతిని చూచి శివుడు విరహజ్వరమును విడనాడెను (32). పార్వతి వైపు చూచుచున్న శివుని అంగములన్నియూ పులకించి పోయెను. ఆయన కన్నులు ఆనందముతో నిండెను. ఆయన కన్నులలో ఆమెయే నిండి యుండుటచే ఆయన సర్వమును మరచెను (33).

అథ కాలీ బహిః పుర్యాం గత్వా పూజ్య కులాంబికామ్ ।

వివేశ భవనం రమ్యం స్వపితుస్స ద్విజాంగనా ॥

శంకరోఽపి సురైస్సార్ధం హరిణా బ్రహ్మణా తథా ।

హిమాచల సముద్దిష్టం స్వస్థానమగమన్ముదా ॥

తత్ర సర్వే సుఖం తస్థుస్సేవంతశ్శంకరం యథా ।

సమ్మానితా గిరీశేన నానావిధసుసంపదా ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే

వరాగమనాది వర్ణనం నామ షట్ చత్వారింశోఽధ్యాయః ॥

తరువాత ఆ కాళి బ్రాహ్మణ స్త్రీలతో కలిసి నగరమునకు బయట కులదైవమగు అంబికను అర్చించి తిరిగి తన తండ్రి యొక్క సుందరమగు భవనములో ప్రవేశించెను (34). శంకరుడు కూడా దేవతలతో, విష్ణువుతో మరియు బ్రహ్మతో గూడి హిమవంతునిచే నిర్దేశించబడిన తన మకామునకు ఆనందముతో వెళ్లెను (35). హిమవంతునిచే సమస్త సంపదలతో సన్మానింపబడిన ఆ దేవతలందరు అచట శంకరుని సేవిస్తూ సుఖముగా నుండిరి (36).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో వరుని రాకను వర్ణించుట అనే నలుబది యారవ అధ్యాయము ముగిసినది (46).

47 – శివుని అంతః పుర ప్రవేశము

బ్రహ్మోవాచ ।

తతశ్శైలవరస్సోఽపి ప్రీత్యా దుర్గోపవీతకమ్ ।
కారయామాస సోత్సాహం వేదమంత్రై శ్శివస్య చ ॥
అథ విష్ణ్వాదయో దేవా మునయస్సకుతూహలమ్ ।
హిమాచల ప్రార్థనయా వివిశాంతర్గృహం గిరేః ॥
శ్రుత్యాచారం భవాచారం విధాయ చ యథార్థతః ।
శివామలంకృతాం చక్రుశ్శివదత్త విభూషణైః ॥
ప్రథమం స్నాపయిత్వా తాం భూషయిత్వాథ సర్వశః ।
నీరాజితా సఖీభిశ్చ విప్రపత్నీభిరేవ చ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

పిమ్మట ఆ పర్వతరాజు ప్రీతితో ఉత్సాహముతో శివ పార్వతులకు వేదమంత్ర పూ◌ర్వకముగా ఉపవీతములను ధరింప జేసెను (1). అపుడు విష్ణువు మొదలగు దేవతలు, మునులు హిమవంతుని ప్రార్థనను మన్నించి కుతూహలముతో ఆయన అంతః పురమునందు ప్రవేశించిరి (2). వేదాచారమును, లోకాచారమును యథావిధిగా ఆచరించి, శివుడిచ్చిన అలంకారములతో పార్వతిని అలంకరింప జేసిరి (3). ఆమెను స్నానము చేయించి తరువాత దేహమును అంతటా అలంకరించి నీరాజనము నిచ్చిరి (4).

అహతాంబరయుగ్మేన శోభితా వరవర్ణినీ ।
విరరాజ మహాశైలదుహితా శంకర ప్రియా ॥
కంచుకీ పరమా దివ్యా నానారత్నాన్వితాద్భుతా ।
విధృతా చ తయా దేవ్యా విలసంత్యాధికం మునే ॥
సా బిభార తథా హారం దివ్యరత్న సమన్వితమ్ ।
వలయాని మహార్హాణి శుద్ధచామీకరాణి చ ॥
స్థితా తత్రైవ సుభగా ధ్యాయంతీ మనసా శివమ్ ।
శుశుభేఽతి మహాశైల కన్యకా త్రిజగత్ప్రసూః ॥

పర్వతా ధీశుని కుమార్తె, శంకరుని ప్రియురాలు, బ్రహ్మచారిణి అగు పార్వతి విడదీయబడని జంట వస్త్రములను ధరించి ప్రకాశించెను (5). ఓ మునీ! గొప్పగా ప్రకాశించే ఆ దేవి అనేక రత్నములను పొదుగుటచే అద్భుతముగా నున్న శ్రేష్ఠమైన దివ్యమగు రవికెను ధరించెను (6). మరియు అమె దివ్యమగు రత్నములతో చేయబడిన హారమును, మిక్కిలి విలువైన, శుద్ధమగు బంగారముతో చేయబడిన గాజులను ధరించెను (7). పర్వతా ధీశుని కుమార్తె, ముల్లోకములకు తల్లి అగు ఆ సుందరి అచటనే నిలబడి మనస్సులో శివుని ధ్యానము చేయుచూ మిక్కిలి ప్రకాశించెను (8).

తదోత్సవో మహానాసీదుభయత్ర ముదావహః ।

దానం బభూవ వివిధం బ్రాహ్మణేభ్యో వివర్జితమ్ ॥

అన్యేషాం ద్రవ్య దానం చ బభూవ వివిధం మహత్ ।

గీత వాద్య వినోదశ్చ తత్రోత్సవపురస్సరమ్ ॥

అథ విష్ణురహం ధాతా శక్రాద్యా అమరాస్తథా ।

మునయశ్చ మహాప్రీత్యా నిఖిలాస్సోత్సవా ముదా ॥

సుప్రణమ్య శివం భక్త్యా స్మృత్వా శివపదాంబుజమ్ ।

సంప్రాప్య హిమగిర్యాజ్ఞాం స్వం స్వం స్థానం సమాశ్రితాః ॥

అపుడు రెండు వైపుల వారికి ఆనందమును కలిగించే మహోత్సవము ప్రవర్తిల్లెను. బ్రారాహ్మణులకు విభిన్న దానము లీయబడెను (9). ఇతరులకు వివిధ వస్తువులు, మరియు అధికమగు ధనము ఈయబడెను. గీతములతో, వాద్యములతో మరియు వినోదములతో గూడిన ఉత్సవము ప్రవర్తిల్లెను (10). అపుడు విష్ణువు, బ్రహ్మనగు నేను, ఇంద్రాది దేవతలు, మునులు అందరు మహోత్సాహముతో, మహానందముతో (11), శివునకు భక్తి పూర్వకముగా ప్రణమిల్లి, శివుని పాదపద్మములను స్మరించి, హిమవంతుని ఆజ్ఞను పొంది తమ తమ నివాసములకు చేరు కొంటిమి (12).

ఏతస్మిన్నంతరే తత్ర జ్యోతి శ్శాస్త్ర విశారదః ।

హిమవంతం గిరీంద్రం తం గర్గో వాక్యమ భాషత ॥

ఇంతలో జ్యోతిశ్శాస్త్ర పండితుడగు గర్గుడు పర్వతరాజగు హిమవంతుని వద్దకు వచ్చి ఇట్లనెను (13).

హిమాచల ధరాధీశ స్వామిన్ కాలీపతిం ప్రభో ।

పాణి గ్రహార్థం శంభుం చానయ త్వం నిజమందిరమ్ ॥

ఓ పర్వత రాజా ! హిమాలయా ! స్వామీ! ప్రభూ ! కాళీపతియగు శంభుని పాణి గ్రహణము కొరకు నీ మందిరమునకు దోడ్కొని రమ్ము (14).

బ్రహ్మోవాచ ।

అథ తం సమయం జ్ఞాత్వా కన్యాదానోచితం గిరిః।

నివేదితం చ గర్గేణ ముముదేఽతీవ చేతసి ॥

మహీధరాన్ ద్విజాంశ్చైవ పరానపి తదా గిరిః ।

ప్రేషయామాస సుప్రీత్యా శివానయన కామ్యయా ॥

తే పర్వతా ద్విజాశ్చైవ సర్వమంగల పాణయః ।

సంజగ్ము స్సోత్సవాః ప్రీత్యా యత్ర దేవో మహేశ్వరః ॥

తదా వాదిత్ర ఘోషేణ బ్రహ్మఘోషేణ భూయసా ।

మహోత్సాహోఽభవత్తత్ర గీత నృత్యై ర్వితేన హి ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

కన్యాదానమునకు సమయ మాసన్నమైనదని గుర్తించి గర్గుడు నివేదించగా అపుడు హిమవంతుడు మనస్సులో చాల సంతసించెను (15). అపుడు ఆ హిమవంతుడు పర్వతులను, బ్రాహ్మణులను, మరియు ఇతరులను శివుని తీసుకొని వచ్చుట కొరకై ఆనందముతో పంపెను (16). ఆ పర్వతులు మరియు బ్రాహ్మణులు మంగళ ద్రవ్యములనన్నిటినీ చేతుల యందు పట్టుకొని ఉత్సాహముతో మహేశ్వరుడు నివసించిన స్థానమునకు వెళ్లిరి (17). అపుడచట వాద్య ఘోష, విస్తారమగు వేదఘోష మరియు గీతములతో నృత్యములతో మహోత్సాహము వర్ధిల్లెను (18).

శ్రుత్వా వాదిత్ర నిర్ఘోషం సర్వే శంకర సేవకాః ।

ఉత్థితాస్త్వేకపద్యేన సదేవర్షి గణా ముదా ॥

పరస్పరం సమూచుస్తే హర్ష నిర్భరమానసాః ।

అత్రాగచ్ఛంతి గిరయశ్శివానయనకామ్యయా ॥

పాణిగ్రహణకాలో హి నూనం సద్యస్సమాగతః ।

మహద్భాగ్యం హి సర్వేషాం సంప్రాప్త మిహ మన్మహే ॥

ధన్యా వయం విశేషేణ వివాహం శివయోర్ధ్రువమ్ ।

ద్రక్ష్యామః పరమప్రీత్యా జగతాం మంగలాలయమ్ ॥

వాద్యముల శబ్దమును విని శంకరుని గణములు, దేవతలు, ఋషులు అందరు ఒక్కకసారిగా ఆనందముతో లేచి నిలబడిరి (19). ఆనందముతో నిండిన మనస్సు గల వారందరు వారిలో వారు ఇట్లు మాటలాడు కొనిరి. శివుని దోడ్కొని వెళ్లుటకే ఇచటకు పర్వతులు వచ్చు చున్నారు (20). పాణిగ్రహణ ముహూర్తము చాల తొందరగా ఆసన్నమైనది. మనందరికి మహాభాగ్యము సంపన్నమైనదని భావించుచున్నాము (21). మనము చాల ధన్యులము. సందేహము లేదు. ఏలయన, లోకములకు మంగళములను కలిగించే పార్వతీ పరమేశ్వరుల వివాహమును పరమానందముతో చూడబోయెదము (22).

బ్రహ్మోవాచ ।

ఏవం యావదభూత్తేషాం సంవాదస్తత్ర చాదరాత్ ।

తావత్సర్వే సమాయాతాః పర్వతేంద్రస్య మంత్రిణః ॥

తే గత్వా ప్రార్థయాం చక్రుశ్శివం విష్ణ్వాదికానపి ।

కన్యాదానోచితః కాలో వర్తతే గమ్యతామితి ॥

తే తచ్ఛ్రుత్వా సురాస్సర్వే మునే విష్ణ్వాదయోఽఖిలాః ।

ముముదుశ్చేతసా తీవ జయేత్యూచుర్గిరిం ద్రుతమ్ ॥

శివోఽపి ముముదేఽతీవ కాలీ ప్రాపణలాలసః ।

గుప్తం చకార తచ్చిహ్నం మనస్యేవాద్భుతాకృతిః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇట్లు వారచట సాదరముగా మాటలాడు చుండగనే, ఇంతలో పర్వతరాజు యొక్క మంత్రులు అందరు విచ్చేసిరి (23). వారు శివుని వద్దకు, విష్ణువు మొదలగు వారి వద్దకు వెళ్లి కన్యాదాన సమయము సమీపించు చున్నది గాన, బయలు దేరుడు అని ప్రార్థించిరి (24). ఓ మునీ! విష్ణువు మొదలగు దేవతలందరు ఆ మాటను విని మనస్సులో చాల సంతసించి వెంటనే హిమవంతుని ఉద్దేశించి జయధ్వానమును చేసిరి (25). కాళిని పొందవలెననే ఉత్కంఠ గల శివుడు కూడ మిక్కిలి సంతసించెను. కాని ఆ చిహ్నములను మనస్సునందు రహస్యముగ నుంచి గంభీరాకారుడై యుండెను (26).

అథ స్నానం కృతం తేన మంగల ద్రవ్యసంయుతమ్ ।
శూలినా సుప్రసన్నేన లోకాను గ్రహకారిణా ॥
స్నాతస్సువాససా యుక్త స్సర్వై స్తైః పరివారితః ।
ఆరోపితో వృషస్కంధే లోకపాలైస్సు సేవితః ॥
పురస్కృత్య ప్రభుం సర్వే జగ్ము ర్హిమగిరే ర్గృహమ్ ।
వాద్యాని వాదయంతశ్చ కృతవంతః కుతూహలమ్ ॥
హిమాగ ప్రేషితా విప్రాస్తథా తే పర్వతోత్తమాః ।
శంభోరగ్రచరా హ్యాసన్ కుతూహల సమన్వితాః ॥

అపుడు శూలధారి, లోకానుగ్రహమును చేయువాడు, మిక్కిలి ప్రసన్నుడు అగు ఆ శివుడు మంగళ ద్రవ్యములతో స్నానమును చేసెను (27). స్నానము చేసి చక్కని వస్త్రమును ధరించిన శివుని వారందరు చుట్టుముట్టిరి. లోకపాలకులు ఆయనను చక్కగా సేవిస్తూ వృషభముపై నెక్కించిరి (28). వారందరు వాద్యములను మ్రోగించుచూ, పండుగను చేసుకొనుచూ ఆ ప్రభుని ముందిడుకొని హిమవంతుని గృహమునకు వెళ్లిరి (29). హిమవంతునిచే పంప బడిన బ్రాహ్మణులు మరియు శ్రేష్ఠులగు పర్వతులు కుతూహలముతో కూడిన వారై శంభుని యెదుట నడిచిరి (30).

బభౌ ఛత్రేణ మహతా ధ్రియమాణో హి మూర్ధని ।
చామరైర్వీజ్య మానోఽ సౌ సవితానో మహేశ్వరః ॥
అహం విష్ణుస్తథా చేంద్రో లోకపాలాస్తథైవ చ ।
అగ్రగా స్సూతి శోభంతే శ్రియా పరమయా శ్రితాః ॥
తతశ్శంఖాశ్చ భైర్యశ్చ పటహానకగోముఖాః ।
పునః పునరవాద్యంత వాది త్రాణి మహోత్సవే ॥
తథైవ గాయకాస్సర్వే జగ్ముః పరమమంగలమ్ ।
నర్తక్యో నన్నృతుస్సర్వా నానాతాల సమన్వితాః ॥

శివుని శిరస్సుపై పెద్ద ఛత్రము ఏర్పాటు చేయబడెను. చామరములు వీచబడెను. వితానము(?)ు (వస్త్రముతో చేసిన పందిరి) క్రింద మహేశ్వరుడు శోభిల్లెను (31). నేను, విష్ణువు, ఇంద్రుడు, లోకపాలకులు ముందు నడిచితిమి. మేము కూడ గొప్ప శోభతో ప్రకాశించితిమి (32). తరువాత శంఖములు, భేరీలు, పటహములు,

అనకములు, గోముఖములు ఆ మహోత్సవములో అనేక పర్యాయములు మ్రోగించబడినవి (33). మరియు గాయకులందరు పరమ మంగళకరమగు పాటలను పాడిరి. నాట్యకత్తె లందరు అనేక తాళములతో గూడి నాట్యమును చేసిరి (34).

ఏభిస్సమేతో జగదేక బంధుః యయౌ తదానీం పరమేశవర్చసా ॥

సుసేవ్యమానస్స కలై స్సురేశ్వరైః వికీర్యమాణః కుసుమైశ్చ హర్షితైః ॥

సంపూజితస్తదా శంభుః ప్రవిష్టో యజ్ఞమండపమ్ ।

సంస్తూయమానో బహ్వీభి స్స్తు తిభిః పరమేశ్వర ॥

వృషాదుత్తారయామాసుర్మహేశం పర్వతోత్తమాః ।

నిన్యుర్గృహాంతరం ప్రీత్యా మహోత్సవపురస్సరమ్ ॥

హిమాలయోఽపి సంప్రాప్తం సదేవగణమీశ్వరమ్ ।

ప్రణమ్య విధి వద్భక్త్యా నీరాజనమథాకరోత్ ॥

జగదేక బంధువగు శివుడు వీరితో గూడి అపుడు పరమేశ్వర తేజస్సుతో ముందుకు సాగెను. లోకపాలకులందరు ఆయనను సేవిస్తూ ఆనందముతో పుష్పములను చల్లు చుండిరి (35). ఈ విధముగా పూజింపబడిన శంభు పరమేశ్వరుడు అనేక స్తుతులచే కొనియాడబడుచున్న వాడై యజ్ఞ మండపములోనికి ప్రవేశించెను (36). పర్వత శ్రేష్ఠులు మహోత్సవపురస్సరముగా మహేశ్వరుని వృషభమునుండి దింపి ప్రీతితో గృహము లోపలికి దోడ్కొని వెళ్లిరి (37). హిమవంతుడు కూడ దేవతలతో గణములతో కూడి విచ్చేసిన ఈశ్వరునకు భక్తితో ప్రణమిల్లి యథావిధిగా నీరాజనమొసంగెను (38).

సర్వాన్ సురాన్ మునీనన్యాన్ ప్రణమ్య సమహోత్సవః ।

సమ్మాన మకరోత్తేషాం ప్రశంసన్ స్వవిధిం ముదా ॥

సోఽ గస్సాచ్యుత మీశానం సుపాద్యా ర్ఘ్య పురస్సరమ్ ।

సదేవముఖ్యవర్గం చ నినాయ స్వాలయాంతరమ్ ॥

ప్రాంగణే స్థాపయామాస రత్నసింహాసనేషు తాన్ ।

సర్వాన్ విష్ణుం చ మామీశం విశిష్టాంశ్చ విశేషతః ॥

సఖీ భిర్మేనయా ప్రీత్యా బ్రాహ్మణ స్త్రీ భిరేవ చ ।

అన్యా భిశ్చ పురం ధ్రీభిశ్చక్రే నీరాజనం ముదా ॥

హిమవంతుడు తన భాగ్యమును కొనియాడుచూ దేవతలను, మునులను, ఇతరులను అందరినీ నమస్కరించి మహోత్సాహముతో సన్మానించెను (39). ఆ హిమవంతుడు అచ్యుతునితో, ముఖ్యులగు దేవతలతో గూడి యున్న ఈశ్వరునికి అర్ఘ్యపాద్యములనిచ్చి తన గృహము లోపలికి తీసుకొని వెళ్లెను (40). నన్ను, విష్ణువును, ఈశ్వరుని ఇతర పెద్దలను వాకిటి యందు రత్న సింహాసనములపై ప్రత్యేకముగా కూర్చుండబెట్టెను (41). చెలికత్తెలు, మేన, మరియు బ్రాహ్మణ స్త్రీలు, ఇతర ముత్తయిదువలు ఆనందముతో నీరాజనమిచ్చిరి (42).

పురోధసా కృత్య విదా శంకరాయ మహాత్మనే ।

మధు పర్కాదికం యద్యత్ కృత్యం తత్తత్ కృతం ముదా ॥

మయా స నోదితస్తత్ర పురోధాః కృతవాంస్తదా ।

సుమంగలం చ యత్కర్మ ప్రస్తావసదృశం మునే ॥

అంతర్వేద్యాం మహా ప్రీత్యా సంప్రవిశ్య హిమాద్రిణా ।

యత్ర సా పార్వతీ కన్యా సర్వాభరణ భూషితా ॥

వేదికోపరి తన్వంగీ సంస్థితా సువిరాజితా ।

తత్ర నీతో మహాదేవో విష్ణునా చ మయా సహ ॥

వివాహ ప్రక్రియ నెరింగిన పురోహితుడు మహాత్ముడగు శంకరునకు మధుపర్క్కము మొదలగు వాటినిచ్చి చేయదగిన కర్మలనన్నిటినీ ఆనందముతో చేయించెను (43). ఓ మునీ! నాచే ప్రేరితుడైన ఆ పురోహితుడు అపుడు వివాహ ప్రస్తావమునకు అనురూపమగు మంగళకార్యముల నన్నిటినీ చేసెను (44). అపుడు శివుడు హిమవంతునితో బాటు వేదిపైన ప్రవేశించెను. అప్పటికి సర్వాలంకార శోభితయగు పార్వతీ కన్య అచట ఉండెను (45). అ సుందరి వేదికపై నున్నదైమిక్కిలి ప్రకాశించెను. మహాదేవుని, విష్ణువును, నన్ను అచటకు దోడ్కొని వెళ్లిరి (46).

లగ్నం నిరీక్షమాణాస్తే వాచస్పతి పురోగమాః ।

కన్యాదానో చితం తత్ర బభూవుః పరమోత్సవాః ॥

తత్రో పవిష్టో గర్గశ్చ యత్రాస్తి ఘటికాలయమ్ ।

యా వచ్ఛేషా ఘటీ తావత్ కృతం ప్రణవ భాషణమ్ ॥

పుణ్యాహం ప్రవదన్ గర్గ స్సమాద్రేఽ జలిం ముదా ।

పార్వత్యక్షత పూర్ణం చ వవృషే చ శివో పరి ॥

తయా సంపూజితో రుద్రో దధ్యక్షతకుశాంబుభిః ।

పరమోదారయా తత్ర పార్వత్యా రుచిరాస్యయా ॥

బృహస్పతి మొదలగు వారు పరమానందముతో అచట కన్యాదాన లగ్నమును నిరీక్షించు చుండిరి (47). గర్గుడుగడియారము ఉన్నచోట కూర్చుండి లగ్నము వరకు గల మధ్య కాలములో ఓంకారమునుచ్చరించెను (48). గర్గుడు పుణ్యాహమం త్రములను పఠిస్తూ పార్వతి యొక్క దోసిలి యందు అక్షతలను నింపెను. ఆమె ఆనందముతో వాటిని శివుని శిరస్సుపై పోసెను. (49). గొప్ప ఉదారురాలు, సుందరమగు ముఖము గలది యగు పార్వతి పెరుగు, అక్షతలు, దర్భలు మరియు జలములతో రుద్రుని పూజించెను (50).

విలోకయంతీ తం శంభుం యస్యార్థే పరమం తపః ।

కృతం పురా మహాప్రీత్యా విరరాజ శివాతి సా ॥

మయా మునే తదోక్తస్తు గర్గాది ముని భిశ్చ సః ।

సమానర్చ శివాం శంభు ర్లౌకికాచార సంరతః ॥

ఏవం పరస్పరం తౌ వై పార్వతీ పరమేశ్వ రౌ ।

అర్చయంతౌ తదానీం చ శుశుభాతే జగన్మయౌ ॥

ఎవని కొరకై పరమతపస్సును పూర్వము చేసినదో, అట్టి శం◌ంభుని మహానందముతో చూస్తూ ఆ పార్వతి మిక్కిలి ప్రకాశించెను (51). ఓ మునీ! నేను, గర్గాది మునులు చెప్పగా ఆ శంభుడు లోకాచారము నందు శ్రద్ధ గలవాడై పార్వతిని పూజించెను (52). ఈ విధముగా జగద్రూపులగు పార్వతీ పరమేశ్వరులు అపుడు పరస్పరము పూజించుకొని ప్రకాశించిరి (53).

త్రైలో క్యలక్ష్మ్యా సంవీతౌ నిరీక్షంతౌ పరస్పరమ్ ।

తదా నీరాజితౌ లక్ష్మ్యా దిభిస్స్త్రీ భిర్విశేషతః ॥

తథా పరా వై ద్విజ యోషితశ్ నీరాజయామాసురథో పురస్త్రి యః ।

శివాంచ శంభుం చ విలోకయంత్యః అవాపుర్ముదం తాస్సకలా మహోత్సవమ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివ హిమగిరి గృహాభ్యంతర గమనోత్సవ వర్ణనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥

ముల్లోకముల శోభను కలిగి ఒకరినొకరు చూచుకొనుచున్న వారిద్దరికి లక్ష్మి మొదలగు స్త్రీలు ప్రత్యేకముగా నీరాజనము నిచ్చిరి (54). మరియు బ్రాహ్మణ స్త్రీలు, ఇతర నగర స్త్రీలు పార్వతీ పరమేశ్వరులకు తరువాత నీరాజనము నిచ్చిరి. వారిద్దరినీ చూస్తూ వారందరు మహానందమును, ఉత్సాహమును పొందిరి (55).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహిత యందు పార్వతీ ఖండలో శివుడు హిమవంతుని అంతః పురములో ప్రవేశించుట అను నలుబది ఏడవ అధ్యాయము ముగిసినది (47).

48 - కన్యాదానము

బ్రహ్మోవాచ ।

ఏతస్మిన్నంతరే తత్ర గర్గాచార్య ప్రణోదితః ।
హిమవాన్మేనయా సార్ధం కన్యాం దాతుం ప్రచక్రమే ॥
హైమం కలశమాదాయ మేనా చార్ధాంగమాశ్రితా ।
హిమాద్రేశ్చ మహాభాగా వస్త్రాభరణ భూషితా ॥
పాద్యాదిభిస్తతశ్శైలః ప్రహృష్టస్సపురోహితః ।
తం వరం వరయామాస వస్త్ర చందన భూషణైః ॥
తతో హిమాద్రిణా ప్రోక్తా ద్విజాస్తిథ్యాది కీర్తనే ।
ప్రయోగో భణ్యతాం తావదస్మిన్ సమయ ఆగతే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఇంతలో అచట గర్గాచార్యునిచే ప్రేరేపింపబడిన హిమవంతుడు మేనతో గూడి కన్యాదానమునకు ఉపక్రమించెను (1). పుణ్యాత్మురాలగు మేన నూతన వస్త్రములను ధరించి సొమ్ములను పెట్టుకొని బంగరు కలశమును చేతబట్టి హిమవంతుని ప్రక్కన కూర్చుండెను (2). అపుడు హిమవంతుడు పురోహితునితో గూడి పాద్యము, వస్త్రము, చంధనము, అలంకారము మొదలగు వాటితో ఆ వరుని ఆనందముగా పూజించెను (3), అపుడు హిమవంతుడు బ్రాహ్మణులను సమయము కాగానే తిథి మొదలగు వాటిని కీర్తించి వివాహ ప్రయోగమును పఠించుడని కోరెను (4).

తథేతి చోక్త్వా తే సర్వే కాలజ్ఞా ద్విజసత్తమాః ।
తిథ్యాది కీర్తనం చక్రుః ప్రీత్యా పరమ నిర్వృతాః ॥
తతో హిమాచలః ప్రీత్యా శంభునా ప్రేరితో హృదా ।
సూతీకృతః పరేశేన విహసన్ శంభు మబ్రవీత్ ॥

కాల జ్ఞాన పండితులగు ఆ బ్రాహ్మణోత్తములు అందరు 'అటులనే' అని పలి◌కి పరమానందముతో తిథి మొదలగు వాటిని కీర్తించిరి (5). అపుడు హృదయము నందు శంభునిచే సానందముగా ప్రేరేపింపబడిన హిమవంతుడు అనేక లీలలను ప్రకటించు వాడు, పరమేశ్వరుడు అగు శంభునితో నవ్వుచూ ఇట్లు పలికెను (6).

స్వగోత్రం కథ్యతాం శంభో ప్రవరశ్చ కులం తథా ।
నామ వేదం తథా శాఖాం మా కార్షీ స్సమయాత్యయమ్ ॥

హే శంభో ! నీవు సమయము దాటి పోకుండా నీ గోత్రమును, ప్రవరను, కులమును, పేరును, వేదమును, వేదశాఖను చెప్పుము (7).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య వచస్తస్య హిమాద్రేశ్శంకరస్తదా ।
సుముఖో విముఖస్సద్యోఽ ష్యశోచ్యశ్శోచ్యతాం గతః ॥
ఏవం విధ స్సురవరైర్మునిభిస్తదానీం గంధర్వ యక్షగణసిద్ధ గణై స్తథైవ ।
దృష్టా నిరుత్తరముఖో భగవాన్ మహేశః అకార్షీ స్సుహాస్యమథ తత్ర స
నారద త్వమ్ ॥
వీణా మవాదయస్త్వం హి బ్రహ్మవిజ్ఞోథ నారద ।
శివేన ప్రేరితస్తత్ర మనసా శంభుమానసః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

హిమవంతుని ఈ మాటను విని శంకరుడు ఆ క్షణములో సుముఖుడుగా నున్నవాడు విముఖుడాయెను. శోకింపదగనివాడు వెనువెంటనే శోచనీయమగు స్థితిని పొందెను (8). ఈ విధముగా దేవోత్తములు, మునులు, గంధర్వులు, యక్ష గణములు, సిద్ధులు, శివగణములు చూచుచుండగా భగవాన్ మహేశ్వరుని నోటి వెంట సమాధానము రాలేదు. ఓ నారదా! అపుడు నీవు ఒక నవ్వదగిన పనిని అచట చేసి యుంటివి (9). ఓ నారదా! శంభుని మనస్సులో ధ్యానించే నీవు శివునిచే మనస్సులో ప్రేరితుడవై వీణను వాయించ మొదలిడితివి. నీవు బ్రహ్మ వేత్తవు గదా! (10)

తదా నివారితో ధీమాన్ పర్వతేంద్రేణ వై హఠాత్ ।
విష్ణు నా చ మయా దేవైర్మునిభిశ్చాఖిలై స్తథా ॥
న నివృ త్తోఽ భవస్త్వం హి స యదా శంకరేచ్ఛయా ।
ఇతి ప్రోక్తోఽ ద్రిణా త ర్హి వీణాం మా వాదయాధునా ॥
సునిషి ద్ధో హఠాత్తేన దేవర్షే త్వం యదా బుధ ।
ప్రత్యవోచో గిరీశం తం సుసంస్మృత్య మహేశ్వరమ్ ॥

అపుడు హిమవంతుడు, విష్ణువు, నేను, దేవతలు, మునులు అందరు బుద్ధిశాలివగు నిన్ను ఆపమని గట్టిగా వారించితిమి (11). కాని శంకరుని ఇచ్ఛచే నీవు ఆపలేదు. అపుడు హిమవంతుడు నీతో "ఇపుడు వీణను వాయించకుము' అని చెప్పెను (12). ఓ దేవ! విద్వాంసుడా! ఆయన నిన్ను హఠాత్తుగా వీణను ఆపుమని గట్టిగా చెప్పగనే, నీవు మహేశ్వరుని స్మరించుకొని ఆ పర్వతరాజునకు ఇట్లు సమాధానము నిచ్చితివి (13).

నారదా ఉవాచః

త్వం హి మూఢత్వమాపన్నో న జానాసి చకించన ।
వాచ్యే మహేశవిషయేఽతీ వాసి త్వం బహిర్ముఖః ॥
త్వయా పృష్టో హరస్సాక్షాత్ స్వగోత్ర కథనం ప్రతి ।
సమయేఽస్మిన్ తదత్యంత ముపహాసకరం వచః ॥
అస్య గోత్రం కులం నామ నైవ జానంతి పర్వత ।
విష్ణు బ్రహ్మాదయోఽపీహ పరేషాం కా కథా స్మృతా ॥
యస్యైక దివసే శైల బ్రహ్మకోటిర్లయం గతా ।
స ఏవ శంకర స్తేద్య దృష్టః కాలితపోబలాత్ ॥

నారదుడిట్లు పలికెను -

నీవు మూర్ఖుడవై నావు. నీకేమియూ, తెలియదు. మహేశ్వరుని గురించి ప్రశ్నించుటచే నీవు పూర్తిగా బహిర్ముఖుడవై ఉన్నావని స్పష్టమైనది (14). నీవు ఈ సమయములో సాక్షాత్తు హరుని తన గోత్రమును చెప్పుమని ప్రశ్నించితివి. ఇది ఎంతయూ అపహాస్యకరమగు మాట యగును (15). ఓ పర్వతా ! ఈయన గోత్ర కుల నామములు విష్ణు బ్రహ్మాదులకైనను తెలియవు. ఇతరుల గురించి చెప్పున దేమున్నది? (16) ఓ పర్వతా ! ఎవని యొక్క ఒక్క దినములో కోటి బ్రహ్మలు లయమగుదురో ఆ శంకరుడినాడు కాళి యొక్క తపోబలము వలన నీకు కనుబడినాడు (17).

అరూపోఽ యం పరబ్రహ్మ నిర్గుణః ప్రకృతేః పరః ।
నిరాకారో నిర్వికారో మాయాధీశః పరాత్పరః ॥
అగోత్రకులనామా హి స్వతంత్రో భక్తవత్సలః ।
తదిచ్ఛయా హి సగుణస్సుతను ర్బహునామభృత్ ॥
సగోత్రీ గోత్రహీనశ్చ కులహీనః కులీనకః ।
పార్వతీతపసా సోఽ ద్య జామాతా తే న సంశయః ॥
లీలా విహారిణా తేన మోహితం చ చరాచరమ్ ।
నో జానాతి శివం కోఽపి ప్రాజ్ఞోఽపి గిరిసత్తమ ॥

ఈయన నిర్గుణ నిరాకార పరబ్రహ్మ. ప్రకృతికి అతీతుడై ప్రకృతిని తనవశమునందుంచు కొనువాడు. వికారహీనుడగు శివుడు సర్వోత్కృష్టుడు (18). భక్తవత్సలుడు, స్వతంత్రుడునగు శివునకు కులగోత్రములు, నామములు లేవు. ఆయన తన ఇచ్ఛచే సగుణుడై దేహమును స్వీకరించి అనేక నామములను ధరించును(19). మంచి గోత్రము గలవాడు, కాని గోత్రము లేనివాడు, మంచి కులమునకు చెందినవాడు, కాని కులము లేనివాడు అగు శివుడు ఈనాడు పార్వతి యొక్క తపస్సుచే నీ అల్లుడైనాడు. సందేహము లేదు (2.0). లీలా విహారియగు శివునిచే స్థావర జంగమాత్మకమగు విశ్వమంతయూ మోహింపబడి యున్నది. ఓ పర్వత శ్రేష్ఠా! శివుని పండితులు కూడా ఎరుంగ జాలరు (21).

లింగాకృతేర్మహేశస్య కేన దృష్టం న మస్తకమ్ ।
విష్ణుర్గత్వా హి పాతాలం తదేనం నాప విస్మితః ॥
కిం బహూక్త్యా నగశ్రేష్ఠ శివమాయా దురత్యయా ।
తదధీనాస్త్ర యో లోకా హరి బ్రహ్మాదయోఽపి చ ॥
తస్మాత్త్వయా శివాతాత సువిచార్య ప్రయత్నతః ।
న కర్తవ్యో విమ ర్శోఽ త్ర త్వేవంవిధవరే మనాక్ ॥

మహేశ్వరుడు లింగాకారమును ధరించగా ఆయన అగ్రభాగము ఎవ్వరికీ కానరాలేదు(21). విష్ణువు పాతాళమునకు వెళ్లియూ ఆ లింగము యొక్క మూలమును గన జాలక చకితుడైనాడు (22). ఓ పర్వత రాజా! ఇన్ని మాటలేల? శివమాయను దాట శక్యము కాదు. విష్ణు బ్రహ్మాదులతో సహా ముల్లోకములు శివమాయకు అధీనములో ఉన్నవి (23). కావున పార్వతీ జనకుడవగు నీవు జాగ్రత్తగా విచారించు కొనుము. ఇటు వంటి వరుని విషయములో అల్పమగు విమర్శయైననూ ఈ సమయములో చేయదగదు (24).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా త్వం మునే జ్ఞానీ శివేచ్ఛా కార్యకారకః ।
ప్రత్యవోచః పునస్తం వై శైలేంద్రం హర్షయన్ గిరా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! జ్ఞాని, శివుని ఇచ్ఛననుసరించి పనులను చక్కబెట్టువాడు అగు నీవు ఇట్లు పలికి పర్వతరాజునకు నీ మాటలచే ఆనందమును కలిగిస్తూ మరల ఇట్లు పలికితివి (25).

నారద ఉవాచ।

శృణు తాత మహాశైల శివా జనక మద్వచః ।
తచ్ఛ్రుత్వా తనయాం దేవీం దేహి త్వం శంకరాయ హి ॥
సగుణస్య మహేశస్య లీలయా రూపధారిణః ।
గోత్రం కులం విజానీహి నాదమేవ హి కేవలమ్ ॥
శివో నాదమయస్సత్యం నా దశ్శివమయస్తథా ।
ఉభయోరంతరం నాస్తి నాదస్య చ శివస్య చ ॥
సృష్టౌ ప్రథమజ త్వాద్ధి లీలాసగుణ రూపిణః ।
శివాన్నాదస్య శైలేంద్ర సర్వోత్కృష్టస్తతస్స హి ॥
అతో హి వాదితా వీణా ప్రేరితేన మయాద్య వై ।
సర్వేశ్వరేణ మనసా శంకరేణ హిమాలయ ॥

నారదుడిట్లు పలికెను -

వత్సా! మహాపర్వతరాజా! పార్వతీ జనకా! నా మాటను వినుము: విని నీ కుమార్తె యగు పార్వతీ దేవిని నీవు శంకరునకిమ్ము (26). సగుణుడు, లీలారూపధారి అగు మహేశ్వరుని కులగోత్రములు కేవలము నాదము మాత్రమేనని యెరుంగుము (27). శివుడు నాదస్వరూపుడు. నాదము శివ స్వరూపము. ఇది సత్యము. నాద శివులకు ఇద్దరికీ భేదము లేదు (28). ఓ పర్వతరాజా! లీలచే సగుణ రూపమును స్వీకరించిన శివుని నుండి మున్ముందుగా నాదము సృష్టింపబడుటచే, అది సృష్టిలో సర్వ శ్రేష్ఠమై యున్నది (29). అందువలననే, నేనీనాడు మనస్సులో సర్వేశ్వరుడగు శివునిచే ప్రేరితుడనై వీణను వాయించితిని. ఓ హిమాలయా! తెలుసుకొనుము (30).

బ్రహ్మోవాచ ।

ఏతచ్ఛ్రుత్వా తవ మునే వచస్తత్తు గిరీశ్వరః ।
హిమాద్రి స్తోషమాపన్నో గత విస్మయ మానసః ॥
అథ విష్ణు ప్రభృతయ స్సురాశ్చ మునయస్తథా ।
సాధు సాధ్వితి తే సర్వే ప్రోచుర్విగత విస్మయాః ॥
మహేశ్వరస్య గాంభీర్యం జ్ఞాత్వా సర్వే విచక్షణాః ।
సవిస్మయా మహామోదాన్వితాః ప్రోచుః పరస్పరమ్ ॥
యస్యాజ్ఞయా జగదిదం చ విశాలమేవ జాతం పరాత్పరతరో నిజబోధరూపః ।
శర్వస్స్వతంత్ర గతి కృత్పర భావగమ్యః సోఽసౌ త్రిలోకపతిరద్య చ నస్సు దృష్టః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మునీ! నీ యొక్క ఈ మాటను వినిన పిమ్మట పర్వతరాజగు హిమవంతుడు గర్వమును వీడి మనస్సులో ఆనందమును పొందెను (31). అపుడు విష్ణువు మొదలగు దేవతలు, మరియు మునులు తొలగిన గర్వము గలవారై 'బాగు బాగు' అని పలికిరి (32). పండితులగు వారందరు మహేశ్వరుని మహిమను ఎరింగి ఆశ్చర్యమును, మహానందమును పొంది, వారిలో వారు ఇట్లు అను కొనిరి (33). ఎవని ఆజ్ఞచే ఈ విశాలమగు జగత్తు పుట్టినదో అట్టి శర్వుడు సర్వమునకు అతీతుడు, ఆత్మ జ్ఞానరూపుడు. మోక్షమునిచ్చువాడు ఆయనయే. ముల్లోకములకు పతియగు ఆయన బ్రహ్మ జ్ఞానముచే మాత్రమే పొందబడును. ఈనాడు ఆయనను మనము చూడగల్గితిమి (34).

అథ తే పర్వత శ్రేష్ఠా మేర్వాద్యా జాతసంభ్రమాః ।
ఊచుస్తే చైకపద్యేన హిమవంతం నగేశ్వరమ్ ॥

అపుడు మేరువు మొదలగు ఆ పర్వత శ్రేషులు ఆశ్చర్యపడిన వారై ఏకకంఠముతో పర్వతరాజగు హిమవంతుని ఉద్దేశించి ఇట్లు పలికిరి (35).

పర్వతా ఊచుః ।

కన్యాదానే స్థీ యతాం చాద్య శైల నాథో క్వా కిం కార్యనాశ స్త్వైవ ।
సత్యం బ్రూమో నాత్ర కార్యో విమర్శః తస్మాత్కన్యా దీయతా మీశ్వరాయ ॥

పర్వతములిట్లు పలికినవి –

ఓ పర్వత రాజా! నీ విపుడు కన్యాదాన కార్యము నందు నిమగ్నుడవు కమ్ము(?)ు, ఉత్తి మాటలతో నీ కార్యము చెడగలదు. కాన ఈ మాటలేల? మేము సత్యమును పలుకుచున్నాము. ఈ విషయములో విమర్శను కట్టి పెట్టుము. కన్యను ఈశ్వరునకు ఇమ్ము (36).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా వచనం తేషాం సుహృదాం స హిమాలయః ।
స్వకన్యా దానమకరోచ్ఛి వాయ విధినోదితః ॥
ఇమాం కన్యాం తుభ్య మహం దదామి పరమేశ్వర ।
భార్యార్థే పరిగృహ్ణీష్వ ప్రసీద సకలేశ్వర ॥
తస్మై రుద్రాయ మహతే మంత్రేణానేన దత్తవాన్ ।
హిమాచలో నిజాం కన్యాం పార్వతీం త్రిజగత్ప్రసూమ్ ॥
ఇత్థం శివాకరం శైలశ్శివహస్తే నిధాయ చ ।
ముమోదీతీవ మనసి తీర్ణ కామమహార్ణవః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఆ మిత్రుల వచనములను విని హిమవంతుడు బ్రహ్మగారి పర్యవేక్షణలో తన కుమార్తెను శివునకు ఇచ్చెను (37). ఓ పరమేశ్వరా! ఈ కన్యను నేను నీ కొరకు ఇచ్చు చున్నాను. ఓ సర్వేశ్వరా! నీవు ప్రసన్నుడవై ఈమెను భార్యగా స్వీకరించుము (38). హిమవంతుడు ఈ మంత్రమును చెప్పి మహాత్ముడగు రుద్రునకు ముల్లోకములకు తల్లి, తనకు కుమార్తె యగు పార్వతిని ఇచ్చెను (39). ఈ తీరున హిమవంతుడు పార్వతి చేతిని శివుని చేతిలో ఉంచి మనస్సులో చాల ఆనందించెను. ఆయన కామనలనే మహాసముద్రమును దాటి వేసెను (40).

వేదమంత్రేణ గిరిశో గిరిజా కర పంకజమ్ ।
జగ్రాహ స్వకరేణాశు ప్రసన్నః పరమేశ్వరః ॥
క్షితిం సంస్పృశ్య కామస్య కోఽదాదితి మనుం మునే ।
పపాఠ శంకరః ప్రీత్యా దర్శయన్ లౌకికీం గతిమ్ ॥
మహోత్సవో మహానాసీత్సర్వత్ర ప్రముదావహః ।
బభూవ జయసంరావో దివి భూమ్యంతరిక్షకే ॥
సాధుశబ్దం నమశ్శబ్దం చక్రు స్సర్వేతి హర్షితాః ।
గంధర్వా స్సుజగుః ప్రీత్యా నన్నృతు శ్చా ప్సరోగణాః ॥



పరమేశ్వరుడగు కైలాసపతి ప్రసన్నుడై వెంటనే వేదమంత్రమును పఠించి, పార్వతి యొక్క పద్మము వంటి చేతిని తనచేతితో పట్టుకొనెను (41). ఓ మునీ! శంకరుడు లోకాచారమును ప్రదర్శించువాడై భూమిని స్పృశించి కామస్య కోక్ దాత్ ఇత్యాది మంత్రమును శ్రద్ధగా పఠించెను (42). అంతటా మహానందమునిచ్చే మహోత్సవము ఆరంభమయ్యెను. భూమి యందు, అంతరిక్షము నందు, స్వర్గమునందు జయధ్వానములు బయలు దేరెను (43). అందరు ఆనందముతో 'బాగు, నమస్కారము' అనుచుండిరి. గంధర్వులు ఆనందముతో పాడగా అప్సరసలు నాట్యమాడిరి (44).

హిమాచలస్య పౌరా హి ముముదుశ్చాతి చేతసి ।
మంగలం మహదాసీద్వై మహోత్సవపుర స్సరమ్ ॥
అహం విష్ణుశ్చ శక్రశ్చ నిర్జరా మునయోఽ ఖిలాః ।
హర్షితా హ్యభవంశ్చాతి ప్రఫుల్ల వదనాంబుజాః ॥
అథ శైలవరస్సోఽ దాత్ సుప్రసన్నో హిమాచలః ।
శివాయ కన్యాదానస్య సాంగతాం సుయథోచితామ్ ॥
తతో బంధు జనాస్తస్య శివాం సంపూజ్య భక్తితః ।
దదుశ్శివాయ స ద్ద్రవ్యం నానావిధి విధానతః ॥

హిమవంతుని రాజ్యములోని పౌరులు మనస్సులో చాల ఆనందించిరి. గొప్ప మంగళ శబ్దములతో కూడిన మహోత్సవము ప్రవర్తిల్లెను (45). నేను, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మునులు, అందరు వికసించిన ముఖ పద్మములు గలవారై మిక్కిలి ఆనందించితిమి (46). అపుడు ఆ పర్వతరాజగు హిమవంతుడు మిక్కిలి ప్రసన్నుడై శివునకు కన్యాదానాంగముగా యథోచితమగు పురస్కారమునిచ్చెను (47). అపుడా హిమవంతుని బంధువులు పార్వతిని భక్తితో పూజించి విధి విధానముగా అనేక మంచి ద్రవ్యములను శివునకిచ్చిరి (48).

హిమాలయస్తుష్టమనాః పార్వతీ శివ ప్రీతయే ।
నానావిధాని ద్రవ్యాణి దదౌ తత్ర మునీశ్వర ॥
కౌతుకాని దదౌ తస్మై రత్నాని వివిధాని చ ।
చారురత్న వికారాణి పాత్రాణి వివిధాని చ ॥
గవాం లక్షం హయానాం చ సజ్జితానాం శతం తథా ।
దాసీనామనురక్తానాం లక్షం స ద్రవ్య భూషితమ్ ॥
నాగానాం శతలక్షం హి రథానాం చ తథా మునే ।
సువర్ణ జటితానాం చ రత్నసార వినిర్మితమ్ ॥

ఓ మహర్షీ! అపుడు సంతసించిన మనస్సు గల హిమవంతుడు శివ పార్వతుల ఆనందము కొరకు బహు విధముల ద్రవ్యముల నొసంగెను. (49). ఆయనకు వివిధ రత్నములను, రత్నములతో చేసిన సుందరమగు ఆభరణములను, వివిధ పాత్రలను, రక్షా బంధములను ఇచ్చెను (50). లక్ష గోవులు, సవారీకి సజ్జితము చేయబడిన వంద గుర్రములు, చక్కని ఆభరణములతో అలంకరింపబడి అనురాగము కలిగిన లక్ష దాసీలు (51), కోటి ఏనుగులు, కోటి బంగరు రథములు ఈయబడెను. ఓ మునీ! ఆ రథములలో శ్రేష్ఠరత్నములు పొదుగబడెను (52).

ఇత్థం హిమాలయో దత్త్వా స్వసుతాం గిరిజాం శివామ్ ।
శివాయ పరమేశాయ విధినాఽఽప కృతార్థతామ్ ॥
అథ శైలవరో మాధ్యందినోక్త స్తోత్రతో ముదా ।
తుష్టావ పరమేశానం సద్గిరా సుకృతాంజలిః ॥
తతో వేదవిదా తేనా జ్ఞప్తా ముని గణాస్తదా ।
శిరోఽ భిషేకం చక్రుస్తే శివాయాః పరమోత్సవాః ॥
దేవాధానముచ్చార్య పర్యుక్షణవిధిం వ్యధుః ।
మహోత్సవస్తదా చాసీన్మహానందకరో మునే ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీఖండే కన్యాదాన వర్ణనం నామ అష్టాచత్వారింశోఽధ్యాయః ॥

ఈ విధముగా హిమవంతుడు తన కుమార్తె యగు పార్వతిని పరమేశ్వరుడగు శివునకు యథావిధిగా ఇచ్చి కృతార్థుడాయెను (53). అపుడు ఆ పర్వతరాజు చేతులు జోడించి శుక్లయజుర్వేద మాధ్యం దిన శాఖ యందలి స్తోత్రమును చక్కని స్వరముతో పఠించి ఆనందముతో పరమేశ్వరుని స్తుతించెను (54). తరువాత వేదవేత్త యగు ఆ హిమవంతునిచే ఆజ్ఞాపించబడిన మహర్షులు అపుడు పరమోత్సాహముతో పార్వతిని శిరస్సుపై అభిషేకించిరి (55). ఓ మునీ! వారు అపుడు శివుని నామమును ఉచ్చరించి యథావిధిగా ప్రోక్షణమును చేసిరి. అచట మహానందమును కలిగించు మహోత్సవము ప్రవర్తిల్లెను (56).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో కన్యాదాన వర్ణనము అనే నలుబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (48).

49 – బ్రహ్మ మోహితుడగుట

బ్రహ్మోవాచ ।

అథో మమాజ్ఞయా విప్రైస్సంస్థాప్యానలమీశ్వరః ।
హోమం చకార తత్రైవమంకే సంస్థాప్య పార్వతీమ్ ॥
ఋగ్యజుస్సామ మంత్రైశ్చాహుతిం వహ్నౌ దదౌ శివః ।
లాజాంజలిం దదౌ కాలీ భ్రాతా మైనాక సంజ్ఞకః ॥
అథ కాలీ శివశ్చోభౌ చక్రతుర్విధివన్ముదా ।
వహ్నిః ప్రదక్షిణాం తాత లోకాచారం విధాయ చ ॥
తత్రాద్భుత మరం చక్రే చరితం గిరిజాపతిః ।
తదేవ శృణు దేవర్షే తవ స్నేహాద్బ్రవీమ్యహమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అపుడు నా ఆజ్ఞచే బ్రాహ్మణులు అగ్నిని వ్రేల్చిరి. ఈశ్వరుడు పార్వతి ప్రక్కన కూర్చుండగా హోమమును చేసెను (1). శివుడు ఋగ్యజుస్సామవేద మంత్రములచే అగ్ని యందు ఆహుతులనిచ్చెను. కాళి సోదరుడగు మైనాకుడు లాజహోమమును చేయించెను (2). కుమారా! అపుడు పార్వతీ పరమేశ్వరులిద్దరు లోకాచారముననుసరించి యథావిధిగా ఆనందముతో అగ్నికి ప్రదక్షిణమును. చేసిరి (3). అచట వెంటనే పార్వతీ పతి అద్భుతమగు వృత్తాంతమును చేసెను. ఓ దేవ! దానిని వినుము. నీ యందలి ప్రేమచే నేను చెప్పు చున్నాను (4).

తస్మిన్నవసరే చాహం శివమాయా విమోహితః ।
అపశ్యం చరణే దేవ్యా నఖేందుం చ మనోహరమ్ ॥
దర్శనాత్తస్య చ తదా ఉభూవం దేవమునే హ్యహమ్ ।
మదనేన సమావిష్టోఽతీవ క్షుభితమానసః ॥
ముహుర్ముహురపశ్యం వై తదంగం స్మరమోహితః ।
తతస్తద్దర్శనాత్సద్యో వీర్యం మే ప్రాచ్యుతద్భువి ॥
తద్ జ్ఞాత్వా చ మహా దేవశ్చుకోపాతీవ నారద ।
హంతుమైచ్ఛత్తదా శీఘ్రం విధిం మాం కామమోహితమ్ ॥

ఆ సమయములో శివమాయచే విమోహితుడనైన నేను ఆ దేవి యొక్క పాదములను, చంద్రవంక వంటి కాలి నఖములను గాంచితిని (5). ఓ దేవర్షీ! ఆ నఖచంద్రుని దర్శనముచే నా యందు కామ వికారము ఆవేశించి నా మనస్సు అల్లకల్లోలమాయెను (6). నేను కామ మోహితుడనై ఆమె పాదములను తేరిపార జూచితిని (7). ఓ నారదా! నాకామ వికారమును గమనించిన మహాదేవుడు మిక్కిలి కోపించి నన్ను చంపుటకు ఉద్యమించెను (8).

హాహాకారో మహానాసీత్తత్ర సర్వత్ర నారద ।
జనాశ్చకంపిరే సర్వే భయ మాయాతి విశ్వభృత్ ॥
తతస్సంతుష్టువుశ్శంభుం విష్ణ్వాద్యా నిర్జరా మునే ।
సకోపం ప్రజ్వలంతం తం తేజసా హంతు ముద్యతమ్ ॥

ఓ నారదా! అపుడచట పెద్ద హాహాకారము చెలరేగెను. జనులందరు వణికిపోయిరి. విష్ణువు కూడ భయపడెను (9). ఓ మునీ! కోపముతో మండి పడుతూ సంహరించుటకు ఉద్యమించుచున్న ఆ శంభుని విష్ణువు మొదలగు దేవతలు స్తుతించిరి (10).

దేవా ఊచుః ।

దేవ దేవ జగద్వ్యాపిన్ పరమేశ సదాశివ ।
జగదీశ జగన్నాథ సంప్రసీద జగన్మయ ॥
సర్వేషామపి భావానాం త్వమాత్మా హేతురీశ్వరః ।
నిర్వికారోఽవ్యయో నిత్యో నిర్వికల్పోఽక్షరః పరః ॥
ఆ ద్యంతావస్య యన్మ ధ్యమిదమన్య దహం బహిః ।
యతోఽ వ్యయస్స నైతాని తత్సత్యం బ్రహ్మ చిద్భవాన్ ॥
తవైవ చరణాంభోజం ముక్తి కామా దృఢవ్రతాః ।
విసృజ్యో భయతస్సంగం మునయస్సముపాసతే ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! జగత్తును వ్యాపించి యున్నవాడా! పరమేశ్వరా! సదాశివా! జగత్ప్రభూ! జగన్నాథా! జగత్స్వ రూపా! ప్రసన్నుడవు కమ్ము (11). సర్వ ప్రాణులకు ఆత్మ, కారణము, ఈశ్వరుడు నీవే. నీవు వికార రహితుడవు,. నాశము లేనివాడవు. నిత్యము, నిర్వికల్పము, అక్షరము అగు పరబ్రహ్మవు నీవే (12). ఆది, అంతము, మధ్యము, ఇది, మరియొకటి, నేను, నాకంటె భిన్నము ఇత్యాది భేదములు లేనిది అవ్యయము, సచ్చిద్ఘనము అగు ఆ పరబ్రహ్మ నీవే (13). ముముక్షువులు, దృఢవ్రతులు అగు మునులు ఇహపరముల యందు సంగమును వీడి నీ పాద పద్మములను మాత్రమే సేవించెదరు (14).

త్వం బ్రహ్మ పూర్ణమమృతం విశోకం నిర్గుణం పరమ్ ।
ఆనందమాత్ర మవ్యగ్రమవికారమనాత్మకమ్ ॥
విశ్వస్య హేతు రుదయ స్థితి సంయమనస్య హి ।
తదపేక్షతయాత్మేశోఽన పేక్షస్సర్వదా విభుః ॥
ఏకస్త్వ మేవ సద సద్ద్వయమద్వయమేవ చ ।
స్వర్ణం కృతా కృతమివ వస్తు భేదో న చైవ హి ॥
అజ్ఞానతస్త్వయి జనైర్వికల్పో విదితో యతః ।
తస్మాద్భ్రమ ప్రతీకారో నిరుపాధేర్న హి స్వతః ॥

పూర్ణము, అమృతము, శోకరహితము, నిర్గుణము, ఆనందఘనము, వ్యగ్రత లేనిది, వికారములు లేనిది, ఉపాధి కంటె భిన్నమైనది అగు పర బ్రహ్మ నీవే (15). జగత్తు యొక్క సృష్టి స్థితిలయములకు కారణము నీవే. ఆ జగత్తునకు ఆత్మ, ప్రభుడు నీవే. సర్వ వ్యాపకుడవగు నీవు ఏనాడైననూ జగత్తుపై ఆధారపడి లేవు (16). నీవు ఒక్కడివే అయిననూ కార్య కారణ రూపములను పొంది ద్వైతముగను, అద్వైత స్వరూపుడగను ఉన్నావు. ఒకే బంగారము ఆభరణములుగను, స్వరూపముగను ఉన్నది గదా! వస్తు భేదము లేనే లేదు (17). జనులు అజ్ఞానముచే నీ యందు భేదమును దర్శించెదరు. కావున భ్రమను నివారించుట ఆవశ్యకమగు చున్నది. ఉపాధికి అతీతుడవగు నీయందు భేదము లేదు (18).

ధన్యా వయం మహేశాన తవ దర్శన మాత్రతః ।

దృఢ భక్త జనానందప్రద శంభో దయాం కురు ॥

త్వమాదిస్త్వమనాదిశ్చ ప్రకృతేస్త్వం పరః పుమాన్ ।

విశ్వేశ్వరో జగన్నాథో నిర్వికారః పరాత్పరః ॥

యో౽ యం బ్రహ్మాస్తి రజసా విశ్వమూర్తిః పితామహః ।

త్వత్ప్రసాదాత్ప్రభో విష్ణు స్సత్త్వేన పురుషోత్తమః ॥

మహేశ్వరా! నీ దర్శన మాత్రముచే మేము ధన్యులమైతిమి. దృఢమగు భక్తితి గల మానవులకు ఆనందమునిచ్చే ఓ శంకరా! దయను చూపుము (19). జగత్తునకు నీవే కారణము. కాని నీకు కారణము లేదు. ప్రకృతికి అతీతుడగు పురుషుడవు నీవే. నీవు విశ్వేశ్వరుడవు, జగన్నాథుడవు, వికారములు లేని వాడవు, పరాత్పరుడవు (20). హే ప్రభో! ఈ బ్రహ్మ నీ అనుగ్రహముచే రజోగుణ ప్రధానుడై విరాడ్రూపుడు, లోకమునకు పితామహుడు అయినాడు. సత్త్వ గుణ ప్రధానుడగు విష్ణువు పురుషోత్తముడైనాడు (21).

కాలాగ్ని రుద్రస్తమసా పరమాత్మా గుణైః పరః ।

సదాశివో మహేశాన స్సర్వవ్యాపీ మహేశ్వరః ॥

వ్యక్తం మహచ్చ భూతాది స్తన్మాత్రాణీంద్రియాణి చ ।

త్వయై వాధిష్ఠితాన్యేవ విశ్వమూర్తే మహేశ్వర ॥

మహాదేవ పరేశాన కరుణా కర శంకర ।

ప్రసీద దేవ దేవేశ ప్రసీద పురుషోత్తమ ॥

వాసాంసి సాగరాస్సప్త దిశశ్చైవ మహాభుజాః ।

ద్యౌర్మూర్ధా తే విభోర్నాభిః ఖం వాయుర్నాసికా తతః ॥

ఆయనయే తమోగుణ ప్రధానుడై కాలాగ్ని రుద్రుడైనాడు. కాని పరమాత్మ గుణాతీతుడు. ఆయన సదా శివుడు, సర్వవ్యాపి, మహేశ్వరుడు (22). ఓ విశ్వమూర్తీ! మహేశ్వరా! అవ్యక్తము నుండి పుట్టిన భూతాదియగు మహత్తత్త్వము, భూత తన్మాత్రలు, మరియు ఇంద్రియములు నీ చేతనే అధిష్ఠితములై ఉన్నవి (23). మహాదేవా! పరమేశ్వరా! కరుణానిధీ! శంకరా! దేవదేవా! ఈశ్వరా! పురుషోత్తమా! ప్రసన్నుడవు కమ్ము (24). సప్త సముద్రములు నీ వస్త్రములు. దిక్కులు నీ మహాభుజములు. ద్యులోకము నీ శిరస్సు. ఆకాశము నాభి. వాయువు నాసిక (25).

చక్షూంష్యగ్నీ రవిస్సోమః కేశా మేఘాస్తవ ప్రభో ।
నక్షత్ర తారకాద్యాశ్చ గ్రహాశ్చైవ విభూషణమ్ ॥
కథం స్తోష్యామి దేవేశ త్వాం విభో పరమేశ్వర ।
వాచామగో చరోఽసి త్వం మనసా చాపి శంకర ॥
పంచాస్యాయ చ రుద్రాయ పంచాశత్కోటి మూర్తయే ।
త్ర్యధిపాయ వరిష్ఠాయ విద్యాతత్త్వాయ తే నమః ॥
అనిర్దేశ్యాయ నిత్యాయ విద్యుజ్జ్వాలాయ రూపిణే ।
అగ్ని వర్ణాయ దేవాయ శంకరాయ నమో నమః ॥
విద్యుత్కోటి ప్రతీకాశమష్ట మూర్తిం సుశోభనమ్ ।
రూపమాస్థాయ లోకేఽస్మిన్ సంస్థితాయ నమో నమః ॥

అగ్ని, సూర్యుడు, చంద్రుడు నీ కన్నులు. ఓ ప్రభూ! మేఘములు నీ కేశములు. నక్షత్రములు, గ్రహములు మొదలగునవి నీ అలంకారములు (26). ఓ దేవదేవా! విభూ! పరమేశ్వరా! నేను నిన్ను ఎట్లు స్తోత్రము చేయగలను? నీవు వాక్కులకు అందవు. ఓ శంకరా! నీవు మనస్సునకైననూ గోచరము కావు (27). ఐదు మోములు గలవాడు, ఏభై కోట్ల రూపములు గలవాడు, భూర్భువస్సువర్లోకములకు ప్రభువు, సర్వోత్తముడు, జ్ఞాన స్వరూపుడు అగు రుద్రునకు నమస్కారము (28). ఇదమిత్థముగా నిర్దేశింప శక్యము కానివాడు, నిత్యుడు, విద్యుత్తువలె ప్రకాశించు రూపముగలవాడు అగు శంకర దేవునకు అనేక అభివాదములు (29). కోటి విద్యుత్తుల కాంతి గలవాడు, సుందరమగు ఎనిమిది రూపములను ధరించి లోకమంతయూ వ్యాపించి యున్నవాడు అగు శంకరునకు అనేక నమస్కారములు (30).

బ్రహ్మోవాచ।

ఇత్యాకర్ణ్య వచస్తేషాం ప్రసన్నః పరమేశ్వరః ।
బ్రహ్మణో మే దదౌ శీఘ్రమభయం భక్తవత్సలః ॥
అథ సర్వే సురాస్తత్ర విష్ణ్వాద్యా మునయస్తథా ।
అభవన్ సుస్మితాస్తాత చక్రుశ్చ పరమోత్సవమ్ ॥
ఋషయో బహవో జాతా వాలఖిల్యాస్సహస్రశః ।
కణకై స్తైశ్చ వీర్యస్య ప్రజ్వలద్భి స్స్వతేజసా ॥
అథ తే హ్యృషయస్సర్వే ఉపతస్థుస్తదా మునే ।
మమాంతికం పరప్రీత్యా తాత తాతేతి చాబ్రువన్ ॥
ఈశ్వరేచ్ఛా ప్రయుక్తేన ప్రోక్తాస్తే నారదేన హి ।
వాలఖిల్యాస్తు తే తత్ర కోపయుక్తేన చేతసా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వారి ఈ మాటలను విని భక్తవత్సలుడగు పరమేశ్వరుడు ప్రసన్నుడై బ్రహ్మనగు నాకు వెంటనే అభయము నిచ్చెను (31). ఓ కుమారా! అపుడచట విష్ణువు మొదలగు దేవతలు, మునులు చిరునవ్వు గలవారై మహోత్సవమును చేసుకొనిరి (32), ఆ వీర్యకణములనుండి గొప్ప తేజస్సుతో ప్రకాశించే వాలఖిల్యులను వేలాది ఋషులు జన్మించిరి (33). ఓ మునీ! అపుడా ఋషులు పరమానందముతో తండ్రీ! తండ్రీ! అని పలుకుతూ అందరు నా సమీపమునకు వచ్చి నిలబడిరి (34). కోపముతో నిండిన మనస్సు గల నారదుడు ఈశ్వరుని సంకల్పముచే ప్రేరితుడై ఆ వాలఖిల్యులతో నిట్లనెను (35).

నారద ఉవాచ ।

గచ్ఛ ధ్వం సంగతా యూయం పర్వతం గంధమాదనమ్ ।
న స్థాతవ్యం భవద్భిశ్చ న హి వోఽ త్ర ప్రయోజనమ్ ॥
తత్ర తప్త్వా తపశ్చాతి భవితారో మునీశ్వరాః ।
సూర్య శిష్యా శ్శివస్యైవాజ్ఞయా మే కథితం త్విదమ్ ॥

నారదుడిట్లు పలికెను -

మీరందరు కలసి గంధమాదన పర్వతమునకు వెళ్లుడు. ఇచ్చట మీకు ప్రయోజనము లేదు. కావున మీరిచట ఉండవలదు (36). అచట మీరు గొప్ప తపస్సును చేసి. మునీశ్వరులై సూర్యునకు శిష్యులు కాగలరు. నేను ఈ మాటను శివుని ఆజ్ఞ చేతనే చెప్పుచున్నాను (37).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్తాస్తే తదా సర్వే వాలఖిల్యాశ్చ పర్వతమ్ ।
సత్వరం ప్రయయుర్నత్వా శంకరం గంధమాదనమ్ ॥
విష్ణ్వాదిభిస్తదా భూవం శ్వాసితోఽహం మునీశ్వర ।
నిర్భయః పరమేశాన ప్రేరితైస్తైర్మహాత్మ భిః ॥
అస్తవం చాపి సర్వేశం శంకరం భక్తవత్సలమ్ ।
సర్వకార్యకరం జ్ఞాత్వా దుష్టగర్వాపహారకమ్ ॥
దేవ దేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।
త్వమేవ కర్తా సర్వస్య భర్తా హర్తా చ సర్వథా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

నారదుడిట్లు పలుకగా ఆ వాలఖిల్యులందరు అపుడు శంకరునకు ప్రణమిల్లి వెంటనే గంధమాదన పర్వతమునకు వెళ్లిరి (38). ఓ మహర్షీ! అపుడు పరమేశ్వరునిచే ప్రేరితులై మహాత్ములగు విష్ణువు మొదలగు వారు నన్ను ఓదార్చగా, నేను భయమును విడనాడితిని (39). శంకరుడు సర్వేశ్వరుడు, భక్తవత్సలుడు, కార్యములనన్నిటినీ చక్క బెట్టు వాడు, దుష్టుల గర్వమును అడంచువాడు అని యెరింగి నేనాయనను స్తుతించితిని (40). దేవదేవా! మహాదేవా! కరుణా సముద్రా! ప్రభూ! సర్వమునకు సర్వ విధములుగా నీవే కర్తవు, భర్తవు, హర్తవు (41).

త్వదిచ్ఛయా హి సకలం స్థితం హి సచరాచరమ్ ।
తంత్యాం యథా బలీవర్దా మయా జ్ఞాతం విశేషతః ॥
ఇత్యేవ ముక్త్వా సోఽహం వై ప్రణామం చ కృతాంజలిః ।
అన్యేఽపి తుష్టువుస్సర్వే విష్ణ్వాద్యాస్తం మహేశ్వరమ్ ॥
అథాకర్ణ్య నుతిం శుద్ధాం మమ దీనతయా తదా ।
విష్ణ్వా దీనాం చ సర్వేషాం ప్రసన్నోఽ భూన్మహేశ్వరః ॥
దదౌ సోఽతి వరం మహ్యమభయం ప్రీతమానసః ।
సర్వే సుఖమతీవాపు రత్యమోదమహం మునే ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే విధిమోహ వర్ణనం నామ నవచత్వారింశోఽధ్యాయః ॥

త్రాటికి అధీనములో నుండి నడిచే ఎద్దులు వలె ఈ చరా చర జగత్తు అంతా నీ సంకల్పమునకు లోబడి నడచు చున్నదని నేను తెలుసుకున్నాను. ఈ విశిష్టజ్ఞానము నాకు కలిగినది (42). నేను ఇట్లు పలికి చేతులు జోడించి నమస్కరించితిని. విష్ణువు మొదలగు ఇతరులు కూడా అందరు ఆ మహేశ్వరుని స్తుతించిరి (43). నేను దీనముగా చేసిన శుద్ధమగు ప్రార్థనను, విష్ణువు మొదలగు వారందరి ప్రార్థనను విని అపుడు మహేశ్వరుడు ప్రసన్నుడాయెను (44). ప్రీతిని పొందిన మనస్సు గల ఆయన నాకు అభయమును వరముగా నొసంగెను. ఓ మునీ! అందరు అధిక సుఖమును పొందిరి. నేను మహానందమును పొందితిని (45).

Scanned with OKEN Scanner

50 – పరిహాసములు

బ్రహ్మోవాచ ।

తతశ్చాహం మునిగణైః శేషం కృత్యం శివాజ్ఞయా ।
అకార్షం నారద ప్రీత్యా శివాశివ వివాహతః ॥
తయోశ్శిరోఽభిషేకశ్చ బభూవాదరతస్తతః ।
ధ్రువస్య దర్శనం విప్రాః కారయామాసురా దరాత్ ॥
హృదయాలంభనం కర్మ బభూవ తదనంతరమ్ ।
స్వస్తి పాఠశ్చ విప్రేంద్ర మహోత్సవపురస్సరః ॥
శివాశిరసి సిందూరం దదౌ శంభుర్ద్విజాజ్ఞయా ।
తదానీం గిరిజాభిఖ్యాద్భుతావర్ణ్యా బభూవ హ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ నారదా! తరువాత నేను శివుని ఆజ్ఞచే పార్వతీ పరమేశ్వరుల వివాహములో మిగిలిన కార్యమును ముని గణములతో గూడి ప్రీతితో చేసితిని (1). బ్రాహ్మణులు వారద్దరికి తరువాత శిరస్సులపై అభిషేకమును సాదరముగా జరిపించిరి. తరువాత ధ్రువనక్షత్ర దర్శనమును చేయించిరి (2). ఆ తరువాత హృదయమును స్పృశించుట అను కర్మ జరుపబడెను. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! స్వస్తి పఠనము మహోత్సవముతో సాగెను (3). శంభుడు బ్రాహ్మణుల ఆజ్ఞచే పార్వతి శిరస్సుపై సిందూరమునుంచెను. అపుడు పార్వతి వర్ణింపశక్యము కాని అద్భుత సౌందర్యముతో నలరారెను (4).

తతో విప్రాజ్ఞయా తౌ ద్వావేకాసన సమాస్థితౌ ।
లేభాతే పరమాం శోభాం భక్తచిత్తముదా వహామ్ ॥
తతస్స్వ స్థానమాగత్య సంస్రవ ప్రాశనం ముదా ।
చక్రతుస్తౌ నిదేశాన్మేఽద్భుత లీలాకరౌ మునే ॥
ఇత్థం నివృత్తే విధివద్యా జ్ఞే వైవాహికే శివః ।
బ్రహ్మణే పూర్ణ పాత్రం మే దదౌ లోకకృతే ప్రభుః ॥
గోదానం విధివచ్ఛంభు రాచార్యాయ దదౌ తతః ।
మహాదానాని చ ప్రీత్యా యాని మంగళదాని వై ॥

అపుడు బ్రాహ్మణుల ఆజ్ఞచే వారిద్దరు ఒకే ఆసనమునందు గూర్చుండి పరమశోభను కలిగియుండిరి. ఆ దృశ్యమునకు భక్తుల చిత్తములు ఉప్పొంగును (5). ఓ మునీ! తరువాత అద్భుతమైన లీలలను ప్రదర్శించే ఆ దంపతులు నా ఆదేశముచే తమ స్థానములకు వచ్చి హోమ శేషద్రవ్యమును ఆనందముతో భుజించిరి (6). ఈ తీరున వివాహయజ్ఞము యథావిధిగా సంపన్నము కాగా, శివప్రభుడు సృష్టికర్త, బ్రహ్మ అగు నాకు పూర్ణ పాత్రను ఇచ్చెను (7). తరువాత శంభుడు యథావిధిగా గోదానమును ఆచార్యునకిచ్చి, మంగళములనిచ్చే మహాదానములను కూడా ప్రీతితో చేసెను (8).

తతశ్శతసువర్ణం చ విప్రేభ్యస్స దదౌ పృథక్ ।
బహుభ్యో రత్నకోటీశ్చ నానాద్రవ్యాణ్యనే కశః ॥
తదానీమమరాస్సర్వే పరే జీవాశ్చరాచరాః ।
ముముదుశ్చేతసా తీవ బభూవాతి జయధ్వనిః ॥
మంగలధ్వనిగానం చ బభూవ బహు సర్వతః ।
వాద్య ధ్వనిరభూద్రమ్యో సర్వానందప్రవర్ధనః ॥
హరిర్మయాథ దేవాశ్చ మునయశ్చాపరేఽఖిలాః ।
గిరిమామంత్ర్య సుప్రీత్యా స్వస్థానం ప్రయయు ర్ద్రుతమ్ ॥

తరువాత ఆయన బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి వంద సువర్ణముల నిచ్చెను. మరియు కోట్ల కొలది రత్నములను, వివిధ ద్రవ్యములను అనేక మందికి ఇచ్చెను (9). అపుడు సర్వ దేవతలు, ఇతరములగు చరాచర ప్రాణులు మనస్సులో చాల ఆనందించి జయధ్వనులను చేసిరి (10). సర్వత్ర అనేక మంగళధ్వనులు, గానములు ఆరంభమయ్యెను. సర్వులకు ఆనందమును పెంపొందించే రమ్యమగు వాద్యధ్వని చెలరేగెను (11). విష్ణువు, నేను, దేవతలు, మునులు, ఇతరులు అందరు హిమవంతుని అనుమతిని పొంది మహానందముతో వెంటనే వారి వారి స్థానములకు వెళ్లితిమి (12).

తదానీం శైలనగరే స్త్రియశ్చ ముదితా వరమ్ ।
శివాశివౌ సమానీయ యయుః కుహవరాలయమ్ ॥
లౌకికాచార మాజహ్రుస్తాస్స్త్రి యస్తత్ర చాదృతాః ।
మహోత్సాహో బభూవాథ సర్వతః ప్రముదావహః ॥
అథ తాస్తౌ సమానీయ దంపతీ జనశంకరౌ ।
వాసాలయం మహాదివ్యం భవాచారం వ్యధుర్ముదా ॥
అథో సమీపమాగత్య శైలేంద్ర నగరస్త్రియః ।
నిర్వృత్య మంగలం కర్మ ప్రాపయన్ దంపతీ గృహమ్ ॥

అపుడు హిమవంతుని రాజధానిలో స్త్రీలు మహానందముతో పార్వతీ పరమేశ్వరులను తోడ్కొని హిమవంతుని గృహమునకు వెళ్లిరి (13). ఆ స్త్రీలు సాదరముగా లోకాచారములను నిర్వర్తింపజేసిరి. అంతటా ఆనందదాయకమగు మహోత్సాహము వెల్లివిరిసెను (14). అపుడు వారు జనులకు కల్యాణమును చేసే ఆది దంపతులగు పార్వతీ పరమేశ్వరులను మహాదివ్యమగు వాసగృహమునకు తోడ్కొని వెళ్లి ఆనందముతో లోకాచారములను నెరపిరి (15). అపుడు హిమవంతుని రాజధానిలోని స్త్రీలు వారి దగ్గరకు వచ్చి మంగళకర్మలను చేయించి దంపతులను వాసగృహములో ప్రవేశపెట్టిరి (16).

కృత్వా జయధ్వనిం చక్రుర్గ్రంథివిరోచనాదికమ్ ।
సస్మితాస్సకటాక్షాశ్చ పులకాంచితవిగ్రహాః ॥
వాసగేహం సంప్ర విశ్య ముముహుః కామినీవరాః ।
ప్రశంసంత్యస్స్వభాగ్యాని పశ్యంతః పరమేశ్వరమ్ ॥
మహాసురూప వేషం చ సర్వలావణ్య సంయుతమ్ ।
నవీన యౌవనస్థం చ కామినీ చిత్త మోహనమ్ ॥
ఈషద్ధాస్య ప్రసన్నాస్యం సకటాక్షం సుసుందరమ్ ।
సుసూక్ష్మవాసో బిభ్రాణం నానారత్న విభూషితమ్ ॥
తదానీం దివ్యనార్యశ్చ షోడశారం సమాయయుః ।
తౌ దంపతీ చ సంద్రష్టుం మహా దరపురస్సరమ్ ॥

ఆ స్త్రీలు పులకించిన దేహములు గలవారై చిరునవ్వుతో ఒకరి నొకరు చూసుకొనుచూ జయధ్వనిని చేసి వధూవరుల వస్త్రముల ముడిని విప్పుట మొదలగు పనులను పూర్తి చేసిరి (17). ఆ ఉత్తమ స్త్రీలు వాసగృహమును ప్రవేశించి దాని శోభకు మోహమును పొందిరి. వారు పరమేశ్వరుని చూస్తూ తమ భాగ్యములను ప్రశంసించుకొనిరి (18). గొప్ప అందమైన రూపము వేషము గలవాడు, సొగసులన్నిటితో కూడి యున్నవాడు, నూతన యౌవనము నందున్నవాడు, స్త్రీల చిత్తమును మోహింప జేయువాడు (19), చిరునవ్వుతో ప్రసన్నమగు ముఖము గలవాడు, సుందరమగు చూపులు గలవాడు, విలువైన వస్త్రమును ధరించిన వాడు, అనేక రత్నాభరణములను అలంకరించు కున్నవాడు అగు శివుని జూచిరి (20). అపుడు ఆ దంపతులను చూచుటకు పదునార్గురు దివ్యస్త్రీలు వెంటనే మహాదరముతో విచ్చేసిరి (21).

సరస్వతీ చ లక్ష్మీశ్చ సావిత్రీ జాహ్నవీ తథా ।
అదితిశ్చ శచీ చైవ లోపాముద్రాప్యరుంధతీ ॥
అహల్యా తులసీ స్వాహా రోహిణీ చ వసుంధరా ।
శతరూపా చ సంజ్ఞా చ రతిరేతాస్సురస్త్రియః ॥
దేవకన్యా నాగకన్యా మునికన్యా మనోహరాః ।
తత్ర యా యాస్స్థితాస్తాసాం సంఖ్యాం కర్తుం చ కః క్షమః ॥
తాభీ రత్నాసనే దత్తే తత్రోవాస శివో ముదా ।
తమూచుః క్రమతో దేవ్యస్సుహాసం మధురం వచః ॥

సరస్వతి, లక్ష్మి, సావిత్రి, గంగ, అదితి, శచి, లోపాముద్ర, అరుంధతి (22), అహల్య, తులసి, స్వాహా, రోహిణి, పృథివి, శతరూప, సంజ్ఞ, రతి అను దేవతా స్త్రీలు విచ్చేసిరి (23). అక్కడ ఉన్న మనోహరలగు దేవకన్యలు, నాగకన్యలు, మునికన్యలు అందరు విచ్చేసిరి. వారి సంఖ్యను చెప్పగలిగే సామర్థ్యము ఎవరికి గలదు? (24) వారు సమర్పించిన రత్నమయమగు ఆసనమునందు శివుడానందముతో కూర్చుండెను. అపుడా దేవీ మూర్తులు క్రమముగా ఆయనతో చిరునవ్వుతో గూడిన మధురవచనములిట్లు పలికిరి (25).

సరస్వత్యువాచ ।

ప్రాప్తా సతీ మహాదేవాధునా ప్రాణాధికా ప్రియా ।
దృష్ట్వా ప్రియాస్యం చంద్రాభం సంతాపం త్యజ కాముక ॥
కాలం గమయ కాలేశ సతీ సంశ్లేష పూర్వకమ్ ।
విశ్లేషస్తే న భవితా సర్వకాలం మమాశ్రితా ॥

సరస్వతి ఇట్లు పలికెను -

మహాదేవా! ఇపుడు నీకు ప్రాణముల కంటే అధిక ప్రియురాలగు సతీదేవి లభిం◌ిచినది. ఓయీ సుందరా! ప్రియురాలి చంద్రుని వంటి ముఖమును చూచి తాపమును వీడుము (26). ఓయీ కాలనియంతా! నీవు సతితో కలిసి కాలమును గడుపుము. మీకు వియోగము ఏ కాలము నందైననూ ఉండబోదు. పార్వతి నాకు ఆశ్రితురాలు కాగలదు (27).

లక్ష్మీ రువాచ ।

లజ్జాం విహాయ దేవేశ సతీం కృత్వా స్వవక్షసి ।
తిష్ఠ తాం ప్రతి కా లజ్జా ప్రాణా యాంతి యయా వినా ॥

లక్ష్మీ దేవి ఇట్లు పలికెను -

ఓ దేవ దేవా! సిగ్గును వీడి సతిని నీ గుండెలలో దాచు కొనుము. ఆమె లేనిదే నీకు ప్రాణములు నిలువవు. ఆమె విషయములో లజ్జ యేల? (28)

సావిత్ర్యువాచ ।

భోజయిత్వా సతీం శంభో శీఘ్రం త్వం భుంక్ష్వ మా ఖిదః ।
తదాచమ్య సకర్పూరం తాంబూలం దేహి సాదరమ్ ॥

సావిత్రి ఇట్లు పలికెను -

ఓ శంభూ! సతిని భుజింపజేసి నీవు శీఘ్రమే భుజించుము. ఖేదమును పొందకుము. తరువాత నీటిని త్రాగి కర్పూర తాంబూలమును ఆమెకు ఆదరముతో నిమ్ము (29).

జాహ్నవ్యువాచ ।

స్వర్ణ కాంతి కరాం ధృత్వా కేశాన్మార్జయ యోషితః ।
కామిన్యా స్స్వామి సౌభాగ్య సుఖం నాతః పరం భవేత్ ॥

గంగా దేవి ఇట్లు పలికెను -

బంగరు కాంతి గల ప్రియురాలి చేతిని బట్టుకొని కేశములను సరిచేయుము◌ు.. ప్రభువునకు లభించే సౌభాగ్య సుఖము ఇంతకంటె గొప్పది ఉండబోదు (30).

అదితిరువాచ ।

భోజనాంతే శివం శంభుం ముఖశుద్ధ్యర్థమాదరాత్ ।
జలం దేహి మహాప్రీత్యా దంపతి ప్రేమ దుర్లభమ్ ॥

అదితి ఇట్లు పలికెను –

పార్వతీ! భోజనము తరువాత ఆ శివశంభునకు ముఖమును కడుగు కొనుటకై ఆదరముతో మహా ప్రేమతో నీటిని ఇమ్ము, ఇట్టి ప్రేమ దంపతుల మధ్య దుర్లభమైనది (31).

శచ్యువాచ ।

కృత్వా విలాపం య ద్ధేతో శ్శివాం కృత్వా చ వక్షసి ।
యో బభ్రామానశం మోహాత్ కా లజ్జా తే ప్రియాం ప్రతి ॥

ఎవతె కొరకై నీవు విలపించి రాత్రింబగళ్లు మోహముతో తిరుగాడితివో, అట్టి శివా◌ాదేవిని గుండెలో దాచుకొనుము. అట్టి ప్రియురాలి విషయములో లజ్జకు స్థానమేది? (32)

లోపాముద్రో వాచ ।

వ్యవహారోఽస్తి చ స్త్రీణాం భుక్త్వా వాసగృహే శివ ।
దత్త్వా తాంబూలం శివాయై శయనం కర్తుమర్హసి ॥

లోపాముద్ర ఇట్లు పలికెను –

ఓ శివా! వాస గృహములో భుజించిన తరువాత స్త్రీలకు పని మిగిలి యుండును. పార్వతికి తాంబూలమునిచ్చి నీవు శయనించవచ్చును (33).

అరుంధత్యు వాచ।

మయా దత్తాం సతీ మేనాం తుభ్యం దాతుమనీశ్చి తామ్ ।
వివిధం బోధయిత్వేమాం సురతిం కర్తు మర్హసి ॥

అరుంధతి ఇట్లు పలికెను –

మేన ఈమెను నీకు ఇచ్చి వివాహము చేయుటకు అంగీకరించలేదు. కాని నేను ఆమెకు పలిపలి విధముల బోధించి నీకు వివాహము చేయించితిని. కాన ఈమెను జాగరూకతతో పాలించుము (34).

అహల్యోవాచ।

వృద్ధావస్థాం పరిత్యజ్య హ్యతీవ తరుణో భవ ।
యేన మేనాను మన్యేత తాం సుతార్పిత మానసా ॥

అహల్య ఇట్లు పలికెను -

నీవు వృద్ధావస్థను విడిచి పెట్టి నవయువకుడవు కమ్ము. అట్లు చేయుట వలన, తన మనస్సును కుమార్తె పై లగ్నము చేసి యున్న మేన నిన్ను అంగీకరించును (35).

తులస్యువాచ ।

సతీ త్వయా పరిత్యక్తా కామో దగ్ధః పురా కృతః ।
కథం తదా వసిష్ఠశ్చ ప్రభో ప్రస్థాపితోఽధునా ॥

తులసి ఇట్లు పలికెను -

ఓ ప్రభూ! నీవు సతిని పరిత్యజించి, పూర్వము మన్మథుని దహించితివి. అట్టి నీవు ఈనాడు వసిష్ఠుని ఈమె కొరకై ఏల పంపితివి? (36).

స్వాహోవాచ ।

స్థిరో భవ మహాదేవ స్త్రీణాం వచసి సాంప్రతమ్ ।
వివాహే వ్యవహారేఽస్తి పురంధ్రీణాం ప్రగల్భతా ॥

స్వాహా దేవి ఇట్లు పలికెను -

మహా దేవా! ఇప్పుడు నీవు స్త్రీల మాటలను జవదాటకుము. వివాహమునందు, వ్యవహారము నందు స్త్రీలకు ప్రాగల్భ్యము కలదు (37).

రోహిణ్యువాచ ।

కామం పూరయ పార్వత్యాః కామశాస్త్ర విశారద ।
కురు పారం స్వయం కామీ కామినీ కామ సాగరమ్ ॥

రోహిణి ఇట్లు పలికెను -

ఓయీ కామశాస్త్ర విశారదా! పార్వతి కోర్కెను తీర్చుము. నీవు స్వయముగా కామివై కామినితో గూడి కామ సముద్రమును దాటుము (38).

వసుంధరో వాచ ।

జానాసి భావం భావజ్ఞ కామార్తానాం చ యోషితామ్ ।
న చ స్వం స్వామినం శంభో ఈశ్వరం పాతి సంతతమ్ ॥

వసుంధర ఇట్లు పలికెను -

ఓయీ! భావము నెరింగినవాడా! కోరిక గల యువతుల భావములు నీకు ఎరుకయే. ఓ శంభో! ధనము సమర్థుడగు ప్రభువును సర్వదా రక్షించదు (39).

శతరూపోవాచ ।

భోగం దివ్యం వినా భుక్త్వా నహి తుష్యేత్ క్షుధాతురః ।
యేన తుష్టిర్భవేచ్ఛంభో తత్కర్తు ముచితం స్త్రియాః ॥

శతరూప ఇట్లనెను -

ఆకలి గొన్న వానికి మృష్టాన్నమును భుజించనిదే ఆకలి తీరదు. ఓ శంభూ! ఏ కార్యము చే స్త్రీకి తృప్తి కలుగునో, ఆ పనిని చేయుట నీకు తగును (40).

సంజ్ఞోవాచ ।

తూర్ణం ప్రస్థాపయ ప్రీత్యా పార్వత్యా సహ శంకరమ్ ।
రత్న ప్రదీపం తాంబూలం తల్పం నిర్మాయ నిర్జనే ॥

సంజ్ఞ ఇట్లు పలికెను -

ఓసీ శతరూపా! నిర్జన స్థానములో తల్పమును ఏర్పాటు చేసి రత్న దీపమునమర్చి తాంబూలము నుంచి పార్వతీ పరమేశ్వరులను ప్రేమతో అచటకు వెంటనే పంపుము (41).

బ్రహ్మోవాచ ।

స్త్రీణాం తద్వచనం శ్రుత్వా తా ఉవాచ శివస్స్వయమ్ ।
నిర్వికారశ్చ భగవాన్ యోగీంద్రాణాం గురోర్గురుః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

స్త్రీల ఆ మాటలను విని వికారములు లేనివాడు, యోగివరుల గురువులకు గురువు అగు శివుడు వారితో స్వయముగా నిట్లనెను (42).

శంకర ఉవాచః

దేవ్యో న బ్రూత వచనమేవం భూతం మమాంతికమ్ ।
జగతాం మాతరస్సాధ్వ్యః పుత్రే చపలతా కథమ్ ॥

శంకరుడిట్లు పలికెను -

ఓ దేవీ మూర్తులారా! నా వద్ద ఇట్టి వచనములను పలుకకుడు. జగన్మాతలు, పతివ్రతలు అగు మీరు పుత్రుని విషయములో చాపల్యమునేల కలిగి యున్నారు? (43)

బ్రహ్మోవాచ ।

శంకరస్య వచశ్శ్రుత్వా లజ్జితాస్సురయోషితః ।

బభూవుస్సంభ్రమాత్తూష్ణీం చిత్ర పుత్తలికా యథా ॥

భుక్త్వా మిష్టాన్న మాచమ్య మహేశో హృష్టమానసః ।

సకర్పూరం చ తాంబూలం బుభుజే భార్యయా సహ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పరిహాస వర్ణనం నామ పంచాశత్తమోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

శంకరుని మాటవిని సిగ్గుపడిన ఆ దేవతా స్త్రీలు కంగారుపడి చిత్రమునందలి స్త్రీ◌ీమూర్తులవలె ఉలుకు పలుకు లేక ఉండిరి (44). మహేశ్వరుడు మృష్టాన్నమును భుజించి ఆచమనము చేసి ఆనందముతో కూడిన మనస్సు గలవాడై భార్యతో కలసి కర్పూర తాంబూలమును సేవించెను (45).

శ్రీ శివ మహాపురాణములో రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో పరిహాసవర్ణనమనే ఏ బదియవ అధ్యాయము ముగిసినది (50).

51 – కామ సంజీవనము

బ్రహ్మోవాచ ।

తస్మిన్నవసరే జ్ఞాత్వానుకూలం సమయం రతిః ।
సుప్రసన్నా చ తం ప్రాహ శంకరం దీనవత్సలమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అది అనుకూలమగు సమయమని తలంచిన రతీదేవి మిక్కిలి ప్రసన్నురాలై దీనవత్సలుడగు ఆ శంకరునితో నిట్లనెను (1).

రతిరువాచ ।

గృహీత్వా పార్వతీం ప్రాప్తం సౌభాగ్యమతిదుర్లభమ్ ।
కిమర్థం ప్రాణనాథో మే నిస్స్వార్థం భస్మ సాత్కృతః ॥
జీవ యాత్ర పతిం మే హి కామవ్యాపారమాత్మని ।
కురు దూరం చ సంతాపం సమవిశ్లేష హేతుకమ్ ॥
వివాహోత్సవ ఏతస్మిన్ సుఖినో నిఖిలా జనాః ।
అహమేకా మహేశాన దుఃఖితా స్వపతిం వినా ॥
సనాథాం కురు మాం దేవ ప్రసన్నో భవ శంకర ।
స్వోక్తం సమ్యగ్వి ధేహి త్వం దీనబంధో పరప్రభో ॥

రతి ఇట్లు పలికెను –

పార్వతిని వివాహమాడి నీవు మిక్కిలి దుర్లభమగు సౌభాగ్యమును పొందితివి. స్వార్థము నెరుంగని నా ప్రాణ ప్రియుడగు భర్త భస్మము చేయబడుటకు కారణమేమి? (2) ఈ సమయములో ఈ నా భర్తను బ్రతికించి నీ యందు ప్రేమ కార్యమును నింపు కొనుము. మనిద్దరకీ సమానముగా కలిగిన వియోగ దుఃఖమును దూరము చేయుము (3). ఓ మహేశ్వరా! ఈ వివాహ మహోత్సవములో అందరు జనులు ఆనందముగా నున్నారు. నేనొక్క తెను మాత్రమే భర్త లేని కారణముచే దుఃఖితురాలనై ఉన్నాను (4). ఓ దేవా! నా భర్తను బ్రతికించుము. ఓ శంకరా! ప్రసన్నుడవు కమ్ము. ఓ దీన బంధూ! మహాప్రభూ! నీమాటను నీవు కార్య రూపములో పెట్టుము (5).

త్వాం వినా కస్సమర్థోఽ త్ర త్రైలోక్యే సచరాచరే ।
నాశనే మమ దుఃఖస్య జ్ఞాత్వేతి కరుణాం కురు ॥
సోత్సవే స్వవివా హేఽస్మిన్ సర్వానంద ప్రదాయిని ।
సోత్సవామపి మాం నాథ కురు దీనకృపాకర ॥
జీవితే మమ నాథే హి పార్వత్యా ప్రియయా సహ ।
సువిహారః ప్రపూర్ణశ్చ భవిష్యతి న సంశయః ॥
సర్వం కర్తుం సమర్థోఽసి యతస్త్వం పరమేశ్వరః ।
కిం బహూక్త్యాత్ర సర్వేశ జీవయాశు పతిం మమ ॥

స్థావర జంగమాత్మకమగు ఈ ముల్లోకములలో నా దుఃఖమును నశింప చేయ గలవాడు నీవు తక్క మరియొకడు ఎవడు గలడు? ఈ సత్యము నెరింగి నా యందు దయను చూపుము (6). దీనులయందు దయను చూపే ఓ నాథా! సర్వులకు ఆనందమును వివాహము మహోత్సవముగా జరిగినది. నన్ను కూడ ఉత్సవము గలదానినిగా చేయుము (7). నా భర్త జీవించిన తరువాత ప్రియురాలగు పార్వతితో ఈ నీ విహారము పరిపూర్ణము కాగలదనుటలో సందేహము లేదు (8). పరమేశ్వరుడవగు నీవు సర్వకార్యములను చేయ సమర్థుడవు. ఇన్ని మాటలేల? ఓ సర్వేశ్వరా! ఇపుడు వెంటనే నా భర్తను బ్రతికించుము (9).

బ్రహ్మోవాచ ।

తదిత్యుక్త్వా కామభస్మ దదౌ సగ్రంథి బంధనమ్ ।
రురద పురతశ్శంభోః నాథ నాథేత్యుదీర్య చ ॥
రతిరోదనమాకర్ణ్య సరస్వత్యాదయస్త్రియః ।
రురుదుస్సకలా దేవ్యః ప్రోచుర్దీనతరం వచః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఇట్లు పలికి మూట గట్టియున్న మన్మథుని భస్మమును ఇచ్చెను. ఆమె శంభుని యెదుట 'నాథా! నాథా' అని పలుకుతూ రోదించెను (10). రతి యొక్క ఏడుపును విని సరస్వతి మొదలగు దేవీ మూర్తులందరు రోదించి దీనాతి దీనముగా నిట్లు పలికిరి (11).

దేవ్య ఊచుః ।

భక్తవత్సలనామా త్వం దీన బంధుర్దయానిధిః ।
కామం జీవయ సోత్సాహాం రతిం కురు నమోఽస్తు తే ॥

దేవీ మూర్తు లిట్లు పలికినారు –

నీకు భక్త వత్సలుడని పేరు. దీనులకు బంధువు నీవే. నీవు దయానిధివి. మన్మథుని బ్రతికించి రతికి ఉత్సాహమునిమ్ము. నీకు నమస్కారమగు గాక! (12)

బ్రహ్మోవాచ ।

ఇతి తద్వచనం శ్రుత్వా ప్రసన్నోఽ భూన్మహేశ్వరః ।
కృపాదృష్టిం చకారాశు కరుణా సాగరః ప్రభుః ॥
సుధాదృష్ట్యా శూలభృతో భస్మతో నిర్గతస్స్మరః ।
తద్రూపవేశ చిహ్నాత్మా సుందరోఽ ద్భుత మూర్తిమాన్ ॥
తద్రూపం చ తదాకారం సస్మితం సధనుశ్శరమ్ ।
దృష్ట్వా పతిం రతిస్తం చ ప్రణనామ మహేశ్వరమ్ ॥
కృతార్థా భూచ్ఛివం దేవం తుష్టావ చ కృతాంజలిః ।
ప్రాణనాథ ప్రదం పత్యా జీవితేన పునః పునః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

వారి ఈ మాటను విని కరుణాసముద్రుడగు మహేశ్వర ప్రభుడు ప్రసన్నుడై వెంటనే ్రోదయాదృష్టిని బరపెను (13). శూలపాణియగు శివుని అమృత దృష్టిచే భస్మ నుండి అదే రూపము వేషము చిహ్నములు గల అద్భుతమగు సుందరమైన దేహము గలవాడై మన్మథుడు బయటకు వచ్చెను (14). అదే రూపముతో చిరునవ్వుతో ధనుర్బాణములను ధరించి యున్న తన భర్తను చూచి రతి ఆతనికి, మహేశ్వరునకు ప్రణమిల్లెను (15). భర్త జీవించుటచే కృతార్థురాలైన ఆమె ప్రాణనాథుని ఇచ్చిన శివ దేవుని చేతులు జోడించి అనేక పర్యాయములు స్తుతించెను (16).

కామస్య స్తుతిమాకర్ణ్య సనారీకస్య శంకరః ।
ప్రసన్నోఽ భవదత్యంతమువాచ కరుణార్ద్రధీః ॥

భార్యతో గూడి మన్మథుడు చేసిన స్తోత్రమును విని కరుణార్ద్రహృదయుడగు శంకరుడు మిక్కిలి ప్రసన్నుడై ఇట్లు పలికెను (17).

శంకర ఉవాచ ।

ప్రసన్నోఽహం తవ స్తుత్యా సనారీకస్య చిత్తజ ।
స్వయం భవ వరం బ్రూహి వాంఛితం తద్దదామి తే ॥

శంకరుడిట్లు పలికెను -

ఓయీ! మనస్సులో నీ అంతట నీవు పుట్టే మన్మథా! భార్యతో గూడి నీవు చేసిన స్తుతికి నేను ప్రసన్నుడనైతిని. నీకిష్టమగు వరమును కోరుకొనుము. నీకు ఇచ్చెదను (18).

బ్రహ్మోవాచ ।

ఇతి శంభు వచశ్శ్రుత్వా మహానంద స్స్మరస్తతః ।
ఉవాచ సాంజలిర్నమ్రో గద్గదాక్షరయా గిరా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

శంభుని ఈ మాటను విని మన్మథుడపుడు మహానందమును పొందినవాడై చేతులు జోడించి నమస్కరించి బొంగురుపోయిన కంఠముతో నిట్లనెను (19).

కామ ఉవాచః

దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।
యది ప్రసన్నస్సర్వేశః మమానందకరో భవ ॥
క్షమస్వ మేఽపరాధం హి యత్ కృతశ్చ పురా ప్రభో ।
స్వజనేషు పరాం ప్రీతిం భక్తిం దేహి స్వపాదయోః ॥

మన్మథుడిట్లు పలికెను -

దేవ దేవా! మహాదేవా! కరుణా సముద్రా! ప్రభూ! సర్వేశ్వరుడవగు నీవు ప్రసన్నుడవైనచో నాకు ఆనందమును కలిగించుము (20). ప్రభూ! పూర్వము నేను చేసిన అపరాధమును మన్నించుము. నీ భక్తుల యందు పరమ ప్రీతిని, నీ పాదములయందు భక్తిని ఇమ్ము (21).

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య స్మరవచః ప్రసన్నః పరమేశ్వరః ।
ఓమిత్యుక్త్వాఽబ్రవీత్తస్మై విహసన్ కరుణానిధిః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మన్మథుని ఈ మాటను విని ప్రసన్నుడైన కరుణా సముద్రుడగు పరమేశ్వరుడు నవ్వి ఆతనితో 'అటులనే' అని ఇట్లనెను (22).

ఈశ్వర ఉవాచ ।

హే కామాహం ప్రసన్నోఽస్మి భయం త్యజ మహామతే ।
గచ్ఛ విష్ణు సమీపం చ బహిః స్థానే స్థితో భవ ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ మన్మథా! నేను ప్రసన్నుడనైతిని. నీవు గొప్ప బుద్ధిశాలివి. భయమును వీడుము. విష్ణువు వద్దకు వెళ్లుము. ఈ గృహమునకు దూరముగా నుండుము (23).

బ్రహ్మోవాచ ।

తచ్ఛ్రుత్వా శిరసా నత్వా పరిక్రమ్య స్తువన్ విభుమ్ ।
బహిర్గత్వా హరిం దేవాన్ ప్రణమ్య సముపాస్త సః ॥
రామం సంభాష్య దేవాశ్చ దదుస్తస్మై శుభాశిషమ్ ।
విష్ణ్వాదయః ప్రసన్నాస్తే ప్రోచుస్స్మృత్వా శివం హృది ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ మాటను విని ఆతడు శిరస్సు వంచి నమస్కరించి విభునకు ప్రదక్షిణము చేసి స్తుతించి బయటకు వెళ్లి విష్ణువునకు దేవతలకు నమస్కరించి వారిని సేవించెను (24). దేవతలు మన్మథునితో మాటలాడి ఆతనికి శుభాశీస్సుల నందజేసిరి. విష్ణువు మొదలగు వారు శివుని హృదయము నందు స్మరించి ప్రసన్నులై ఇట్లనిరి (25).

దేవా ఊచుః ।

ధన్యస్త్వం స్మర సందగ్ధ శ్శివేనానుగ్రహీకృతః ।

జీవయా మాస సత్త్వాంశ కృపాదృష్ట్యాఖిలేశ్వరః ॥

సుఖదుఃఖదో న చాన్యోఽస్తి యతస్స్వకృత భుక్ పుమాన్ ।

కాలే రక్షా వివాహశ్చ నిషేకః కేన వార్య తే ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ మన్మథా! నీవు ధన్యుడవు. శివునిచే దహింపబడిన నీవు అనుగ్రహింపబడితివి. ఆ సర్వేశ్వరుడు సత్త్వగుణాంశమగు దయాదృష్టితో నిన్ను బ్రతికించెను (26). మానవులకు సుఖదుఃఖములను ఇతరులు ఈయరు. సర్వులు తాము చేసిన కర్మల ఫలమును అనుభవించెదరు. కాలము వచ్చినప్పుడు అను గ్రహమును, వివాహమును, సంతానమును ఎవ్వరు ఆపగలరు? (27)

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా తే చ సమ్మాన్య తం సుఖేనామరాస్తదా ।

సంతస్థుస్తత్ర విష్ణ్వాద్యాస్సర్వే లబ్ధమనోరథాః ॥

సోఽపి ప్రముదిత స్తత్ర సమువాస శివాజ్ఞయా ।

జయశబ్దో నమశ్శబ్ద స్సాధు శబ్దో బభూవ హ ॥

తతశ్శం భుర్వాస గృహే వామే సంస్థాప్య పార్వతీమ్ ।

మిష్టాన్నం భోజయా మాస తం చ సా చ ముదాన్వితా ॥

అథ శంభుర్భవాచారీ తత్ర కృత్యం విధాయ తత్ ।

మేనామామంత్ర్య శైలం చ జనావాసం జగామ సః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు విష్ణువు మొదలగు దేవతలందరు ఇట్లు పలికి, ఆతనిని ఆనందముతో సత్క◌ారించి, తీరిన కోరిక గల వారై అచట నివసించిరి (28). ఆ మన్మథుడు కూడా ఆనందించి శివుని ఆజ్ఞచే అచట నివసించెను. జయము కలుగు గాక! నమస్కారము, బాగు బాగు అను వచనములు వినవచ్చు చుండెను (29). అపుడు శంభుడు నివాస గృహములో పార్వతిని ఎడమ వైపు కూర్చుండబెట్టుకొని ఆమెకు మృష్టాన్నమును తినిపించగా, ఆమె కూడ. ఆనందముతో ఆయనకు తినిపించెను (30). తరువాత శంభుడు అచట కర్తవ్యమును పూర్తి చేసి మేనా హిమవంతుల అనుమతిని బొంది జనులు నివసించిన చోటికి వెళ్లెను (31).

మహోత్సవస్తదా చాసీ ద్వేదధ్వనిరభూన్మునే ।
వాద్యాని వాదయమాసుర్జనాశ్చతుర్విధాని చ ॥
శంభురాగత్య స్వస్థానం వవందే చ మునీంస్తదా ।
హరిం చ మాం భవాచారా ద్వందితోఽ భూత్సురాదిభిః ॥
జయశబ్దో బభూవాథ నమశ్శబ్దస్తథైవ చ ।
వేద ధ్వనిశ్చ శుభదస్సర్వ విఘ్నవిదారణః ॥
అథ విష్ణురహం శక్రస్సర్వే దేవాశ్చ సర్షయః ।
సిద్ధా ఉపసురా నాగాస్తుష్టువుస్తే పృథక్ పృథక్ ॥

అపుడు గొప్ప ఉత్సవము జరిగెను. ఓ మునీ! - వేద ధ్వని విస్తరిల్లెను. జనులు నాల్గు విధముల (తత, ఆనద్ధ, సుషిర, ఘనములు) వాద్యములను మ్రోగించిరి (32). శంభుడు తన స్థానమునకు వచ్చి అపుడు మునులను, హరిని, నన్ను లోకాచారము ననుసరించి నమస్కరించెను. దేవతలు మొదలగు వారు ఆయనకు నమస్కరించిరి (33). అపుడు జయశబ్దము, నమశ్శబ్దము, మరియు. విఘ్నముల నన్నిటినీ పారద్రోలి శుభములనిచ్చే వేద ధ్వని విస్తరిల్లెను (34). అపుడు విష్ణువు, నేను, ఇంద్రుడు, సర్వ దేవతలు, ఋషులు, సిద్ధులు, ఉపదేవతలు, నాగులు వేర్వేరుగా స్తుతించిరి (35).

దేవా ఊచుః ।

జయ శంభోఽ ఖిలాధార జయ నామ మహేశ్వర ।
జయ రుద్ర మహాదేవ జయ విశ్వం భర ప్రభో ॥
జయ కాలీపతే స్వామిన్ జయానంద ప్రవర్ధక ।
జయ త్ర్యంబక సర్వేశ జయ మాయాపతే విభో ॥
జయ నిర్గుణ నిష్కామ కారణాతీత సర్వగ ।
జయ లీలాఖిలాధార ధృతరూప నమోఽస్తు తే ॥
జయ స్వభక్త సత్కామ ప్రదేశ కరుణాకర ।
జయ సానందసద్రూప జయ మాయాగుణాకృతే ॥
జయోగ్ర మృడ సర్వాత్మన్ దీన బంధో దయానిధే ।
జయావికారమాయేశ వాఙ్ మనోఽ తీత విగ్రహ ॥

దేవతలిట్లు పలికిరి -

హే శంభో! సర్వాధారా! జయము. ఓ మహేశ్వరా! నీ నామమునకు జయము. ఓ రుద్రా! మహాదేవా! జయము. జగత్తును పోషించే ఓ ప్రభూ! జయము (36). కాళీపతీ! స్వామీ! జయము. ఆనందమును పెంపొందిచు వాడా! జయము. ముక్కంటీ! సర్వేశ్వరా! జయము. మాయాధీశా! ప్రభూ! జయము (37). గుణరహితా! కామ రహితా! కారణమగు ప్రకృతికి అతీతమైన వాడా! సర్వవ్యాపీ! జయము. లీలచే సర్వముకు ఆధారమె రూపమును ధరించిన వాడా! జయము. నీకు నమస్కారమగు గాక! (38) నీ భక్తులకు యోగ్యమగు కామనలను ఇచ్చు ఈశ్వరా! దయానిధీ! జయము. సచ్చిదానంద రూపా! జయము. మాయచే గుణములను, రూపమును స్వీకరించినవాడా! జయము (39). భయంకరాకారా! రక్షకుడా! సర్వాత్మా! దీనబంధూ! దయాసముద్రా! జయము. వికారహీనుడా! మాయా ధీశా! వాక్కులకు, మనస్సునకు అతీతమైన విగ్రహము గలవాడా! జయము (40).

బ్రహ్మోవాచ ।

ఇతి స్తుత్వా మహేశానం గిరిజానాయకం ప్రభుమ్ ।
సిషేవిరే పరప్రీత్యా విష్ణ్వాద్యాస్తే యథోచితమ్ ॥
అథ శంభుర్మహేశానో లీలాత్తతనురీశ్వరః ।
దదౌ మానవరం తేషాం సర్వేషాం తత్ర నారద ॥
విష్ణ్వాద్యాస్తేఽఖిలాస్తాత ప్రాప్యాజ్ఞాం పరమేశితుః ।
అతిహృష్టాః ప్రసన్నాస్యాః స్వస్థానం జగ్మురాదృతాః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే కామ
సంజీవన వర్ణనం నామ ఏకపంచాశత్తమోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు మొదలగు ఆ దేవతలు గిరిజాపతి యగు మహేశ్వర ప్రభుని ఇట్లు స్తుతించి మహానందముతో యథా యోగ్యముగా సేవించిరి (41). ఓ నారదా! అపుడు మహేశ్వరుడు, లీలచే స్వీకరింపబడిన దేహము గలవాడు అగు శివుడు అచట వారందరినీ సన్మానించి వరముల నిచ్చెను (42). వత్సా! విష్ణువు మొదలగు ఆ దేవతలందరు పరమేశ్వరుని అనుమతిని పొంది మహానందముతో ప్రసన్నమగు ముఖములు గలవారై సాదరముగా తమ తమ స్థానములకు వెళ్లిరి (43).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయందు పార్వతీ ఖండలో కామ సంజీవనమనే ఏబది యొకటవ అధ్యాయము ముగిసినది (51).

52 - పెండ్లి వారి భోజనములు.

బ్రహ్మోవాచ ।

అథ శైలవరస్తాత హిమవాన్ భాగ్యసత్తమః ।
ప్రాంగణం రచయామాస భోజనార్థం విచక్షణః ॥
మార్జనం లేపనం సమ్యక్కారయామాస తస్య సః ।
స సుగంధైరలంచక్రే నానావస్తు భిరాదరాత్ ॥
అథ శైల స్సురాన్ సర్వాన్ అన్యా నపి చ సేశ్వరాన్ ।
భోజనా యాహ్వాయామాస పుత్రై శ్శైలైః పరైరపి ॥
శైలాహ్వానమథా కర్ణ్య స ప్ర భుస్సా చ్యుతో మునే ।
సర్వైస్సురాదిభిస్తత్ర భోజనాయ యయౌ ముదా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

కుమారా! అపుడు మహాభాగ్యవంతుడు, పర్వతరాజు, విద్వాంసుడునగు హిమవంతుడు భోజనము కొరకు ప్రాంగణమును ఏర్పాటు చేసెను (1). ఆయన దానిని తుడిపించి, చక్కగా సుగంధ ద్రవ్యములను చల్లించి, అనేక వస్తువులచే శ్రద్ధగా అలంకరింపజేసెను (2). అపుడు హిమవంతుడు దేవతలనందరినీ, ఇతరులను, ఈశ్వరుని, తన కుమారులగు పర్వతుల చేత, మరియు ఇతరులచేత ఆహ్వానింప జేసెను (3). ఓ మునీ! ఆ ప్రభుడు పర్వతుని ఆహ్వానమును విని అచ్యుతునితో గూడి, దేవతలు మొదలగు వారందరితో కలిసి ఆనందముతో ఆచటకు భోజనము కొరకై వెళ్లెను (4).

గిరిః ప్రభుం చ సర్వాంస్తాన్ సుసత్కృత్య యథావిధి ।
ముదోపవేశయామాస సత్పీ ఠేషు గృహాంతరే ॥
నానా సుభోజ్య వస్తూని పరివిష్య చ తత్పునః ।
సాంజలిర్భోజనాయాజ్ఞాం చక్రే విజ్ఞప్తి మానతః ॥
అథ సమ్మానితాస్తత్ర దేవా విష్ణుపురోగమాః ।
సదాశివం పురస్కృత్య బుభుజుస్సకలాశ్చ తే ॥
తదా సర్వే హి మిలితా ఏకపద్యేన సర్వశః ।
పంక్తి భూతాశ్చ బుభుజుర్విహసంతః పృథక్ పృథక్ ॥

హిమవంతుడు శివుని ఇతరులనందరిని యథావిధిగా మంచిగా సత్కరించి ఇంటి లోపల మంచి పీటలపై ఆనందముతో కూర్చుండ బెట్టెను (5). అనేక మధుర పదార్థములను వడ్డించిన తరువాత ఆయన సమ్మానపూర్వకముగా చేతులు జోడించి భోజనమునకు అనుమతినిచ్చెను (6). అపుడచట సన్మానింపబడిన విష్ణువు మొదలగు దేవతలందరు సదాశివుని ముందిడుకొని భోజనము చేసిరి (7). అపుడు వారందరు ఒకే సారి అంతటా వరుసలో వేర్వేరుగా కూర్చుండి నవ్వుతూ భుజించిరి (8).

నంది భృంగి వీరభద్ర వీరభద్ర గణాః పృథక్ ।
బుభుజుస్తే మహాభాగాః కుతూహల సమన్వితాః ॥
దేవాస్సేంద్రా లోకపాలా నానాశోభా సమన్వితాః ।
బుభుజుస్తే మహాభాగా నానాహాస్యరసైస్సహ ॥
సర్వే చ మునయో విప్రా భృగ్వాద్యా ఋషయస్తథా ।
బుభుజుః ప్రీతితస్సర్వే పృథక్ పంక్తి గతాస్తదా ॥
తథా చండీ గణాస్సర్వే బుభుజుః కృతభాజనాః ।
కుతూహలం ప్రకుర్వంతో నానాహాస్యకరా ముదా ॥

మహాత్ములగు నంది, భృంగి, వీర భద్రుడు, వారి గణములు కుతూహలముతో గూడిన వారై వేర్వేరుగా భుజించిరి (9). ఇంద్రాది దేవతలు, మహాత్ములగు లోకపాలకులు వివిధ శోభలతో గూడిన వారై అనేక హాస్యోక్తులను పలుకుతూ భుజించిరి (10). మునులు, విప్రులు, భృగువు మొదలగు ఋషులు అందరు వేర్వేరు పంక్తులలో కూర్చుండి ప్రీతితో భుజించిరి (11). చండీ గణములందరూ కుతూహలమును కలిగించువారై అనేక హాస్యవచనములను పలుకుతూ ఆనందముతో పల్లెరముల యందు భుజించిరి (12).

ఏవం తే భుక్త వంత శ్చాచమ్య సర్వే ముదాన్వితాః ।
విశ్రామార్థం గతాః ప్రీత్యా విష్ణ్వాద్యాస్స్వం స్వమాశ్రమమ్ ॥
మేనాజ్ఞయా స్త్రియ స్సాధ్వ్య శ్శివం సంప్రార్థ్య భక్తితః ।
గేహే నివాసయామాసుర్వాసాఖ్యే పరమోత్సవే ॥
రత్న సింహాసనే శంభుర్మేనాదత్తే మనో హరే ।
సన్నిధాయ ముదా యుక్తో దదృశే వాసమందిరమ్ ॥
రత్న ప్రదీపశతకై ర్జ్వలద్భి ర్జ్వలితం శ్రియా ।
రత్న పాత్ర ఘటాకీర్ణం ముక్తామణి విరాజితమ్ ॥

విష్ణువు మొదలగు వారందరు ఈ తీరున ఆనందముగా భుజించి నీటిని త్రాగి ప్రీతితో విశ్రమించుట కొరకై తమ తమ నివాసములకు వెళ్లిరి (13). మేన యొక్క ఆజ్ఞచే సాధ్వీమణులు శివుని భక్తితో ప్రార్థించి పరమోత్సవముతో కూడియున్న గృహమునందు నివసింప జేసిరి (14). శంభుడు మేనచే ఈయబడిన మనోహరమగు రత్న సింహాసనమునందు కూర్చుండి ఆనందముతో వాసగృహమును పరికించెను (15). మెరిసిపోయే అనేక రత్న దీపములతో శోభిల్లునది, రత్నములు పొదిగిన పాత్రలతో ఘటములతో కూడియున్నది, ముత్యములతో మణులతో విరాజిల్లునది అగు మందిరమును చూచెను (16).

రత్నదర్పణతో భాఢ్యం మండితం శ్వేత చామరైః ।
ముక్తామణి సుమాలాభి ర్వేష్టితం పరమర్ధి మత్ ॥।
అనూపమం మహాదివ్యం విచిత్రం సుమనోహరమ్ ।
చిత్తాహ్లాదకరం నానా రచనా రచిత స్థలమ్ ॥
శివదత్త వరస్యైవ ప్రభావమతులం పరమ్ ।
దర్శయంతం సముల్లాసి శివలో కాభిధానకమ్ ॥
నానా సుగంధసద్ద్రవ్యై ర్వాసితం సుప్రకాశకమ్ ।
చందనా గురు సంయుక్తం పుష్పశయ్యాసమన్వితమ్ ॥

రత్నపుటద్దముల శోభతో విరాజిల్లునది, తెల్లని చామరములతో అలంకరింపబడినది, ముత్యముల మణుల మాలలతో అలంకరింపబడినది, మహా సంపదలతో కూడియున్నది (17), సాటిలేనిది, మహా దివ్యమైనది, రంగు రంగులది, మిక్కిలి మనోహరమైనది, చిత్తమునకు ఆహ్లాదమును కలిగించునది, నేలపై వివిధ రచనల శోభ గలది (18), శివుడు ఇచ్చిన వర ప్రభావము వలననే నిర్మాణమైనది, శివలోకమను నామధేయము గలది (19), అనేక సుగంధ ద్రవ్యములచే పరిమళ భరితమైనది, చందనము, అగరులతో కూడినది, పుష్ప శయ్యలతో కూడియున్నది అగు గృహమును చూచెను (20).

నానాచిత్ర విచిత్రాఢ్యం నిర్మితం విశ్వకర్మణా ।
రత్నేంద్ర సారరచితై రాచితం హారకై ర్వరైః ॥
కుత్ర చిత్పుర నిర్మాణం వైకుంఠం సుమనోహరమ్ ।
కుత్రచిచ్చ బ్రహ్మలోకం లోకపాలపురం క్వచిత్ ॥
కైలాసం కుత్రచిద్రమ్యం కుత్రచిచ్ఛక్రమందిరమ్ ।
కుత్రచిచ్ఛివలోకం చ సర్వోపరి విరాజితమ్ ॥
ఏతాదృశ గృహం సర్వ దృష్ట్వాశ్చర్యం మహేశ్వరః ।
ప్రశంసన్ హిమశైలేశం పరితుష్టో బభూవ హ ॥

అనేక చిత్ర విచిత్రములతో ప్రకాశించునది, విశ్వకర్మచే నిర్మించబడినది, శ్రేష్ఠ రత్నములతో తయారైన శ్రేష్ఠ హారములతో అలంకరింపబడినది (21) అగు గృహమును చూచెను. ఆ గృహములో ఒకచోట దేవతలచే నిర్మింప బడిన మిక్కిలి అందమగు వైకుంఠము, మరియు బ్రహ్మ లోకము, మరియొక చోట లో కపాలకుల నగరము (2 2), ఒకచోట రమ్యమగు కైలాసము, మరియొక చోట ఇంద్ర భవనము, వీటన్నిటిపై విరాజిల్లే శివలోకము రచింపబడి యుండెను (23). అందరిచే ఆశ్చర్యముతో చూడబడే ఇట్టి గృహమును చూచి మహేశ్వరుడు హిమవంతుని ప్రశంసించి సంతుష్టుడాయెను (24).

తత్రాతిరమణీయే చ రత్న పర్యంక ఉత్తమే ।
అశయిష్ట ముదా యుక్తో లీలయా పరమేశ్వరః ॥
హిమాచలశ్చ స్వభ్రాతౄన్ భోజయామాస కృత్స్నశః ।
సర్వానన్యాంశ్చ సుప్రీత్యా శేషకృత్యం చకార హ ॥
ఏవం కుర్వతి శైలేశ స్వపతి ప్రేష్ఠ ఈశ్వరే ।
వ్యతీతా రజనీ సర్వా ప్రాతః కాలో బభూవ హ ॥
అథ ప్రభాతకాలే చ ధృత్యుత్సాహ పరాయణాః ।
నానా ప్రకారవాద్యాని వాదయాంచక్రిరే జనాః ॥

ఆ భవనములో ఉత్తమము అతిరమణీయము అగు రత్న పర్యంకముపై పరమేశ్వరుడు ఆనందముతో కూడిన వాడై లీలగా శయనించెను (25). హిమవంతుడు తన సోదరులను, ఇతరులను చక్కని మృష్టాన్నముతో ఆనందింపజేసి ఇతర కృత్యములను కూడ చేసెను (26). హిమవంతుడు ఇట్లు కార్యమగ్నుడై యుండగా, ప్రియతముడగు ఈశ్వరుడు నిద్రించుచుండగా, రాత్రి గడచిపోయి, ప్రాతఃకాలమయ్యెను (27). అపుడా ప్రభాత సమయములో జనులు ధైర్యోత్సాహములతో నిండినవారై అనేక రకముల వాద్యములను మ్రోయించిరి (28).

సర్వే సురాస్సముత్తస్థుర్విష్ణ్వాద్యాస్సుముదాన్వితాః ।
స్వేష్టం సంస్మృత్య దేవేశం సజ్జీ భూతాస్ససంభ్రమాః ॥
స్వ వాహనాని సజ్జాని కైలాసం గంతు ముత్సుకాః ।
కృత్వా సంప్రేషయామాసుర్ధర్మం శివసమీపతః ॥
వాసగేహమథాగత్య ధర్మో నారాయణాజ్ఞయా ।
ఉవాచ శంకరం యోగీ యోగీశం సమయోచితమ్ ॥

విష్ణువు మొదలగు దేవతలందరు ఆనందముతో నిద్రలేచి తమ ఇష్ట దైవమగు ఈశ్వరుని స్మరించి తొందరగా సంసిద్ధులైరి (29). వారు కైలాసమునకు వెళ్లుటకై ఉత్సుకత గలవారై తమ వాహనములను సిద్ధము చేసుకొని ధర్ముని శివుని వద్దకు పంపిరి (30). యోగి యగు ధర్ముడు అపుడు వాసగృహమునకు వచ్చి నారాయణుని ఆజ్ఞచే యోగి శ్రేష్ఠుడగు శివునితో సమయానురూపముగా నిట్లు పలికెను (31).

ధర్మ ఉవాచ ।

ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే భవ నః ప్రమథాధిప ।
జనావాసం సమాగచ్ఛ కృతార్థాన్ కురు తత్ర తాన్ ॥

ధర్ముడిట్లు పలికెను –

ఓ ప్రమథ పతీ! లెమ్ము, లెమ్ము. నీకు మంగళమగుగాక! మాకు మంగళములనిమ్ము. జనుల నివాసము వద్దకు రమ్ము. అచట వారిని కృతార్థులను చేయుము (32).

బ్రహ్మోవాచ ।

ఇతి ధర్మ వచశ్శ్రుత్వా విజహాస మహేశ్వరః ।
దదర్శ కృపయా దృష్ట్యా తల్పముజ్ఝాం చకార హ ॥
ఉవాచ విహసన్ ధర్మ త్వమగ్రే గచ్ఛ తత్ర హ ।
అహమప్యాగమిష్యామి ద్రుతమేవ న సంశయః ॥
ఇత్యుక్త శ్శంకరేణాథ జనావాసం జగామ సః ।
స్వయం గంతుమనా ఆసీత్తత్ర శంభురపి ప్రభుః ॥
తద్ జ్ఞాత్వా స్త్రీ గణ స్సోఽ సౌ తత్రాగచ్ఛన్మహోత్సవః ।
చక్రే మంగలగానం హి పశ్యన్ శంభు పదద్వయమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ధర్ముని ఈ మాటలను విని మహేశ్వరుడు నవ్వి, దయా దృష్టితో చూచి శయ్యను వీడెను (33). 'ఓ ధర్మా! నీవు ముందు అచటకు వెళ్లుము. నేను కూడా శీఘ్రమే రాగలను. సందేహము వలదు' అని ఆయన నవ్వి పలికెను (34). శంకరుడిట్లు పలుకగా ఆతడు జనుల నివాసమునకు వెళ్లెను. శంభు ప్రభుడు కూడా అచటకు స్వయముగా వెళ్లవలెనని తలంచెను (35). ఆ విషయము తెలిసి స్త్రీలందరు అచటకు గొప్ప ఉత్సాహముతో వచ్చిరి. వారు శంభుని పాద ద్వయమును చూచుచూ మంగళ గానములను పాడిరి (36).

అథ శంభుర్లోకాచారీ ప్రాతః కృత్యం విధాయ చ ।
మేనా మామంత్ర్య కుభ్రం చ జనావాసం జగామ సః ॥
మహోత్సవస్తదా చాసీ ద్వేదధ్వనిరభూన్మునే ।
వాద్యాని వాదయామాసు ర్జనాశ్చాతుర్విధాని చ ॥
శంభురాగత్య స్వస్థానం వవందే చ మునీంస్తదా ।
హరిం చ మాం భవాచారాత్ వందితోఽ భూత్సురాదిభిః ॥
జయశబ్దో బభూవాథ నమశ్శబ్దస్తథైవ చ ।
వేదధ్వనిశ్చ శుభదో మహాకోలాహలోఽ భవత్ ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే వరవర్గ భోజన శివశయన వర్ణనం నామ ద్విపంచాశత్తమోఽ ధ్యాయః ॥

అపుడు శంభుడు లోకాచారమునను సరించి ప్రాతః కృత్యములను పూర్తి చేసుకొని మేనా హిమవంతుల అనుమతిని తీసుకొని జనావాసమునకు వెళ్లెను (37). ఓ మునీ! అపుడు మహోత్సవమారంభమాయెను. వేదధ్వని మొదలాయెను. జనులు నాల్గు విధముల వాద్యములను మ్రోగించిరి (38). శంభుడు అపుడు తన స్థానమునకు వచ్చి లో కాచారమునను సరించి మునులను, విష్ణువును, నన్ను నమస్కరించెను. దేవతలు మొదలగు వారు ఆయనకు నమస్కరించిరి (39). తరువాత జయధ్వానములు, నమశ్శబ్దములు, శుభకరమగు వేదధ్వని కలిసి పెద్ద కోలాహలము ప్రవర్తిల్లెను (40).

53 – శివుని కైలాస యాత్ర

బ్రహ్మోవాచ ।

అథ విష్ణ్వాదయో దేవా మునయశ్చ తపోధనాః ।
కృత్వా వశ్యకకర్మాణి యాత్రాం సంతేనిరే గిరేః ॥
తతో గిరివరస్స్నాత్వా స్వేష్టం సంపూజ్య యత్నతః ।
పౌరబంధూన్ సమాహూయ జనవాసం యయౌ ముదా ॥
తత్ర ప్రభుం ప్రపూజ్యాథ చక్రే సంప్రార్థనాం ముదా ।
కియద్దినాని సంతిష్ఠ మద్గేహే సకలైస్సహ ॥
విలో కనేన తే శంభో కృతార్థోఽహం న సంశయః ।
ధన్యశ్చ యస్య మద్గేహ ఆయాతోఽసి సురైస్సహ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

అపుడు విష్ణువు మొదలగు దేవతలు, తపోధనులగు మునులు అవశ్యమగు పనులను పూర్తి చేసుకొని కైలాసయాత్రకు సన్నద్ధులైరి (1). అపుడు హిమవంతుడు స్నానము చేసి ఇష్టదైవమును శ్రద్ధగా పూజించి పౌరులను బంధువులను దోడ్కొని పెళ్లివారి మకామునకు వెళ్లెను (2). అచట శివప్రభుని ఆనందముతో పూజించి ఇట్లు ప్రార్థించెను. నా గృహములో కొద్ది రోజులు అందరితో కలిసి నివసించుము (3). హే శంభో! నిన్ను దర్శించుట చేత, దేవతలతో గూడి నీవు నా ఇంటికి వచ్చుట చేత నేను కృతార్థుడను, ధన్యుడను అయితిననుటలో సందేహము లేదు (4).

ఇత్యుక్త్వా బహు శైలేశః కరౌ బద్ధ్వా ప్రణమ్య చ ।
ప్రభుం నిమంత్రయామాస సహ విష్ణు సురాదిభిః ॥
అథ తే మనసా గత్వా శివ సంయుతమాదరాత్ ।
ప్రత్యూచుర్మునయో దేవా హృష్టా విష్ణు సురాదిభిః ॥

పర్వతరాజు ఈ తీరున చేతులు జోడించి నమస్కరించి విష్ణువును, దేవతలను, ఇతరులను, శివ ప్రభుని అనేక విధములుగా ఆహ్వానించెను (5). విష్ణువు మొదలగు దేవతలతో గూడిన మునులు శివుని సాదరముగా మనస్సులో స్మరించి అపుడిట్లు బదులిడిరి (6).

దేవా ఊచుః ।

ధన్యస్త్వం గిరిశార్దూల తవ కీర్తిర్మహీయసీ ।
త్వత్సమో న త్రిలోకేషు కోఽపి పుణ్యతమో జనః ॥
యస్య ద్వారి మహేశానః పరబ్రహ్మ సతాం గతిః ।
సమాగతస్స దాసైశ్చ కృపయా భక్తవత్సలః ॥
జనావాసోఽతిరమ్యశ్చ సమ్మానో వివిధః కృతః ।
భోజనాని త్వపూర్వాణి న వర్ణ్యాని గిరీశ్వర ॥
చిత్రం న ఖలు తత్రాస్తి యత్ర దేవీ శివాంబికా ।
పరిపూర్ణ మశేషం చ వయం ధన్యా య దాగతాః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ గిరిరాజా! నీవు ధన్యుడవు. నీ కీర్తి చాల గొప్పది. ముల్లోకములలో నీ అంతటి పుణ్యాత్ముడగు జనుడు మరియొకడు లేడు (7). పరబ్రహ్మ, సత్పురుషులకు శరణము, భక్తవత్సలుడు అగు మహేశ్వరుడు తన కింకరులతో గూడి నీ ఇంటికి దయ చేసినాడు (8). ఇచటి విడిది చాల సుందరము గనున్నది. వివిధ సన్మానములను చేసి యుంటివి. ఓ పర్వతరాజా! అపూర్వములైన భోజనములను వర్ణింప శక్యము కాదు (9). దీనిలో వింత ఏమీ లేదు. ఏలయన ఎచట జగన్మాతయగు శివాదేవి గలదో, అచట సర్వము పరిపూర్ణమగును. మేము ఇచటకు వచ్చి ధన్యులమైతిమి (10).

బ్రహ్మోవాచ ।

ఇత్థం పరస్పరం తత్ర ప్రశంసా భవదుత్తమా ।
ఉత్సవో వివిధోజాతో వేద సాధు జయధ్వనిః ॥
అభూన్మంగల గానం చ ననర్తు రప్సరసాం గణాః ।
నుతిం చక్రుర్మాగధాద్యా ద్రవ్య దానమభూద్బహు ॥
తత ఆమంత్ర్య దేవేశం స్వగేహ మగమ ద్గిరిః ।
భోజనోత్సవమారేభే నానావిధి విధానతః ॥
భోజనార్థం ప్రభుం ప్రీత్యా నయామాస యథోచితమ్ ।
పరివారసమేతం చ సకుతూహల మీశ్వరమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అచట ఈ విధముగా పరస్పరము గొప్పగా ప్రశంసించుకొనిరి. గొప్ప ఉత్సవము మొదలాయెను. వేదశబ్దము, సాధు కారము, జయ ధ్వానములు ప్రవర్తిల్లెను (11). మంగల గానము ఆరంభమాయెను. అప్సరసలు నాట్యమాడిరి. వంది మాగధులు స్తోత్రములను చేసిరి. గొప్ప దానములు చేయబడెను (12). అపుడు హిమవంతుడు దేవదేవుని ఆహ్వానించి తన గృహమునకు వెళ్లెను. యథావిధిగా భోజనోత్సవము ఆరంభమాయెను (13). పరివారముతో గూడి కుతూహలము కలిగియున్న ఈశ్వర ప్రభుని ప్రీతితో యథావిధిగా భోజనమునకు తీసుకు వెళ్లిరి (14).

ప్రక్షాల్య చరణౌ శంభో ర్విష్ణోర్మమ వరాదరాత్ ।

సర్వేషా మమరాణాం చ మునీనాం చ యథార్థతః ॥

పరేషాం చాగతానాం చ గిరీశో మండపాంతరే ।

ఆసమాయాస సుప్రీత్యా తాంస్తాన్ బంధుభిరన్వితః ॥

సురసైర్వివిధాన్నైశ్చ తర్పయామాస తాన్ గిరిః ।

బుభుజర్నిఖిలాస్తే వై శంభునా విష్ణునా మయా ॥

తదానీం పురనార్యశ్చ గాలీదానం వ్యధుర్ముదా ।

మృదువాణ్యా హసంత్యశ్చ పశ్యంత్యో యత్నతశ్చ తాన్ ॥

శంభునకు, విష్ణువునకు, నాకు, దేవతలందరికి, మునులకు పాద్య జలమీయబడెను (15). హిమవంతుడు బంధువులతో గూడి అందరినీ మండపములోపల ప్రేమతో కూర్చుండబెట్టెను (16), పర్వతుడు వారిని మధురమగు వివిధ భక్ష్యములతో తృప్తిపరచెను. శంభుడు, విష్ణువు, నేను, ఇతరులు అందరు భుజించితిమి (17), అపుడు పురస్త్రీలు నవ్వుతూ మృదువగు మాటలతో వారిని పరిహాసము చేసి వారిని చూస్తూ ఆనందించిరి (18).

తే భుక్త్వా చమ్య విధివద్గిరిమామంత్ర్య నారద ।

స్వస్థానం ప్రయయుస్సర్వే ముదితాస్తృప్తి మాగతాః ॥

ఇత్థం తృతీయే ఘస్రేఽపీ మానితాస్తేఽ భవన్మునే ।

గిరీశ్వరేణ విధివద్దానమానాదరాదిభిః ॥

చతుర్థే దివసే ప్రాప్తే చతుర్థీ కర్మ శుద్ధితః ।

బభూవ విధివద్యేన వినా ఖండిత ఏవ సః ॥

ఉత్సవో వివిధశ్చాసీత్ సాధువాద జయధ్వనిః ।

బహుదానం సుగానం చ నర్తనం వివిధం తథా ॥

ఓ నారదా! వారందరు భుజించి, యథావిధిగా ఆచమనమును చేసి, పర్వతుని అనుమతిని పొంది సంతుష్టులై ఆనందించి తమ స్థానమును చేరుకొనిరి (19). ఓ మహర్షీ! ఇదే తీరున మూడవనాడు కూడా. ఆ పర్వతరాజు వారికి యథా విధిగా వస్తువులనిచ్చి, ఆదరమును చూపి సన్మానించెను (20) నాల్గవనాడు శుద్ధిగా యథావిధిగా చతుర్థికర్మ ఆచరింపబడేను. దీనిని ఆచరించనిచో వివాహయజ్ఞము భగ్నమగును (21). అపుడు వివిధములగు ఉత్సవములు జరిగినవి. సాధువాదము, జయధ్వనులు మిన్ను ముట్టినవి. అనేక దానములు చేయబడెను. నృత్యములు, వివిధ గానములు ప్రవర్తిల్లెను (22).

పంచమే దివసే ప్రాప్తే సర్వే దేవా ముదాన్వితాః ।

విజ్ఞప్తిం చక్రిరే శైలం యాత్రార్థం మతి ప్రేమతః ॥

తదాకర్ణ్య గిరీశశ్చోవాచ దేవాన్ కృతాంజలిః ।

కియద్దినాని తిష్ఠంతు కృపాం కుర్వంతు మాం సురాః ॥

ఇత్యుక్త్వా స్నేహతస్తాంశ్చ ప్రభుం విష్ణుం చ మాం పరాన్ ।

వాసయామాస దివసాన్ బహూన్నిత్యం సమాదరాత్ ॥

ఇత్థం వ్యతీయుర్దివసా బహవో వసతాం చ తత్ ।

సప్తర్షీన్ ప్రేషయామాసుర్గిరీశాంతే తతస్సురాః ॥

అయిదవ రోజు ఉదయమే దేవతలందరు అత్యానందముతో, అతి ప్రేమతో హిమవంతునకు తిరు[illegible]గు యాత్ర గురించి విన్నవించిరి (23). ఆ మాటను విని హిమవంతుడు చేతులు జోడించి దేవతలతో 'ఓ దేవతలారా! దయచేసి మరికొన్ని రోజులు ఉండుడు' అని కోరేను (24). ఇట్లు పలికి ఆయన ప్రేమతో వారిని, శివుని, విష్ణువును, నన్ను, ఇతరులను చాల రోజులు అక్కడనే నిలిపివేసి, నిత్యము గొప్ప ఆదరమును చూపెను (25). అక్కడ నివసించి యుండగనే వారికి అనేక దినములు ఈ తీరున గడిచి పోయినవి. తరువాత దేవతలు పర్వతరాజు వద్దకు సప్తర్షులను పంపిరి (26).

తే తం సంబోధయామాసుర్మేనాం చ సమయోచితమ్ ।

శివతత్త్వం పరం ప్రోచుః ప్రశంసన్ విధివన్ముదా ॥

అంగీకృతం పరేశేన తత్తద్బోధనతో మునే ।

యాత్రార్థ మగమచ్ఛంభుః శైలేశం సోమరాదికః ॥

యాత్రాం కుర్వతి దేవేశ స్వశైలం సామరే శివే ।

ఉచ్చై రురోద సా మేనా తమువాచ కృపానిధిమ్ ॥

వారు మేనకు సమయోచితముగా పరమ శివతత్త్వమును యథావిధిగా బోధించి ఆమెను ఆనందముతో ప్రశంసించిరి (27). ఓ మునీ! వారు వారు చెప్పగా పరమేశ్వరుడు యాత్రకు అంగీకరించి దేవతలు మొదలగు వారితో గూడి హిమవంతుని వద్దకు వెళ్లెను (28). దేవ దేవుడు అగు శివుడు దేవతలతో గూడి యాత్రకు సంసిద్ధమగు చుండగా ఆ మేన బిగ్గరగా విలపించి దయానిధి యగు శంభునితో నిట్లనెను (29).

మేనోవాచ ।

కృపానిధే కృపాం కృత్వా శివాం సంపాలయిష్యసి ।
సహస్ర దోషం పార్వత్యా ఆశుతోషః క్షమిష్యసి ॥
త్వత్పదాంబుజ భక్తా చ మద్వత్సా జన్మజన్మని ।
స్వప్నే జ్ఞానే స్మృతిర్నాస్తి మహాదేవం ప్రభుం వినా ॥
త్వద్భక్తి శ్రుతి మాత్రేణ హర్షాశ్రు పులకాన్వితా ।
త్వన్నిందయా భవేన్మౌనా మృత్యుంజయ మృతా ఇవ ॥

మేన ఇట్లు పలికెను -

ఓ దయానిధీ! నీవు దయచేసి పార్వతిని చక్కగా పాలించుము. తేలికగా సంతసించు నీవు పార్వతి యొక్క వేయి దోషములను క్షమించుము (30). నా కుమార్తె జన్మ జన్మల యందు నీ పాదపద్మములపై భక్తి కలిగి యుండెను. ఆమె తెలివిగా ఉన్ననూ, కలగన్ననూ ఆమె స్మృతిలో మహాదేవ ప్రభుడు లేని కాలము లేదు (31). ఆమె నీ భక్తి గురించి విన్నంత మాత్రాన ఆనందముతో కన్నీరు గార్చెడిది. శరీరము గగుర్పొడిచెడిది. ఓ మృత్యుంజయా! నిన్ను నిందించినచో ఆమె మరణించిన దానివలె మౌనముగ నుండెడిది (32).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా మేనకా తస్మై సమర్ప్య స్వసుతాం తదా ।
అత్యుచ్చం రోదనం కృత్వా మూర్ఛా మాప తయోః పురః ॥
అథ మేనాం బోధయిత్వా తామామంత్ర్య గిరిం తథా ।
చకార యాత్రాం దేవైశ్చ మహోత్సవ పురస్సరమ్ ॥
అథ తే నిర్జరాస్సర్వే ప్రభుణా స్వగణైః సహ ।
యాత్రాం ప్రచక్రిరే తూష్ణీం గిరిం ప్రతి శివం దధుః ॥
హిమాచలపురీ బాహ్యోపవనే హర్షితాస్సురాః ।
సేశ్వరా స్స్థిత్వాస్తస్థుః పర్యైషంత శివాగమమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

మేనక ఇట్లు పలికి అపుడు తన కుమార్తెను ఆయనకు సమర్పించి బిగ్గరగా రోదించి వారిద్దరి యెదుట మూర్ఛిల్లెను (33). అపుడు ఆ మేనకు తెలివి వచ్చునట్లు చేసి శివుడు మేనా హిమవంతుల అనుమతిని పొంది దేవతలతో గూడి మహోత్సవముతో యాత్రను చేసెను (34). అపుడా దేవతలందరు శివుని గణములతో కూడి యాత్రను మొదలిడిరి. వారు మౌనముగా హిమవంతు మంగళాశాసనమును చేసిరి (35). హిమవంతుని నగరము యొక్క బాహ్యోద్యానవనమునందు దేవతలు శివునితోగూడి ఉత్సాహముతో ఆనందముతో వేచియుండిరి. వారు పార్వతి రాకను ప్రతీక్షించుచుండిరి (36).

ఇత్యుక్త్వా శివసద్యాత్రా దేవైస్సహ మునీశ్వర ।

ఆకర్ణయ శివాయా త్రాం విరహోత్సవ సంయుతామ్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్రసంహితాయాం పార్వతీ ఖండే శివయాత్రా వర్ణనం నామ

త్రిపంచాశత్తమోఽ ధ్యాయః ॥

ఓ మహర్షీ! దేవతలతో గూడిన శివుని యాత్రను ఇంత వరకు వర్ణించితిని. వి◌ియోగ దుఃఖముతో మరియు ఆనందముతో కలిసియున్న పార్వతి యాత్రను ఇపుడు వినుము (37).

శ్రీ శివ మహాపురాణములోని రుద్ర సంహితయుందు పార్వతీ ఖండలో శివుని యాత్రను వర్ణించే ఏబదిమూడవ అధ్యాయము ముగిసినది (53).

54 - పతివ్రతా ధర్మములు

బ్రహ్మోవాచ ।

అథ సప్తర్షయస్తే చ ప్రోచుర్హి మగిరీశ్వరమ్ ।
కారయస్వాత్మజాదేవ్యా యాత్రామద్యోచితాం గిరే ॥
ఇతి శ్రుత్వా గిరీశోఽపి బుద్ధ్వా తద్విరహం పరమ్ ।
విషణ్ణోఽభూన్మహా ప్రేమ్ణా కియత్కాలం మునీశ్వర ॥
కియత్కాలేన సంప్రాప్య చేతనాం శైలరాట్ తతః ।
తథాస్త్వితి గిరాముక్త్వా మేనాం సందేశమబ్రవీత్ ॥
శైలసందేశమాకర్ణ్య హర్ష శోకవశా మునే ।
మేనా సంయాపయామాస కర్తుమాసీత్సముద్యతా ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అపుడు సప్తర్షులు హిమవంతునితో "ఓ పర్వతరాజా! నీ కుమార్తె యగు పార్వతీ దేవి యొక్క యాత్రకు ఈనాడు బాగున్నది గాన ఏర్పాట్లను చేయుము' అని చెప్పిరి (1). పర్వతరాజు ఈ మాటను విని కుమార్తె యొక్క విరహమును స్మరించి మహాప్రేమచే దుఃఖితుడాయెను. ఓ మహర్షీ! ఆతడు కొంతసేపు స్పృహను గోల్పోయెను (2). తరువాత ఆ పర్వతరాజు కొంతసేపటికి తెలివిని దెచ్చుకొని. 'అటులనే' అని పలికి మేనా దేవికి సందేశమును పంపెను (3). ఓ మునీ! ఆనంద దుఃఖములతో ఒక్కసారి నిండిన మనస్సుగల మేన హిమవంతుని సందేశమును విని పార్వతిని సాగనంపుటకు సంసిద్ధురాలాయెను (4).

శ్రుతిస్వకులజాచారం చచార విధివన్మునే ।
ఉత్సవం వివిధం తత్ర సా మేనా క్షితభృత్ప్రియా ॥
గిరిజాం భూషయామాస నానారత్నాంశుకైర్వ రైః ।
ద్వాదశాభరణైశ్చైవ శృంగారైర్నృపసమ్మితైః ॥
మేనా మనోగం బుద్ధ్వా హి సాధ్వ్యేకా ద్విజకామినీ ।
గిరిజాం శిక్షయామాస పాతివ్రత్య వ్రతం పరమ్ ॥

ఓ మునీ! ఆమె వేదోక్త విధానమును, తమకులాచారమును యథావిధిగా పాటించెను. అపుడుచట గొప్ప ఉత్సవము ఆరంభమయ్యెను. హిమవత్పత్ని యగు ఆ మేన (5) శ్రేష్ఠమగు పట్టు వస్త్రములతో, రాజు యొక్క హోదాకు తగిన పన్నెండు రకముల ఆభరణములతో పార్వతిని అలంకరించెను (6). పతివ్రతయగు ఒక బ్రాహ్మణపత్ని మేన యొక్క మనోగతము నెరింగి గొప్ప పాతివ్రత్య వ్రతమును గురించి పార్వతికి బోధించెను (7).

ద్విజపత్న్యువాచ ।

గిరిజే శృణు సుప్రీత్యా మద్వచో ధర్మ వర్ధనమ్ ।
ఇహాముత్రా నందకరం శృణ్వతాం చ సుఖప్రదమ్ ॥
ధన్యా పతివ్రతా నారీ నాన్యా పూజ్యా విశేషతః ।
పావనీ సర్వలోకానాం సర్వపా పౌఘనాశినీ ॥
సేవతే యా పతిం ప్రేమ్ణా పరమేశ్వర వచ్ఛి వే ।
ఇహ భుక్త్వాఖిలాన్ భోగాన్ అంతే పత్యా శివాం గతిమ్ ॥
పతివ్రతా చ సావిత్రీ లోపాముద్రా హ్యరుంధతీ ।
శాండిల్యా శతరూపానసూయా లక్ష్మీస్స్వధా సతీ ॥

బ్రాహ్మణస్త్రీ ఇట్లు పలికెను -

ఓ పార్వతీ! ధర్మమును వృద్ధి పొందించునది, ఇహపరములయందు ఆనందమును కలిగించునది, సుఖకరమైనది అగు నా మాటను ప్రీతితో వినుము (8). పతివ్రతయగు స్త్రీ ధన్యురాలు. అట్టి స్త్రీని మాత్రమే ప్రత్యేకముగా పూజించవలెను. ఆమె సర్వలోకములను పవిత్రము చేయును. సర్వపాప పుంజములను నశింపజేయును (9). ఓ పార్వతీ! ఏ స్త్రీ భర్తను ప్రేమతో పరమేశ్వరుని వలె సేవించునో, ఆ స్త్రీ ఇహలోకములో భోగములనన్నిటినీ అనుభవించి, దేహమును వీడిన తరువాత శుభగతిని భర్తతో గూడి పొందును (10). సావిత్రి, లోపాముద్ర, అరుంధతి, శాండిల్య, శతరూప, అనసూయ, లక్ష్మి, స్వధా, సతీదేవి అనువారు గొప్ప పతివ్రతలు (11).

సంజ్ఞా చ సుమతిశ్శ్రద్ధా మేనా స్వాహా తథైవ చ ।
అన్యా బహ్వ్యో పి సాధ్వ్యో హి నోక్తా విస్తరజాద్భయాత్ ॥
పాతివ్రత్య వృషేణైవ తా గతా స్సర్వపూజ్యతామ్ ।
బ్రహ్మ విష్ణు హరైశ్చాపి మాన్యా జాతా మునీశ్వరైః ॥
సేవ్యస్త్వయా పతిస్తస్మాత్ సర్వదా శంకరః ప్రభుః ।
దీనానుగ్రహకర్తా చ సర్వ సేవ్యస్సతాం గతిః ॥
మహాన్ పతివ్రతా ధర్మ శ్రుతిస్మృతిషు నోదితః ।
యథైష వర్ణ్యతే శ్రేష్ఠో న తథాన్యోఽస్తి నిశ్చితమ్ ॥

సంజ్ఞ, సుమతి, శ్రద్ధ, మేన, స్వాహా అను వారలే గాక ఇంకనూ ఎందరో సాధ్వీమణులు గలరు. వారి పేర్ల నన్నిటిని విస్తరభీతిచే చెప్పుట లేదు (12). పాతివ్రత్య ధర్మము చేతనే వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు, మునీశ్వరులకు మరియు సర్వులకు పూజింపదగిన వారు, సమ్మానింపదగిన వారు అయినారు (13). కావున నీవు సర్వకాలముల యందు నీ భర్తయగు శంకర ప్రభుని సేవింపుము. ఆయన దీనులనను గ్రహించువాడు, సర్వులచే సేవింపబడువాడు, సత్పురుషులకు ఆశ్రయమైనవాడు (14). పతివ్రతా ధర్మము చాల గొప్పది యని శ్రుతి స్మృతులు చెప్పుచున్నవి. దీనితో సమానమగు శ్రేష్ఠత గల ధర్మము మరియొకటి లేదనుట నిశ్చితము (15).

భుంజ్యాద్భుక్తే ప్రియే పత్యౌ పాతి ప్రత్య పరాయణా ।
తిష్ఠేత్తస్మిన్ శివే నారీ సర్వథా సతి తిష్ఠతి ॥
స్వప్యాత్స్వపితి సా నిత్యం బుధ్యేత్తు ప్రథమం సుధీః ।
సర్వథా తద్ధితం కుర్యా దకైతవగతిః ప్రియా ॥
అనలంకృత మాత్మానం దర్శయేన్న క్వచిచ్ఛివే ।
కార్యార్థం ప్రోషితే తస్మిన్ భవేన్మండనవర్జితా ॥
పత్యుర్నామ న గృహ్ణీయాత్క దాచన పతివ్రతా ।
ఆక్రుష్టాపి న చాక్రోశేత్ ప్రసీదేత్తా డితాపి చ ॥
ఆహూతా గృహ కార్యాణి త్యక్త్వా గచ్ఛే త్తదంతికమ్ ।
సత్వరం సాంజలిః ప్రీత్యా సుప్రణమ్య వదేదితి ॥

పాతివ్రత్య ధర్మమునందు నిష్ఠగల స్త్రీ భర్త భుజించిన తరువాత భుజించవలెను. ఓ పార్వతీ! భర్త నిలబడియున్న సమయమంతయూ పతివ్రత నిలబడియే ఉండవలెను (16), సద్బుద్ధి గల స్త్రీ భర్త నిద్రించిన తరువాత నిద్రించి, నిత్యము ఆతని కంటే ముందుగా నిద్ర లేవవలెను. ఆమె ప్రవర్తనలో కపటము లేనిదై సర్వవిధములుగా భర్తకు హితమును చేయుచూ ఆతనికి ప్రియురాలు కావలెను (17). ఓ పార్వతీ! భర్త యెదుట అలంకారము లేకుండగా కనబడరాదు. భర్త కార్యార్థియై పొరుగూరు వెళ్లినచో ఆమె అలంకారములను ఆ సమయములో ధరించరాదు (18). పతివ్రత ఏ సమయము నందైననూ భర్త పేరును ఉచ్చరించరాదు. భర్త తిట్టిననూ, కొట్టిననూ తిరిగి తిట్ట కుండగా ప్రసన్నురాలై ఉండవలెను (19). భర్త పిలిచినచో. ఆమె వెంటనే ఇంటి పనులను విడనాడి ప్రేమతో ఆతని వద్దకు వెళ్లి చేతులు జోడించి నమస్కరించి ఇట్లు పలుకవలెను (20).

కిమర్థం వ్యాహృతా నాథ స ప్రసాదో విధీయతామ్ ।
తదాదిష్టా చరేత్కర్మ సుప్రసన్నేన చేతసా ॥
చిరం తిష్ఠేన్న చ ద్వారే గచ్ఛే న్నైవ పరాలయే ।
ఆదాయ తత్త్వం యత్కించి త్కస్మై చిన్నార్పయేత్ క్వచిత్ ॥
పూజోపకరణం సర్వమనుక్తా సాధయే త్స్వయమ్ ।
ప్రతీక్షమాణావసరం యథాకాలో చితం హితమ్ ॥
న గచ్ఛేత్తీర్థయాత్రాం వై పత్యాజ్ఞాం వినా క్వచిత్ ।
దూరతో వర్జయేత్సా హి సమాజోత్సవదర్శనమ్ ॥

'నాథా! ఏల పిలిచితిరి? పని చెప్పి అను గ్రహించుడు' అని పలికి ఆయన ఆదేశించిన పనిని ప్రసన్నమగు మనస్సుతో చేయవలెను (21). ద్వారము వద్ద చిరకాలము నిలబడరాదు. ఇతరుల గృహమునకు పోరాదు. భర్త హృదయములోని భావము నెరింగి ప్రవర్తించవలెను. దేనిని పడితే దానిని ఎక్కడ పడితే అక్కడ ఎవరికి పడితే వారికి ఈయరాదు (22), పూజాసామగ్రిని భర్త చెప్పకుండగనే స్వయముగా సర్వమును సంపాదించవలెను. హితమును చేయు

అవకాశము కొరకు ఎదురు చూస్తూ సందర్భమునకు తగినట్లుగా హితమును ఆచరించవలెను (23), భర్త అనుమతి లేనిదే తీర్థయాత్రకు ఎప్పటికైననూ వెళ్లరాదు. పతివ్రత సమాజోత్సవములకు దూరముగా నుండవలెను (24).

తీర్థార్థినీ తు యా నారీ పతిపాదోదకం పిబేత్ ।
తస్మిన్ సర్వాణి తీర్థాని క్షేత్రాణి చ న సంశయః ॥
భుంజ్యాత్సా భర్తురుచ్ఛిష్ట మిష్ట మన్నాదికం చ యత్ ।
మహాప్రసాద ఇత్యుక్త్వా పతిదత్తం పతివ్రతా ॥
అవిభజ్య న చాశ్నీయా ద్దేవపిత్రతిథిష్వపి ।
పరివారకవర్గేషు గోషు భిక్షు కులేషు చ ॥
సంయతో పస్కరా దక్షా హృష్టా వ్యయపరాఙ్ముఖీ ।
భవేత్సా సర్వదా దేవీ పతివ్రత పరాయణా ॥

తీర్థములను సేవించ గోరు స్త్రీ భర్త పాదోదకము త్రాగవలెను. సర్వక్షేత్రములు, తీర్థములు దానియందే గలవనుటలో సందేహము లేదు (25). భర్త భుజించిన తరువాత మిగిలిన మృష్టాన్నమును, ఇతర భోజ్యములను భర్త ఇచ్చిన మహా ప్రసాదము అను భావనతో స్వీకరించి భుజించవలెను (26). పతివ్రత దేవతలకు, పితృదేవతలకు, అతిథులకు, పరిచారకులకు, గోవులకు మరియు భిక్షుకులకు, పెట్టకుండగా తాను తినరాదు (27). పతివ్రతా ధర్మమునందు నిష్ఠగల దేవి గృహవస్తువులను పొందికగా భద్రముగా నుంచుకొనవలెను. ఆమె సామర్థ్యముతో ఇంటిని పొదుపుగా నిర్వహించవలెను. ఆమె సర్వదా ఆనందముగా నుండి దుర్వ్యయమును విసర్జించవలెను (28).

కుర్యాత్పత్యనను జ్ఞాతా నోపవాసవ్రతాదికమ్ ।
అన్యథా తత్ఫలం నాస్తి పరత్ర నరకం వ్రజేత్ ॥
సుఖపూర్వం సుఖాసీనం రమమాణం యదృచ్ఛయా ।
ఆంతరేష్వపి కార్యేషు పతిం నోత్థాపయేత్ క్వచిత్ ॥
క్లీబం వా దురవస్థం వా వ్యాధితం వృద్ధమేవ చ ।
సుఖితం దుఃఖితం వాపి పతిమేకం న లంఘయేత్ ॥
స్త్రీ ధర్మిణీ త్రిరాత్రం చ స్వముఖం నైవ దర్శయేత్ ।
స్వవాక్యం శ్రావయేన్నాపి యావత్ స్నానాన్న శుధ్యతి ॥

భర్త అనుజ్ఞ లేనిదే ఉపవాసములు, వ్రతములు మొదలగు వాటిని చేయరాదు. అట్లు చేసినచో ఆ ఫలము లభించక పోవుటయే గాక, మరు జన్మలో నరకము లభించును (29). సుఖముగా భర్త కూర్చుని యుండగా, లేక స్వేచ్ఛచే క్రీడించుచుండగా ఆటంకమును కలిగించరాదు. భర్త నిద్రించుచున్న సమయములో ఆవశ్యకమగు కార్యము ఉన్ననూ నిద్ర లేపరాదు (30). భర్త అసమర్థుడైననూ, దురవస్థలో నున్ననూ, వ్యాధిగ్రస్తుడైననూ, వృద్ధుడే అయిననూ, సుఖము గలవాడైననూ, లేక దుఃఖియైననూ, పతివ్రత భర్తను ఉల్లంఘించరాదు (31). రజస్వలా సమయములో భర్తకు దూరముగా నుండవలెను. స్నానము అగువరకు కబుర్లాడరాదు (32).

సుస్నాతా భర్తృవదన మీక్షేతాన్యస్య న క్వచిత్ ।
అథవా మనసి ధ్యాత్వా పతిం భానుం విలోకయేత్ ॥
హరిద్రా కుంకుమం చైవ సిందూరం కజ్జలాదికమ్ ।
కూర్పాసకం చ తాంబూలం మాంగల్యాభరణాదికమ్ ॥
కేశసంస్కారకబరీ కరకర్ణాది భూషణమ్ ।
భర్తురాయుష్య మిచ్ఛంతీ దూరయేన్న పతివ్రతా ॥
న రజక్యా న బంధక్యా తథా శ్రమణయా న చ ।
న చ దుర్భగయా క్వాపి సఖిత్వం కారయేత్ క్వచిత్ ॥

స్నానము చేసిన తరువాత భర్త ముఖమునే చూడవలెను. ఇతరుల ముఖమును చూడరాదు. భర్త దగ్గర లేనిచో, భర్తను మనస్సులో ధ్యానించి సూర్యుని చూడవలెను (33). భర్త యొక్క ఆయుష్షును గోరు పతివ్రత పసుపును, కుంకుమను, సిందూరమును, కాటుకను, తాంబూలమును, మంగళ సూత్రమును, ఆభరణములను, రవికెను, కేశసంస్కారమును, కేశాభరణములను, చేతులకు గాజులను, కర్ణాభరణములను, ఇటు వంటి ఇతర ఆభరణములను విడనాడరాదు (34,35). చాకలితో, కులటతో, సన్న్యాసినితో మరియు. భాగ్యహీనురాలితో ఎన్నడునూ ఎక్కడనైననూ స్నేహము చేయరాదు (36).

పతివిద్వేషిణీం నారీం న సా సంభాషయేత్ క్వచిత్ ।
నైకాకినీ క్వచిత్తిష్ఠన్నగ్నా స్నాయాన్న చ క్వచిత్ ॥
నోలూఖలే న ముసలే న వర్ధన్యాం దృషద్యపి ।
న యంత్రకే న దేహల్యాం సతీ చ ప్రవసేత్ క్వచిత్ ॥
వినా వ్యవాయసమయం ప్రాగల్భ్యం నాచరేత్ క్వచిత్ ।
యత్ర యత్ర రుచిర్భర్తు స్తత్ర ప్రేమవతీ భవేత్ ॥
హృష్టా హృష్టే విషణ్ణా స్యా ద్విషణ్ణా స్యే ప్రియే ప్రియా ।
పతివ్రతా భవేద్దేవీ సదా పతి హితైషిణీ ॥

భర్తను ద్వేషించు స్త్రీ తో పతివ్రత ఎన్నడునూ సంభాషించరాదు. ఎక్కడనైననూ ఒంటరిగా నుండరాదు. నగ్నముగా ఎన్నడైననూ స్నానము చేయరాదు (37). పతివ్రత రోటిపైన, రోకలి పైన, చీపురు కట్టపైన, రాతిపైన, తిరగలి పైన, గడప పైన ఎన్నడునూ కూర్చుండరాదు (38). సంభోగసమయమునందు తక్క ఇతరత్రా ప్రగల్భముగ నుండరాదు. భర్తకు దేని యందు అభిరుచి గలదో, దానియందామె ప్రేమను కలిగి ఉండవలెను (39). భర్త ఆనందముగ నున్నచో, భార్య ఆనందించవలెను. ప్రియుడగు భర్త విషాదమును పొందినచో ప్రియురాలగు భార్య కూడ విషాదమును పొందవలెను. పతివ్రత సర్వకాలములయందు భర్త యొక్క హితమును గోరవలెను (40).

ఏకరూపా భవేత్పుణ్యా సంపత్సు చ విపత్సు చ ।
వికృతిం స్వాత్మనః క్వాపి న కుర్యాద్ధైర్యధారిణీ ॥
సర్పిర్లవణతైలాది క్షయేఽపి చ పతివ్రతా ।
పతిం నాస్తీతి న బ్రూయా దాయాసేషు న యోజయేత్ ॥
విధేర్విష్ణోర్హరాద్వాపి పతిరేకోఽ ధికో మతః ।
పతివ్రతాయా దేవేశి స్వపతిశ్శివ ఏవ చ ॥
వ్రతోపవాసనియమం పతిముల్లంఘ్య యా చరేత్ ।
ఆయుష్యం హరతే భర్తు ర్మృతా నిరయ మృచ్ఛతి ॥

భార్య సంపద కల్గినపుడు, ఆపద వచ్చినప్పుడు కూడ ఏకరూపముగ పుణ్య భావమును కలిగి యుండవలెను. ఆమె ధైర్యమును కలిగియుండి తనలో ఎట్టి వికారమునకైననూ తావీయరాదు (41). సోపు సామగ్రి, ఉప్పు, నూనె మొదలగునవి లేక పోయిననూ, పతివ్రత భర్తతో 'లేదు' అని చెప్పరాదు. భర్తకు ఆయాసమును కలిగించరాదు (42). భర్త విష్ణువు కంటె, బ్రహ్మ కంటె, శివుని కంటె గొప్పవాడని పెద్దలు చెప్పెదరు. ఓ దేవదేవీ! పతివ్రతకు తన భర్త శివుడే యగును (43). భర్తను కాదని వ్రతములను, ఉపవాసములను, నియమములను అనుష్ఠించు స్త్రీ భర్త ఆయుష్షును క్షయము చేయుటయే గాక, మరణించిన పిదప నరకమును పొందును (44).

ఉక్తా ప్రత్యుత్తరం దద్యాద్యా నారీ క్రోధతత్పరా ।
సరమా జాయతే గ్రామే శృగాలీ నిర్జనే వనే ॥
ఉచ్చాసనం న సేవేత న వ్రజేద్దుష్ట సన్నిధౌ ।
న చ కాతర వాక్యాని వదేన్నారీ పతిం క్వచిత్ ॥
అపవాదం చ న బ్రూయాత్కలహం దూరతస్త్య జేత్ ।
గురూణాం సన్నిధౌ క్వాపి నోచ్చైర్బ్రూయాన్న వై హసేత్ ॥
బాహ్యే దాయాంత మాలోక్య త్వరితాన్న జలాశనైః ।
తాంబూలైర్వసనై శ్చాపి పాద సంవాహనాదిభిః ॥
తథైవ చాటు వచనై స్స్వేదసన్నోదనైః పరైః ।
యా ప్రియం ప్రీణయేత్ ప్రీతా త్రిలోకీ ప్రీణితా తయా ॥

భర్త చెప్పిన మాటకు కోపముతో మండి పడుతూ బదులిడే స్త్రీ గ్రామములో కుక్కయైగాని, నిర్జనారణ్యములో నక్కయైగాని జన్మించును (45). పతివ్రత ఎత్తైన ఆసనముపై కూర్చుండరాదు. దుష్టుల సన్నిధికి పోరాదు. భర్తతో ఎక్కడనైననూ పిరికి దనమును, భయమును కలిగించు మాటలను చెప్పరాదు (46). కొండెములను చెప్పరాదు. కలహములకు దూరముగా నుండవలెను. పెద్దల సన్నిధిలో బిగ్గరగా మాటలాడరాదు, నవ్వరాదు (47). బయట నుండి వచ్చిన భర్తను గాంచి వెంటనే నీటిని ఇచ్చి, వస్త్రములనిచ్చి, భోజనము పెట్టి, తాంబూలమునిచ్చి పాదములను నొక్కి సేవించవలేను (48). మరియు ప్రేమతో నిండిన మాటలను చెప్పి శ్రమను తొలగింపజేసి ప్రీతిని కలిగించు స్త్రీ ముల్లోకములను సంతోష పెట్టిన పుణ్యమును పొందును (49).

మితం దదాతి జనకో మితం భ్రాతా మితం సుతః ।
అమితస్య హి దాతారం భర్తారం పూజయేత్సదా ॥
భర్తా దేవో గురుర్భర్తా ధర్మ తీర్థ వ్రతాని చ ।
తస్మాత్సర్వం పరిత్యజ్య పతిమేకం సమర్చ యేత్ ॥
యా భర్తారం పరిత్యజ్య రహశ్చరతి దుర్మతిః ।
ఉలూకీ జాయతే క్రూరా వృక్షకోటరశాయినీ ॥
తాడితా తాడితుం చేచ్ఛేత్సా వ్యాఘ్రీ వృషదంశికా ।
కటాక్షయతి యాన్ యం వై కేకరాక్షీ తు సా భవేత్
॥

తండ్రి గాని, సోదరుడు గాని, కుమారుడు గాని, స్త్రీకి పరిమితముగనే ఇచ్చును. కాని సర్వస్వమును ఇచ్చే భర్తను స్త్రీ సదా పూజించవలెను (50). దైవము, గురువు, ధర్మము, తీర్థము, వ్రతము అన్నియూ భర్తయే. కావున అన్నిటినీ విడిచి ఒక్క భర్తను మాత్రము సేవించవలెను (51). భర్తను విడిచి రహస్యముగా తిరుగాడు దుష్టస్త్రీ చెట్టు తొర్రలో నివసించే క్రూరమగు గుడ్లగూబయై పుట్టును (52). భర్తను కొట్ట బోవు స్త్రీ పెద్ద పులి, లేక పిల్లియై పుట్టును. ఇతర పురుషులను ఓర చూపుతో చూచే స్త్రీ మెల్లకన్ను గలది యగును (53).

యా భర్తారం పరిత్యజ్య మిష్టమశ్నాతి కేవలమ్ ।
గ్రామే వా సూకరీ భూయా ద్వల్గుర్వాపి స్వవిడ్ భుజా ॥
యా తుకృత్య ప్రియం బ్రూయాన్మూకా సా జాయతే ఖలు ।
యా సపత్నీం సదేర్ష్యేత దుర్భగా సా పునః పునః ॥
దృష్టం విలుప్య భర్తుర్యా కంచిదన్యం సమీక్షతే ।
కాణా చ విముఖీ చాపి కురూపాపి చ జాయతే ॥
జీవహీనో యథా దేహః క్షణాదాశు చితాం వ్రజేత్ ।
భర్తృహీనా తథా యోషిత్సుస్నాతాప్యశుచిస్సదా ॥
సా ధన్యా జననీ లోకే స ధన్యో జనకః పితా ।
ధన్యస్స చ పతిర్యస్య గృహే దేవీ పతివ్రతా ॥

ఏ స్త్రీ భర్తను విడిచి పెట్టి తాను ఒక్కతెయే మృష్టాన్నమును భుజించునో ఆమె గ్రామసూకరమైగాని, మేకయై గాని పుట్టును (54). ఏ స్త్రీ భర్తను నిరాకరించి మాటలాడునో ఆమె మూగియై జన్మించును, ఎల్లవేళలా సవతితో కొట్లాడు స్త్రీ భాగ్యహీనురాలిగా అనేక జన్మలను పొందును (5 5). భర్తను చూచుట మాని ఇతర పురుషుని చూచు స్త్రీ కురూపి, గ్రుడ్డి, వికృతమగు ముఖము గలది అయి పుట్టును (56). ప్రాణము లేని దేహము అశుచి గనుక మానవులు దానిని వెంటనే తగుల బెట్టెదరు. అదే తీరున భర్తను విడిచిన స్త్రీ చక్కగా స్నానము చేసినా అశుచియే యగును (57). ఏ గృహములో పతివ్రతా దేవి ఉండునో, ఆమె తల్లి దండ్రులు ధన్యులు. ఆమె భర్త ధన్యుడు (58).

పితృవంశ్యా మాతృవంశ్యాః పతివంశ్యాస్త్రయస్త్రయః ।

పతి వ్రతాయాః పుణ్యేన స్వర్గే సౌఖ్యాని భుంజతే ॥

శీలభంగేన దుర్వృత్తాః పాతయంతి కులత్రయమ్ ।

పితుర్మాతుస్తథా పత్యు రిహాముత్రాపి దుఃఖితాః ॥

పతివ్రతాయాశ్చరణో యత్ర యత్ర స్పృశేద్భువమ్ ।

తత్ర తత్ర భవేత్సా హి పాపహంత్రీ సుపావనీ ॥

విభుః పతివ్రతా స్పర్శం కురుతే భానుమానపి ।

సోమో గంధవహశ్చాపి స్వపావిత్ర్యాయ నాన్యథా ॥

పతివ్రత యొక్క తండ్రి వంశములోని వారు ముగ్గురు, తల్లివంశములోని వారు ముగ్గ్గురు, భర్త వంశములోని వారు ముగ్గురు ఆమె పుణ్యముచే స్వర్గములో సౌఖ్యముల ననుభవించెదరు(59). శీలమును విడిచెడు దారులలో తిరిగే స్త్రీల యొక్క పితృమాతృ భర్తృవంశములవారు పతితులగుదురు. అట్టి స్త్రీలు ఇహపరలోకములలో దుఃఖమును పొందెదు (60). పతివ్రత యొక్క పాదము ఏయే స్థానములలో భూమిని స్పృశించునో, ఆయా స్థానములు పాపములు తొలగి పావనమగును (61). సూర్య భగవానుడు, చంద్రుడు, వాయువు కూడ తమ పవిత్రత కొరకు పతివ్రతను స్పృశించెదరనుటలో సందేహము లేదు (62).

ఆపః పతివ్రతాస్పర్శ మభిలషంతి సర్వదా ।

అద్య జాడ్య వినాశో నో జాతాస్త్వద్యాన్యపావనాః ॥

భార్యా మూలం గృహస్థస్య భార్యా మూలం సుఖస్య చ ।

భార్యా ధర్మ ఫలావాప్త్యై భార్యా సంతాన వృద్ధయే ॥

గృహే గృహే న కిం నార్యో రూపలావణ్య గర్వితాః ।

పరం విశ్వేశ భక్త్యైవ లభ్యతే స్త్రీ పతివ్రతా ॥

పరలోకస్త్వయం లోకో జీయతే భార్యయా ద్వయమ్ ।

దేవపిత్రతిథీ జ్యాది నా భార్యః కర్మ చార్హతి ॥

జలములు సర్వదా పతివ్రతల స్పర్శను గోరును. అట్టి స్పర్శను పొంది 'ఈనాడు మన జడత్వము తొలగి ఇతరులను పవిత్రులను చేయు సామర్థ్యము లభించినది' అని జలములు భావించును (63). గృహస్థ ధర్మమునకు, గృహస్థుని సుఖమునకు, ధర్మము యొక్క ఫలమును పొందుటకు, సంతానాభివృద్ధికి భార్యయే మూలమై యున్నది (64). రూప లావణ్యములచే గర్వించిన స్త్రీలు అన్ని గృహములలో లేరా? కాని.విశ్వేశ్వరుని యందలి భక్తిచే మాత్రమే పతివ్రతయగు స్త్రీ లభించును (65). మానవుడు భార్యా సహాయముతో ఇహపరలోకములను రెండింటినీ జయించును. భార్య లేనివాడు దేవయజ్ఞ పితృయజ్ఞ అతిథియజ్ఞాది కర్మలకు అర్హుడు కాడు (66).

గృహస్థ స్సహి విజ్ఞేయో యస్య గేహే పతివ్రతా ।

గ్రస్య తేఽన్యా ప్రతిదినం రాక్షస్యా జరయా యథా ॥

యథా గంగావగాహేన శరీరం పావనం భవేత్ ।

తథా పతివ్రతాం దృష్ట్వా సకలం పావనం భవేత్ ॥

న గంగాయా తయా భేదో యా నారీ పతిదేవతా ।

ఉమాశివసమౌ సాక్షాత్తస్మాత్తౌ పూజయేద్బుధః ॥

తారః పతి శ్శ్రుతిర్నారీ క్షమా సా స స్వయం తపః ।

ఫలం పతిస్సత్క్రియా సా ధన్యౌ తౌ దంపతీ శివే ॥

ఎవని గృహములో పతివ్రత ఉండునో వాడే గృహస్థుడని తెలియవలెను. పతివ్రత కాని స్త్రీ పురుషుని రాక్షసి వలె, వార్ధక్యమువలె ప్రతిదినము భక్షించి వేయును (67). గంగాస్నానముచే శరీరము పవిత్రమగును. అటులనే పతివ్రతను చూచినంత మాత్రాన సర్వము పవిత్రమగును (68). పతివ్రతయగు స్త్రీకి గంగకు తేడా లేదు. పతివ్రత, ఆమె భర్త సాక్షాత్తుగా ఉమాశివులతో సమమైనవారు గనుక, విద్వాంసుడు వారిని పూజించవలెను (6-9). భర్త ఓంకారము, భార్య వేదము. భర్త తపస్సు, భార్య క్షమ. భార్య పుణ్య కర్మ, భర్త తత్కర్మ ఫలము. ఓ పార్వతీ! అట్టి దంపతులు ధన్యులు (70).

ఏవం పతివ్రతా ధర్మో వర్ణితస్తే గిరీంద్రజే ।

తద్భేదాన్ శృణు సుప్రీత్యా సావధానతయాఽ ద్య మే ॥

చతుర్విధాస్తాః కథితా నార్యో దేవి పతివ్రతాః ।

ఉత్తమాదివిభేదేన స్మరతాం పాపహారికాః ॥

ఉత్తమా మధ్యమా చైవ నికృష్టా తిని కృష్టికా ।

బ్రువే తాసాం లక్షణాని సావధానతయా శృణు ॥

స్వప్నేఽ పి యన్మనో నిత్యం స్వపతిం పశ్యతి ధ్రువమ్ ।

నాన్యం పరపతిం భద్రే ఉత్తమా సా ప్రకీర్తి తా ॥

ఓ పార్వతీ! నీకీ విధముగా పతివ్రతా ధర్మమును వర్ణించితిని. ఇపుడు నేను పతివ్రతలలోని భేదములను వర్ణించెదను. ప్రీతితో సావధానముగా వినుము (71). ఓ దేవీ! స్మరించి నంతనే పాపములను పోగొట్టే పతివ్రతలు ఉత్తమ మొదలగు భేదముచే నాల్గు తెరంగుల నున్నారని పెద్దలు చెప్పెదరు (72). ఉత్తమ, మధ్యమ, నికృష్ట, అతిని కృష్ణ అను నాల్గు విధముల పతివ్రతల లక్షణములను చెప్పెదను. సావధానముగా వినుము (73). ఓ మంగళ స్వరూపు రాలా! ఏ స్త్రీ యొక్క మనస్సు నిత్యము స్వప్నములోనైననూ తన భర్తనే నిశ్చితముగా చూచునో, పరపురుషుని చూడదో, ఆమె ఉత్తమ అని చెప్ప బడినది (74).

యా పితృభ్రాతృసుతవత్ పరం పశ్యతి సద్ధియా ।
మధ్యమా సా హి కథితా శైలజే వై పతివ్రతా ॥
బుద్ధ్వా స్వధర్మం మనసా వ్యభిచారం కరోతి న ।
నికృష్టా కథితా సా హి సుచరిత్రా చ పార్వతి ॥
పత్యుః కులస్య చ భయాద్వ్యభిచారం కరోతి న ।
పతివ్రతాధమా సాహి కథితా పూర్వసూరిభిః ॥
చతుర్విధా అపి శివే పాపహంత్ర్యః పతివ్రతాః ।
పావనాస్సర్వలోకానామిహాముత్రాపి హర్షితాః ॥

ఓ పార్వతీ! ఏ స్త్రీ పరపురుషుని సద్బుద్ధితో తండ్రిని వలెగాని, సోదరుని వలె గాని, కుమారుని వలె గాని దర్శించునో, ఆమె మధ్యమ పతివ్రత అనబడును (75). ఓ పార్వతీ! స్వధర్మమును ఎరింగి మనస్సు చేనైననూ వ్యభిచరించని సుశీలయగు స్త్రీ నికృష్టపతి వ్రత యనబడును (76). భర్త ఇంటిలోని వారికి భయపడి వ్యభిచరించని స్త్రీ అధమ పతివ్రత యగునని ప్రాచీన విద్వాంసులు చెప్పెదరు (77). ఓ పార్వతీ! ఈ నాల్గు విధముల పతివ్రతలు కూడా పాపములను పోగొట్టి, మానవులనందరినీ పవిత్రులను చేసి ఇహపర సుఖముల నొసంగెదరు (78).

పాతివ్రత్య ప్రభావేణాత్రిస్త్రియా త్రిసురార్థనాత్ ।
జీవితో విప్ర ఏకో హి మృతో వారాహ శాపతః ॥।
ఏవం జ్ఞాత్వా శివే నిత్యం కర్తవ్యం పతిసేవనమ్ ।
త్వయా శైలాత్మజే ప్రీత్యా సర్వకామ ప్రదం సదా ॥
జగదంబా మహేశీ త్వం శివస్సాక్షాత్పతిస్తవ ।
తవ స్మరణతో నార్యో భవంతి హి పతి వ్రతాః ॥
త్వదగ్రే కథనేనానేన కిం దేవి ప్రయోజనమ్ ।
తథాపి కథితం తేఽద్య జగదాచారతశ్శివే ॥

అత్రి భార్యయగు అనసూయ పాతివ్రత్య ప్రభావముచే త్రిమూర్తుల నర్థించి వా◌ారాహ శాపముచే మరణించిన బ్రాహ్మణుని ఒకనిని జీవింప చేసినది (79). ఓ పార్వతీ! నీవీ సత్యము నెరింగి సర్వదా సర్వకామనల నీడేర్చు పతి సేవను ప్రీతితో ప్రతిదినము చేయవలెను (80). నీవు జగన్మాతవగు మహేశ్వరివి. నీ భర్త సాక్షాత్తుగా ఆ శివుడే. నిన్ను స్మరించు స్త్రీలు పతివ్రతలగుదురు (81). ఓ శివాదేవీ! ఈ ధర్మములను నీకు చెప్పబని యేమున్నది? అయిననూ, ఈనాడు లోకాచారమునకనుసరించి నీకు చెప్పి యుంటిని (82).

బ్రహ్మోవాచ ।

ఇత్యుక్త్వా విరరామాసా ద్విజస్త్రీ సుప్రణమ్య తామ్ ।
శివా ముదమతి ప్రాప పార్వతీ శంకరప్రియా ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే పతివ్రతా ధర్మ వర్ణనం నామ చతుః పంచాశత్తమోఽధ్యాయః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ బ్రాహ్మణస్త్రీ ఆమెతో ఇట్లు పలికి విరమించెను. శంకరునకు ప్రియు◌రాలు, పర్వతునకు కుమార్తె యగు శివాదేవి ఆమెకు ప్రణమిల్లి మహానందమును పొందెను (83).

శ్రీ శివ మహాపురాణములో పతివ్రతా ధర్మ వర్ణనమనే ఏబది నాల్గవ అధ్యాయము ముగిసినది (54).

55 - శివ పార్వతుల కైలాసగమనము

బ్రహ్మోవాచ ।

అథ సా బ్రాహ్మణీ దేవ్యై శిక్షయిత్వా వ్రతం చ తత్ ।
ప్రోవాచ మేనామామంత్ర్య యాత్రా మస్యాశ్చ కారయ ॥
తథాస్త్వితి చ సంప్రోచ్య ప్రేమవశ్యా బభూవ సా ।
ధృతిం ధృత్వా హ్వాయ కాలీం విశ్లేష విరహాకులా ॥
అత్యుచ్చై రోదనం చక్రే సంశ్లేష్య చ పునః పునః ।
పార్వత్యపి రురోదోచ్చై రుచ్చరంతీ కృపావచః ॥
శైలప్రియా శివా చాపి మూర్ఛా మాప శుచార్దితా ।
మూర్ఛాం ప్రాపుర్దేవపత్న్యః పార్వత్యా రోదనేన చ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఆ బ్రాహ్మణ స్త్రీ పార్వతీ దేవికి ఆ వ్రతమును నేర్పి మేనను పిలిచి 'ఈమెను యాత్రకు పంపుము' అని చెప్పెను (1). ఆమె అటులనే అని పలికి ప్రేమకు వశురాలై వియోగదుఃఖముచే పీడితురాలైననూ ధైర్యమును వహించి కాళిని పిలిచెను (2). ఆమె పార్వతీని పలుమార్లు కౌగిలించుకొని ఏడ్చెను. పార్వతి కూడ దయను కలిగించు మాటలను పలుకుతూ బిగ్గరగా ఏడ్చెను (3). హిమవంతుని పత్ని మరియు పార్వతి దుఃఖపీడితులై మూర్ఛను పొందిరి. పార్వతి ఏడ్పుటచే దేవపత్నులు కూడ మూర్ఛను పొందిరి (4).

సర్వాశ్చ రురుదుర్నార్యస్సర్వమాసీ దచేతనమ్ ।
స్వయం రురోద యోగీశో గచ్ఛన్ కోఽ న్యః పరః ప్రభుః ॥
ఏతస్మిన్నంతరే శీఘ్రమాజగామ హిమాలయః ।
స సర్వతనయస్తత్ర సచివైశ్చ ద్విజైః పరైః ॥
స్వయం రురోద మోహేన వత్సాం కృత్వా స్వవక్షసి ।
క్వ యాసీత్యేవముచ్చార్య శూన్యం కృత్వా ముహుర్ముహుః ॥
తతః పురోహితో విప్రైరధ్యాత్మ విద్యయా సుఖమ్ ।
సర్వాన్ ప్రబోధయామాస కృపయా జ్ఞాన వత్తరః ॥

స్త్రీలందరు ఏడ్చుచుండిరి. సర్వము జడమాయెనా యన్నట్లుండెను. యోగీశ్వరుడగు శివుడే వెళ్ల బోవుచూ స్వయముగా రోదించెను. ఆ పర ప్రభుడు దుఃఖించగా, ఇతరుల మాట చెప్పునది ఏమి గలదు? (5) ఇంతలో అచటకు హిమవంతుడు కుమారులందరితో, మంత్రులతో మరియు మహా బ్రాహ్మణులతో గూడి వెంటనే విచ్చేసెను (6). ఆయన కుమార్తెను గుండెలకు హత్తుకొని, 'నీవు సర్వమును శూన్యముగా చేసి ఎచటకు వెళ్లుచున్నావు?' అని పలికి అనేక పర్యాయములు స్వయముగా మోహముచే రోదించెను (7). అపుడు జ్ఞాని శ్రేష్ఠుడగు పురోహితుడు బ్రాహ్మణులతో గూడి సుఖకరముగా అధ్యాత్మ విద్యను దయతో వారందరికి బోధించెను (8).

ననామ పార్వతీ భక్త్యా మాతరం పితరం గురుమ్ ।
మహా మాయా భవాచారా ద్రురో దోచ్చై ర్ముహుర్ముహుః ॥
పార్వత్యా రోదనేనైవ రురుదుస్సర్వ యోషితః ।
నితరాం జననీ మేనా యామయో భ్రాతరస్తథా ॥
పునః పునశ్శివామాతా యామయోఽ న్యాశ్చ యోషితః ।
భ్రాతరో జనకః ప్రేమ్ణా రురు దుర్వృద్ధసౌహృదాః ॥
తదా విప్రాస్సమాగత్య బోధయామాసురాదరాత్ ।
లగ్నం నివేదయామా సుర్యాత్రాయాస్సుఖదం పరమ్ ॥

మహామాయ యగు పార్వతి భక్తితో తల్లిని, తండ్రిని, గురువును నమస్కరించి లోకాచారముననుసరిస్తూ పరిపరి విధముల బిగ్గరగా రోదించెను (9). పార్వతి రోదించుట తోడనే స్త్రీ లందరు రోదించ మొదలిడిరి. తల్లియగు మేన, చెల్లెళ్లు, సోదరులు మరియు తండ్రి ప్రేమచే రోదించిరి (10). పార్వతి యందు దృఢమగు ప్రేమగల ఆమె తల్లి, అక్క చెల్లెళ్లు, ఇతరస్త్రీ లు, సోదరులు, మరియు తండ్రి ప్రేమచే రోదించిరి (11). అపుడు బ్రాహ్మణులు వచ్చి ఆదరముతో నచ్చజెప్పి సుఖకరము, శ్రేష్ఠము అగు యాత్రాలగ్నము సమీపించినదని విన్నవించిరి (12).

తతో హిమాలయో మేనాం ధృత్వా ధైర్యం వివేకతః ।
శిబికామానయామాస శివారోహణ హేతవే ॥
శివామారోహయామాసుస్తత్ర విప్రాంగనాశ్చ తామ్ ।
ఆశిషం ప్రదదుస్సర్వాః పితా మాతా ద్విజాస్తథా ॥
మహారాజ్ఞ్యుప చారాంశ్చ దదౌ మేనా గిరిస్త థా ।
నానా ద్రవ్యసమూహం చ పరేషాం దుర్లభం శుభమ్ ॥
శివా నత్వా గురూన్ సర్వాన్ జనకం జననీం తథా ।
ద్విజాన్ పురోహితం యామీస్స్త్రీ స్తథాన్యా యయౌ మునే ॥

అపుడు వివేకి యగు హిమవంతుడు మేనకు ధైర్యమును చెప్పి పార్వతి అధిరోహించుటకై పల్లకిని రప్పించెను (13). అచట నున్న బ్రాహ్మణ స్త్రీలు ఆ పార్వతిని పల్లకిలో కూర్చుండ బెట్టిరి. అపుడు తల్లి దండ్రులు, సర్వ స్త్రీలు, బ్రాహ్మణులు ఆశీర్వదించిరి (14). మేనా హిమవంతులు మహారాణికి తగిన ఉపచారములను, ఇతరులకు దుర్లభమగు శుభకరమగు అనేక ద్రవ్యములను ఆమెకు ఇచ్చిరి (15). ఓ మునీ! పార్వతి గురువులను, తండ్రిని, తల్లిని, బ్రాహ్మణులను, పురోహితుని, అక్కచెల్లెళ్లను, ఇతర స్త్రీలను నమస్కరించి వెళ్లెను (16).

హిమాచలోఽపి ససుతోఽ గచ్ఛత్ స్నేహవశీ బుధః ।
ప్రాప్తస్తత ప్రభుర్యత్ర సామరః ప్రీతిమావహన్ ॥
ప్రీత్యా ఖరేఖరే సర్వే మహోత్సవ పురస్సరమ్ ।
ప్రభుం ప్రణేముస్తే భక్త్యా ప్రశంసంతోఽ విశన్ పురీమ్ ॥
జాతిస్మరాం స్మారయామి నిత్యం స్మరసి చేద్వద ।
లీలయా త్వాం చ దేవేశి సదా ప్రాణ ప్రియా మమ ॥
ఇత్యాకర్ణ్య మహేశస్య స్వనా థస్యాథ పార్వతీ ।
శంకరస్య ప్రియా నిత్యం సస్మితో వాచ సా సతీ ॥

వివేకి యగు హిమవంతుడు కూడా ప్రేమకు వశుడై కుమారులతో గూడి, శివుడు ు దేవతలతో బాటు ఉన్నచోటకు వచ్చి వారందరికీ ఆనందమును కలిగించెను (17). వారందరు మహోత్సాహముతో పరస్పరము కలుసుకొనిరి. అపుడు వారు భక్తితో శివునకు నమస్కరించి ఆయనను ప్రశంసిస్తూ, నగరమునకు తిరిగి వచ్చిరి (18). 'పూర్వ జన్మస్మృతి గల నీకు గుర్తు చేయుచున్నాను. నీవు నన్ను నిత్యము స్మరించి యున్న పక్షములో చెప్పుము. ఓ దేవ దేవీ! నేను నిన్ను పొందుట ఒక లీల. నీవు నాకు సర్వదా ప్రాణ ప్రియురాలవు' (19). తన నాథుడగు మహేశ్వరుని ఈ మాటను విని, శంకరునకు నిత్య ప్రియురాలగు పార్వతి (సతీదేవి) చిరునవ్వుతో నిట్లనెను (20).

పార్వత్యువాచ ।

సర్వం స్మరామి ప్రాణేశ మౌనీ భూత్వా భవేతి చ ।
ప్రస్తావోచితమద్యాశు కార్యం కురు నమోఽస్తు తే ॥

పార్వతి ఇట్లు పలికెను –

ఓ ప్రాణనాథా! సర్వము నాకు గుర్తున్నది. ఇప్పుడు మీరు మౌనముగా నుండి ి ఇప్పటి సందర్భమునకు ఉచితమగు కార్యమును వెంటనే చేయుడు. మీకు నమస్కారమగు గాక! (21)

బ్రహ్మోవాచ ।

ఇత్యాకర్ణ్య ప్రియావాక్యం సుధాధారాశతోపమమ్ ।
ముముదేఽతీవ విశ్వేశో లౌకికాచారతత్పరః ॥
శివస్సంభృతసంభారో నానావస్తు మనోహరమ్ ।
భోజ యామాస దేవాంశ్చ నారాయణ పురోగమాన్ ॥
తథాన్యాన్నిఖిలాన్ ప్రీత్యా స్వవివాహ సమాగతాన్ ।
భోజ యామాస సురసమన్నం బహు విధం ప్రభుః ॥
తతో భక్త్వా చ తే దేవా నానారత్న విభూషితాః ।
సస్త్రీ కాస్సగణాస్సర్వే ప్రణేముశ్చంద్ర శేఖరమ్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అమృతధారలతో సమమగు ప్రియురాలి ఈ మాటను విని లోకాచారమునందు నిష్ఠగల విశ్వేశ్వరుడు మిక్కిలి సంతసించెను (22). శివుడు సామగ్రిని కూడగట్టి అనేక పదార్థములతో గూడిన మనోహరమగు భోజనమును నారాయణుడు మొదలగు దేవతలకు ఏర్పాటు చేసెను (23). మరియు ఆ ప్రభుడు తన వివాహమునకు వచ్చిన వారందరికి రుచ్యమగు బహువిధముల అన్నమును ప్రీతితో భుజింప జేసెను (24). అనేక రత్నా భరణములతో ప్రకాశించు ఆ దేవతలు అందరు భుజించి భార్యలతో గణములతో కలిసి చంద్ర శేఖరుని ప్రణమిల్లిరి (25).

సంస్తుత్య వాగ్భిరిష్టాభిః పరిక్రమ్య ముదాన్వితాః ।
ప్రశంసంతో వివాహం చ స్వధామాని యయుస్తతః ॥
నారాయణం మునే మాం చ ప్రణనామ శివస్స్వయమ్ ।
లౌకికాచారమాశ్రిత్య యథా విష్ణుశ్చ కశ్యపమ్ ॥
మయాశ్లిష్యా శిషం దత్త్వా శివస్య పునరగ్రతః ।
మత్వా నైతం పరం బ్రహ్మ చక్రే చ స్తు తిరుత్తమా ॥
తమామంత్ర్య మయా విష్ణు స్సాంజలిశ్శివయోర్ముదా ।
ప్రశంసన్ తద్వివాహం చ జగామ స్వాలయం పరమ్ ॥

తరువాత దేవతలు ఇష్టములగు వాక్కులతో చక్కగా స్తుతించి ఆనందముతో ప్రదక్షిణము చేసి వివాహమును కొనియాడుతూ తమ ధామములకు వెళ్లిరి (26). ఓ మునీ! శివుడు లో కాచారమునను సరించి, విష్ణువు కశ్యపుని వలె, నారాయణుని నన్ను స్వయముగా ప్రణమిల్లెను (27). నేను శివుని కౌగిలించుకొని, ఆశీర్వదించి, మరల ఆయన పరబ్రహ్మయని గుర్తించి యెదుట ఉత్తమ మగు స్తోత్రమును చేసితిని (28). విష్ణువు నాతో కలసి శివుని అనుమతిని పొంది పార్వతీ పరమేశ్వరుల వివాహమును ప్రీతితో కొనియాడుతూ తన పరమధామమునకు వెళ్లెను (29).

శివోఽపి స్వగిరౌ తస్థౌ పార్వత్యా విహరన్ముదా ।

సర్వే గణాస్సు ఖం ప్రాపురతీవ స్వభజన్ శివౌ ॥

ఇత్యేతత్క థితస్తాత శివోద్వాహస్సుమంగలః ।

శోకఘ్నో హర్ష జనక ఆయుష్యో ధన వర్ధనః ॥

య ఇమం శృణుయాన్నిత్యం శుచిస్తద్గతమానసః ।

శ్రావయే ద్వాథ నియమాత్ శివలోకమవాప్నుయాత్ ॥

ఇద మాఖ్యాన మాఖ్యాతమద్భుతం మంగలాయనమ్ ।

సర్వవిఘ్న ప్రశమనం సర్వవ్యాధి వినాశనమ్ ॥

శివుడు కూడ పార్వతితో ఆనందముగా విహరిస్తూ కైలాస పర్వతమునందుండెను. గణములందరు సుఖమును పొంది పార్వతీ పరమేశ్వరులను చక్కగా సేవించిరి (30), కుమారా! నీకు ఇంతవరకు పరమమంగలము, శోకమును నశింపజేయునది, ఆనందమును కలిగించునది, ఆయుర్దాయము నిచ్చునది, ధనమును వర్ధిల్ల జేయునది అగు పార్వతీ కల్యాణమును చెప్పి యుంటిని (31). ఎవడైతే దీనిని నిత్యము శుచియై దాని యందు మనస్సును లగ్నము చేసి వినునో, లేక నియమముతో వినిపించునో వాడు శివలోకమును పొందును (32). అద్భుతము, మంగళములకు నిలయము, విఘ్నముల నన్నిటినీ పోగొట్టునది, వ్యాధులనన్నిటినీ నశింపజేయునది అగు ఈ వృత్తాంతమును చెప్పితిని (33).

యశస్యం స్వర్గ్య మాయుష్యం పుత్ర పౌత్రకరం పరమ్ ।

సర్వకామ ప్రదం చేహ భుక్తిదం ముక్తిదం సదా ॥

అపమృత్యు ప్రశమనం మహాశాంతి కరం శుభమ్ ।

సర్వ దుస్స్వప్న శమనం బుద్ధి ప్రజ్ఞాది సాధనమ్ ॥

శివోత్సవేషు సర్వేషు పఠితవ్యం ప్రయత్నతః ।

శుభేప్సు భిర్జనైః ప్రీత్యా శివ సంతోషకారణమ్ ॥

కీర్తిని కలిగించునది, స్వర్గము నిచ్చునది, ఆయుర్దాయము నిచ్చునది, పుత్ర పౌత్రురులనిచ్చునది, గొప్పది, ఇహలోకములో సర్వకామనల నీడేర్చునది, భక్తిని ఇచ్చునది, నిత్యముక్తిని ఇచ్చునది (34), అపమృత్యువును తొలగించునది, గొప్ప శాంతిని కలిగించునది, శుభకరమైనది, దుష్ట స్వప్నములనన్నిటినీ శమింపజేయునది, బుద్ధిని ప్రజ్ఞను ఇచ్చునది (35), శివునకు సంతోషమును కలిగించునది అగు ఈ వృత్తాంతమును శుభమును గోరు జనులు శివోత్సవములన్నిటి యందు శ్రద్ధతో ప్రీతితో పఠించవలెను (36).

పఠేత్ప్రతిష్ఠాకాలే తు దేవాదీనాం విశేషతః ।
శివస్య సర్వ కార్యస్య ప్రారంభే చ సుప్రీతితః ॥
శృణుయాద్వా శుచిర్భూత్వా చరితం శివయోశ్శివమ్ ।
సిధ్యంతి సర్వకార్యాణి సత్యం సత్యం న సంశయః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే రుద్ర సంహితాయాం పార్వతీ ఖండే శివ కైలాస గమనవర్ణనం నామ పంచపంచాశత్తమోఽ ధ్యాయః ॥

దేవాదులను, శివుని ప్రతిష్ఠించు సమయములో మరియు సర్వకార్యములనారంభిం◌ిచు సమయములో దీనిని ప్రత్యేకించి మిక్కిలి ప్రీతితో పఠించవలెను (37). లేదా, శుచియై పార్వతీ పరమేశ్వరుల ఈ మంగళ చరితమును వినవలెను. అట్లు చేసినచో సర్వకార్యములు సిద్ధించును. ఇది ముమ్మాటికీ సత్యము. సందేహము లేదు (38).

శ్రీ శివ మహాపురాణములోని రుద్రసంహితయందు పార్వతీ ఖండలో శివుడు కైలాసమునకు వెళ్లుట అనే ఏబది అయిదవ అధ్యాయము ముగిసినది (55).

పార్వతీ ఖండ సమాప్తమైనది.

శ్రీ కృష్ణార్పణమస్తు.